# అర్చన

నవల

- అత్తలూరి విజయలక్ష్మి



శ్రీ
కౌముది
మీ ముంగిట్లో సాహితీ వెన్నెల
www.koumudi.net
ప్రచురణ సంఖ్య: 72

కౌముది మాసపత్రికలో

జనవరి 2012 సంచిక నుంచి డిసెంబర్ 2013 సంచిక వరకూ

సీరియల్‌గా వచ్చిన నవల

**డిసెంబరు నెల చివరివారం.** ఆంధ్రులకు అత్యంత ప్రీతిపాత్రమైన, పవిత్రమైన ధనుర్మాసం తొలిరోజులు.

అది ఆంధ్రదేశంలో, గోదావరి గట్టున ఉన్న చిన్నపల్లెటూరు. ఎటు చూసినా పచ్చని పొలాలు, మధ్యగా పారే పంటకాలువలు, కాయలతో బరువుగా వంగి, గోదావరి చల్లని ఒడిలో సేదతీరుతోన్న కొబ్బరి చెట్లు, చల్లగా, పరిమళభరితంగా వీచేగాలి. కోనేటి ఒడ్డున, ప్రశాంతమైన పరిసరాల్లో వెలసిన వేణుగోపాలస్వామి కోవెల. విశాఖపట్నానికి, పిఠాపురంకి మధ్యలో ఉన్న ఆ ఊరు అనంతంగా పెరిగిపోయిన నాగరికతకీ, ఆధునిక, సాంకేతిక పరిజ్ఞానపు వాసనలకి అతీతంగా, కనుమరుగవుతోన్న స్వచ్ఛమైన, అసలైన అమాయకపు పల్లెటూళ్ళకి చిహ్నంగా ఉంది. ఆ ఊరికి కరెంటు ఉన్నా, కొన్ని ఇళ్ళల్లో ఇంకా సంధ్య వాలడంతోటే లాంతర్లు చూరుకి వేళ్ళాడుతూ కనిపిస్తాయి. ప్రభుత్వంవారు ఇంటింటికీ గ్యాసు పొయ్యిల పథకం కింద ఎందరికో గ్యాసుస్టవులిచ్చినా, ఆ ఊరికి మాత్రం గ్యాసుస్టవ్‌లు ఇంకా చేరుకోలేదు. అందుకే కొన్ని డాబా ఇళ్ళలో కిరోసిన్ స్టవ్‌లు వెలుగుతూ, మరి కొన్ని పెంకుటిళ్ళలోంచి కట్టెలపొయ్యి పొగ, బొగ్గుల కుంపట్ల వెలుగు కనిపిస్తూ ఉంటుంది.

ఆ ఊరికి చిన్న రైల్వే గేటుంది. అటు నుంచి ఎప్పుడన్నా ఒకటీ, అరా ప్యాసింజరు బండ్లు మాత్రం పక్క స్టేషనువైపు నిదానంగా వెళుతూ ఉంటాయి. ఆ ఊరికి రైలు స్టేషను లేదు. ఆ ఊళ్ళో సినిమా థియేటరు లేదు. కానీ అప్పుడప్పుడూ డేరా హాళ్ళు వేసి, పాత సినిమాలు ప్రదర్శిస్తుంటారు. ఆ సినిమాలకి, చిన్నా, పెద్దా, ముసలీ, ముతకా అంతా కలిసి పొలోమంటూ వెళ్ళి చూసివస్తుంటారు. ఆ చూసిన సినిమా గురించి, మరో సినిమా ప్రదర్శించిందాకా కబుర్లు చెప్పుకుంటూ ఉంటారు కుర్రకారు. ఆ సినిమాలో హీరోయిన్‌లా ఉండాలని అమ్మాయిలు, హీరోలా ఉండాలని అబ్బాయిలూ కలలు కంటూ, తామెన్నడూ చూడని అందమైన ప్రదేశాలను ఊహల్లో చూసి తృప్తి పడుతుంటారు.

ఏ కల్మషం, ఏ మాలిన్యం, ఏ రాజకీయం అంటని ఆ ఊరు మంచుకడిగిన ముత్యంలా, హిమాలయాల్లో పూసిన గులాబీలా స్వచ్ఛంగా, అందంగా ఉంటుంది.

ఎర్రబస్సులే తప్ప, మరో బస్సు తిరగదు. ఇటు రాజమండ్రి, పిఠాపురం, అటు ఏలూరు, కాకినాడనుంచి కొన్ని బస్సులు మాత్రం అడపా దడపా దూసుకొచ్చి దుమ్మురేపి, రోడ్డుపక్కన మర్రిచెట్టు కింద ప్రయాణీకులను దింపి, తిరిగి పక్క ఊరికి వెళ్ళిపోతాయి. మట్టిరోడ్డు తప్ప, తారురోడ్డు ఎరగని మట్టిమనుషులు.. అయితేనేం మనసులనిండా బంగారమే.

అప్పుడు సరిగ్గా సమయం ఉదయం ఐదున్నర.

అప్పటివరకూ మబ్బులచాటున మత్తుగా పడుకున్న సూరీడు బద్ధకం వదిలించుకుని, మెల్లిగా ప్రయాణమైన సూచన వచ్చిందేమో చంద్రుడు మెల్లిగా తన కర్తవ్యాన్ని ముగించుకుని ఆ పూటకి సెలవు తీసుకోడానికి కదిలాడు. అప్పటిదాకా చలికి ముడుచుకుపడుకున్న పక్షులు బద్ధకంగా లేచి ఆవలించాయి.

అప్పుడే మొదటి బస్సు శబ్దం చేస్తూ వచ్చి ఆగింది. ఆగిన బస్సులోంచి భుజం మీద పసిపాపను వేసుకుని, కుడిచేత్తో సూట్ కేసు పట్టుకుని ఓ యువతి దిగింది. బస్సు తిరిగి శబ్దం చేస్తూ కదిలింది. పక్కనే పొలాల్లోని పైర్లు తలలూపుతూ వయ్యారంగా కదులుతున్నాయి. వాటికి దూరంగా కనిపించీ, కనిపించని కొండలు మంచుతో కప్పబడి, అస్పష్టంగా కనిపిస్తున్నాయి మసక చీకట్లో. చలి వణికిస్తోంది. ఆమె తన చేతిలో ఉన్న సూట్ కేసు కిందపెట్టి, భుజం మీద ఉన్న పాప చలికి వణుకుతున్నట్లుగా అనిపించి, ఆ పాపమీద కప్పిన బట్ట ఇంకా కొంచెం పైకి జరిపింది. తిరిగి సూట్‌కేసు చేతిలోకి తీసుకుని, అర్ధచంద్రుడి వెలుగులో అస్పష్టంగా ఉన్న మట్టిరోడ్డు మీద నుంచి ముందుకి నడిచింది.

ఆ రోడ్డంతా నిర్మానుష్యంగా ఉంది. రెండు పక్కలా పొలాలు తప్ప ఏమీ కనిపించడంలేదు. గాలిచేస్తున్న శబ్దం ఆమె చేయబోయే పనిని ఊరంతటికీ టముకు వేస్తున్నట్టుగా అనిపించి ఆమె ఒక్క క్షణం వణికింది. దీనంగా, మూగగా గాలినందిస్తున్న పొలాలవైపు

చూసింది శబ్దం చేయద్దన్నట్టుగా. చలికి కాళ్ళు కొంగర్లుపోతున్నాయి. అడుగులు బరువుగా పడుతున్నాయి. గుండె ఎప్పటికన్నా వేగంగా కొట్టుకుంటోంది. ' భగవంతుడా! నా పని పూర్తిఅయ్యేదాకా ఈ ఊరికి తెల్లవారనీయకు.' భగవంతుడిని దీనంగా వేడుకుంటూ, కనిపించిన మలుపు తిరిగింది. అయిపోయింది.. దగ్గరపడింది. అందరూ నిద్రలేచారు. చలికి బైటికి రాకపోయినా ఇళ్ళల్లో పనులు చూసుకుంటున్నారు. కొంచెం దూరంగా కనిపిస్తున్న పెంకుటిళ్ళలో సన్నని వెలుగు కనిపిస్తోంది. ఆ వెలుగు, కాఫీలకోసం గృహిణులు రాజేసిన బొగ్గుల కుంపట్ల తాలుకుది అని గ్రహించింది ఆ యువతి. ఆమె నెమ్మదిగా ఎడం పక్కకి తిరిగి, దేవాలయాలవైపు నడిచింది.

చలికాలం కాబట్టిగానీ, అదే ఎండాకాలం అయివుంటే ఈ పాటికి ఊరంతా బైటే ఉండేవాళ్ళు. చిరుచీకట్లోనే గృహిణులు వంటగదుల్లో కుంపట్లు రాజేయడానికి, కన్నెపిల్లలు వీధుల్లో పేడకళ్ళాపి జల్లి, అందమైన ముగ్గులు తీర్చిదిద్దడానికి, పురుషులు పొలాలకి బయలుదేరడానికి అనువైన సమయం, అలవాటైన సమయం. వాళ్ళెవరూ బైటికి రాకముందే తనని ఎవరూ చూడకుండా,గుర్తుపట్టకుండా తానొచ్చిన పని పూర్తిచేసుకుని వెళ్ళిపోవాలి. దేవాలయం సమీపిస్తుండగా అర్చకులు మోగిస్తున్న చిరుగంటల శబ్దం ఉండి, ఉండీ వినిపించసాగింది.

'భగవంతుడా! నా పని విజయవంతంగా పూర్తికావాలి తండ్రి!' మనసులో మనసారా వేడుకుందామె దేవుడిని. దేవాలయం సమీపించింది.

అప్పుడే ఆ వైష్ణవాలయం అర్చకుడు కృష్ణస్వామిగారు కోవెలలో స్నానం ముగించి, తడితువ్వాలు చుట్టుకుని, రాగిచెంబుతో నీళ్ళు తీసుకుని దేవాలయం మెట్లు ఎక్కుతున్నారు. ఆ యువతి ఆయనని చూడగానే అడుగులు వేయడం ఆపి, వేపచెట్టు వెనక్కి నక్కి నిలబడింది. ఆ వేపచెట్టు దేవాలయం మెట్లకి అతి సమీపంలో ఎడం పక్క బాగా విశాలమైన కొమ్మలతో బలంగా పెరిగి ఉంది. చీకటిగా ఉంది కాబట్టి ఆమెని ఆయన గమనించలేదు. పైగా ఆయన మనసంతా దేవుడిపైన లగ్నం అయిఉంది. ఆదిత్య హృదయం చదువుతున్నాడు. అందుకే పరిసరాలవైపు దృష్టి సారించలేకపోయాడు. ఆయన ద్వారం దాటి లోపలికి వెళ్ళగానే, యువతి ఒక్కసారి తలెత్తి దూరంగా కనిపిస్తున్న డాబా ఇంటివైపు దృష్టిసారించింది. ఆ ఇంట్లో లైట్లు వెలుగుతున్నాయి. ఆమె గుండెల్ని చీల్చుకుంటూ ఓ నిట్టూర్పు వెలువడింది. కళ్ళు చెమర్చాయి. చెట్టుచాటునుంచి కదిలి నెమ్మదిగా ఆలయం మెట్లు ఎక్కింది. సరిగా పదిమెట్లు.. తొమ్మిదో మెట్టు ఎక్కబోతుండగా, ఓ స్త్రీ దైవదర్శనం ముగించి, బైటికి రాబోతూ, ద్వారానికి అభిముఖంగా ఉన్న రావిచెట్టు దగ్గరికి వెళ్ళి ప్రదక్షిణలు చేయసాగింది. ఆ సమయం అవకాశంగా వాడుకోడానికి చటుక్కున లోపలికి ప్రవేశించి ద్వారం చాటుచేసుకుని ఊపిరి తీసుకుంది.

రావిచెట్టుకి ప్రదిక్షణలు ముగించిన స్త్రీ బైటికి వెళ్ళిపోయింది.

ఆ యువతి ద్వారం చాటునుంచి కదిలి, భుజం మీద నిద్రపోతున్న పాపని రెండుచేతుల మధ్యకి తీసుకుని, తదేకంగా పాప మొహంలోకి చూసింది. ఆమె కళ్ళు నీటితో నిండాయి. చేతిలు వణికాయి. గుండె వేగంగా కొట్టుకోవడం ప్రారంభించింది. తడబడే అడుగులతో రావి చెట్టు గట్టు దగ్గరకి వచ్చి, పాపకి నిండుగా గుడ్డకప్పి ఆ గట్టుమీద పడుకోబెట్టింది. ఎగిసిపడతూన్న దుఃఖం బైటికి రాకుండా, ఎక్కువ ఆలస్యం చేయకుండా వడివడిగా బైటకి వచ్చి ఆలయం మెట్లు దిగింది.

అదిరే గుండె చిక్కబట్టుకుని వేపచెట్టు దగ్గరికి వచ్చి, కొంచెం సేపు ఆయాసం తీర్చుకోడం కోసం అన్నట్టుగా ఓ క్షణం అక్కడే నిలబడింది. అప్పటికే మరో వైపు నుంచి ఇద్దరు స్త్రీలు చేతిలో పూల సజ్జతో గుడివైపు వస్తున్నారు. వాళ్ళు పట్టు చీరలు కట్టుకున్నారు. ఆ చీరలు చాలా పాతకాలం నాటివి. మడికోసం వాడేవి. తడి జుట్టు వేలుముడి వేసుకున్నారు. జుట్టు కొసలనుంచి నీళ్ళు కారుతూ జాకెట్లు తడుస్తున్నాయి. ఆ చలిలో.. తడిసిన జాకెట్లు, నీళ్ళు కారుతున్న జుట్టుతో ఆ స్త్రీలు ఆలయం లోపలికి వెళుతోంటే ఆ యువతి కళ్ళనుంచి ధారాపాతంగా కన్నీరు స్రవించసాగింది. కళ్ళు తుచుకుని, పాపని మరోసారి చూడాలన్న గుండె ఆరాటాన్ని అరికడుతూ తలమీంచి చీరచెంగు కప్పుకుని కనిపించే గోడలు, చెట్లు చాటుచేసుకుంటూ, తిరిగి బస్టాండుకి చేరింది.

అప్పటికి సూర్యుడు తూర్పు కొండలనుంచి నింపాదిగా ప్రయాణం కట్టి ఆ ఊరివైపు కదిలి వస్తున్నాడు. ఆయన వెనక చిరువెచ్చదనం గాలిలో కలిసి వస్తోందేమో, వణుకు తగ్గినట్టు అనిపించిందా యువతికి. ఆమె నుదుట చిరుచెమట పోసింది కానీ, తనని ఎవరన్నా చూస్తారేమో అనే ఖంగారువలన కలిగిన చెమటేకానీ, వాతావరణంలో మార్పుకాదని ఆమెకి అర్థమైంది. అప్పటికే చాలామంది పొలాలవైపు రావడం, కొందరు చెంబుతీసుకుని ఊరిబైటకి బయలుదేరడంతో తనని ఎవరన్నా గుర్తుపడతారేమోనని ఆమె గజగజలాడుతూ బస్స్టాండులో ఓ మూల, పైకప్పు కూలిపోయి, సున్నం, విరిగిపోయిన ఇటుకలతో నిండిన ఓ పాత ఇంటి గోడ వెనక నక్కి కూర్చుంది, మరో బస్సుకోసం ఎదురుచూస్తూ.

●●●

అప్పుడే తాయారమ్మ పూజ ముగించి, నీళ్ళుకారుతున్న పెద్ద జుట్టువేలు ముడివిప్పి, జుట్టు చిక్కుల్లో దాగిన కుంకుడుకాయ తొక్కలు దులుపుతూ వీధివాకిట్లోకి వచ్చింది. నీలవేణి పదమూడు చుక్కల ముగ్గు వేయడం ముగించి, పాత చాటలో గొబ్బెమ్మలు తీసుకొస్తోంది. పెరట్లోంచి తాయారమ్మగారిని చూసి, చిరునవ్వుతో అన్నది

"పెద్దమ్మగారూ పూజఅయిందా? ప్రసాదం పెడతారా? ఇయాల అయ్యగారి పెసాదం పులిహోర, అమ్మగారి పెసాదం చక్కెర పొంగలా?" అన్నది ముగ్గు మధ్యలో పసుపు, కుంకుమలు, బంతిపూలతో అలంకరించిన గొబ్బెమ్మలు పెడుతూ.

"తెల్లవారనీయవులే ప్రసాదానికి" నవ్వుతూ వేళ్ళతో జుట్టు చిక్కులు విడదీయసాగింది తాయారమ్మ.

నీలవేణి గొబ్బెమ్మలు తీర్చిదిద్దడం ముగించి, బంతిపూల రెక్కలు చల్లుతూ

"ఈ ధనుర్మాసం అంతా పెసాదంతోటేగా పెద్దమ్మగారూ గడిచేది" అన్నది.

ఆవిడ నీలవేణివైపు నడిచి కొన్ని రెక్కలు చేతిలోకి తీసుకుని తనూ గొబ్బెమ్మలపైన చల్లింది.

"ఆడపిల్లలు లేక కొంతకాలం అసలు గొబ్బెమ్మలు పెట్టలేదే నీలవేణీ, కోడలొచ్చాక పెడుతుందనుకుంటే ఆ కోడలు పట్నం పిల్ల అయిపోయింది. ఏడాది అవుతోంది కొడుకూ కోడలూ ఇక్కడికొచ్చి ఎన్నిసార్లు రమ్మని ఉత్తరాలు రాసినా, సెలవ దొరకడంలేదమ్మా అంటూ రావడమే లేదు. ఏవిటో ఉన్న ఒక్క కొడుకూ, కోడలూ దూరంగా ఉంటోంటే మనసుకేం శాంతిగాలేదే ఈ వయసులో మాకు తోడుగా ఉండమనే కాబోలు ఆ విష్ణుమూర్తి దయతలిచి నిన్ను పంపించాడు. మళ్ళీ మా లోగిలి కళకళ్ళాడుతోంది" అన్నదావిడ.

నీలవేణి చాట అరుగుమీద పెట్టి, పక్కన ఉన్న సిమెంటు తొట్టిలోంచి నీళ్ళు తీసుకుని చేయి కడుక్కుంది. నడుం చుట్టూ దోపిన ఓణీ తీసుకుని చెంగుతో చేయి తుడుచుకుంటూ వచ్చి, తాయారమ్మ చేతిలోంచి ఆవిడ జుట్టు అందుకుని వెనక్కేసి మృదువుగా చిక్కులు తీస్తూ అన్నది. "కులం గోత్రం లేని ఈ అనాధని సొంతబిడ్డలా ఆదరించే తల్లి ఎవరుంటారు పెద్దమ్మా. మీరు ఆదరించారు కాబట్టి ఊరంతా ఆదరిస్తోంది. లేకపోతే నాకు గోదారితల్లేగా గతి"

"అంతమాటనకే నీలవేణీ! ఎక్కడినుంచి వచ్చావో ఊరికే ఆడబడుచువి అయావు. అంతా నీ మంచితనం తల్లీ. నీలో మంచితనం, అణకువ లేకపోయి ఉంటే నిన్ను ఎవరాదరించేవాళ్ళీ పల్లెటూళ్ళో. అయినా మన ఊళ్ళో ఏం ఉన్నా లేకపోయినా మానవత్వం మాత్రం పుష్కలంగా ఉంది. అందుకే మన గోదావరి నీళ్ళు తియ్యగా ఉంటాయి. మన ఊరిగాలి స్వచ్ఛంగా ఉంటుంది".

దాదాపు ఏడు నెలల క్రితం గోదావరి ఒడ్డుకి కొట్టుకొచ్చింది నీలవేణి. ఉదయాన్నే స్నానానికి వెళ్ళిన కృష్ణస్వామిగారి పాదాల దగ్గర స్పృహలేని స్థితిలో వచ్చిపడింది. వయసులో ఉన్న ఆడపిల్లని ఆ స్థితిలో చూసిన కృష్ణస్వామిగారు అప్పటికప్పుడు ఊరందరినీ పిలిపించి, ఆ పిల్ల తాగిన నీళ్ళు కక్కించి, ప్రథమ చికిత్స చేసి, తన ఇంట్లో ఆశ్రయం ఇచ్చారు. తనకి ఎవరూ లేరని, వరదల్లో ఇల్లు, తల్లీ, తండ్రి, తమ్ముడు, చెల్లెలు కొట్టుకుపోయారని చెప్పింది నీలవేణి. ఆ పిల్ల అణకువ, మంచితనం, పనితనం ఊరందరికీ సాయం చేసే సద్గుణం ఆమెని ఆ ఊరికి ఆడపడుచుని చేశాయి.

"తాయారమ్మగారూ! తాయారమ్మగారూ!"

ఆ పిలుపుకి ఉలిక్కిపడిన తాయారమ్మ నీలవేణి చేతుల్లోంచి జుట్టూ విడిపించుకుని చివ్వున వెనక్కి తిరిగింది.

నుదుట కుంకుమ బొట్లతో, జుట్టునుంచి కారిన నీళ్ళతో తడిసిన జాకెట్లతో, నలిగిన పట్టుచీరలతో, మొహం నిండా గాభరా నిండి ఉండగా పరిగెత్తుకుని వస్తున్నారు వెంకటలక్ష్మి, ఆండాళ్ళు. ఆండాళ్ళు చేతిలో పొత్తిళ్ళలో ఉన్న పసిపాప వెంకటలక్ష్మి చేతుల్లో అరటిదొప్పల్లో చక్కెరపొంగలి.

నీలవేణి పరిగెత్తుకుని వెళ్ళి ఆండాళ్ళు చేతుల్లో ఉన్న పాపని అందుకుంది "ఎవరీ బంగారు తల్లి చిన్నమ్మగారూ?" అన్నది. పాప మొహం చూసి మురిసిపోతూ.

ఆండాళ్ళు ఖంగారు అణచుకోడానికి అన్నట్టుగా అరుగుమీద కూలబడి, "ఎవరో గుళ్ళో రావిచెట్టు కింద ఈ పాపని వదిలేసి వెళ్ళారు. మేము గుళ్ళోకి అడుగుపెడుతూనే కనిపించింది. "

తాయారమ్మ భయంగా చూసింది. "ఈ పాపని వదిలిపెట్టి వెళ్ళారా? ఎవరు?"

"తెలీదు తెలిస్తే దాని తాట వలిచేవాళ్ళంగా" అన్నది వెంకటలక్ష్మి.

"మన ఊళ్ళో ఇట్టాంటి పనిచేసేవాళ్ళు ఎవరున్నారు?"

"మన ఊరివాళ్ళు కాదు. పొద్దున్నే వచ్చిన ఫస్టు బస్సులోంచి ఎవరో అమ్మాయి దిగిందని, ఆ అమ్మాయి చేతిలో పాపుందని మన సూరయ్య చెప్పాడు."

"అలాగా! ఏడి వాడు?"

"వస్తున్నాడు. వెనకాల పూజారిగారు ఆ అమ్మాయి ఎక్కడుందో వెతకమని పంపించారు. ఇదెంతపెద్ద ఊరని ఏ బస్టాండులోనో ఉంటుంది వెళ్ళి లాక్కురమ్మన్నారు."

"అదిగాదే, చూసినవాడు ఆ అమ్మాయి ఎవరింటికి వెళుతోందో, ఎక్కడినుంచి వచ్చిందో ఎందుకడగలేదు?"

"వాడు కడుపులో గాభరాగా ఉండి తొందరగా పరిగెడుతోంటే కనిపించిందిట. సరేలే ఎవరింటికో తరువాత తెలుస్తుందికదా అనుకున్నాట్ట".

"మన ఊళ్ళో ఇంత గోరం జరిగితే ఎవరికి తెలీకపోవడం ఏంటమ్మగారూ. అందరం ఎప్పుడో నిద్దర్లు లేచి పనులు చూసుకుంటున్నాం కదా ఆశ్చర్యంగా ఉందే పొరుగూరునుంచీ ఎవరో రావడం ఏంటి? ఈ పిల్లముండని గుళ్ళో వదిలేసి పోడం ఏంటి?"

"ఈ మజ్జె ఆడపిల్లలు పుడితే ఇట్టాగే వదిలేత్తున్నారంటగా. ఏ పిల్ల అయితే మాత్తరం వదిలెయ్యడానికి మనసెట్టా ఒప్పుతుందో?" అంటూ పాపను ముద్దాడుతూన్న నీలవేణి చేతికి తడిగా తగిలింది.

"అయ్యో బట్టలు తడిపేసింది" అంటూ పాపకి కట్టిన లంగోటీ విప్పింది.

"అమ్మగారూ పాపకాదు బాబు" అన్నది గట్టిగా.

"బాబా!?" అందరి దృష్టి బాబు మీద పడింది.

ఇంతలో కిర్రుచెప్పుల శబ్దం విని తలపైకెత్తి చూసిన ఆండాళ్ళు

"అడుగో సూరయ్య వస్తున్నాడు" అన్నది.

నలుగురూ సూరయ్య వస్తున్న వైపు చూశారు. సూరయ్య, అతడి వెనకాలే కృష్ణస్వామిగారు వస్తున్నారు.

"ఏరా దొరికిందా?" అడిగింది వెంకటలక్ష్మి.

వాడు మాట్లాడకుండా కృష్ణస్వామిగారివైపు చూశాడు.

అందరికళ్ళూ ఆయనవైపు తిరిగాయి.

ఆయన మొహం గంభీరంగా ఉంది.

ఆయన మొహం చూసిన వాళ్ళేవరికీ ఇంక వివరాలు అడిగే ధైర్యం చాల్లేదు. ఆయన మౌనంగా లోపలికి వెళ్ళిపోయాడు. ఆడాళ్ళంతా మొహా, మొహాలు చూసుకున్నారు.

"ఏమైందిరా?" తాయారమ్మ కొంచెం కలవరంగా అడిగింది.

సూరయ్య ఏం మాట్లాడకుండా వెనక్కి తిరిగి వీధి అరుగు మీదకెళ్ళి కూర్చున్నాడు.

ఆండాళ్ళు అయోమయంగా అడిగింది.

"వీడినేం చేద్దాం?"

"నేను పెంచుకుంటానమ్మగారు." నీలవేణి మురిపెంగా అన్నది "సీరామసెందుడ్లా ఉన్నాడు. నేను పెంచుకుంటాను".

"అదేవిటే పెళ్ళీ పెటాకుల్లేకుండా పిల్లాడిని పెంచుకుంటే పరువుపోదూ? నీకు మళ్ళీ పెళ్ళి అవుతుందా? " వెంకటలక్ష్మి విస్తుబోతూ అన్నది.

"కాకపోతే పోనీండి. ఈ అనాదని ఎవరు పెల్లాడతారు? ఎట్టాగా నాకు పెల్లికాదు. వీడిని పెంచుకుంటాను. వీడు అనాధకాకూడదు" అంటూ బాబుని గుండెలకి హత్తుకుంది.

వెంకటలక్ష్మి, ఆండాళ్ళ మనసు ద్రవించిపోయింది.

"ఎంత మంచి మనసే నీది ఆ వేణుగోపాలుడు చల్లగా చూడాలి నిన్ను" అంటూ తాయారమ్మ దగ్గర సెలవు తీసుకుని వెళ్ళిపోయారు.

తాయారమ్మకి అంతా అయోమయంగా అనిపించింది. భర్త అలా గంభీరంగా ఎందుకున్నాడో, సూరయ్య ఎందుకు మౌనంగా ఉన్నాడో ఉదయాన్నే నిద్రలేస్తూనే ఈ బాబెవరో గుమ్మంలోకి రావడం. అంతా గందరగోళంగా వుంది..

నీలవేణి బాబుని తీసుకుని పెరటివైపు వెళ్ళిపోయింది. తాయారమ్మ నెమ్మదిగా లోపలికి వెళ్ళింది. కృష్ణస్వామి హాల్లో ఉన్న దివాన్ మీద, కుడిచేయి కళ్ళమీద అడ్డంగా పెటుకుని, ఎడం చేయి పొట్టమీద పెట్టుకుని పడుకున్నారు. తాయారమ్మ ఆయనకి సమీపంగా నడిచింది. నెమ్మదిగా "ఏవండీ" అని పిలిచింది.

రెండుసార్లు పిలిచాక ఆయన చేయి అడ్డం తీసి కళ్ళు తెరిచాడు.

"ఏం జరిగింది?" అడిగింది. ఆవిడ మనసేదో కీడుని శంకించసాగింది.

ఆయన మౌనంగా లేచి కూర్చున్నాడు. దిండు కింద పెట్టిన కాగితం మడత తీసి అందించాడు.

"ఏంటిది? అడిగిందావిడ వణుకుతున్న స్వరంతో.

"చదువు" గంభీరంగా అన్నాడాయన.

ఆవిడ కళ్ళు కాగితం మీద ఉన్న అక్షరాలవైపు పరిగెత్తాయి.

"పూజ్యులైన కృష్ణస్వామిగారికి

పరమపవిత్రమైన, సంప్రదాయబద్ధమైన మీ ఇంటికోడలిగా, బుద్ధిమంతుడైన మీ కుమారుడు వేణు భార్యగా ఎంతో గౌరవంగా బతకాల్సినదాన్ని కానీ, నా కడుపులో ఊపిరిపోసుకున్న బాబు నా బాధ్యతని గుర్తుచేశాడు. అందుకే ఈ తొమ్మిదినెలలూ వంటరిగా జీవితంతో పోరాడి, మీ మనవడిని, వేణు కొడుకుని భూమ్మీద పడేయడానికి ఎంతో కష్టపడ్డాను. విధాత నా నుదుట రాసిన రాత వీడి నుదుట నేను రాయడం నాకిష్టంలేదు. అందుకే వీడిని మీకు వదిలి వెళ్ళిపోతున్నాను. నా జీవితాన్ని ఎలా గడిపినా, ఎలా ముగించినా మీ


కౌముది

వంశాంకురం అయిన బాబుని, వాడి భవిష్యత్తుని చెడగొట్టే అధికారం నాకు లేదు కాబట్టి మీ వంశాంకురాన్ని మీకే అప్పగించి వెళ్ళిపోతున్నాను. వీడు మీ మనవడు. ఇకనుంచీ వీడి బాధ్యత మీదే. ఇంతకాలం తరువాత వేణుని కలవాలని, ఇడుగో నీ కొడుకు అంటూ వీడిని తనకి అప్పగించాలని నేను అనుకోడంలేదు. వేణుని కలిసే శక్తికూడా నాకు లేదు. అందుకే నేను మీ వంశంనుంచి నిష్క్రమిస్తున్నాను. అత్తయ్యగారికి నా పాదాభివందనాలు.

**సెలవ్,**

**అర్చన.''**

ఆ కాగితం అలాగే రెండుచేతుల్లో పట్టుకుని, కిందకూలబడిపోయి వెక్కి, వెక్కి ఏడవసాగింది తాయారమ్మ.

''ఏంటండి ఇది? కోడలు ఇల్లు వదిలి వెళ్ళడం ఏంటి? అబ్బాయి మనకి విషయం తెలియచేయకపోడం ఏంటి? పట్నంలో ఇద్దరూ ఉద్యోగాలు చేసుకుంటూ హాయిగా, ఆనందంగా బతుకుతున్నారనుకుంటున్నాం. అందుకేనా, అందుకేనా వాడు ప్రతి ఉత్తరంలో సెలవు దొరకడం లేదమ్మా, రావడానికి కుదరదు క్షమించు అంటూ రాస్తున్నాడు. భగవంతుడా ఏంటి ఏం చేశావు? కోడలు ఎందుకిలా చేసింది? ఏం జరిగింది వాళ్ళమధ్య. కనీసం మాకు మాటమాత్రం చెప్పకుండా పెళ్ళిచేసుకుని తీసుకొచ్చినా, లక్ష్మీదేవిలాంటి పిల్ల ఇంటికోడలైందని మురిసిపోయి ఆదరించామే. అందుకేనా అందుకేనా మాకీశిక్ష?''

ఆవిడ వెక్కిళ్ళ మధ్య తన ఆవేదన వెళ్ళబోసుకుంటుంటే మౌనంగా వింటోన్న కృష్ణస్వామి, కొంతసేపటికి స్వరం విప్పాడు ''తాయారూ!'' ఆయన స్వరం గంభీరంగా పలికింది.

''నెమ్మదించు కర్తవ్యం ఆలోచించు. తరతరాలుగా ఈ ఊళ్ళో మనం కాపాడుకుంటూ వస్తోన్న పరువు, ప్రతిష్టలు ఈ పసివాడి రాకతో మంట గలిసిపోకుండా, అలాగని ఈ పసివాడికి మన వలన అన్యాయం జరక్కుండా ఏం చేయాలో, ఎలా చేయాలో ఆలోచించు. నేను ఈ రోజే హైదరాబాదు వెడతాను. అబ్బాయిని కలుస్తాను. అసలేం జరిగిందో, అమ్మాయి ఇల్లొదిలి ఎందుకు వెళ్ళిందో? వాడు మనకి విషయం తెలియచేయకుండా ఒక్కడే కుమిలిపోవడానికి కారణం ఏమిటో అంతా తెలుసుకుని వస్తాను. ఆ తరువాత వాడి నిర్ణయంతో కలిసి మనంకూడా ఓ నిర్ణయానికి వద్దాం. ఈ పసివాడి గురించి ఈ ఊరి జనానికి, మన బంధువులకూ తెలియకుండా జాగ్రత్తపడే బాధ్యత నీది. ఈ విషయం నీకూ, నాకూ సూరయ్యకీ తప్ప ఇంకెవరికీ తెలియకూడదు. '' అంటూ ఆవిడ చేతిలో ఉన్న కాగితం పరపరా చింపి మూలకి విసిరేసి, దివాన్ మీద నుంచి లేచి మరోసారి స్నానం చేయడానికి పెరట్లో ఉన్న నుయ్యి దగ్గరకు నడిచాడు.

తాయారమ్మ మాత్రం ఒంట్లోని శక్తంతా హరించుకుపోయినట్టు నిస్తేజంగా అలా పడి ఉండి, నిశ్శబ్ధంగా కన్నీరు కార్చసాగింది.

●●●

ఏలూరు వెడుతోన్న బస్సులో కూలబడింది అర్చన అప్పటిదాకా ఉగ్గుబట్టుకున్న ప్రాణం కొంచెం తెరిపిన పడింది.

ఎవరూ తనని చూడకూడదనుకుంది. అందుకోసం ఎంతో సాహసం చేసింది. కానీ, సూరయ్య చూడనే చూశాడు. సూరయ్య చూశాడంటే తప్పకుండా పెద్దవాళ్ళిద్దరికీ తను వచ్చివెళ్ళినట్టు తెలుస్తుంది. ఆపాదమస్తకం వణికింది.

కొంపదీసి సూరయ్య ఈ బస్సు వెనకాల మరో బస్సు పట్టుకుని రావడంలేదుకదా.

''అమ్మాయిగారూ'' అంటూ సూరయ్య పిలిచిన పిలుపు చెవుల్లో ప్రతిధ్వనిస్తోంది. భయంతో వణికిపోతోంది. సూరయ్యచూశాడు. కేవలం అత్తగారికీ, మావగారికీ మాత్రమే తెలియాలి అనుకున్న రహస్యం ఊళ్ళో అందరికి తెలిసిపోతుంది ఎలా? ఇప్పుడెలా? ఆ ఊళ్ళో వాళ్ళిద్దరూ ఎలా తలెత్తుకు తిరగ్గలరు?

వైష్ణవాలయం పూజారి కృష్ణస్వామిగారంటే ఊరివారందరికీ ఎంతో గౌరవం, మరెంతో అభిమానం. పవిత్రతకూ, పరమనిష్టకూ మారుపేరైన కృష్ణస్వామిగారు ఇవాళ తనవలన ఎంతటి అవమానాన్ని ఎదుర్కోవాలోకదా. కృష్ణస్వామిగారి కోడలు, పిల్లవాడిని కని ఊళ్ళో వదిలేసిపోయింది అని ఈపాటికి ఊరంతా గుప్పుమని ఉంటుంది.

చచ్చిపోయిందనుకున్న కోడలు తిరిగిరావడం ఏంటి? పిల్లవాడిని వదిలేయడం ఏమిటి? ఇంతకాలం ఎక్కడ తిరిగిందో ఆ దిక్కుమాలిన పిల్లాడిని ఎవరికి కన్నదో?

అర్చన నిలువునా వణికిపోయింది. తప్పకుండా జనమంతా తనని అసహ్యించుకుంటారు. మావగారిని, అత్తగారిని ప్రశ్నల బాణాలతో గుచ్చి, గుచ్చి చంపుతారు. వాళ్ళని చూసి నవ్వుతారు. అబ్బ ఎంత గొప్ప కోడలు అని హేళన చేస్తారు. ఉన్నతమైన కుటుంబానికి కోడలైన తాను వాళ్ళకెలాంటి స్థితి తెచ్చిపెట్టింది. ఇదేనా వాళ్ళు తనకు చేసిన ఉపకారానికి, తనపట్ల చూపిన ఔదార్యానికి తను చేసే ప్రత్యుపకారం ఇదేనా చూపవలసిన కృతజ్ఞత. అర్చనకి దుఃఖం ఎగదన్నుకు వస్తోంది. మనసంతా వేదనతో నిండిపోయింది. తను పొరపాటు చేసిందా? ఖచ్చితంగా ఇది పొరపాటే. కానీ, చేయక తప్పలేదు..

పాపం పెద్దవాళ్ళు..!

కొడుకు తమని సంప్రదించకుండా, తమతో ఒక్కమాట కూడా చెప్పకుండా పెళ్ళిచేసుకుని నేరుగా వాళ్ళ ఆశీర్వాదం కోసం తీసుకెళ్ళినా, ఏ మాత్రం కోపం తెచ్చుకోకుండా తనని ఎంతో ఆదరించారు. బాగా చదువుకుని ఉన్నతస్థానానికి ఎదుగుతాడని ఆశలు పెట్టుకున్న కొడుకు, చదువు అర్ధాంతరంగా ఆపేసి, హఠాత్తుగా పెళ్ళిచేసుకుని వస్తే, ఆవేశపడి అల్లరిచేయకుండా ఎంతో సంస్కారంతో తనని ఇంటికోడలిగా స్వీకరించారు. నిష్కల్మషమైన ప్రేమా, ఆప్యాయతని అందించారు. అలాంటి అత్తగారిని, మావగారినీ వంచింది, వాళ్ళ స్వచ్ఛమైన ప్రేమని కాలదన్ని.. ఛీ.. అర్చనకి తనమీద తనకే కోపం వచ్చింది. 'ఎందుకెళ్ళావు అర్చనా? ఏం సాధించావు?' అంతరాత్మ నిలబెట్టి ప్రశ్నించినట్టు అనిపించింది.

అర్చన కళ్ళనుంచి కన్నీళ్ళు చెంపలమీదకి జారాయి. నెమ్మదిగా చీరచెంగుతో కళ్ళు తుడుచుకుంది.

పల్చగా పరుచుకుంటున్న వెలుగురేఖల మధ్య చల్లని ప్రభాతవేళ మంచిపనులు చెయ్యమంటారు పెద్దలు. తనేం చేసింది? దారుణం చేసింది. ఇంకా కళ్ళు కూడా తెరవని పసివాడిని, తన పేగు తెంచుకు పుట్టిన అమాయకుడిని.. అనాధలా వదిలేసి వచ్చింది. మావయ్యగారు బాబుని స్వీకరించారా? అక్కున చేర్చుకుని ఆదరిస్తారా? నిజంగా వాళ్ళబ్బాయి రక్తమేనని, వాళ్ళ వంశాంకురమే అని నమ్ముతారా? అక్రమ సంతానంగా భావించి బాబుని ఏ అనాధాశ్రమంలోనో వదిలిపెడతారా? తానలంటాది కాదని వాళ్ళని నమ్మించేదెలా?

అనాధ..! నో బాబు అనాధకాకూడదు.! అర్చనకి వెంటనే బస్సుదిగేయాలనిపించింది. బస్సు చాలావేగంగా వెళుతోంది. దారి అస్తవ్యస్తంగా ఉన్నా, ఎగుడు, దిగుళ్ళను దాటుకుంటూ, ఎత్తి ఎత్తివేస్తూ వేగంగా వెడుతొంది. ఎలాగోలా ప్రయాణీకులను గమ్యం చేర్చడమే నా లక్ష్యం అన్నట్టుగా డ్రైవర్ పరుగులు పెట్టిస్తున్నాడు బస్సుని.

"లాభంలేదు. వెళ్ళలేదు. ఆ ఇంటి ద్వారాలు శాశ్వతంగా మూసుకునిపోయి ఉంటాయి. తను ఇంక వెళ్ళలేదు. ఎన్నటికీ వెళ్ళలేదు"

అర్చన కళ్ళు మూసుకుంది. ఆ మూసుకున్న కళ్ళ వెనకనుంచి, అస్పష్టంగా ఏవో ఆకారాలు.. ఏవో సంఘటనలు.. ఎన్నో జ్ఞాపకాలు.. తరుముతున్నకొద్దీ వెంటబడుతున్నట్టుగా తనని వెంటాడి వేధించే జ్ఞాపకాలు.

●●●

**సికింద్రాబాదు స్టేషనులో గోదావరి ఎక్స్‌ప్రెస్ ఆగింది. చేతి సంచి తీసుకుని కృష్ణస్వామి రైలు దిగాడు.**

విపరీతమైన రద్దీతో, కోలాహలంగా ఉన్న ప్లాట్ ఫారం చూడగానే మొదటిసారిగా నగరానికి వచ్చిన ఆయనకి గాభరా వేసింది. ఎటు వెళ్ళాలో అర్థం కాలేదు. వేణుకి టెలిగ్రాం ఇచ్చి బయలుదేరడానికి సమయంలేదు. కూర్చున్నవాడు కూర్చున్నట్టుగా, ఓ పంచె, లాల్చీ తీసుకుని బయలుదేరాడాయన. లాల్చీ జేబులో వేణు ఉంటోన్న ఇంటి అడ్రస్, పనిచేస్తున్న బ్యాంకు అడ్రసు కాగితం ఉంది. ఆ కాగితం చేతులోకి తీసుకున్నాడు. టికెట్టు కూడా అలా గుప్పిట్లో పట్టుకుని తనతో పాటు రైలు దిగిన కొందరు ప్రయాణికులు నడుస్తున్న వైపుకి నడిచాడు. ఎలాగొలా ఎగ్జిట్ ద్వారం దగ్గరకి వచ్చి, టికెట్టు కలెక్టర్‌కి టిక్కెట్టు ఇస్తూ, తన చేతిలో ఉన్న అడ్రస్ కాగితం చూపించాడు. "బాబూ నేనీ అడ్రసుకి వెళ్ళాలి. ఎలా వెళ్ళాలో చెబుతావా? మొదటిసారి వచ్చాను హైదరాబాదుకి" అడిగాడాయన.

అతను అడ్రస్ చూసి "మల్కాజ్ గిరి వెళ్ళాలా మీరు? బైటకి వెళ్ళండి. కంట్రోలర్ ఆటో మాట్లాడి పంపిస్తాడు. వెళ్ళండి" అంటూ తిరిగి మరో వ్యక్తి దగ్గర టిక్కెట్టు కలెక్ట్ చేసుకోడంలో పడ్డాడు. అతని ధోరణి ఆయనకి నిర్లక్ష్యంగా కనిపించింది. తన ఊళ్ళో ఎవరన్నా అపరిచితులు వస్తే, వాళ్ళని ఎవరింటికి వెళ్ళాలో, వాళ్ళింటికి చేయిపట్టుకు తీసుకొస్తారు ఊరి జనం. బహుశా ఈ పట్నంలో ఇంతే కాబోలు. నిట్టూర్చి అందరితో పాటు బైటకి నడిచాడు. ప్లాట్‌ఫాం మీదకన్నా భయంకరమైన రష్. జనం జనం పరుగులు పెడుతున్నారు. కార్లు, బస్సులు, స్కూటర్లు, ఆటోలు. "సార్ ఆటో కావాలా? ఆటో.. ఇవ్వండి.. బ్యాగ్ ఇవ్వండి. రండి ఎక్కండి." చుట్టూ మూగి ఊదరబెట్టసాగారు ఆటోవాలాలు.

"మల్కాజ్‌గిరి వెళ్ళాలి" అన్నాడాయన.

"రండి. వందరూపాయలు."

"వందరూపాయలా? ఆయనకి మతిపోయినట్టైంది. తిరిగి రాజమండ్రి వెళ్ళడానికి రైలు టిక్కెట్టు ధరా? తన కొడుకింటికి వెళ్ళడానికి. ఇదేం ఊరు బాబోయ్.

"సార్ అక్కడ క్యూలో నిలబడండి. కంట్రోలర్ ఎక్కిస్తాడు ఆటో." ఎవరో వ్యక్తి వెళుతూ వెళుతూ, ఆయన అవస్థ చూసి, చాంతాడంత క్యూ వైపు చూపించి వెళ్ళాడు. ఆయన క్యూ దగ్గరగా నడిచాడు. చాలా పెద్ద క్యూ. ఆటోలు సర్రన దూసుకొస్తున్నాయి. కంట్రోలర్ ఆటో నెంబర్ నోట్ చేసుకుని, ఒకొక్కరినే పంపిస్తున్నాడు. ఈ పద్ధతి ఆయనకి నచ్చింది. హైదరాబాదులో ఆటోవాలాలు, పట్నవాసం వాళ్ళనే మోసం చేస్తున్నారని చదువుతున్నాడు పేపర్లో. పల్లెటూరివాడైన తనని మోసం చేయరూ. బహుశా అందుకే ఈ పద్ధతి పెట్టినట్టున్నారు. మంచిదే ఇలా మోసాన్ని కంట్రోల్ చేయచ్చు అనుకుంటూ తన వంతు వచ్చిందాకా ఓపిగ్గా నిలబడ్డాడు. ఆటో తన ముందు ఆగగానే కంట్రోలర్‌కి అడ్రస్ చూపించాడు. ఆయన అది చదివి, కాగితం తిరిగి కృష్ణస్వామికిస్తూ, ఆటో అతన్ని మీటర్ వేయి అంటూ దబాయించి, ఎక్కండి అన్నాడు కృష్ణస్వామిని. ఆయన ఎక్కి కూర్చోగానే, ఆటో నెంబర్ నోట్ చేసుకుని, పోనీ అన్నాడు. ఆటో వేగంగా కదిలింది. కృష్ణస్వామి సీటులో కొద్దిగా వెనక్కివాలి కూర్చుని, రోడ్లనీ, వాహనాలనీ, అన్యమనస్కంగా చూస్తూ, కొడుకు గురించిన ఆలోచనల్లో మునిగిపోయారు.

పిచ్చి వెధవ. ఇంత అవమానాన్ని గుండెల్లో దాచుకుని, ఇంతకాలం నుంచీ తమకి తెలియచేయకుండా ఎలా ఉన్నాడో? భార్య ఇంట్లోంచి వెళ్ళిపోయిందంటే ఎంత అవమానం? ఎంత అవమానం? ఎంత దెబ్బ గుండెకి. అసలెందుకు వెళ్ళిపోయింది అర్చన?

ఎంతో అణుకువగల పిల్ల. ఎలా చేసింది, ఇంత అప్రదిష్టపని ఎందుకు చేసింది. భార్యాభర్తలు గొడవపడ్డారా? భార్యాభర్తలన్నాక గొడవలు రావడం సహజం అంతమాత్రాన ఇల్లు వదిలి ఎందుకు వెళ్ళింది?

ఈ చదువుకున్న అమ్మాయిలకి వాళ్ళకేం కావాలో వాళ్ళకే స్పష్టమైన అవగాహన ఉండడంలేదు. ఎలాంటి స్థితినుంచి ఎలాంటి స్థితికి చేరుకున్నారు. ఒకనాడు ఆడపిల్లలని ఇల్లు కదలనిచ్చేవాళ్ళా? చదువుల్లేవు, ఉద్యోగాలు లేవు, పెళ్ళి అయిందాకా తల్లి, తండ్రుల అధీనంలో, పెళ్ళి అయాక భర్త, అత్త, మామల ఆధీనంలో వాళ్ళేం చెబితే అదే వేదం. అదే శాసనం. వాళ్ళు ఏ బట్ట కొనిస్తే అదే మహా

ప్రసాదం. తాయారమ్మ తనని ఈ నలభై ఏళ్ళుగా నోరు తెరిచి ఏదన్నా కావాలని అడిగిందా? పొరపాటునన్నా తను ఆవిడని సినిమాకి తీసుకెళ్ళాడా? సరదాక్కూడా తనకి ఆవిడ ఎదురు చెప్పిందా? లేదు. కానీ అర్చనని తాము అలా చూడలేదే ఉద్యోగం చేస్తానంటే చేయమన్నారు. పట్నంలో ఉంటానంటే ఉండమన్నారు. పెళ్ళి అయిన ఏడాది ఒక్కసారి మాత్రం వచ్చింది అత్తగారింటికి. తాయారు ఒక్క పని చేయించలేదు. తల్లికన్నా ఎక్కువగా చూసుకుంది. "ఉద్యోగం చేసి, ఇంట్లో పనిచేసి, అలసిపోయి వస్తావమ్మా. ఉన్న నాలుగురోజులు నీకెందుకీ చాకిరీ" అంటూ కూర్చున్న దగ్గరకే అన్నీ అమర్చేది. అయినా, వినకుండా చేతనైన సాయం చేస్తూ, అత్తగారికి నోట్లో నాలికలా మసులుకుంది. అర్చన ఇలాంటి పనిచేయగలదని అసలెన్నడైనా ఊహించారా? ఇద్దరూ ప్రేమించి పెళ్ళిచేసుకున్నారంటే సరే అన్నారు. అనుకోని పరిస్థితుల్లో మీకు చెప్పలేకపోయాం నాన్నగారు! అంటే, వయసు వేడిలో తొందరపడ్డారు కాబోలని సర్దిచెప్పుకున్నారు. కానీ, కానీ, భగవంతుడా ఏం చేయబోతున్నావు నా కొడుకు భవిష్యత్తుని. అర్చన ఇల్లు విడిచి పోయిందన్న విషయం మాట మాత్రం చెప్పకుండా ఎంత గోప్యంగా ఉంచాడు వేణు. ఎందుకు? రహస్యంగా ఉంచాల్సి వచ్చింది? ఆమె అలా వెళ్ళిపోవడానికి కారణం వేణా? అర్చనే క్షణికావేశంలో వెళ్ళిపోయిందా? క్షణికావేశం అయితే, ఈ పాటికి ఎప్పుడో వాళ్ళిద్దరూ తిరిగి కలుసుకోవాల్సింది, కానీ కలుసుకోలేదు. పైగా ఇప్పుడు ఓ పిల్లవాడి తల్లిగా వచ్చి, ఆ పసివాడిని తన లోగిట్లో వదిలి వెళ్ళిపోయింది. ఎక్కడికెళ్ళింది? ఆలోచనలతో మెదడు పగిలిపోతున్నట్టుగా ఉంది కృష్ణస్వామిగారికి.

"ఎంత పిలిచినా పలకలేదయ్యగారూ. ఏలూరెల్లే బస్సు ఎక్కినారు. ఆరు ముమ్మాటికీ మన కోడలుగారే" అన్నాడు సూరయ్య. అదే ఇంకే ఆడపిల్లనో అయివుంటే, సూరయ్యని ఏలూరుకి వెంటనే పంపించేవాడు తను. కానీ, పసివాడిని నిర్దయగా వదిలి వెళ్ళింది తన కోడలని తెలిశాక మెదడు మొద్దుబారిపోయింది. సర్వశక్తులూ హరించిపోయినట్టు అయింది.

"సార్ మల్కాజ్‌గిరి ఇదే ఎక్కడికెళ్ళాలి?" ఆటోవాలా ప్రశ్నతో ఆయన ఈలోకంలోకి వచ్చాడు. చేతిలో అడ్రసు కాగితం చూశాడు. అనుటెక్స్ బట్టలదుకాణం ఎక్కడ బాబూ?" అడిగాడు.

"ఇంకా ముందుంది సార్" అంటూ ఆటో ముందుకి పోనిచ్చాడు. సరిగ్గా రెండు నిమిషాల్లో అనుటెక్స్ దగ్గర ఆగింది.

"ఇంకా కొంచెం ముందుకి వెళ్ళు. బ్యాంక్ ఎదురుగా సందులో"

మరో రెండు నిమిషాల్లో ఆటో సందులోకి తిరిగింది. ఇంటి నెంబరు చూస్తూన్న ఆయన "ఆపు. ఆపు ఇక్కడే" అంటూ అరిచాడు. ఆటో ఆగింది. మీటరు చూసి డబ్బులు ఇచ్చి, బ్యాగు చేతిలోకి తీసుకుని గేటు తోసి, లోపలికి నడిచాడు. వేణు ఇంకా లేవలేదు కాబోలు. తలుపు తీయలేదు. వాకిట్లో మొక్కలు ఎండిపోయి ఉన్నాయి. వాకిలి ఊడ్చి, ముగ్గేసి చాలాకాలం అయినట్టుగా అంతా ఎండిన ఆకులతో, మట్టితో, చెత్తా, చెదారంతో నిండి ఉంది. ఆయన తలుపు దగ్గరకి నడిచి, ఎడం చేయి పక్కగా ఉన్న కాలింగ్ బెల్ నొక్కాడు. మూడు, నాలుగుసార్లు నొక్కాక కానీ, లోపల్నించి ఎవరూ అన్న స్వరం వినిపించలేదు. అది వేణు స్వరమే. బరువుగా ఉంది. ఇంకా నిద్రమత్తు వదల్లేదు.

"వేణూ.. తలుపు తియ్యి" మృదువుగా బదులు పలికాడు ఆయన.

కొన్ని క్షణాల తరువాత తలుపు తెరుచుకుంది. ఎదురుగా తండ్రిని చూసిన వేణు కళ్ళల్లో ఆశ్చర్యం. నిద్రమత్తు పూర్తిగా వదిలిపోయింది. అప్రతిభుడై చూస్తూ "నాన్నా మీరా? మీరు ఇప్పుడు..?" తడబడ్డాడు.

"లోపలికి రానివ్వవా?" అడిగాడాయన.

వేణు చటుక్కున ఆయన చేతిలో సంచి అందుకుని, "రండి" అంటూ లోపలికి నడిచాడు. అతని వెనకాలే లోపలికి నడిచిన ఆయన అస్తవ్యస్తంగా ఉన్న డ్రాయింగ్ రూము, దుమ్ముకొట్టుకుపోయి ఉన్న టి.విని చూసి, వేణువైపు చూశాడు. గడ్డం పెంచాడు. బాగా చిక్కిపోయాడు. కళ్ళకింద చర్మం ఉబ్బినట్టుగా ఉంది. పచ్చటి పిల్లాడు రంగు మారాడు. తెలివితేటలు ప్రస్ఫులిస్తున్నట్టుండే కళ్ళల్లో ఏదో

విచారం. విషాదం పెనవేసుకుని ఉన్నాయి. ఆయన చూపులు తట్టుకోలేనివాడిలా చూపు తిప్పుకుని "రండి నాన్నా అదిగో బాత్రూం. మొహం కడుక్కోండి వేడినీళ్ళు పెడతాను. స్నానం చేద్దురుగాని" అంటూ చేతిలో సంచి అక్కడే ఉన్న అలమరలో పెట్టాడు.

అతని నోటి నుంచి చాలా వికారమైన వాసన. కృష్ణస్వామికి కడుపులో తిప్పినట్టు అయింది. తెల్లవారకుండానే, గోదారమ్మ ఒడిలో స్నానమాచరించి, ఆ విష్ణుమూర్తికి అగరుబత్తులు ధూపం వేసి, కర్పూర హారతులిచ్చి, చామంతులు, గులాబులు, మల్లెలు, విరజాజులు, సంపెంగలతో పూజిస్తూ, ఆ పరిమళాల మధ్య కాలం గడిపే ఆయన వేణు నోట్లోనుంచి వచ్చిన వాసనకి తట్టుకోలేకపోయాడు.

"కో..కోడలేది? అడిగాడు. తడబడిన స్వరం అదుపులోకి తెచ్చుకుంటూ"

వేణు చివ్వున చూశాడు. తిరిగి తల తిప్పుకుని "లే..లేదు బైటికి వెళ్ళింది" అన్నాడు.

"ఎక్కడికి వెళ్ళింది? ఎప్పుడు వస్తుంది?"

"వస్తుంది నాన్నా మీరు స్నానం చేయండి. నేనిప్పుడే వెళ్ళి పాలు తీసుకొస్తాను." అంటూ లోపలికి వెళ్ళి, తల దువ్వుకుని, పైజమా మీద లాల్చీ వేసుకుని స్లిప్పర్లు తొడుక్కుని బైటికి నడిచాడు.

వేణు బైటకి వెళ్ళగానే, కృష్ణస్వామి ఇల్లంతా పరికించి చూశాడు. ఒక డ్రాయింగ్ రూం, ఒక బెడ్ రూం, చిన్న వంటగది. దానికే ఎక్స్‌టెన్షన్‌లా అమర్చబడిన డైనింగ్ హాల్. బెడ్ రూముకి అటాచ్‌డ్ టాయిలెట్. చిన్న వసారా. చుట్టూ ప్రహరీ, బైట మరో బాత్‌రూం, టాయిలెట్. ఇల్లు చిన్నది. భార్యా, భర్త, ఇద్దరు పిల్లలు ఉన్న వాళ్ళు హాయిగా ఆనందంగా ఉండచ్చు. ముద్దుగా ఉంది. కానీ, ఆడదిక్కులేని ఇల్లులాగే అసహ్యంగా ఉంది. వేణు బెడ్ రూములో సిగరెట్ పీకలు, ఖాళీ బ్రాందీ సీసాలు, సగం తిని వదిలేసిన అన్నం కంచం, చిప్స్ పాకెట్.

ఆయన బాత్ రూములోకి నడిచి, కాలకృత్యాలు తీర్చుకుని స్నానం చేశాడు. టవల్ చుట్టుకుని బైటకి వచ్చేటప్పటికి వేణు కాఫీ కాస్తున్నాడు. అప్పటికి ఇల్లంతా కొద్దిగా సర్దిఉంది. "పూజ గది ఎక్కడ బాబూ" అడీగాడాయన.

పూజగది అంటూ ప్రత్యేకంగా ఏంలేదు నాన్నా. ఇలారండి. ఇదే, ఇక్కడే దేవుడి ఫోటోలున్నాయి. అంటూ వంటగదిలో ఓ మూల ఉన్న గూట్లో దేవుడి ఫోటోలు చూపించాడు. దుమ్ము, ధూళితో నిండి ఉన్నాయి వెంకటేశ్వర స్వామి ఫోటో, లక్ష్మీ, సరస్వతీ, వినాయకుడు ఉన్న ఫోటోలు. కుందుల్లో కాలిన వత్తి, కాలిన అగరు బత్తుల నుసితో దీపారాధన చేయడానికి అనువుగా లేని ఆ గూట్లో పూజ చేసుకోవాలన్న ఆలోచన విరమించుకుని, శ్లోకాలు చదువుకుంటూ బట్టలు వేసుకున్నాడు. ఈ లోపల ఎవరో ఒక పన్నెండేళ్ళ పిల్ల వచ్చి, చక చకా ఇల్లంతా సర్ది, ఊడ్చి తడిగుడ్డతో ఇల్లంతా తుడించింది. సింకులో ఉన్న ప్లేట్లు, గిన్నెలు కడిగేసింది. వేణు ఆయనకి కాఫీ తెచ్చిచ్చాడు. "స్నానం చేసి వస్తాను నాన్నా" అంటూ బాత్ రూంలోకి దూరాడు. అప్పటికి ఆయన అక్కడికి వచ్చి గంటైంది. వేణుకీ, ఆయనకీ మధ్య రెండు మూడు మాటలు మినహా మరేం సంభాషణ జరగలేదు.

అప్పటిదాకా గిరగిర తిరుగుతూ పనిచేసిన పిల్ల వరండాలో నిలబడి "అయ్యగారూ. ఎల్లచ్చా" అని అడిగింది కృష్ణస్వామిని. ఆయనేం మాట్లాడలేదు. స్నానం పూర్తిచేసి వచ్చిన వేణు మాత్రం "ఉండు. అయ్యగారికీ, నాకూ టిఫిను తెచ్చిపెడుదువుగాని" అంటూ లోపలికి వెళ్ళాడు.

కృష్ణస్వామి కూడా కుర్చీలోంచి లేచి వేణుని అనుసరించి అడిగాడు "టిఫిను హోటలునుంచా?"

వేణు తల ఊపాడు "అవును నాన్నగారూ"

ఆయన కొన్ని క్షణాలు మౌనంగా ఉండి అన్నాడు. "నా అలవాట్లలో మార్పేం లేదురా. నేను బైట తిండి తినలేను నాన్నా. అరటి పళ్ళు తెప్పించి, కాసిని పాలు కలిపి ఇవ్వు చాలు."

వేణుకి అప్పుడు గుర్తొచ్చింది. ఆయన నిష్ఠాగరిష్టుడైన వైష్ణవాలయం పూజారి కృష్ణస్వామిగారు అరవై ఏళ్ళ ఆయన జీవితంలో ఏనాడూ బైట వండిన ఆహారం తీసుకోలేదు. ఇప్పుడు ఆయన నియమం తప్పించి, బైటనుంచి ఇడ్లీ తెప్పించి పెట్టాలనుకున్న తన తెలివితక్కువకి అతనికే సిగ్గేసింది. "సారీ నాన్నా మర్చిపోయాను. నాకు బైట తిండి అలవాటు కాబట్టి, మీకూ అలవాటనుకున్నాను" అంటూ చొక్కా తొడుక్కుంటూ అన్నాడు. "ఇప్పుడే వస్తాను. కూరలు, పెరుగు తీసుకొస్తాను"

ఆయన అతన్ని వారిస్తూ అన్నాడు. "ఒద్దొద్దు నువ్విప్పుడు బైటకి వెళ్ళకు నీతో మాట్లాడాలి. ఆ అమ్మాయిని పంపించి పండ్లు, పాలు తెప్పించు."

వేణు గుండె గుభేలుమంది. ఏం మాట్లాడాలి? తండ్రిని గుమ్మంలో చూడగానే సగం గుండె జారిపోయింది. ఇప్పుడు పూర్తిగా ప్రాణం పోతున్నట్టుగా ఉంది. భయం వేస్తోంది. అర్చన ఏది? అనడిగితే ఏం చెప్పాలి? అర్చన వెళ్ళిపోయింది. వెళ్ళి ఏం చేస్తోందో, ఎక్కడుందో, అసలు బతికుందో, లేదో భగవంతుడా ఇంతకాలం ఈ ప్రశ్న ఎదుర్కోవాల్సి వస్తుందని అమ్మా, నాన్నా కంటపడకుండా తప్పించుకుంటున్నాను. ఇప్పుడేం చెప్పను. ఈయనడిగే ప్రశ్నల ధాటినుంచి నన్ను రక్షించు తండ్రీ.

వేణు గుబగుబలాడుతున్న గుండెని చిక్కబట్టుకుని, తనని తాను అదుపు చేసుకుంటూ వరండాలోకి వెళ్ళి పనిపిల్ల చేతికి ఇరవై రూపాయలు ఇచ్చాడు. "వెళ్ళి అరటి పళ్ళు కొనుక్కురా"

"ఎన్నండి?" అడిగింది.

"డజను తీసుకురా".

వేణు వంట గదిలోకి వెళ్ళి పాలు వెచ్చబెట్టి, గ్లాసులో పోసాడు. పంచదార వేసి, స్పూన్‌తో నెమ్మదిగా కలుపుతూ, అడుగులో అడుగు వేసుకుంటూ గదిలోకి నడిచాడు. కృష్ణస్వామి రెండుచేతులూ ఒడిలో చాపుకుని, కుర్చీలో కొంచెం ముందుకి వంగి, నేలచూపులు చూస్తూ ఏదో దీర్ఘంగా ఆలోచిస్తున్నాడు. వేణు ఆయన దగ్గరగా నడిచి వణుకుతున్న చేతులతో పాలగ్లాసు అందించాడు.

అతని చేతులు కంపించడం ఆయన దృష్టిలో పడింది. నెమ్మదిగా గ్లాసు అందుకుని "కూర్చో వేణూ" అన్నాడు.

వేణుకెందుకో భయం వేసింది. నాన్న ఎందుకలా ఉన్నారు? అసలు ఇంత సడన్‌గా ఎలా వచ్చారు? ఇంతకుముందెప్పుడూ హైదరాబాదు రాని మనిషి ఎలా వచ్చారు? ఈయన లేకపోతే గుడి తలుపులు కూడా తీయరే. పైగా ఇది ధనుర్మాసం. ఎలా వచ్చారు? కొడుకూ, కోడలి దగ్గరకి వచ్చానన్న ఆనందంకానీ, ఉత్సాహం కానీ లేదీయనలో. వస్తూనే అమ్మాయేది? అంటూ చాలా పొడిగా ప్రశ్నించారు. ఎక్కడికెళ్ళిందన్న ఆరాటంకానీ, కుతూహలం కానీ కనిపించలేదు. చాలా మామూలుగా, నిర్వికారంగా అడిగారు. ఏదో జరిగింది. ఏం జరిగి ఉంటుంది. నాన్నకి అర్చన ఇంట్లోంచి వెళ్ళిపోయిందని తెలిసిపోయిందా?

"వేణూ.. అర్చన వచ్చింది"

వేణు పక్కన బాంబు పడ్డట్టుగా అదిరిపడ్డాడు. విహ్వలంగా చూశాడు తండ్రి వైపు "అ.. అర్చన వచ్చిందా? ఎ..ఎక్కడికి? ఎప్పుడు?"

ఆయన తలెత్తి సూటిగా కొడుకువైపు చూస్తూ, అమ్ముల పొదిలో దాచిన బాణాలు ఒకొక్కటే సంధిస్తున్న వాడిలా అన్నాడు. "అర్చన మన ఊరుకి వచ్చింది నిన్న తెల్లవారు ఝామున, బాబుని తీసుకొచ్చి, గుడిమెట్ల మీద వదిలిపెట్టి, తిరిగి వెంటనే వెళ్ళిపోయింది . మాకెవరికీ కనిపించకుండా వెళ్ళిపోయింది. "

వేణు తెల్లబోయి చూస్తూ వింటున్నాడు. "బాబుని ఎవరి బాబుని?" అయోమయంగా అడిగాడు.

"నీ కొడుకుని"

"నో" గట్టిగా అరిచాడు "నో నా కొడుకా? అలా జరగడానికి వీల్లేదు. అసలా అవకాశమేలేదు"

ఈసారి ఆయన తెల్లబోయిచూశాడు "అంటే అంటే ఏంటిరా నువ్వనేది? వాడు నీ కొడుకు కాదా?"

"కాదు నాన్నా. ఎంతమాత్రం కాదు. నాకొడుకసలు కాదు. ఆ అవకాశం లేదు"

"అదేంటి? అర్చన నీ భార్య"

"కావచ్చు. కానీ, మా మధ్య ఆ సంబంధమేలేదు. ఆ అన్యోన్యత, ఆ ప్రేమా ఏవీలేవు. అర్చన నాతో బలవంతంగా బతికింది అదీ కొంతకాలం. నిజం నాన్నా. కేవలం ఐదారు నెలలు అంతే. నా నుంచి పారిపోయింది. ఆమె మనసులో నాకు చోటులేదు. నేనంటే ఆమెకిష్టం లేదు. అందుకే అందుకే నన్ను విడిచి వెళ్ళిపోయింది. ఏడాది కావస్తోంది. వెళ్ళిపోయింది. ఏడాది కావస్తోంది. వెళ్ళిపోయింది. అవును నాన్నా అర్చన నన్ను వదిలిపెట్టి వెళ్ళిపోయింది" వేణు రెండు చేతుల్లో మొహం దాచుకుని, మోకాళ్ళమీదకి వంగాడు.

"ఎక్కడికి? ఎక్కడికెళ్ళింది?"

"నాకు తెలియదు నాన్నా. నాకేం తెలియదు. నన్నేం అడక్కండి" వేణు స్వరంలోని వేదన ఆయన గుండెల్ని పిండేసినట్టుగా అనిపించింది. ఆప్యాయంగా కొడుకు తలమీద చెయ్యి వేసి, జుట్టు సవరిస్తూ అన్నాడాయన.

"ఏం జరిగిందిరా? మీ ఇద్దరి మధ్యా ఏదన్నా గొడవైందా? సంసారం అన్నాక గొడవలు మామూలు నాన్నా. దానికోసం"

వేణు చివ్వున తలెత్తి చూశాడు. అతని కళ్ళు ఎర్రగా ఉన్నాయి."నాన్నా మీకు తెలియదు. అర్చన నాకు లోకం కోసమే భార్య. అవును కేవలం లోకం దృష్టిలో మాత్రమే నా భార్యనాన్నా. మా ఇద్దరి మధ్యా ఏం సంబంధంలేదు. తనెక్కడికి వెళ్ళిందో, ఎందుకెళ్ళిందో నాకేం తెలియదు."

అయోమయంగా చూశాడాయన.

ఏమైంది? వేణుకేమైంది? అర్చన ఎందుకు వెళ్ళింది? ప్రేమించి పెళ్ళిచేసుకున్నారే. ఎందుకు వాళ్ళ మధ్య గొడవ అయింది? అది ఇంత తీవ్రరూపం దాల్చిందాకా పెద్దవాళ్ళయిన తనకి, తన భార్యకీ ఎందుకు చెప్పలేదు? ఆయనకి ఆలోచిస్తుంటే శరీరం తీవ్రంగా కంపించసాగింది. కొడుకు కాపురం మూణ్ణాళ్ళ ముచ్చటైందా? ఒక్కగానొక్క కొడుకు కలెక్టర్ కావాలని పట్నం పంపించి చదివించారు. ఎంతో బాగా చదువుతూ, తమ ఆశలు తీరుస్తాడనుకున్న కొడుకు డిగ్రీ పూర్తికాగానే బ్యాంకు పరీక్షలు రాయడం, బ్యాంకులో ఉద్యోగం సంపాదించుకుని, అర్చనని భార్యగా స్వీకరించి ఆశీర్వాదం కోసం వచ్చినరోజు నిర్ఘాంతపోయారేగానీ, కొడుకుని ఏమీ అనలేకపోయారు. పోనీలే ఎలాగోలా వాడికి నచ్చిన పద్ధతిలో బతకనీ ఎలా బతికినా సుఖంగా ఉంటే చాలనుకున్నారు. కానీ, ఇదేంటి? ఇలా జరిగిందేం?

ఆయన అయోమయంగా వేణువైపు చూశాడు. వేణు రెండుచేతుల్లో తలపట్టుకుని, నేలచూపులు చూస్తూ కూర్చున్నాడు. అతని కళ్ళు నిప్పుకణికల్లా ఉన్నాయి. రగులుతున్న అగ్నిలా ఉన్నాడు. ఆయనకి భయం వేసింది. అసలే భార్య వియోగంతో ఉన్న కొడుకుకి ఇప్పుడు ఆశనిపాతంలాంటి వార్త తీసుకొచ్చాడు తను. ఆయన పితృహృదయం ద్రవించింది.

"వేణూ" మృదువుగా ప్రేమగా పిలిచాడు.

వేణు దీనంగా చూశాడు. "నిజం నాన్నా నాకు అర్చన ఎందుకు వదిలి వెళ్ళిందో తెలియదు. నేను తనని ఏమీ బాధపెట్టలేదు నాన్నా. ఇంకా తనని ఎప్పుడూ సంతోషపెట్టడానికే ప్రయత్నించా. తనంటే నాకు చాలా ఇష్టం నాన్నా. అందుకే అందుకే... "

"అ అందుకే" ఏదో చెప్పబోయి ఆగిపోయిన కొడుకుని రెట్టిస్తూ అడిగాడు.

"అబ్బే ఏం లేదు నాన్నా. నాకు తెలియదు తనెందుకు వెళ్ళిపోయిందో"

"ఎందుకు తెలియదు? తెలుసుకోవాల్సిన బాధ్యత నీదికాదూ. నీ భార్య ఇంట్లోంచి వెళ్ళిపోతే, ఎక్కడికెళ్ళిందో, ఎందుకెళ్ళిందో, వెళ్ళి ఏం చేస్తోందో తెలుసుకున్నావా?" తీవ్రంగా అడిగాడాయన.

వేణు ఆవేశంగా చూశాడు. అణుచుకున్న ఆవేశం ఒక్కసారిగా ఉవ్వెత్తున లేచింది.

"ఎందుకు తెలుసుకోవాలి? చెప్పండి. దానికి ఒళ్ళు పొగరెక్కి వెళ్ళింది. ఆయాచితంగా లభించిన చక్కటి సంసార జీవితాన్ని అనుభవించడం చాతకాక వెళ్ళిపోయింది. అలాంటి ఆడదాన్ని నేనెందుకు ఖాతరు చేయాలి? చెప్పండి. ఎందుకు చేయాలి?" ఆవేశంగా అడిగాడు. "అయితే, ఓ విషయం మా దగ్గర ఇంతకాలం ఎందుకు దాచావురా? అర్చన నిన్ను విడిచి వెళ్ళిందని మాకెందుకు చెప్పలేదింతకాలం?"

"ఈ విషయం ఒక్కటే కాదు నాన్నా మీ దగ్గర మరో విషయం దాచాను. అందుకే నా కన్నతల్లి తండ్రులను మోసగించినందుకే నేనివాళ ఇలా అనుభవిస్తున్నాను. నన్ను క్షమించండి.." బావురుమంటూ ఆయన ఒళ్ళో వాలిపోయాడు వేణు.

ఆయన మనసు ఆర్ధ్రమైంది. అతనిపట్ల వాత్యల్యంతో, అభిమానంతో గుండె కరిగిపోయింది. అప్రయత్నంగా అతని వీపు మీద చేయివేసి నిమురుతూ "ఎందుకునాన్నా ఇంత గరళాన్ని గొంతులో అదిమిపెట్టి, అమ్మనీ, నాన్ననీ మోసంచేస్తూ బతుకుతున్నావు? మేము చచ్చామనుకున్నావా?"

"అంతమాటనకండి నాన్నా ప్లీజ్. ప్లీజ్ జరిగిందేవిటో, ఏ పరిస్థితుల్లో నేను అర్చనని పెళ్ళిచేసుకోవాల్సి వచ్చిందో చెపుతాను. మీరనుకున్నట్టు, నేనూ, అర్చనని గాఢంగా ప్రేమించినమాట నిజం. తను కావాలని తపించిపోయింది నిజం. కానీ, అర్చనకి నేనంటే ఇష్టంలేదు. అయితే, మా పెళ్ళి ఎలా జరిగిందని మీకు అనుమానం రావచ్చు. చెపుతాను" వేణు కొన్ని క్షణాలు మౌనంగా ఉండిపోయాడు. జరిగిన సంఘటనలు మరోసారి మనోఫలకం మీదికి తెచ్చుకుని, వాటిని తండ్రికి కన్విన్స్ చేసేలా చెప్పడం కోసం రిహార్సల్స్ వేసుకుంటున్నవాడిలా ఉండిపోయాడు. పనిపిల్ల అరటిపళ్ళు తెచ్చిచ్చింది.

"పండు తినండి నాన్నా" పండు అందించాడు.

ఆయన వేణు చేతిలోంచి ఆ పళ్ళు తీసుకుని వంటగదిలోకి నడిచి, సింక్‌లో పంపు తిప్పి పళ్ళను కడిగాడు.

కడిగిన పళ్ళల్లోంచి నాలుగు పళ్ళు ఒక ప్లేట్‌లో పెట్టుకుని, తిరిగి వేణు దగ్గరకు వచ్చాడు.

ఒక అరటి పండు తీసుకుని, కొద్దిగా తొక్క వలచి, పండు వేణు నోటికి అందిచ్చాడు.

వేణు కళ్ళల్లో మరోసారి నీళ్ళు తిరిగాయి. ఎంత ప్రేమ అమ్మా, నాన్నలకి తనంటే. ఒక్కడే కొడుకని ఎంతగారాంగా పెంచారు? తను కలెక్టర్ కావాలని కలలు కన్నారు. అడిగినంత డబ్బిచ్చి, విశాఖపట్నంలో చదివించారు. డిగ్రీ కాగానే 'సివిల్ సర్వీసెస్‌కి రాయినాన్నా మంచి ర్యాంకు తెచ్చుకుని, కలెక్టర్‌వై మన ఊరికి నేను పుట్టి పెరిగిన ఈ ఊరికి నువ్వు కలెక్టర్‌గా రావాలిరా' అంటూండేవాడు నాన్న. అమ్మ సెలవులకి వెళ్ళినప్పుడల్లా సున్నుండలు, వెన్నుండలు అంటూ బలం పెంచే పిండివంటలు చేసి పెడుతూ, కొసరి కొసరి కమ్మటి వంటలు వడ్డిస్తూ, 'బాగా చదువుకో నాన్నా పట్నంలో మగపిల్లలు గాలికి తిరుగుతారని అంటున్నారు. మన ఊళ్ళో వాళ్ళ ఆలోచన తప్పని నిరూపించాలి' అంటూ హితువు చెపుతుండే అమ్మ. ఎంత వాత్సల్యం, ఎంత కరుణ, ఎంత ప్రేమ చీమకూడా హాని చేయని అమాయకులు అమ్మా, నాన్నా.

ఆ రోజు అర్చనని మెడలో మంగళసూత్రంతో ఇంటికి తీసికెళ్ళేరోజు తనెంతగా భయపడ్డాడు.

కానీ ఏం జరిగింది? ఆ దంపతులు ముందు నిర్ఘాంతపోయినా గంటసేపు తనతో మాట్లాడకపోయినా, కొద్దిసేపట్లోనే కోడల్ని ఆప్యాయంగా లోపలికి ఆహ్వానించి, మా కోడలు అంటూ ఊరందరికి పరిచయం చేసుకున్నారు.

ఒక్కగానొక్క కొడుకు పెళ్ళి అంటూ మరోసారి ఊళ్ళో వాళ్ళకోసం పెళ్ళంత ఆర్భాటం చేసి, సత్యనారాయణ వ్రతం చేయించారు.

అర్చన మెడ వంగిపోయే అన్ని నగలతో అలంకరించింది అమ్మ. ఆ నగలు అమ్మకి వాళ్ళ పుట్టింటివాళ్ళు ఇచ్చినవి. అయినా ఇవి నీకే తల్లి అంటూ అర్చనకి ఇచ్చింది. "మహాలక్ష్మిలా నట్టింట అడుగుపెట్టావు కంటనీరు పెట్టొద్దమ్మా" అంటూ అర్చన తడి కళ్ళను తన చెంగుతో అద్ది, అక్కున చేర్చుకుంది అమ్మ.

అలాంటి వాళ్ళని తను వంచించాడు. తనేకాదు. అర్చనకూడా. అర్చన చేసిన వంచన, మోసం భయంకరమైనది. అటువాళ్ళనీ, ఇటు తననీ ఘోరంగా, దారుణంగా మోసం చేసింది.

వేణు రక్తం సలసలా మరిగినట్టు అయింది. పైగా, పైగా పిల్లవాడిని తీసికొచ్చి, తనవాళ్ళ దగ్గర దింపిందిట. వాడు నా కొడుకా? ఛీ, ఛీ కాపురమే చేయనప్పుడు కొడుకెలా పుడతాడు?

ఎవరై ఉంటాడా పిల్లాడు? అర్చన పెళ్ళిచేసుకుందా? లేదు అలా జరగదు. పెళ్ళి చేసుకునే ఉద్దేశమే ఉంటే తనని వదిలి ఎందుకు వెళుతుంది? అయితే ఎవ బాబు? కొంపతీసి ఆమె జీవితంలో ఏదన్నా దుర్ఘటన.. ఒక్కసారి వేణు వణికిపోయాడు.

ఏడాదిపాటు ఎంత సహనం వహించాడు. ఎంత ప్రేమించాడు. అర్చన మనసు మారాలని, మారుతుందని ఎంత ఆశపడ్డాడు. ప్రేమించిన యువతి, కోరుకున్న యువతి భార్య అయి, ఒక ఇంట్లో కలిసి బతుకుతూ, తనని వేలేసి ముట్టుకోనివ్వలేదు. ఆఖరికి ఆఖరికి ఆరోజు వేణు ఆలోచనలు హఠాత్తుగా ఆగిపోయాయి.

"చెప్పు వేణూ ఏదో చేపుతానన్నావు?" కృష్ణస్వామి మాటలకి ఉలిక్కిపడ్డాడు.

ఒక్కసారి గాఢంగా నిట్టూర్చి అన్నాడు "చెపుతాను నాన్నగారూ. మీకిప్పుడు నేను చెప్పితీరాలి. ఇప్పటికీ చెప్పలేకపోతే నేను మిమ్మల్ని మోసం చేస్తున్నానన్నమాట.

ఆయన మంచం మీద వెనక్కివాలి, దిండుకి తల ఆన్చి అతనివైపు సూటిగా చూశారు.

"ఏం జరిగింది? ఏ విషయంలో నన్ను మోసం చేశావు ఇప్పటిదాకా"

మరోసారి ఉలిక్కిపడ్డాడు వేణు. ఆయనంత సుటిగా అడుగుతాడనుకోలేదు.

మౌనంగా ఉన్న వేణుని రెట్టిస్తూ అడిగాడాయన "చెప్పరా ఏ విషయంలో మోసం చేశావు? నిన్ను ఎంతో ప్రేమగా పెంచుకుని, నువ్వేం చేసినా మనసారా దీవించిన మమ్మల్ని మోసం చేయాల్సిన అగత్యం ఎందుకొచ్చిందిరా"

"అవును ఎందుకొచ్చింది? ఒకే ఒక్క కొడుకని ఎంతో ప్రేమగా, అడిగిందల్లా కాదనకుండా, లేదనకుండా చేసిన అమ్మా నాన్నల్ని మోసం చేయాల్సిన అవసరం ఎందుకు కలిగింది? " వేణు మనసులో తననితను పదే, పదే ప్రశ్నించుకోసాగాడు.

"మోసం చేయాలని చేయలేదు నాన్నగారూ. పరిస్థితులు అలా వచ్చాయి. అంతే ఆ పరిస్థితుల్లో నేనలా చేయాల్సి రావడం నా దురదృష్టమో, అర్చన దురదృష్టమో నాకు తెలియదు. కానీ కానీ.." నెమ్మదిగా తనలో తాను చెప్పుకుంటున్నట్టుగా, అస్పష్టంగా వేణు చెప్పసాగాడు. కృష్ణస్వామి దిండుమీద వెనక్కి వాలి, వేణువైపు తదేకంగా చూస్తూ పడుకున్నాడు.

వేణు మనసంతా గందరగోళంగా ఉంది. అర్చన ఏమాత్రం విశ్వాసం లేని స్త్రీ సిగ్గులేకుండా ఎక్కడెక్కడో తిరిగి, ఎవరికో పిల్లవాడిని కని, తన తల్లి, తండ్రుల వద్ద ఆ పల్లెటూళ్ళో వదిలిపెట్టి వెళ్ళడమా? ఎంత ధైర్యం. అతనికి కంపరంగా అనిపించింది. పుట్టి పెరిగిన ఊళ్ళో, తరతరాలనుంచీ ఒక గౌరవనీయమైన కుటుంబంగా ఊరి ప్రజలందరి అభిమానం, మన్నన పొందుతూన్న కృష్ణస్వామిగారు, భ్రమరాంబగారు ఇవాళ వారి కోడలు చేసిన పనికి తలెత్తుకోలేని వాళ్ళయ్యారు. ఏ ఊళ్ళో అయితే, మహారాజుల్లా తిరిగారో ఆ ఊళ్ళో ఇవాళ చేయని నేరానికి వాళ్ళిద్దరూ నేరస్తులుగా తిరగాలి. ఎంత ధైర్యం అర్చనకి. ఎవరికి కన్నబిడ్డనో తీసుకువచ్చి మీ మనవడు అని వదిలిపెట్టడానికి ఆమెకెంత ధైర్యం కావాలి.

కానీ, కానీ అలా ఎందుకు చెపుతుంది? అర్చన నిజంగా తను అనుకుంటున్నట్టు నీతిలేనిదికాదు. తను కోపంలో, ఆమె తనకి చేసిన అన్యాయానికి రగిలిపోతూ అభాండాలు వేస్తున్నాడు కానీ, అర్చన సంగతి తనకి బాగా తెలుసు. ఆమెకి అసలు మగస్పర్శే ఇష్టంలేదు. ఎన్నోసార్లు తను తాకబోతే పాము మీద పడ్డట్టే చూసేది. పెళ్ళంటేనే అసహ్యం అన్న అర్చన ఎవరికో పిల్లాణ్ణి కంటుందా?

ఓ గాడ్ ఏంటి? ఏం జరుగుతోంది? ఇప్పటిదాకా జరిగిన ఘోరాలు చాల్లేదా? భగవంతుడు ఇంకా, ఇంకా తన జీవితంతో ఆడుకోవాలనే అనుకుంటున్నాడా?

ఒకవేళ ఒకవేళ బాబు నిజంగా.. నో.. ఎలా సాధ్యం?

ఎందుకు సాధ్యం కాకూడదు? నువ్వు ఆవేశంలో చేసిన పని ఆమెకి శాపంగా మారిందేమో! ఆ శాపాన్ని నీకే కానుకగా ఇచ్చిందేమో? అంతరాత్మ నిలదీసినట్టు అనిపించింది.

వేణుకి ఒళ్ళంతా చెమటలు పట్టింది. మెదడు ఆలోచనలతో వేడెక్కిపోయింది.

తండ్రివైపు పిచ్చి చూపులు చూశాడు. బాగా అలసిపోయాడేమో కృష్ణస్వామి నిద్రలోకి జారిపోయాడు.

వేణు చివ్వున లేచి వాష్ బేసిన్ వైపు వెళ్ళి, చన్నీళ్ళతో మొహం కడుక్కున్నాడు. అడ్డ, దిడ్డంగా తల దువ్వుకుని, హాంగర్ కున్న షర్ట్ తీసి తొడుక్కుని, తలుపు వారగా వేసి, బైటకి వచ్చి స్కూటర్ స్టార్ట్ చేశాడు.

కొంచెం దూరంలో ఉన్న డాక్టర్ ప్రజ్ఞ దగ్గరకి స్కూటర్ పోనిచ్చాడు.

డాక్టర్ ప్రజ్ఞ వేణు కొలీగ్‌కి అక్క. ఆవిడ గైనకాలజిస్టు. ఈ మధ్యే కోర్సు పూర్తిచేసి, ప్రైవేటు ప్రాక్టీసు పెట్టింది. వేణు స్కూటర్ గేట్లో పార్క్ చేసి, లోపలికి నడిచాడు. పైన ఇల్లు కింద డిస్పెన్సరీ.

అప్పటికి సమయం పన్నెండవుతోంది. ఒకరిద్దరు పేషెంట్స్ వరండాలో కూర్చుని ఉన్నారు. ఆయా డాక్టర్ గారి గుమ్మం దగ్గర కర్టెన్ పట్టుకుని మధ్య, మధ్య లోపలికి తొంగిచూస్తూ నిలబడి ఉంది. లోపల ఎవరో పేషెంట్ ఉన్నట్టున్నారు. వేణు కుర్చీలో కూర్చున్నాడు.

"మెడికల్ రిప్రెజెంటివా?" అడిగింది ఆయా.

కాదన్నట్టు తలఊపి "పర్సనల్" అన్నాడు.

ఇంతలో లోపల ఉన్న పేషెంట్ బైటికి వచ్చింది. ఆయా మరొకరిని పంపించింది. మిగిలిన ఆ ఒక్క పేషెంట్ కూడా లోపలికి వెళ్ళొచ్చిందాకా ఓపిగ్గా కూర్చున్నాడు వేణు. ఆఖరి పేషెంట్ బైటకి వస్తోంటే ఆయా లోపలికి వెళ్ళింది. ఒక్క నిమిషంలో బైటికి వచ్చి వెళ్ళండి అన్నది వేణుని ఉద్దేశిస్తూ.

వేణు కర్టెన్ తొలగించుకుని లోపలికి నడిచాడు.

"హలో వేణూ కం కం ఏంటిలా వచ్చావు? " హుషారుగా ఆహ్వానించింది డాక్టర్ ప్రజ్ఞ

వేణు సమాధానంగా చిన్నగా నవ్వి ఊరుకున్నాడు.

"టీ తాగుతావా? కాఫీనా?"

"ఏం వద్దు. ఇప్పుడే అన్ని అయాయి."

"ఏం ఫర్వాలేదు. మరోసారి కానివ్వు. టీ చెప్పనా? అయామ్ టైర్డ్.. టీ తాగాలి" అన్నది బెల్ నొక్కుతూ. ఆయా లోపలికి రావడంతో వేణు సమాధానం కోసం చూడకుండా "రెండు టీ తెప్పించు" అని చెప్పి ఆయా వెళ్ళిపోగానే "ఏంటి విశేషాలు?" అనడిగింది.

వేణు మౌనంగా ఆవిడ టేబుల్ మీద్ ఆపేపర్ వెయిట్ తిప్పుతూ కూర్చున్నాడు. కొన్ని క్షణాలు అతని సమాధానం కోసం చూస్తూ కూర్చున్న ప్రజ్ఞ కొద్దిగా ముందుకు వంగి ఆప్యాయంగా అడిగింది. "ఏంటి మౌనం భోంచేస్తున్నావు? ఎనీ థింగ్ రాంగ్?"

వేణు సన్నగా నిట్టూర్చి తలెత్తి ఆవిడవైపు చూస్తూ "ఒక్కసారితో గర్భం వచ్చే అవకాశం ఉందా?" అడిగాడు. ఆవిడ కళ్ళల్లో ఆశ్చర్యం వెంటనే పెదిమల మీద చిన్న చిరునవ్వు వెలిశాయి. ఆవిడకి అర్చన గురించి తెలుసు. వేణు జీవితంలోంచి అర్చన వెళ్ళిపోయిందని, వేణు అప్పట్నించీ బాగా డిస్ట్రబ్ అయి ఉన్నాడని అన్ని విషయాలూ తెలుసు. వాళ్ళిద్దరిదీ అన్యోన్య దాంపత్యం కాదని కూడా తెలుసు. ఓసారి అర్చనని చెకప్‌కి కూడా తీసుకొచ్చాడు. అర్చనకి దాంపత్య జీవితం మీద ఎందుకు విరక్తి కలిగిందో తనతో ఎందుకు ఎడమొహంగా ఉంటోందో, శారీరకంగా ఏం లోపమో తెలుసుకోవడానికి తీసుకొచ్చాడు. అర్చనకి శారీరకంగా ఏం లోపం లేదని మానసికంగానే అని ఆవిడకి తెలిసినా ఆవిడ వేణుతో ఆ విషయం చెప్పలేదు "మరికొంత కాలం ప్రయత్నించు వేణూ. ఆవిడకేం లోపంలేదు. షి ఈజ్ క్వైట్ ఆల్ రైట్" అని చెప్పిపంపించింది.

వేణు ప్రశ్నతో ప్రజ్ఞ ఉలిక్కిపడింది. "కలిసిన ఎన్నాళ్ళకి గర్భం వస్తుంది"

"ఎందుకు అడుగుతున్నావు? ఎవరితోనన్నా కమిట్ అయావా? ఈజ్ షి క్యారీయింగ్?" అడిగింది. మగవాడు భార్యలేకుండా ఎంతకాలం ఉంటాడు. వేణు ఏదో పొరపాటు చేసి ఉంటాడు. అయితే ఏం మ్యారేజ్ చేసుకోవచ్చుగా. వెళ్ళిపోయిన భార్యకోసం ఎందుకు నిరీక్షణ అనిపించిందావిడకి.

"నో నో" ఖంగారుగా అన్నాడు వేణు.

"అలాంటిదేం లేదు కానీ"

"ఊ కానీ"

"అర్చన.. అర్చన వెళ్ళిపోయిన ఏడాదికి తిరిగి వచ్చి బాబుని నాన్నగారి దగ్గర వదిలి వెళ్ళిందిట."

"వ్వాట్ అర్చన బాబుని హౌ హౌ ఇటీజ్ పాసిబుల్?"

"అదే నాకూ అర్థం కావడంలేదు."

"మ్యారేజ్ చేసుకుందేమో"

"అలా అయితే, తన కొడుకుని నాన్నగారి దగ్గర ఎందుకు వదులుతుంది?"

"అఫ్‌కోర్స్" ఆవిడ ఆలోచనలో పడింది

"ఎవరిబాబు?" అడిగింది

"నా బాబని చెప్పిందిట."

"ఓ గాడ్ వేణూ ఇలా ముక్కలు, ముక్కలుగా కాక కొంచెం వివరంగా చెబుతావా? నాకు మతిపోతోంది" అన్నది.

ఇంతలో ఆయా టీ తీసుకురావడంతో ఇద్దరూ నిశ్శబ్దంగా అయారు.

టీ తాగుతూ తనకి కృష్ణస్వామిగారు చెప్పిందంతా క్లుప్తంగా చెప్పి అన్నాడు. "నాతో కాపురమే చేయలేదు. నాకు బాబు ఎక్కడినుంచి వస్తాడు?" అడిగాడు సూటిగా

"అసలు మీ ఇద్దరూ ఎప్పుడూ కలవలేదా? దాదాపు ఏడాది కలిసి బతికారుగా"

"లేదు కానీ.. ఒకరోజు"

"ఊ ఒకరోజు ఏం జరిగింది?"

వేణుకి ప్రజ్ఞ అలా సుటిగా అడుగుతుంటే కొంచె జంకు కలిగింది. నేను తప్పుచేశాను. అలా చేయకుండా ఉండాల్సింది. ప్రజ్ఞకి ఆ సంఘటన గురించిఎలా చెప్పాలి?

అతని మౌనం భంగం చేస్తూ మళ్ళీ అడిగింది ఆవిడ. "ఏం జరిగింది చెప్పు సందేహించకు."

ప్రజ్ఞ అతడివైపు సూటిగా చూస్తూ కూర్చుంది.

అతని కళ్ళముందు ఆనాటి సంఘటన కదిలింది.

●●●

**ఆ రోజు చక్రవర్తి కొడుకు బారసాల.** చక్రవర్తి వెళ్ళి మూడోనెల బాబునీ, మాధవినీ పుట్టింటినుంచి తీసుకొచ్చాడు. వారంరోజుల తరువాత బ్యాంకులో వేణుని కలిసాడు.

''వేణూ.. రేపు బాబు బారసాల పేరు పెడుతున్నాం. అర్చనని తీసుకుని రేపు ఉదయం ఇంటికి వచ్చెయ్యి. ఆదివారమేగా. అలాగే అర్చనని పేరేదన్నా సెలక్ట్ చేయమని చెప్పు. మంచి క్రియేటివ్ నేమ్.'' అన్నాడు చక్రవర్తి వేణుతో మధ్యాహ్నం లంచ్ టైంలో. ఒకళ్ళకి హైదరాబాదులో, మరొకరికి వరంగల్‌లో పోస్టింగ్ రావడంతో కొంచెం బాధపడ్డారు కానీ, చక్రవర్తి తండ్రి బాగా పలుకుబడి ఉన్న వ్యక్తికావడంతో చక్రవర్తిక్కూడా వరంగల్ నుంచి హైదరాబాదుకి ఆరునెలల్లో బదిలీ చేయించగలిగాడు. అలా వారిద్దరూ ఒకే బ్యాంకులో, ఒకే బ్రాంచిలో కలిసి పనిచేసే అవకాశం ఏర్పడింది. విద్యార్థులుగానే వాళ్ళిద్దరూ మంచి స్నేహితులు. పైగా ఒకే రూములో ఉండేవాళ్ళు. ఇప్పుడు ఒకే ఆఫీసు. వాళ్ళ మధ్య ఎటువంటి అరమరికలు, రహస్యాలు లేని స్నేహం ఉంది.

''అర్చన వస్తే తప్పకుండా తీసుకొస్తాను'' అన్నాడు కొంచెం ముభావంగా.

''ఏం? ఎందుకురాదు? '' అడిగాడు చక్రవర్తి. ''అర్చనా, మధూ మంచి స్నేహితులు కూడా కదా''

వేణు మౌనంగా ఉండిపోయాడు.

''ఏంటి వేణూ మాట్లాడవేం?'' మృదువుగా అడిగాడు చక్రవర్తి.

''ఏం మాట్లడను?''

''ఏదో ఒకటి. డల్‌గా ఉన్నావేంటి?'' వేణు భుజమ్మీద చేయివేసి ఆప్యాయంగా అడిగాడు చక్రవర్తి.

వేణు నిట్టూర్చాడు. ''అర్చన ఉద్యోగం మానేసింది.''

''ఉద్యోగం మానేసిందా?'' విస్మయంగా అడిగాడు చక్రవర్తి.

''అవును. పదిరోజుల్నుంచీ ఆఫీసుకి వెళ్ళడం లేదు. ఒంట్లో బాగోలేదేమో లీవు పెట్టిందేమో అనుకున్నాను.''

''అనుకోడం ఏంటి? నువ్వడగలేదా ఏమైంది అని'' ఆశ్చర్యంగా చూశాడు.

వేణు నిట్టూర్చాడు. ''ఏం మాట్లాడినా సమాధానం సరిగా చెప్పదు. ఇన్నిరోజులూ కనీసం స్నేహితుల్లా అయినా కబుర్లు చెప్పుకుంటూ సరదాగా ఉండేవాళ్ళం. సుమారు నెలకావస్తోంది. తనలో ఏదో మార్పు వచ్చింది. పరధ్యానంగా ఉంటుంది. నవ్వడం మర్చిపోయినట్టుగా ఉంది. మాధవి కూడా సమయానికి డెలివరీకి వెళ్ళడంతో అర్చన మనసులో ఏం ఉందో తెలుసుకోవడం ఎలాగో నాకు అర్థంకాలేదు.''

''అదేంటి వేణూ నాకెందుకు చెప్పలేదు. మనం రోజూ కలుస్తూనే ఉన్నాం కదా''

వేణు మాట్లాడలేదు. ఏం చెప్పాలి. ఎంత ఆత్మీయుడైనా నా భార్య నాతో సరిగా ఉండడం లేదని అస్తమానం చెప్పుకోడం తనకే అవమానం. చక్రవర్తి పెళ్ళి అయిన ఐదారు నెలలకే అర్చనని తను వివాహం చేసుకున్నాడు. చక్రవర్తి తండ్రి అయాడు. కానీ, తను..!?

అర్చన తనని ఒక స్నేహితుడిగా తప్ప భర్తగా అంగీకరించడం లేదు. ప్రతిరాత్రీ అర్చన కౌగిలికోసం తను తపిస్తూనే ఉన్నాడు. పదికాగానే గుడ్‌నైట్ అంటూ తన గదిలోకి వెళ్ళిపోయి తలుపేసుకుంటుంది. అప్పటిదాకా ఎన్నో కబుర్లు చెపుతుంది. టిఫిను, వంట చేసిపెడుతుంది. భార్యగానో, స్నేహితురాలిగానో ఉదయం లేచిన దగ్గర్నుంచీ తనకి ఏ టైముకి ఏం కావాలో అన్నీ అమరుస్తూ, కులాసాగా బండి వెనకాల కూర్చుని కలిసి ఆఫీసుకి వెళుతూ, సినిమాలు, షికార్లు తిరుగుతూ రాత్రికాగానే తన నుండి దూరంగా పారిపోయే అర్చన

గురించి ఎవరికి చెప్పుకోవాలి. ఏమని చెప్పుకోవాలి. ఎంతో ప్రేమించి, తపించి, లాలించి, బుజ్జగించి, అనునయించి పెళ్ళిచేసుకున్నాడు. తనమీద తల్లి, తండ్రులు పెట్టుకున్న ఆశలు కూడా నిరాశ చేసి, అర్చన జీవితం నాశనం కాకూడదని ఆమెని అర్ధాంగిగా చేసుకున్నాడు. తనకి బ్యాంకు ఉద్యోగం రావడం ఆమె అదృష్టం కాదా!? లేకపోతే ఇంత స్వల్ప వ్యవధిలో జీవితం ఇలా సెటిల్ అయేదా, అర్చన ఎందుకు అర్థం చేసుకోడం లేదు. ఆమె మనసులో ఏం ఉంది? ఏం చేయాలనుకుంటోంది?

"వేణూ. ఏం జరిగింది? ఏం ఆలోచిస్తున్నావు?" మృదువుగా అడిగాడు చక్రవర్తి.

ఆలోచనలనుంచి తేరుకుంటూ "తెలియదు. అర్చన మనసులో ఏదో సంఘర్షణ జరుగుతోంది. నాకెందుకో అనుమానంగా కూడా ఉంది. ఏదో జరక్కపోతే తనకి సెక్స్ అంటే భయం ఎందుకు?" అన్నాడు కొంచెం ఆవేశంగా.

"ఏంటి? ఏం అంటున్నావు నువ్వు. నీకూ, అర్చనకీ ఇంకా సయోధ్య కుదరలేదా? నేనింకా ఈ పాటికి మీరిద్దరూ చక్కగా కాపురం చేసుకుంటున్నారనుకుంటున్నాను. అదేంటి వేణూ. ఎందుకు ఊరుకున్నావు?"

"ఊరుకోక ఏం చేయాలి? కొట్టనా? తన్ననా? వెళ్ళగొట్టనా?

"ప్చ్.. వేణూ.. ఆవేశం కాదు. కొంచెం నిదానంగా మాట్లాడు. మంచో, చెడో తొందరపాటో, గ్రహపాటో ఆమెని పెళ్ళిచేసుకున్నావు. ప్రేమించావు. కావాలనుకున్నావు. అందరిలా కాకుండా అనుకోని పరిస్థితుల్లో జరిగిన పెళ్ళి కాబట్టి మీరు అడ్జస్టు అవడానికి కొంచెం టైం పట్టచ్చు. కానీ, ఆర్నెల్లు కావస్తోంది. ఇంకా మీ మధ్య ఏం జరగలేదనడం హాస్యాస్పదంగా అనిపిస్తోంది. తప్పు నీదా, ఆమెదా?"

వేణు మొహం జేవురించింది. "తప్పునాదే యస్ చక్రవర్తి నాదే ఎంత ప్రేమించినా చెడ్డపేరు తెచ్చుకున్న అమ్మాయిని ఆదర్శంగా పెళ్ళిచేసుకున్నాను చూడు. అది నేను చేసిన బ్లండర్."

"కమాన్.. కూల్ డౌన్ వేణూ. ఏదో జరిగింది. నీకు తెలిసే చేసున్నావు కదా!"

"అయితే. నేనేం అందుకు రిపెంట్ అయి ఆవిడని ఆదరించడంలేదా? ప్రేమించడంలేదా? నేనేమన్నా ఆ విషయాల గురించి ఆవిడతో గొడవపడ్డానా. ఏం చేశాను? పెళ్ళి చేసుకున్నాను. ఆనందంగా ఉండాలని కోరుకోడం తప్పా? ఆవిడ నాతో కోపరేట్ చేయకపోతే నేనేం చేయను? పైగా ఉద్యోగం కూడా మానేసి కూర్చుంది. ఏం జరిగింది అంటే చెప్పదు. పిచ్చెక్కిపోతోంది నాకు. నేనో వెధవలా కనిపిస్తున్నాను ఆవిడకి. చెప్పు.. మాధవికి చెప్పి ఆమెకేదన్నా దయ్యం పట్టిందేమో కనుక్కో."

"వేణూ నువ్వెంత త్యాగం చేశావో, ఆమె కోసం ఎంత సాహసం చేశావో ఆమెకి తెలియదా? ఇంతగా ప్రేమించిన నీకన్నా వేరే ఎవరన్నా తనకింత సెక్యూర్డ్ లైఫ్ ఇవ్వగలరా? ఎనీవే ఉద్రేకపడకు. ఇంట్లో హడావిడి అయిపోనీ మాధవికి చెపుతాను, అర్చనతో మాట్లాడమని. సరేనా."

"ఏమో. నాకు నమ్మకం కుదరడంలేదు. ఆమె మనసులో ఎవరన్నా ఉన్నారేమో అనిపిస్తుంది. నా ప్రేమ ఒన్ వే ట్రాఫిక్ కదా" విరక్తిగా అన్నాడు వేణు.

"ఆమెకి వేరే ఎవరినీ ప్రేమించే అర్హత లేదు వేణూ. అసలు లేదు. నీ పట్ల ఆమె ఎంత కృతజ్ఞతగా ఉండాలి. అలాంటి స్థితిలో నువ్వు తప్ప ఎవరు చేసుకుంటారు ఆమెని? నో. నాకేదో అనుమానంగా ఉంది వేణూ. ఏదో జరిగింది. డెఫినెట్‌గా మానసికంగా దెబ్బతింది. నాకు తెలిసి ఒక సైకియాట్రిస్టు ఉన్నారు. ఆయన దగ్గరకు తీసుకెళదాం"

"నాకూ అలాగే అనిపిస్తోంది. పగలంతా చాలా బాగుండేది. రాత్రికాగానే ముడుచుకుపోతుంది. దగ్గరికి వెడితే చాలు. బెదిరిపోతూ చూస్తుంది. పదిరోజుల్నుంచి అయితే పగలు, రాత్రీ అలా శూన్యంలోకి చూస్తూ కూర్చుంటోంది. నేకేం అర్థం కావడంలేదు. ఏమో మా

జాతకాలు కలవలేదేమో? నేను అనవసరంగా బలవంతంగా వెంటబడి చేసుకున్నాను. దేవుడు మా ఇద్దరికీ రాసిపెట్టనప్పుడు ఏం చేసినా ఈ సమాంతర రేఖలు కలవ్వు."

"జాతకాలా గాడిదగుడ్డా. చూద్దాం. అయినా అనకూడదుకానీ, వేణూ నువ్వసలు మగాడివేనా?"

వేణు రోషంగా చూశాడు. "ఏం తమాషాగా ఉందా?" కోపంగా అన్నాడు.

"మరేంటి? అర్చన నీ భార్య. నువ్వు తాళికట్టిన భార్య. ఆమె మీద నీకు అన్ని హక్కులూ ఉన్నాయి. వాటిని వినియోగించుకుని, దారిలో పెట్టుకోలేవూ. ఏవిటీ తపస్సు. భార్య ఉండీ, బ్రహ్మచారిగా బతకడం నీకు అవమానంగా లేదూ. నీ తోటి వాళ్ళం మేమంతా తండ్రులు అయితే, నీకూ తండ్రి కావాలనిపించడంలేదూ. నయానా, భయానా దారిలో పెట్టుకోవాలి."

"చక్రవర్తీ!"

చక్రవర్తి నచ్చచెపుతున్నట్టుగా అన్నాడు "ఆమె నీభార్య. సామ, దాన దండోపాయాలు ఉపయోగించి దారిలో పెట్టుకునే బాధ్యత నీది. సెక్స్ విషయంలో ఆమెకేమన్నా భయాలుంటే పోగొట్టే ప్రయత్నం చేయి. అనునయంగా, జాగ్రత్తగా నీకు అనుకూలంగా తిప్పుకో. నీ వైపు నుంచి కూడా ప్రయత్నాలు ఉండాలికదా. ఆమె అంతట ఆమె నీ కౌగిట్లోకి వాలిపోవాలని ఎదురు చూడడం తెలివితక్కువ. జరిగిన సంఘటన మర్చిపోయి తను అంత సాహసం చేయలేదు. నీమీద ఇష్టం ఉన్నా నీ అంతట నువ్వు చొరవ చేయకపోతే ఎలా?"

చక్రవర్తి మాటలు వేణు మెదడు మీద పనిచేయడం ప్రారంభించాయి. అతని పౌరుషాన్ని రెచ్చగొట్టాయి. నిశ్శబ్దంగా ఉన్న తేనెతుట్టను కదిలించినట్టు అయి చెల్లాచెదరుగా ఆలోచనలు కదిలించాయి. అవును అర్చన తన భార్య. తనకి సంపూర్ణమైన హక్కులున్నాయి. చక్రవర్తి అన్నట్టు తనసలు ఉపయోగించుకోడంలేదు.

వేణు చక్రవర్తి మాటలే మననం చేసుకుంటూ ఇంటికి వెళ్ళాడు.

అప్పుడే అర్చన స్నానం చేసి, వాయిల్ చీర కట్టుకుని, పెద్ద జడ వదులుగా వేసుకుని, పెరట్లో కుర్చీ వేసుకుని కూర్చుని ఏదో ఆలోచిస్తోంది. సింపుల్‌గా ఎంతో అందంగా అనిపించింది. వేణు ముగ్ధమోహనంగా ఉన్న ఆమెని చూస్తూ, వెనకగా వెళ్ళి నెమ్మదిగా కళ్ళు మూసాడు. అర్చన ఉలిక్కిపడి అతని చేతులు తోసేసి, విసురుగా లేచి నిలబడింది.

వేణు వైపు చూసి "ఏంటిది?" అంది కొంచెం చిరాగ్గా.

వేణు మనసు కలుక్కుమంది. నెమ్మదిగా తనకి తాను నచ్చచెప్పుకుని "నీకళ్ళు మూసే ధైర్యం నాక్కాక ఇంకెవరికుంటుంది?" అడిగాడు చిలిపిగా.

అర్చన మాట్లాడలేదు. నొసలు చిట్లించి మొహం తిప్పేసుకుంది.

వేణుకి ఆమెనలా చూస్తుంటే మతిపోతున్నట్టుగా ఉంది. ఆమె అందం అతనిలో వివేకాన్ని చంపేసింది. తాపం నరనరానా వ్యాపించి ఆలోచనా హీనుడ్ని చేసింది. ఆమె తిరస్కారాలు, చిరాకులూ అతనిపైన ప్రభావం చూపించలేకపోయాయి. ఆమె భుజం మీదుగా వంగి, ఆమె చెంపకి తన చెంపరాస్తూ, పరవశంగా అన్నాడు.

"అర్చనా ఎంత బాగున్నావో తెలుసా? వనంలో విహరిస్తున్న శకుంతలలా ఉన్నావు. కాళిదాసు నిన్నిప్పుడు చూస్తే మరోకావ్యం రాస్తాడు."

అర్చన చివ్వున దూరం జరిగింది.

వేణుకి ఒళ్ళు మండిపోయింది. ఆమె భుజం మీద చేతులేసి విసురుగా తనవైపు తిప్పుకుంటూ అక్కసుగా అన్నాడు. "ఏంటి ఎవరో పరాయివాళ్ళు నీ ఒంటిమీద చేయివేసినట్టు అలా దూరం, దూరం జరుగుతావు. నేను నీ మొగుడ్ని."

అర్చన బలవంతంగా అతడిని విడిపించుకుని అక్కడినుంచి కదిలి, కనకాంబరం మొక్కల దగ్గరకు వెళ్ళి, సుతారంగా పూలుకోయసాగింది.

వేణు విడిచిపెట్టలేదు. ఆమెని అనుసరించి వెళ్ళి భుజం పట్టుకుని తనవైపు తిప్పుకుని చెంపమీద ముద్దుపెట్టుకున్నాడు.

అర్చనకి నిప్పులకణికలా తగిలాయి అతడి పెదాలు. నిలువెల్లా వణికిపోతూ అంది. "ఒద్దు దయచేసి నన్ను ముట్టుకోవద్దు. నా కిష్టంలేదు.."

వేణులో ఆవేశం పెల్లుబికింది. చక్రవర్తి మాటలు చెవుల్లో గింగిర్లెత్తాయి. "ఏం ఎందుకిష్టంలేదు. అంత ఇష్టం లేనిదానివి పెళ్ళికెందుకు ఒప్పుకున్నావు?"

"అదంతా నాకు తెలియదు. నన్ను మాత్రం ముట్టుకోవద్దు."

"నీ ఇష్టంతో నాకు సంబంధం లేదు. నేను నీ భర్తని. నా కోరిక తీర్చాల్సిందే "ఆమె చెయ్యి పట్టుకుని బలవంతంగా లోపలికి లాక్కొచ్చాడు.

అర్చన అతనిచేయి విడిపించుకోడానికి ప్రయత్నిస్తూ గట్టిగా అంది. "వదులు. నా వల్లకాదు. నాకు, నాకు ఇష్టంలేదు. నన్ను ముట్టుకోవద్దు. ఒదులు. ఐ హేట్ యూ"

"బట్ ఐ లవ్ యూ" వేణు ఆమెని మంచం మీద పడేసి, రెండు చేతుల మధ్యా బంధించాడు.

అర్చన పెనుగులాడింది. వదులు నన్ను వదులు ప్లీజ్.

"వదలను. ఇన్నిరోజులు నుంచీ ఎంతో సహనం వహించాను. నా వల్లకాదు. నేనూ మనిషినే. నేనూ మగాడినే. భార్య ఉండగా బ్రహ్మచారిగా బతకాల్సిన అవసరం లేదు."

"నీ ఇష్టం వచ్చిన వాళ్ళతో ఎంజాయ్ చెయ్యి. దయచేసి నన్నొదులు."

"నాన్సెన్స్. నువ్వుండగా నాకు వేరేవాళ్ళతో ఎంజాయ్ చేయాల్సిన ఖర్మేంటి?"

"నా కిష్టం లేదు కాబట్టి. నిన్ను నేను సుఖపెట్టలేను కాబట్టి"

"అలాంటప్పుడు పెళ్ళికి ఎందుకొప్పుకున్నావు?" కోపంతో ఊగిపోతూ అరిచాడు.

"నేను ఒప్పుకోలేదు. నన్ను బలవంతంగా ఒప్పించారు." అరిచింది అర్చన లేవబోతూ.

"ఏం నాకేం తక్కువైంది? నిన్నెంత ప్రేమించాను. ఎంత ఆరాధించాను. నీమీద నాకు సర్వహక్కులూ ఉన్నాయి." ఆమె లేవకుండా అదిమిపెడుతూ అన్నాడు.

"కావచ్చు. అలా అని నాకిష్టంలేకుండా నన్ను అనుభవించే హక్కు నీకు లేదు."

"ఏం? ఎందుకు లేదు?"

"లేదు. లేదు. నన్ను వదులు...వదులు.." అతడి చేతులనుండి వదిలించుకోడానికి పెనుగులాడుతూ ఏడుపు స్వరంతో అన్నది.

"వదలను. ఏం చెడిపోయిన నీకు నాకన్నా గొప్పవాడు దొరుకుతాడా?"

అర్చన దెబ్బతిన్నట్టుగా చూసింది. "ఏం అన్నావు?"

"అవును. నేనేం తప్పు అనలేదు. నువ్వు చెడిపోయావు. నిన్ను నాగరాజు కిడ్నాప్ చేయడమే కాదు. రేప్ చేశాడు అవునా నిజం చెప్పు. అందుకేనా నీకు సెక్స్ ఇష్టంలేదు" ఆమె భుజాలు గట్టిగా పట్టుకుని, కళ్ళల్లోకి సూటిగా చూస్తూ అడిగాడు.

ఆమె నిశ్చేష్టురాలైనట్టుగా చూస్తోంది.

"చెప్పు నిజం చెప్పు. నేను కాబట్టి, నిన్ను మనసారా కోరుకున్నాను కాబట్టి, అంత జరిగినా పోనీలే అని పెళ్ళిచేసుకున్నాను. నీకు మంచి భవిష్యత్తు ఇవ్వాలనుకున్నాను. కానీ, నువ్వే రాక్షసివి. నీకసలు మనసనేదే లేదు. కనీసం కొంచమైనా కృతజ్ఞత ఉందా? ఎవరూ నిన్నుపెళ్ళి చేసుకోరని, తల్లితండ్రుల గుండెలమీద పెద్ద బరువుగా, వాళ్ళకో ప్రశ్నార్ధకంగా మిగిలిపోతావని, నేనెంత త్యాగం చేసానో నీకు తెలుసా. ఇంతగా క్షోభ పెడతావా నన్ను?"

అర్చన గుడ్లప్పగించి చూడసాగింది వేణుని. ఆమె కళ్ళలో అంతులేని విస్మయం కనిపిస్తోంది. కొన్ని వందల ప్రశ్నలు కళ్ళల్లో తిరుగుతూ జవాబు కోసం వేణువైపు చూస్తున్నాయి.

ఆమె నోట్లోంచి అనేక ప్రశ్నలు బాణంలా వచ్చాయి, "నువ్వు నన్ను జాలిపడి పెళ్ళిచేసుకున్నావా? నీకు నామీద ప్రేమలేదా? అబద్దం చెప్పకు వేణూ. వివాహానికి పునాది జాలి, దయ, కృతజ్ఞత అని నేనెప్పుడూ అనుకోలేదు. పరస్పర ప్రేమానురాగాలు, ఒకరి పట్ల ఒకరికి అవగాహన, గౌరవం అభిమానం ఉండాలనుకున్నాను. మనశ్శరీరాలు పంచుకుంటూ బ్రతికే భార్యాభర్తల మధ్యా కృతజ్ఞత ఉండాలని నేనెప్పుడూ అనుకోలేదు. అందుకే అందుకే ఈ పెళ్ళి వద్దన్నాను. ఎవరన్నా విన్నారా? నన్నెలాగైనా వదిలించుకోవాలని మా అమ్మా, నా నిస్సహాయస్థితిని అవకాశంగా తీసుకుని నన్ను దక్కించుకోవాలన్న స్వార్ధంతో నువ్వు నన్ను ఊపిరి సలపనివ్వకుండా చేసి, బలవంతంగా నా మెడలో తాళికట్టావు. నా బతుకేదో అయిపోయిందని, నువ్వు పెళ్ళిచేసుకుని నాకీ జీవితం ఇవ్వకపోయి ఉంటే నేనేమైపోయేదాన్నో అనే అభద్రతాభావంతో నిన్ను పెళ్ళి చేసుకోలేదే నేను. నాకా ఆలోచనే లేదే? ఏం వేణూ, నేనూ అందరిలాంటి ఆడపిల్లను కానా? నాకంటూ వేరే కోరికలు, ఆశలూ ఉండకూడదా? నా కాబోయే జీవిత భాగస్వామి పట్ల నాకొక నిర్దుష్టమైన ఆలోచన, కోరికా ఉండకూడదా? ఎవడో ఒళ్ళు పొగరుతో నా మీద కక్షతో రెండు రోజులు నన్ను బంధించిన పాపానికి నేనెందుకు శిక్ష అనుభవించాలి? ఒద్దు. నా అంతరాత్మని అనుక్షణం చంపుకుని బతికే ఈ స్థితి నాకు ఒద్దు. దయచేసి నన్ను మర్చిపో. నీకు కావాల్సిన వాళ్ళను పెళ్ళిచేసుకో.. నాకీ బతుకొద్దు వేణూ ఒద్దు" అర్చన రెండుచేతుల్లో మొహం దాచుకుంది.

అప్పటికే చక్రవర్తి మాటల ప్రభావంతో ఒక పక్క, ఆమె మీద కాంక్షతో మరోపక్క కాగిపోతున్న వేణుని ఆమె ఏడుపు కదిలించలేకపోయింది. అందుకే కసిగా అన్నాడు. "నో అదంతా నాకు తెలియదు. నేను నీ భర్తను ఇప్పటిదాకా ఎంతో సహనం వహించాను. నా సహనం నా చేతకానితనంగా భావిస్తున్నావు నువ్వు. నేనింక ఉపేక్షించను. నిన్ను క్షమించదలచుకోలేదు. నాలో జాలి, దయ, ఏమీలేవు. నా హక్కు నేను ఉపయోగించుకుంటాను."

"అంటే అంటే నీకు నా శరీరంతోటే కానీ, మనసుతో ఏం సంబంధం లేదనమాట. నన్ను బలవంతంగా అనుభవించడానికి పెళ్ళి చేసుకున్నావనమాట. నీకసలు సంస్కారం లేదు. ఛీ"

"అవును లేదు. సంస్కారం లేదు సరేనా?" వేణు పళ్ళు పటపటలాడిస్తూ ఆమె చేతులు వెనక్కి విరిచిపట్టుకున్నాడు.

*********

వేణు హఠాత్తుగా టీ కప్పు టేబుల్ మీద పెట్టి రెండు చేతుల్లో మొహం దాచుకున్నాడు.

ప్రజ్ఞ తెల్లబోయింది. అతడ్నాపరిస్థితిలో చూస్తుంటే ఆమెకి చాలా జాలేసింది. వేణుది నిజానికి చాలా మృదువైన స్వభావం. ఎవరినీ బాధపెట్టడం, హింసించడం అతని తత్వంకాదు. కాకపోతే తాననుకున్నది జరగాలన్న పంతం మాత్రం ఉంది. అర్చనని ఎంతో ప్రేమించాడు. ఆరాధించాడు. పెళ్ళిచేసుకున్నాడు. ఏ పరిస్థితుల్లో చేసుకున్నా ఆమెని తాను భార్యగా పొందానన్న తృప్తి గర్వం అతనిలో ఉన్నాయి. కానీ, అర్చన ప్రవర్తన అందుకు విరుద్ధంగా ఉండేది. వేణు పట్ల కేవలం కృతజ్ఞత తప్ప, ప్రేమ చూపించలేకపోయింది. కారణం ఏవిటో అర్చనకే తెలియాలి. నిట్టూర్చింది ప్రజ్ఞ.

ఏది ఏమైనా, అర్చన వేణు జీవితంలోంచి శాశ్వతంగా వెళ్ళిపోవటానికి ఏదో బలమైన కారణం ఉంది. అదేమిటో వేణు కొంచెం మానసికంగా తేరుకున్నాక తెలుసుకుంటే మంచిది. బహుశా వేణు ఆమె ప్రవర్తనకి విసిగిపోయి ఆవేశపడివుంటాడు. అనుభవజ్ఞురాలైన డాక్టర్‌గా, ఓ స్త్రీగా వేణు పరిస్థితి అర్థం చేసుకున్న ప్రజ్ఞ మృదువుగా అన్నది.

''రిలాక్స్ వేణూ. రిలాక్స్ ఓకే ఏం జరిగిందో ఐ కెన్ అండర్ స్టాండ్. జరిగిందేదో జరిగింది. మర్చిపో. అర్చన నిన్ను వదిలి వెళ్ళిపోయింది. దానికి కారణం నేను ఊహించింది అయితే, నువ్వన్నట్లు ఒక్కసారి మీ ఇద్దరూ శారీరకంగా కలిసినా ఆమెకి గర్భం వచ్చే అవకాశం ఉంది. అది బలవంతంగా కలిసినా, ఇష్టపూర్వకంగా కలిసినా మీ ఇద్దరూ కలిసిన పీరియడ్‌ని బట్టి, ఆమెకి గర్భం రావచ్చు. అదే నిజమైతే అర్చన వదిలివెళ్ళిన బాబు నీ కొడుకే.''

వేణు దిగ్గున తలెత్తి చూశాడు. చింతనిప్పుల్లా ఉన్నాయి అతడి కళ్ళు. ''మీరు.. మీరనేది?''

''అక్షరాలా నిజం. ఇఫ్ అయామ్ కరెక్ట్ నువ్వు అర్చనని బలవంతంగా అనుభవించావు''

వేణు అపరాధిలా కళ్ళుదించుకున్నాడు.

''అంతగా నువ్వు బాధపడాల్సిన అవసరం లేదు వేణూ. నిజానికి చట్టపరంగా నువ్వు చేసింది తప్పే. నీ భార్య అయినా ఆమెకిష్టంలేకుండా ఆమెని అనుభవించడం నేరం. కానీ మనం కొంత ప్రాక్టికల్‌గా ఆలోచిస్తే నువ్వు చేసింది అంత పెద్ద నేరం కాదనే నేననుకుంటాను. ఎనీవే ఇప్పుడు అర్చన తిరిగి వస్తుందన్న ఆశ నీలో పూర్తిగా తుడిచిపెట్టుకుపోయి ఉంటుందనుకుంటా. ఆమె గుర్తుగా ఆమె మిగిల్చిన బాబుని స్వీకరించి, మరో పెళ్ళిచేసుకుని ఆనందకరమైన జీవితాన్ని అనుభవించు. జరిగిందంతా మర్చిపో''

''ఎలా? ఎలా మర్చిపోను?'' ఆవేదనగా అన్నాడు వేణు.

''వేణూ ఆఫ్టాల్ ఇది లైఫ్. ఎప్పటికప్పుడు గతం మర్చిపోతూ, వర్తమానంతో రాజీపడుతూ భవిష్యత్తుని నిర్మించుకుంటూ సాగిపోవడమే జీవితానికి అర్థం. కాబట్టీ నువ్వు ఇకనైనా అర్చనని మర్చిపోవడం మంచిది. పెద్దదాన్నీ, నీ శ్రేయోభిలాషిని ఇంతకన్నా నీకు నేనేం చెప్పలేను. నా మాటవిను.''

వేణు ఏం మాట్లాడలేదు. కొన్ని క్షణాల తర్వాత అన్నాడు ''అయితే, బాబు. నిజంగా నాకొడుకేనా?''

నవ్వింది ప్రజ్ఞ ''మగవాడివనిపించుకున్నవు. కట్టుకున్న నిన్నే తన ఒంటిమీద చేయి వేయనివ్వని అర్చన ఇంకెవరికో పిల్లవాడ్ని కంటుందా?''

''అదికాదు. నా ఉద్దేశం'' కలవరంగా అన్నాడు.

''నీ ఉద్దేశం పక్కన పెట్టు. ఆ బాబు ఖచ్చితంగా నీ కొడుకే. కావాలంటే డి.ఎన్.ఏ టెస్టు చేయించు.''

''నో అవసరంలేదు. వెంటనే నా బాబుని నేను తీసుకొచ్చుకుంటాను.''

''గుడ్.. బాబు నీ జీవితాన్ని ట్రెమండస్‌గా మార్చేస్తాడని ఆశిస్తాను.''

వేణు లేచాడు. అతని మనసిప్పుడు కొంచెం ప్రశాంతంగా ఉంది. బాబుని అర్జంటుగా చూడాలని ఆరాటంగా కూడా ఉంది.

''వెళ్తాను'' అన్నాడు .

''ఓకే గుడ్ లక్'' ప్రజ్ఞ చేయి అందించింది.

''థాంక్యూ'' వేణు బైటకి నడిచాడు.

అతను వెళ్ళిన వైపు చూస్తూ సన్నగా నిట్టూర్చింది ప్రజ్ఞ

●●●

**ఏలూరు బస్టాండ్‌లో బస్ దిగింది అర్చన. జనాన్ని దాటుకుంటూ,** ఉమ్ములు, అరటి పండు తొక్కలు తొక్కకుండా, చీర కుచ్చిళ్ళు ఒకచేత్తో కొద్దిగా ఎత్తిపట్టుకుని, జాగ్రత్తగా అడుగులు వేస్తూ బస్టాండ్ దాటి రోడ్డుమీదకు వచ్చింది. ఒక్కసారి చుట్టూ చూస్తే ఎటు వెళ్ళాలో, ఏం చేయాలో అర్థం కాలేదు. కొద్దిసేపలాగే ఒక న్యూస్ పేపర్ షాప్ ముందు నిలబడిపోయింది. అటు, ఇటూ రకరకాల దుకాణాలు.. లోపలికి వెళ్ళే బస్సులు, బస్టాండులోంచి బైటకి వచ్చే బస్సులతో, రద్దీగా, హడావుడిగా ఉంది.

ఏవిటీ జీవితం? ఎక్కడినుంచి ఎక్కడికి వెళుతోంది? వేణుని వదిలి వచ్చి తను తప్పు చేసిందా?

కడుపులో పేగులు మెలిపెడుతున్నట్టుగా అనిపించింది. కళ్ళు తిరుగుతున్నాయి. పరిసరాలన్నీ గుండ్రంగా తిరుగుతున్నట్టుగా అనిపించింది. కళ్ళు తిరుగుతున్నాయి. పరిసరాలన్నీ గుండ్రంగా తిరుగుతున్నట్టుగా అనిపించింది.

సరిగ్గా ఆ రోజు ఇలాగే జరిగింది. కళ్ళు తిరిగిపడిపోతోన్న తనని అమ్మ పరిగెత్తుకు వచ్చి పట్టుకుంది.

అస్పష్టంగా ఏదో తెలుస్తోంది.

వేణుతో కాకుండా ఒంటరిగా వచ్చినందుకు నాన్నా, అన్నయ్యా, అమ్మా తనని బాగా తిట్టారు. అతనిలాంటి మంచివాడితో రాజీపడి బతక్కుండా అలా రావడం మహాపరాధం అన్నట్టు మాట్లాడారు. ఆవేశంతో ఊగిపోయింది అర్చన. విచక్షణారహితంగా ఏదేదో మాట్లాడింది. ఆవేశం ఆపుకోలేని అన్నయ్య, మగాడినన్న అహంకారం నిలువెల్లా నింపుకున్న అన్నయ్య లాగిపెట్టి కొట్టాడు. అంతే కళ్ళు బైర్లు కమ్మాయి. వేణు చేసిన అవమానం, తల్లితండ్రుల నిరాదరణ, అన్నగారి అహంకారం, ఆమె అభిమానాన్ని, అహాన్ని దారుణంగా దెబ్బతీశాయి. ప్రయాణం బడలిక, ఖాళీ కడుపు దిమ్మ తిరిగిపడిపోయింది. ఏమీ కనిపించలేదు. అస్పష్టంగా ఏదో వినిపించింది.

అమ్మ ఏడుస్తూ "ఏదో జరిగింది ఆడపిల్ల ఎక్కడికి వెళుతుంది ఉన్నపళంగా. దాని ఆరోగ్యం బాగున్నట్టులేదు. డాక్టర్‌ని తీసుకురండి" అంటోంది.

కాస్సేపటికి ఏవో పరీక్షలు. నోట్లో బలవంతంగా ఏదో పోశారు. వెచ్చగా, తీయగా హార్లిక్స్ కావచ్చు. "బలహీనంగా ఉందమ్మా అమ్మాయి జాగ్రత్తగా చూసుకోండి. మందులేం అవసరంలేదు. పళ్ళు, పాలు బాగా ఇవ్వండి. బంగారం లాంటి మనవడు పుడతాడు" డాక్టర్ స్వరం.

ఆ తరువాత తనకి భవిష్యత్తంతా మరింత జటిలంగా కనిపించింది. అంధకారం నిండిన భవిష్యత్తులో గమ్యాన్ని వెతుక్కుంటూ కూర్చుంది.

"ఒట్టి మనిషి కాదురా. దాని పురుడు పోసిందాకా ఉండనీ. ఆ అబ్బాయికి ఉత్తరం రాసి రమ్మని చెప్పు" అమ్మ స్వరం.

"అతడ్ని నీ కూతురు వదిలేసి వచ్చింది. నేనే మొహం పెట్టుకుని ఫోన్ చెయ్యనమ్మా, దానికసలు కృతజ్ఞత ఉందా? అలాంటి స్థితిలో అతను కాబట్టి పెళ్ళి చేసుకున్నాడు. అతనే చేసుకోకపోయి ఉంటే దాని బతుకేమయ్యేది. నోరుమూసుకుని హాయిగా అతనితో కాపరం చేస్తూ సుఖంగా ఉండక అతన్నొదిలేసి ఎందుకొచ్చినట్టు? అమ్మా ఆడది ఆడదానిలా ఉంటే ఈ సమస్యలు వస్తాయా? తనేదో రాణీ రుద్రమని అనుకుని వెధవ్వేషాలేసింది. మగాడు అందులోనూ రౌడీ వెధవ ఊరుకుంటాడా?

"అయిందేదో అయిందిరా. భవిష్యత్తు సంగతి ఆలోచించు. అది ఒట్టిమనిషికాదు"

"ఆ విషయం ఆవిడ లేచాక చెప్పి నోరుమూసుకుని మొగుడి దగ్గరకెళ్ళి బతకమను. ఈ సమాజంలో మగాడ్ని ఎదిరించి బతికే ఆడదానికి చోటులేదు. ఉండదు"

మగతగా పడుకున్న అర్చన చెవుల్లో పదునైన గుండుసూదులు గుచ్చుతున్నట్టుగా అనిపిస్తోంది. నిప్పుల కుంపటిలాగా గుండె మండుతోంది. నోటికొచ్చినట్టు మాట్లాడుతున్న అన్నగారిని ఎడా, పెడా చెంపలు వాయించాలనిపిస్తోంది. కానీ, పెదవి దాటి అక్షరం కూడా మాట్లాడలేని దయనీయస్థితి. ప్రతి మగవాడూ ఆడవాళ్ళ గురించి ఇలాగే ఆలోచిస్తారా? మగాడు, మగాడి తరపునే మాట్లాడతాడు.

ఈయనకి వచ్చే భార్య ఎలా బతుకుతుందో! భగవంతుడు దయతలచి ఇతని భావాలకి పూర్తిగా విరుద్ధమైన మనస్తత్వం ఉన్న అమ్మాయి గనక వస్తే.. అస్పష్టమైన ఆలోచనలతో కళ్ళు మూతలుపడ్డాయి.

సరిగ్గా పదిరోజుల తరువాత కొద్దిగా స్వాంతన చేకూరింది.

''ఇల్లు అమ్ముడుపోయిందమ్మా. మీరు నాతో వచ్చేయండి. ఇదిగో ఈ యాభైవేలు దానికిచ్చి ఎక్కడికిపోతుందో పొమ్మను. నా దగ్గరకి మాత్రం రావద్దు నేనక్కడ పరువుగా బతుకుతున్నా''

అన్నగారి స్వరం.

అర్చన మనసంతా నిర్వికారంగా అయిపోయింది. తల్లి చేతిలో ఉన్న డబ్బువైపు చూడలేదు. ఆవిడ పిలుపు వినలేదు. బైటకి వచ్చేసింది.

రోడ్డు మీదకు వచ్చిన తరువాత ఎక్కడికి వెళ్ళాలో అర్ధంకాలేదు. అస్పష్టంగా డాక్టరు మాటలు చెవుల్లో వినిపిస్తున్నాయి.

తను గర్భవతి. ఏదైతే జరగద్దు అనుకుందో అదే జరిగింది.

వేణు పశుత్వానికి తన భవిష్యత్తు బలైపోతోంది. ఒద్దు ఒద్దు అనుకుంటూనే సంసారం ఉచ్చులో బిగుసుకుపోతోంది.

ఏ గమ్యం కోసం వేణు ప్రేమని తిరస్కరించిందో, ఏ కలలు నిజం చేసుకోడానికి తనని ప్రేమించిన, ప్రేమిస్తున్నానన్నవారందరినీ ఒక చూపుతో దూరంగా నిలబెట్టిందో ఇవాళ అవన్నీ గర్భంతో సమాప్తం. ఇంక వేణు భార్యగానే బతకాలి. అతని పిల్లలకి తల్లిగా, వాళ్ళింటి కోడలిగా ఒక సామాన్య స్త్రీలా బతకాలి.

అసలు ఈ స్థితికి కారకుడైనవాడు. వాడు నాగరాజు. అర్చన ఆవేశంతో నిలువెల్లా వణికింది. వాడిని వాడినేం చేసినా పాపం లేదు. అన్యాయంగా తన జీవితంతో ఆడుకున్న ఆ నాగరాజు మీద ప్రతీకారం తీర్చుకోనీకుండా మౌనంగా జీవితంతో రాజీపడి బతకమని అందరూ తనని ఆదేశించారు.తన ప్రతిఘటనని ఎవరూ పట్టించుకోలేదు.

తన తప్పు లేకుండా జరిగిన ఒక నీచమైన పరిస్థితికి చిలవలు, పలవలు అల్లుకుని ఏదో జరిగిందని, ఆ జరిగిందానికి తనే పరువుకోసం, కుటుంబ ప్రతిష్ఠ నిలపడం కోసం ఇష్టంలేని వాడిని భర్తగా జీవితాంతం భరించమన్నారు. ఆ ఒక్క సంఘటనను తనకు అనుకూలంగా మార్చుకుని తనని సాధించాలనుకున్న వేణు ప్లాన్‌కి లొంగిపోయేలా చేశారు. తలవంచి తాళి కట్టించారు. వేణు పట్ల కృతజ్ఞతతో అతని సంసారం చేస్తూ జీవిత్మతో రాజీపడమన్నారు.

ఇది న్యాయమా? ధర్మమా? ఎందుకు రాజీపడాలి. ఆమెకి దుఃఖం పొర్లి, పొర్లి వస్తోంది. ఎవరున్నారు తన ఆవేదన పంచుకోడానికి? మాధవి సరిగ్గా సమయానికి అందుబాటులో లేదు. ఉన్నా మాధవి కూడా రాజీపడమనే చెపుతుంది. తన బాధ అర్ధం చేసుకుందా ఏనాడైనా? వేణు వైపే మాట్లాడుతుంది. ఎంతైనా వేణు స్నేహితుడి భార్య తనకి స్నేహితురాలు కాగలదా? తన వైపు నుంచి ఆలోచించగలదా? గాఢంగా నిట్టూర్చింది అర్చన.

సడన్‌గా నీలిమ గుర్తొచ్చింది. తనకున్న ఒకే ఒక ఆప్తురాలు నీలిమ. ఐదేళ్ళ స్నేహం. తన మనసు తెలుసు. తన ఆశయం తెలుసు. తన కలలు తెలుసు. నీలిమకి తన కల తెలుసు. యస్. నీలిమ దగ్గరకి వెళ్ళాలి. ప్రస్తుతం తనని ఆదుకోడానికి ఉన్నది నీలూనే. అర్చన మనసుకి కొంచెం ఊరట లభించినట్టు అయింది. హమ్మయ్య చిరుచీకట్లో చిన్న ఆశాకిరణం నీలు.

అర్చన ఒక నిర్ణయానికి వచ్చినదానిగా ఆటో పిలిచింది. ఎక్కి కూర్చుని రామకృష్ణ బీచ్‌కి పోనీయమంది. ఆటో కదిలింది. వేడిగాలి ఒక్కసారిగా మొహాన్ని తాకింది.

నీలిమ, అర్చన ఇంటర్ నుంచి డిగ్రీదాకా క్లాస్‌మేట్స్ ఒకే కాలేజీలో చదువుకున్నారు. దాదాపు రెండేళ్ళు నీలిమ వాళ్ళు కూడా అర్చన ఇంటి పక్కనే అద్దెకుండేవాళ్ళు. నీలిమ పేరెంట్స్‌కి కూడా అర్చనంటే ఎంతో ఇష్టం. అర్చన తెలివితేటలు, చలాకీతనం వాళ్ళకి ఎంతో

ఇష్టం. నీలిమ కొంచెం పిరికిగా ఉండేది. నలుగురిలోకి వెళ్ళడానికి జంకేది. నీలిమకి కొంచెం ధైర్యం, చొరవ నేర్పమని అస్తమానం చెప్పేవాళ్ళు. ఆ తరవాత రామకృష్ణా బీచ్ దగ్గరగా ఒక అపార్ట్‌మెంట్‌లో ఫ్లాట్ కొనుక్కుని షిఫ్ట్ అయిపోయారు. ఆ ఫ్లాట్‌కి అర్చన చాలా సార్లు వెళ్ళింది కూడా. తప్పకుండా తనకి ఆశ్రయం ఇస్తారు. నీలిమకి అన్ని విషయాలు చెప్పుకుంటే మనసుకి కొంచెం శాంతి లభించవచ్చు. కన్నతల్లి కడులో పెట్టుకుంటుందని ఆశపడింది. కానీ ఆవిడ కొడుకు చేతిలో బానిస. కొడుకు ఎలా ఆడితే అలాగే ఆడుతుంది.

ఆటో ఆగింది. అర్చన దిగి డబులిచ్చి ఒక్కసారి నిలబడి అపార్ట్‌మెంట్‌ని పైదాకా చూసింది. ఐదు అంతస్తులు మూడో అంతస్తులో నీలిమ వాళ్ళ ఫ్లాటు.

కార్ పార్కింగ్ దాటి లిఫ్ట్ దగ్గరకి సూట్‌కేసు లాక్కుంటూ వెళ్ళింది. లిఫ్ట్‌లో మూడో అంతస్తు చేరుతోంటే ప్రాణ స్నేహితురాలిని కలుస్తున్నానన్న ఆనందంతో ఒక్క క్షణం మనసు దూది పింజలా తేలిగ్గా అయినట్లనిపించింది.

కాలింగ్ బెల్ మీదకుడిచేయి చూపుడు వేలు పెటి నొక్కింది. రెండు క్షణాల్లో తలుపు తెరుచుకుంది.

ఎదురుగా నీలిమ తల్లి జగతి. "నమస్తే ఆంటీ" నవ్వింది అర్చన.

ఆవిడ కళ్ళల్లో ఆశ్చర్యం. "నువ్వా? ఎక్కడ్నించి వస్తున్నావు అర్చనా. రా రా లోపలికిరా" పక్కకి తప్పుకుని అర్చనని ఆహ్వానించింది.

"ఎవరు జగతీ?" అంటూ లోపల్నించి వచ్చిన ఆనంద్ అర్చనని చూసి ముందు ఆశ్చర్యపోయి, అర్చన "బాగున్నారా అంకుల్?" అనడంతో "ఆ బాగున్నాను. నువ్వెలా ఉన్నావు?" అడిగాడు. కానీ, ఆ అడగడంలో మునపటి ఆప్యాయత కనిపించలేదు.

"నీలూ లేదాంటీ?" అడుగుతూ సూట్‌కేస్ ఒక పక్కగా గోడకానించి లోపలికి తొంగి చూసింది అర్చన.

"నీలూనా తన పెళ్ళయింది. స్టేట్స్‌కి వెళ్ళిపోయింది. నీకు తెలియదా?" జగతి ఆశ్చర్యంగా అడిగింది.

"వాట్. నీలూ పెళ్ళయిందా? నాకు తెలియకుండా, నన్ను పిలవకుండా నీలూ పెళ్ళి చేసుకుందా? ఎంత అన్యాయం?"

"మీ ఇంటికి కార్డు పంపించాం. మీ అమ్మగారు చెప్పలేదా? పెళ్ళయి రెండునెల్లయింది. వెంటనే అమెరికా వెళ్ళిపోయింది."

"అమ్మ నాకేం చెప్పలేదు. అయినా నేను అమ్మని అడగలేదు" అంటూనే ఆలోచనలో పడింది అర్చన. అమ్మా తనూ ఈ విషయాలు మాట్లాడుకునే సమయం, సందర్భం ఏం వచ్చిందని? తన రాకే అనుకోని అతిథి రాకలా ముగ్గురూ భావించి ఇబ్బంది పడ్డారు.

"ఎప్పుడొచ్చావు హైదరాబాదు నుంచి. మీ అమ్మగారు, నాన్నగారు, బాగున్నారా? పాపం నీ వలన చాలా మానసిక క్షోభ అనుభవించారు. అయినా ఆడపిల్లని కొంచెం ఒదిగి ఉండాలి అర్చనా. మగాళ్ళతో సమానంగా కయ్యానికి కాలు దువ్వితే నష్టపోయేది మనమే. నీ అందానికి, నీ తెలివితేటలకి కొంచెం వినయం, సహనం, మన్నన ఉండి ఉంటే మా నీలూలాగా మంచి ఫారెన్ సంబంధం వచ్చేది. చూడు గతిలేక చేసుకున్నట్టయింది. ఇంతకీ మీ ఆయనకి ఏదన్నా ఉద్యోగం దొరికిందా? ఎలా ఉన్నారు? నిన్ను బాగానే చూసుకుంటున్నాడా?"

పాత ఆంటీకాదు ఈవిడ. మారిపోయింది. ఒక మామూలు స్త్రీలాగా నిందలూ, నిష్టూరాలూ, అవమానించడానికి ప్రయత్నించటంలాటివి చేస్తోంది. అక్కడ ఒక్క క్షణం ఉండాలనిపించలేదు. ఆ భార్యాభర్తలిద్దరి మొహాల్లో ఒకనాడు తాము అభిమానించిన అమ్మాయి, వాళ్ళ కూతురితో సమానంగా ఇంట్లో తిరిగిన అమ్మాయి వచ్చిందన్న భావన కనిపించడంలేదు. మనస్ఫూర్తిగా, ఆదరంగా ఆహ్వానించడంలేదు. స్నానం చేస్తావా? భోంచేశావాలాంటి ప్రశ్నలు వేయలేదు. పరిస్థితి తను ఊహించిన దానికి భిన్నంగా ఉండడంతో అర్చనకి ఒక్క క్షణం కూడా ఉండాలనిపించలేదు.


కౌముది

నెమ్మదిగా సూట్ కేసు హ్యాండిల్ పట్టుకుని డోర్ వైపు చూస్తూ, దుఖాఃన్ని అణచుకుంటూ. "ఆయన బ్యాంక్ ఆఫీసర్గా ఉద్యోగం చేస్తున్నారు. వస్తానాంటీ ఇటు వెళుతూ మిమ్మల్ని, నీలూని చూసి వెడదామని వచ్చాను. వెళ్ళొస్తాను" అంది.

"భోం చేసి వెళ్ళమ్మా" మామూలుగా అంది జగతి.

అర్చన నవ్వింది. ఆమె నవ్వు జగతికి ఇబ్బందిగా అనిపించింది. ఎంత ప్రేమ నామీద అన్నట్టుంది. నిజానికి అర్చనకి సాయం చేయాలనే ఉంది ఆవిడకి. అర్చన స్వభావం, ఆమె ధైర్యసాహసాలు, ఆమెలోని నిక్కచ్చిదనం అన్నీ తెలుసు జగతికి. కానీ, ఈ సమాజంలో అనేక వేల లక్షలమంది ఆడవాళ్ళలా ఆమె కూడా భర్త ఇష్టాఇష్టాలమీద ఆధారపడి బతుకుతున్న ఒక సాధారణ స్త్రీ. అర్చన జీవితంలో జరిగిన ఒకే ఒక్క దురదృష్టకర సంఘటన విన్న తరువాత అతను చేసిన కామెంట్స్ గుర్తున్నాయి. మగవాడు కొన్ని సందర్భాల్లో ఆడపిల్ల పట్ల చేసే విమర్శలు అమానవీయంగానే కాదు అసహ్యంగా కూడా ఉంటాయి. తన భర్త గొప్ప మనసు ఆవిడకి తెలుసు. అర్చనతో ఆ ఇంటికున్న అనుబంధంతో అర్చన ధైర్యంగా నేనిక్కడ కొన్నాళ్ళు ఉండాలనుకుంటున్నాను అని నిర్మొహమాటంగా చెప్పే చనువు ఉంది. కానీ, ఆ చనువుని ఇంకో విధంగా ఉపయోగించుకునే నీచత్వం తన భర్తలో కూడా ఉండే ఉండచ్చునన్న భయం అర్చనని చూస్తున్న కొద్దీ జగతి మనసులో కలుగుతూనే ఉంది. నిస్సహాయ స్థితిలో ఉన్న ఆ ఆడపిల్లకి తనింట్లో ఆశ్రయం ఇవ్వడంలో ఆ పిల్లకి ఉపకారం కన్నా అపకారమే ఎక్కువ జరిగే అవకాశం ఉంది. అందుకే జగతి అర్చనని ఆహ్వానించలేకపోయింది. అంతేకాదు. ఆమె మీద తన మనసులో ఉన్న అభిమానం, సానుభూతి కూడా బైటపడకుండా జాగ్రత్త పడడానికి ప్రయత్నిస్తోంది. అందుకే అర్చన నవ్వు ఆమెని బాధించింది. ఎక్కడ తన మాటలో ఆప్యాయత కనిపిస్తుందో నన్నట్టు పొడిపొడిగా అంది. ఆ విషయం అర్చన గ్రహించిందన్న బాధ ఆమెలో కలిగింది.

"లేదాంటీ నాకోసం అమ్మ ఎదురుచూస్తుంటుంది. వస్తాను" అర్చన చరచరా నడిచి లిఫ్ట్ దగ్గరకు వెళ్ళడంతో జగతి నిట్టూర్చింది.

మనసు దిటవు చేసుకుని వెనక్కి తిరిగిన జగతికి తన భర్త చూపులోని భావం కడుపులో తిప్పినట్టై లోపలికి వెళ్ళిపోయింది.

అర్చన వెనక్కి తిరిగి చూడలేదు. ఆమెకి అర్థమైపోయింది. తనని ఎవరూ అర్థం చేసుకోరు చేసుకోలేరు. కన్నతల్లే అర్థం చేసుకోలేనప్పుడు ఇంకెవరో అర్థం చేసుకుంటారన్న ఆశే అర్థవిహీనం. అవమానించారన్న భాధ దేనికి?

బాధ, ఆవేదన అవమానాలు, తిరస్కారాలు వీటిని మౌనంగా స్వీకరించగలిగిన నాడు తాను జీవితాన్ని జయించిన మహారాణి అవుతుంది. యస్ జయించాలి. ఈ జీవితాన్ని జయించాలి. తను వేణుని తిరస్కరించడం, హిందూమతం పవిత్ర బంధంగా భావించిన వివాహాన్ని వాలంటరీగా రద్దు చేసుకోడం ఈ సమాజం ఎట్టి పరిస్థితుల్లో అంగీకరించదు. సహించదు. అలాగని ఈ సమాజం కోసం తను అన్యాయంగా కోల్పోయిన కొన్ని ప్రాథమిక హక్కులను వదులుకోడానికి తను సిద్ధంగా లేదు. వేణు తనని ఆదర్శ వివాహం చేసుకున్నాడని, నాశనం కాబోయే తన భవిష్యత్తుని సానుభూతితో కాపాడాడని అతనికి కృతజ్ఞతగా పడి ఉండాల్సిన అగత్యం తనకి లేదు.జరిగిన సంఘటన ఒక దురదృష్టకరమైన సంఘటనగా భావించి మర్చిపోయి, వేణుతో రాజీపడి అతని పిల్లలకి తల్లిగా, అతని భార్యగా ఒక సాధారణ గృహిణిగా బతికే బలహీనత తనలో లేదు. చిన్నప్పటినుంచీ తన రక్తంలో జీర్ణించుకుపోయిన తిరుగుబాటు తనం, విప్లవ భావాలు చంపేసుకుని నచ్చని జీవితంతో, తను ఆహ్వానించలేని జీవితంతో రాజీపడి బతికే పెద్ద హృదయం అంటారా?లేక బలహీనత అంటారా? లేక మంచితనం అంటారా? ఏ పేరు పెడతారో ఈ సంప్రదాయవాదులు. ఆ పేర్లు ఏవన్నాకానీ, తనకి అవసరంలేదు.

తన ఇష్టంలేకుండా తన కడుపులో పడిన శిశువుని ఈ భూమ్మీదకి తీసుకొచ్చే అవసరం తనకేంటి? అవసరంకాదు బాధ్యత. కర్తవ్యం. నీ ప్రాథమిక హక్కులకోసం నువ్వెంతగా తపిస్తున్నావో తనకీ జనించే హక్కుంది. అది కాదనే హక్కు నీకు ఎంత మాత్రంలేదు. నీ సుఖం కోసం, నీ స్వేచ్ఛ కోసం హత్య చేసే అధికారం నీకుందా? ఎవరో కొరడాతో ఛెళ్ళున కొట్టినట్టు అనిపించింది.

ఉలిక్కిపడింది. హత్యా ఇంకా ఒక రూపమే రాని రక్తపు ముద్దని తీసేయడం హత్య అవుతుందా? ప్రతినెలా మూడు రోజులు తన శరీరంలోంచి ఎంతో రక్తం పోతోంది. అది చెడురక్తం. మరి ఇది. ఇది చెడు రక్తంకాదా?

అలా అని నీ తల్లి కూడా అనుకుని ఉంటే నువ్వెవరివి?

మెదడు ఆలోచనలతో బరువెక్కింది. ఏం చేయాలో తెలియని స్థితి. ఏం చేస్తోందో కూడా అర్థంకాని పరిస్థితి. ఎవరన్నా కదిలిస్తే భళ్ళున బద్దలయే నీళ్ళ కుండలా ఉంది ఆమె హృదయం బరువుగా బాధగా.

అర్చన తల విదిలించింది. ఈ ఆలోచనలనుంచి బైటపడాలి. ఈ సుడిగుండలో చిక్కుకుని గిలగిలా తన్నుకుని చావలేకా, బ్రతకలేకా ... నో అలా జరక్కూడదు. ఈ సమస్యకి న్యాయమైన పరిష్కారం ఎవరు చెప్పగలరు?

అర్చనకి హఠాత్తుగా గుర్తొచ్చింది. జానకి. జానకి మేడమ్. తను చదువుకున్న కాలేజీ ప్రిన్సిపాల్ జానకి. ఆవిడకి తనంటే చాలా ఇష్టం. బి.యస్సీ ఫస్ట్‌క్లాస్‌లో పాసయిందని తెలిసి ఎన్నోసార్లు కబురు చేసింది. ఎమ్మెస్సీలో చేరి, కెమిస్ట్రీలో పి.హెచ్.డి చెయ్యి. జరిగిన సిల్లీ సంఘటన మర్చిపోయి కొత్త జీవితం ప్రారంభించు అంటూ.

యస్ ఆవిడని కలవాలి. ఆవిడ ఉండి ఉంటారా? ఆమె ఇంకెక్కడికీ వెళ్ళి ఉండరు కదా. రిటైరు అయి ఉండరు కదా. లేదులే అప్పుడే రిటైర్ అవరు. ఆవిడ తప్పకుండా ఉంటారు. ఆమెని కలవగలిగితే చాలు తనకి కొండంత ధైర్యం వస్తుంది.

అలా ఆలోచించాక అర్చనకి కొంచెం రిలీఫ్‌గా అనిపించింది. హమ్మయ్య సునామీలో కొట్టుకుపోతున్న చిన్న పక్షికి ఓ చిటారుకొమ్మ లభించినట్టు.

రోడ్డు మీద నిలబడి ఆలోచిస్తున్నట్టు అప్పుడే స్పృహ వచ్చింది. వెంటనే అటుగా వెళుతోన్న ఆటో పిలిచింది. తను చదువుకున్న కాలేజీవైపు వెళ్ళమంది. సముద్రం మీంచి వీస్తున్న గాలి హాయిగా ఉంది. విశాఖ. ఈ పేరులోనే ఏదో హాయి ఉంది. ఆంధ్రా యూనివర్శిటీ ఆవరణలో అడుగుపెట్టడానికి తపా, తహలాడింది. సరిగ్గా ఆ సమయం వచ్చేటప్పటికి తన జీవిత నౌక మునిగిపోయింది. దీనిని బైటకి తీసి డామేజిని బాగుచేసి మళ్ళీ కదిలించాలి. తన ఆశయాల నదిలో హాయిగా నడవాలి.

కాలేజీ గేటు దగ్గర ఆటో ఆగగానే నేరుగా ప్రినిపాల్ రూమ్ వైపు నడిచింది.

ఒక్కసారిగా మనసుకు రెక్కలొచ్చినట్టు అనిపించింది. నాటి రోజులు ఎంత బాగుండేవి. ఎంత అద్భుతమైనది విద్యార్థి...అందులోనూ కాలేజీ విద్యార్థి జీవితం ఎంత అందంగా, ఎంత చలాకీగా ఎన్నో ఆశలు ఏవేవో కోరికలు ప్రేమలేఖలు, అల్లరి చేష్టలు, లేకి చూపులు తమాషా జీవితం ఆడైనా, మగైనా జీవితంలో చేరే అతి ముఖ్యమైన మజిలీలో అప్పుడప్పుడూ గుర్తుచేసుకుని ఆనందించడానికి పోగేసుకునే అందమైన అనుభూతులు కాలేజీ అనుభవాలు.

పాతవాళ్ళెవరూ లేరు. అన్నీ కొత్త మొహాలు అందంగా, చలాకీగా ఉన్నారు. అందరి మొహాల్లో ఎంతో ఆత్మస్థైర్యం, ఆత్మవిశ్వాసం ఫ్యాషన్ ప్రపంచం తెచ్చిన మార్పు. సుమారు రెండేళ్ళు కాలేజీనుండి బైటకి వచ్చి రెండేళ్ళలో ఎంత మార్పు. ఆడపిల్లల్లో ఏదో ధైర్యం కనిపిస్తోంది. వాళ్ళ నడకలో, నవ్వులో వ్యక్తిత్వం ధీమా ఎక్కడినుంచి వచ్చిందీ వీళ్ళకీ ధీమా. కాలం తెచ్చిన మార్పా. ఎంత మంచి మార్పు. వాళ్ళందరినీ గమనిస్తూ ప్రిన్సిపాల్ రూం దగ్గరకు వచ్చింది. గుమ్మం పక్కన స్టూలు మీద కూర్చున్న ప్యూన్ సింహాచలం అర్చనని గుర్తుపట్టి చప్పున లేచాడు. బాగున్నారా అమ్మాయిగారూ. విప్పారిన మొహంతో ఆప్యాయంగా పలకరిస్తూన్న సింహాచలాన్ని చూడగానే ఎంతో ధైర్యం వచ్చింది అర్చనకి.

"బాగున్నాను సింహాచలం నువ్వెలా ఉన్నావు?"

"నాకేం తల్లీ. మీ అందరి దయవల్ల హాయిగా ఉన్నాను. నీ జీవితమే అన్యాయమైపోయింది. ఆ ము...సుబ్బరంగా తిరుగుతున్నాడు. లక్షల కట్నం తీసుకుని పెళ్ళిచేసుకున్నాడు.

స్థాణువైంది అర్చన. వాడు వాడు పెళ్ళిచేసుకున్నాడా? అదీ కట్నంతో. ఎవరిచ్చారు వాడికసలు ఆడపిల్లని. వాడొక రాక్షసుడు. ఆనాటి రావణాసరుడికి కొంచెం నీతి ఉంది. నేటి రావణాసురుడైన ఆ వెధవకి నీతిలేదు. నియమంలేదు. అలాంటి వాడికి లక్షల కట్నం ఇచ్చి అమ్మాయి జీవితాన్ని పణం పెట్టిన ఆ తల్లి తండ్రులెవరో.

"పోనీలేమ్మా బంగారంలాంటి కుర్రాడు మిమ్మల్ని కోరి పెళ్ళిచేసుకున్నాడు. సుఖంగా ఉన్నారుకదా. "

అర్చన తడబడుతూ అంది "ఆ బాగున్నాను.. మేడమ్ ఉన్నారా సింహాచలం?"

"మేడమ్ రిటైర్ అయారమ్మా. నాలుగు నెలలైంది."

"రిటైర్ అయారా? అప్పుడేనా?"

"ఆవిడ కూతురు అమెరికా వెళ్ళింది కదమ్మా. ఆవిడకి పిల్లలు. వాళ్ళని చూడ్డానికి అమ్మగారు వెళ్ళాల్సి వచ్చింది. ఆవిడక్కూడా ఆరోగ్యం బాగోలేదు. అందుకే వాలంటరీ రిటైర్మెంటు తీసుకున్నారు."

"అంటే అంటే ఇప్పుడు అమెరికాలో ఉన్నారా?"

"లేదమ్మా వెళ్ళివచ్చారు. వచ్చికూడా పదిరోజులైంది. మన దగ్గర నుంచి రావాల్సిన డబ్బులు ఇంకా ఉన్నాయి. వాటికోసం వచ్చి వెళుతున్నారు. నిన్న వచ్చారు.. ఈ రోజు రాలేదు."

"మేడమ్ ఇల్లు తెలుసా సింహాచలం"

"తెలియకేం తెలుసమ్మా"

"నన్ను తీసుకెళతావా అక్కడికి అమ్మగారితో చాలా పనుంది నాకు."

"అలాగే తల్లీ. ఇంకో అరగంటలో కాలేజీ అయిపోతుంది. వెళదాం. కాస్సేపు కూర్చోండి"

"అలాగే" అర్చన కూర్చోడం కోసం చుట్టూ చూసింది. రూమ్ గుమ్మానికి బైట రెండుపక్కలా బెంచీలున్నాయి. ఆమె చూపులు గ్రహించినవాడిలా అన్నాడు సింహాచలం. "లోపలకూర్చోమ్మా. "

"ఒద్దులే సింహాచలం. అలా ఒక్కసారి కాలేజీ మొత్తం చూసి వస్తాను"

"వెళ్ళిరా తల్లీ" సింహాచలం చూపుల్లో కనిపిస్తున్న ఆప్యాయతకి చలించిపోయింది అర్చన. చదువూ, సంధ్యా లేని ఈ వ్యక్తిలో ఉన్నపాటి సంస్కారం కూడా తన వాళ్ళెవరికీ లేదు.

నిట్టూర్చి నెమ్మదిగా అక్కడినుంచి కదిలి తను తిరిగిన పరిసరాలను చూడడానికి బయలుదేరింది.

●●●

**వేణు ప్రజ్ఞ దగ్గర్నించి బయలుదేరి** నేరుగా ఇంటికి వెళ్ళకుండా పార్కుకెళ్ళి కూర్చున్నాడు. అదృష్టం బాగుంది కాబట్టి ఉదయం తాను చెప్పిందేదీ తండ్రి వినలేదు. విని ఉంటే కథలో వచ్చిన చిత్రమైన మార్పుని అబద్ధంగా కొట్టేసేవారు. అర్చన దోషిగా మిగిలిపోయేది ఆయన దృష్టిలో. ఇప్పుడు అర్చన సంగతి, తన సంగతి పక్కన పెడితే తామిద్దరూ చేసిన తప్పుకి ఒక పసిప్రాణం బలికాకూడదు.

బాబు తన రక్తం. వేణు ఛాతీ ఉప్పొంగింది. నేను తండ్రినయానా? దోషి అయితే అయాను. కానీ తండ్రినయాను. చాలు చక్రవర్తి ఇచ్చిన స్ఫూర్తితో ఆ రోజలా తాను రెచ్చిపోకుండా ఉండి ఉంటే ఎప్పటికీ తండ్రి అయేవాడు కాదు. అది కూడా అర్చన ద్వారా. ఇప్పుడు అర్చన లేకపోయినా ఆమె ప్రతిరూపం బాబు ఉన్నాడు. బాబులో అర్చనని చూసు కుంటూ బతికేయచ్చు.

అర్చనని ఎంత ప్రేమించాడు? ఎంత ఆరాధించాడు. ఆమె తనని ఒక గడ్డిపోచలా తీసేసినా, అవమానించినా ఆమె వెంటపడి, ఆఖరికి ఆ రోజు ఆ సంఘటనకు జరక్కపోయి ఉంటే అర్చన తనకి దక్కేదా? ఆమె ఆశలు, ఆశయాలు, చాలా ఉన్నతమైనవి. వాటిని

దాటి ఎట్టి పరిస్థితుల్లో కూడా ఆమె తన ప్రేమని అంగీకరించేదికాదు. ఒక విధంగా ఆ సంఘటన ఆమెకి శాపం. తనకి వరంగా పరిణమించింది. కానీ, ఇప్పుడు అనిపిస్తోంది. అది వరంకాదు. ఇద్దరికీ శాపమే అని.

"సార్! పల్లీసార్. పల్లీకావాలా. "

ఆలోచనలు చెదరగొట్టిన ఆ కుర్రాడిమీద బాగా కోపం వచ్చింది వేణుకి. తమాయించుకుంటూ "వద్దు" అన్నాడు.

"తీసుకోండి సార్. ప్లీజ్ సార్. " ప్రాధేయపూర్వకంగా అడిగాడా కుర్రాడు.

వేణుకి కొంచెం జాలేసింది. వాడిని అక్కడినుంచి పంపేస్తే మళ్ళీ అర్చన గురించిన ఆలోచనల్లోకి వెళ్ళిపోవచ్చన్నట్టుగా జేబులోంచి పదిరూపాయలు నోటు తీసి పల్లీలు కొన్నాడు. కుర్రాడు హుషారుగా "పల్లీ పల్లీ" అని అరుస్తూ వెళ్ళిపోయాడు.

పదేళ్ళ ఆ కుర్రాడిని చూస్తుంటే వేణుకేదోలా అనిపించింది. చదువుకోవాల్సిన వయసులో వాడికీ ఖర్మేంటి? ఏ తల్లి కనివదిలేసిందో పాపం ఇలా బాలకార్మికుడిగా బతకాల్సి వచ్చింది.

బాలకార్మికుడు.. వేణు సడన్‌గా ఏదోగా అనిపించింది. బాలకార్మికుడిగా ఎందుకయాడు. వాడి తల్లి, తండ్రి వదిలేసారా వాడిని. తల్లి, తండ్రి వదిలేసిన పిల్లలు ఇలా అవుతారు. అవును.

వేణు ఆపాదమస్తకం వణికింది.

వెంటనే బాబు గుర్తొచ్చాడు. బాబుని తెచ్చుకోవాలి. వెంటనే తెచ్చుకోవాలి. తన ప్రాణానికి ప్రాణంగా, తన కంటిపాపలా వాడిని పెంచుకోవాలి. అర్చన కసాయిది. తాను కసాయివాడు కాదు. తన బాబుని తను పెంచుకుంటాడు.

వేణుకి ఇంక ఒక్క క్షణం కూడా అక్కడ కూర్చోవాలనిపించలేదు.

ఎల ఉన్నాడో తన రక్తం పంచుకు పుట్టిన బాబు వాడిని చూడాలి. అవును చూడాలి. వెంటనే తనతో తెచ్చుకోవాలి. చివాల్న బెంచీమీదనుంచీ లేచాడు. పార్కింగ్ ప్లేస్‌లో పెట్టిన బండిమీద కూర్చుని ఉద్వేగంగా స్టార్ట్ చేసి ఇంటివైపు పోనిచ్చాడు.

వేణు గేటు తోసుకుని లోపలికి నడిచేటప్పటికి వాకిట్లో అరుగుమీద కృష్ణస్వామి కూర్చుని ఉన్నాడు. వాకిలి శుభ్రంగా ఊడ్చి, నీళ్ళు చల్లి ముగ్గు పెట్టి ఉంది. అరుగు మీద దుమ్ము, ధూళి అంతా పోయి కూర్చోడానికి వీలుగా ఉంది. పనమ్మాయి లోపలనుంచి ప్లాస్టిక్ చేటలో చెత్త తీసుకొచ్చి ఓ మూలగా పెట్టిన కవరులో చెత్తవేసింది. అదంతా చూడగానే తండ్రి పరిశుభ్రతకి ఎంత విలువ ఇస్తాడో వేణుకి గుర్తొచ్చింది. మొహమాటంగా కొన్ని క్షణాలు గేట్లోనే నిలబడి పోయాడు. తనింట్లో అతనికే కొత్తగా, మొహమాటంగా అనిపించింది.

"రా నాన్నా. ఏం అలాగే ఆగిపోయావు?" చాలా ప్రశాంతంగా ఆహ్వానించాడు కృష్ణస్వామి.

వేణు ముందు రెండు అడుగులు సందేహంగా వేసినా బాబు గుర్తు రావడంతో అనుకోకుండానె అతని అడుగుల్లో వేగం పెరిగింది. కళావిహీనమైన ఆ కళ్ళల్లో చిన్న వెలుగు వెలిగింది. తండ్రికి దగ్గరగా నడిచి ఆయన పక్కనే అరుగుమీద కూర్చుని నెమ్మదిగా అన్నాడు. "నాన్నా.. బాబు ఎలా ఉన్నాడు? ఎక్కడ ఉన్నాడు?"

"ఏ బాబు?" కొంచెం చిత్రంగా చుశాడాయన.

"అదే అది అర్చన బాబు"

కొన్ని క్షణాలు మౌనంగా ఉన్న కృష్ణస్వామి నెమ్మదిగా అడిగాడు "ఇప్పుడు నమ్మకం కలిగిందా బాబు నీ కొడుకే అని" వేణు తలవంచుకున్నాడు.

"ఏమైందిరా? అర్చన బాబుని ఎందుకు వదిలేసింది? మీ అనుబంధానికి గుర్తేనా బాబు?"

వేణు నిట్టూర్చాడు. "బాబుకి మేమే తల్లితండ్రులం నాన్నా.. కానీ"

"చెప్పరా ఉదయం ఏదో చెపుతుంటే నాకు నిద్రపట్టింది. "

"చెపుతాను నాన్నా. కానీ, ఇప్పుడు కాదు. నాన్నా.. మనం ఈ రాత్రికే మన ఊరు వెళ్ళిపోదాం. నాకు బాబుని చూడాలని ఉంది"

ఆయన మనసు ఆర్ధ్రమైంది. వేణు భుజమ్మీద ఆప్యాయంగా చెయ్యి వేసి నొక్కుతూ, "అలాగె వెడదాం నాన్నా" అన్నాడు.

వేణు కళ్ళల్లో ఆనందం విరిసింది. "అయితే, ఇప్పుడే ఫోన్ చేసి టిక్కెట్లు బుక్ చేస్తాను నాన్నా. బస్సులో వెడదామా? కాకినాడ దాకా బస్సులున్నాయి. ఏ.సి బస్సులు. అక్కడి నుంచి మన ఊరికి మంచి బస్సుంటే వెళదాం. లేకపోతే టాక్సీలో వెడదాం" అన్నాడు.

"అలాగే నీ ఇష్టం. ఇంతకీ నువ్వు భోంచేశావా?"

అప్పుడు గుర్తుకొచ్చింది వేణుకి ఆయనకి భోజనం ఏర్పాటు చేయలేదని. "నాన్నా మీకు భోజనం?" అంటూ ఆగిపోయాడు.

"పద కాళ్ళూ చేతులు కడుక్కురా. అన్నం తిందాం" అన్నాడాయన అరుగుమీంచి లేస్తూ.

"అన్నమా?" అయోమయంగా చూశాడు వేణు.

"నాకు వంటొచ్చు కదరా!"

ఓ.. వేణు చూపులు గుమ్మంలోంచి లోపలికి ప్రసరించడానికి ప్రయత్నిస్తూ తానూ లేచి లోపలికి నడిచాడు. గుమ్మం దగ్గరే మంచి పరిమళం అగరొత్తుల పరిమళం ఇల్లంతా చాలా పరిశుభ్రంగా ఉంది. పనమ్మాయితో శుభ్రం చేయించి నాన్న వంట చేసినట్టున్నారు. ఛ తానొక ఫూల్ అని మరోసారి రుజువు చేసుకున్నాడు. వేణు మనసులోనె నొచ్చుకుంటూ బాత్‌రూం వైపు వెళ్ళిపోయాడు.

అతని తిరిగి వచ్చేసరికి విస్తరాకుల్లో అన్నం, కూర వడ్డించి అతని కోసం ఎదురుచూస్తూ కూర్చుని ఉన్నాడు కృష్ణస్వామి. వేణు మౌనంగా వచ్చి తండ్రి పక్కనే పీట మీద కూర్చున్నాడు. ఎంతకాలమైంది. నాన్నతో కలిసి భోంచెసి. వేణు కళ్ళల్లో నీళ్ళు చిప్పిల్లాయి. అవి బైటకు రాకుండా మంచినీళ్ళు తాగి, భోజనానికి ఉపక్రమించాడు.

వేణు హైస్కూలుకి వచ్చిందాకా ప్రతిపూటా ఖచ్చితంగా తండ్రితో కలిసే భోంచేసేవాడు. వేణుకి ఏడేళ్ళ వయసులోనే ఉపనయనం జరిగింది. గాయత్రీ మంత్రం చెవిలో పడిన మరుక్షణం వేణులో దివ్యమైన తేజస్సు, అంతులేని విజ్ఞానం కలుగుతాయని కృష్ణస్వామి నమ్మకం. నిజం చెప్పాలంటే వేణు చాలా తెలివైనవాడు. అతని జీవితం అనుకోకుండా తిరిగిన మలుపు వలన అతనొక బ్యాంక్ మేనేజర్‌గా ఉండిపోవాల్సి వచ్చింది. కానీ, ప్రయత్నించి ఉంటే కలెక్టర్ కావాలన్న తండ్రి కోరిక తప్పకుండా తీర్చగలిగేవాడు. నీళ్ళు నిండిన అతని కళ్ళకి పళ్ళెంలో పదార్థాలు మసకగా కనిపించాయి.

ఉపనయనం అయాక కొంతకాలం పాటు ప్రతీపూటా భోజనం చేసేటప్పుడు పాటించాల్సిన ఆచారాలను దగ్గరుండి అమలు చేయించాడు. గాయత్రీ మంత్రం చదివావా? లేదా? అంటూ పదే పదే అడిగి తెలుసుకునేవాడు. సంధ్యావందనం చేయించడం దగ్గర్నించీ ప్రతి ఒక్కటీ వేణుకి హఠాత్తుగా ఒకటి అనిపించింది. సుమారు హైస్కూలు చదువు అయిందాకా పాటించిన ఆచారాలను తను ఎప్పుడు, ఎలా వదిలేసినట్టు అతనికి ఎంతో ఆలోచించినా ఆ విషయం గుర్తురాలేదు.

"సరిగా భోంచెయ్యి వేణూ. ఇప్పుడు బాధపడినంత మాత్రాన కోల్పోయిన జీవితాన్ని, ఆనందాన్ని తిరిగి పొందలేము అందుకే పెద్దలంటారు. గతం అనేది ఒక క్యాన్సిల్డ్ చెక్కులాంటిదిట. మర్చిపో. ఏం చేయాలో అమ్మతో ఆలోచించి చేద్దాం సరేనా?"

ఆయన మాటల్లోని ఆర్ధ్రత, ఆప్యాయత వేణు కన్నీళ్ళను మరింత ఎక్కువ చేస్తుంటే బలవంతంగా కన్నీళ్ళు అదిమి పెట్టి అన్నం ముద్ద నోట్లో పెట్టుకున్నాడు.

రాత్రి తొమ్మిదిన్నరకి కాకినాడ వెళ్ళే బస్సుకి టికెట్టు బుక్ చేశాడు. సూట్ కేస్‌లో రెండు జతలు బట్టలు సర్దుకుని, ఇంట్లో సర్దుకోవాల్సినవి ఏమన్నా ఉన్నాయేమో చూశాడు. అంట్ల గిన్నెలన్నీ పెరట్లో పంపుదగ్గర వేసి గిన్నెల గంప అక్కడ పెట్టాడు. జాగ్రత్తగా పెరటి

తలుపు వేసి గొళ్ళెం పెట్టాడు. వంట గదిలో అన్నీ ఒకసారి చెక్ చేసుకుని సిలిండర్ ఆఫ్ చేసాడు. వాకిట్లోకి వెళ్ళి తండ్రి పక్కన కూర్చుని నెమ్మదిగా అడిగాడు.

"నాన్నాగారూ.. బాబుని అమ్మే చూసుకుంటోందా?"

ఆయన వేణు వైపు చూసి మెత్తగా నవ్వాడు. "లేదు. అమ్మకి ఆ బాబెవరో ఏమిటో తెలియదు. ఆవిడ షాక్‌లో ఉంది. నీలవేణి అని ఒకమ్మాయి మనింట్లో పని చేస్తుంటుంది. అమ్మకి చేదోడు వాదోడుగా ఉంటోంది. ఆ అమ్మాయి బాబుని తాను పెంచుకుంటానని తీసుకుంది."

వేణు కంగారుగా అడిగాడు. "ఆ అమ్మాయి ఎక్కడుంటుంది?"

"మనింట్లోనే ఉంటుంది భయపడకు. బాబు ఎక్కడికీ వెళ్ళదు"

హమ్మయ్య వేణు గుండె కుదుట పడింది.

"ఏ.టి ఎమ్‌కి వెళ్ళొస్తాను నాన్నా. " అంటూ బైటికి వెళ్ళబోతున్న వేణుని వారిస్తూ అన్నాడు కృష్ణస్వామి.

"డబ్బులు నా దగ్గర ఉన్నాయిలేరా. నువ్విప్పుడు ఓ ఐదువేల కోసం ఏ.టి.ఎమ్‌దాకా ఎందుకు? "

"నా దగ్గర అసలు లేవు నాన్నా. "

"ఫర్వాలేదురా. నీ డబ్బు, నా డబ్బు అంటూ మనకి తేడాలేం లేవుకదా. ఇంట్లో ఉన్నాయి. నా దగ్గర ఉన్నాయి. కూర్చో ఉదయం నుంచీ తిరుగుతూనే ఉన్నట్టున్నావు. ఇంకా ఎంత టైం ఉంది మన బండికి? "

కూర్చున్నాడే కానీ, ఏం మాట్లాడాలో అర్థం కాని వేణు కొద్దిసేపు ఆలోచిస్తూ ఉండిపోయాడు. అతని మనసు నిండా బాబు నిండిపోయి ఉన్నాడు. ఎలా ఉన్నాడో చిట్టి తండ్రి. తన పోలికా? అర్చన పోలికా! ఆ రాక్షసి పోలిక రాకుండా ఉంటేనే హాయి.

అవును ఆమె రాక్షసి. అందమైన రాక్షసి. తన సున్నితమైన మనసుని ముక్కలు చేసి, ఆ ముక్కలు మరింతగా గుండెల్లో గుచ్చుకునేలా ఆ గుండెల మీంచి నడిచి వెళ్ళిపోయిన గుండెలేని ఆడది. అందమైన ఆ రూపం వెనక ఎంత కాఠిన్యం? ఆ మనసు ఎంత పాషాణం? అలాంటి ఆడదాన్ని ప్రేమించడం తను చేసిన పొరపాటు. ప్రేమించి వెంటబడడం ఆమె ఛీత్కారాలు, అవమానాలు భరించడం, చివరికి ఆమె అహంకారం దిగిపోయిందనుకుని, నిస్సహాయంగా తన చేయి అందుకుని తనతో నడుస్తుందని ఆశించి పెళ్ళిచేసుకోడం ఇవన్నీ పొరపాట్లే. ఎన్ని పొరపాట్లు చేశాడు. వీటిని సరిదిద్దుకుని సవ్యంగా జీవించడానికి తనకి ఎంతకాలం పడుతుందో? అంతదాకా అమ్మా, నాన్నలకి మానసిక క్షోభేకదా. ఇది న్యాయమా? తను చేసింది ధర్మమా? ఒక యువతి కోసం కంటిదీపంలా పెంచుకున్న తల్లి, తండ్రులకి ఇంతటి శిక్షవేసిన తాను వాళ్ళని క్షమించమని ఎలా అడగగలడు?

బి.యస్సీలో యూనివర్సిటీ ఫస్ట్ వచ్చిన తను అర్చన కోసం ఆమెని భార్యగా పొంది చక్కటి దాంపత్య జీవితం గడపడం కోసం బ్యాంకు ఎగ్జామ్స్ రాయడం, బ్యాంకులో తనకి ఉద్యోగం రావడం, అంతా జస్ట్ యాక్సిడెంట్. ఎంత పెద్ద గాయం. మానని గాయం చేసింది ఈ యాక్సిడెంట్.

ఆ రోజు చక్రవర్తి బతిమాలాడు. "ఒద్దురా నా మాట విను. నేను సరదాకి రాస్తున్నను బ్యాంకు ఎగ్జామ్స్. నీలాగా నాకు పెద్ద యాంబిషన్స్ లేవు. నా మాట విని సివిల్స్‌కి ప్రిపేర్ అవరా" అని తను వింటేనా? నో అర్చనని పెళ్ళి చేసుకోవాలి. ఆమె కోల్పోయిన జీవితానందాన్ని తను ఇవ్వాలి. అందుకు ఉద్యోగం సంపాదించాలి. అనుకున్నట్టే జరిగింది. బ్యాంకు ఎగ్జామ్స్ రాయడం సెలక్ట్ అవడం అంతా యాధృచ్ఛికం. తనేం కష్టపడలేదు. చాలా ఈజీగా వచ్చింది ఉద్యోగం.

చక్రవర్తి తండ్రి పెద్ద బిజినెస్ మాన్. చక్రవర్తి ఒక్కడే కొడుకు. అతనికి ఉద్యోగం చేసే అవసరం ఎంతమాత్రం లేదు. కానీ, ఉద్యోగం చేయాలి కాబట్టి సరదాగా బ్యాంక్ ఎగ్జామ్స్ రాశాడు. ఉద్యోగం వచ్చింది. అయితే, అంతకు ముందే డిగ్రీ అయిపోగానే అతని

మేనత్త కూతురు మాధవితో అతని వివాహం కూడా అయిపోయింది. మాధవి మంచి అమ్మాయి. గొప్ప అందగత్తె కాకపోయినా చామనఛాయితో, గుండ్రటి మొహంతో ఆకర్షణీయంగా ఉంటుంది. మంచి స్నేహశీలి చక్రవర్తితో చెపితే అతను ముక్కచివాట్లు పెట్టాడు. భవిష్యత్తు చేతులారా పాడుచేసుకుంటున్నావు నీకెందుకురా ఆ అమ్మాయి గొడవ. నిన్ను ప్రేమించడం లేదని చెప్పిందికదా. అంటూ ఎంత చెప్పినా వేణు పట్టిన మొండి పట్టుకి మాధవి సపోర్టు ఇవ్వడంతో వేణు కోరిక నెరవేరింది.

వేణుకి జుట్టు పీక్కోవాలనిపిస్తోంది. తనని ఎడాపెడా కొట్టుకోవాలనిపిస్తోంది. ఎదురుగా నుదుట నామాలతో కూర్చుని, ప్రశాంతంగా ధ్యానం చేసుకుంటున్న తండ్రి అతని కంటికి విష్ణుమూర్తిలా అనిపించాడు. ఆలోచనలనుంచి బైటపడాలి. తల విదిల్చిలేచాడు. లోపలికి వెళ్ళి గోడ గడియారం చూశాడు. ఎనిమిదింపావు. బయలుదేరాలి. బైటకి వచ్చి మెల్లిగా అన్నాడు.

"నాన్నా బయలుదేరదామా? "

కృష్ణస్వామి ధ్యానంలోంచి కళ్ళు తెరిచాడు.

"ఆ వెళదాం పద. " అంటూ లేచి కండువా దులుపుకుని భుజం మీద వేసుకుని లాల్చీవేసుకోడానికి లోపలికి నడిచాడు.

●●●

అర్చనకి తాను మూడు సంవత్సరాలు ఎంతో ఉల్లాసంగా గడిపిన ఆ పరిసరాల్లో తిరుగుతుంటే అప్పటిదాకా నిరాశతో, నిస్పృహతో, విషాదంతో నిండిన మనసంతా కొత్తగ చైతన్యం నింపుకున్నట్టయింది ఇదే చెట్టుకింద కదా ఎప్పుడూ తనూ, నీలూ, లీల కూర్చుని కబుర్లు చెప్పుకునేవారు. ఈ క్యాంటిన్ దగ్గరే కదా గంటలు, గంటలు కాఫీలు తాగుతూ, బాతాఖానీ వేస్తూ గడిపేవారు. ఈ వేదికమీదే కదా తను అందరిచేతా ఎన్నో సాంస్కృతిక కార్యక్రమాలు చేయించింది. ఇదే ఇదే తన క్లాస్. అణువణువునా ఆనందం ఇదే ఇదే ఈ క్లాసులోనే వేణు, వేణు స్నేహితులు. ఆగిపోయింది. ఉత్సాహం చప్పున చల్లారిపోయింది. నీరసంగా, వెనక్కి తిరిగింది. గంట వినిపించింది. కాలేజీ అయిపోయింది. అడుగులు వేగంగా వేసుకుంటూ ప్రిన్సిపాల్ రూము వైపు నడిచింది. సింహాచలం ఎదురొచ్చాడు.

"వెడదామా సింహాచలం?" అడిగింది.

"లేదమ్మా ఆయమ్మ అక్కడ లేరట. ఇంకెక్కడికో వెళ్ళిపోయారట. మీరు కావాలంటే రేపు కొత్త మేడమ్ వస్తారు కలుస్తారా?" అడిగాడు. పొంగుతున్న పాలమీద గిన్నెడు నీళ్ళు ఒలికిపోయాయి. ఆశలన్నీ అణగారిపోయాయి. మళ్ళీ భవిష్యత్తు క్వశ్చన్ మార్కు దగ్గరికొచ్చింది. ఈ జీవితం నిండా క్వశ్చన్ మార్కులేనా? నవ్వొచ్చింది. జీవంలేని నవ్వు.

ఏం మాట్లాడకుండా తల అడ్డంగా తిప్పి వెనక్కి తిరిగింది.

కడుపులో ప్రాణం పోసుకుంటున్న బిడ్డ. అంధకారం? అలుముకున్న భవిష్యత్తు. అర్చనకి ఉప్పెనగా దుఃఖం వచ్చింది. ఏమిటీ జీవితం? కొన్ని రోజులు ముందు తాను వేణుని వదిలేసి వచ్చినా కన్యగానే ఉండేది. కానీ, భవిష్యత్తు గురించి ఒక నిర్ణయానికి వచ్చేలోపలే ఆ సంఘటన జరిగిపోయింది. ఆ రోజు వేణు ఆలా ఉద్రేకపడకపోయి ఉంటే ఈ జీవితం ఇంకోరకంగా ఉండేది. తన ఆశయాలు, ఆశలు... అర్చన అర్చనగానే మిగిలేది. కానీ, ఇప్పుడు తను అర్చన కాదు. మిసెస్ వేణు. నో అలా జరక్కూడదు. ఎన్నటికీ జరక్కూడదు.

అర్చనకి దిగులుగా, బాధగా తనమీద తనకే జాలిగా అనిపిస్తోంది. ఈ వెధవ బతుకు బతకాల్సిన అవసరం ఉందా? అనిపించింది కాస్సేపు. చావడానిక్కూడా ధైర్యం కావాలి అనుకుంది. తనకి బతికే ధైర్యం ఉంది కానీ, చచ్చే ధైర్యం లేదు. ఏం జరిగినా బతకాలి. ఎలాగైనా బతకాలి.

ఒక నిర్ణయానికి వచ్చిన దానిలా ఆటో పిలిచి ఎక్కింది. తనకున్న ముఖ్యమైన స్నేహితురాళ్ళలో లీల కూడాఉంది. తన దగ్గరకు వెళ్ళాలి. లోకం గొడ్డుపోలేదు. నీలిమలాంటి వ్యక్తిత్వం లేనిది కాదు లీల. మంచి మనసున్న మనిషి. దానికీ చాలా ఆశయాలుండేవి. బహుశా పి.జి పూర్తిచేసి ఉంటుంది. నీలిమలా పెళ్ళి చేసుకుని ఉండకపోవచ్చు.

తనకు బాగా గుర్తున్న లీల ఇల్లు సునాయసంగానే తెలుసుకోగలిగింది అర్చన.

చిరకాల స్నేహితురాలిని చూస్తున్నానన్న ఆనందంతో ఓ క్షణం శరీరం ఆపాదమస్తకం ఆనందంతో నృత్యం చేసింది. ఒక్కసారి ఆ రోజుల్లో అందరూ కలిసి చేసిన అల్లరి, కంబైన్డ్ స్టడీస్ పేరుతో ఒకళ్ళ ఇంటికి ఒకళ్ళు వెళ్ళి వెన్నల రాత్రుల్లో డాబా మీద కూర్చుని పాత సినిమాల్లో పడుకున్న పాటలు, ఒకళ్ళకి వచ్చిన ప్రేమలేఖలు మరొకళ్ళు చదువుకుంటూ పొందిన చిత్రమైన ఆనందం అన్ని గుర్తొచ్చాయి.

తనను చూడగానే ఎగురుతూ వచ్చి వాటేసుకుంటుందని ఆశించిన అర్చని నిరాశే మిగిలింది. అర్చన రాకను ఆహ్వానించింది. కానీ ఆనందంగా స్వీకరించలేదు. పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేశానన్న గర్వం ఆమెలో తొంగిచూసింది. పైగా లీల పెళ్ళి ఒక ఐ.ఏ.ఎస్ ఆఫీసర్‌తో నిశ్చయమైంది.

ఆశ్రయం కోరి వచ్చిందని తెలియగానె నిర్దయగా అంది.

"సారీ అర్చనా. నువ్వు ప్రాణ స్నేహితురాలివే కానీ, ఇలాంటి పరిస్థితుల్లో నీకు సాయం చేయడం నా గొయ్యిని నేను తవ్వుకోడం అవుతుంది. ఏమీ అనుకోకు."

అర్చన నిట్టూర్చింది.

ఆమె ఆశపడిన దారులన్నీ మూసుకుపోయి. గర్భిణీ. ఉదయం నుంచీ తిండి లేకుండా తిరుగుతోంది. చేతిలో డబ్బుంది. హోటల్ రూం తీసుకోవచ్చు. కానీ, ఎవరన్నా చూస్తే, చూస్తే చూడనీ అనుకునే పరిస్థితి కాదు. అటు కన్నతల్లితండ్రులు, ఇటు భర్త పేరుతో ఓ వ్యక్తి తనకి ఉన్న విషయం అందరికీ తెలుసు. ఈ విశాఖపట్టణం తాను పుట్టి పెరిగిన ఊరు ఎవరో ఒకళ్ళు ఎక్కడో అక్కడ కనిపించచ్చు. ఏంటమ్మా హోటల్లో ఉన్నావేంటి అని అడగచ్చు. సమాధానం చెప్పాలి. ఏమని చెప్పాలి? అవును ఏమని చెప్పాలి? తల్లి, తండ్రి నన్ను ఇంట్లోంచి వెళ్ళగొట్టారు అని చెప్పాలా? నా మొగుడ్ని నేను వదిలేసి వచ్చాను అని చెప్పాలా? ఏమని చెప్పాలి? ఎందుకు అని అడిగితే ఆ ఎందుకుకి తన దగ్గర సమాధానం ఉందా?

అర్చనకి ఆకలితో పాటు, అవమాన భారం కూడా కలిసి ఒళ్ళంతా తూలిపోతోంది. అగమ్యగోచరంగా బైటకి వచ్చి, ఆలోచిస్తున్న అర్చన తట్టుకోలేని అశక్తతో కనిపించిన హోటల్లోకి దూరింది.

ఆ క్షణంలో ఆమెకి మూసుకుపోయిన దారుల్లో చిన్న వెలుగు చూపించడానికే ఆ దైవం ఆ హోటల్‌కి పంపించాడేమో నన్న భావన కలిగేలా ఆ జగన్మాతే హేమలత రూపంలో కనిపించింది. ప్రస్తుతం కాలేజీ ప్రిన్సిపాల్ ఒకనాటి కెమిస్ట్రీ లెక్చరర్. అర్చనని చూడగానే గుర్తుపట్టింది. సంతోషం వెల్లివిరుస్తున్న మొహంతో ఆత్మీయంగా పలకరించింది.

"ఏమ్మా అర్చనా ఏంటిలా వచ్చావు? ఎలా ఉన్నావు?" ఆమెని చూడగానే భయం, కంగారు కలిగిన అర్చనకి ఆ పలకరింపు పన్నీటి జల్లులా అనిపించింది.

"బాగున్నాను మేడమ్ మీరెలా ఉన్నారు?"

"చాలా హాయిగా ఉన్నాను. అరుగో మావారు." హ్యాండ్ వాష్‌కి వెళ్ళి వస్తున్న భర్తని అర్చనకీ, అర్చనని అతనికీ పరిచయం చేస్తూ అంది. "ఈ అమ్మాయే అర్చన అని నాకిష్టమైన స్టూడెంట్ అని చెప్పాను కదా మీకు చాలాసార్లు."

"ఓ నైస్. హవార్యూ అర్చనా?" అడిగాడు ఆయన. నల్లటి హేమలతకి హ్యాండ్ సం హజ్‌బండ్

అర్చన పల్చగా నవ్వి. "థాంక్యూ సర్. అయామ్ ఫైన్" అంది.

"మళ్ళీ కలుస్తాను మేడమ్.." అంటూ వెళ్ళబోతున్న అర్చన చేయిపట్టుకుని ఆపుతూ

"ఎక్కడికి? కూర్చో కలిసి తిందాం.." అంటూ తన పక్కన కుర్చీలో కూర్చోబెట్టుకుని "ఏమ్మా ఎక్కడున్నావు? ఏం చేస్తున్నావు?" ప్రశ్నల పరంపర ప్రారంభించింది. తప్పించుకుందామనుకున్న పరిస్థితి ఎదురవడంతో తప్పేలా లేదనుకున్న అర్చన "తరవాత మాట్లాడదాంలే

మేడమ్" అంది. ఆమెకిప్పుడు హేమలతతో పర్సనల్‌గా మాట్లాడాలని ఉంది. ఈవిడే సింహాచలం చెప్పిన క్రొత్త ప్రిన్సిపాల్ అని తెలిస్తే ఆవిడ ఇంటికే వెళ్ళేది. కానీ అతను చెప్పలేదు. తాను అడగలేదు. ఇప్పుడు ఆవిడ భర్త ఎదురుగా తన వ్యక్తిగత విషయాలు ఆమెతో చర్చించడం ఇష్టంలేని అర్చన మొహంలో కనిపిస్తున్న అయిష్టత హేమలత సూక్ష్మదృష్టికి రావడంతో ఆమె కూడా ఆ విషయలు వదిలేసి కాలేజీ విషయాలు, లోకాభిరామాయణం మాట్లాడుతూ కడుపునిండా టిఫిను పెట్టించింది.

"రేపు కాలేజికి రా.." అంటూ అర్చనని ఆహ్వానించి, సెలవు తీసుకుని వెళ్ళిపోయింది.

ఆమె మాటలు, ఆమె ఆప్యాయత అర్చనకి ఏదో అభయం ఇచ్చినట్టు అనిపించింది. ఈ ఒక్కరాత్రి హోటల్లో గడపక తప్పదు అని ఓ నిర్ణయానికి వచ్చి హోటల్ వైపు నడిచింది.

మర్నాడు కాలేజ్‌కి వెళ్ళిన అర్చనని ఆదరంగా ఆహ్వానించింది అర్చన మెల్లిగా సమయం చూసుకుని అంది.

"నాకు కొంతకాలం సుమారు ఆరునెలలు ఆశ్రయం కల్పించండి మేడమ్. మీకు ఋణపడి ఉంటాను. "

"తప్పమ్మా అంత పెద్దమాటలెందుకు? ప్రస్తుతం మన లైబ్రేరియన్ మెటర్నిటీ లీవు మీద వెళ్ళింది. ఆ పోస్టు చేస్తావా నీ డెలవరీ అయిందాకా? " అంది హేమలత.

అంతకన్నా ఏం కావాలి? "తప్పకుండా చేస్తాను. అలాగే నాకేదన్నా హాస్టల్ లో కూడా అకామిడేషన్ ఇప్పించగలరా?"

"ష్యూర్. వైనాట్ నా ఫ్రెండ్ ఒకావిడ రీసెంట్‌గా వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్ పెట్టింది. నువ్వక్కడ జాయిన్ అవచ్చు. హాయిగా నిర్భయంగా ఉండచ్చు. "

అర్చన మొహంలో ఆరిపోయిన వెలుగు దివ్యకాంతితో వచ్చినట్టైంది. "థాంక్యూ మేడమ్ థాంక్స్ ఎలాట్." అంది ఉద్వేగంగా..

ఇంతకీ ఇలాంతి పరిస్థితి ఎందుకొచ్చింది? అడిగింది ఆవిడ.

అర్చన కొన్ని క్షణాలు మౌనంగా ఉండి అంది "చెప్తాను. కానీ ఇప్పుడు కాదు. ఇంక ఇక్కడే ఉంటాను కదా. తప్పకుండా చెపుతాను" అంది.

ఆవిడ ఇంక రెట్టించలేదు.

అర్చన జీవితనౌక చిన్న మజిలీలో ఆగింది.

హేమలత దయతో అర్చన ప్రశాంతంగా బాబుకి జన్మనిచ్చింది. బాబుని చూసుకున్నప్పుడు చిన్న మమకారం ఉవ్వెత్తున లేచింది. మాతృత్వం మధురంగా గుండెల్లో సన్నాయి మోగించింది. కానీ, ఆమె ముందు బలంగా నిలబడిన ఒక లక్ష్యం ఆ మమకారాన్ని జయించింది. సన్నాయిలోని శ్రావ్యతను ఆస్వాదించే స్థితిలో లేని తన ఆశక్తతకి తల వంచింది. అర్చన డెలివరీకి వెళ్ళడం, డెలివరికి వెళ్ళిన లైబ్రేరియన్ డ్యూటీలో జాయిన్ అవడం ఒకేసారి జరిగాయి.

ఉన్న ఉద్యోగం ఊడిపోయింది. మళ్ళీ జీవితం ప్రశ్నార్ధకంగా మారింది.

ఈసారి ఆమె కళ్ళముందున్న పెద్ద ప్రశ్న బాబు. ఈ బాబునేం చేయాలి? తాడూ బొంగరం లేని ఈ జీవితానికి బాబు నిజంగా ఒక ప్రతిబంధకమే. అలా అని వాడిని ఏ మురుగు కాలవలోనో పడేయాడానికి ఆమె హృదయంలేని కసాయి స్త్రీకాదు. స్త్రీ సహజమైన మాతృత్వపు మమకారం ఆమెలోనూ ఉంది. చిన్ని, చిన్ని పాదాలు, అరచేతులు, నల్లని కనుపాపలు అల్లనల్లన తిప్పుతూ కళ్ళు తెరిచి తనవైపు చూస్తున్న బాబు నన్నేం చేస్తావు అని అడుగుతున్నట్టే అనిపించి ఉలిక్కిపడసాగింది.

బాబుని వాడి తాతగారికి, నాయనమ్మకి అందించగలిగితే వాడి జీవితం చక్కటి మార్గంలో సాగిపోతుంది. వాడు ఉన్నతంగా ఎదుగుతాడు. ఆ నమ్మకం ఆమెకి ఉంది. పదిరోజులు గడిచి, స్నానం చేయగానే హేమలతకి చెప్పి, హైదరాబాద్ వెళుతున్నానని నమ్మించి బాబుని తీసుకుని బయలుదేరింది.

***

బస్సు హారన్ మోగుతోంది. అర్చన ఉలిక్కిపడింది. కొంచెం ఉంటే బస్సు కిందపడిపోయేది. చాలాసేపటి నుంచీ ఆలోచిస్తూ అక్కడే నిలబడిపోయింది. విశాఖపట్నం వెళ్ళే బస్సులు వెళ్ళిపోయాయా? ఆలోచనలు వదిలించుకుని ఒక్కసారి బస్టాండులో ఉన్న బస్సులపైన పేర్లు చూసింది. పిఠాపురం. విశాఖపట్నం. యస్ తను వెళ్ళాల్సిన బస్సు.

కౌంటర్ వైపు నడవబోతుంటే మరోసారి కళ్ళు తిరిగినట్టు అయింది. పక్కనే ఉన్న కొట్టులో మంచినీళ్ళ బాటిల్ కొనుక్కుని ఓ పక్కగా వెళ్ళి నీళ్ళు నోట్లో పోసుకుని మూడుసార్లు పుక్కిలించింది. మిగిలిన నీళ్ళు తాగింది. తిరిగి కొట్టుదగ్గరకి నడిచి బాయిలర్‌లో మరుగుతున్న కాఫీ వైపు చూసి ఒక కప్పు ఇవ్వమంది.

వేడి, వేడి కాఫీ తాగాక ఎంతో బలం వచ్చినట్టు అనిపించింది. పర్సు తెరిచి డబ్బులిచ్చి కౌంటర్ వైపు నడిచింది. పగలు కాబట్టి రిజర్వేషన్ అవసరంలేదు. టిక్కెటు తీసుకుని కొన్ని క్షణాల్లో కదలబోతున్న బస్సు ఎక్కి సీటులో కూర్చున్నాక రిలాక్స్‌గా వెనక్కి వాలి, కళ్ళు మూసుకుంది.

●●●

అర్చన విశాఖపట్నం బస్ డిపోలో బస్సు దిగింది. ఆ గాలి సోకగానే ఏదో నిశ్చింత. ఏదో ఆశ. పుట్టి పెరిగిన ఊరు. జీవితాన్ని, జీవితానికో లక్ష్యం నిర్ణయించిన ఊరు. కానీ, ఆ లక్ష్యాన్ని నెరవేర్చుకునే అవకాశం కూడా దూరం చేసిన ఊరు.

ఏది ఏమైనా ఇది తన ఊరు. జీవితం ఇక్కడినుంచే ప్రారంబం అయింది. ఇక్కడే కొనసాగింది. ఇక్కడే మధ్యలో బ్రేక్ వేసింది. మళ్ళీ ఇక్కడే పునర్జీవితం ప్రారంభం కావాలి. ఇక్కడే ఈ జీవితం స్థిరపడాలి. స్థిరంగా అనుకుంది.

తప్పకుండా తన లక్ష్యం నెరవేర్చుకుంటుంది. ఇదంతా తాత్కాలికం. సుదీర్ఘమైన ఈ జీవనయానంలో ఇదొక మజిలీ. ఈ మజిలీ దాటి తప్పకుండా తను చేరాల్సిన గమ్యానికి దారి తెలుస్తుంది. యస్. ఆ దారిలో నడిచి వెళ్ళి తప్పకుండా గమ్యం చేరాలి. అందుకు తనకి ఎంతో ఆత్మవిశ్వాసం కావాలి. ఎంతో ధైర్యం కావాలి. ఎవరేమన్నా లక్ష్యపెట్టకూడదు.

అలా అనుకున్నాక ఆమెలో కొత్త శక్తి, ఎంతో ధైర్యం నరనరంలో పాకుతున్న భావన కలిగింది. రోడ్డుమీదకు వచ్చి, చుట్టూ మూగిన ఆటో వాళ్ళల్లో ఒకళ్ళ ఆటో ఎక్కింది.

ఇప్పుడు నేరుగా హోటల్‌కి వెళుతుంది. ఆ తరువాత ఎం చేయాలో, ఎలా ప్లాన్ చేసుకోవాలో ఆలోచించుకోవచ్చు. ఇప్పుడు హోటల్‌కి వెళ్ళడానికి ఎలాంటి అభ్యంతరం, ఎలాంటి నదురు, ఆలోచన భయంలేవు.

ఆటో మంచి హోటల్ ముందు ఆగింది. ఆటో దిగి తన సూట్ కేస్ తీసుకుని నేరుగా హోటల్ ప్రొప్రయిటర్ దగ్గరకు వెళ్ళి రూము తీసుకుంది.

సూట్ కేసు తీసుకుని, రూమ్ తాళం చెవి పట్టుకుని తన వెనకే వస్తున్న హోటల్ బాయ్ ముందు దర్పంగా, ఠీవిగా తనకి ఇచ్చిన గదిలోకి వెళ్ళింది. ఆమె దగ్గర ఇప్పుడు డబ్బుంది. మెడలో, చెవులకి, చేతులకి నాలుగు బంగారం గాజులు, ఫర్వాలేదు. ఉద్యోగం దొరికిందాక సరిపోతుంది. ఇప్పుడు మళ్ళీ వెంటనే ఒక ఉద్యోగం సంపాదించాలి. కొంచెం సేపు రెస్టు తీసుకుని తిరిగి ప్రిన్సిపాల్ దగ్గరికి వెళ్ళాలి. ఇప్పుడా కాలేజీనే తన టార్గెట్. అక్కడ ఉంటేనే ఆ కాలేజీ కరెస్పాండెంటు కొడుకు నాగరాజు మూమెంట్స్ తనకి తెలుస్తాయి.

నాగరాజు... అర్చన పళ్ళుపటపటలాడాయి. డబ్బు, పరపతి ఉపయోగించి తను పెట్టిన కేసు కొట్టేయించాడు. ఎవరూ ఏం చేయలేదని కదా వాడి ధైర్యం అర్చన తల్చుకుంటే ఏం చేయగలదో నిరూపించాలి. వాడి డబ్బుతో ఎంత గొప్ప భవిష్యత్తు నిర్మించుకున్నా దాన్ని పునాది సహా పడేయాలి. ఈ ఒక్క లక్ష్యం నెరువేర్చుకున్నాక భవిష్యత్తు నిర్ణయం తీసుకోవాలి.

వేణుతో పూర్తిగా తెంపులు చేసుకుంది. బాబు అర్చన గుండెల్ని మెలిపెడుతూ.. ఒక నిట్టూర్పు వచ్చింది. కసాయి తల్లి. తను కసాయి తల్లి. ఎంత కసాయిదైనా ఎక్కడికి చేర్చాలో అక్కడికి చేర్చింది. బాబు విషయంలో నిశ్చింతగా ఉండచ్చు. దేవతల్లాంటి ఆ దంపతుల చేతుల్లో బాబు చక్కగా ఎదుగుతాడు. మంచి వ్యక్తిత్వంతో ఎదుగుతాడు. మంచివాడుగా ఎదుగుతాడు. వాడిలో వేణులోని స్వార్ధం, నాగరాజులాంటి వాళ్ళలా దుర్మార్గం పిరికితనం, చేతగాని తనం ఇవేవీ ఉండకూడదు. మగాడిలా పెరగాలి. మగాడిలా బతకాలి. మంచి మగాడిలా బతకాలి. ఎప్పటికైనా తాను బాబుని కలుసుకుంటుంది. ఆ రోజున ఎత్తుగా ఎదిగిన వాడిముందు మరుగుజ్జుగా మారి తన దీనగాధ చెప్పుకుంటుంది. వాడు తప్పకుండా క్షమిస్తాడు. అవును క్షమాగుణమే ఆభరణంగా నిష్కల్మషంగా బతికే కృష్ణస్వామి, తాయారమ్మ దంపతుల సంరక్షణలో వాడూ దేవుడే అవుతాడు.

పల్చగా కన్నీటి తెర కప్పేసింది కళ్ళని. కన్నీళ్ళు తుడుచుకుని, సూట్ కేసులోంచి బట్టలు, టవల్, సోప్ తీసుకుని స్నానానికి వెళ్ళింది. నింపాదిగా వేడినీళ్ళతో కాస్సేపు ఆడుకుంటూ స్నానం చేస్తుంటే గుర్తొచ్చింది. తనిప్పుడు బాలింత. అంతా సక్రమంగా ఉండి ఉంటే పసుపు, సున్నిపిండితో నలుగు పెట్టుకుని స్నానం చేయమనేది అమ్మ. తలంటి పోసుకుని, సాంబ్రాణి ధూపం వేసుకోవాల్సిన సమయమిది. బాబుకి ఒంటికి నూనె రాసి, మూడేసి బకెట్లతో నీళ్ళు పోయాల్సింది. వేడినీళ్ళతోపాటు కన్నీళ్ళు కూడా వెచ్చగా జారాయి చెంపలమీదికి.

నేను భార్యను కాను, తల్లిని కాదు. అమ్మా, నాన్నలకి కూతుర్ని కాను. అన్నయ్యకి చెల్లిని కాను. నేనిప్పుడు ఎవరిని? ఒక్కసారి దబ్బనం లాంటి ప్రశ్న గుండెల్లోకి దిగిబడినట్టు అనిపించింది.

నేను అర్చనని. యస్ అయామ్ అర్చన.

మిగిలిన నీళ్ళు గబ గబా పోసుకుని మరో ఆలోచనకి తావివ్వకుండా చక చకా స్నానం కానిచిచ్, ఫ్రెషప్ అయి రిసెప్షన్‌కి ఫోన్ చేసి బ్రేక్ ఫాస్ట్, కాఫీ ఆర్డర్ చేసింది. రిమోట్ తీసుకుని టీ.వి. ఆన్ చేసింది.

కాలింగ్ బెల్ మోగింది. లేచి వెళ్ళి డోర్ తీసింది.

రూమ్ బోయ్. చేతిలో ట్రే. ఆమె పక్కకి తొలిగి దారిచ్చింది. అతను లోపలికి వచ్చి, ట్రే టేబుల్ పై మీద పెట్టి జగ్‌లో ఉన్న నీళ్ళు గ్లాసులో పోసి, పెట్టి వెళ్ళిపోయాడు. డోర్ వేసుకుని వచ్చి కూర్చుని టిఫిన్ తినసాగింది.

●●●

**బిలబిల్లాడుతూ పిల్లలు లేత నీలం రంగు యూనిఫాంలో** పావురాళ్ల గుంపులా కనిపించారు. పెద్దగేటు, దాటి లోపలికి వెళితే విశాలమైన ప్రాంగణం, వరసగా నాలుగైదు బిల్డింగులు. సమయం ఉదయం ఎనిమిదిన్నర. స్కూలు బెల్ మోగింది.

మోడువారిన వనం చిగురించి, పూలసౌరభాలతో నిండినట్టు అయింది అర్చన మనసు.

"రండి అర్చనగారూ. ఇప్పుడు ప్రేయర్.. రండి వెళదాం."

సర్వం మరిచిపోయినట్టు నిలబడిపోయిన అర్చన దగ్గరకు వచ్చి స్నేహంగా పిలిచింది హేమలత పరిచయంచేసిన నళిని టీచర్. హేమలతని ఉద్యోగం ఇప్పించమని అడిగిన వెంటనే ఆవిడ తన చిన్ననాటి స్నేహితురాలైన నళిని బి.ఎడ్ చేసి కాన్వెంట్ రన్ చేస్తోందని నళిని ఇంటికి తీసుకుని వెళ్లి అర్చనని పరిచయం చేసి, ఆ స్కూల్లో లెక్కల టీచర్‌గా ఉద్యోగం ఇప్పించింది. ఆ ఉద్యోగంతోపాటు నళిని ఉంటున్న ఇంటికి దగ్గరగా రెండు గదుల పోర్షను కూడా ఇప్పించింది. అద్దె తక్కువని కొంచెం ప్రధాన నగరానికి దూరంగానే ఉంటుంది నళిని. అర్చన కూడా ప్రస్తుతం ఎక్కువ అద్దె భరించే స్థితిలేదు కాబట్టి అక్కడే ఆమెక్కూడా ఇప్పించడం జరిగింది.

అర్చన నళినితోపాటు ముందుకు నడిచింది. పిల్లలంతా ఆరు వరసల్లో చాలా క్రమశిక్షణతో నిలబడ్డారు.

"ప్రేయర్ స్టార్ట్" అంది నళిని.

పిల్లలంతా ఒకే స్వరంతో శృతి తప్పకుండా చక్కగా మొదలుపెట్టారు. "పిల్లలతో గడిపితే ఇంత మనఃశ్శాంతి ఉంటుందా?" అనిపించింది అర్చనకి.

నా తండ్రి ఎప్పటికి పెద్దవాడై ఇలా స్కూలుకి వెళతాడో. తల్లి మనసు ఒక్కసారిగా విలవిల్లాడింది కన్నకొడుకు కోసం. ఏం బతుకిది భగవంతుడా కొడుకుండీ లేని తల్లి, తల్లి ఉండి లేని కొడుకు.

"ఇండియా ఈజ్ మై కంట్రీ. ఆల్ ఇండియన్స్ ఆర్ మై బ్రదర్స్ అండ్ సిస్టర్స్ ఐ లవ్ మై కంట్రీ."

పిల్లలంతా ఏక కంఠంతో లయబద్ధంగ పాడుతున్నారు. అర్చనకి ఒక్కసారిగా తన చిన్నతనం గుర్తొచ్చింది. పాపం ఏమాటకామాటే నాన్న తననెంతో ప్రేమగా పెంచారు. అమ్మ మాత్రం ఏం తక్కువ చేసింది? ప్రేమగానే పెంచింది. కాకపోతే తల్లిగా ఆవిడ కొన్ని విషయాల్లో కఠినంగానే వ్యవహరించేది. ఆడపిల్లలంటే పనీపాటా నేర్చుకోవాలని, వంటావార్పూ వచ్చి ఉండాలని, లేకపోతే అత్తగారింటికి వెళ్ళాక చాలా ఇబ్బంది పడాల్సి వస్తుందని వంట నేర్చుకో అంటూ అర్చనని వేధించేది. కానీ, వెంటనే ఆనందరావు "మా అర్చన అందరాడపిల్లల్లా పెళ్ళిచేసుకోదు. ఐ.పి.యస్ ఆఫీసర్ అవుతుంది" అంటూ కొట్టిపారేసేవాడు.

గాఢంగా నిట్టూర్చింది అర్చన.

అలాంటి నాన్న, చిన్నప్పటినుంచి తనకి చదువుపట్ల అంతులేని ఆసక్తిని కలగచేసిన నాన్న, ఎందుకు వేణు మాయలో పడ్డాడు. కాదు నాన్న వేణు మాయలో పడలేదు. నాగరాజు చేసిన ఘాతుకంతో బెదిరిపోయి, ఒకసారి కలిగిన దౌర్భాగ్యస్థితి తన కూతురికి మరోసారి కలక్కూడదని, వరించి వచ్చిన కుర్రవాడిని మహాభాగ్యంగా భావించి, తనకి నచ్చచెప్పి, తన మెడలు వంచి పెళ్లిచేశాడు. ఛ! అర్చనకి మళ్లీ ఏడుపొచ్చింది. తనని తాను మందలించుకుని పిల్లలతోపాటు స్వరం కలిపింది.

ప్రేయర్ అయిపోయింది. క్యూలో ఉన్న పిల్లలంతా చెదిరిన పక్షుల్లా కలకలధ్వనులు చేస్తూ క్లాస్ రూమ్స్‌కి వెళ్ళిపోసాగారు.

"రండి మీ క్లాసు చూపిస్తాను" నళినిని అనుసరించింది.

ఆ రోజంతా స్కూలు టీచర్‌గా ఓ కొత్త జీవితాన్ని ఆస్వాదిస్తున్నట్టు అనిపించింది. చాలా రోజుల తరువాత మనసంతా ఉల్లాసంగా, తేలిగ్గా అయింది. మంచి ఉద్యోగం ఇప్పించారు మేడమ్. ఆవిడకి థాంక్స్ చెప్పాలి అనుకుంది. మిగతా టీచర్లని కూడా నళిని పరిచయం చేసింది. ఎవరూ కూడా తనని "మీ ఆయనేం చేస్తారు? మీకెంతమంది పిల్లలు?" లాంటి రొటీన్ ప్రశ్నలేయనందుకు చాలా ఆనందంగా అనిపించింది.

సాయంకాలం నళిని, అర్చన కలిసే ఇంటికి వెళ్ళారు. స్కూలికి కూడా దగ్గరే.. నడిచి వెళ్లచ్చు. నళినికి థాంక్స్ చెప్పి తన ఇంటివైపు నడిచింది.

ఇంటికి వెళ్ళగానే పొట్లాలు, పొట్లాలుగా ఉన్న సరుకులు, అట్టపెట్టెల్లో ఉన్న చిన్న గిన్నెలు బైటకి తీసింది. టీ పొడి, పంచదార, పాలపొడి డబ్బా, అగ్గిపెట్టె వరసగా అన్ని సర్దుకుని స్నానం చేసి వచ్చి టీ పెట్టుకుని, టీ కప్పుతో వచ్చి వరండాలో కూర్చుంది. వాకిట్లో ఉన్న పూలమొక్కలు ఒకొక్కటే తమని తాము పరిచయం చేసుకుంటున్నట్టు గాలికి తొంగిచూసి వెనక్కెల్తున్నాయి. 'నా పేరు కనకాంబరం' అంది ఓ మొక్క కొద్దిగా ఒంగి. 'నా పేరు పచ్చచామంతి' అన్నాయి పచ్చని పూలు. 'హలో నా పేరు గులాబి. చూశావుగా ఎంత నాజూగ్గా ఉంటానో నన్ను చూడగానే పిల్లల దగ్గర్నించీ పెద్దవాళ్లదాకా మొక్కనుంచి వేరుచేయడానికే చూస్తారు. అందుకే నా చుట్టూ ముళ్లకాపలాగా' నవ్వింది గులాబీ. ఆనవ్వుకి పరవశించిన పారిజాతం జలజలా రాలింది.

అర్చన పెదవులమీద కూడా సన్నని నవ్వు విరిసింది. అది పూవుల్లో కలిసి షికారుకెళ్ళింది.

"ఏమ్మా వచ్చేశావా?" అంటూ వచ్చింది పూర్ణమ్మగారు.

"రండి పిన్నిగారూ. టీ తాగుతారా?" తను కూర్చున్న స్టూలు ఆవిడకిచ్చి తను గడపమీద కూర్చుంటూ అడిగింది.

"గడపమీద కూర్చోకూడదమ్మా" అందావిడ.

చటుక్కున లేచింది అర్చన. లేచి వెళ్లి కిటికీలో కూర్చుంది. "టీ తాగుతారా?" మళ్లీ అడిగింది.

"ఒద్దమ్మా నాకలవాటు లేదు. అవునూ మీ వారు ఎప్పుడు వస్తారు?"

అర్చన గుండె గుభేలుమంది. ఇల్లు తీసుకునేముందు "ఆయన ఊళ్లో లేరండి" అని చెప్పింది. ఇప్పుడేమని చెప్పాలి?

విధవరాలైన పూర్ణమ్మగారి అయిదుగదుల ఇంట్లో, ఒకటిన్నర గది అద్దెకు దొరికింది. ఆ ఇంట్లో పూర్ణమ్మగారు ఒక్కతే ఉంటోంది. ఆవిడ వయసు అరవై ఐదు ఏళ్లుంటాయి. పిల్లలు లేరు. భర్తపోయాడు. ఒక్క మనవడు ఆవిడ దగ్గరుండి చదువుకుంటున్నాడు. ఆ అబ్బాయి పేరు రాఘువ. అతని తల్లీ, తండ్రీ హైదరాబాదులో ఉద్యోగం చేస్తున్నారు. ఆవిడ మంచీ, చెడూ రాఘువే చూసుకుంటాడు. ఆవిడకా ఇల్లు భర్త తదనంతరం చెందిన మావగారి ఆస్తిలో భాగం. ఆయనకున్న రెండిళ్ళు. ఇద్దరు కొడుకులకీ చెరొకటీ రాసిచ్చాడు. పెద్ద కొడుకు పూర్ణమ్మగారి భర్త లక్ష్మీనారాయణ. ఆ దంపతులకి పిల్లలు లేకపోవడంతో తోటికోడలు కొడుకు రాఘువ తండ్రి అయిన శేఖరాన్ని చిన్నప్పటినుంచీ చేరదీసారు. అతడిని బాగా చదివించి, ఉద్యోగస్తురాలైన అమ్మాయిని చూసి పెళ్ళిచేశారు. వాళ్ళకి ఒక కూతురు, కొడుకు. కొడుకు రాఘువ పూర్ణమ్మగారు హైదరాబాదులో ఇమడలేదని కొడుకుని ఆవిడ దగ్గరే ఉంచారు పూర్ణమ్మగారి భర్త ఏమీ సంపాదించలేదు.

మామగారిచ్చిన ఆ ఇంట్లో రెండు పోర్షన్లు అద్దెకిచ్చి ఆ అద్దెతో గడిపేస్తుంది. రాఘువ చదువు ఖర్చు అతని తండ్రే చూసుకుంటాడు. ఇంటికి నాలుగువైపులా ఖాళీ స్థలం ఉండడంతో పూలమొక్కలు, పండ్ల మొక్కలు, కూరగాయల మొక్కలు వేసుకుంది. వాటి సంరక్షణా, దైవధ్యానం వీటితో ఆవిడ సమయాన్ని గడిపేస్తుంటుంది.

అర్చన వంటరిగా, కేవలం ఒక సూట్‌కేసుతో వచ్చి, ఆశ్రయం కోరితే, ఆమె ఎవరో ముక్కూ, మొహం తెలియకపోయినా వంటరి ఆడపిల్ల, ఏదో కష్టంలో ఉంది అనే సదుద్దేశంతో ఆదుకుని, ఇంట్లో ఒక గది ఇచ్చింది. ఆ ఒక్కగదీ చాలా విశాలంగా ఉంది. ఒక చిన్న క్లోజ్‌డ్ వరండా. చుట్టూ చెట్లు, రకరకాల మొక్కలు ధారాళంగా గాలీ, వెలుతురూ చాలా హాయిగా ఉంది. కానీ, మట్టిగోడల బాత్‌రూం, ఫ్లష్ అవుట్ లేని టాయ్‌లెట్ కొంచెం ఇబ్బందిగా అనిపించాయి అర్చనకి. అయినా, ఇనప్పెట్టెలో ఉన్నంత భద్రంగా ఉన్న ఆ గది ఆమెకి కొంత నిశ్చింతనీ, హాయినీ కలిగించడంతో మిగతా విషయాలకి ప్రాధాన్యత ఇవ్వలేదు.

ఆమె పూర్ణమ్మగారి నుంచి ఇలాంటి ప్రశ్నలు వస్తాయని ఆశించలేదు. అర్చనతో ఆ ఇంటికి వచ్చి అడ్వాన్స్ ఇచ్చాక చెప్పింది నళిని. "మీ ఆయన ఏడి అని అడిగితే ఊరికెళ్లారు అని చెప్పు పూర్ణమ్మగారితో."అని.

అబద్ధం చెప్పడానికి అర్చన మనస్సు అంగీకరించలేదు. "ఇవాళ కాకపోతే రేపైనా ఆవిడకి నిజం తెలుస్తుందేమో" అంది సందేహంగా.

"రెండు రోజులు పోయాక చెపుతాను. పెద్దావిడ కదా. నీ మీద చెడ్డ అభిప్రాయం లేకపోయినా ఒంటరి ఆడపిల్లవని నీకు ఇల్లివ్వడానికి సందేహించచ్చు. అందుకే చిన్న అబద్ధంతో ఆపద దాటావంటే నీకు కావలసినంత కాలం ఇక్కడ సేఫ్‌గా ఉండచ్చు" అంది నళిని.

ఆ మాట నచ్చింది అర్చనకి. అందుకే అడ్వాన్స్ ఇచ్చి కొద్ది సామానుతో రాగానే పూర్ణమ్మగారి ధాటిని ఓపికగా తట్టుకోగలిగింది.

"ఏంటమ్మా ఇంత కొంచం సామానేనా? మంచాలు లేవా? అదేంటి పాత ఇంట్లోంచి సామానేం తెచ్చుకోలేదా? మీ ఆయన ఊరెళ్లాట్టగా ఎప్పుడొస్తాడు? నువ్వు ఆఫీసు నుంచి ఎన్నింటికి వస్తావు?" ఇలాంటి అనేక ప్రశ్నలన్నిటికీ సమాధానాలు చెప్పి, ఆవిడని పంపించి గదిలోకి వచ్చి తలుపేసుకుంది.

కానీ, ఇప్పుడు మళ్ళీ ఆవిడ అదే ప్రశ్న వేసింది. అర్చన కొన్ని క్షణాలు మౌనంగా ఉండి అంది. "వస్తారండి ఆయన పని అయిపోయాక వస్తారు. ఆఫీసు పనిమీద బొంబాయి వెళ్లారు."

"అలాగా జాగ్రత్తగా ఉండమ్మా. అసలే రోజులు బాగాలేవు. నేనున్నాననుకో. ఏం భయంలేదు. ఏదన్నా కావాలంటే మా కుర్రాడు రాఘువని పిలువు. సరే మరి చూడు. దొడ్లో కూరగాయలున్నాయి. ఏం కావాలన్నా తీసుకో. సరేనా?"

అర్చన కృతజ్ఞతగా తలూపింది.

వస్తానమ్మా ఆవిడ వెళ్ళిపోయింది.

పాపం ఎంత అమాయకురాలు? ఎంత మంచితనం హేమలత దయవలన నళినితో, నళిని దయవల్ల ఈ ఇంట్లో పూర్ణమ్మగారితో, ఇదంతా ఆ భగవంతుడు చేస్తున్న సహాయం ఒంటరిని చేసినా ఎంత మంచి ఆత్మీయుల్ని ప్రసాదించాడు. కరుణామయుడు. నిట్టూర్చింది. కాస్సేపు పడుకోవాలనిపించింది. మెల్లిగా ఒక టీవి కొనుక్కుంటే కాస్త కాలక్షేపం అవుతుంది

నెమ్మదిగా కిటికీ దిగి, ఖాళీ టీ కప్పు తీసుకుని కిచెన్‌లో సింకులో పెట్టేసింది. మళ్ళీ గదిలోకి వచ్చి కలయ చూసింది.

ఆ గదిలో ఎప్పటిదో పాతకాలం నాటి పందిరిమంచం ఉంది. ఒక పడక్కుర్చీ ఉంది తలుపు వేసేసి మంచం మీద వాలింది. ఒక్కసారిగా ఏదో దిగులు కమ్మేసినట్టు అయింది. గట్టు తెగి, గండిపడిన చెరువులాగా దుఃఖం వెల్లువైంది అర్చనకి. ఎక్కడి నుంచి ఎక్కడికి ఈ పయనం? చివరికి ఏది గమ్యం?

అర్చనలో భవిష్యత్తుపట్ల భయం దిగులు, ఆవేదన దుఃఖంగా మారి జలప్రళయంలా బుస కొట్టసాగింది. కళ్ళు బలవంతంగా మూసుకుని నిద్రలోకి జారడానికి ప్రయత్నించింది.

●●●

అదొక అందమైన పూలతోట రంగు, రంగుల గులాబీలు, చేమంతులు, పరిమళాల ధూపం వేస్తూ సంపెంగలు, మొగలిపూలు, అక్షింతల హారతిస్తూ పొగడలు, పారిజాతాలు. అప్పుడే ఓ అందమైన అమ్మాయి చేతిలో పూలసజ్జతో వచ్చింది. ఆ అమ్మాయి చాలా అందంగా ఉంది. మోకాళ్ళను దాటి, అరచేతి మందాన ఉన్న పూలజడ వేసుకుంది. పట్టుపరికిణీ, ఓణీ, పట్టు జాకెట్టు. చీరకీ జాకెట్టుకీ మధ్య ఉన్న అందమైన సన్నని నడుమ మోయలేక మోస్తున్న వడ్డాణం, మెడనిండా నగలు, చెంపస్వరాలు, పచ్చటి ఒంటి రంగు బంగారంతో పోటీపడుతోంది. ఆ బంగారపు బొమ్మ పూలసౌరభాలను గాఢంగా ఆఘ్రాణిస్తూ, పరుగు పరుగున మొక్కల దగ్గరకి పరిగెత్తింది. సుకుమారమైన తన లేత వేళ్ళతో నాజూగ్గా ఒకొక్క పూవే తెంపి, పూలసజ్జలో వేయసాగింది. అంతలో ఎక్కడినుంచో ఓ తెల్లని గుర్రం రెక్కలు తప, టపలాడిస్తూ ఆమె ముందు ఆగింది. దానిమీంచి తెల్లని దుస్తుల్లో అందమైన రాజకుమారుడు దిగి, ఆమె వైపే అడుగులు వేస్తూ, ఆమె దగ్గరగా వచ్చి, మత్తుగా, ఆమె కళ్ళల్లోకి చూసి, మనోహరంగా నవ్వాడతను. ఆ నవ్వుకి మతిపోయి శిలావిగ్రహంలా నిలబడిపోయింది. తన చేతి స్పర్శతో ఆ శిలలో చైతన్యం కలిగించడానికి కాబోలు అతని అందమైన చేయి ఆమె చేతిని అందుకుంది. ఇంతలో వేగంగా వచ్చిన ఓ పక్షి ఇద్దరి చేతుల మీదుగా రివ్వున ఎగిరింది. ఆమె చేయి విరిగింది. తల ఎగిరిపడింది. మొండెంతో ఆ పక్షి రెక్కల మించి నిప్పురవ్వలు రాలిపడి, మంటలుగా ఎగిసి, ఆ మంటలో అందమైన పూలతోట కాలిపోతోంది. మంటలు ఆకాశాన్ని ఎగిసి పడుతున్నాయి.

కెవ్వున అరిచి లేచి కూర్చుంది అర్చన. కిటికీలోంచి అవతల పక్క పెరట్లో ఉన్న నూరువరహాలు కిటికీ వైపు వంగి, తొంగి చూస్తోంది. దాహంతో గొంతు తడారినట్టైంది.

ఇదే కల చాలా కాలమైంది. మళ్ళీ ఇన్నేళ్ళకు ఇదేకలరావడం. ఎందుకిలా? ఈ కల ఎంతకాలం ఇలా వెంటాడుతుంది?

ఒళ్ళంతా చెమటతో నిండిపోగా, కాళ్ళమీదున్న దుప్పటి తొలగించి లేచి, టేబుల్ మీద ఉన్న చిన్న కూజాలో నీళ్ళు, గ్లాసులోకి వంపుకుని తాగింది.

ఆమెకేం అర్థం కాలేదు. ఇదే కల. ఈ కలే ఇదివరకూ వచ్చింది. సరిగ్గా ఇలాగే అతను తన చెయ్యి అందుకోడానికి ప్రయత్నించడం, ఆ భయంకరమైన పక్షి ఆ చేతి మీదనుంచి ఎగరడం, తన చెయ్యి విగిరిపోవడం. అర్చనకి భయంతో ముచ్చెమటలు పోశాయి. భగవంతుడా ఏవిటీ కల? నన్నెందుకిలా ఈ కల నన్ను వెంటాడుతోంది? అతన్నెక్కడో చూసినట్టు అనిపిస్తోంది.

ఎవరతను? ఎవరతను? అస్పష్టంగా ఉన్న రూపం, కానీ అతని నవ్వు మాత్రం చాలా స్పష్టంగా, ఎంతో మనోహరంగా ఉంది. ఆ నవ్వు చాలా పరిచితమైన నవ్వు. ఎవరతను? ఎస్ అతనే అవును ఇప్పుడు స్పష్టంగా తెలుస్తోంది. అతనే. ఎందుకిలా జరుగుతోంది. ఎందుకో ఆ పక్షి మాత్రం ఖచ్చితంగా వేణూనే అనిపిస్తోంది. వేణు ఎందుకు తన దృష్టికి ఎప్పుడూ దుర్మార్గుడిలా కనిపిస్తాడో ఆమెకి అర్థంకాదు నిజానికి వేణు దుర్మార్గుడు కాదు. కానీ, తన బలహీనతని క్యాష్ చేసుకున్న స్వార్థపరుడు, అవకాశవాది అని ఆమె విశ్వాసం

అర్చనకి తన మనసులో ఏం జరుగుతుందో అర్థం కాలేదు. నెమ్మదిగా లేచి తలుపు తీసుకుని బైటకి వచ్చింది.

నిశ్శబ్దంగా ఉన్న పరిసరాలను, చీకట్లో మౌనంగా ఉన్న చెట్లను చూస్తూ నిలబడింది. పెరట్లో విచ్చుకున్న జాజులు, తెల్ల గన్నేరు పూలు గాలికి పెరడంతా రాలి ఉన్నాయి. చీకట్లో చూస్తూంటే తెల్లటి పూలున్న నల్లతివాచీలా అనిపిస్తోంది. మంచి సువాసన వీస్తోంది. రకరకాల పూలసౌరభాలు. కొద్దిగా సేదతీరినట్టు అనిపించింది. కానీ, ఎందుకో చీకటిని చూస్తుంటే భయం వేస్తోంది.

తనిలా చీకట్లో ఇక్కడ నిలబడడం ఇంటి ఓనరు పూర్ణమ్మగారు చూస్తే ఏమనుకుంటుందో? అనేక అనుమానాలు, భయాలు ముప్పిరిగా ఆవరించగా గదిలోకి వెళ్ళిపోయి తలుపు వేసుకుని, మంచం మీద వాలింది. కనీ, కళ్ళు మూతలు పడలేదు.

ఎప్పుడో, తెలతెలవారుతుండగా నిద్రపట్టింది.

●●●

తనని చూడగానే కన్నీళ్ళతో వచ్చి దగ్గరగా తీసుకున్న తల్లి భుజమ్మీద తలాన్చి ఏడ్చేశాడు వేణు. ఆవిడకూడా దుఃఖాన్ని ఆపుకోలేకపోయింది. ఆ దృశ్యం చూసి తట్టుకోలేని కృష్ణస్వామి లోపలికి వెళ్ళిపోయాడు. నీలవేణి అప్పుడే బాబుకి నీళ్ళు పోసినట్టుంది. కాళ్ళమీద పడుకోబెట్టుకుని పౌడర్ రాస్తోంది. ఇల్లంతా సాంబ్రాణి వాసనేస్తోంది. అది పౌడర్ సువాసనతో కలిసి తమాషాగా ఉంది. ఆయన సూట్‌కేసు పక్కన బెట్టి నేరుగా పెరట్లోకి వెళ్ళిపోయాడు స్నానానికి.

వేణు కళ్ళు తుడుచుకుని నెమ్మదిగా అడిగాడు "బాబు ఎక్కడమ్మా? నా బాబు ఎక్కడ?"

ఆవిడ దుఃఖం అణచుకుంటూ చెంగుతో కళ్ళు తుడుచుకుని "దా నాన్నా లోపలికి" అంటూ పెద్ద గడప దాటి లోపలికి నడిచింది.

ఆవిడని అనుసరించిన వేణు నీలవేణి కాళ్ళమీద ఉన్న బాబుని చూస్తూనే కొంచెం వేగంగా ముందుకి నడిచాడు. అప్పటికే జుబ్బా తొడిగిన నీలవేణి చటుక్కున బాబుని భుజమ్మీద వేసుకుని లేచి తయారమ్మ చేతికిచ్చింది. ఆవిడ బాబుని ఒక్కసారి గుండెలకు హత్తుకుని వేణు చేతులకిచ్చింది. నీలవేణి నిశ్శబ్దంగా అక్కడి నుంచి వెళ్ళిపోయింది.

వేణు జాగ్రత్తగా బాబుని రెండు చేతుల్లో పట్టుకుని తదేకంగా చూడసాగాడు. అర్చన పోలికలు కనిపిస్తాయేమోనన్నట్టు ఆత్రంగా అతని కళ్ళు బాబుని వెదకసాగాయి. తెల్లగా, బొద్దుగా, నల్లని ఉంగరాల జుట్టుతో ముద్దుగా ఉన్నాడు. సాంబ్రాణి, పౌడర్ వాసన కలగపులగంగా వస్తోంది. "అమ్మా.. వీడు నాకొడుకు" అన్నాడు ఉద్వేగంగా వేణు.

ఆవిడ అవునన్నట్టుగా తలూపింది.

వేణుని చూస్తుంటే ఆవిడకి దుఃఖం ఆగడం లేదు. ఎంత త్వరగా వీలైతే అంత త్వరగా వేణు ద్వారా అసలేం జరిగిందో తెలుసుకుని ఈ సమస్యని పరిష్కరించాలని, కోడల్ని ఇంటికి తీసుకురావాలని ఆవిడ తహ తహలాడుతోంది. కానీ అతను రాగానే ఆ విషయాలు గుర్తుచేసి, అతను పడే వేదన చూసే ధైర్యం ఆమెకి లేదు. అందుకే విషయం దాటేస్తూ నెమ్మదిగా అంది. "స్నానం చేసిరా నాన్నా! వేడిగా ఇడ్లీ చేశాను. తిందువుగాను.. బాబు పడుకున్నాడు కదా, లేచాక ఎత్తుకుందువులే"

వేణుకి వాడిని దింపాలని లేదు. అలా గుండెలకానించుకుని ఆ స్పర్శలోని మాధుర్యాన్ని ఆస్వాదించాలనిపిస్తోంది. వాడు తన కొడుకు అనుకుంటుంటేనే అతనికి చాలా గర్వంగా అనిపిస్తోంది.

ఇలా ఇవ్వు నాన్న. ఆవిడ చేయి చాపింది.

"నేను పడుకోబెడతానమ్మా"

"తీసుకురా" అంటూ ఆవిడ పడకగదిలోకి నడిచింది. పెద్ద ఉయ్యాల. అది తనదే వేణుకి అర్థమైంది. ఇన్నేళ్ళూ అటక మీద ఉన్న చెక్క ఉయ్యాల మనవడికోసం కిందికి దించింది తాయారమ్మ.

"ఇది నాదే కదమ్మా" బాబుని మెత్తటి పక్కమీద పడుకోబెట్టి ఉయ్యాల ముట్టుకుంటూ అన్నాడు.

"అవును నాన్నా. నీ తరవాత ఎవరూ ఊగలేదు. మళ్ళీ నీ కొడుకే." అందావిడ బాబు మీద పల్చటి బట్ట కప్పి ఫ్యాను ఒకటో నెంబరులో వేసింది. "పద స్నానం చేసిరా." అంటూ వేణు భుజం మీద చేయేసి గదిలోంచి బైటకి తీసుకెళ్ళి తలుపు ఓరగా వేసింది. అప్పుడే స్నానం ముగించి వస్తున్న కృష్ణస్వామిని చూసిన వేణు, తల్లి అందించిన కొత్త టవల్, మైసూరు శాండల్ సోపు తీసుకుని పెరట్లోకి వెళ్ళిపోయాడు.

వేణు స్నానం చేసి వచ్చేసరికి వేడి, వేడి ఇడ్లీ, కారప్పొడి, కొబ్బరి పచ్చడి ఇంట్లో కాచిన నెయ్యి వాసన వేస్తోంది. తండ్రీ, కొడుకులిద్దరికీ పెద్ద స్టీలు ప్లేట్లలో పెట్టి, నేతిగిన్నె పట్టుకుని నిలబడింది తాయారమ్మ. దూదుల్లా ఉన్న ఇడ్లీ తుంచుకుంటూ 'ఎంతకాలమైంది అమ్మ చేతి వంట తిని?' అనుకున్నాడు వేణు. తాయారమ్మ వేణు ప్లేటులో ఉన్న కారప్పొడి కొద్దిగా కదిపి వేలితో గుంటలా చేసి, నెయ్యి వేసింది. "చాలమ్మా చాలు" ఖంగారుగా చేయి అడ్డం పెట్టబోయాడు వేణు. "తిను నాన్నా" అంటూ కారప్పొడి నేయితో తడిపి, గిన్నె తీసుకుని కృష్ణస్వామి దగ్గరకు వెళ్ళింది తాయారమ్మ.

"ఏమన్నా విశేషాలున్నాయా?" అడిగాడు కృష్ణస్వామి భార్యని.

ఆవిడకి ఆ ప్రశ్నలో అర్థం తెలుసు. బాబు విషయంలో ఎవరన్నా, ఏదన్నా అడిగారా? ఏమన్నా విమర్శలు, ప్రశ్నలు వచ్చాయా అని "లేదు ఏమీలేవు." అంటూ లోపలికి వెళ్ళిపోయింది.

ఆయన సన్నగా నిట్టూర్చి ఇడ్లీ ముక్క నోట్లోపెట్టుకున్నాడు.

●●●

ఆ రోజు కాలేజీ వార్షికోత్సవం. వారం ముందు నుంచీ అనేక రకాల పోటీలు నిర్వహించి ఆటల్లో, పాటల్లో, వక్తృత్వ పోటీల్లో గెలిచిన వాళ్ళకి ప్రైజులు ఇవ్వడం, కొంతమంది మెరిట్ స్టూడెంట్స్‌కి సర్టిఫికెట్లు ఇవ్వడం, ప్రత్యేకంగా ఆ రోజున డ్యాన్సు, సంగీతంలాంటి వాటిలో ప్రావీణ్యం ఉన్నవాళ్ళచేత మంచి కార్యక్రమాలు చేయడం.. కాలేజీలో ఎన్నో సంవత్సరాలుగా వస్తోన్న ఆనవాయితీ. కాలేజీ మొత్తానికి అందమైంది, తెలివైనది అయిన అర్చన అన్ని విషయాల్లో ముందుండడంతో, లెక్చరర్స్ దగ్గరి నుంచీ, స్టూడెంట్స్ కూడా ఆమెనే ఒక లీడర్‌గా పరిగణించి ఈ ఏడాది, కాలేజీ సాంస్కృతిక సంస్థకి అర్చనని సెక్రటరీ చేశారు. అందుకే ఈ ఏడాది అర్చన వార్షికోత్సవం జరిపించాల్సిన బాధ్యత తీసుకోవాల్సి వచ్చింది.

స్టూడెంట్స్ అందర్నీ నెల్రకితం సమావేశపరిచి, ఏ ఏ కార్యక్రమాలు చేయాలి? ఎలా చేయాలి? అని చర్చించింది. అర్చన మీదున్న ఆరాధనతో క్రేజ్‌తో చాలామంది రక, రకాల కళలతో ముందుకొచ్చారు తమ ప్రతిభ చూపించుకోడానికి. అందరినీ ప్రోత్సహించడానికి ఈ సారి పదిహేను రోజుల ముందు నుంచే వార్షికోత్సవానికి కావలసిన ఏర్పాట్లు చేయడంలో చాలా బిజీగా ఉంది అర్చన. అర్చనకి చదువు తప్ప, మరో కళ మీద పెద్దగా అవగాహనలేదు. అప్పుడప్పుడు చిన్న, చిన్న కవితలు తన డైరీలో రాసుకుంటుంది. అంతకు తప్ప సంగీతం, నాట్యం ఇతర కళల గురించి పెద్దగా ప్రవేశం లేదు. కాకపోతే వాటి పట్ల అభిరుచి మాత్రం ఉంది. సంగీతం వినడం, నాట్యం చూడడం ఆస్వాదించడం ఆమెకి చాలా ఇష్టం. అందుకే ఈసారి కార్యక్రమాల్లో శాస్త్రీయ సంగీతం, నాట్యం ఉండేలా ఏర్పాట్లు చేసింది.

అమలకి సంగీతం వచ్చు. కానీ, ఆ పిల్లకి స్టేజి ఫియర్. పేరంటాల్లో పాడడం, లేదంటే రేడియోలో అప్పుడప్పుడూ పాడి, పాతికో, పరకో తెచ్చుకోడం తప్ప, వేదిక ఎక్కి కచేరీలు చేయలేదు. ఇప్పుడు అమల ఈ కార్యక్రమంలో అమలని వేదిక ఎక్కించాలని నిశ్చయించుకున్న అర్చన ఆ పిల్లకి ధైర్యం చెప్పి, ఒప్పించింది. ఇప్పుడు అమల ఈ కార్యక్రమంలో అన్నమాచార్య కీర్తనలు పాడుతోంది. మరో నమ్రత అనే అమ్మాయి కూచిపూడి నేర్చుకుంటోంది. ఆమె నాట్య ప్రదర్శన. కీర్తన అనే అమ్మాయి మ్యాజిక్ షో చేస్తోంది. వీళ్ళుకాక కొందరు అబ్బాయిలు వెస్టన్ డ్యాన్సు చేస్తున్నారు. కొందరు మిమిక్రీ చేస్తున్నారు. ముఖ్య అతిధిగా విశాఖపట్నం మేయర్‌ని పిలిచారు. కలెక్టర్‌ని పిలిచారు. ఇంత పెద్ద కార్యక్రమం సలక్షణంగా జరిపించే బాధ్యత తనది కావడంతో,అర్చన చాలా బిజీగా ఉంది. ఉదయం కాలేజీకి వచ్చి కావాల్సిన ఏర్పాట్లు చేసుకుని మళ్లీ ఇంటికి వెళ్లి తిరిగి సాయంత్రం నాలుగింటికే వచ్చేసింది.

కాలేజీ ఆవరణలో బండి ఆపగానే విద్యార్థులంతా ఆమెని చుట్టుముట్టారు. కాస్సేపు అంతా గోలగోలగ అయింది.

'అర్చనా ఇలారా, అర్చనా నా ప్రోగ్రాం ఎన్నింటికి, డ్యాన్సు తరవాతనా, ముందా? అర్చనా నా మిమిక్రీ ఒక్కసారి చూడకూడదూ. ' ఇలా అందరూ కలగా, పులగంగా మాట్లాడుతూ ఆమెకి ఊపిరి సలపకుండా చేశారు. అందరినీ తప్పించుకుని, లోపలికి వెళ్ళబోతున్న అర్చన దగ్గరకు వచ్చి అడిగాడు వేణు.

"అర్చనా నేనేమన్నా సాయం చేయాలా నీకు?"

అర్చన వేణువైపు చూసింది. ఎప్పుడూ పుస్తకాల్లో మునిగిపోయి, మధ్య మధ్య తన వైపు దొంగచూపులు చూస్తూ, బెరుకుగా ఉండే వేణు కళ్ళల్లో ఆమెతో మాట్లాడేటప్పుడు ఓ చిత్రమైన మెరుపు కనిపిస్తుంది. ఆ మెరుపు చూస్తే ఆమెకి నవ్వొస్తుంది. తెల్లగా, బక్కపల్చగా ఆడపిల్లలా ఉండే వేణు, ఒక్క చక్రవర్తితో తప్ప ఇంకెవరితోనూ ఎక్కువగా మాట్లాడడు. కానీ, అప్పుడప్పుడు అర్చనతో మాత్రం మాట్లాడతాడు. ఆమెని ఎప్పుడూ ఆరాధనగా చూస్తూ ఉంటాడు.

అర్చన క్లాసెస్‌కి అటెండ్ అవని రోజున ఏదన్నా నోట్సు కావాలా అని అడగడం, నిన్న కాలేజీకి రాలేదేం అంటూ బెంగగా అడగడం, లంచ్ అవర్‌లో ఆమె తింటోందో చూసిగాని, బాక్స్ మూత తీయకపోడం ఇలాంటి వన్నీ చూస్తుంటే అర్చనకి వేణు అంటే తమాషాగా అనిపిస్తుంటుంది.

ఎందుకితనికి నేనంటే ఇంత శ్రద్ధ. ఎవరితో మాట్లాడనివాడు నాతో ఎందుకు మాట్లాడతాడు? అని ఎప్పుడూ ఆలోచిస్తూ ఉంటుంది. అప్పుడప్పుడూ సరదాగా ఆట పట్టిస్తూ ఉంటుంది. 'నిన్న నాకు బాగా జ్వరం వచ్చింది వేణూ నూటపదహారు డిగ్రీలుంటుందేమో టెంపరేచర్' అని బిక్కమొహం పెట్టగానే, వేణు తెల్లటి మొహం గాభరాతో, ఎర్రగా అయిపోతుంది.

'మరి డాక్టర్ దగ్గరకు వెళ్ళావా? ఏమన్నారు? మందులేసుకుంటున్నావా?' వగైరా ప్రశ్నలతో హడావుడీ పడుతుంటాడు.

"నిజంగా నువ్వు చాలా మంచివాడివి వేణూ. నాకు నోట్స్ నువ్వు తప్ప ఎవరూ ఇవ్వరు" అంటూ చిలిపిగా నవ్వుతుంది. ఆమె మాటల్లో కొంటెదనాన్ని, వ్యంగ్యాన్ని అర్థం చేసుకోడో, లేక అర్థం కాదో వేణు మాత్రం చాలా మామూలుగా ఉంటాడు.

ఎప్పటిలాగే ఇప్పుడూ నవ్వుతూ అన్నది అన్నది అర్చన "నువ్వేం చేయద్దులేగానీ, మధ్య, మధ్య నాకు కాస్త, బిస్కెట్లు, టీలు అందిస్తూ ఉండు చాలు"

వేణు వెళ్ళిపోయాడు. అతను వెళ్ళినవైపు చూస్తూ నవ్వుకుంది. ఏం మగాళ్ళు. ఆడదాని పట్ల ఆకర్షణ కలగలేగానీ, ఏం చేయడానిక్కూడా సిద్ధపడతారు అనుకుంటూ తన పనిలో మునిగిపోయింది. ఆమె సరదాగా అన్నా వేణు, బిస్కెట్ పాకెట్‌తో, టీ కప్పుతో ఆ రోజు కార్యక్రమం అయిందాకా ప్రతి అరగంటకీ ప్రత్యక్షం కాసాగాడు.

పనిలో మునిగిపోయిన అర్చన ఆ విషయం పెద్దగా పట్టించుకోలేదు.

కార్యక్రమాలు మొదలైనయి. మేయర్‌గారు, కలెక్టర్‌గారు వచ్చారు. చక్కటి పూలదండలతో, అందమైన పుష్పగుచ్చాలతో వాళ్ళకి ఆహ్వానం పలికారు అమ్మాయిలు నలుగురు కలిసి.

మొదట గణపతి స్తోత్రంతో కూచిపూడి డ్యాన్స్ మొదలుపెట్టింది ఒక అమ్మాయి.

ఆ తరువాత అమల పాటలు. రెండు అన్నమాచార్య కీర్తనలు పాడింది. ఎవరినీ చూడకుండా కళ్ళు మూసుకుని, మైకు ముందు నిలుచుని కొండలలో నెలకొన్న కోనేటిరాయుడువాడు, బ్రహ్మ కడిగిన పాదము పాడి, ఇవతలకి వచ్చిన అమల మొహంలో చెమటలు చూసి పక, పకా నవ్వింది అర్చన.

"ఏంటే అంత భయమైతే ఎలా?" అంటూ.

"ఏమో తల్లీ నీ బలవంతం మీద ఎక్కానివాళ స్టేజ్! లేకపోతే ఛస్తే ఎక్కేదాన్నికాను." చెమటలు తుడుచుకుంటూ అంది.

వేదిక మీద మ్యాజిక్ షో మొదలైంది. నోట్లోంచి రెండు మీటర్ల గుడ్డ తీయడం, అందరూ చూస్తుండగానే బంగారం గొలుసుని పాముగా మార్చడం వగైరా తమాషా చర్యలతో సరదాగా గడిచింది.

ఆ తరువాత అబ్బాయిల వెస్టన్ డ్యాన్స్, వెంట్రిలాక్విజమ్ ఇలా వరసగ కార్యక్రమాలన్నీ జయప్రదంగా ముగిసాయి.

కలెక్టర్‌గారి చేతిమీదుగా బహుమతి ప్రదానం జరిగింది. కార్యక్రమాలన్నీ చక్కగా నిర్వహించినందుకు ప్రిన్సిపాల్, లెక్చరర్స్ అర్చనని అభినందించారు.

స్టూడెంట్స్ అంతా అర్చనకి థాంక్స్ చెప్పి, ఇళ్ళదారి పట్టారు. అందర్నీ పంపించి, వాచ్‌మాన్‌కి అన్నీ అప్పచెప్పి, అర్చన వెహికల్ దగ్గరకు వచ్చేటప్పటికి రాత్రి పదైంది.

"బాగా లేట్ అయింది అర్చనా. మగపిల్లలు కూడా వెళ్ళిపోయినట్లున్నారు. మనిద్దరం వెళ్ళగలమా ఈ టైంలో" భయంగా అడిగింది అమల.

"ఏం? ఎందుకెళ్ళలేము? " బండి స్టార్ట్ చేస్తూ అడిగింది అర్చన.

"ఏమో బాబూ నీకు చాల ధైర్యం ఎక్కువ. ఎవరికన్నా అప్పచెప్పి త్వరగా బయలుదేరాల్సింది మనం. అందరూ వెళ్లేదాకాఉండాల్సి వచ్చింది. అయినా ప్రిన్సిపాల్‌గారు కూడా బాధ్యతంతా మన మీద పెట్టడం ఏంటి? ఇంతమంది మగపిల్లలుంటే"

"ఏంటీ నీ నస? రా కూర్చో" విసుక్కుంది అర్చన. అర్చనకి అమల పిరికితనం చూస్తే చిరాకు. ఆడపిల్లలు డైనమిక్‌గా ఉండాలి. ఈ పని చేయను. ఆ పని చేయను. అక్కడికి వెళ్ళను. ఇక్కడికి వెళ్ళను అని అనకూడదు అంటుంది. అమల ఒట్టి పిరికిది.

అమల అర్చన వెనకాల బండిమీద ఎక్కి కూర్చుంది బ్యాగ్ భుజానికి తగిలించుకుంటూ.

అర్చనా బండి బయలుదేరుతుంటే హడావిడిగా వచ్చాడు వేణు చక్రవర్తితో కలిసి

"అర్చనా పది దాటింది. మేము మీ ఇంటిదాకా తోడు వస్తాం" అన్నాడు.

అర్చన ఆశ్చర్యంగా చూసింది."మీరింకా వెళ్లలేదా?"

"లేదు మీరు వెళ్లకుండా మేమెలా వెళతాం? ఆడపిల్లలు ఇంత రాత్రివేళ ఒంటరిగా వెళ్లడం క్షేమం కాదు."

"ఎందుకు? ఫర్వాలేదు మేము వెళ్లగలం" అంది అర్చన.

అమల మెల్లిగాఅంది. "రానీవే కాస్త మగపిల్లలు తోడుంటారు. వద్దంటావేంటి?" అర్చన అమల వైపు చూసింది. తిరిగి వేణుని చూస్తూ మా గురించి వీళ్ళకెందుకింత ఆదుర్దా అనుకుంటూ "ఏం ఫర్వాలేదు. మీరు వెళ్లండి మాకేం భయంలేదు" అంది బండి స్టార్ట్ చేస్తూ.

అమలకి ఒళ్లు మండిపోయింది. ఏంటి దీని ధైర్యం? వాళ్లంతట వాళ్లు వస్తానంటే వద్దంటుందేం?

"మీకు భయం లేకపోయినా మీరు ఒంటరిగా వెళుతుంటే మాకు భయం. మాకేం ఫర్వాలేదు వస్తాం" అన్నాడు వేణు.

అర్చన కొంచెం విసుగ్గా చూసింది "ఏంటి వేణూ నీ చాదస్తం. అయినా నేను బండిమీద కదా వెళుతున్నాను. నువ్వెలా వస్తావు?"

"మీరు ఇప్పుడు ఒంటరిగా వెళితే వాడు రాత్రికి నిద్రపోడు. మేము మీ వెనకాల జస్ట్ బండిమీద ఫాలో అవుతాం. మీరు గేటులోకి వెళ్ళిపోగానే వెనక్కి వెడతాం" అన్నాడు చక్రవర్తి.

అమల గబగబా అంది. "రండి, రండి అర్చన అలాగే అంటుంది".

అర్చన కోపంగా అమలవైపు చూసి మీ ఖర్మ అనుకుంటూ "సరే రండి" అంది.

ముందు అర్చన, అమల కూర్చున్న బండి, తరువాత చక్రవర్తి, వేణు కూర్చున్న బండి ఒకదాని వెనక ఒకటి బయలుదేరాయి.

రోడ్లన్నీ దాదాపు నిర్మానుష్యం అయిపోయాయి. మెయిన్‌రోడ్స్ మీద కార్లు, బస్సులు, స్కూటర్లు తిరుగుతున్నాయి. రామకృష్ణ బీచ్ మీదుగా అర్చన నడిపిస్తున్న కెనైటిక్ హోండా రివ్వున వెళుతోంది. గాలికి ఆమె కట్టుకున్న షిఫాన్ చీర కుచ్చిళ్ళు చిందర, వందరగా చిందులేస్తున్నాయి. వేణు చక్రవర్తి భుజం మీదగా అర్చనని చూడడానికి తల అటూ, ఇటూ తిప్పుతుంటే "అరేయ్ సరిగ్గా కూర్చో" అంటూ కసురుకున్నాడు చక్రవర్తి.

వేణు సర్దుకుని కూర్చున్నాడు. రెండు బళ్లు అర్చన ఇంటి గేటు ముందు ఆగాయి.

అమల ముందు దిగింది. అర్చన కూడా దిగి, హ్యాండిల్స్ పట్టుకుని వెనక్కి తిరిగి, చక్రవర్తి వైపు చూస్తూ "థాంక్యూ.. గుడ్‌నైట్!" అంది.

చక్రవర్తి చిరునవ్వుతో మోస్ట్ వెల్‌కమ్ అంటూ తన మోటార్ బైక్‌ని రివర్స్ చేశాడు. ఆ రివర్స్ చేయడంలో వేణు అర్చన వైపుకి తిరిగాడు. ఆమె చూపుల్లో చూపు కలిపి గుడ్‌నైట్ అన్నాడు. అర్చనకి చిరాకేసినా తమాయించుకుని, గుడ్‌నైట్ అని తన కైనెటిక్ హోండాని అమల గేటు తీసి పట్టుకుంటే లోపలికి నడిపించుకుని వెళ్ళింది.

"ఇప్పుడు మనం డిన్నర్ చేయాలి" అన్నాడు చక్రవర్తి.

"అవును పద ఏదన్నా హోటల్‌కి వెడదాం" అన్నాడు వేణు.

"హోటల్ కాకపోతే మనకిప్పుడు ఎవరు వండి వారుస్తారు? " అన్నాడు చక్రవర్తి. బండి స్లో చేసి, దారిలో ఏ హోటల్ కనిపిస్తుందా అని పరిశీలిస్తూ

కానీ, ఆ సమయంలో అన్ని హోటల్స్, రెస్టారెంట్స్ మూసేసే ప్రయత్నాల్లో ఉన్నారు. ఒకటి, రెండు చోట్ల ఆపి, "మీల్స్ ఉందా? " అని అడిగితే లేదన్నారు. చక్రవర్తికి ఆకలేస్తోంది. వేణు మీద విరుచుకు పడ్డాడు. "నీ వలన ఈ పూట తిండిలేకుండా మాడాల్సి వస్తోంది. వద్దంటే వినకుండా ఆవిడకి బాడీగార్డులా బయలుదేరావు. "

"అబ్బా విసుక్కోకు. ఎక్కడోక్కడ దొరుకుతుంది. పద ముందు ఇంకా ఎమన్నా హోటల్స్ ఉన్నాయేమో చూద్దాం" అన్నాడు వేణు.

"నా మొహం ఉంటాయి. మెయిన్ రోడ్‌లో లేనివి, ఎక్కడో మూల ఉంటాయా ఒకవేళ ఉన్నా, ఇప్పుడు అవన్నీ వెతుక్కుంటూ వెళ్తానా? "

"లేకపోతే పోనీరా. రూములో ఫ్రూట్స్ ఉన్నాయి, స్వీట్స్ ఉన్నాయి. తిందువుగాని. ఈ పూట ఆడపిల్లలకోసం ఆ మాత్రం త్యాగం చేయలేవా? "

"నీకంత దురదగా ఉంటే నువ్వు చెయ్యి త్యాగాలు. నాకిలాంటి పిచ్చి పైత్యాలు లేవు. అయామ్ ఏ ప్రాక్టికల్ మాన్" అన్నాడు చక్రవర్తి బండి వేగం పెంచి.

చక్రవర్తి, వేణు ఒకే ఊరువాళ్ళు, ఒకే రూమ్ మేట్స్ కూడా. ఏడో తరగతి నుంచీ కలిసి చదువుకుంటున్నారు. వేణుది సున్నితమైన స్వభావం. చక్రవర్తి ప్రాక్టికల్‌గా ఆలోచించే వ్యక్తి. ప్రేమా, గీమాలాంటి పిచ్చి వేషాలేయడం అతనికి నచ్చదు. చక్కగా కట్నం తీసుకుని పెద్దవాళ్లు చూపించిన అమ్మాయిని పెళ్లిచేసుకోవడమే అతనికిష్టం. కానీ వేణు సంగతి వేరు. వేణుకి అర్చనంటే పిచ్చి, వెర్రి. ఆమె కోసం కైలాసగిరి మీదనుంచి దూకమన్నా దూకడానికి సిద్ధంగా ఉన్నాడు. ఆ విషయం చక్రవర్తికి తెలుసు. అందుకే విసుక్కుంటాడు. ఏంటి పిచ్చి అంటూ. వేణుకి అదేం పట్టదు. ఎవరి పిచ్చి వాళ్ళకానందం అంటాడు.

వాళ్ళు రూముకి చేరే దారిలో గానీ, చుట్టుపక్కలగానీ ఎక్కడా హోటల్స్ లేవు. మీల్స్ దొరకలేదు. ఉసూరుమంటూ రూమ్ దారి పట్టాడు చక్రవర్తి.

రూముకి చేరుకోగానే చక్రవర్తి షూస్ విప్పి, గదిలో ఓ మూలకి గిరాటేసి, కింద పరిచిన పరుపుమీద జారగిలపడుతూ "హోటల్స్ అన్నీ మూసేశారు. ఆకలేస్తోంది. నీ వలన ఈ పూట తిండిలేదు". అన్నాడు.

"అబ్బా ఆగరా ఐదు నిమిషాలు ఓపిక పట్టు కడుపునిండా పెడతాను. " అంటూ వేణు చొక్కా విప్పి, హేంగర్‌కి తగిలించి, కాళ్ళు, చేతులు కడుక్కోడానికి బాత్‌రూము వైపు వెళ్ళాడు.

"ఏంటి పెట్టేది కడుపునిండా" అనుకుంటూ చక్రవర్తి కళ్ళుమూసుకున్నాడు. ఆవేళ జరిగిన కార్యక్రమాలన్నీ ఒక్కసారి కళ్లముందు కదిలాయి. ఎంతైనా అర్చన డైనమిక్ అనుకున్నాడు.

వేణు కాళ్ళు, చేతులు కడుక్కుని వచ్చి, "పోరా నువ్వు కూడా ఫ్రెషప్ అయిరా" అన్నాడు.

"నాకాకలివేస్తోంది. కడుపులో ఏమన్నా పడితేగానీ, లాభంలేదు" అన్నాడు చక్రవర్తి లేవకుండా.

నువ్వు కాళ్ళు, చేతులు కడుక్కుని వస్తేగానీ ఏమీ పెట్టను అన్నాడు వేణు.

"అబ్బ వీడొకడు. " విసుక్కుంటూ లేచి బాత్ రూము వైపు వెళ్ళాడు చక్రవర్తి

వేణు యాపిల్స్ కడిగి చక్కగా ముక్కలు తరిగాడు. ద్రాక్షపళ్ళు కడిగి, అన్నీ విడిగా తీసి ప్లేటులో సర్దాడు. స్టీలు డబ్బాలో ఉన్న కేకు నాలుగు ముక్కలుగా సర్దాడు. మర, మరాల్లో కొంచెం నేతిలో వేయించిన శెనగపప్పు, వేరుశెనగ పప్పులు కలిపి, ఉల్లిపాయ ముక్కలు సన్నగా తరిగి, కొంచెం ఉప్పూ, కారం వేసి, అన్నీ కలిపాడు.

చక్రవర్తి మొహం కడుక్కుని టవల్‌తో తుడుచుకుంటూ వచ్చి, అవన్నీ చూసి "ఏంటిరా. బానే జమ చేసావే తిండి. ఎక్కడివి ఇవన్నీ? " అడిగాడు. తిరిగి పరుపుమీద కూర్చుని యాపిల్ ముక్క తీసుకుంటూ.

"అదే మరి వేణంటే ఏంటనుకున్నావు? " గర్వంగా అన్నాడు వేణు.

"సంతోషించాంలే. ఇంతకీ ఏంటి కథ ఆ పిల్ల వెంట పడ్డావు? "

వేణు మాట్లాడలేదు. కేకు తింటూ ఉండిపోయాడు.

"మాట్లాడవేం? ఇంకా నువ్వు చదువుకోవాల్సింది చాలా ఉంది. అప్పుడే ఇలా ప్రేమ వలలో పడితే మీ అమ్మా, నాన్నల ఆశయం నెరవేర్చడం చాలా కష్టం".

వేణు నవ్వాడు. "ఏం ఫర్వాలేదు చక్రవర్తి. నాకులాగే అర్చన కూడ్ ఐ.ఏ.యస్ అవాలనుకుంటోంది. అంచేత ప్రేమించినంత మాత్రాన నేను నా ఆశయం మర్చిపోయి, పెళ్ళికోసం తపిస్తాననుకోకు. కానీ, ఎప్పటికైనా నేను పెళ్ళంటూ చేసుకుంటే అర్చననే. "

"కానీ, తన ప్రవర్తను చూస్తుంటే నీ పట్ల తనకలాంటి భావం ఏమీ ఉన్నట్టులేదే!? "

"కావచ్చు ఉండాలని నేను ఆశించను కూడా. కాకపోతే, చక్రవర్తి తెరిచి ఉన్న కవాటాల్లోంచి లోపలికి వెళ్ళడం చాలా ఈజీ కానీ, మూసి ఉన్న కవాటాలను తెరుచుకుని లోపలికెళ్ళడంలో ఒక విధమైన థ్రిల్లింగ్ ఉంటుంది తెలుసా. నేను అందగాడిని కాను. నాకు తెలుసు. అర్చన నన్ను ప్రేమిస్తుందని నాకు నమ్మకం కూడా లేదు. కానీ, పెళ్ళి మాత్రం నేను ఆమెనే చేసుకుంటా. నా ప్రేమతో ఆమె మనసు గెల్చుకుంటా తన కోసం ఎంతకాలమైనా ఎదురు చూస్తా. తన ఆశయం, నా ఆశయం నెరవేరడానికి నా శాయశక్తులా కృషిచేస్తా."

ఒక విధమైన ఆవేశంతో చెపుతున్న వేణు వైపు ఆసక్తిగా, ఆశ్చర్యంగా చూస్తూ ఉండిపోయాడు చక్రవర్తి.

వీడి ఆవేశం ఎంత వరకూ సక్సెస్ అవుతుంది? అనే ప్రశ్న అతని మెదడులో గిర్రున తిరుగుతుంటే ఆలోచిస్తూ ఉండిపోయాడు.

వేణు మాత్రం అర్చన గురించిన కలల్లో తేలిపోతూ కళ్ళు మూసుకున్నాడు.

●●●

**పరీక్షలు పూర్తవగానే హాయిగా** ఊపిరి పీల్చుకుంటూ పరీక్ష హాల్లోంచి బైటికి వచ్చారు అర్చనా, నీలిమా ఇంకా కొందరు అమ్మాయిలు, అబ్బాయిలు. వాళ్ళల్లో వేణు కూడా ఉన్నాడు. అర్చనని చూడగానే వికసించిన మొహంతో ఆమె దగ్గరకు వెళ్ళి "పరీక్షలు బాగా రాశావా అర్చనా నేను చాలా బాగా రాశాను. ఫస్ట్ క్లాస్ గ్యారంటీ" అన్నాడు.

అర్చనకి నవ్వొచ్చింది. "గుడ్ కంగ్రాచ్యులేషన్స్" అంది నవ్వుతూ.

"నువ్వెలా రాశావు. అఫ్‌కోర్స్ నాకన్నా బాగానే రాసి ఉంటావులే. నీకు యూనివర్శిటీ ఫస్ట్ వస్తుందని నాకు తెలుసు" అన్నాడు.

నీలిమ తమాషాగా కళ్ళెగరేసి "ఏంటోయ్ వేణూ. పెద్ద జ్యోతిష్యుడిలా మాట్లాడుతున్నావేంటి? అర్చనకేనా? నాకు రాకూడదా యూనివర్శిటీ ఫస్ట్" అంది రెచ్చగొడుతూ.

"అర్చనకి తప్ప ఇంకెవరికీ వచ్చే అవకాశం లేదులే నీలిమా" అన్నాడు. మొదటిసారిగా ధైర్యంగా, చనువుగా మాట్లాడుతూ. అర్చన చిత్రంగా చూసింది అతనివైపు. బెరుకు, బెరుగ్గా, ముడుచుకుపోతూ ఉండే వేణేనా అనిపించిందామెకి.

అర్చన చూపుల్లో భావం గమనించిన వాడిలా అన్నాడు వేణు." మనలో కొందరం ఈ ఏడాది నుంచీ విడిపోతాం. వేరు, వేరు ఆశయాలతో, అందరూ వారి వారి దారుల్లో నడిచివెళ్ళిపోతారు. ఇవాళైనా అందరం మనస్ఫూర్తిగా మాట్లాడుకోవాలి. అందుకే ధైర్యం కూడగట్టుకున్నాను. రండి క్యాంటిన్‌కి వెళ్ళి సెలబ్రేట్ చేసుకుందాం" అన్నాడు.

"ఛీ, ఛీ క్యాంటిన్ ఏంటి? మంచి హోటల్‌కి వెడదాం" అన్నాడు ఇంకో కుర్రాడు.

ఓ.కె అంటే ఓకే అనుకుంటూ పదిమంది బిలబిల్లడుతూ కాలేజీకి కొంచెం దూరంలో ఉన్న హోటల్‌కి వెళ్ళారు. వేణు నెమ్మదిగా అర్చన పక్కకి చేరి, "అర్చనా నేను కొంచెం నీతో మాట్లాడాలి" అన్నాడు కొంచెం రహస్యంగా. అర్చన చిత్రంగా చూసింది.

"ప్లీజ్.." అభ్యర్ధనగా చూశాడు.

అర్చన ఏం మాట్లాడలేదు. అందరూ కట్‌లెట్స్ తిని, కాఫీలు తాగి బైటపడ్డారు. ఎవరి దారిన వాళ్ళు వాళ్ళ వాళ్ళ వెహికల్స్ మీద బై చెప్పేసి వెళ్ళిపోయారు. నీలిమ బండి మీద లిఫ్ట్ కోసం ఎదురుచూస్తూ నిలబడింది.

అర్చన మౌనంగా కూర్చున్న వేణుని చూస్తూ అంది. ''రా వేణూ. అలా స్కూటర్ పార్క్ చేసిన దగ్గరకు వెడుతూ మాట్లాడుకుందాం'' అంటూ పార్కింగ్ ప్లేస్ వైపు నడిచింది.

''చెప్పు వేణూ. ఏంటి ఏదో మాట్లాడాలన్నావు.''

వేణు పక్కనే ఉన్న ఒక స్కూటర్ మీద పడిన వేపచెట్టు ఆకుల్ని దులుపుతూ మౌనంగా ఉండిపోయాడు. అర్చన కొన్ని క్షణాలు అతని సమాధానం కోసం ఎదురు చూసి అంది. ''ఆ స్కూటర్ ఎవరిదో వాళ్ళు క్లీన్ చేసుకుంటారులే నువ్వెందుకు ఇబ్బంది పడుతున్నావు. నాతో ఏం మాట్లాడాలనుకున్నావో చెప్పు ముందు. నాకోసం నీలిమ ఎదురుచూస్తోంది. ''

వేణు ఆమె మాటల్లోని హాస్యానికి కొద్దిగా నవ్వాడు అతని గుండెల్లో దడగా ఉంది. సినిమాల్లోలాగానో, కథల్లోలాగానో నిన్ను ప్రేమిస్తున్నా అర్చనా నువ్వు లేకుండా బతకలేను అంటూ ఏవో ప్రేమకబుర్లు చెప్పే చాతుర్యం అతనిలో లేదు. మనసులో ఉన్నది రెండే ముక్కల్లో నిక్కచ్చిగా చెప్పాలనుంది. కానీ, తను చెప్పాక అర్చన రియాక్షన్ ఎలావుంటుందో ఊహించాలంటే భయంగా ఉంది. అలాగని ఆమెకి భయపడి తను చెప్పదల్చుకున్నది చెప్పకుండా ఉండలేడు. అర్చన కొంచెం అసహనంగా కదిలింది. తలవంచుకుని ఆమె పాదాలవైపు చూస్తున్న వేణు కొంచెం ధైర్యంగా, నెమ్మదిగా అన్నాడు.

''అర్చనా నువ్వంటే నాకు చాలా ఇష్టం. జీవితంలో పెళ్ళంటూ చేసుకుంటే నిన్నే చేసుకుంటా. నువ్వు ఐ.ఏ.యస్ అవాలనుకున్నావు కాబట్టి నీ ఆశయం నెరవేరడానికి నా శాయశక్తులా కృషిచేస్తా. నా సహకారం అందిస్తా. కానీ, కానీ నువ్వు మాత్రం మరొకర్ని పెళ్ళాడొద్దు ప్లీజ్''

అర్చన సీరియస్‌గా చూస్తూ అంది. ''ఎవరిని పెళ్ళాడాలో, అసలు పెళ్ళాడాలో వద్దో నిర్ణయించుకోవాల్సింది నేను. ఇకపోతే ఐ.పి.యస్, ఐ.ఏ.ఎస్ అవడానికి నీ సహకారం నాకేం అవసరంలేదు. నీలాగే ఈ రొటీన్ డైలాగ్ చాలామంది చెప్పారు. అందర్నీ నేను పెళ్ళాడలేను కాబట్టి నిన్నుకూడా పెళ్ళాడలేను. ఈ ఆలోచన మానేసి, హాయిగా చదువుకుని, వృద్ధిలోకి రా. గుడ్‌లక్ బై'' చరచరా వెళ్ళిపోతున్న అర్చనని దిగ్భ్రాంతిగా చూస్తూ శిలలా నిలబడిపోయాడు వేణు.

తనకోసం ఎదురుచూస్తూ తన వెహికల్ దగ్గర నిలబడిన నీలిమ దగ్గరకు వెళ్ళి, బండి స్టార్ట్ చేసి, ఒక్కసారి నిరసనగా వేణు వైపు చూసింది అర్చన. ఆ చూపు పదునైన చాకులా సూటిగా వేణు గుండెల్లోకి దూసుకెళ్ళింది.

నువ్వు కూడా నన్ను ప్రేమించే మగాడివా అన్నట్టుంది ఆ చూపు.

నీ మొహానికి ప్రేమ ఒకటా అని పరిహాసించినట్టు ఉందా చూపు.

వెధవా నువ్వు నన్ను పెళ్ళాడతావా? ఎంత ధైర్యం నీకు ఆ మాట అనడానికి అన్నట్టుగా ఉందా చూపు.

వేణు అణువణువూ అవమానంతో దహిస్తున్నట్టు అనిపించింది. అయితే అప్పుడే అతని మనసులో ఒక బలమైన నిర్ణయానికి నాంది ఏర్పడింది. ''ఎలాగైనా నిన్ను నేనే పెళ్ళిచేసుకుంటాను అర్చనా. ఇది నా ఛాలెంజ్'' అనుకున్నాడు మనసులోనే. సన్నగా, తెల్లగా సున్నితంగా అనిపించే వేణు మనసు కూడా చాలా సున్నితం. కానీ, నిర్ణయం చాలా కఠినం. అతను ఒక్కడే కొడుకవడం వల్ల అతను కోరుకున్నదేదీ దక్కకుండా సాగలేదు జీవితంలో ఇప్పటిదాకా. అలాంటిది జీవితంలో అతి ముఖ్యమైన జీవితభాగస్వామి కోరుకున్న అమ్మాయికాక ఇంకోరు కావడానికి అతని మనసు అంగీకరించడం అసాధ్యం ఆ క్షణంలో ఆ నిర్ణయం తీసుకోడానికి అర్చన మాటలు బాగా దోహదం చేశాయి. నిశ్శబ్దంగా అక్కడి నుంచి వెళ్ళిపోయాడు.

వేసవి శెలవులు అయాక మళ్ళీ కలవదా? ఎక్కడికెళుతుంది తను? ఈ లోపల ఊరెళ్ళి అమ్మా, నాన్నలకి చెప్పాలి ఈ సంగతి అనుకున్నాడు. వేగంగా రూం వైపు కదిలాడు. అయితే ఊరికి వెళ్ళాడు కానీ, తల్లి తండ్రులతో తన ప్రేమ విషయం చెప్పే ధైర్యం చేయలేకపోయాడు. ఫలితంగా వేణు తమ ఆశలు నెరవేస్తాడన్న నమ్మకం వాళ్ళ మనసుల్లో ధ్రుఢంగా పడిపోయింది.

●●●

"వేణూ! నీకీ విషయం తెలుసా?" పరీక్షలయాక వేసవి శెలవుల్లో ఊరు వెళ్ళి వచ్చిన వేణుతో అన్నాడు చక్రవర్తి.

"ఏ విషయం?" స్నానానికి వెళ్ళబోతున్న వేణు ఆగిపోయి చక్రవర్తి మొహంలోకి ప్రశ్నార్థకంగా చూశాడు.

"అదే నీ డ్రీమ్ గర్ల్ అర్చన..." చక్రవర్తి స్వరంలో ఓ విధమైన వెటకారం ధ్వనించింది.

"ఏమైంది? అర్చనకేమైంది?" నొసలు చిట్లించి ఆతృతగా అడిగాడు వేణు.

"అర్చనని మన కాలేజీ రౌడీలు నాగరాజు వాడి స్నేహితులు అంతా కలిసి"

"ఊ కలిసి"

"అర్చనని కిడ్నాప్ చేసి, రాత్రంతా దాచేశారు" చక్రవర్తి అద్దంలో చూసుకుంటూ, గడ్డానికి సబ్బు రాసుకుంటూ నింపాదిగా చెప్పాడు.

"ఏంటి? నువ్వు చెప్పేది" వేణు చేతిలో టవల్ జారిపడింది. ఆపుకోలేని ఆవేశంతో అరిచాడు.

"అర్చనని రేప్ చేసారని విన్నాను"

"చక్రవర్తీ... "వేణు ఉద్రేకంగా చక్రవర్తిని తనవైపు తిప్పుకుని చొక్కాపట్టుకున్నాడు "నువ్వు నువ్వు చెప్పేది నిజమేనా?"

"నా మీద నమ్మకం లేకపోతే మన ఫ్రెండ్స్‌ని ఎవరినన్నా అడుగు" చొక్కా విడిపించుకుంటూ అన్నాడు చక్రవర్తి.

వేణు చక్రవర్తి చొక్కా వదిలేశాడు. అర్చనని రేప్ చేశారా? ఒక్కసారిగా సర్వనాడులూ శక్తిహీనమై పడినట్టనిపించింది. నో అలా జరక్కూడదు. అర్చనని అంత దారుణంగా రేప్ చేసే ధైర్యం ఎవరికుంది? అర్చన అలా మోసపోదు. ఆ అవకాశమే లేదు. అలా జరగదు. జరక్కూడదు.

చక్రవర్తి చెపుతున్నాడు. "వాళ్ళు టీకి రమ్మన్నారుట. వాళ్ళల్లో ఎవరిదో పుట్టినరోజు అని పిల్చారుట. ఈవిడగారు చాలా అడ్వాన్స్‌డ్ బ్రాడ్ మైండెడ్ కద వెళ్ళింది. కాఫీలో మత్తుమందు కలిపి ఇచ్చి, ఎత్తుకెళ్ళారు. తెల్లారాక ఆమెని వాళ్ళింట్లో దింపి మరీ వెళ్ళారుట."

"చక్రవర్తీ ప్లీజ్" చెవులు రెండూ మూసుకుంటూ ప్రాధేయపూర్వకంగా అన్నాడు" దయచేసి చెప్పకు నేను వినలేను నా వల్లకాదు"

నిజంగానే వేణు గుండెల్లో బాంబులు పేలుస్తున్నట్టుగా ఉంది చక్రవర్తి అలా చెపుతోంటే అర్చన అమాయకురాలు. తను చాలా తెలివైందాన్ని అనుకుంటుంది. కానీ, అందర్నీ నమ్ముతుంది. ప్రతివాళ్ళకీ తనేదో చాలా తెలివైనదానిలా నీతి సూక్తులు చెబుతూ ఉంటుంది. అవి విన్నవాళ్ళు కొందరు ఆమె వెనకాల నవ్వుకోవడం తనకి తెలుసు. ఎన్నోసార్లు ఆమెకి చెప్పాలనుకున్నాడు అందర్నీ నమ్మద్దని ఎవరు పిలిస్తే వాళ్ళతో ఎక్కడికీ వెళ్ళద్దని అందరితో మాట్లాడద్దని కానీ, ఆమె తనని అపార్థం చేసుకుంటుందని ఊరుకున్నాడు. అసలే అంతకు ముందు ప్రేమలేఖ రాసి చులకన అయాడు. ఇలా చెపితే ఎలా స్వీకరిస్తుందో అని భయపడి చెప్పలేదు. అలాంటిది అలాంటిది ఇంత దారుణం. అర్చన తన ప్రేమని తిరస్కరించినా, తనని అవమానించినా తను ఆమెని ప్రేమిస్తున్నాడు. ప్రేమిస్తూనే ఉంటాడు.

వేణు ఇంక ఆలోచించదల్చుకోలేదు. ముందు అర్చన ఎలా ఉందో ఒక్కసారి చూడాలి. గబ, గబా స్నానానికి వెళ్ళిపోయాడు.

త్వర, త్వరగా స్నానం ముగించి, నలిగిన బట్టలతోటే బైటికి వచ్చాడు. ముందు ఎటు వెళ్ళాలో అర్థంకాలేదు. అర్చన ఇంటికి నేరుగా వెళ్ళేకన్నా, కాలేజీకి వెళితే ఇంకా ఏమన్నా వివరాలు తెలుస్తాయని ముందుగా కాలేజీకి బయలుదేరాడు. చక్రవర్తి ఎక్కడికి అని వెనకాల అడుగుతున్నా వినిపించుకోలేదు.

అతను కాలేజీకి వెళ్ళేటప్పటికి స్టూడెంట్స్ గుంపులు, గుంపులుగా నిలబడి మాట్లాడుకుంటున్నారు. అందరి మొహాల్లో ఆనందం, ఆందోళన, ఏదో హడావుడి కనిపిస్తోంది. వాళ్ళందరినీ అలా చూడగానే వేణు గుండెల్లో రైళ్ళు పరిగెత్తినట్టుగా అనిపించింది. ఏం జరిగిందో

అనుకుంటూ లోపలికి నడిచాడు. అతడిని చూస్తూనే వేణుకి సన్నిహితులైన మిత్రులు కొందరు గబగబా అతని దగ్గరకు వచ్చి, చేయి అందుకుని గట్టిగా ఊగుతూ "వేణూ కంగ్రాట్స్" అని అరిచారు.

ఎందుకు? అయోమయంగా చూశాడు వేణు.

"రిజల్ట్స్ వచ్చాయిగా చూసుకోలేదా? ఫస్ట్ క్లాస్ వచ్చింది నీకు"

వేణు మొహంలోకి సర్రుమని దూసుకొచ్చిందో క్షణం ఆనందం. ఒక స్టూడెంట్ చేతిలో ఉన్న న్యూస్‌పేపర్ లాక్కున్నాడు. జేబులోంచి పాకెట్ సైజ్ డైరీ తీసి ఏదో నంబరు కోసం వెతికాడు.

"ఏంరా మా మాటలమీద నమ్మకం లేదా? డైరీ తీశావు"

"కాదురా వాడి నెంబరు కోసం కాదు. ఇంకెవరో ఆత్మీయుల నెంబరు కోసం చూస్తున్నట్టున్నాడు" ఇలా అందరూ తలోమాట అంటుండగానే వేణు తనకి కావలసిన నెంబరు వెతికి, డైరీ జేబులో పెట్టుకుని, పేపర్‌లో ఆ నెంబరు కోసం చూశాడు. కొన్ని క్షణాల్లో అతని మొహంలో కాంతి నిండింది.

వేణు మొహంలో ప్రతిఫలిస్తున్న ఆనందం చూసిన ఒక స్టూడెంట్ అడిగాడు. "ఏంటిరా అంత ఆనందం? ఎవరి నెంబరు? అర్చనదేనా?"

వేణు నవ్వుతూ అన్నాడు "అవును అర్చన కూడా ఫస్ట్ క్లాస్‌లో పాసైంది"

"లాభమేముంది? అర్చన పాసైనా ఒకటే, ఫెయిల్ అయినా ఒకటే"

"లైఫ్‌లోనే ఘోరంగా ఫెయిల్ అయింది. పరీక్షదేం ఉంది?"

"ఇంక ఆమెకి భవిష్యత్తు లేదులే వేస్ట్"

వేణు రక్తం కుతకుత ఉడికింది. మొహంలో ఆనందం ఆవిరిలా మారింది. కళ్ళు చింతనిప్పుల్లా అయాయి.

"ఏం? ఏమైంది? అర్చనకేమయింది?" ప్రాణాలు ఉగ్గబట్టుకుని అడిగాడు.

"నీకు తెలీదా? చెడిపోయింది"

షటప్ తీవ్రంగా అరిచాడు వేణు.

"నిజం చెపితే అంత కోపం దేనికిరా? నిజంగానే ఆమె చెడిపోయింది. గ్యాంగ్ రేప్ చేశారు నాగరాజు అండ్ పార్టీ"

వేణు కోపం దుఃఖంలా మారింది. వణికే స్వరంతో అన్నాడు. "ఏ.. ఎందుకురా? తను వాళ్ళకేం అపకారం చేసింది? ఎందుకు చేశారలా? ఎప్పుడు జరిగింది? ప్లీజ్ చెప్పండిరా అర్చన ఇప్పుడెలాఉంది?" ఒక కుర్రాడి షర్టు కాలర్ పట్టుకుని గట్టిగా ఊపుతూ ఆవేశంగా అడిగాడు.

అతను షర్టు విడిపించుకుని సర్దుకుంటూ "నాగరాజుగాడు లవ్ లెటర్ రాశాట్ట. అర్చన మామూలుగానే వాడి మొహం మీద కూడా ఆ లెటర్ చింపి, ఆ ముక్కలు విసిరేసి, అద్దంలో మొహం చూసుకున్నావా ఎప్పుడన్నా? నీ మొహం నాకు లవ్ లెటర్ రాయమని చెప్పిందా? ఒళ్ళు దగ్గరపెట్టుకుని మసులుకో అంటూ తిట్టివెళ్ళిపోయిందిట. వాడు ఆ దెబ్బతో తనమీద పగపట్టాడు"

"పగా! పగబట్టి ఒక ఆడపిల్ల జీవితం నాశనం చేశాడా? వాడ్ని వాడ్ని ఎక్కడున్నాడు వాడు?"

"ఏం చేస్తావు? వాడి తండ్రి పొలిటికల్ లీడర్. పైగా రూలింగ్ పార్టీ. వాడితో తగవు పెట్టుకోగలవని నమ్మకం నీకుందా?"

"ఏం? పొలిటికల్ అయితే ఆడపిల్లల జీవితం నాశనం చేయడానికి వాడికి లైసెన్స్ ఇచ్చారా?"

"అదికాదులే గానీ, వాడు మళ్ళీ అర్చనకి సారీ చెప్పాట్ట."

"సారీనా అర్చన క్షమించిందా?"

"తెలియదు. క్షమించిందో, ఆమె కూడా వాడి మీద పట్టి డిప్లొమటిక్‌గా వాడి అంతం చూడాలనుకుందో కానీ వాడు వెళ్ళి - సారీ అర్చనా ఇవాళ్టినుంచి మనం బ్రదర్స్ అండ్ సిస్టర్‌లా ఉందాం. మన అనుబంధానికి గుర్తుగా టీ పార్టీ చేసుకుందాం- అంటూ హోటల్‌కి ఆహ్వానించాట్ట"

"అలాగా అర్చన వెళ్ళిందా?"

"వెళ్ళింది. ఎందుకు వెళ్ళాలి? తప్పు ఆమెదే కదా పైగా ఒక్కతే వెళ్ళింది. వాడు రోగ్ అని తెలిసి కూడా వెళ్ళింది. వాడు కాఫీలో మత్తు మందు కలిపిచ్చి"

వేణు చెవులు మూసుకుంటూ అన్నాడు "పార్టీ ఎక్కడిచ్చాడు?"

"తెలియదు"

వేణు పళ్ళు పట, పట నూరుకున్నాడు. రాస్కెల్ వాడి అంతు చూస్తాను.

"నువ్వేం చూడక్కర్లేదు. ఆవిడగారు కోర్టెక్కింది"

"ఏంటి? అర్చన కేసు పెట్టిందా? " ఆశ్చర్యంగా అడిగాడు వేణు.

"అవును. వాడ్ని జైలు పాళ్ళు చేసిందాకా నిద్రపోనని పంతం పట్టిందిట"

వేణు మొహంలో ఆశ్చర్యం ఆనందంగా మారింది. "మంచిపని చేసింది. వాడిని నగరం నడిమధ్యలో ఉరితీయించాలి. అలా చేస్తేగానీ మరెవరూ ఇలాంటి పని చేయరు" అంటూ అక్కడినుంచి వేగంగా ముందుకు నడిచాడు. అతని స్నేహితులంతా "వేణూ ఎక్కడికి? " ఆగు అని పిలుస్తున్నా వినిపించుకోకుండా గేటుదాటుతుండగా, అప్పుడే గేట్లోకి వస్తున్న విక్రాంత్ "వేణూ కంగ్రాట్స్" అంటూ అతని పక్కన బండి ఆపాడు.

వేణు బలవంతంగా నవ్వి, "థాంక్యూ" అంటూ వెళ్ళబోతుంటే వేణు భుజం పట్టి ఆపుతూ అడిగాడు విక్రాంత్. "ఏంటిరా? అలా ఉన్నావేం? ఎవరిమీదో కోపంగా ఉన్నట్టున్నావు. "

"లేదు అదేం లేదు. అర్జంటు పని ఉంది"

"అరే నేను పాసయానురా నాకు కంగ్రాట్స్ చెప్పవా?"

"సారీరా.. వెరీ సారీ. ఎనీవే కంగ్రాచ్యులేషన్స్"

"థాంక్యూ. చెప్పు ఇంతకీ ఏం జరిగింది? వాళ్ళ మీద కోపంగా వస్తున్నావు ఎవరేమన్నారు?"

"ఏంలేదురా ఏం లేదు. "

"నాకు తెలుసులే అర్చన గురించేనా నీ బాధ"

"అ.. అర్చన.. నీకూ తెలుసా?"

"నాకేంటి? మొత్తం యూనివర్సిటీకి తెలుసు. షి బికేమ్ ఎ పబ్లిక్ ఫిగర్"

వేణుకి ఏడుపొచ్చినంత పనైంది. రుద్ధమైన కంఠంతో అన్నాడు. "ఎవ్రరా? ఎందుకు చేశార్రా అలా? నా అర్చన ఎవరికేం అపకారం చేసింది?"

"అయినా ఆమెది కూడా తప్పే తనో పెద్ద వీరనారీమణి ననుకుంటుంది. తనేదో పెద్ద అసాధారణ యువతిననుకుంటుంది. వాళ్ళు కాఫీకి పిలవగానే వెళ్ళడమేనా? పోనీ వెళ్ళితే వెళ్ళింది. ఎప్పుడూ తోకలా తిప్పుకునే అమలని కూడా తీసికెళ్ళకుండా ఒక్కతే వెళ్ళింది. వాడు వెధవని తెలుసుకదా ఏదో ఉద్ధరించేశానని, తను క్లాసు పీకగానే వాడేదో మారిపోయి మహోత్తముడైపోయాడని నమ్మింది. ఏం జరిగింది? అందుకే ఆడవాళ్ళకంత ధైర్యం పనికిరాదనేది"

"విక్రాంత్ ప్లీజ్ స్టాపిట్" వేణు దవడలు బిగుసుకున్నాయి.

"మీరంతా తనకి మోరల్ సపోర్ట్ ఇచ్చి ధైర్యం చెప్పాల్సింది పోయి, ఇలా చిత్రహింస పెట్టారా?"

"బాగుంది మనకేం అవసరం? వాళ్ళూ వాళ్ళు చూసుకుంటారు. ఆమె వెంటనే వెళ్ళి పోలీస్ స్టేషన్‌లో ఎఫ్.ఐ.ఆర్ ఫైల్ చేసింది. కేసు ఇప్పుడు కోర్టులో ఉంది"

"వాళ్ళని అరెస్టు చేశారా లేదా?"

"చేశారు జామీను మీద వాళ్ళ వాళ్ళు విడిపించుకుని వెళ్ళారు."

"ఎలా? ఎలా జామీను ఇస్తార్రా అలాంటి వాళ్ళకి?" ఆవేశంగా అడిగాడు వేణు.

"ఇది ఇండియా బాబూ ఇక్కడ అన్నీ సాధ్యాలే. "

"నాన్సెన్స్" కసిగా అన్నాడు. అతని రక్తం మరుగుతున్నట్టుగా అనిపించింది. జామీను మీద విడిపించారా? అసలు అవతలివాడు నేరం చేశాడని, ఆ విక్టిమ్ వెళ్ళి చెప్పగానే వాడికి శిక్షవేయాల్సిందిపోయి, ఎందుకు తాత్సారం చేస్తున్నట్టు

"ఏంటిరా? అంత సీరియస్‌గా ఆలోచిస్తున్నావేంటి?" విక్రాంత్ వేణు భుజం తట్టాడు.

వేణు ఏం మాట్లాడకుండా కొద్దిసేపలాగే ఆలోచిస్తూ ఉండిపోయాడు. తరవాత సన్నగా నిట్టూరుస్తూ "సరే నువ్వెళ్ళు నేను అర్జంటుగా వెళ్ళి అర్చనని చూడాలి" అన్నాడు.

"నీకేం పిచ్చా? ఇంకా దానిమీద ప్రేమేనా? చెడిపోయిందిరా"

షటప్ గట్టిగా అరిచాడు వేణు. విక్రాంత్ అయోమయంగా చూశాడా అరుపుకి.

వేణు తమాయించుకుంటూ అన్నాడు. "విక్రాంత్ తప్పు. అలా ఎప్పుడూ మాట్లాడకూడదు. ఇదే మన అక్కలకో, చెల్లెళ్ళకో జరిగితే ఇలాగే అంటామా?"

విక్రాంత్ మొహం జేవురించింది. "ఛ, ఛ మా అక్కలు, చెల్లెళ్ళు ఇలా అర్చనలాగా బరితెగించి తిరగరు. అలా జరగదు కూడా." అంటూ బండి స్టార్ట్ చేసి, గేటులోపలికి పోనిచ్చాడు.

వేణుకి పట్టరాని కోపం వచ్చింది. కానీ, ఏమనలేకపోయాడు. పాపం అర్చన ఎంతమందితో ఎలాంటి మాటలు పడాల్సి వచ్చింది అనుకుంటూ బాధగా రోడ్డు మీదకి నడిచి, కాస్సేపు రోడ్డు మీదే అస్థిమితంగా తిరిగాడు. కొంచెం సేపు తరువాత ఒక నిర్ణయానికి వచ్చినట్టుగా గబ,గబా ముందుకు నడిచి ఖాళీగా వెళ్తోన్న ఆటో పిల్చాడు. యానివర్శరీ రోజున అర్చన బండి వెనకాల, ఆమెని అనుసరిస్తూ వెళ్ళిన దారి గుర్తుకు తెచ్చుకుంటూ ఆటోవాడికి ఎక్కడికి వెళ్ళాలో చెప్పి, ఆటో ఎక్కాడు. మరో రెండు నిమిషాల్లో వేణు కూర్చున్న ఆటో అర్చన ఇంటివైపుగా కదిలింది.

తన గదిలో కిటికీ దగ్గర కూర్చుని బైటకు చూస్తూ తీవ్రంగా ఆలోచిస్తోంది. అందమైన అర్చన, చలాకీగా మొత్తం కాలేజీని ఒక్కటిచేసే అర్చన, ఎందరికో ఆరాధ్యదేవత అర్చన శోకమూర్తిలా కూర్చుంది. ఆమె ఆత్మవిశ్వాసం మీద పెద్ద దెబ్బ తగిలింది. ఆ దెబ్బ ఆమె గుండెని ముక్కలు చేసింది. ఆ దెబ్బ ఆమె భవిష్యత్తుని నిలువునా కూల్చేసింది. ఆమె ఆశలు, ఆశయాలు, కోరికలు, అన్నీ ఆ ఒక్క సంఘటనతో విచ్ఛిన్నం చేయబడ్డాయి. సంప్రదాయాలకు, పరువు మర్యాదలకు అత్యంత విలువనిచ్చే సావిత్రమ్మ, ఆనందరావులు అర్చనని గుమ్మం కదలనివ్వడంలేదు.

జరిగింది నిజానికి ఏమీ లేదు. కానీ, జరక్కూడనిది జరిగిందన్నట్టుగా వాళ్ళు బాధపడుతూ తననీ బాధపెడుతున్న తల్లి, తండ్రుల ఉద్దేశం ఏమిటో, తన భవిష్యత్తుని ఎలా నిర్ణయించబోతున్నారో అర్చనకి అర్థం కావడంలేదు. నాగరాజు చెరనుంచి బైట పడిన మరుక్షణం నుంచి తనకి ఇల్లు ఒక జైలు అయిపోయింది. దెబ్బలాడి, అరిచి వెళ్ళి పోలీస్ స్టేషన్‌లో కంప్లైంట్ చేసింది. కంప్లైంట్ రికార్డు చేసుకుని,

ఎ.ఫ్.ఐ.ఆర్ రాసుకుని కూడా నాగరాజుని పోలీసులు ఏమీ చేయలేకపోయారు. కనీసం తను మళ్ళీ వెళ్ళి ఏం జరిగిందని కూడా అడిగే అవకాశం లేకుండా తన చుట్టూ కంచె కట్టేశారు. ఎవరూ రావడంలేదు. తానెక్కడికీ వెళ్ళడం లేదు. ఏం చేయలో, ఎలా చేయాలో ఆమెకేం అర్ధం కావడంలేదు.

తన చుట్టూ చేరి అర్చనా అర్చనా అని పిలిచే స్నేహితులంతా తనని వెలివేశారు. చెల్లెలి తెలివితేటలు, చలాకీతనం భరించలేని అన్నగారు కిరణ్ ఇప్పుడు చాలా ఆనందంగా ఉన్నాడు. కిరణ్‌కి చదవబ్బలేదు. అతి కష్టం మీద బికాం పూర్తి చేసి, రియల్ ఎస్టేట్ బిజినెస్‌తో కుస్తీపడుతూ, లేస్తూ సరిగా నిలబడలేని కిరణ్‌కి ఇప్పుడు చెల్లెలికి జరిగిన ఒక అవమానం ఆనందం కలగచేస్తోంది. ఆ అవమానంతో ఆమె తనకన్నా పైకి ఎదిగే అవకాశం కోల్పోయిందన్న ఆనందం అతడిని నిలవనివ్వడంలేదు. అవకాశం దొరికినప్పుడల్లా ఆడదానికి అంత ధైర్యం పనికిరాదు. నీ ధైర్యమే నిన్ను మోసం చేసింది చూశావా? ఏం జరిగినా జరక్కున్నా పరాయిమగాడి చెరలో రెండు రోజులుండి వచ్చిన నీకు ఈ సమాజంలో ఎలాంటి గౌరవం ఉంటుందో అర్ధం అయిందా? అంటూ ప్రతిక్షణం దెప్పిపొడుస్తూనే ఉన్నాడు.

ఇప్పటికి ఇంట్లో నాలుగుగోడల మధ్యనే ఉండి పదిరోజులైంది. ఇవాళో, రేపో రిజల్ట్స్ రావాలి తప్పకుండా తనకి ఫస్ట్‌క్లాస్ వస్తుంది. పి.జికి అప్లై చెయ్యాలి. పిజి అయ్యాక, అయ్యాక కాదు ఈ లోపలే సివిల్స్‌కి ప్రిపేర్ అవాలి. ఐ.ఏ.ఎస్ అవాలి అయి తీరాలి. అర్చన కిటికీలోంచి పెరట్లోకి చూసింది. తన చేతుల మీదుగా నాటబడి, ఏపుగా ఎదిగి కాపుకి సిద్ధంగా ఉన్న మావిడిచెట్టు, నిండుగా కాయలతో బరువుగా వంగిన జామ చెట్టు కొమ్మలు, గాలికి సుతారంగా కదులుతున్న గులాబీలు, చామంతులు, కనకాంబరాలు నేలమీద పరిమళాల పానుపు వేస్తున్న పారిజాతం. తన భవిష్యత్తు ఈ తోటలా కళకళ్ళాడుతుందా? దుఃఖం ఎగదన్నుకు వచ్చింది.

మళ్ళీ తనను తానే మందలించుకుంది. ఎందుకేడవాలి? ఎవడో వాడి అహాన్ని సంతృప్తి పరుచుకోడానికి తనని కిడ్నాప్ చేసి నవ్వులపాలు చేసినందుకు వాడి మీద పగ తీర్చుకోవాలి. అదే తన స్వభావం. ఏడుస్తూ కూర్చోడానికి తాను ఒక మామూలు అమ్మాయి కాదు. కానీ, ఇదేంటి అమ్మా, నాన్నా నన్నిలా చెరసాల పాలు చేశారు. ఎలా? ఎలా ఇక్కడినుంచి బైటపడాలి? వీళ్ళకి ఎలా నచ్చచెప్పాలి? తనకేం జరగలేదని, ఏం చేయలేక ఇలా పగతీర్చుకున్నాడా వెధవ అని చెప్పి ఎలా ఒప్పించాలి?

మాట మాట్లాడుతుండగానే, "తల్లీ నీకు కోటి నమస్కారాలు. మమ్మల్నిట్లా బతకనీ" అంటూ పెద్ద శబ్దంతో నమస్కారం పెడుతూ అమ్మ నోరే ఎత్తనివ్వడంలేదు. అర్చనకి పిచ్చెక్కిపోతోంది. ఏదన్నా జరగాలి. ఇంతకాలం తన నోట్స్‌కోసం, తన స్నేహం కోసం నీడలా అంటిపెట్టుకు తిరిగిన నీలిమకి ఏమైంది? పక్కనే ఉంటూ కూడా ఒక్కసారి కూడా వచ్చి పలకరించలేదు. "నీకేం కాలేదు అర్చనా ధైర్యంగా ఉండు" అంటూ ఓదార్చే ప్రయత్నం చేయలేదు. ఇదేనా స్నేహనికున్న విలువ. నీలిమ తండ్రి చాలా నారో మైండెడ్ నీలిమని తన ఇంటివైపు కూడా రానివ్వడంలేదేమో. అయితే దాని వ్యక్తిత్వం ఏమైంది? దానికి తెలియదా ఈ అర్చన సంగతి. ఆ నాగరాజుగాడి సంగతి కూడా తెలుసు. వాడి ప్రేమ కాదన్నందుకేగా వాడు పగపట్టాడు. ఛీ అయినా ఆ నాగరాజుని ఏ అమ్మాయి అయినా ఎలా ప్రేమించగలదు? వాడికి చదువు లేదు, సంస్కారం అసలే లేదు. జులాయి డబ్బుందని అహంకారం. సిగరెట్టు కంపుకొడుతూ వాడు నడిచి వస్తుంటే పెద్ద సిగరెట్ పాకెట్ నడిచి వస్తున్నట్టే అనిపించేది. పక్కనుంచి వెళుతుంటే వాసన సిగరెట్టు, మందువాసన వాడు కోరుకున్న ఆడపిల్ల వాడి ఒళ్ళో వాలాలి. అర్చన పళ్ళు పట, పటలాడాయి. ఆడపిల్లంటే ఎంత చులకన? పోవాలి ఈ చులకన భావం పోవాలి. ఆడదంటే ఏంటో, ఏం చేయగలదో నిరూపించాలి. అర్చనలో ఆవేశం కట్టలు తెంచుకుంటోంది. కానీ, కానీ ఎలా? ఇక్కడ నుంచి బైటపడితే చాలు. కనీసం అమల కూడా ఇంటికి రావడం లేదు. ఎంత కఠినం వాళ్ళ మనసులు. ఎంతైనా తల్లి, తండ్రుల చాటు పిల్లలు. పోనీలే నిట్టూర్చింది.

●●●

గేటు శబ్దం "నమస్కారమండీ" అనే స్వరం వినిపించి, అర్చన గదిలోంచి బైటికి వచ్చింది. హాల్లోంచి వాకిట్లోకి తొంగిచూసింది.

"ఎవరు బాబూ నువ్వు? "

"నే ..నేను అర్చన క్లాస్ మేట్‌ని"

ఆనందరావు స్వరంలో ఆవేశం. "ఏం పని నీకు? ఎందుకొచ్చావు? "

తడబడుతున్న స్వరంతో వేణు "అదీ నేను అర్చన ఫస్ట్ క్లాసులో పాసైంది చెప్పి వెళ్దామని వచ్చాను. "

"ఓ అలాగా మంచిది థాంక్స్ చెప్పావుగా" గంభీరంగా అన్నాడాయన.

"ఒక్కసారి తనని కలవవచ్చా? "

అర్చన వేణు స్వరం గుర్తించింది. గుమ్మం దగ్గరకు వచ్చింది. వేణు వైపు ఆశ్చర్యంగా చూసింది. ఆమెని చూడగానే అతనికి ధైర్యం వచ్చింది. "హలో అర్చనా నువ్వు ఫస్ట్ క్లాసులో పాసయావు కంగ్రాట్స్" అన్నాడు.

అర్చన గంభీరంగా "థాంక్యూ" అంది.

వేణు వికసించిన మొహంతో ఆనందరావు వైపు చూశాడు.

అది గమనించిన అర్చన తండ్రితో అంది "నాన్నా వేణు.. నా స్నేహితుడు నా శ్రేయోభిలాషి"

ఆయన ఒక్కసారి వేణుని ఎగాదిగా చూసి, సన్నగా నిట్టూర్చి వెళ్ళు అన్నట్టు చేత్తో సైగ చేశాడు.

వేణు ఆయన వైపు కృతజ్ఞతగా చూసి లోపలికి వెళ్ళాడు. అర్చన తన గదిలోకి దారితీసింది. ఆమెని అనుసరించాడు వేణు. ఆమె క్లాస్ పుస్తకాలు రెండు అరల్లో ఒక అరలో ఇంగ్లీషు, తెలుగు నవలలు - ఉన్నాయి. ఆ రాక్ మీద చిన్న టూ ఇన్ వన్ ఉంది. పక్కనే ఒక టేబిల్, దానిమీద టేబుల్ లైట్. రెండు గాద్రెజ్ కుర్చీలు మంచానికి వెనకవైపు కిటికీ ఉంది. దానికి దోమలు రాకుండా మెష్ అమర్చి ఉంది దోమతెర పైకి మడిచి ఉంది. మంచం మీద ఉన్న తలగడమీద ఏదో ఇంగ్లీషు పుస్తకం సగం చదివి మూసినట్టుగా, చదివినంతవరకూ పేజీలకి చిన్న కాగితం గుర్తుగా పెట్టి ఉంది.

నిశితంగా గదిని గమనిస్తూ నిల్చున్న వేణుకి కుర్చీ చూపించి "కూర్చో" అంది అర్చన.

వేణు కుర్చీలో కూర్చున్నాడు. అర్చన విరబోసుకున్న జుట్టు ముడివేసుకుంటూ మంచం మీద ఓ పక్కగా కూర్చుంది. కొద్ది క్షణాలు ఇద్దరి మధ్యా మౌనం రాజ్యం చేసింది.

అతనెందుకు వచ్చాడో ఊహించడానికి ప్రయత్నిస్తోంది అర్చన. వేణు పరీక్షలవగానే ఊరెళ్ళిపోయాడు. వెళ్ళేముందు తనని కలిశాడు. ఆ రోజు గుర్తొచ్చింది

ఆ రోజు వేణుని అలా అవమానించినందుకేనా తనకి భగవంతుడు ఇంతటి ఘోరమైన శిక్ష వేశాడు. అనిపించింది. కళ్ళల్లో నీళ్ళు తిరుగుతుంటే చప్పున కింద పడిన కాగితం తీసే నెపంతో ఒంగి చెంగుతో కళ్ళు తుడుచుకుని, సరిగా కూర్చుంది. పోనీ కనీసం ఇతనైనా వచ్చాడు. ప్రాణస్నేహితురాళ్ళనుకున్న వాళ్ళు తన మొహం కూడా చూడడంలేదు. వేణు ఏ ఉద్దేశంతో వచ్చినా ప్రస్తుతం అతని రాక ఆమెకి కొంచెం ఊరటని కలిగించింది. కాలేజీ సంగతులు తెలుసుకోవచ్చు అనుకుంది. తన రిజల్ట్స్ కూడా చూసుకోవాలన్నీ ధ్యాసలేదు. ఆ విషయమే మర్చిపోయింది. పాపం ప్రత్యేకంగా వచ్చి శుభవార్త వినిపించాడు.

"ఎలా ఉన్నావు వేణూ మీ పేరెంట్స్ బాగున్నారా?" అడిగింది మృదువుగా.

"ఆ అందరూ బాగున్నారు అర్చనా. నేను కూడా ఫస్ట్ క్లాస్‌లో పాసయాను."

"కంగ్రాట్స్ వేణూ"

"థాంక్యూ కొంచెం సేపు మళ్ళీ మౌనం"

"ఊరి నుంచి వస్తూనే జరిగిన దారుణం తెలిసింది అర్చనా! చాలా దారుణం" అన్నాడు బాధగా.

అర్చన మాట్లాడలేదు. పరామర్శించడానికి వచ్చాడన్నమాట.

వేణుకి ఆమె ఏదన్నా మాట్లాడితే బాగుండు అనిపించింది.

"నువ్వు వాళ్ళ మీద కేసు పెట్టడం మంచిదైంది. చాలా మంచిపని చేశావు. ఎంతవరకూ వచ్చింది?" మళ్ళీ అడిగాడు.

అర్చన నిట్టూర్చింది. "సాక్ష్యాలు కావాలిట. ఏం సాక్ష్యాలు చూపించాలి ఎఫ్.ఐ.ఆర్ ఫైల్ చేసి కూడా అతడినేమీ చేయలేకపోయారు. ఈ సమాజాన్ని రాజకీయం శాసిస్తోంది." ఆమె స్వరం కొద్దిగా వణికింది.

"అదికాదు అర్చనా అసలు వాడ్ని నమ్మి ఒక్కదానివే కాఫీకి ఎందుకెళ్ళావు? "

"కాఫీకా? కాఫీకి వెళ్ళడం ఏంటి? " అయోమయంగా.

"కాఫీకి ఆహ్వానించాట్టగా"

"ఓ గాడ్ అసలు విషయానికి చాలా రంగులు పూస్తున్నారనమాట. అది నిజం కాదు. సారీ చెప్పిన మాట నిజం. ఇప్పటినుంచీ నన్ను నీ బ్రదర్ అనుకో అనడం నిజం. కానీ, తన బర్త్‌డే అని నన్ను, నీలిమని మరో ఇద్దర్నీ కూడా వాళ్ళింటికి పార్టీకి పిలిచాడు. నేనూ నీలిమా బయలుదేరాం. దాదాపు వాళ్ళింటిదాకా వెళ్ళాక నీలిమకి ఏదో హెల్త్ ప్రాబ్లం వచ్చింది. తప్పనిసరి పరిస్థితుల్లో తను వెనక్కి వెళ్ళాల్సి వచ్చింది. అంత దూరం వెళ్ళాం కదా అని నేను జస్ట్ విష్ చేసి వెళ్ళిపోదాం అని వెళ్ళాను. కానీ, వాడు పెద్ద ప్లాన్ వేశాడని నాకు తెలియదు. తెలియక ఇరుక్కుపోయాను"

"అలాగా ఎంత దుర్మార్గం! కానీ, జనం వేరే అనుకుంటున్నారు. "

"ఇంకా ఏం అనుకుంటున్నారు? " సూటిగా అడిగింది.

"కోర్టులో ఉందిటగా కేసు.? "

"కోర్టా వాడిని కనీసం పోలీస్ స్టేషన్‌కి కూడా పిలవలేదు అంత గొప్పగా ఉంది మన లా అండ్ ఆర్డర్. నేను ఫరదర్‌గా ప్రొసీడ్ అవుదామంటే ఇదిగో ఇంట్లో ఇలా నన్ను ఖైదు చేశారు. "

"పోనీలే అర్చనా జరిగింది మర్చిపో పి.జికి అప్లై చెయ్యి. "

"మర్చిపోవాలా? " ఆవేశంగా అంది.

"అంటే నా ఉద్దేశం..."

"అంటే నా ఉద్దేశ్యాలతో పనిలేదు. నేనేం చేయదల్చుకున్నానో చేసి తీరతాను. వాడ్ని మాత్రం వదలను. సాక్ష్యాలు కావాలి కదా చూపిస్తాను. " పళ్ళబిగువున అంది.

వేణు ఆవేశంగా అన్నాడు. "అయినా ఇంకా ఏం సాక్ష్యాలు కావాలి? నిన్ను మెడికల్ టెస్టుకి పంపించలేదా?"

"మెడికల్ టెస్ట్‌కా? దేనికి" చిత్రంగా చూసింది.

వేణు తడబడుతూ అన్నాడు "అదే రేప్ జరిగినట్టుగా కన్‌ఫర్మ్"

"వాట్?" గట్టిగా అరిచింది అర్చన. "రేప్ జరిగిందని ఎవరు చెప్పారు?"

వేణు బిత్తరపోయి చూశాడు. "కా...కాలే"

అర్చన అరిచినట్టుగా అంది. "నాన్సెన్స్ మీరంతా చదువుకుంటున్నారా? గాడిదలు కాస్తున్నారా? చూడూ మళ్ళీ, మళ్ళీ చెబుతున్నా నన్ను ఎవరూ రేప్ చేయలేదు. ఓన్లీ కిడ్‌నాప్... కిడ్‌నాప్ చేశారు. అండర్ స్టాండ్"

లోపల్నించి సావిత్రి, వాకిట్లోంచి ఆనందరావు అర్చన అరుపుకి పరిగెత్తుకుంటూ వచ్చారు.

సావిత్రి తీవ్రంగా అంది "ఎందుకే ఎందుకలా అరుస్తావు? జరిగిన అల్లరి చాల్లేదా? ఎందుకే మా బతుకులు బజార్న పడేస్తావు?"

"అమ్మా! " తీవ్రంగా పిలిచింది అర్చన. "ఏంటి? నేనేదో అపరాధం చేసినట్టు మండిపడతావు? ఆ వెధవ ఒళ్ళు బలిసి, తనేదో పెద్ద లీడర్‌నని అందరూ తెలుసుకోవాలని కిడ్నాప్ చేశాడు. మోసంతో చేశాడు. వాడికి నన్ను రేప్ చేసే దమ్ముందా? ఒక్కరోజు వాడెక్కడో దాచేస్తే, అడ్డమైనవాళ్ళు నేను రేప్ చేయబడ్డానని వాగుతోంటే నోర్మూసుకుని ఊరుకోవాలా? నెవ్వర్"

"ఊరుకోక ఏం చేయగలం తల్లీ?" బాధగా అన్నాడు ఆనందరావు. ఆయనకి కూతురంటే ప్రాణం. కానీ సంప్రదాయాలన్నా ప్రాణమే. పరువు, ప్రతిష్టలంటే మరీ ప్రాణం. అందుకే ఏ ప్రాణం ఎలా నిలుపుకోవాలో అర్థంకాక నిస్సహాయంగా ఉండిపోయాడు.

ఆయన మనసులో ఆవేదన అర్థంకాని అర్చన మండిపడుతూ అంది. ఊరుకోను నడిరోడ్డుమీద నిలబడి అందర్నీ పిలిచి ఏం జరిగిందో, ఎందుకు అలా జరిగిందో చెపుతాను. అందరి నోళ్ళు మూయిస్తాను.

"ఉద్ధరించావు" గట్టిగా అరిచింది సావిత్రి "జరిగింది చాలు. వెంటనే ఈ ఊరినుంచి వెళ్ళిపోదాం. బాబూ నువ్వు పరామర్శించింది చాలు. ఇంక వెళ్ళు నాయనా. మమ్మల్నిలా బతకనీ" రెండు చేతులెత్తి నమస్కరిస్తూ అంది.

వేణు ఏదో చెప్పబోయి అది సమయం కాదని అర్థం చేసుకున్నాడు. మౌనంగా వెనక్కి తిరిగి "మీకేదన్నా సాయం కావాలంటే నేనున్నానండి. అర్చనకి పిజికి అప్లై చేయడానికి అప్లికేషన్ తెస్తాను. తనని చదివించండి" అన్నాడు ఆనందరావుతో నెమ్మదిగా.

ఆయనేం మాట్లాడలేదు.

అర్చన తీవ్రంగా అంది. "వేణూ చాలు నాకోసం నువ్వు చేసిన త్యాగాలు చాలు. ఇంక నీ దారిన నువ్వు వెళ్ళు నాకేం కావాలో, నేనేం చేయాలో నేను చేసుకోగలను. "

వేణు ఏదో చెప్పబోయాడు. కానీ, అది సమయం కాదనిపించింది. అర్చన కోపంగా ఉంది. ఆవేశంగా ఉంది. ఈ ఆవేశం తగ్గనీ అనుకుని "సరే అర్చనా వస్తాను. కానీ, నన్ను నమ్ము అయామ్ యువర్ వెల్ విషర్" అంటూ వేణు బైటికి వచ్చేశాడు. ఏమైనా తన పట్టు వదల్లేదు. ఈ పట్టు సడలితే అర్చనని దక్కించుకోడం అసాధ్యం అనుకున్నాడు. వెంటనే పీజికి రెండు అప్లికేషన్స్ తీసుకున్నాడు. ఒకటి తాను అప్లై చేసి, మరొకటి అర్చన దగ్గరకు తీసుకుని వెళ్ళాడు. అడపా, దడపా వెళుతూ ఆనందరావుని, సావిత్రిని మంచి చేసుకున్నాడు. వాళ్ళ ద్వారా అర్చనకి కావాల్సిన సాయం చేసి, ఆమె మనసులో ముందు స్నేహితుడిగా ఒక శ్రేయోభిలాషిగా స్థానం సంపాదించుకుంటే చాలనిపించింది. అందుకే ఈ దిశగా ప్రయత్నాలు ప్రారంభించాడు. అతని ప్రయత్నాలు కొంచెం విజయం వైపుగా సాగాయి.

అర్చన పి.జి.కి అప్లై చేసింది. వేణుతో పాటు ఆమె యూనివర్శిటీకి వెళ్ళడానికి ఆనందరావు అంగీకరించాడు.

వేణు సాయం తీసుకుని బైటికి వచ్చిన అర్చన హాయిగా ఊపిరి పీల్చుకుంది.

"నీ మేలు మర్చిపోను వేణూ. చాలా థాంక్స్. ఆ అప్లికేషన్ నాకిచ్చి నువ్వు వెళ్ళిపో. నేను ఒక్కదాన్నీ వెళ్ళగలను యూనివర్శిటీకి" అంది బండి తీసుకుని బైటకి రాగానే.

"ఒద్దు అర్చనా నేనూ వస్తాను. నన్ను నమ్మి మీ ఫాదర్ పంపించారు. నేనిలా మధ్యలో వదిలేసి వెళ్తే ఏదన్నా జరిగితే నా గురించి ఏం అనుకుంటారు? "

"నాన్సెన్స్" విసుక్కుంది. "పదే, పదే మోసపోడానికి నేనేం వెర్రిదానిలా కనిపిస్తున్నానా? ఐనో వాట్ టు డూ. వాట్ నాట్ టు డూ. "

"కానీ, అర్చనా .. "

"వేణూ ప్లీజ్ లీవ్ మీ అలోన్."

ఆమె స్వరంలోని శాసింపుకి వేణు ఏం మాట్లాడలేదు. సరే, అంటూ తన దారిన తాను వెళ్ళిపోయాడు. కానీ, ఆమెకి తెలియకుండా ఆమెని అనుసరించాడు. అర్చన యూనివర్శిటీ వైపు కాకుండా పోలీస్ స్టేషన్ వైపు వెళ్ళడం గమనించి, తానుకూడా అటే వెళ్ళాడు.

అర్చన నేరుగా స్టేషన్ లోపలికి వెళ్ళి ఇన్స్పెక్టర్‌తో దెబ్బలాడింది. నాగరాజుని ఎందుకు అరెస్ట్ చేయలేదని అతడిని బెదిరించింది. "అతను చాలా పవర్ ఫుల్ మేడమ్. అతని మీద యాక్షన్ తీసుకుంటే మా ఉద్యోగాలు ఊడతాయి. ప్లీజ్ జరిగింది మర్చిపోండి. కావాలంటే మీకు అతని నుంచి నష్టపరిహారం ఇప్పిస్తాం" అన్నాడు ఇన్స్పెక్టర్.

అర్చన మండి పడింది. "డబ్బుతో అన్నీ కొనచ్చు అని భ్రమ పడకండి. నాకు తెలుసు. అతనికి శిక్షపడేలా ఏం చేయాలో, ఎలా చేయాలో" అంటూ బైటికి వచ్చేసింది.

అక్కడినుంచి యూనివర్శిటీకి వెళ్ళింది. వేణు మాత్రం నేరుగా తన రూముకి వెళ్ళిపోయాడు.

చక్రవర్తి ఏవో అప్లికేషన్‌లు రాస్తున్నాడు.

"ఏంటిరా అవి? " అడిగాడు వేణు.

"బ్యాంక్ ఎగ్జామ్స్ రాస్తున్నాను. నా పెళ్ళి మాధవితో సెటిల్ అయింది" అన్నాడు చక్రవర్తి.

"బ్యాంక్ ఎగ్జామ్సా! "

"అవును పెళ్ళి చేసుకుంటున్నాగా. ఉద్యోగం ఉండాలికదా పురుష లక్షణం" అంటూ నవ్వాడు.

వేణు నవ్వలేదు. సీరియస్‌గా అడిగాడు. ఎప్పుడు ఎగ్జామ్స్.

రెండు నెలల్లో ఉంటాయి. "ఏం? నువ్వూ రాస్తావా? " అడిగాడు చక్రవర్తి.

వేణు చక్రవర్తి దగ్గరగా వచ్చి అప్లికేషన్ చూస్తూ "ఒక్కటే తెచ్చావా? " అడిగాడు.

"లేదు రెండు తెచ్చాను. ఫిలప్ చేయడంలో ఏదన్నా పొరపాటు జరిగితే ఇంకోటి ఉంటుంది కదా అని. "

"అయితే ఇది నాకిచ్చెయ్."

"నీ కెందుకురా."

"కావాలి. నేనూ రాస్తాను."

"నీ తలకాయ. డోంట్ బీ సిల్లీ నీకేం అవసరం ఇప్పుడు? చక్కగా చదువుకో సివిల్స్‌కి ప్రిపేర్ అవు."

"నో చక్రవర్తీ నేను కూడా బ్యాంక్ ఎగ్జామ్స్ రాస్తాను. "

"ఎందుకురా? నీకెందుకు?"

"ఎందుకంటే నేను అర్చనని పెళ్ళిచేసుకుంటాను. అందుకు నాకు ఉద్యోగం కావాలికదా. "

వాట్? దిగ్భ్రాంతిగా చూశాడు చక్రవర్తి. "నీకేం మతిపోయిందా? ఏం మాట్లాడుతున్నావు? "

వేణు స్థిరంగా అన్నాడు. "నేను అర్చనని పెళ్ళిచేసుకుంటాను చక్రవర్తీ. తనకి చాలా ద్రోహం జరిగింది. అదే ఆలోచిస్తూ తను పిచ్చిదవుతోంది. ఆ సంఘటన మర్చిపోయి తను మామూలు మనిషవాలంటే తనని నేను అర్జెంటుగా పెళ్ళి చేసుకోవాలి. అంతే. "

"వేణూ పిచ్చి ఆలోచనలు చేయకు. ఆవిడ కోసం నీ కెరియర్ పాడు చేసుకుంటావా? అయినా నీకిదేం పిచ్చిరా. నిన్ను జోకర్‌లా భావిస్తుంది అర్చన. గడ్డిపోచ విలువివ్వదు. అలాంటిది ఆమె మీద నీకెందుకింత వ్యామోహం?"

"వ్యామోహం కాదు చక్రవర్తీ పిచ్చి ప్రేమ. వెర్రి ఏదైనా అను నాకు ఆమె కావాలి అంతే. ఇలా ఇవ్వు ఆ అప్లికేషన్. టేబుల్ మీద ఉన్న అప్లికేషన్ లాక్కున్నాడు. "

"వేణూ. నీ మీద మీ పేరెంట్స్ చాలా ఆశలు పెట్టుకున్నారా. వాళ్ళ ఆశలు వమ్ము చేయడం ధర్మం కాదు. అది కూడా ఆఫ్ట్రాల్ ఒకమ్మాయి కోసం. నీకు తెలీదు వేణూ. అర్చన నిన్ను పెళ్ళిచేసుకోడానికి ఒప్పుకోదు. ఆడది తన వెంట పడే మగాడిని ఒక క్రీచర్గా చూస్తుంది. అందులో నువ్వంటే మరీ చిన్నచూపు ఆమెకి. నువ్వంటే అటు ప్రేమా, ఇటు గౌరవం లేని ఆమెని పెళ్ళిచేసుకోవాలన్న ఆలోచనే కరెక్ట్ కాదు. నా మాట విను."

వేణు శాంతంగా చక్రవర్తి మొహంలోకి చూస్తూ అన్నాడు. "ఆమె నన్ను ప్రేమించేలా చేసుకుంటాను. చక్రవర్తీ తెరిచి ఉన్న తలుపుల్లోంచి లోపలికి వెళ్ళడంలో థ్రిల్ లేదు. తలుపులు తెరుచుకుని వెళ్ళడంలోనే థ్రిల్ ఉంది. నేను తప్పకుండా అనుకున్నది సాధిస్తాను. ఇంక కెరియర్ అంటావా? ఒక ఐ.ఏ.యస్ ఆఫీసర్, ఒక బ్యాంక్ ఆఫీసర్ జీతంలో పెద్ద తేడా ఉండదు. అయినా నా పర్సనాలిటీ ఐ.ఏ.యస్‌లకి, ఐ.పి.ఎస్‌లకి సరిపోదులే అర్చనని చదివిస్తాను."

"వెర్రి కుదిరింది. రోకలి తలకి చుట్టమన్నాట్ట నీలాంటివాడే వెనకటికి. "

వేణు మాట్లాడలేదు. మౌనంగా అప్లికేషన్ ఫిలప్ చేయడం ప్రారంభించాడు.

"వేణు వైపు అయోమయంగా చూస్తూ ఉండిపోయాడు చక్రవర్తి."

అర్చనకి పీజీలో సీటు రాలేదు. ఆమె గురించి యూనివర్శిటీలో కూడా చెడ్డగా ప్రచారం జరిగింది. దానికి కారణం చాలా మందికి తెలిసినా ఎవరూ నోరెత్తలేదు.

వేణు చాలా బాధపడ్డాడు.

వేణూ, చక్రవర్తీ బ్యాంక్ ఎగ్జామ్స్‌లో సెలెక్ట్ అయ్యారు. వాళ్ళిద్దరికీ పోస్టింగ్ వచ్చింది. వేణుకి హైదరాబాదులో చక్రవర్తికి వరంగల్లులో.

వేణు ఆనందానికి హద్దుల్లేవు. ఆ విషయం చెప్పి ఆనందరావు, సావిత్రిల అంగీకారం తీసుకోడానికి నిర్ణయించుకున్నాడు.

గుడికి వెళ్ళి దేవుడి ఆశీర్వాదం తీసుకుని అర్చన ఇంటివైపు వెళ్ళాడు.

●●●

**అర్చన బాగా చిక్కిపోయింది**. తనకి ఎవరూ సపోర్ట్‌గా నిలవకపోడంతో ఆమె బాగా కృంగిపోయింది. ప్రాణస్నేహితురాళ్లు అనుకున్నవాళ్ళు, తోబుట్టువు అందరూ వెలేసినట్టు చూస్తున్నారు. యూనివర్శిటీలో కూడా ఆమె పట్ల చాలా చెడ్డగా ప్రచారం జరిగింది. నాగరాజుని వలలో వేసుకుని ఆడుకుందని, అతని ఆస్తి మీద కన్నేసిందని, అది తెలిసిన నాగరాజు ఆమెని వదిలించుకునేందుకు చాలా తిప్పలు పడ్డాడనీ. అర్చన ముందు ఆవేశంతో రగిలిపోయింది. తరువాత విరక్తిగా నవ్వుకుంది. ఆ తరువాత తీవ్రంగా ఒక స్థిరనిశ్చయానికి వచ్చింది. ముందు కొన్నాళ్ళు ఈ ఊరినుంచి దూరంగా వెళ్ళాలి. ఆ తరువాత భవిష్యత్తు నిర్ణయించుకుని మళ్ళీ వచ్చి తన ఆశయం నెరవేర్చుకోవాలి. ఎట్టి పరిస్థితుల్లోనూ నాగరాజుని వదిలేది లేదు. అలా అనుకున్నాక ఆమెకి కొంచెం శాంతిగా అనిపించింది. అర్చన ఆలోచిస్తూ ఉండగానే వేణు వచ్చాడు. ఈ మధ్య వేణు రాక కొంచెం బాగానే అనిపిస్తోంది. అందరూ వెలేసినా అతను మాత్రం తను అవమానించినా, ఒద్దన్నా ఎదో సాయం చేయడానికి ప్రయత్నిస్తుంటే నిజాయితీ ఉన్న మనిషి అని అతని పైన ఒక మంచి అభిప్రాయం కలిగింది.

అందుకే చిరునవ్వుతో ఆహ్వానించింది "రా వేణూ.. " అంటూ.

వికసించిన మొహంతో అన్నాడు వేణు. "నాకు బ్యాంక్‌లో పోస్టింగ్ వచ్చింది అర్చనా.. "

"ఏ బ్యాంక్‌లో ఆశ్చర్యంగా చూసింది. ఎప్పుడు రాశావు ఎగ్జామ్స్?"

వేణు నవ్వాడు.

"ఈ మధ్యే చక్రవర్తి రాస్తుంటే నేనూ రాశాను. మా ఇద్దరికీ పోస్టింగ్ వచ్చింది. తనకి వరంగల్‌లో, నాకు హైదరాబాదులో. "

"ఓ గుడ్ కంగ్రాట్స్. కానీ, నీ యాంబినేషన్ వేరు కదా. "

"అవును. కానీ, మార్చుకున్నాను. "

"ఏం?"

ఇంతలో సావిత్రి కాఫీ గ్లాసుతో వచ్చింది "కులాసానా బాబూ..? " అంటూ.

కాఫీ గ్లాసు అందుకుని "థాంక్స్ ఆంటీ.. నాకు ఉద్యోగం వచ్చింది" అన్నాడు.

"అలాగా! చాలా సంతోషం. ఎక్కడ?" అంటూ ఆనందరావు కూడా వచ్చాడు.

"స్టేట్ బ్యాంక్‌లో.. " అంటూ వివరాలు చెప్పాడు.

"మంచిపని చేశావు బాబూ. ఏం చదువుకున్నా మంచి ఉద్యోగమేగా కావాల్సింది. బ్యాంకు ఉద్యోగం కన్నా ఏం కావాలి? చాలా మంచిపనిచేశావు. " అంటూ అర్చన వైపు చూస్తూ అన్నాడు ఆనందరావు. "నువ్వు కూడా ఏదన్నా కాంపిటిటివ్ ఎగ్జామ్స్ రాయమ్మా. మంచి ఉద్యోగం వస్తే నీ దారిన నీవు హాయిగా బతకచ్చు. "

సావిత్రి కూడా అంది. "ఇప్పట్లో నీకు పెళ్ళి అయే యోగం ఉందో లేదో ఆ పని చేయమ్మా. ఉద్యోగం సంపాదించుకుని బతుకు. "

అర్చన పళ్ళ బిగువున కోపం అదిమిపెట్టి లేదు "నాన్నా.. నేను ఉస్మానియా యూనివర్శిటీలో పి.జి.కి అప్లై చేస్తాను. చదువుకుంటాను" అంది.

"చదివింది చాలు. అయిన రభస చాలు. మా ప్రాణాలు తీయకుండా ఉద్యోగం చేసుకో తల్లీ. అటు పెళ్ళికాక, ఇటు ఉద్యోగం లేక మా గుండెలమీద ఎన్నాళ్ళిలా ఉంటావు? " ఆవేశం, ఆవేదన కలిసిన స్వరంతో అంది సావిత్రి.

"ఏంటమ్మా ప్రతిరోజూ ఈ గోల? నాకేం జరగలేదు అంటే నమ్మరేం? నాకిప్పుడు ఏమైంది? "

"ఏమైంది అని నువ్వడిగితే ఏం చెప్పమంటావు? ఏమైనా నీకు పెళ్ళికావడం మాత్రం ఇప్పట్లో అసాధ్యం."

"నేనేం పెళ్ళికోసం తపించడంలేదు. "

"నువ్వు తపించినా, తపించకున్నా నీకు పెళ్ళిచేయడం కర్తవ్యం. కానీ మా ఖర్మ ఇలా ఉంది నీకు పెళ్ళికాదు. "

అప్పటిదాకా వాళ్ళ వాదన ఉగ్గబట్టుకుని వింటున్న వేణు అర్చన కళ్ళల్లో ఉబికిన కన్నీళ్ళు చూసి తట్టుకోలేకపోయాడు. పాపం ఈ తల్లి, తండ్రులకి ఎంత వేదన? ఆడపిల్ల జీవితం ఎంత పల్చన. ఏం జరిగినా ప్రపంచానికి తక్షణం కనిపిస్తుంది. వీళ్ళ ఆవేదన తీరాలంటే ఎవరన్నా విశాల హృదయంతో ముందుకు వచ్చి ఆమె మెడలో తాళి కట్టాలి. ఆ పని తానే ఎందుకు చేయకూడదు? అవును ఎందుకు చేయకూడదు? అవును తానే అర్చనకి అండగా ఉండాలి. తప్పకుండా ఒప్పుకుంటుంది. ఇప్పుడింక తను తప్ప ఎవరున్నారు ఆమెకి? నిజంగానే ఎవరు పెళ్ళిచేసుకుంటారు? ఇది భగవంతుడు తనకి కల్పించిన మహదావకాశం. అర్చన తనకి దక్కాలని రాసిపెట్టి ఉంది. అందుకే ఇలా కలిపాడు భగవంతుడు. పిచ్చి అర్చన. అవును తానే అర్చనకి అండగా ఉండాలి. తప్పకుండా అర్చన ఒప్పుకుంటుంది. అవును ఇదే అవకాశం. నిజంగా తనకిది మంచి అవకాశం. అర్చనని దక్కించుకోడానికి, అర్చనని తన స్వంతం చేసుకోడానికి ఇదే అవకాశం.

మనసులో ఆలోచనలు ఉవ్వెత్తున ఎగుస్తుంటే కెరటంలా లేచిన ఆనందంతో, ఆవేశంతో గబుక్కున అన్నాడు వేణు.

"మీరు బాధపడకండి. మీరొప్పుకుంటే మీ అమ్మాయిని నేను పెళ్ళిచేసుకుంటాను. చూశారుగా నాకు ఉద్యోగం కూడా ఉంది తనని నా ప్రాణానికి ప్రాణంలా చూసుకుంటాను" అన్నాడు ఉద్వేగంగా.

ఒక్క క్షణం అక్కడ పిన్‌డ్రాప్ సైలెన్స్ ఆవరించింది.

కొన్ని క్షణాల తర్వాత అర్చన కంపిస్తున్న స్వరంతో తీవ్రంగా పిలిచింది.. "వేణూ!.. "

వేణుతో సహా మిగతా ఇద్దరూ బిత్తరపోయారు అర్చన అరుపుకి.

అర్చన వేణువైపు మండిపడుతూ చూసింది. "వేణూ! ఇంతకాలం నిన్ను తక్కువగా అంచనా వేసి, ఏడిపించిన మాట నిజం. ఇప్పుడే నీలో మంచి స్నేహితుడిని చూసి, నీ స్నేహాన్ని ఆహ్వానించాలనుకుంటున్నాను. దయచేసి పరిస్థితుల్ని నీ కనుకూలంగా మార్చుకోవాలన్న దుష్ట ఆలోచన రానివ్వకుండా ఉంటే బాగుంటుంది. "

"లేదు అర్చనా.. నువ్వంటే నాకు ఇష్టం. నీ జీవితం ఏ ఆనందానికీ, ఏ సుఖానికీ నోచుకోకుండా ఇలా మోడులా ఉండిపోవడం నేను భరించలేను. అందుకే నేను నిన్ను పెళ్ళిచేసుకుంటాను. నువ్వు కోల్పోయిన ఆనందం నేనిస్తాను. "

ఆర్చన కడుపులో కాలుతున్నట్టుగా అనిపిస్తోంది. ఏంటితని ఉద్దేశం? ఏం జరిగిందని ఇలా మాట్లాడుతున్నాడు తనకేం జరిగింది? ఏం కొంపలు అంటుకున్నాయి. వాడెవడో తననిమోసం చేసి ఎత్తుకెళ్ళి ఒక రాత్రి తన ఇంట్లో ఉంచినందుకు, ఏదో జరిగిపోయిందని, తద్వారా తన జీవితం నాశనం అయిందని ఎందుకనుకుంటున్నాడు? ఫూల్‌లా ఉన్నాడే

అర్చన కొంచెం తీవ్రమైన స్వరంతో అంది. "వేణూ, ఆడదాని కొన్ని నిస్సహాయ పరిస్థితులను అవకాశంగా వాడుకోవడం మీ మగాళ్ళకున్న ఆర్ట్ అని నాకు తెలుసు. ప్రస్తుత నా స్థితిని అడ్డం పెట్టుకుని నన్ను పెళ్ళిచేసుకుని ఉద్ధరించాలన్న నీచమైన ఆలోచనలు పెట్టుకోకు. నేను పెళ్ళిచేసుకోను. నిన్ను అసలే చేసుకోను. నువ్వింక వెళ్ళిపోవచ్చు. "

ఎప్పుడు వచ్చాడో కిరణ్ వెటకారంగా అన్నాడు. "అవును ఈవిడని వరించి రాజకుమారుడు వస్తాడు. నువ్వెందుకు పనికివస్తావు? అంతేలే అదృష్టం అందలం ఎక్కిస్తానంటే ఏదో జరిగిందిట. "

అర్చన తీవ్రంగా అరిచింది. "అన్నయ్యా ఇది నా స్వవిషయం. నీ జోక్యం అవసరంలేదు. "

"ఏం ఎందుకు అవసరంలేదు? ఇప్పటికే నీవలన ఈ ఇంటి పరువు బజారుకెక్కింది. ఇంకా నీకు సిగ్గు రాలేదు. అతనికేం తక్కువని అతనంతట అతనుగా వలచి వస్తే నీకు చులకన అయాడా?" అంటూ అర్చన మీద విరుచుకుపడి, తల్లితో అన్నాడు. "అమ్మా మీకు నేను కావాలంటే ముందు దాన్ని ఈ ఇంటినుంచి బైటికి పంపించండి." అంటూ విసురుగా వెళ్ళిపోయాడు.

అర్చన మ్రాన్పడిపోయింది. ఆమె కాళ్ళకింద నేల రెండుగా చీలి తనని లోపలికి లాక్కెళ్ళుతున్నట్టుగా అనిపించసాగింది.

ఆనందరావు సీరియస్‌గా వేణుని అడిగాడు. "వేణూ ఆర్ యూ సీరియస్ మీ వాళ్ళతో మాట్లాడావా? "

వేణు ఉబికి వస్తున్న సంతోషంతో అన్నాడు. "మా వాళ్ళు నా మాట కాదనరు. నిజంగానే నాకు అర్చనంటే ఇష్టం. నా కళ్ళల్లో పెట్టుకుని చూసుకుంటాను. నన్ను నమ్మండి. తన కోసమే నేనీ జాబ్ కూడా సంపాదించుకున్నాను. నాకు అర్చనంటే ప్రాణం. తనకి చెడు జరిగితే నాకు జరిగినట్టే అర్చనకి తోడుగా నేనుంటాను. "

వేణు మాటలు విన్న ఆనందరావు సావిత్రి వైపు చూస్తూ " విన్నావుగా నీ కూతుర్ని ఒప్పించే భారం నీది" అంటూ వేణు చెయ్యిపట్టుకుని బైటకు తీసుకుని వెళ్ళిపోయాడు.

అక్కడ సావిత్రి, అర్చన మిగిలారు. అర్చన శిలావిగ్రహంలా నిలబడిపోయింది.

సావిత్రి ఆమెకి కొంచెం దగ్గరగ జరిగి అనునయిస్తున్న స్వరంతో చెప్పసాగింది. " నా మాట వినమ్మా పరిస్థితి అర్థమైందికదా. ఈ పరిస్థితిలోంచి నువ్వు బైటపడాలంటే పెళ్ళే మార్గం. అతను పెద్ద మనసుతో వచ్చి తనంతట తానుగా చేసుకుంటానంటున్నాడు ఒప్పుకో."

అర్చన మండిపడుతూ అంది. " ఛ. ఇడియట్స్ ఆడదాని బలహీనతని క్యాష్ చేసుకోడానికి చూస్తారు ఎంతసేపటికీ. వీడి మొహానికి నేను కావాల్ట. ఛస్తే చేసుకోను. "

" ఏం ఎందుకని? " ఉగ్రురాలైంది సావిత్రమ్మ. " ఎందుకు చేసుకోవు? పెళ్ళి చేసుకోకుండా ఇలా ఎంతకాలం మా మానాన బడి ఉంటావు? ఎంతకాలం మా నెత్తిన కూచుంటావు? "

" అదేంటమ్మా నేను మీ కూతుర్ని. నేను ఎక్కడికి వెళతాను? " ఆశ్చర్యంగా అడిగింది అర్చన. ఆమెకి తల్లి ఎందుకంత అఘాయిత్యం చేస్తోందో అర్థం కావడంలేదు. ఆ రోజు నుంచి ఒకటే ఏడుపు.. గోల.. " అయిపోయింది. పూర్తిగా నాశనం అయింది. దీనికింక పెళ్ళికాదు. పెళ్ళికాకపోతే పోనీ కనీసం బాగా చదివించి తన కాళ్ళమీద నిలబడుతుందనుకుంటే చదువు కూడా చట్టబండలైంది. దేవుడా ఈ పిల్ల ఏ నక్షత్రాన పుట్టిందిరా నాయనా? దీనివలన నాకిన్ని కష్టాలెందుకురా" అంటూ శోకాలు పెడతోంది... ఇప్పుడిలా అంటూంటే అర్చనకి మరీ అయోమయంగా అనిపించింది.

" ఏంటమ్మా? ఏం జరిగిందని? ఏదో జరిగింది. నా శీలం పోయింది. నా పాతివ్రత్యం పోయింది. నేను చెడిపోయాను అనుకుంటూ ఏడుస్తూ కూర్చునే పాతకాలం ఆడపిల్లను కాను నేను. ముందు ఆ వెధవల సంగతి తేల్చి వాళ్ళకి శిక్షపడేదాకా పోరాడి, ఆ తరువాత నా చదువు, నా భవిష్యత్తు నిర్ణయించుకుంటాను. ఎప్పటికీ ఇలా మీ మీద తిండికీ, బట్టకీ ఆధారపడి బతుకుతానని ఎందుకు అనుకుంటున్నావు? ఇప్పుడు వాళ్ళకి శిక్షపడేలా చేయాలన్నదే నా లక్ష్యం. ఇది అయాక భవిష్యత్తు తీర్చిదిద్దుకునే ప్రయత్నాలు చేస్తాను."

" ఆ చేశావులే? ఏంటే చేసేది? ఇంక నువ్వు ఏమీ చేయలేవు. నీకు ఈ సంఘం సంగతి ఏం తెలుసు? ఇప్పటికే.. ఇప్పటికే నీ వల్ల" ఆవిడ స్వరంలో వణుకు. దుఃఖంతో రుద్ధమైన స్వరంతో అంది. " దేవుడు పంపినట్టుగా ఇతను వచ్చి, నా మనసులో నేను అనుభవిస్తున్న వేదనకి ఉపశమనంగా తీయని మాట చెప్పాడు. ఈ అవకాశం పోగొట్టుకుంటే నీకు ఈ జన్మలో పెళ్ళికాదు. "

" కాకపోతే పోనీ అమ్మా పెళ్ళే నా జీవితానికి పరమావధికాదు. అయినా ఎందుకలా అస్తమానం నాకు పెళ్ళికాదేమో, పెళ్ళికాదేమో అని ఆలోచిస్తావు. ఏం ఎందుకు కాదు? నాకేం తక్కువైంది? "

" ఏం తక్కువైందో, ఏం ఎక్కువైందో అవన్నీ నేనిప్పుడు చెప్పలేనమ్మా. నిన్ను ఇంట్లో పెట్టుకోడం అంటే నెత్తిమీద నిప్పుల కుంపటి పెట్టుకోడం. మేము శాంతిగా, నిశ్చింతగా బతకాలని నీకుంటే నువ్వు ఈ పెళ్ళికి ఒప్పుకు తీరాలి. "

" ఒప్పుకోను.! " అరిచింది అర్చన.

" ఏం? ఎందుకొప్పుకోవు? తనంతటతానుగా నిన్ను చేసుకుంటానన్నాడు. అతను దేవుడు. "

" కాదు స్వార్ధపరుడు. ఒక రౌడీవెధవ నామీద పగతో నన్ను ఒక రోజు కిడ్నాప్ చెసి దాచేసిన విషయాన్ని తనకి అడ్వాంటేజ్‌గా మార్చుకుని, నా జీవితం మీద, నా మీద పెత్తనం సంపాదించడానికి... నామీద తనకు ఏర్పడిన వ్యామోహాన్ని ఇలా తీర్చుకోడానికి ప్లాన్ చేశాడు. తన ప్రేమని నేను అంగీకరించనందుకు ఈ సంఘటనకి మసిపూసి మారేడుకాయ చేస్తున్నాడు. "

" నువ్వన్నవన్నీ నిజమే. అయినా అతను నిన్ను పెళ్ళిచేసుకుంటాననడం నీ అదృష్టమే. దీన్నికాదనలేవు అంతే. "

" అతను స్వార్ధంతో నన్ను పెళ్ళిచేసుకోడానికి నామీద మీకు ఏదేదో చెబితే అదే నిజమని నమ్ముతారా? నాకేం జరగలేదని నాకు తెలియదా? "

" అర్చనా ఆడపిల్లలకి ఇంత తెగింపు పనికిరాదు. స్వేచ్ఛా స్వాతంత్ర్యాలంటూ మీరెంత అరిచినా, ఎంత గింజుకున్నా ఇది మగవాడి సమాజం. వాళ్ళు బతికినంత స్వేచ్ఛగా, తెగింపుగా ఆడది బతకడం అసం భవం. మేమెంతకాలం నీకు అండగా ఉండగలం? ఎంతకాలం నిన్ను కాపాడగలుగుతాం? అందుకే అర్చనా మామాట విని, అంది వచ్చిన అదృష్టం చేజార్చుకోకు. అదృష్టం జీవితంలో ఒక్కసారే వస్తుందిట. ఆ క్షణం తలుపు తీయకపోతే అలిగి వెళ్ళి, ఇంక ఎప్పటికీ రాదుట." ఏడుస్తూ ప్రాధేయపడసాగింది సావిత్రమ్మ.

అర్చనకి కాళ్ళకింద భూమి కదిలిపోతున్నట్టు అనిపించింది.

అర్చన రెండు చేతుల్లో మొహం దాచుకుని పరిగెత్తుకుంటూ లోపలికి వెళ్ళిపోయింది. గుండెలవిసిపోయేలా ఏడవసాగింది. ఎంత నిర్దయ.! ఆడదంటే ఎక్కడికక్కడ, ఎప్పటికప్పుడు జీవితంతో రాజీపడడమేనా?

చేయని తప్పుకి, ప్రతిక్షణం కుమిలిపోతూ, ఇష్టంలేని జీవితం అనుభవించాలా? ఇదేం న్యాయం? అసలైనా ఎందుకు తనమీదే అందరూ కత్తికట్టి బాధపెడుతున్నారు. నాగరాజు, వేణు, వీళ్ళంతా బుద్ధిలేనివాళ్ళు. సిగ్గు, శరంలేనివాళ్ళు. కానీ, అమ్మా, నాన్నా, అన్నయ్యా తననే అపరాధిగా చూస్తున్నారేం? తనేం తప్పు చేసింది? బాగా చదువుకుని ఉన్నత స్థానం పొందాలనుకుంది. తప్పా అందుకు వాళ్ళేగా తన మెదడులో బీజాలు వేశారు. ఇప్పుడు పెళ్ళి చేసుకోమంటారేం? ఆ నాగరాజు దౌర్జన్యం చేస్తే వాడిని శిక్షించాలి. తననెందుకు పెళ్ళి, సంసారం అనే జైల్లో పెట్టి శిక్షించాలనుకుంటున్నారు. అదికూడా తనకే మాత్రం ఇష్టంలేని వేణుని పెళ్ళిచేసుకోవాలిట. ఇదేం ధర్మం. పెళ్ళంటే ప్రేమా, అనురాగంతో కలిసి జీవించడంకాదా. పెళ్ళంటే కృతజ్ఞతా?

నాగరాజు చేసిన దౌర్జన్యానికి పెళ్ళే పరిష్కారం అంటూ పెళ్ళి చేసుకోమని బలవంతం చేస్తున్నారు. అంతా వాళ్ళిష్టమేనా? తనని కని, పెంచినందుకు తన జీవితం మీద పెత్తనం మొత్తం వాళ్ళదేనా? తన జీవితం మీదా, తన భవిష్యత్తు మీదా తనకేం హక్కులేదా? తనకేం ఆశలు, కోరికలు ఉండకూడదా? భగవాన్ ఇదేం తీర్పు. అర్చనకి కన్నీళ్ళు కారిపోసాగాయి. ఆ రోజు దుఃఖంతో మౌనం వహించింది.

ఆ భయంకరమైన నిశ్శబ్ధంలో తన భవిష్యత్తుకు ఏకపక్ష నిర్ణయాలు జరిగిపోవడం.. ఆ నిశ్శబ్దంలోనే ఆమె జీవితంపైన వేణు ఆధిపత్యం సంపాదించడం.. చాలా మాములుగా జరిగిపోయింది.

వెంకటేశ్వరస్వామి  ఆలయంలో అర్చనా, వేణుల వివాహం చాలా నిరాడంబరంగా జరిగింది. ఓ కన్నెపిల్ల కలలకి, ఆశలకి, కోరికల సమాధికి పునాదిరాయి పడింది. జరిగిన ఏ నేరానికీ కూడా పరోక్షంగా కానీ, ప్రత్యక్షంగా కానీ కారకురాలు కాని ఓ ఆడపిల్ల భవిష్యత్తు, సంప్రదాయం అనే సంకెళ్ళతో, సమాజం అనే బందిఖానాలో నిర్బంధించబడింది.

ఎంత నిర్దయ.!! కన్నకూతురికన్నా, కూతురి భావాలకన్నా, కూతురి భవిష్యత్తుకన్నా, సమాజం, అది గీసిన కట్టుబాట్లు, ఆచారాలు, సంప్రదాయాల పేరుతో ఆ సమాజం విధించిన నీచ నిబంధనలు, కఠోర నియమాలు ఎక్కువైనాయి.

సర్వం కోల్పోయినట్టు అర్చనా, సమస్త ప్రపంచాన్ని గెల్చినట్టు వేణూ, అతని తల్లితండ్రుల దీవెనలకోసం అతని ఊరు వెళ్ళారు. కొడుకు ఎవరినో అమ్మాయిని తీసుకుని హఠాత్తుగా వచ్చి, ఈమె మీ కోడలు అని పరిచయం చేయడంతో వాళ్ళు ముందు నిర్ఘాంతపోయారు. తరువాత ఏం చేయాలో తెలియక మాటలు మర్చిపోయి మౌనవిగ్రహాలయారు. తరవాత కొడుకు మీద ప్రేమతో, కోడల్ని కళ్ళనిండా చూసుకున్నారు. అందంగా, మహాలక్ష్మిలా కళకళలాడుతూ ఇంటి గుమ్మంలో నిలబడ్డ ఆ అమ్మాయిని చూడగానే వాళ్ళ గుండెల్లో పొదుపుకున్న వాళ్ళ ప్రేమా, ఆదరణా మర్చిపోలేనివిగా అనిపించాయి. వారం రోజుల పాటు వాళ్ళ ఆప్యాయతా జల్లుల్లో తడిసి హైదరాబాదు బయలుదేరారు.

గోదావరి ఎక్స్‌ప్రెస్‌లో కూర్చున్న అర్చనకి తన జీవితం ఎక్కడినుంచి ఎక్కడికి పయనిస్తుందో అర్ధంకాలేదు. మనసు, శరీరం అలసిపోయి ఉన్నయి. ఎంత మాత్రం ఓపికలేనట్టు నిస్సహాయంగా అనిపిస్తోంది. వేణు తనతో మాట్లాడాలని ప్రయత్నించడం, తిరిగి ఎటోచూస్తూ కూర్చోడం చూస్తుంటే అతన్ని కసిగా పొడిచేయాలనిపిస్తోంది. ఎంత తెలివైనవాడు చాప కింద నీరులా మంచిగా ఉంటూ తన జీవితం పైన ఆధిపత్యం తీసుకున్నాడు. జరగదు. ఎట్టి పరిస్థితుల్లోనూ తను అతని భార్యకాదు. కాలేదు. స్థిరంగా అనుకుంది. ఆలోచనలతో బాగా నలిగినట్టుగా ఉంది. కళ్ళు మూసుకుంది. రైలు శబ్దం లయబద్ధంగా వినిపిస్తుంటే మగతగా నిద్రపట్టింది.

●●●

అదొక అందమైన పూలతోట. రంగు, రంగుల గులబీలు, నక్షత్రాల్లా రాలిపడుతున్న జాజులు, పూలమొక్కలతో దాగుడుమూతలాడుతున్న గాలికెరటాలు మేఘాలమీద తేలుతున్న వెన్నెలరేడు అప్పుడే ఓ అందమైన అమ్మాయి చేతిలో పూలసజ్జతో వచ్చింది. ఆ అమ్మాయి చాలా అందంగా ఉంది. మోకాళ్ళను దాటి, అరచేతి మందాన ఉన్న పూలజడ పట్టు పరికిణీ, ఓణీ, పట్టుజాకెట్టు. వోణీకి, జాకెట్టుకీ మధ్య ఉన్న అందమైన సన్నని నడుము మోయలేక మోస్తున్న వడ్డాణం, మెడనిండా నగలు, చెంపస్వరాలు, పచ్చటి ఒంటి రంగు బంగారంతో పోటీ పడుతోంది. ఆ బంగారు బొమ్మ పూలసౌరభాలను గాఢంగా ఆఘ్రాణిస్తూ, పరుగు పరుగున మొక్కల దగ్గరకు పరిగెత్తింది. సుకుమారమైన తన లేత వేళ్ళతో నాజూగ్గా ఒకొక్క పువ్వే తెంపి, పూలసజ్జలో వేయసాగింది. అంతలో ఎక్కడినుంచో ఓ తెల్లని గుర్రం రెక్కలు టప, టపలాడిస్తూ ఆమె ముందు ఆగింది. దానిమీంచి తెల్లని దుస్తుల్లో అందమైన రాజకుమారుడు దిగి, ఆమె వైపే అడుగులు వేస్తూ ఆమె దగ్గరగా వచ్చి, మత్తుగా, ఆమె కళ్ళల్లోకి చూసి, మనోహరంగా నవ్వాడతను. ఆ నవ్వుకి మతిపోయి శిలా విగ్రహంలా నిలబడిపోయింది. తన చేతి స్పర్శతో ఆ శిలలో చైతన్యం కలిగించడానికి కాబోలు అతని అందమైన చేయి ఆమె చేతిని అందుకుంది. ఇంతలో వేగంగా వచ్చిన ఓ పక్షి ఇద్దరి చేతులమీదుగా రివ్వున ఎగిరింది. ఆమె చేయి విరిగింది. తల ఎగిరిపడింది. ఆ పక్షి రెక్కల మించి నిప్పురవ్వలు రాలిపడి, మంటలుగా ఎగిసి, ఆ మంటలో అందమైన పూలతోట కాలిపోతోంది. మంటలు ఆకాశాన్ని ఎగిసిపడుతున్నయి.

ఉలిక్కిపడింది అర్చన. రైలు శబ్దం చాలా భయంకరంగా ఉంది. ప్రయాణీకులంతా గాఢ నిద్రలో ఉన్నారు. వేణు కూడా ప్రశాంతంగా నిద్రపోతున్నాడు. కిటికీలోంచి బైటికి చూసింది. కదిలిపోతున్న విశాలమైన మైదానాలు, చీకట్లో వికటాట్టహాసం చేస్తున్నట్టున్న వృక్షాలు. భయంతో ఒళ్ళంతా చెమట దాహం గొంతు ఆరిపోయింది. మంచినీళ్ళ బాటిల్ కోసం చూసింది. వేణు తల దగ్గరగా ఉంది. ఆ బాటిల్ తీసుకుని గట, గటా తాగేసింది. మూతపెట్టి బాటిల్ పక్కన పెట్టి మోకాళ్ళ చుట్టు చేతులు చుట్టుకుని గువ్వలా ఒదిగి కూర్చుని బైటకి చూడసాగింది.

ఈ కల, ఇంతకు ముందుకూడా వచ్చింది. అతనెవరు? ఎందుకిలా కలలోకి వస్తున్నాడు? ఆ పక్షి ఎవరు? ఈ కల దేనికి సంకేతం? కలలు మనోభావాలకి ప్రతీకలని అంటారు మానసిక విశ్లేషకులు.

తన మనసులో చాలాకాలంగా కలుగుతున్న భావపరంపరలకి ఇవి సంకేతాలా? అతను.. అతను కేవలం కలలో వ్యక్తికాదు. తనకి తారసపడ్డాడు ఒకసారి కాదు చాలాసార్లు. ప్రతిసారీ కళ్ళతోటే మాట్లాడి వెళ్ళిపోయాడు. కానీ, తన మనసులో మాత్రం అలజడి రేపాడు. ఆ అలజడే తనకి మనశ్శాంతి లేకుండా చేసింది. ఆ అలజడే తన భవిష్యత్తు పట్ల ఒక నిర్ణయానికి రాకుండా చేసింది. ఆ అలజడే తనని పిచ్చిదాన్ని చేసింది. ఎందుకిలా జరుగుతోంది?

ఏంటి ఆడదానిజీవితం? ఇప్పుడు తను మరొకరి భార్య. ఇష్టంగానో, అయిష్టంగానో తనకి వివాహం అయింది వివాహితురాలైన తాను పరాయి పురుషుడిని కలలో కూడా స్మరించుకోకూడని కట్టుబాట్లలో ఉంది. కానీ, ఇలా తరచూ కలలో వచ్చి కలవరపెట్టే ఆ వ్యక్తి ఎలా మర్చిపోవడం? ఇంతకాలం ఎవరికీ, ఆఖరికి ఎన్నోసార్లు తరచి, తరచి అడిగిన అమలక్కూడా చెప్పని రహస్యం ఈ గుండెల్లో దాచుకుంది. ఇప్పుడు ఇప్పుడు ఈ రహస్యం బట్టబయలవుతుందా? రేపట్నించీ తన పక్కన వేణు అనబడే ఒక పురుషుడు హక్కుగా పడుకుంటాడు. తనకిలాంటి కలవచ్చిందని అతనికి తెలిసిపోతే? ఎలా తెలుస్తుంది? తెలుస్తుంది. తప్పకుండా తెలుస్తుంది. తను ఊపిరి పీల్చినా అతనికి తెలుస్తుంది. ఇంతకాలం ఈ జీవితం తనది. ఒక్కదానికే స్వంతం. కానీ, నేడూ ఈ తాళి అనబడే ఈ రెండు బంగారు నాణాలు మెడలో పడిన క్షణం నుంచీ ఈ జీవితంతో మరో జీవితం ముడిపడింది. తన స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు ఈ వివాహం అనే తంతుతో శాశ్వతంగా పోగొట్టుకుంది. ఏంటీ ఆడదాని జీవితం వివాహం అనబడే ఈ తంతుతో తన మీద తనకి హక్కులేని జీవితమా ఆడది కోరుకునేది. ఆఖరికి తనకి వచ్చిన కలను తల్చుకునే స్వేచ్ఛకూడా ఉండని ఈ వివాహ వ్యవస్థని గౌరవించాల్సిన అవసర ఉందా?

అసలు ఈ పెళ్ళే ఒద్దనుకున్న తనకి ఈ పెళ్ళేంటి? ఇష్టంలేని వ్యక్తితో ఈ ప్రయాణం ఏంటి? ఇది కేవలం పదిగంటల రైలు ప్రయాణం కాదు. జీవితమంతా ఈ వ్యక్తితో కలిసి ప్రయాణించాలి లేదు లేదు అలా జరక్కూడదు. తనకి పెళ్ళి ఇష్టం లేదని, అసలు అతనంటే ఇష్టంలేదని వేణుకి చెప్పాలి. ఎంత చెప్పినా అతను అర్థం చేసుకోలేదు. ఎందుకింత మొండిగా తనని ఇలా బంధించాడు. ఎలా? ఈ బందిఖానాలోనుంచి బైటపడడం అర్చన వేణువైపు చూసింది. ప్రశాంతంగా, ఒకింత గర్వంగా నిద్రపోతున్నాడు. నిశ్చింతగా నిద్రపోతున్నాడు. అనుకున్నది సాధించానన్న తృప్తితో నిద్రపోతున్నాడు. తన మనసులో జరిగే సంఘర్షణ అతనికి తెలియదు. తెలిసినా అర్థంకాదు. అర్థం చేసుకోడానికి ప్రయత్నించడు. అతనంటే ఇష్టంలేదని తెలుసు. కానీ, ఎందుకిష్టంలేదో తెలియదు. ఇప్పుడు తెలిస్తే, తన మనసు పరాధీనమైందని తెలిస్తే, తన మనసులో ఎంతో కాలంగా పేరూ, ఊరూ తెలియని ఒక వ్యక్తి వలపు ప్రభంజనం సృష్టించాడని, ఆ ప్రభంజనంలో పడి తను ఉక్కిరి, బిక్కిరి అవుతోందని, పాపానికీ, నీతికీ, ధర్మానికీ నిర్వచనం వెతుక్కుంటూ తిరుగుతోందని వేణుకి తెలుస్తుందా? తెలిస్తే ఏం చేస్తాడు? వదిలేస్తాడా? వదిలేస్తే ఎంత బాగుంటుంది? కోల్పోయిన స్వేచ్ఛ తిరిగి పొందచ్చు. కానీ? వేణు వదలడు. వదిలే వాడైతే అసలు పెళ్ళేచేసుకోడు.

అతని భార్యగా బతకాలి తనకిష్టంలేని ఆ వ్యక్తికి ఈ శరీరాన్ని సమర్పించుకోవాలి. ప్రతిక్షణం అతని సమక్షంలో సంచరించాలి. అతనితో కలిసి భోంచేయాలి. అతనికి వండిపెట్టాలి. సేవలు చేయాలి. ఇవన్నీ తాను చేయలేదు. మనసు చంపుకుని అసలు చేయలేదు. జీవితంలో తను చాలా అసహ్యించుకునే పదం రాజీ. ఆడదంటే ప్రతిక్షణం, ప్రతివిషయానికీ రాజీ పడుతూ బతకడం అని చాలామంది అభిప్రాయం. కానీ, తనకలా ఎంతమాత్రం ఇష్టంలేదు. ఇప్పుడు వేణుతో రాజీపడి బతక్కపోతే ఏం జరుగుతుంది? బతికితే ఏం జరుగుతుందో తనకి బాగా తెలుసు. అర్చన చచ్చిపోతుంది. మరో అర్చన చీమూ, నెత్తురూ, మనసు, అనుభూతులు లేని అర్చన బతుకుతుంది. వేణు అనే అతని జీవితం అనే ప్రయోగశాలలో రక, రకాల పరిశోధనలకు ఉపయోగపడే అస్థిపంజరంలా బతికి ఉంటుంది. ఆ బతుకంటే తనకి అసహ్యం. అలా బతకడం కన్నా చావడం తన కిష్టం. బతుకంటే అందంగా బతకాలి. ఆర్టిస్టిక్‌గా బతకాలి. హాయిగా బతకాలి. ఆకాశంలో స్వేచ్ఛగా ఎగిరే పక్షిలా బతకాలి. నచ్చిన వ్యక్తితో జీవితాన్ని పంచుకుని, నచ్చేలా, అతను మెచ్చేలా బతకాలి. ఇంక ఈ జీవితానికి ఆ అవకాశం పోయినట్టేనా. శాశ్వతంగా తాను ప్రేమించే అర్హత కోల్పోయిందా? ఆమెకి తెలియకుండానే కళ్ళు వర్షిస్తున్నాయి.

అతడెవరో, అతని పేరేంటో, ఎక్కడుంటాడో తెలుసుకోవాలని ఎంతో తపించింది. ప్రయత్నించింది కూడా పరీక్షలయాక. ఆ విషయంలో చాలా సీరియస్‌గా వర్క్ చేద్దామనుకుంది. కానీ, కానీ మనసేలేని ఓ కసాయి వ్యక్తి ప్రేమించానంటూ వెంటాడి, వేటాడి తన జీవితానందాన్ని శాశ్వతంగా చిదిమేశాడు. అప్పటి నుంచి మనసంతా గందరగోళం. ఏం చేయాలో, ఎలా చేయాలో తెలియని అయోమయం అత్యంత స్వల్పకాలంలో ఎంత భయంకరమైన మార్పు చోటు చేసుకుంది ఈ జీవితంలో. ఇంక ఎప్పటికీ అతడిని కలవలేదు. అర్చనకి ఎప్పుడో విన్నపాట గుర్తొచ్చింది.

'పేరైనా అడగలేదు. ఊరైనా అడగలేదు. మనసేమో అతని విడిచి మరలి రాదాయే. మరలి రాదాయే వెతలన్నీ అతనికే వినిపించానెందులకో. ' నిశ్శబ్దంగా ఏడవసాగింది. ఎంత నిగ్రహించుకుందామన్నా ఆగని కన్నీళ్ళు జలపాతాలయాయి. చాలాసేపటికి తనని తాను నిగ్రహించుకుని కళ్ళు తుడుచుకుని సన్నగా వెక్కిళ్ళు వస్తుంటే చీరచెంగు అడ్డం పెట్టుకుని ఆ రూపాన్ని కళ్ళముందు తెచ్చుకోడానికి ప్రయత్నించింది.

అతను కనిపించిన మొదటిరోజు గుర్తొచ్చింది.

ఆ రోజు అర్చన, అమల విశాఖపట్నంలో ఉన్న అత్యంత పెద్ద షాపింగ్ కాంప్లెక్స్‌కి వెళ్ళారు. మర్నాడు అర్చన పుట్టినరోజు. అమల అర్చనకి మంచి బహుమతి కొనడానికి తీసుకెళ్ళింది. ఇద్దరూ కళ్ళు చెదిరే కొత్త, కొత్త అందమైన రక,రకాల బొమ్మల్ని, ఇంటీరియర్ డెకరేషన్‌కి పనికివచ్చే అలంకార వస్తువులను చూస్తూ నెమ్మదిగా నడుస్తున్నారు.

" అదిగో ఆ వాటర్ ఫౌంటెన్ తీసుకోనా? " అమల ఆగిపోయి చేత్తో చూపించింది.

అందమైన అమ్మాయి తడిసిన ఏకవస్త్రంతో వయ్యారంగా నిలబడి ఉంది. ఆమె చంకలో నీటి కుండకొద్దిగా వంగి ఉంది. ఆ కుండలోనుంచి జారిపడుతున్న నీళ్ళు తిరిగి ఫౌంటెన్‌లా చిమ్ముతూ రకరకాల కాంతుల్ని విరజిమ్ముతున్నాయి. ఆమె ఒక సరస్సులో నిలబడినట్టుగా ఎంతో సజీవంగా అందంగా ఉంది.

" చాలా బాగుంది కదా..! " మిల, మిల మెరుస్తున్న కళ్ళతో చూస్తూ ఆ బొమ్మవైపు నడిచింది.

" ఎంత ఈ ఫౌంటెన్?" సేల్స్‌మాన్ ని అడిగింది.

" దానికి రేట్ ట్యాగ్ ఉంది చూడండి మీరు చూస్తారా? నేను చూడనా? "

చివ్వున వెనక్కి తిరిగింది అర్చన.

దాదాపు ఆమె భుజాన్ని ఆనుకుంటూ నిలబడి ఆ బొమ్మవైపే చూస్తున్నాడు ఓ ఆజానబాహుడు. లేత రంగు నిలువు గీతల షర్టు, నల్లటి ప్యాంటులోకి టక్ చేశాడు. చామన ఛాయగా, అందంగా ఉన్నాడు. అతని పెదాలపైన విరిసీ, విరియని లేత చిరునవ్వు మెరుస్తోంది. కళ్ళు ఎంతో విజ్ఞానదాయకంగా, తేజోవంతంగా ఉన్నాయి. చాలా మంచి హోదా, అంతస్తు ఉన్న వ్యక్తిలా కనిపించాడు.

రెప్పవేయకుండా తనవైపే చూస్తున్న అర్చనవైపు హఠాత్తుగా చూపులు తిప్పాడు.

ఇద్దరి చూపులూ కలిసాయి. విశాలమైన అతని కళ్ళల్లో లిప్తపాటు మెరుపు కనిపించింది. చిన్నగా, పలకరింపుగా నవ్వాడు.

ఒక్కసారి గుండె ఝల్లుమంది అర్చనకి. చటుక్కున చూపులు తిప్పుకుంది. అప్పటికే అమల ఆ బొమ్మకి ఖరీదు బేరం చేసి, గిఫ్ట్ ప్యాక్ చేయిస్తోంది.

" అలాంటి బొమ్మ మరోటుందా? " అతను అడిగాడు.

" సారీ సార్. అన్నీ ఒకొక్క పీస్ మాత్రమే వస్తాయి. ఇవన్నీ కొత్త పీసులు. శాంపిల్‌గా వస్తాయి. ఇదిగో ఈ బొమ్మ తీసుకోండి. కొంచెమే తేడా" అంటూ మరో బొమ్మ చూపించాడు. అందులో అమ్మాయి బదులుగా దేవతా వస్త్రాల్లో ఉన్న స్త్రీమూర్తి ఉంది.

" ఊహూ. ఒద్దు పోనీలే" తమాషాగా అర్చనవైపు చూసి అక్కడ్నించి ముందుకు నడిచి వెళ్ళిపోయాడతను.

అతను వెళ్ళిన వైపు చూస్తూ బొమ్మలా నిలబడిపోయిన అర్చన భుజంమ్మీద చేయేసి " పద వెడదాం." అంది అమల.

ఉలికిపడిన అర్చన అయిష్టంగా ఆమెని అనుసరించింది. మౌనంగా, స్వప్నావస్థలో ఉన్నట్టుగా నడుస్తున్న అర్చనని చిత్రంగా చూస్తూ అడిగింది అమల. " ఏమైంది? ఇప్పటిదాకా బాగానే ఉన్నావుగా. "

" అబ్బే ఏ... ఏం లేదు. " తడబాటుగా అంది అర్చన.

" ఏంటే, అతన్ని చూసి మనసు పారేసుకున్నావా? " సరదాగా నవ్వింది అమల అర్చన మొహం ఎర్రబడింది.

" ఏంటి అదంతా సిగ్గే. ఏంటే బాబూ అంత నచ్చాడా అతను. నేను సరిగా చూడలేదు. పద వెనక్కి ఓసారి పరిశీలనగా చూసి, పేరు, ఊరు వివరాలు తెలుసుకుందాం."

" ఇంకా నయం. చాల్లే తెలివి పదపోదాం." అర్చన పార్క్ చేసిన తన బండివైపు నడిచింది.

దారిపొడుగునా, ఇంటికి వెళ్ళాక కూడా అనుక్షణం అతనే గుర్తుకొస్తూ అర్చనకి మనశ్శాంతి కరువైంది.

అతన్నెక్కడో చూసినట్టుంది. ఎవరతను? బాబోయ్ ఎంత పదునైన చూపులు? సూటిగా గుండెల్లోకి దూసుకెళ్ళి అలజడి రేపాయి ఎన్నడూ లేని అనుభూతులేవో ఈనాడు గుండెల్లో సందడి చేస్తున్నాయి. పదే, పదే అతణ్ణి చూడాలనిపిస్తోంది.

ఎక్కడో చూసింది. చాలా పరిచితంగా, ఎంతో ఆత్మీయంగా అనిపిస్తున్నాడు.

ఎంత బాగుంది అతని నవ్వు? మన్మధబాణంలా మరులు రేపుతూ మగవాడి స్పర్శ చూపుల్తో తగిలినా భరించలేకపోయే తను ఇవాళ అతని చూపుల జల్లుల్లో ఇంతలా తడిసిందేంటి? ఎందుకీ కలవరం ఏమిటీ పులకరం?

" ఏంటమ్మా అన్నం సరిగా తినడం లేదేం?" సావిత్రి ప్రశ్నకి " ఆకలి లేదమ్మా.. " అంటూ చేయి కడుక్కుని లేచి వెళ్ళిపోయింది అర్చన. మంచం మీద వాలగానే హఠాత్తుగా గుర్తొచ్చింది. అతనే ఇతను ఇతను అతనే. నిత్యం తనని వెంటాడే కలలోని రాజకుమారుడు. అవును అదే నవ్వు. అదే చూపు. అంటే ఇతను.

అమ్మో మరి ఆ రాక్షసుడు ఎవరు? తామిద్దరూ ఏకమయే సమయంలో తన చేయి విరగ్గొట్టినవాడు. ఇవాళ మళ్ళీ ఆ కలవస్తే తెలిసిపోతుంది. " అమ్మో మళ్ళీ కలా? " వణికిపోయింది అర్చన.

ఆ రాత్రి అవే ఆలోచనలతో ఆమెకి శివరాత్రి అయింది.

ఆ తరువాత మళ్ళీ అతను ఒక సినిమా థియేటర్‌లో కలిసాడు. సినిమాకి వెళ్ళారు అమలా, అర్చనా. ఇంటర్వెల్‌లో కాఫీ తాగడానికి వెడితే అక్కడ జనం మధ్య అతను. అవే చూపులు. అవే కళ్ళు. అదే నవ్వు.

ఆ తరువాత సినిమా చూడలేకపోయింది. మధ్యలో వెళ్ళిపోదామనుకుని కూడా చివరిదాకా ఉంటే మళ్ళీ ఓసారి అతను కనిపిస్తాడన్న ఆశతో ఉండిపోయింది. కానీ, అతను కనిపించలేదు.

అర్చన మూడ్ మారిపోడం చూసి అడిగింది అమల " ఏమైందే సడన్‌గా? "

అర్చన చెప్పాలనుకుంది. కానీ, పెదవి దాటి మాట పెగల్లేదు. " ఏం లేదు. ఏంటో డల్‌గా ఉంది" అంది.

అలా నాలుగైదు సార్లు అతను కనిపించాడు. ప్రతిసారీ అర్చన మనసులో అలజడి రేపుతూ మాయమైపోతున్నాడు. ఒక్కసారి అతనితో మాట్లాడాలి అనుకుంది. కనీసం అతనన్నా ఒక్కసారి పలకరించవచ్చుగా. తను ఆడపిల్ల. తనకి సిగ్గు, మొహమాటం. కానీ, అతనికేం? మగాడు మాట్లాడచ్చుగా. పరిచయం అయితే, తన కల గురించి చెప్పి, నా కల్లో కనిపించే రాజకుమారుడివి నువ్వే అని చెప్పచ్చు. ఆ కలకి అర్థం ఏవిటో అతణ్ణే అడగచ్చు.

ప్రతిసారి జనం మధ్యలో కలవడం, తిరిగి చూసేలోగా మాయమవడం.

ప్రశాంతంగా ఉన్న అర్చన మనసు కల్లోల సముద్రం అయింది.

ప్రణయ జ్వాలలు రేగిన దండకారణ్యంలా, వలపు ప్రభంజనంలా శాంతినీ, ప్రశాంతినీ భగ్నం చేస్తూ, అలజడినీ, అశాంతినీ ఆహ్వానిస్తూ.

ప్రేమ గురించే ఆలోచించని ఆమె మనసులో ప్రేమ ఓ వాయు తరంగంలా, ప్రవేశించింది. ఇప్పుడెందుకో ఆమె కంటికి అంతా అందంగా, అందరూ మంచివాళ్ళుగా కనిపిస్తున్నారు. అతనెవరో తెలుసుకోవాలి. అతనితో స్నేహం చేయాలి. కబుర్లు చెప్పాలి. తన కలలన్నీ చెప్పాలి. ఆశయాలు చెప్పాలి. ఆశలు చెప్పాలి. కలుసుకోవాలి. పేరైనా అడగలేదు. ఊరైనా అడగలేదు. మనసేమో అతన్ని విడిచి మరలి రాదాయే. పెదాలమీద పాత ప్రేమపాట లిపి దిద్దింది.

అర్చన కోరుకున్నట్టు అతడిని కలుసుకోలేదు. కాలం విషసర్పమై బుసకొట్టకపోయి ఉంటే కలుసుకునేదేమో కానీ అర్చన వెక్కిళ్ళు అణచుకోడానికి చాలా ప్రయత్నం చేయాల్సి వచ్చింది. రైలు శబ్దంలో కలిసిపోయి పైకి రాలేక గుండెల్లో మెలి చుట్టుకుని గింగరాలు తిరుగుతోంటే అలాగే బెర్తుమీదకి వాలిపోయింది.

వేణుతో కలిసి హైదరాబాదులో మల్కాజ్‌గిరిలో ఒక ఇండిపెండెంట్ పోర్షన్‌లో అర్చన కొత్త జీవితం ప్రారంభమైంది. వేణు హైదరాబాదు వచ్చిన నెలకే చక్రవర్తి ఇన్‌ఫ్లుయన్స్ చేసి వరంగల్ నుంచి హైదరాబాదు వచ్చేశాడు. అప్పటికే అతనికి మాధవితో వివాహం అయింది. మాధవి స్నేహం అర్చనకి కొంచెం ఊరటనీ, ఆనందాన్ని కలగచేసింది. ఎంతో అన్యోన్యంగా ఉండే ఆ దంపతులు కూడా

మల్కాజ్‌గిరిలోనే ముందు అద్దెకి, మరో రెండు నెలల్లోనే స్వంత అపార్ట్‌మెంట్‌కి మారిపోయినా అర్చనకీ, వేణుకీ మాత్రం దగ్గరగానే ఉన్నారు.

వేణు అర్చన చేత ఉస్మానియా యూనివర్శిటీలో పి.జికి అప్లై చేయించేలోగా మాధవి సరదాకి పనిచేస్తున్న ఒక ప్రైవేట్ కంపెనీలోనే అర్చనకి కూడా సెక్రటరీ పోస్ట్ లభించడంతో ఆమె ఉద్యోగంలో చేరిపోయింది. అర్చన తన ఆశయం ప్రకారం చదువు కొనసాగించే ఆలోచన కొద్దికాలం వాయిదా వేసుకుంది. అందుకు తగినట్టుగా తాను మానసికంగా సిద్ధం కావాలి. రెండు వేణు మీద ఎలాంటి పరిస్థితుల్లో కూడా ఆర్థికంగా ఆధారపడకూడదు. ప్రస్తుతం ఆమె మానసిక స్థితి చాలా గందరగోళంగా ఉంది. హఠాత్తుగా సంభవించిన ప్రళయంలో సర్వస్వం కోల్పోయిన అభాగ్యురాలిలా శూన్యంలో నిలబడి దిక్కులు చూస్తున్నట్టు అనిపిస్తోంది. అందుకే తాత్కాలికంగా కొంత డైవర్షన్ ఉంటుందని మాధవి అడగగానే అంగీకారం తెలిపి వెళ్ళి జాయిన్ అయిపోయింది. అర్చన ఉద్యోగంలో చేరడం ఎంత మాత్రం తనకిష్టం లేకపోయినా ముందు ఆమె మానసికంగా సెటిల్ అవాలని వేణు కూడా వారించలేదు. తప్పకుండా అర్చన కొద్దికాలంలోనే అన్ని మరిచిపోయి తనతో అన్యోన్యంగా ఉంటుందని ఆశించాడు.

కానీ, అతను ఆశించినట్టు అర్చన అంతా మర్చిపోయి భర్తగా అంగీకరించలేదు. నెలలు గడుస్తున్నా వేణుని ఒక స్నేహితుడిగా తప్ప భర్తగా అడుగుకూడా ముందుకు వేయనీయలేదు. అతనికి ప్రతిరోజూ ఒక గండంలా అనిపిస్తోంది. సహనం నెమ్మదిగా నశించిపోతోంది. ఎంతకాలం ఇలా ఉంటుంది ఈమె ఏ ఆడదానికైనా ఇంతకన్నా ఏం కావాలి? దారి తప్పబోతున్న జీవితాన్ని తను అందుకుని సరైన దారిలో నడిపిస్తున్నందుకు ఆమెకి కనీసం కృతజ్ఞత కూడా లేదు. ఏమిటి ఈమె ఉద్దేశం? అనేక ప్రశ్నలు అతని మనసులో సంఘర్షణ కలగచేస్తుంటే తన మనసులో భావాలు, తన ఆవేదన మధ్య, మధ్యలో చెప్పీ చెప్పకుండా చక్రవర్తికి చెబుతూ కొద్దిగా మనసు తేలిక పరుచుకునే ప్రయత్నం చేస్తున్నాడు.

కాలం గడుస్తూనే అర్చన ప్రవర్తనలో ఎలాంటి మార్పూ లేదు. వేణుతో పగలంతా సరదాగా ఉంటోంది. అందులో చక్రవర్తి, మాధవి కలిసిన రోజు ఆమె ఆనందానికి అడ్డే ఉండదు. వేణు చాలాసార్లు సన్నిహితంగా రావడానికి, ఆమెని బుజ్జగించి తన దారిలోకి తెచ్చుకోడానికి ప్రయత్నించాడు. పక్కన వెళ్ళి పడుకోగనే పెద్ద తాచుపామును చూసినట్టు చూసి, దిండూ, దుప్పటి తీసుకుని వెళ్ళిపోయి సోఫాలో పడుకుంటుంది. ఒకరోజు చాలా సీరియస్ అయాడు. " ఏంటి? నేనేం దయ్యాన్నా, భూతాన్నా ఎందుకలా దూరంగా ఉంటావు? నేను నీ భర్తను అర్చనా!? " అన్నాడు కోపంగా.

నిర్మొహమాటంగా అంది అర్చన. " సారీ వేణూ. జీవితంలో ఎప్పటికైనా నిన్ను భర్తగా చూడగలిగితే నేనే నీ పక్కన వచ్చి పడుకుంటాను. దయచేసి నన్ను ముట్టుకోవద్దు. మనం స్నేహితులం. "

వేణు ఉబికివస్తున్న కోపం అదుపు చేసుకుంటూ " నువ్వెప్పటికీ నన్ను భర్తలా చూడలేకపోతే? " అన్నాడు.

అర్చన మాట్లాడలేదు. కొన్ని క్షణాల తరువాత అంది. " నీ ఇష్టం వేణూ. నువ్వు వేరే పెళ్ళి చేసుకోడానికి నాకెలాంటి అభ్యంతరం లేదు. "

వేణు నిర్ఘాంతపోయాడు. " వేరే పెళ్ళా? దానికోసం నేనింత కష్టపడడం దేనికి అర్చనా!? నీకోసం నిన్ను పొందదం కోసం నేను నా ఉన్నత చదువు వదులుకుని ఉద్యోగం చూసుకున్నాను. ఇంత నిర్దయగా నన్ను వేరే పెళ్ళి చేసుకోమని అనేందుకు నీకు నోరెలా వచ్చింది? "

అర్చన మాట్లాడలేదు. "నేను నిన్ను బలవంతం చేశానా? " అనుకుంది మనసులో. తన మనసులో వేరే ఎవరో ఉన్నారని ఎలా చెప్పాలి? చెబితే అతని రియాక్షన్ ఎలా ఉంటుంది? అందుకే మౌనంగా అతని పక్కనుంచి లేచి అవతలకు వెళ్ళిపోయింది.

వేణు ఆవేశంతో వణికిపోయాడు. కానీ ఏం చేయలేక నిస్సహాయంగా పడుకుండిపోయాడు. "ఈమె మనసులో నేనెన్నటికీ గెలుచుకోలేనా? ఈమెని బలవంతంగా పెళ్ళిచేసుకుని పొరపాటు చేశానా? " అని ఆలోచిస్తూ చాలాసేపటికి నిద్రపోయాడు.

కాలం గడిచిపోతూనే ఉంది. మాధవి గర్భవతి అయింది. వేణుకి వాళ్ళముందు చాలా అవమానంగా అనిపించింది. అర్చనని ఎలా తనదాన్ని చేసుకోవాలా? అని ఆలోచిస్తూనే ఉన్నాడు.

అర్చన ఉద్యోగంలో చేరి మూడునెలలయింది. మాధవి నెలతప్పిన దగ్గరనుంచీ వాళ్ళిద్దరి మధ్యా రాకపోకలు ఎక్కువైనాయి. అర్చన కాపురం సంగతి తెలియని మాధవి "నువ్వు కూడా త్వరలోనే నా జత చేరాలి అర్చనా. నేను పాపని కంటే నువ్వు బాబుని, నేను బాబుని కంటే నువ్వు పాపని కనాలి" అంటూ ఆట పట్టించేది.

అర్చన పల్చగా నవ్వి "అన్నీ మన చేతుల్లో ఉన్నాయా? " అంటూ దాటేసేది. అయితే ఒకరోజు చక్రవర్తి ద్వారా మాధవికి అర్చన ప్రవర్తన తెలిసింది. ఆ రోజు అర్చనకి గట్టిగా క్లాసు తీసుకుంది. "పిచ్చి వేషాలేయకుండా జరిగింది మర్చిపోయి వేణుతో హాయిగా కాపురం చేసుకో" అంటూ వార్నింగ్ కూడా ఇచ్చింది. "వేణు మంచివాడు అతనిలాంటి భర్త లభించడం నీ పూర్వజన్మ సుకృతం" అంటూ కొసమెరుపు కూడా ఇచ్చింది. అర్చన అన్నిటికీ చిరునవ్వే సమాధానంగా ఇచ్చింది.

మాధవికి ఏడోనెల వచ్చింది. పురిటికి వెళ్ళింది. వెళ్తూ, వెళ్తూ "నేను బాబునెత్తుకుని వచ్చేసరికి నువ్వు ఖచ్చితంగా కన్సీవ్ అవాలి" అంటూ అర్చనని శాసించి మరీ వెళ్ళింది.

మాధవి మాటలు, వేణు తనకోసం పడుతున్న తపన, అర్చన ఆలోచనల్లో చిన్న మార్పుని తీసుకొచ్చాయి. అందరన్నట్టు వేణు తనకోసం త్యాగం చేశాడా? మంచివాడు. నిజంగానే మంచివాడు. ఏడాది కావస్తోంది పెళ్ళి అయి ఇంతవరకూ సహనంతో తన అంగీకారం కోసం చూస్తున్నాడేకానీ, ఏనాడూ హద్దుమీరి ప్రవర్తించలేదు. ఇంక ఎలాగూ ఈ జీవితం ఇంతే. ఇప్పుడిప్పుడే కొద్దిగా మనసు కుదుటపడుతోంది. కల కలగానే మర్చిపోవడానికి ప్రయత్నిస్తోంది. ఒక విధంగా ఈ ప్రయత్నంలో కృతకృత్యురాలవుతోంది కూడా. కాకపోతే నాగరాజు చేసిన డామేజీనే ముల్లులా పొడుస్తూనే ఉంది. అతని మీద ప్రతీకారం తీర్చుకోలేకపోయిన తన నిస్సహాయతకి తన మీద తనకే కోపం వస్తోంది. ఆ అవకాశం లభించకుండా చేసింది వేణే అని అనిపించినప్పుడల్లా వేణు మీద అంతులేని కోపం వస్తోంది. కానీ, ఆ కోపాన్ని అణచుకుని, శాంతంగా, ప్రశాంతంగా ప్రాక్టికల్గా ఆలోచించడానికి ప్రయత్నించింది.

ఆ రోజు ఒక నిర్ణయానికి వచ్చింది. ఇకనుంచీ వేణుని ప్రేమించాలని, అతని భార్యగా జీవితంతో రాజీ పడాలని నిర్ణయించుకుంది. రాజీ.. ఎంతమాత్రం ఇష్టంలేని పదం. రాజీ.. ఆడదానికి జీవితం అంటే రాజీ.. ఈ రాజీ అనేది లేకుండా తన ఇష్టం వచ్చినట్టు బతికే స్వేచ్ఛ వచ్చిందాకా ఆడదానికి స్వేచ్ఛ లేనట్టే అని తీర్మానించుకుంది.

28 వ తారీకు. రెండు రోజుల్లో నెల అయిపోతుంది. ఉద్యోగం మానేసి, చదువు ప్రారంభించాలి. వేణుతో కాపురం ప్రారంభించాలని దారీ తెన్నూ లేకుండా సాగుతున్న అల్లిబిల్లి ఆలోచనలకి ఫుల్స్టాప్ పెట్టి జీవితాన్ని జీవితంగా సాగించాలి. జీతం తీసుకుని ఉద్యోగం మానేయాలి. అలా అనుకుని ఆఫీసుకి వెళ్ళిన అర్చన జీవితంలో అదొక అత్యంత ముఖ్యమైన రోజుగా మారుతుందని ఊహించలేదు. ఆమె ఆఫీసుకి వెళ్ళేటప్పటికి అంతా హడావిడిగా ఉంది. కొత్త మేనేజర్ వస్తున్నాట్ట. పాత మేనేజర్ అమెరికా వెళ్ళిపోతున్నాట్ట అంటూ కొలీగ్స్ చెబుతుంటే ఆసక్తిగా వింది. అందరితో పాటు తానూ కొత్తగా వచ్చే బాస్ కోసం కుతూహలంగా ఎదురుచూసింది.

అతను వచ్చాడు. పొడుగ్గా, ఛామనఛాయిగా, సూదుల్లాంటి చూపులతో గుండెల్లో అలజడిని రేకెత్తిస్తూ పెదాల చాటున అస్పష్టంగా కదుల్తున్న చిరునవ్వుతో వచ్చాడు. అతడే.. అతడే. మొదటి రోజు మాల్లో, మరో రోజు సినిమా హాల్లో, ఇంకో రోజు మార్కెట్లో తరచూ కలలో కనిపిస్తూ తన హృదయంలో కల్లోలం సృష్టించిన వ్యక్తి. ఇతనా బాస్. ఆమె కళ్ళ ముందు పెద్ద పెద్ద

విస్ఫోటనాలు సముద్రం ఉవ్వెత్తున అలలతో ఎగిసిపడుతూ ఊరునంతా ముంచేస్తున్నట్టు ఆకాశం పెళ, పెళారావాలతో గర్జిస్తు పిడుగులు తనమీదే పడుతున్నట్టు, తన సుదీర్ఘమైన జీవితం చిన్న చాపచుట్టలా మారి ఆ అలలతో కొట్టుకుపోతున్నట్టు నిశ్చేష్టురాలై, శిలయై నిలబడిపోయింది.

ఎవరో పరిచయం చేస్తున్నారు. "ఈమె అర్చన. మీ సెక్రెటరీ."

అతను కళ్ళల్లో నవ్వుతో, పెదాల మీద హాలో అనే రెండక్షరాలతో సూటిగా చూశాడు.

అర్చన ఏమీ మాట్లాడలేదు. నవ్వుదామంటే పెదాలు బిగించుకున్నాయి. కళ్ళు శూన్యంగా చూశాయి. మధ్యాహ్నానికి లీవ్ లెటర్ ఇచ్చేసి వచ్చేసింది. ఆ రోజు తీసుకున్న నిర్ణయాలు, భవిష్యత్తు పట్ల వేసుకున్న పథకాలు అన్నీ సుడిగాలి వీచి చెల్లా చెదురైనట్టుగా అయాయి. అదే ఆఖరు ఆఫీసుకి వెళ్ళడం. రిజిగ్నేషన్ లెటర్ పంపించింది. ఎందుకు? కారణం ఏంటి? అంటూ అతను కబురు పంపించాడు. కానీ, ఏం చెప్పలేదు. ఏం చెప్పడానికి తన దగ్గర సమాధానం ఉంటే కదా?

వేణు కూడా పదే, పదే అడగసాగాడు. "ఏం అర్చనా ఇవాళ ఆఫీసుకి వెళ్ళడంలేదా? ఏం? ఒంట్లో బాగాలేదా? డాక్టర్ దగ్గరకు వెడదామా? ఏంటి ఇవాళ కూడా వెళ్ళవా? ఏమైంది. ఆఫీసులో ఏదన్నా ప్రాబ్లెమా? " ఏ ఒక్క ప్రశ్నకీ సమాధానం లేదు. చెప్పలేదు. పదిరోజులు గడిచిపోయాయి. కనీసం స్నేహితురాలిగా కూడా ఉండలేని స్థితి. అసలా ఇంట్లో ఉండడమే కష్టంగా, భారంగా, వేణుకీ, తనకీ మధ్య మళ్ళీ పెద్ద అగాధం. ఈ అగాధం ఇంక పూడ్చలేదు. అర్చన మానసిక స్థితి ఆమెకే అర్ధం కావడంలేదు.

అలాంటి సమయంలోనే వేణు, సహనం కోల్పోయిన వేణు, ఉద్రేకాన్ని, ఆవేశాన్ని, కోరికనూ ఆపుకోలేని వేణు ఆమె మీద అత్యాచారం చేశాడు. అతను భర్తే. కానీ, తన అంగీకారం లేకుండా, తన సహకారం లేకుండా, తన ఇష్టంలేకుండా తన మీద దౌర్జన్యం చేయడం సహించరానిది, భరించరానిది. చట్టపరంగా తీసుకుంటే శిక్షార్హమైనది. కానీ అర్చన అదేం ఆలోచించలేదు. తనకక్కడ రక్షణ లేదని, ఆ ఇంట్లో తనకి స్థానం లేదని మనసులో ఏ మాత్రం వేణుకి చోటు లేదని నిర్ణయించుకుంది. ఎవరికోసం విశాఖ మొత్తం జల్లెడ పట్టి వెతకాలని ఆశించిందో అతను ఎదురుగా ఎంతో చేరువుగా, ఎంతో సన్నిహితంగా వచ్చాడు. కానీ, తను తలెత్తి అతడిని కళ్ళారా చూసే అర్హతను కూడా కోల్పోయింది. ఇంక అక్కడ ఉండడం క్షేమం కాదు. ఉండలేదు కూడా. అందుకే అర్చన వేణునీ, వేణు ఇచ్చిన జీవితాన్నీ వదిలి బైటకి వచ్చేసింది.

***

అప్పటిదాకా నిశ్శబ్దంగా అర్చన చెప్పింది విన్న నళిని భారమైన హృదయంతో బరువుగా అంది. "చాలా పొరపాటు చేశావు అర్చనా.. చాలా పొరపాటు చేశావు. ఆ విషయం వేణుతో పంచుకుని, అతనితో బతకాల్సింది మనసులో ఉన్న బరువు ఎవరికన్నా చెప్పుకుంటే మనసు తేలికవుతుంది. "

అర్చన కన్నీళ్ళతో చూసింది. "నువ్వు కూడా ఇదే అంటున్నావా నళినీ.?"

"ఎవరైనా ఇలాగే అంటారు అర్చనా. మన దేశంలో కొన్ని సంప్రదాయాలు, ఆచారాలు, పద్దతులు ఉన్నది ఆచరించడానికే అవి ఆచరిస్తే మానవజీవితం, ముఖ్యంగా స్త్రీ జీవితం ప్రశాంతంగా గడిచిపోతుంది. "

"అంటే మనసులో ఇష్టం లేకుండా కేవలం ఓ కట్టెలా నా శరీరం నిత్యం రాత్రిళ్ళు వేణుకి అర్పిస్తూ, అసహ్యంగా కాపురం చేస్తూ, పిల్లల్ని కని, వాళ్ళని పెంచి, పెద్దచేసి, చదువులు, పెళ్ళిళ్ళు, పిల్లలు ఇదేనా నా జీవితం.!?"

"నీదే కాదమ్మా ప్రతి ఆడదాని జీవితం, ఆ మాటకొస్తే ప్రతి మగాడి జీవితం కూడా అంతే ఏం? ఆలోచనలు, ఆశలు, ఆశయాలు మగవాళ్ళకుండవా? నీకు తెలుసా అర్చనా మా నాన్న మా కుటుంబం కోసం ఎంత త్యాగం చేశారో, ఎన్ని కోరికలు చంపుకున్నారో, ఎంత సుఖాన్ని త్యజించారో నీకు తెలుసా. మా అమ్మకి కనీసం ఇంట్లోకి నాలుగు, బైటకి నాలుగు, రెండు పట్టుచీరలు

ఉండేవి. నాన్నకి ఒక లుంగీ, రెండు ప్యాంట్లు, రెండు షర్టులు. అవి సుమారు ఐదేళ్ళు వాడారు. ఇలాంటి వెన్నో నాకు తెలుసు. మా నాన్నలాంటి మధ్యతరగతి తండ్రులెందరో తమ పిల్లలకోసం, తమ కుటుంబం కోసం త్యాగాలు చేశారు, రాజీలు పడ్డారు. ఆఫ్టాల్ ఇది జీవితం అర్చనా.! సుదీర్ఘమైన జీవితంలో ఎన్నో మలుపులు ఏర్పడుతుంటాయి. ఎన్నో పరిచయాలు ఏర్పడుతుంటాయి. అంతా ఒక ప్రయాణంలా సాగిపోవాలి. నీకు రైలు ప్రయాణంలో నీతోపాటు ప్రయాణించే ఎందరితోటో పరిచయం ఏర్పడుతుంది. కొందరితో ఆ కొన్ని గంటల్లోనే ఒక సాన్నిహిత్యం, అనుబంధం ఏర్పడుతుంది. అలా అని వాళ్ళు దిగిపోయాక వాళ్ళకోసం ఏడుస్తూ కూర్చుంటావా? లేదు కదా అంతే అతనెవరో నీకు తెలియదు. ప్రేమించావు. ఇది ప్రేమ కూడా కాకపోవచ్చు. జస్ట్ ఆకర్షణ. నీ జీవితంలో జరిగిన యాక్సిడెంటు నుంచి నిన్ను కాపాడాడు. అలాంటిది అతని పట్ల నువ్వెంతో కృతజ్ఞత చూపాల్సింది. ఇలా చేయడం ఎంత మాత్రం హర్షణీయం కాదు అర్చనా. అయామ్ సారీ ఇలా అంటున్నానని ఏమీ అనుకోకు. ఎనీవే నీ జీవితం నీ ఇష్టం కానీ, ఒక శ్రేయోభిలాషిగా చెబుతున్నా. ఇప్పటికైనా మించిపోయింది లేదు. వేణుకి ఉత్తరం రాసి సారీ చెప్పు. వచ్చి తీసికెళ్తాడు. తప్పకుండా తీసికెళ్తాడు. "

అర్చన అయోమయంగా చూసింది నళినివైపు కొంత ఓదార్పు లభిస్తుందన్న ఆశతో చెప్పింది. నళిని ఇలా మాట్లాడుతుందేంటి? ఆడవాళ్ళంతా ఇలాగే మాట్లాడతారా? ఇదేనా జీవితం అంటే వేణుకి సారీ చెప్పి మళ్ళీ జీవితంలోకి ఆహ్వానించాలా? అంతకన్నా అవమానకరమైన విషయం ఇంకోటుందా?

అప్పటికే చీకటి పడింది. బైట స్ట్రీట్ లైట్లు వెలిగాయి. పార్కులో జనం కూడా లేచి ఇంటిదారి పడుతున్నారు. అప్పటిదాకా పిల్లల అల్లరితో కోలాహలంగా ఉన్న పార్కులో హఠాత్తుగా నిశ్శబ్దం ఆవరించింది. తదియ చంద్రుడు సన్నని దారంలా వంపు తిరిగి సుందరంగా ఉన్నాడు. "అదిగో అర్చనా నెలపొడుపు. దండం పెట్టుకో ఈ నెల నుంచీ నీ జీవితంలో మార్పొస్తుంది. "

వింతగా చూసింది అర్చన నళినివైపు. ఆమె చూపులో భావం గమనించిన నళిని అంది. "నెలపొడుపు చూసి, దేవుడిని, నీకిష్టమైన వాళ్ళనీ చూడాలి. నీ చీర చెంగునుంచి ఒక దారపు పోగు తీసి చంద్రుడికిచ్చి మనసారా నీ కోరిక వెల్లడించుకో. నీ కోరిక తప్పకుండా నెరవేరుతుంది. " అంటూ తన చీర చెంగు నుంచి ఒక దారపు పోగు తీసి చంద్రుడి వైపు విసిరి రెండు చేతులు జోడించి, దండం పెట్టుకుంది నళిని. అరచేతులు చూసుకుని, తన చేతులు తనే ముద్దుపెట్టుకుని "పద వెడదాం" అంది.

మౌనంగా ఆమెని అనుసరిస్తూ అనుకుంది అర్చన "ఎవరి నమ్మకాలు వారివి. ఎవరి జీవితం వారిది. "

●●●

**వేణు సెలవు అయిపోయింది. హైదరాబాదు తిరిగి వెళ్ళాలి.** ఆ రాత్రి తల్లి దగ్గర చిన్నపిల్లాడిలా మారిపోయాడు.

"అమ్మా బాబుని నేను తీసుకెళ్ళిపోనా? " అడిగాడు.

"నువ్వా? " ఆశ్చర్యంగా చూసింది తాయారమ్మ. "తీసుకెళ్ళి ఏం చేస్తావు? నువ్వు చూడగలవా వాడి ఆలనా, పాలనా ఎవరు చూస్తారు? "

వేణు వెంటనే సమాధానం చెప్పలేదు. ఎటో చూస్తూ ఆలోచనలో పడిపోయాడు.. "అవును తీసుకెళ్ళి ఏమి చెయ్యాలి? ఎలా వాడిని పెంచి పెద్ద చెయ్యాలి. వాడి పాలూ, నీళ్ళూ ఆలనా పాలనా ఎవరు చూస్తారు? "

తన కొడుకుని తనతో తీసుకెళ్ళాలన్న కోరిక ఉండడంలో తప్పు లేకపోవచ్చు కానీ, వాడిని గాలికి వదిలేసి పెద్దవాడిని చేయాలనుకోడం ధర్మం కాదే? గాఢంగా నిట్టూర్చాడు. మళ్ళీ చిన్న ఆశ ఏదో మిణుకుమంటూ మెరిసినట్టు అనిపించి అన్నాడు. "పనిమనిషిని పెట్టుకుంటానమ్మా. "

ఆవిడ వేణు జుట్టు నిమురుతూ సన్నగా నిట్టూర్చింది. కొన్ని క్షణాల నిశ్శబ్దం తరవాత అంది.

"పనిమనిషి మన మనిషి అవుతుందా నాన్నా వాడికి తల్లిలేదు. కానీ, నానమ్మని నేను బతికే ఉన్నాగా!? "

"అమ్మా..!" బాధగా పిలిచాడు. "అలా అనకమ్మా. నేను తట్టుకోలేను."

ఆవిడ సన్నగా నిట్టూరుస్తూ అంది. "నువ్వు తట్టుకోలేకపోయినా ఇది నిజం నాన్నా.." అలా అన్నాక ఆవిడ నెమ్మదిగా వేణు చేయి చేతిలోకి తీసుకుని నిమురుతూ "వేణూ! ఆ అమ్మాయి నీ నుంచి ఎందుకు దూరంగా వెళ్ళిందో కానీ తప్పు వెళ్ళి చేసింది. కానీ ఆ అమ్మాయికి కూడా ఏం వయసుందని? చిన్నపిల్లేగా. తప్పు చేసిందని వదిలేస్తామా? పెద్దవాళ్ళం నయానో, భయానో దారికి తీసుకురావడం మా బాధ్యత. ఏదో ఆవేశంలోనో, తొందరపాటో వెళ్ళిపోయింది."

"ఏం చేస్తాం చెప్పమ్మా. ఎక్కడని ఆవిడకోసం వెతుక్కుంటూ వెళ్తాం?"

"ఆడపిల్లకి రెండే ఇళ్ళుంటాయిరా. ఒకటి పుట్టిల్లు, రెండు మెట్టినిల్లు. ఇక్కడ లేదు. నీ దగ్గర లేదు. మిగిలింది పుట్టిల్లు ఖచ్చితంగా తల్లి దగ్గర ఉండే ఉంటుంది."

"తల్లి దగ్గర ఉన్నావిడ బాబుని ఇక్కడ ఎందుకు వదిలేసిందమ్మా?"

ఆ ప్రశ్నకి ఆమెకి సమాధానం తోచలేదు - అవును బాబుని ఇక్కడెందుకు వదిలేసింది?

అప్పుడే కృష్ణస్వామి అక్కడకి వచ్చాడు. భుజం మీద కండువా తీసి అరుగు మీద దులిపి కూర్చుంటూ అన్నాడు.

"ఏం నాన్నా వేణూ.. నీ సెలవలు అయిపోయాయి అనుకుంటా."

"అవును నాన్నా.." వేణు స్వరంలో వినిపించిన జీర అతని వేదన తెలియచేసింది ఆయనకి.

"బాబు గురించి ఏం నిర్ణయించావు?"

వేణు తల్లివైపు చుశాడు. ఆవిడ మంద్రంగా అంది. "వాడేం ఆలోచిస్తాడండి? బాబుని తీసుకెళ్ళాలని ఉబలాటపడుతున్నాడు. కానీ, ఎంతవరకు సాధ్యమో ఆలోచించలేదు."

ఆయన తల పంకిస్తూ అన్నాడు. "అవును. ఆడవాళ్ళ సంరక్షణ లేకుండా వాడినెలా చూసుకోగలవు?"

"ఏవండీ..!" తాయారమ్మ నెమ్మదిగా సందేహంగా పిలిచింది.

ఆయన ఆమె వైపు చూశాడు.

"ఒక్కసారి మనం వైజాగ్ వెళ్ళొద్దాం. కోడలికి నచ్చచెప్పి తీసుకొద్దాం."

లిప్తపాటు కాలం ఆయన కళ్ళల్లో కోపం వచ్చినట్టు ఎర్రజీరలు కనిపించాయి. వెంటనే తల పంకిస్తూ అన్నాడు.

"వెళ్ళడం మన బాధ్యత. అయితే, నేనూ వేణూ వెళ్ళి వస్తే బాగుంటుందేమో?"

ఆవిడ కళ్ళల్లో సంతోషం వెల్లివిరిసింది. తన ప్రతిపాదన ఆయన సమ్మతించడం అంటే తను చెప్పిందానికి ఆయన అంగీకరించడం అనుకుంటూ అంది. "అవును నేను వస్తే బాబునెవరు చూసుకుంటారు? అందుకే మీరిద్దరూ వెళ్ళిరండి."

"నేను రాను నాన్నా..!"

సడన్‌గా వేణు స్వరం వినిపించి ఇద్దరూ ఉలిక్కిపడ్డారు.

"ఏం? ఎంచేత?" ఆయన కొంచెం నొసలు చిట్లిస్తూ అనుమానంగా అడిగాడు.

"ఏం లేదు. నేను ఒద్దనుకుని వెళ్ళిపోయిన ఆవిడ కోసం నేనెందుకు దేబిరిస్తూ వెళ్ళాలి నాన్నా. నాకు బాబున్నాడు. చాలు వాడిని చూసుకుంటూ నేను బతికేయగలను."

"కానీ ఆ అమ్మాయికి ఆ అవకాశం కూడా లేదు కదరా."

"దానికి నేను బాధ్యుడిని కాదు నాన్నా."

"బాధ్యులెవరు? కారణాలేంటి? అవన్నీ తరువాత చర్చించుకుందాం. ముందు మన ప్రయత్నం మనం చేయాలి. ఆ అమ్మాయి జరిగిన సంఘటనకి భయపడి సంసార జీవితం మీద విరక్తి పెంచుకుందా? మగవాళ్ళంటేనే అసహ్యించుకుంటోందా? లేక నువ్వన్నట్టు స్వేచ్ఛ కోసం వెళ్ళిపోయిందా మనకి ఖచ్చితంగా తెలియాలి. నువ్వన్నదే నిజమైతే ఆమెని బతిమాలను. కానీ, బతుకు గురించి తెలియచేయడం మాత్రం నా ధర్మం, నా కర్తవ్యం. "

వేణు మాట్లాడలేదు. మౌనంగా ట్యూబ్ లైటు కింద పురుగులకోసం తిరుగుతున్న బల్లిని చూస్తూ కూర్చున్నాడు.

"లైటార్పేస్తాను. బల్లులు చేరుతున్నాయి. వెన్నెల ఉందిగా.. " అంటూ తాయారమ్మ లేచి స్విచ్ ఆఫ్ చేసింది.

అప్పటిదాకా ట్యూబ్ లైటు వెలుగులో ఓ రకంగా ఉన్న పరిసరాలు ఇప్పుడు వెన్నెల వెలుగులో నిపుణుడైన చిత్రకారుడి చేతిలో రూపు దిద్దుకున్న అద్భుతమైన చిత్రంలా అందంగా ఉంది. పారిజాతం పూల పరిమళం గాలిలో తేలి వస్తోంది. పూలన్నీ నేలన రాలి తివాచీ పరిచినట్టున్నాయి. కొబ్బరి మట్టల మధ్య నుంచి జాబిల్లి దోబూచులాడుతూంది. ఊరంతా మాటు మణిగింది. అంత నిశ్శబ్దంలో అంత రాత్రివేళ మొదటిసారిగా వేణుగోపాలస్వామి ఆలయపూజారి కృష్ణస్వామిగారి ఇంటి ఆవరణలో ఆ ఇంటి సభ్యులు కూర్చుని తీవ్రమైన ఆలోచనలో పడడం వాళ్ళకే చిత్రంగా అనిపిస్తోంది. పదికాకుండానే లైట్లన్నీ ఆర్పి నిద్రలోకి జారిపోయే ఆ వృద్ధ దంపతులు ఈ రోజు పదకొండు దాటుతున్నా కొడుకు కాపురం పట్ల కలతతో నిద్రరాక చింతాక్రాంతులై కూర్చున్నారు

ఊహించని సమస్య వచ్చింది. ఆ సమస్య పరిష్కరించాలి.. ఎలా? ఇదే ఆ దంపతుల ఆలోచన.

అయితే, తాయారమ్మ చేసిన ప్రతిపాదనని కృష్ణస్వామి బాధ్యతాయుతంగా అంగీకరించినా, వేణు మనసు మాత్రం ససేమిరా అంటోంది. వెళ్ళినా ఒరిగేదేం లేదని అతని మనసు గట్టిగా చెపుతోంది. కానీ ఆ విషయం తల్లి, తండ్రులకి చెప్పడం ఇష్టం లేనివాడిలా మౌనంగా ఉండిపోయాడు.

కృష్ణస్వామి స్వరం మరోసారి ఆ నిశ్శబ్దంలో గంభీరంగా మోగింది. "ఏం వేణూ. రేపు ఉదయం ఫస్ట్ బస్‌కి విశాఖ వెడదామా? "

కాదనే శక్తి వేణుకి లేదు. అలాగని వెళ్ళాలన్న ఆసక్తీ లేదు. అందుకే తటస్థంగా తలుపాడు.

మర్నాడు వేణు, కృష్ణస్వామి విశాఖపట్టణం వెళ్ళటానికి ఆ రాత్రి నిర్ణయం జరిగిపోయాక ఎవరి గదుల్లోకి వాళ్ళు వెళ్ళిపోయి మంచం మీద వాలారు. కానీ, కృష్ణస్వామి దంపతులు ఒక ఆలోచనతో, వేణు మరొకరకమైన ఆలోచనలతో దాదాపు జాగారమే చేశారు.

●●●

అర్చనకి రోజులు చాలా హాయిగా గడిచిపోతున్నాయి.

స్కూల్లో పిల్లల మధ్య గడుపుతుంటే బాధలన్నీ మర్చిపోయి, ఉల్లాసంగా అనిపిస్తోంది.

స్కూల్లో టీచర్‌గా ప్రస్థానం కొనసాగిస్తూ సివిల్స్‌కి ప్రిపేర్ అవడంకోసం చాలా పుస్తకాలు కొనుక్కుని వచ్చింది.

రోజూ సాయంత్రం ఇంటికి రాగానే కాస్సేపు టీ తాగుతూ మొక్కల మధ్య గడపడం, కాస్సేపు వరమ్మగారితో కబుర్లు చెప్పడం, ఆ తరవాత రెండే రెండు పుల్కా తిని, చదువుకుంటూ కూర్చోడం రాత్రి ఏ పన్నెండింటికో పడుకోడం వేరే ఆలోచనలకు సమయం సరిపోనంత బిజీగా దినచర్యని ప్లాన్ చేసుకుంది. అయితే తనను వెంటాడే కలనుంచి తప్పించుకోడానికి తప్పనిసరై నిద్రమాత్రలు రోజూ వేసుకోవాల్సి వస్తోంది. ఆ మాత్రల ప్రభావం మరునాడు మధ్యాహ్నం పూటకూడా పడుతుండడంతో బలవంతంగా నిద్రనుంచి తప్పించుకుంటూ నెట్టుకొస్తుందేమో రాత్రిపూట చదువు సరిగా సాగడంలేదు. అందుకే క్రమంగా రోజూ వేసుకునే మాత్రలు రోజు విడిచి రోజుకి మార్చింది. అలా నెమ్మదిగా పూర్తిగా మానేయాలని తన మనసులో మరే ఆలోచనకీ చోటివ్వకూడదని నిశ్చయం చేసుకుంది అర్చన.

ఆమెకి ఒక ధ్రుఢమైన నమ్మకం పడిపోయింది. ఈ జీవితంలో ప్రేమా, పెళ్ళి, సంసారం భర్త వీటికి చోటులేదు. రాదు అనుకుంది. తనని ప్రేమించిన వ్యక్తిని తాను దూరం చేసుకుంది. తను ప్రేమిస్తున్నవాడు మొదటినుంచీ దూరంగానే ఉన్నాడు. భగవంతుడెందుకో అతడిని దగ్గరకు తీసుకొస్తున్నట్టే తీసుకొస్తూ దూరంగా తరిమేస్తున్నాడు. బహుశా తనకి ప్రేమ అచ్చిరాదేమో అనుకుని విరక్తిగా నవ్వుకుంది.

ప్రేమ.... ఎంత మధురమైనవీ అక్షరాలు. జీవితంలో ఒక్కసారన్నా ప్రేమించని, ప్రేమించబడని మనిషి ఎవరూ ఉండరేమో.

ప్రేమ మనిషికి టానిక్ లాంటిది. అందులోనూ కోరుకున్నవాళ్ళ ప్రేమ లభించడం అదృష్టవంతులకే దక్కుతుందేమో. తను చాలా దురదృష్టవంతురాలు.

భర్త, ప్రియుడు, అమ్మ, నాన్న, అన్నయ్య, ఆఖరికి రేపో, మాపో ప్రేమించే కొడుకు ప్రేమకు కూడా నోచుకోని ఈ బతుకు బతుకేనా..

వేణు తనని ఖచ్చితంగా ఈ పాటికి ద్వేషిస్తూ ఉంటాడు. అసహ్యించుకుంటాడు.

పోనీలే కనీసం బాబుని చేరదీస్తే చాలు. వాడికి మంచి భవిష్యత్తునిస్తే చాలు. ఏనాటికైనా తను వాడిని కలుస్తుంది. యస్.. కలుస్తుంది. తల్లిగా తనకా హక్కుంది. తన లక్ష్యం నెరవేర్చుకుని తన గమ్యం చేరుకుని వాడిని కలుస్తుంది. ఒక గౌరవనీయమైన స్థానం సంపాదించుకుని వాడిని కలుస్తుంది. వాడి ప్రేమని తాను పొందుతుంది.

ప్రేమిస్తాడా? వాడు తనని ప్రేమిస్తాడా? పసివాడిని నిర్ధయగా అలా వదిలి వచ్చిందని వాడికి తెలిస్తే తనని క్షమిస్తాడా?

వేణు తనని రానిస్తాడా? బాబుని కలవనిస్తాడా? వాడిని చేరదీయనిస్తాడా? ఎప్పటికైనా వాడిని తన దగ్గరకు తెచ్చుకోవాలన్న తన కోరిక నెరవేరుతుందా?

ఆ ఆలోచన రాగానే కలవరంతో పిచ్చెక్కినట్టు అయిపోయింది. మళ్ళీ కొద్దిసేపటికే తానలా చేసింది వాడి భవిష్యత్తుకోసమే. వాడిని తను చేర్చాల్సిన చోటికి చేర్చానని తనకి తాను సర్దిచెప్పుకుంటూ, నచ్చచెప్పుకుంటూ బాధ దరిచేరనీకుండా జాగ్రత్త పడసాగింది.

ఇంక ఈ జీవితానికి పెళ్ళి అనేది లేదు కాబట్టి తను కేవలం అర్చనగా ఉండిపోతుంది. ఈ అర్చన ఎవరికీ ఏమీ కాదు. కానీ వాడికి మాత్రం తల్లి అవుతుంది. ఈ హక్కు ప్రకృతి అనే న్యాయస్థానం ఇచ్చింది. దీన్ని కాదనే హక్కు ఎవరికీ ఉండదు.

ఎప్పటికైనా వాడు తన దగ్గరకు రావాల్సిందే. ఎందుకంటే వేణుకి తప్పకుండా అతని తల్లి, తండ్రి మళ్ళీ పెళ్ళి చేస్తారు. భార్యా, పిల్లలు అతనికి విడిగా ఒక సంసార జీవితం ఏర్పడుతుంది. అప్పుడు..... అప్పుడు తన కొడుకు ఆ ఇంట్లో పరాయివాడు అవుతాడు. నో.. అలా కాకూడదు. మహా అంటే ఐదేళ్ళు. ఐదేళ్ళలో తన జీవితం ఒక గాడిన పడుతుంది. ఒక స్థానం, హోదా, డబ్బు సంపాదించుకున్నాక తన కొడుకుని తాను తెచ్చుకోవచ్చు.

అలా అనుకున్నాక అర్చనకి మనసు ప్రశాంతంగా అనిపించింది.

ఆమె ప్రస్తుతం మరో రిక్రియేషన్ నళిని. నళినితో కష్టసుఖాలు మాట్లాడుకుంటూ ఉంటే కొత్త, కొత్త జీవిత సత్యాలేవో తెలుస్తున్న భావన కలుగుతోంది. నళినితో స్నేహం సాఫీగా, ప్రశాంతంగా సాగుతోంది. ఆమె ఒక ఫిలాసఫీని నమ్ముతుంది. భగవంతుడివి మనస్ఫూర్తిగా నమ్ముతుంది. ' నువ్వెందుకు పెళ్ళి చేసుకోలేదు నళినీ?' అనడిగితే ' ఇది భగవంతుడి ఆజ్ఞ నన్నిలా కన్యగానే ఉండిపోయి ఈ పిల్లలకి నా సేవలందించమని ఆ దేవుడు ఆజ్ఞాపించాడు. దాన్ని కాదనే అధికారం, ధైర్యం నాకు లేవు' అంటుంది.

అంతేకాదు. ' నీ కలలో కనిపించే రాజకుమారుడు నీకు వచ్చే జన్మలో తప్పకుండా భర్త అవుతాడు. కొందరికి పూర్వజన్మ స్మృతులు ఉంటాయి తెలుసుకదా. చాలాసార్లు పేపర్లలో చదివాం. అలాగే కొందరికి తరువాత జన్మకి సంబంధించిన విషయాలు ఇలా కలలుగా వస్తుంటాయి. కాబట్టి ఈ జన్మలో నువ్వు కోరుకునే వ్యక్తి నీకు భర్తగా వస్తాడన్న ఆశ ఏదన్నా ఉంటే మనసులోంచి తుడిచెయ్.

నా మాట విని హాయిగా వేణు దగ్గరకు వెళ్ళిపోయి దర్జాగా బతుకు. లేదంటే పిల్లలతో ఇలా గడిపెయ్. అంతేగానీ ఆకాశంలో చందమామని కొప్పున అలంకరించుకోవాలనుకోడం, నక్షత్రాలను నెక్లెసుగా అలంకరించుకోవాలనుకోడం తెలివి తక్కువ' అని అర్చనకి బ్రెయిన్ వాష్ చేయడానికి ప్రయత్నిస్తుంటుంది.

నళిని మాటలు విని, పల్చగా నవ్వి ఊరుకుంటుంది అర్చన. ' నేనంత బలహీనురాల్ని కాను నళినీ..' అని మాత్రం మనసులో అనుకుంటుంది.

అంతేకాక, నాగరాజు మీద పగ తీర్చుకోవాలన్న అర్చన ఆలోచనను కూడా వ్యతిరేకించింది నళిని. ' అతనికి పెళ్ళయింది. నువ్వు అనవసరంగా మూసేసిన ఫైల్ ఓపెన్ చేశావంటే మరో అమ్మాయి జీవితం నాశనం అవుతుంది. కాబట్టి జరిగిందేదో జరిగింది. మర్చిపో. మనిషిలో రోజు గడుస్తున్న కొద్దీ ప్రవర్తన, ఆలోచన మారుతుంటుంది. రెండేళ్ళ నాటి సంఘటన తిరిగి తవ్వుకోడం మూర్ఖత్వం అవుతుంది. ఎవరూ నీకు సపోర్ట్ కూడా రారు. నిన్నే ఇంకా దుమ్మెత్తిపోస్తారు. అంచేత నా మాట విని నీ భవిష్యత్తు నీకు అనుకూలంగా, సుఖంగా ఉండేలా డిజైన్ చేసుకో. అంతేగానీ, పంతాలకు పోకు' అంటూ సలహా ఇచ్చింది.

నళిని మాటల ప్రభావం అర్చన మీద బాగానే పడింది. నాగరాజు గురించి ఆలోచిస్తూ కాలం వృధాగా గడిపేస్తున్నాననిపించింది. ఆమెకి తెలిసినంతమట్టుకు నాగరాజు డిగ్రీ ఫెయిల్ అయ్యాడు. చదువు పక్కన పెట్టి అతని తండ్రి అతనికి తన బిజినెస్‌లో కొంత షేర్ ఇచ్చి మంచి కట్నంతో పెళ్ళి చేసి వాళ్ళని విడిగా పంపించేశాడు.

నాగరాజు తండ్రికి అంతో, ఇంతో విలువలున్నాయి. అతను అర్చన అని తెలియకపోయినా ఒకమ్మాయికి ద్రోహం చేశాడని తెలిసింది. అంతేకాదు. కొడుకు చదువు నిర్లక్ష్యం చేయడం కూడా సహించలేకపోయాడు. ఎంత డబ్బున్నా, ఎంత పదవి, అధికారం ఉన్నా, తన కొడుకు ఒక అప్రయోజకుడని నలుగురిలో చెప్పుకోడం ఆయనకి ఇష్టంలేదు. అలా అని కొడుక్కి శ్రద్ధ లేకున్నా, డబ్బుతో ఇంజనీరింగ్ సీటులు, సర్టిఫికెట్‌లు కొనివ్వడం కూడా ఆయన సిద్ధాంతాలకి విరుద్ధం. అందుకే డిగ్రీ ఆపేసి బిజినెస్‌లో దింపాడు. అదికూడా అతని మేధా స్థాయికి తగినట్టు రియల్ ఎస్టేట్ బిజినెస్. విశాఖపట్టణానికీ, భీమ్లీకి మధ్య ఉన్న ప్రాంతంలో విల్లాలు కడుతున్నాడని ఆమెకి తెలిసింది.

చాలాసార్లు అనుకుంది. నాగరాజు తండ్రినే కలవాలని. కానీ, ఎందుకో ఆమెకి ఈ ఒక్క విషయంలో సాహసం చేయలేకపోయింది. అందుక్కారణం ఆయన తప్పకుండా తననే నిందిస్తాడని ఆమెకు తెలుసు. అంతేకాక నళిని అనేకసార్లు ఆమె ధైర్యాన్ని దెబ్బతీయడం, అవమానాలను ఎదుర్కొనే శక్తి లేకపోవడం ఏదైనా ఏనాటికైనా అతను కలుస్తాడని ఏదో ఒక విధంగా కక్షతీర్చుకోవాలని అనుకుంటోంది. కానీ, ఎలాంటి కక్ష అనేదానికి ఆమెకే స్పష్టమైన ఆలోచన లేదు.

అందుకే అన్ని ఆలోచనలకు స్వస్తి చెప్పి, భవిష్యత్తు ప్రణాళిక వేసుకుంది. అందులో భాగమే తన ఆశయం నెరవేర్చుకునే వైపుగా వేసిన అడుగు. పుస్తకాల సేకరణ, పఠనం.

ఆ రోజు నళిని ఒక ప్రపోజల్ చేసింది. పిల్లలని తీసుకుని అరకు టూర్ వెళ్ళాలని. సంతోషంగా ఒప్పుకుంది అర్చన. ముప్పైమంది పిల్లలతో స్పెషల్ బస్సు మాట్లాడుకుని అరకు ప్రయాణం అయారు. దారిలో ఎదురయే ప్రకృతి దృశ్యాలను మైమరిచి చూస్తూ తనను తాను మర్చిపోయింది అర్చన. అరకులో గిరిజనులతో కలిసి ధింసా నృత్యం చేయడం, అందమైన ఉడ్ కాటేజ్ నుంచి గార్డెన్ చూడడం, అరకు ఎగ్జిబిషన్‌లో మానవ జీవన పరిణామ క్రమం శిల్పాలు చూసి వాటి గురించి, తెలుగువారి జీవనశైలి గురించి పిల్లలకు తనకు తెలిసినంతవరకు వివరిస్తూ ఆ శిల్పాల పక్కన నిల్చుని ఫోటోలు తీయించుకోడం అన్నీ మరుపురాని మధురానుభూతులుగా మూట కట్టుకుంది.

ఎంత బాగుంది అరకు.!! గిరిజనులతో ఆట, పాటానే కాక వాళ్ళతో కలిసి చాలా ఫోటోలు తీయించుకున్నారు. వాళ్ళిచ్చిన చిన్న, చిన్న బహుమతులు పదిలంగా దాచుకుంది. వెదురుతో చేసిన విసనకర్రలు, బొమ్మలు ఎంతో బాగున్నాయి అంటూ.. వాళ్ళ పనితనం మెచ్చుకుంది. 'వీళ్ళల్లో ఎంత కళ ఉంది నళినీ కానీ, ఎందుకు వీళ్ళు నాగరిక సమాజానికి దూరంగా ఉంటారు. అక్షరాస్యత వైపు ఎందుకు వీళ్ళ దృష్టి వెళ్ళదు? ' అని కొద్దిగా బాధపడింది.

'ఉండనీలే అర్చనా.. ఈ ప్రపంచంలో నిష్కల్మషమైన, నిర్మలమైన మమతానురాగాలు మనకి కావాలన్నప్పుడు ఇక్కడికి వచ్చి సేద తీరాలంటే వీళ్ళిక్కడే, ఇలాగే ఉండనీ. నాగరిక సమాజంలోకి వస్తే వీళ్ళు మనలాగే పొల్యూట్ అవుతారు' అంది నళిని.

'ఎంత స్వార్థం!?' అంటూ నవ్విందే కానీ, ఆ మాట నిజమే అని ఎక్కడో అంతరంగంలో చిన్న భావన అంకురించింది.

అక్కడినుంచి బొర్రాగుహలు వెళ్ళారు. కొందరు లోపలికి వస్తే కొందరు పిల్లలు భయపడ్డారు. భయపడిన పిల్లలకి తోడుగా అర్చన బైటనే ఉండిపోయింది. నళిని, మరో టీచర్ ఆ పిల్లలతో పాటు లోపలికి వెళ్ళారు.

ఇలా అర్చన ఈ విహారయాత్రలో ఉన్నప్పుడే కృష్ణస్వామి, వేణు వైజాగ్ రావడం అర్చన జాడ తెలియక వెనక్కి వెళ్ళిపోడం జరిగింది. కృష్ణస్వామి బాధగా తన ఊరు వెళ్ళిపోతే వేణు అక్కడినుంచి హైదరాబాదు వెళ్ళిపోయాడు. వెడుతూ, వెడుతూ బాబుని తన దగ్గరకు పంపించే ఏర్పాటు చేస్తే బాగుంటుందన్న కోరిక వెలిబుచ్చాడు.

కానీ, ఏ విధంగానూ బాబుకి అక్కడ క్షేమకరంగా లేకపోవడంతో ఏం చేయాలో తోచలేదు తాయారమ్మకి. బాగా ఆలోచించిన మీదట ఒకటే ఆలోచన వచ్చింది. నీలవేణినీ, బాబునీ వేణు దగ్గరకు పంపేస్తే.. కానీ, వయసులో ఉన్న పిల్ల నీలవేణి. పనిపిల్లే అయినా ఆడపిల్ల ఎలా పంపించగలదు? ఏం చేయాలో తోచలేదు ఆవిడకి. పైగా రోజు, రోజుకీ ఊళ్ళో వాళ్ళ ప్రశ్నల పరంపర ఎక్కువ అయిపోతోంది. ' తాయారమ్మగారూ ఇంతకీ ఈ బాబు ఎవరో తెలిసిందా? వీడి తల్లి ఎవరో, మన ఊరికి ఆమెకి సంబంధం ఏమిటో వాకబు చేశారా? కులం, గోత్రం తెలియని పిల్లాడిని ఇంట్లో పెట్టుకున్నారు. తర్వాత, తర్వాత ఇబ్బంది పడతారేమో.!? ' అంటూ ఎవరికి తోచిన సలహా వాళ్ళివ్వడం ఎక్కువైపోతోంది. ఈ విషయాలన్నీ ఒకరోజు రాత్రి భర్తతో చర్చించింది ఆవిడ.

ఆవిడ చర్చించడం వలన కాక, ఆయన కూడా పరోక్షంగా ఆ ప్రశ్నలు ఎదుర్కొంటున్నవాడే అవడంతో ఆయన కూడా ఈ విషయం తీవ్రంగానే ఆలోచించసాగాడు. అలా ఆలోచించాక ఒక నిర్ణయానికి వచ్చాడు.

వేణు కోరిక ప్రకారం బాబు వేణు దగ్గర ఉండాలంటే, అదీకాక, ఆ ఊళ్ళో బాబు తల్లి ఎవరో, ఆమె ఎందుకు ఆ బాబుని అక్కడ వదిలేసిందో ఊళ్ళో వాళ్ళకి తెలియకూడదంటే ఒకటే మార్గంగా భావించాడు కృష్ణస్వామి. నీలవేణినీ, బాబునీ వేణు దగ్గరకు పంపించడం, కాకపోతే వయసులో ఉన్న నీలవేణిని వేణు దగ్గర వదిలేసి రేపేదన్న జరగరానిది జరిగాక మళ్ళీ మరో సమస్య మీద పడకుండా ఉండాలంటే తాయారమ్మగారు కూడా వాళ్ళతో వేణు దగ్గరకు వెళ్ళడం.

ఆయన నిర్ణయం విన్న తాయారమ్మ కళ్ళనీళ్ళు పెట్టుకుంది. "పెళ్ళయి మీ దగ్గరకు వచ్చాక పట్టుమని పదిరోజులు కూడా మిమ్మల్ని వదిలి పుట్టింట్లో కూడా ఉన్నాను కాదు. అలాంటిది ఈ వయసులో మిమ్మల్ని వదిలి ఎలా వెళ్ళనండి? మీ ఆరోగ్యం మాత్రం నాకు ముఖ్యం కాదా? " అంది.

ఆయన సాలోచనగా అన్నాడు. "తప్పదు తాయారూ. మనకి అన్నిటికన్నా మన అబ్బాయి క్షేమం, మనవడి భవిష్యత్తు ముఖ్యం. నేను ఎలాగైనా కోడలి ఆచూకీ సంపాదిస్తాను. త్వరలో సమస్య పరిష్కరించి వాళ్ళ కాపురం బాగుచేస్తాను. ఆ తరువాత మళ్ళీ మన ఊరు, మనం.. కొంతకాలం తప్పదు. "

" పట్నం మొహం కూడా తెలియదు నాకు ఎలా ఉండాలో? ఏంటో? " అందావిడ దిగులుగా.

"పర్లేదు నీలాంటి చాదస్తపు ఇల్లాళ్ళెందరో అమెరికా వెళ్ళి నాగరికత నేర్చుకుని వస్తున్నారు. నువ్వు వెళ్ళేది మనదేశం, మన రాష్ట్రం, మనవాళ్ళుండే చోటు. ఏం ఫర్వాలేదు. వేణు స్నేహితులున్నారు. అతని భార్య మాధవి లక్షణమైన పిల్ల. నీకు తోడుగా ఉంటుంది. కాకపోతే బాబుని నువ్వొక్కదానివి చూసుకోలేవు కాబట్టి నీలవేణిని పంపిస్తున్నాను. "

"అది లేకుండా బాబుని నేను చూసుకోలేనన్నది నిజమేలెండి. సరే కానివ్వండి. తప్పదు కదా! " అందావిడ నిట్టూరుస్తూ..

ఆయన భార్యని ఆప్యాయంగా, ఆదరంగా దగ్గరకు తీసుకున్నాడు. చాలాకాలం తరవాత భర్త గుండెలమీద పడుకుని ఆయన్ని చిన్నపిల్లలా హత్తుకుపోయిందావిడ.

మర్నాడు ఉదయమే వేణుకి ఫోన్ చేసి తన నిర్ణయం తెలియచేశాడాయన.

వేణు ఆనందంతో పొంగిపోయాడు.

"థాంక్స్ నాన్నగారూ థాంక్యూ వెరీమచ్.." అంటూ పదే, పదే కృతజ్ఞతలు తెలిపాడు తండ్రికి.

●●●

తాయరమ్మ గారితో కలిసి మొదటిసారిగా హైదరాబాదు చేరిన నీలవేణికి ఉక్కిరి, బిక్కిరి అవుతున్నట్టుగా అనిపించింది. ఏమిటీ జనం? ఎక్కడికి వీళ్ళ పరుగులు? ఎందుకింత హడావుడి? ఎవరి మొహాలు చూసినా ఏదో ఆందోళన ఎంచేత? ఆమెకి ఏమీ అర్థంకాలేదు. "అమ్మగారూ పాపం వీళ్ళంతా ఏటండి.. ఇంత దిగాలుగా ఉన్నారు? " అనడిగింది తాయారమ్మని.

"నాకు మాత్రం ఏం తెలుసే. నీతోటే వచ్చాను. అడుగో అబ్బాయి వస్తున్నాడు. బాబునిలా ఇవ్వు. సామాను పట్టుకో.. " అంటూ నీలవేణి భుజమ్మీంచి బాబుని తీసుకుంది.

వేణు మొహం నిండా సంతోషంతో పరుగులాంటి నడకతో వచ్చాడు. "అమ్మా.. " అంటూ ఆవిడ చేయి పట్టుకుని నొక్కి "ప్రయాణం బాగా జరిగిందామ్మా? భయం వేసిందా? " అనడిగాడు బాబుకోసం చేయి చాపుతూ.

"బాగానే జరిగింది నాన్నా. వాడు నిద్రపోతున్నాడు. పదముందు.. మమ్మల్ని ఇక్కడి నుంచి ఈ జనప్రవాహం నుంచి బైటికి తీసుకెళ్ళరా నాకు ఊపిరాడడంలేదు.. " అందావిడ.

వేణు నవ్వాడు. నీలవేణి దగ్గరనుంచి రెండు బ్యాగులు అందుకున్నాడు. నీలవేణి మరో బ్యాగు పట్టుకుంది. ముగ్గురూ ఆటో వైపు నడిచారు.

ఒక ఆటోలో నీలవేణి తాయారమ్మ కూర్చుంటే మరో ఆటోలో సామానుతో తను కూర్చున్నాడు. తన ఆటోని అనుసరించమని వాళ్ళు కూర్చున్న ఆటో అతనికి చెప్పాడు. ఆటోలు కదిలాయి.

నీలవేణి విశాలమైన కళ్ళతో దాటిపోతున్న పరిసరాలను, రోడ్లను, జనాన్ని వింతగా, ఆసక్తిగా గమనిస్తుంటే తాయారమ్మ రోడ్లమీద ఉన్న చెత్తా, చెదారం, ఉమ్ములు, ఎక్కడ పడితే అక్కడ మగవాళ్ళు నిలబడి ఉచ్చలు పోయడం చూస్తూ ముక్కుకి చీర చెంగు అడ్డం పెట్టుకుని నొసలు చిట్లించి విసుక్కోసాగింది.

" ఇదేం ఊరో, దిక్కుమాలిన ఊరు శుచీ, శుభ్రంలేవు బొత్తిగా. ఈ పిచ్చ వెధవ ఇక్కడికెందుకు వచ్చిపడ్డాడో.. " అంటూ చిరాకు పడసాగింది. నీలవేణి అదేం పట్టించుకోకుండా కలలో కూడా ఊహించని పట్నంని కుతూహలంగా గమనిస్తూ కూర్చుంది.

ఆటో ఇల్లు చేరేటప్పటికి మాధవి గుమ్మంలోనే ఎదురొచ్చింది. తాయారమ్మ దగ్గరగా నడిచి ఆవిడ భుజమ్మీద ఉన్న బాబుని అందుకుని " నా పేరు మాధవి పిన్నిగారూ.. " అంటూ తనని తాను పరిచయం చేసుకుంది.

లక్ష్మీదేవిలా దర్శనమిచ్చిన మాధవిని చూడగానే ఆవిడ చికాకు మాయమైపోయింది.

లోపల అడుగుపెడుతుండగానే కమ్మటి ఉప్మావాసన, కాఫీ వాసన ఆవిడ ముక్కుపుటాలకు సోకి, నేరుగా స్నానానికి వెళ్ళిపోయింది. బిక్కు, బిక్కుమంటూ నిలబడిన నీలవేణిని చూస్తూ " అలా వెళ్ళి పెరట్లో మరో బాత్రూం ఉంది. అక్కడే ఒక గది ఉంది నీ సామాను అందులో పెట్టుకుని స్నానం చేసిరా" అంటూ దారి చూపించింది మాధవి.

నీలవేణి తన బ్యాగు తీసుకుని మాధవి చూపించిన వైపు వెళ్ళిపోయింది.

మాధవి బాబుని రెండు అరచేతుల మీదకి తీసుకుంది. వాడు లేచి కళ్ళు తెరిచి చూస్తున్నాడు. వేణు వైపు చూస్తూ అంది మాధవి.

"అర్చన పోలికే.. నీ పోలికలు లేవు. "

వేణు నవ్వాడు.

మాధవి బాబుని వేణు చేతికిచ్చి వంట గదివైపు వెళ్ళిపోయింది.

వేణు బాబుని ఎత్తుకుని కుర్చీలో కూర్చుని తదేకంగా వాడినే చూడసాగాడు.

"మీ అమ్మ నీ మొహం సరిగా చూసి ఉండదురా. చూసి ఉంటే నిన్నిలా వదిలేసేది కాదు. పోనీలే నిన్ను నాకు వదిలి మంచిపని చేసింది. మీ అమ్మ చేసిన మంచిపని ఇదొక్కటే. ఈ విషయంలో కూడా మూర్ఖపు నిర్ణయం తీసుకుని ఉంటే నాన్నా నిన్ను నేను ఈ జన్మలో చూడగలిగేవాడిని కాదురా." వేణు కళ్ళనుంచి రెండు కన్నీటి చుక్కలు బాబు చేతిమీద పడ్డాయి.

అప్పుడే స్నానం చేసి, తయారై వచ్చిన తాయారమ్మ వేణు దగ్గరగా వచ్చి చెంగుతో అతని చెంపలు తుడిచింది. బాబుని చేతుల్లోకి తీసుకుని "వెళ్ళు నాన్నా స్నానం చేసిరా. ఆఫీసుకి వెళ్ళవా? " అంది వేణు భుజమ్మీద ఆప్యాయంగా తడుతూ.

వేణు మౌనంగా లేచి వెళ్ళిపోయాడు. మాధవి అందరికీ వేడి వేడి ఉప్మా, ఇడ్లీ, కారప్పొడి, సాంబారు చేసిపెట్టింది.

నీలవేణి మాధవికి సాయం చేయడానికి లోపలికి వెళ్ళిపోతే, వేణు ఆఫీసుకు వెళ్ళిపోయాడు.

మాధవి వంటగది క్లీనింగ్, గిన్నెలు తోమడం అన్నీ నీలవేణికి వదిలేసి వచ్చి తాయారమ్మ పక్కన కూర్చుంది.

ఆవిడ ఆప్యాయంగా మాధవిని చూస్తూ అంది "ఎందుకమ్మా ఇంత శ్రమ తీసుకున్నావు.? "

మాధవి నవ్వింది. "శ్రమ ఏంలేదు పిన్నిగారూ. బాబుని తీసుకుని మొదటిసారి మీరు హైదరాబాదు వచ్చారు. మీకిక్కడి పద్ధతులు, అలవాట్లు తెలిసిందాకా కొంచెం సాయంగా వచ్చానంతే. "

"నువ్వు ఉద్యోగం చేస్తున్నావు కదూ.!? "

"అవునండి. ఇవాళ, రేపు లీవుపెట్టాను. "

"నీకు మా అర్చన బాగా తెలుసా? "

"తెలుసు. కానీ, పర్సనల్ విషయాలు, అంటే వ్యక్తిగతమైన విషయాలు నాతో ఎప్పుడూ ఎక్కువ చర్చించలేదు. చాలా సరదాగా, సన్నిహితంగా ఉండేవాళ్ళం. ఇద్దరం ఒకటే ఆఫీసులో ఉద్యోగం.. తను ఉద్యోగం ఎందుకు మానేసిందో నాకసలు తెలియదు. మా బాస్ కూడా నన్ను ఒకటి, రెండుసార్లు అడిగారు. ఏం చెప్పాలో నాకర్థం కాలేదు. ఏమైందో నాకేం తెలియదు. "

ఆవిడ నిట్టూర్చింది. ఎవరికీ ఏమీ చెప్పకుండా కడుపులో కుమిలిపోతే ఇలాగే ఉంటుంది. ఎవరికన్నా చెప్పుకుంటే తోచిన సలహా ఇస్తారు. నచ్చితే పాటించవచ్చు. లేకపోతే మరో నిర్ణయం తీసుకోవచ్చు. ఏవిటో జీవితం ఇలా ఎందుకు చేసుకుందో నాకేం అర్థం కావడంలేదమ్మా.

మాధవి ఓదార్పుగా అంది. "బాధ పడకండి. భర్తమీద ప్రేమ లేకపోయినా పేగు తెంచుకు పుట్టిన కొడుకు మీద ప్రేమ ఉండదా? ఎంతకాలం దూరంగా ఉంటుంది? తప్పకుండా ఏదో ఒకరోజు వెతుక్కుంటూ వస్తుంది. "

ఆవిడ విరక్తిగా నవ్వింది. "లేదమ్మా.. అసలు ఎక్కడికి వెళ్ళిందో కూడా తెలియలేదు. వేణు, వాళ్ళ నాన్నగారు వైజాగ్ వెళ్ళి ఆ అమ్మాయి తల్లి, తండ్రులని కలవడానికి వెళ్ళారు. అక్కడ ఎవరూ లేరంట. ఇల్లుకూడా అమ్మేసి వెళ్ళిపోయారని తెలిసింది. మరి ఈ అమ్మాయి ఎక్కడుందో, ఏంటో, ఒంటరిగా ఉంటే ఈ రోజుల్లో ఆడపిల్లలు ఎన్ని తంటాలు పడాలో... "

మాధవికి జాలేసింది. పెద్దావిడ ఎంత బాధపడుతోంది!? అర్చన నిజంగా కఠినాత్ముురాలు. .. మూర్ఖురాలు..ఇలాంటి అత్తగారిని, భర్తని, ముత్యంలాంటి కొడుకునీ, దేవుడులంటి మావగారిని, ఇంత భద్రతగల జీవితాన్ని వదిలి వెళ్ళిందంటే ఏం ఆశించి వెళ్ళినట్టు. ఏం సాధించాలని వెళ్ళినట్టు. ఏం సాధిస్తుంది. ఛీ, అర్చన క్షమార్హురాలు కాదు. ఎంత మాత్రం కాదు.!!

ఇద్దరూ వాళ్ళ ఆలోచనల్లో ఉండగా నీలవేణి వచ్చి "అమ్మాయిగారూ బాబుకి నీళ్ళు పొయ్యాలి. ఎక్కడ పొయ్యమంటారు? " అనడిగింది.

మాధవి లేచి "పద నేను కూడా సాయం చేస్తాను. పెరట్లో కొంచెం విశాలంగా ఉంటుంది. అక్కడ పోద్దాం" అంది లేస్తూ.

నీలవేణి, మాధవి లేచి వెళ్ళబోతుంటే "నాకా గ్యాస్ స్టవ్ వెలిగించడం నేర్పించమ్మా.. వంట చేస్తాను" అంది తాయారమ్మ.

మాధవి వెనక్కి తిరిగి నవ్వి "ఇవాళ్టికి మీరు విశ్రాంతి తీసుకోండి. రేపట్నించీ నేర్పిస్తాను" అంది.

"ఫర్వాలేదమ్మా,.. ఏం పెద్ద అలసిపోయానని విశ్రాంతికి? నేను చేస్తాలే వంట."

"నేను మడి కట్టుకోకపోయినా స్నానం చేసి, శుభ్రమైన చీర కట్టుకుని చేస్తాను. మీరేం బాధపడకండి."

ఆవిడ గాఢంగా శ్వాస తీసుకుని అంది. "మడి , తడి అన్ని మర్చిపోయానమ్మా.. ఆయనకోసం మడి. నాకేం మడి.?"

"ఫర్లేదు. మీరు విశ్రాంతిగా తీసుకోండి. రండి.. మంచం మీద ఉతికిన దుప్పటి వేశాను. " అంటూ ఆవిడ్ని చేయి అందించి లేపింది కుర్చీలోంచి. ఆవిడకి కూడా కాస్సేపు విశ్రాంతి తీసుకుంటే బాగుండు అనే అనిపించి మౌనంగా మాధవిని అనుసరించింది.

బెడ్ రూములోకి తీసుకెళ్ళి ఫ్యాన్ ఆన్ చేసి, మంచం చూపిస్తూ "మీరు పడుకోండి.." అంది మాధవి.

ఆవిడ మౌనంగా మంచం మీద వాలింది.

మాధవి తలుపు జారేసి "పద.. " అంటూ నీలవేణిని తీసుకుని పెరట్లోకి వెళ్ళింది. నీలవేణి బాబుని మాధవి చేతికిచ్చి తను కట్టుకున్న లంగా గోచీలాగా వెనక్కి దోపి, ఓణీ బొడ్లో దోపింది. బాయిలర్‌లో కాగుతున్న నీళ్ళు బకెట్లోకి పట్టుకుని, సరిపడా చన్నీళ్ళు కలిపి, నూనె గిన్నె, శెనగపిండి, జాన్సన్ సోప్ తీసుకొచ్చింది.

చుట్టూ చూస్తూ "నాకు కూర్చోడానికి పీట కావాలండీ.." అంది.

మాధవి ఒక్క క్షణం చుట్టూ చూసి ఓ మూల గోడకి ఆనించి పెట్టిన ఒక రాయి చూపించి "అది తెచ్చుకో ఇక్కడ పీటలు ఉండవు. "

నీలవేణి రాయి తెచ్చుకుని వేసుకుని కూర్చుంది. బాబుని తీసుకుని నేర్పుగా బాబు ఒంటికి నూనెరాసి మర్ధన చేస్తుంటే మాధవి కుతూహలంగా చూస్తూ కూర్చుంది.

●●●

కాలం గడిచిపోతోంది. అర్చన సివిల్స్ రాయాలని అన్ని విధాలా కృషి చేస్తోంది. అయితే అంతకన్నా ముందు గ్రూప్ 1 పరీక్షల నోటిఫికేషన్ రావడంతో ఆ దిశగా ఆలోచించి అప్లికేషన్ తెప్పించింది. గుడికి వెళ్ళి అప్లికేషన్ దేవుడిపాదాల మీద పెట్టివ్వమని పూజారిని కోరింది. ఆయన దీవెనలు తీసుకుని వచ్చి అప్లికేషన్ పంపించింది.

కరెంట్ ఎఫైర్స్, జనరల్ నాలెడ్జ్ కొన్ని ఇంగ్లీష్ న్యూస్ పేపర్లు ప్రతి రోజూ ఖచ్చితంగా చదవడం, ఇండియా టుడే లాంటి మ్యాగ్ జైన్స్, మధ్య మధ్యలో సాహిత్యం, ఏ మాత్రం ఖాళీ సమయం దొరికినా వేరే విషయాల గురించిన ఆలోచనలు కబుర్లు కాలక్షేపాలూ

పక్కన పెట్టేసింది. చదువు.. చదువూ దీక్షగా ఒక ఉద్యమంలా చదువుతూ, చదివింది పదే పదే గుర్తుచేసుకుంటోంది. ఆమెకి తెలియకుండానే అంతులేని విజ్ఞానం మూటకట్టుకున్నట్టు అనిపించింది. ఆమె ఎదురు చూసిన రోజు వచ్చింది. అర్చన గ్రూప్ 1 పరీక్షలు రాసింది చాలా తృప్తిగా ఉంది ఆమెకి. తన శక్తి వంచన లేకుండా కష్టపడి రాసింది. బాగా రాసింది. సెలక్షన్ వస్తే అదృష్టం. రాకపోతే నో..... రాదన్న ప్రసక్తే లేదు. తప్పకుండా వస్తుంది. అనుకుంది. అంతేకాదు. ఆ రోజు పూజ చేసుకుంటూ భగవంతుడిని వేడుకుంది. 'దేవుడా నేను సెలక్ట్ అవాలి. నా లక్ష్యం నెరవేరాలి. ఈ సమాజంలో ఒక హోదాగల స్త్రీగా నాకు తప్పకుండా గౌరవం లాభిస్తుంది. ఆ గౌరవం వెంటబెట్టుకుని నా కొడుకు దగ్గరకు నేను వెళ్ళాలి. నా తండ్రిని నేను తెచ్చుకోవాలి. నా కోరిక తీరిస్తే తప్పకుండా నేను తిరుపతి వచ్చి నిన్ను దర్శించుకుంటాను తండ్రి...' అలా అనుకున్నాక ఆమెకి చాలా ఆశ్చర్యంగా అనిపించింది... 'నేనేనా ఇలా మొక్కుకున్నాను !? ' అనుకుంది.

అర్చన భగవంతుడిని నమ్ముతుంది. అలా అని గాలిలో దీపం పెట్టి దేవుడి మీద భారం వేసే మనస్తత్వం కాదు. కృషి చేసి, ఫలితం దేవుడికి వదిలేయాలి అనే తత్వం. అందుకే ప్రతి విషయంలోనూ కష్టపడటం ఆమెకు అలవాటు అయింది. కష్టపడి పొందే ఫలితంలో ఎంత ఆనందం ఉంటుందో ఆమెకి బాగా తెలుసు. ఇప్పుడు కష్టపడి రాసిన పరీక్షా ఫలితాల ఎఫెక్ట్ జీవితమంతా తనకి అంతులేని సంతృప్తినిస్తుందని ఆమె భావించింది.

రోజులు ప్రశాంతంగా గడిచి పోతున్నాయి. నళిని వలన ఎలాంటి ఇబ్బంది లేదు అర్చనకి. నళినికి రాజకీయాలు తెలియవు. మంచి మనసు. దేవుడంటే అపారమైన నమ్మకం. తన ఫిలాసఫీని నమ్ముకుని జీవిస్తోంది. అలా అని తన అభిప్రాయాలు బలవంతంగా ఎవరిమీదా రుద్దదు. అలాగని ఎదుటివారి నిస్సహాయస్థితిని, బలహీనతనీ అవకాశంగా తీసుకుని వాళ్ళని అవమానించాలనికానీ, బాధపెట్టాలనికానీ ఆమెకి ఆలోచన ఉండదు. పిల్లలంటే ఎంతో ప్రేమ. స్కూల్లో పిల్లలందరినీ సమానంగా ప్రేమిస్తుంది. ప్రతిఏటా తన పుట్టినరోజుకి, తన తల్లి, తండ్రుల పుట్టిన రోజులకి పిల్లలందరికీ స్వీట్స్ పంచుతుంది. మధ్య మధ్య అనాధాశ్రమాల్లో విరాళాలు ఇస్తుంటుంది.

ఇకపోతే వర్ధనమ్మగారు మాత్రం కొంతకాలం అడపా, దడపా, ఆ తరువాత తరచూ అర్చనని ' మీవారు ఇంకా ఎప్పుడొస్తారు? నిన్ను తీసుకెళ్ళచ్చుకదా? ఎంతకాలం ఇలా ఒంటరిగా ఉంటావు? ' అంటూ ప్రశ్నిస్తూనే ఉంది. అర్చన నళినితో చాలాసార్లు అంది. 'చెప్పేస్తాను ఆవిడకి నిజం చెప్పేస్తాను' అని. కానీ, నళిని పడనీయలేదు.

అయితే ఆ రోజు మాత్రం ఆవిడ అదేపనిగా ఈ విషయమై అర్చనతో అటో, ఇటో తేల్చుకోవాలని వచ్చినట్టుగా వచ్చింది.

" అమ్మా అర్చనా! ఏం చేస్తున్నావు? " అంటూ వచ్చింది ఆదివారం ఉదయాన్నే. ఆవిడ వెంట ఆవిడ కొడుకు, కోడలు కూడా వచ్చారు. వాళ్ళిద్దరూ అంతకు ముందురోజే హైదరాబాదు నుంచి వచ్చారు.

వాళ్ళని చూడగానే అర్చన గుండెల్లో రాయిపడింది.

" వీళ్ళేంటి ఇలా దాడి చేశారు? " అనుకుంటూ " రండి, రండి.. కూర్చోండి" అంటూ ఆహ్వానించింది.

కోడలు ప్రారంభించింది.

" మీరు ఇన్ని రోజులనుండీ ఒంటరిగా ఉంటున్నారని అత్తయ్య చెప్పారు. మీ వారు ఎక్కడ ఉద్యోగం చేస్తున్నారు? "

అర్చన ఊహించిన సమయం వచ్చినందుకు ఏం చేయాలో, ఏం చెప్పాలో తెలియక గుడ్లప్పగించి చూడసాగింది.

"కాఫీ తాగుదురుగాని.. " అంటూ కుర్చీలోంచి లేవబోతుంటే వర్ధనమ్మ చేయిపట్టుకుని కూర్చోబెడుతూ అంది. " కాఫీ ఒద్దు ఏం ఒద్దు కూర్చోమ్మా.. నీతో ఓ ముఖ్యమైన విషయం మాట్లాడాలి."

అర్చన అయోమయంగా చూసింది.

కోడలు మొదలు పెట్టింది. "మీరేమీ అనుకోకపోతే మీ ప్రైవేటు విషయం అడుగుతాను. నిజంగా మీవారున్నారా? లేక మీరిద్దరూ.."

అర్చన షాకింగ్‌గా చూసింది. "అదీ, అదీ.." తడబడుతుంటే ఆవిడే అంది మళ్ళీ.

"చూడండి అర్చనగారూ... ఈ రోజుల్లో చాలామంది పెళ్ళిళ్ళు అలాగే ఫెయిల్ అవుతున్నాయి. కాలం మారిపోయిందండి. అమ్మాయిలంతా బాగా చదువుకుని, ఉద్యోగాలు చేస్తూ, ఇండివిడ్యువాలిటీ డెవలప్ చేసుకోవడంతో భార్యలు బానిసలుగా ఉండాలనే మగాళ్ళ ఆటలు సాగడంలేదు. అంచేత విడిపోవడం మామూలైపోయింది. మేమేదో అనుకుంటామని మీరు దాచాలని ప్రయత్నించవద్దు. ఇంతకాలం నుంచీ మీరుంటున్నా ఎప్పుడూ ఒకనాడు కూడా మీవారు రావడం అత్తయ్య చూడలేదన్నారు." అంటూ వర్ధనమ్మ వైపు చూసింది. ఆవిడ చెప్పమన్నట్టుగా సైగ చేసింది. ఆవిడ తిరిగి మాట్లాడసాగింది. "మా తమ్ముడు సాఫ్ట్‌వేర్ ఇంజినీరు. నెలకి లక్షరూపాయలపైనే సంపాదిస్తున్నాడు. చక్కగా ఉంటాడు. అదేం ఖర్మో వాడికి జోడిగా ఒక్కమ్మాయి కూడా దొరకడంలేదు. మీరైతే అన్ని విధాలా బాగుంటారనిపించిందిట అత్తయ్యకి. మీ వయసు ముప్పై ఉంటుందా?"

అర్చన ఏం మాట్లాడలేదు. బొమ్మలా చూసింది. ముప్పై ఏళ్ళా? పాతికేళ్ళకే అనుభవాల పుట్ట అయింది.

"మా తమ్ముడికి ముప్పైమూడు. అయినా పాతికేళ్ళ కుర్రాడిలా ఉంటాడు. మీకు అభ్యంతరం లేకపోతే మాకెలాంటి ప్రాబ్లం లేదు. మీరు ఎప్పుడు పిలిపించమంటే అప్పుడు మా తమ్ముణ్ణి పిలుస్తాను."

ఆవిడ ఆపింది. వర్ధనమ్మ మొదలు పెట్టింది. "పిచ్చిపిల్లలాగా మనసులో కొండంత బాధపెట్టుకుని నాకు అబద్ధం చెప్పావా? నేను మాత్రం ఆడదాన్నికానా? నాకు మాత్రం పరిస్థితులు అర్థం చేసుకునే శక్తి లేదా? నువ్వేం మనసులో పెట్టుకోకమ్మా. మా కోడలు చెప్పింది ఆలోచించి చెప్పు. వీళ్ళింకా నాలుగురోజులుంటారు. ఈలోగా చెప్పావంటే కుర్రాడిని పిలిపిస్తాం. ఒకళ్ళనొకళ్ళు చూసుకుని సరే అంటే వచ్చేది శ్రావణమాసం. తాంబూలాలు పుచ్చుకోవచ్చు. అన్నట్టు నీకు లాయర్ కాగితాలున్నాయిగా. ఉండే ఉంటాయిలే."

ప్రశ్న, జవాబు అన్నీ తానే అయి ఆవిడ మాట్లాడుతుంటే అర్చన నిశ్శబ్ధంగా ఉండిపోయింది. లాయర్ కాగితాలంటే విడాకులు. వివరించింది కోడలు. అర్చన ఏమీ సమాధానం చెప్పలేదు. బాగా ఆలోచించి చెప్పండి. మా దగ్గర మొహమాటం ఏంలేదు. సిగ్గుపడకండి. జీవితం కదా ఇది ఏవో సమస్యలు వచ్చిపోతుంటాయి. పిల్లలు లేకపోవడం మీ అదృష్టం. పిల్లలుంటే ఆడవాళ్ళకి రెండో పెళ్ళి కావడం కష్టం. ఇలా ఏదో మాట్లాడుతూనే మరోసారి ఆలోచించమని హెచ్చరించి వచ్చినంత వేగంగా వెళ్ళిపోయారు వాళ్ళు. తల్లి, భార్య మాట్లాడుతుంటే శిలావిగ్రహంలా కూర్చున్నాడు అతను.

వాళ్ళు వెళ్ళాక జడివాన కురిసి వెలిసినట్టు సుఖంగా అనిపించింది.

ఇదేంటి భగవంతుడా!!. పరిస్థితి ఇలా ఎదురు తిరిగింది. ఇప్పుడేం జవాబు చెప్పాలి. కాదంటే ఇల్లు ఖాళీ చేయమనదుకదా ఈవిడ.

అర్చనని దిగులు కమ్మేసింది. ఎంతో భద్రంగా, సుఖంగా ఉందిక్కడ. ఇక్కడనుంచి ఖాళీ చేసిందంటే ఇంత శాంతి, సుఖం ఉండవు.. ఇదెక్కడి పరీక్ష?

అన్యమనస్కంగా వంట చేస్తూనే ఆలోచించి, ఆలోచించి నళినికి ఫోన్ చేసి " భోజనానికిరా.. కలిసి భోంచేద్దాం" అంటూ ఆహ్వానించింది. నళిని వస్తే సమస్య తీరినట్టే అనుకున్నాక రిలీఫ్‌గా అనిపించింది. నళిని వచ్చేటప్పటికి వంట పూర్తిచేసి, ఫ్రెష్‌గా తయారై గులాబీ రంగు కాటన్ చీర కట్టుకుని ప్రశాంతంగా కూర్చుని ఉంది అర్చన. లోపలికి అడుగుపెట్టగానే మొగలిపూల పరిమళం ఉక్కిరి, బిక్కిరి చేసింది. "ఎక్కడివి మొగలిపూలు? " వికసించిన మొహంతో అడిగింది నళిని.

"పూలుకాదు. అగరు బత్తీలు. రా కూర్చో" నవ్వుతూ ఆహ్వానించింది.

"ఎంతబాగుందో వాసన" చేతిలో ఉన్న అరటి పండ్లు టేబిల్ మీద పెడుతూ అంది నళిని.

"అబ్బా.. వాసన అనకపోతే పరిమళం అనచ్చుకదా"

"ఏం? వాసన అన్నా, పరిమళం అన్నా అర్ధం ఒకటే కదా"

"అమ్మ మొగుడన్నా, నాన్న అన్నా అర్ధం ఒకటే కదా. ఏది బాగుంది?"

నళినికి అర్ధమైనట్టు నవ్వింది.. " సరే.. పరిమళం!" అంటూ అర్చనని పరిశీలనగా చూస్తూ కుర్చీలో కూర్చుంటూ అంది.

" నువ్వు చాలా బాగుంటావు అర్చనా.. ఈ చీరలో ఎంతబాగున్నావో.

అర్చన నవ్వి "కాఫీ తాగుతావా?" అడిగింది.

"ఒద్దు. ఇప్పటికే రెండుసార్లు తాగాను. ఇంతకీ ఏంటి విషయం? లంచ్ ప్రోగ్రామ్ ఏంటి సడన్‌గా?"

"ఏం లేదు" అంటూ నళిని మొహంలోకి చూసి ఒకసారి నవ్వి మొహం తిప్పుకుంది.

"నువ్వలా నవ్వావంటే ఏదో ఉందనిపిస్తోంది."

అర్చన మాట్లాడలేదు. కొన్ని క్షణాల తరువాత అంది "ప్రమాదం ముంచుకొచ్చింది."

నళిని ఆదుర్దాగా చూసింది. "ఏం జరిగింది? ఏం ప్రమాదం?"

"అంత ఖంగారు పడకు. ఏం లేదు. వర్ధనమ్మగారు వచ్చి వెళ్ళారు."

"అదా? " ఊపిరి పీల్చుకుని అంది.

"నాకు పెళ్ళి సంబంధం తెచ్చింది."

"నీకా? " అయోమయంగా చూసింది నళిని. "ఆవిడకేమన్నా పిచ్చా?"

"పిచ్చో, వెర్రో వాళ్ళ కోడలి తమ్ముడున్నాట్ట. అతనికి పెళ్ళికాలేదుట. ముప్పైమూడేళ్ళట"

"అదా సంగతి!?" తేలిగ్గా అన్న నళిని వైపు చిత్రంగా చూసింది.

"ఈ రోజుల్లో మగపిల్లలకి పెళ్ళిళ్ళవడం చాల కష్టమైపోతోంది. ఇదివరకు రోజుల్లో ఆడపిల్ల పెళ్ళికోసం కాళ్ళకి బలపాలు కట్టుకు తిరిగే పరంధామయ్యలంతా ఇప్పుడు మగపిల్లల పెళ్ళిళ్ళకోసం అలాగే తిరుగుతున్నారు. కొందరు పార్వతమ్మలు కొడుకు పెళ్ళికోసం వ్రతాలు, నోములు, పూజలు హోమాలు, తాయిత్తులు"

"నాకర్ధంకాడంలేదు. పరంధామయ్య, పార్వతమ్మ వీళ్ళంతా ఎవరు?"

"నీకు తెలియదా? ఆడపిల్లల తల్లులంతా పార్వతమ్మలు, తండ్రులంతా పరంధామయ్యలు."

"అబ్బా నళిని ప్లీజ్. పజిల్స్ విప్పే శక్తి లేదు కానీ, సరిగా చెబుదూ."

నళిని పకపకా నవ్వుతూ అంది. "నువ్వు ఇదివరకటి రచయిత్రుల కథలు చదవలేదేమో అందుకే నీకు తెలియదు. కానీ పార్వతమ్మలు, పరంధామయ్యలు ఆడపిల్లల తల్లితండ్రులుగా,"

"ఓ! మైగాడ్ అదా చంపేశావు" తనూ గట్టిగా నవ్వుతూ అంది అర్చన.

నళిని నవ్వాపి "అందుకే రెండో పెళ్ళి అమ్మాయైనా ఫర్వాలేదు. పిల్లలు లేకపోతే చాలని అడ్జస్ట్ అవుతున్నారు. ఆ పరంపరలో వచ్చిందే వర్ధనమ్మగారి ప్రపోజల్ ఇంతకీ నువ్వేమన్నావు?"

"ఏమన్నా అనడానికి నాకు ఛాన్స్ ఇస్తేనా? వాళ్ళే ప్రశ్నలు, వాళ్ళే జవాబులు అన్నీ చెప్పేసి ఆలోచించి త్వరగా చెప్పు అంటూ వెళ్ళిపోయారు."

"పోనీలే ఆలోచించి చెప్పమన్నారు కదా ఆలోచిద్దాం."

"ఏంటి నళినీ ఆలోచించేది. నేనసలే టెన్షన్‌తో ఉంటా మధ్యలో వీళ్ళ గోలేంటి?" విసుగ్గా అంది అర్చన.

నళిని నవ్వాపి కొంచెం సీరియస్‌గా అంది. "అర్చనా ఇది నీకు మొదటి పరీక్ష. అందుకే చెపుతున్నాను. నా మాట విని వేణు దగ్గరకు వెళ్ళిపో. ఇలాంటి పరీక్షలు నువ్వు చాలా ఎదుర్కోవాల్సి వస్తుంది. ఏదో ఒకటి చెప్పి ఎంతోకాలం తప్పించుకుని బతకలేవు. నా మాట విని వెంటనే వేణు దగ్గరకు వెళ్ళిపో."

"నళినీ ప్లీజ్! ఆ ఒక్కటి తప్ప ఏదైనా చెప్పు."

"ఏం? ఎందుకు? అర్చనా నీకసలు ఏం కావాలి?" ఖచ్చితంగా అంది నళిని.

అర్చన మాట్లాడలేదు. ఆమెకేమీ అర్థంకాలేదు. అవును నాకేం కావాలి? ఆ ప్రశ్న అప్పుడే విన్నట్టు సమాధానం కోసం అన్వేషిస్తున్నట్టు అనిపించింది. నాకేం కావాలి? మరోసారి తన్ని తాను ప్రశ్నించుకుంది.

నళిని మళ్ళీ అంది. "అర్చనా! జీవితానికి ఒక లక్ష్యం, ఆదర్శం ఉండడంలో తప్పులేదు. కానీ, ఆ లక్ష్యం, ఆదర్శంలో మిగతా విషయాలు ఏవీ కలవకూడదు. నీ లక్ష్యం నెరవేర్చుకోడానికి నీకు సహకరించే వ్యక్తులు నీకు కావాలి. అది ఇద్దరే చేయగలరు. నిన్ను కన్నవాళ్ళు, నిన్ను కట్టుకున్నవాడు ఆ ఇద్దరికీ నువ్వు దూరం అయావు.. అంతేకాక, అతనికి తెలుసా? ఎవరో చాలామంది కనిపిస్తుంటారు. ఆడపిల్ల, అందులోనూ అందమైన ఆడపిల్ల కనిపిస్తే ఒకటికి పదిసార్లు చూడని మగాడు ఉండడు. అలాంటిది అతను నిన్ను ఏవో భావాలతో చూశాడని, అతనికి నువ్వంటే ఇష్టం ఉండచ్చని, భ్రమ ఉంటే వెంటనే నీ మనసులోంచి ఆ భావన తుడిచెయ్. నా మాట విని.."

నళిని మాట పూర్తికాకుండానే అర్చన గట్టిగా అరిచింది. "స్టాపిట్ నళినీ.. స్టాపిట్.. థాంక్స్. ఏదో స్నేహితురాలివని నా కష్టం, సుఖం చెప్పుకుంటే ఇలా మాట్లాడతావా? నీకు నా మీద ఇంత చులకన భావం ఉందని ఇప్పుడే అర్థమైంది. థాంక్స్ నళినీ.. థాంక్స్ ఎలాట్.. నిన్ను భోజనానికి పిలిచాను. అందుకే ఏమీ అనడంలేదు. లేకపోతే నా గురించి ఇంత అసహ్యంగా మాట్లాడిన నిన్ను ఈ పాటికి గెట్ అవుట్ అని ఉండేదాన్ని.."

అర్చన ఆవేశం చూసి నళిని అవాక్కైంది.

●●●

**బాబు బోర్లాపడి పాకేస్తున్నాడు.** ఇల్లంతా బాబు కేరింతలతో మార్మోగుతోంది. గబ, గబా పాకేస్తూ ఏది కనిపిస్తే అది నోట్లో పెట్టేసుకోడంతో అస్తమానం ఒకళ్ళు వాడి వెనకాల ఉంటూ వాడు అవీ, ఇవీ నోట్లో పెట్టేసుకుని మింగేయకుండా చూడాల్సి వస్తోంది.

ఏడో నెల్లో అన్నప్రాసన ఘనంగా చేశాడు వేణు. ఆఫీసులో అందరికీ తనకి కొడుకు పుట్టాడని చెప్పాడు. అర్చనా, వేణుల గురించి, వాళ్ళ సంసారం గురించి చూచాయిగా కొందరికి తెలిసినా ఎవరూ వేణుతో ఆ విషయం ప్రస్తావించలేదు. అందుకే అర్చన పై చదువుల కోసం చెన్నై, వెళ్ళిందన్న అబద్ధాన్ని అలవోకగా నమ్మేసారు.

అన్నప్రాసనకి కృష్ణస్వామి కూడా వచ్చాడు. బాబుకి మెడలో బంగారు గొలుసు, వేళ్ళకి ఉంగరాలు కొన్నారు తాయారమ్మ దంపతులు. వేణు బ్రేస్‌లెట్ కొన్నాడు.

మాధవి బౌన్సర్ కొనుక్కొచ్చింది.

చాలమంది మిత్రులు చాలా బహుమతులు తెచ్చారు.

ఎవరిని చూసినా బోసి నవ్వులు నవ్వడం, పలకరింపులకి ఊ కొట్టడం పైన తిరిగే సీలింగ్ ఫ్యాన్ చూసి కేరింతలు కొట్టడం, ఈ చేష్టలన్నీ ముద్దు, ముద్దుగా ఉండి అతిధులను విపరీతంగా ఆకర్షించాడు. బాబు రాక, బాబు అల్లరి ఇల్లంతా వెలుగులు మిరజిమ్ముతుంటే

వేణు ఆనందానికి పట్టపగ్గాల్లేకుండా అయిపోతోంది. అదేరోజు బాబుకి మాధవి సెలక్ట్ చేసిన రిత్విక్ అనే పేరు పెట్టేశారు బాబుకి. మాధవి కొడుకు పేరు కౌశిక్. ఆ పేరు అర్చన సెలక్ట్ చేసిన పేరు. అందుకే అర్చన కొడుక్కి తాను సెలక్ట్ చేసిన పేరు పెట్టింది మాధవి.

అన్నప్రాసన తరువాత తాయారమ్మ వాడికోసం బియ్యం వేయించి, కందిపప్పు వేయించి డబ్బాల్లో పోసి పెట్టింది. అన్నం ఇప్పుడే సరిగ్గా తినలేడని మాధవి సెరిలాక్ కూడా తెప్పించి నీలవేణికి చూపించింది ఎలా పెట్టాలో అరటిపండు గుజ్జులో కలిపి, పాలతో కలిపి, క్యారట్ జ్యూస్‌లో కలిపి ఇలా వాడి బాడీలోకి కావలసిన వివిధరకాల విటమిన్స్, క్యాలరీలు ఎలా తినిపించాలో మాధవి ట్రైనింగ్‌లో పూర్తిగా నేర్చుకుంది నీలవేణి.

నీలవేణికి అక్కడ బాగా అలవాటైపోయింది. ఉదయాన్నే లేవడం వాకిలి ఊడ్చి, నీళ్ళు చల్లి ముగ్గులు పెట్టడం, పెరడంతా ఖాళీగా ఉండడం చూసి మెంతులు, ధనియాలు, కాకరకాయ గింజలు, దోసగింజలు చల్లి చక్కగా మొక్కలు పెంచింది. ఇల్లంతా అద్దంలా ఉంటోంది. వంట మాత్రం తాయారమ్మ చేస్తుంది. మిగతాపని, బాబు పనితో సహా నీలవేణి ఒక అంకిత భావంతో చేయడం మాధవిని ఆకర్షించింది. ఇంతమంచి పనిమనిషి దొరకడం ఎంత అదృష్టం అనుకుంటుంటుంది నీలవేణి నిజాయితీ, పనిలో నేర్పరితనం చూస్తూ. ఇంక బాబు నీలవేణికి ఆరోప్రాణం అయిపోయాడు. కొత్తల్లో వేణు దగ్గర భయంగా, బిడియంగా ఉండే నీలవేణి ఇప్పుడు వేణుతో కూడా కొంచెం చనువుగా మాట్లాడడం మొదలుపెట్టింది. అది కూడా బాబుకి సంబంధించినంతవరకు.

ఇవాళ బాబు ఈ అల్లరి చేశాడు. ఆ అల్లరి చేశాడు అంటూ బాబు కబుర్లు అవసరమైనంత మటుకి వేణుకి చెప్పడం రోజువారి కార్యక్రమం అయింది.

నీలవేణి మీద వేణుక్కూడా సానుభూతితోపాటు ఒక అభిమానం కూడా ఏర్పడింది. ఒకరోజు తాయారమ్మతో అన్నాడు.

"ఈ అమ్మాయిని మనింట్లో ఎంతకాలం ఉంచుకుంటాం అమ్మా? ఆ అమ్మాయికి మనం చాలా ఋణపడిపోతున్నాం. ఏదన్నా చేయాలని ఉంది. ఏం చేయను? " అన్నాడు.

ఆ మాటకి తాయారమ్మ చాలా సంతోషించింది.

"చూడు నాయనా ఏనాటి ఋణానుబంధమో వరదల్లో కొట్టుకొచ్చి మన పంచన చేరింది. తన అవసరాన్ని మనం అవకాశంగా వాడుకుని జీవితాంతం మనింట్లో పనిమనిషిగా ఉంచేసుకోవడం భావ్యం కాదుకూడా. పెళ్ళి చేసి పంపిస్తే మన బాధ్యత తీరిపోతుంది" అంది.

వేణు అప్పటికప్పుడే ఆ అమ్మాయికి తగిన సంబంధం చూడాలని నిశ్చయించుకున్నాడు.

"ఎలాంటి అబ్బాయి కావాలో మనకేం తెలుసు? " అన్నాడు.

"దానికి మాత్రం ఏం తెలుసు? మంచి సంబంధం ఉంటే చూడు. వాళ్ళ కులంలో వాళ్ళు మీ ఆఫీసులో ఉండే ఉంటారు కదా!" అందావిడ.

"ఆవిడ కులం ఏంటో మనకేం తెలుసమ్మా. ఆ సంగతి తరవాత చూద్దాం. అందాకా అమ్మాయి పేరు మీద నేను ఒక లక్షరూపాయలు ఫిక్స్ చేయాలనుకుంటున్నానమ్మా. సడెన్‌గా పెళ్ళి కుదిరితే ఆ డబ్బు ఉపయోగపడుతుంది" అన్నాడు.

ఆవిడ కళ్ళల్లో కొడుకు ఉదార హృదయం పట్ల హర్షం కనిపించింది.

"మంచిపని నాయనా. ఎలాగా ఆ మాత్రం ఖర్చు పెట్టకపోతే పెళ్ళికాదు కూడా" అంది.

మరునాడే వేణు తన సేవింగ్స్‌లోంచి లక్ష తీసి నీలవేణి పేరు మీద ఫిక్స్ చేశాడు. అతనితో పాటు బ్యాంకుకు వెళ్ళి వేలిముద్రలేసిన నీలవేణి కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

"ఎంత మంచి కుటుంబానికి నన్ను లాక్కొచ్చావు తండ్రి. వీళ్ళ మనసులు వెన్న ముద్దలు" అనుకుంది.

అయితే వాళ్ళు తనకి పెళ్ళి చేయాలనుకుంటున్నారని.. వేణు సంబంధాల వేటలో పడబోతున్నాడని తెలియని నీలవేణి మాత్రం ఇంక తన జీవితం ఆ ఇంట్లో బాబు సేవలతో, తాయారమ్మగారి సేవలతో గడిచిపోతుందని గట్టి విశ్వాసంతో పెళ్ళి గురించిన ఆలోచనకే తావివ్వలేదు. బాబు సంరక్షణ తన ధ్యేయంగా భావించింది.

అన్నప్రాసన తరవాత నీలవేణి బాబుని ఎత్తుకుని పెరట్లో పిచుకల్ని చూపిస్తూ గోరుముద్దలు పెట్టడం వాడికి నీళ్ళు పోయడం ప్రతి గంటకీ వాడి బట్టలు మార్చి నీటుగా ఉంచడం ఎంతో శ్రద్ధగా సొంత కొడుక్కి చేస్తున్నట్టు సేవలు చేస్తోంటే తెలియని వాళ్ళు ఆ పిల్లాడు ఆమె కొడుకే అనుకోవడంలో తప్పేం లేదనిపించింది మాధవికి. ఈ అమ్మాయికి కొంచెం చదువు, మంచి ఫ్యామిలీ బ్యాక్‌గ్రౌండ్ ఉండి ఉంటే ఎంత బాగుండేది అనుకునేది కూడా. మళ్ళీ తనలో తానే ఉలిక్కిపడి ఆ ఆలోచనలనుంచి బైటపడుతుండేది.

బాబు అల్లరి బాగా పెరిగింది. గోడపట్టుకుని, మంచం కోడు పట్టుకుని లేచి నిలబడడానికి ప్రయత్నించడం వెంటనే పడిపోయి ఏడుపు లంకించుకోడం, కాస్సేపు నీలవేణి భుజమ్మీద వేసుకుని అలా తిప్పి వచ్చాక మళ్ళీ అదే ప్రయత్నం అలాగే పడిపోడం వేణుకి చూస్తున్న కొద్దీ ముచ్చటగా మురిపెంగా అనిపిస్తున్నాయి బాబు చర్యలు.

నేరుగా ఆఫీసునుంచి ఇంటికి వచ్చి బాబుతో గడపడంలో అతనికి అలౌకికమైన ఆనందం కలుగుతోంది. బాబు తప్ప మరో ప్రపంచం లేనట్టూ అయిపోయింది. తాయారమ్మకి వేణులో వచ్చిన మార్పు సంతోషం కలిగించినా అతని జీవితంలో అనుకోకుండా ఏర్పడిన శూన్యం మాత్రం భరించరానిదిగా ఉందావిడకి. మాధవితో చూచాయిగా రెండు, మూడుసార్లు అంది కూడా. కాస్త చదువుకుని, సంసారపక్షంగా ఉండే అమ్మాయి ఉంటే చూడమని వేణుకి మళ్ళీ పెళ్ళి చేయాలనుకుంటున్నానని. మాధవి కూడా అందుకు పూర్తిగా సిద్ధంగా ఉంది.

అర్చన చేసిన పనిని మాధవి ఎంత మాత్రం సమర్థించలేకపోయింది. ఏం సాధించాలని వెళ్ళిందో ఎక్కడుందో ఇంత బంగారంలాంటి బాబుని వదిలి వెళ్ళడానికి మనిషో, రాక్షసో అనుకునేది. అర్చన మీద పిచ్చికోపం, వేణుమీద, అతని కుటుంబ సభ్యుల మీద సానుభూతి పెరిగిపోయింది మాధవి మనసులో. బాబుని చూస్తుంటే అవాజ్యమైన మమతానురాగాలు ఆమెలో పెల్లుబుకుతున్నాయి. వాడు బాగా అలవాటైపోతున్నాడు. కానీ, అంత బంధం పెంచుకోడం ఇష్టంలేని మాధవి క్రమంగా ఆ ఇంట్లో తన అవసరం తగ్గించడానికి ప్రయత్నించాలనుకుంది.

బాబుని తీసుకుని తాయరమ్మ, నీలవేణి వచ్చిన దగ్గర్నించీ మాధవి రోజూ వస్తూ వాళ్ళకి తెలియని విషయాలు చెపుతూ, మెల్లిగా తాయారమ్మకి, నీలవేణికి ఆ ఇల్లు పరిసరాలు, అలవాటయాక రోజు విడిచి రోజు, రెండు రోజులకొకసారి అలా నెమ్మదిగా రావడం తగ్గించడం ప్రారంభించింది.

నీలవేణికి మెల్లిగా చుట్టుపక్కల కిరాణాకొట్టూ, ఇస్త్రీ, పాలు, పెరుగు, కూరగాయలు దొరికే చోట్లు అన్నీ తెలిసిపోయాయి. ఏదన్నా కావాలంటే నీలవేణి ఉన్నపళంగా వెళ్ళి కొట్టునుంచి కొనుక్కురాగల నేర్పు సంపాదించడంతో మాధవి రాకపోకలు వారానికోసారి మారాయి.

కాకపోతే అప్పుడప్పుడు వేణు బలవంతం మీద మాత్రం చక్రవర్తితో కలిసి రావడం తప్పడంలేదు. శనివారాలు వీకెండ్ కాబట్టి ఇంటిదగ్గరే ఏదో ఒకటి స్పెషల్ వంటలు చేసుకుని తీసుకొస్తుంది. మాధవి కొడుకు బాబుకి బాగా అలవాటు పడ్డాడు. వాడితో ఎంతసేపు ఆడుకున్నా వాడికి తృప్తి ఉండదు. ఇంటికి వెళ్ళేటప్పుడు పేచీ పెడుతుంటాడు. అలాంటప్పుడు వచ్చినపుడు రాత్రి పొద్దుపోయిందాకా ఆ కుటుంబంతో గడిపి వెళ్తుంటారు ఆ దంపతులు.

మాధవి అంటే తాయారమ్మకి వెర్రి అభిమానం. ఇలాంటి అమ్మాయి వీడికెందుకు దొరకలేదో అనుకుంటుంటుంది అప్పుడప్పుడు కొడుకుని ఉద్దేశించి. ప్రతిరోజూ కృష్ణస్వామికి ఫోన్‌లో బాబుకి సంబంధించిన కబుర్లు చెపుతూంటే ఆయనికి కూడా బాబుని చూడాలనిపిస్తుండేది. నెమ్మదిగా గుడి బాధ్యతలు ఎవరికన్నా అప్పచెప్పి వాళ్ళ దగ్గరికి వెళ్ళిపోవాలని ఆలోచించడం మొదలుపెట్టాడు.

ఆదివారం వేణు తీరుబడిగా కూర్చుని బాబుతో ఆడుకుంటున్నాడు.

ఒత్తుగా ఉన్న వాడి జుట్టూ చూస్తూ "వీడికి జుట్టెక్కువమ్మా. చిరాగ్గా ఉందేమో క్రాఫ్ చేయించనా? " అనడిగాడు తల్లిని.

"బాబుకి ఏడాదిలోపుగా పుట్టెంట్రుకలు తీయించాలి నాన్నా" చెప్పింది తాయారమ్మ.

"అలాగే తీయిద్దామమ్మా. సెలూన్‌కి తీసుకెళతాలే" అన్నాడు వేణు.

"ఇంకా నయం.." మందలింపుగా అంది ఆవిడ. "మొదటిసారి వెంట్రుకలు తీయించడం అనేది ఒక పవిత్రకార్యం. తిరుపతికి తీసుకెళ్ళి తీయించడం మన ఆచారం."

"అయ్యో సారీ అమ్మా. నాకు తెలియదు కదా అలా అని. దానికేం ఎప్పుడు వెడదాం? నాన్నతో కూడా మాట్లాడి టికెట్స్ రిజర్వ్ చేయించేస్తా" అన్నాడు.

"అలాగే. ఆయన ఇంకా గుడినుంచి ఇంటికి వెళ్ళి ఉండరు. రాత్రికి మాట్లాడి ఆయన్నే ముహూర్తం పెట్టమందాం."

"ఓకే ... " చేతుల్లో ఉన్న రిత్విక్‌ని కొంచెం ఎగరేసి పట్టుకుంటూ, ముందుకు ఒంగి వాడి మొహం మీద మొహం పెట్టి నవ్వుతూ అడిగాడు వేణు. "తిరుపతి వెడదామా? జేజిని చూస్తావా? నా బంగారు కొండా.. తాతనడిగి టికెట్లు కొనుక్కుందాం. ఓకే.? "

కొడుకు చేష్టలకి మురిసిపోయింది తాయారమ్మ.

"మాధవినీ, చక్రవర్తినీ, కౌశిక్‌నీ కూడా తీసుకెడదాం. వాళ్ళకి కూడా టికెట్లు తీసుకో నాన్నా" అంది తాయారమ్మ.

"అలాగేనమ్మా దానికేం. మొత్తం ఐదు టికెట్లు అంతేగా? "

"ఐదేంటిరా ఆరు. నీలవేణిని మర్చిపోయావా? "

"నీలవేణా? " అదోరకంగా అడిగాడు. ఆమె అవసరమా అన్నట్టు.

"అక్కడ బాబుని ఎవరు చూసుకోగలుగుతారు నాన్నా? పైగా పాపం అది కూడా ఆ వెంకన్న దర్శనం చేసుకుంటుంది కదా.! "

"అలాగేలేమ్మా చేయిస్తాను. " అన్నాడు.

నీలవేణి ఇంట్లో కుటుంబ సభ్యుల్లో కలిసిపోయింది. ఏం చేసినా ఈ అమ్మాయిని ఖచ్చితంగా దృష్టిలో పెట్టుకోవాలి కాబోలు అనుకున్నాడు.

ఆ రాత్రి కృష్ణస్వామికి ఫోన్ చేసి మరో పదిరోజుల్లో తిరుపతి వెళ్ళడానికి ముహూర్తం తెలుసుకున్నాడు.

●●●

అర్చనకీ, నళినికీ దురదృష్టవశాత్తూ ఏర్పడిన అభిప్రాయబేధాలు చాలా తీవ్రరూపం దాల్చాయి. స్కూల్లో కూడా నళిని అర్చనని చూడగానే మొహం చిట్లించడం, మాట్లాడకుండా వెళ్ళిపోడం అర్చన మనసుని గాయం చేసింది. తను ఆవేశపడి తనని అనకూడని మాట అంది. అది నళిని మనసుకి గాయం చేసింది. ఉన్న ఒకే ఒక్క స్నేహితురాలిని దూరం చేసుకుంది. ఇప్పుడు పూర్తిగా ఒంటరి అయిపోయింది. పెద్దవాళ్ళు చెప్పిన కాలు జారితే వెనక్కి తీసుకోగలం నోరు జారకూడదన్న అమృత వాక్కులు గుర్తొస్తూ అర్చనకి శాంతిలేకుండా అయిపోయింది.

స్కూల్లో ఒకటీ, రెండుసార్లు నళినిని కలిసి సారీ చెప్పడానికి ప్రయత్నించి విఫలమైంది. నళిని అర్చనని చూడగానే ఆమెకి దూరంగా వెళ్ళిపోవడం, ఆమె వెనక వెళ్ళబోయి తోటివాళ్ళు గమనిస్తున్నారన్న అవమానంతో వెనక్కి వెళ్ళిపోడం జరిగింది. మాట జారింది.

అది వెనక్కి తీసుకునే విషయం కాదు. ఏం చేయాలి? మళ్ళీ నళిని స్నేహం లభిస్తుందా? అర్చన మనసంతా గందరగోళంగా అయిపోయింది. ఈ మధ్యలో వర్ధని కోడలు ఒకటే, రెండు సార్లు అర్చన అభిప్రాయం కోసం కబురు చేసి, ఆమెనుంచి జవాబు రాకపోవడంతో కొంచెం కోపం తెచ్చుకుంది. ఆ విషయం వర్ధని మాటల ద్వారా అర్ధమై భయపడింది. ఇల్లు ఖాళీ చేయమంటారేమో? ఎక్కడికి పోవాలో దేవుడా అనుకుంది. తను రాసిన గ్రూప్ ఓ ఎగ్జామ్స్ రిజల్ట్స్ వచ్చేస్తే తప్పకుండా ఎక్కడో ఒక దగ్గర పోస్టింగ్ వస్తుంది. ఆ తరువాత తను ఎక్కడుందో ఎవరికీ తెలియదు. అందాకా ఈ గండం గడిచిపోతే ఎంత బాగుండు అనుకుంది. దేవుడికి దండం కూడా పెట్టుకుంది.

ఆమె మొర వృధాపోలేదు. అర్చన కల నెరవేరింది. ఆమెకి విజయవాడలో ఆర్.డి.ఓగా పోస్టింగ్ వచ్చింది. అర్చన ఆనందానికి హద్దుల్లేవు. తన ఆనందం పంచుకోడానికి ఒకే ఒక్కరున్నారు. అది నళిని ఆమె తప్ప ప్రస్తుతం తనకంటూ ఎవరూ లేరు. తొందరపడి ఆమె మనసు గాయం చేసిన తను క్షమార్హురాలు కాదు. అడగాలి. నళినిని క్షమార్పణ అడగాలి.

ఆ రోజు ముందు ఇంటి దగ్గరులో ఉన్న గుడికి వెళ్ళి అక్కడి నుంచి స్కూలుకి వెళ్ళింది. అప్పటికే ప్రెయర్ అయిపోయింది. పిల్లలంతా ఎవరి క్లాసులకి వాళ్ళు వెళ్ళిపోయారు. మొదటి పీరియడ్ ఎలాగూ నళిని ఫ్రీ. అందుకే ఆమెని వెతుక్కుంటూ స్టాఫ్ రూంకి వెళ్ళింది. నళిని ఒక్కతే కూర్చుని ఏదో రాసుకుంటోంది. వెనక నుంచి దగ్గరగా వెళ్ళి "నళినీ.." అని పిలిచింది అర్చన.

నళిని వెనక్కి తిరిగి అర్చనని చూసి మొహం తిప్పుకుంది.

అర్చనకి దుఃఖం వచ్చేసింది.

కోపం, అభిమానం, సిగ్గు, మొహమాటం అన్నీ పక్కన పడేసి ఆమె ముందుకు వెళ్ళి చేయి పట్టుకుని బలవంతంగా కుర్చీలోంచి లేపి గట్టిగా కౌగలించుకుంది.

నళిని కొంచెం ఇబ్బందిగా ఆమె నుంచి విడిపించుకుని ముభావంగా అడిగింది. "ఏమైంది?"

అర్చన మాట్లాడలేదు. కళ్ళల్లో తిరుగుతున్న నీళ్ళు చెంపలమీదికి జారాయి. రుద్ధమైన స్వరంతో అంది

"అ .. అయామ్ సారీ.. "

నళిని మాట్లాడలేదు.

"నళిని .. ప్లీజ్ నన్ను క్షమించు." ఆమె చేతులు తన చేతుల్లోకి తీసుకుంది అర్చన.

"ఒదులు. ఇప్పుడేమైంది. అందరూ చూస్తారు."

"ఇక్కడెవరున్నారు? ఎవరూ లేరుగా నళినీ నేను ఫూల్‌ని నన్ను క్షమించు. నాకెంతో సాయం చేసి నా జీవితం నిలబెట్టిన నిన్ను అనకూడని మాటన్నాను."

"ఇట్స్ ఓకే. ఫర్వాలేదు. అయినా నేనేం చేశాను నీకు?"

"అంతమాటనకు ప్లీజ్. నళినీ నేనిప్పుడు చాలా సంతోషంగా ఉన్నాను. నా సంతోషం నీకు తప్ప ఎవరికి షేర్ చేయగలను నాకెవరున్నారు."

ఓహో అందుకా ఇప్పుడు ఈవిడకి తన అవసరం వచ్చింది. అవును ఎవరున్నారు? మరి ఎందుకు అంత అహంకారం? ఏమాట పడితే ఆ మాట అనేముందు తనకెవరూ లేరని, చేతులారా అందర్నీ దూరం చేసుకుందన్న జ్ఞానంలేదా ఈమెకి నిరసనగా అనుకుంది నళిని.

ఆమె హావభావాలు గమనించినదానిలా అంది అర్చన.

"నాకు తెలుసు నళినీ. అనేముందు గుర్తురాలేదా ఈవిడకి అనుకుంటున్నావు కదూ నళినీ నేను చాలా సామన్యురాలిని. ఆవేశం అదుపులో పెట్టుకోడం చేతకానిదాన్ని. నాకెందుకో నువ్వలా నా భావాల్ని చులకన చేసి మాట్లాడుతుంటే తట్టుకోలేకపోయాను. నిన్ను బాధపెట్టాను. తప్పు చేశాను. కానీ, చిన్న తప్పేకదా క్షమించలేవా? " జాలిగా అడిగింది అర్చన.

నళిని కళ్ళల్లో కొంచెం సానుభూతి కదిలింది. "నేనెవరినిలే క్షమించడానికి. అయినా నీకూ, నాకూ ఏం సంబంధం? ఉన్న నాలుగురోజులూ కలిసి ఉంటాం. ఎవరి జీవితాలు ఎలా సెటిల్ అవుతాయో ఎవరి గమ్యం ఏంటో ఎవరికి తెలుసు. రేపు నీకేదన్నా మంచి జాబ్ వస్తే నీ దారిన నువ్వు వెళ్ళిపోతావు."

"అవును. ఆ సమయం వచ్చింది. అందుకే నేను చాలా సంతోషంగా ఉన్నాను. నా సంతోషం నీకు పంచాలని వచ్చాను."

"ఏం? ఎందుకు అంత సంతోషం?" అడిగింది.

"నేను.. నేను .. నాకు ఆర్.డి.ఓగా విజయవాడలో పోస్టింగ్ వచ్చింది. రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్."

"ఓ గుడ్ కంగ్రాచ్యులేషన్స్" అప్పటిదాకా ఉన్న తిరస్కార భావం మంత్రం వేసినట్టు మాయమైంది. హమ్మయ్య ఈమె జీవితం ఒడ్డున పడింది అనుకుంది. అదే భావనతో, అదే నిజాయితీతో అంది. "మొత్తానికి నీ కల నెరవేరింది. హార్టీలీ కంగ్రాచ్యులేషన్స్" మనస్ఫూర్తిగా అభినందించింది నళిని.

"థాంక్యూ.. థాంక్యూ వెరీమచ్" కళ్ళల్లో ఆనంద భాష్పాలతో చెప్పింది అర్చన.

"అయితే నువ్వు విజయవాడ వెళ్ళిపోతావా?"

"తప్పదుగా నళినీ. ఇంక నుంచీ నేనెక్కడ ఉంటానో నాకే తెలియదేమో. ఎన్ని ఊళ్ళు తిప్పుతారో, ఏ ఏ పోస్టింగ్‌లు ఉంటాయో నాది ఛాలెంజింగ్ జాబ్. నేనిక నుంచీ మానసికంగా అని రకాల సమస్యలకు, సిద్ధపడాలి. సమస్యలే ఉంటాయో సహకారమే ఉంటుందో తెలియదు కదా ఏదెలా ఉన్నా నేను త్వరలో కలెక్టర్‌ని కావాలి. అవుతాను."

"యస్. అవుతావు. బెస్టాఫ్ లక్."

"ఎందుకోయ్? ఏంటి సంగతి? ఎవరికి బెస్ట్ ఆఫ్ లక్?" క్లాస్ అయిపోడంతో స్టాఫ్ రూముకి వచ్చిన మరో ఇద్దరు టీచర్లు అడిగారు. "మన అర్చనకి ఆర్.డి.ఓ.గా పోస్టింగ్ వచ్చింది."

"ఓ కంగ్రాట్స్.. అయితే ఇవాళ మనందరికీ అర్చన లంచ్ ఇప్పిస్తుందనమాట." సరదాగ అందొక టీచర్.

"ష్యూర్. ఎందుకిప్పించను?లంచ్ టైములో బైటకి వెళదాం" అంది అర్చన.

అందరూ అభినందనలతో ముంచెత్తారు. వాళ్ళతో కలిసి మంచి హోటల్లో భోంచేసి తన ఆనందాన్ని పంచుకుంది అర్చన. సాయంత్రం నళిని, అర్చనా కలిసి షాపింగ్ వెళ్ళారు. వర్ధనమ్మకి, నళినికి మంచి చీరలు చెరొకటీ కొంది అర్చన.

"నేను తిరుపతి వెళ్ళాలి నళినీ. జాయినయేముందు తిరుపతి వెళ్ళిరావాలి.." చెప్పింది అర్చన.

"అలాగే వెళ్ళు అర్చనా.. దానికేంటి?"

"నాతో తోడు వస్తావా?"

"ఎలా అర్చనా.. పిల్లల ఎగ్జామ్స్ టైం కదా."

"ఓ కరెక్ట్" అర్చనకి గుర్తొచ్చింది. హాఫ్ ఇయర్లీ పరీక్షలు మొదలు. చాలా బిజీగా ఉండే పరిస్థితి.

"నేను రేపు రిజిగ్నేషన్ ఇచ్చేస్తాను నళినీ."

"ఇచ్చెయ్. ఇంకెందుకీ పిచ్చి ఉద్యోగం?"

"అలా అనకు. ఇంతకాలం నాకు అన్నం పెట్టిన ఉద్యోగం. నాకు మనశ్శాంతినీ, ఆనందాన్నీ ఇచ్చిన ఉద్యోగం."

"ఓకే. ఓకే. " ఎమోషనల్ అవకు.

"సరే ఇంకా రిజర్వేషన్‌కి టైం ఉంది. స్టేషన్‌కి వెడదమా? " అడిగింది అర్చన.

"వెడదాం పద. " ఇద్దరూ ఆటో చేసుకుని స్టేషన్‌కి వెళ్ళి తిరుపతికి టికెట్ రిజర్వేషన్ చేయించుకున్నారు.

ఆ రాత్రి నళినిని వదల్లేదు అర్చన.

ఇద్దరూ గుండె తలుపులు తెరిచి కష్టసుఖాలు, అభిరుచులు, అలవాట్లు కలబోసుకున్నారు. ఆ మాటల్లో తన కలల రాజకుమారుడి ప్రస్తావన రాకుండా జాగ్రత్తపడింది అర్చన. రాత్రి బాగా పొద్దుపోయాక తేలికపడిన మనసుతో ఇద్దరూ హాయిగా నిద్రపోయారు.

●●●

పదో తారీకు శుక్రవారం తిరుపతి వెళ్ళడానికి నారాయణాద్రిలో టికెట్లు బుక్ చేశాడు వేణు. ముందురోజే కృష్ణస్వామి హైదరాబాద్ వచ్చేశాడు. ముప్పై ఏళ్ళ వాళ్ళ వైవాహిక జీవితంలో మొదటిసారిగా భర్తకి దూరంగా ఉంటున్న తాయారమ్మకి ఆయన్ని చూడగానే దుఃఖం వచ్చేసింది. మనిషి కొంచెం చిక్కాడు. మునపటంత ఆరోగ్యం కనిపించలేదు. ఆ మాట ఆయనతో అనడానికి కొడుకు ముందు ఆవిడ జంకింది. కాకపోతే కొంచె జాలి ధ్వనించే స్వరంతో అడిగింది. ఆరోగ్యం బాగుందాండీ..

ఆయన నవ్వి. "నా ఆరోగ్యానికేం భేషుగ్గా ఉంది. నా బంగారు సంగతేంటి? " అంటూ మనవడిని ఎత్తుకున్నాడు.

"నిన్నే కలవరిస్తున్నాడు నాన్నా. " అన్నాడు వేణు నవ్వుతూ.

"ఏరా తాతా నిజమేనా నన్ను కలవరిస్తున్నావా? " అంటూ వాడిని ముద్దు పెట్టుకుని భార్య చేతికిస్తూ "నేను స్నానం చేసి వస్తాను. " అంటూ పెరట్లోకి వెళ్ళిపోయాడు.

స్నానం చేసి వచ్చాక వదలకుండా మనవడితో ఆడుకుంటూ కాలం మర్చిపోయాడు ఆయన.

నీలవేణి, తాయారమ్మ ప్రయాణం ఏర్పాట్లు చేయడానికి వెళ్ళిపోయారు. జంతికలు, లడ్లు చేశారిద్దరూ కలిసి.

మర్నాడు మధ్యాహ్నానికి మాధవి పులిహోరా, పూరీ కూరా చేసుకుని తీసుకొచ్చింది. కృష్ణస్వామిని చూడగానే మాధవికి ఫాన్సీ వేషంలో ఉన్న పరమేశ్వరుడిలా అనిపించాడాయన. అసంకల్పితంగానే ఆయన పాదాలకు నమస్కరించింది.

"దీర్ఘసుమంగళీభవ" అని దీవిస్తూ "ఈ అమ్మాయేనా మాధవి? " అనడిగాడు భార్యవైపు చూస్తూ.

అవును అన్నట్టు తలూపి మాధవిని దగ్గరగా తీసుకుని అంది ఆవిడ. లక్ష్మీదేవిలాంటి పిల్ల. చక్రవర్తి అదృష్టవంతుడు. మనస్ఫూర్తిగా అనుకుంటూ అర్చనని తల్చుకుని దీర్ఘంగా నిట్టూర్చింది. ఇలాంటి ఆడపిల్లతో స్నేహం చేసి అలా ఎందుకైందో అనుకుంది ఆవిడ.

"ఏం బాబూ కులాసానా? చాలాకాలమైంది నిన్ను చూసి" అంటూ చక్రవర్తిని పలకరించాడు కృష్ణస్వామి.

"అవును బాబాయ్. మీరెలా ఉన్నారు? జీవితంలో ఇన్నేళ్ళకి ఇప్పుడు స్వయంపాకం మీకు తప్పలేదా? " అన్నాడు చక్రవర్తి.

"స్వయంపాకం కాబట్టే కడుపు నిండా తింటూ ఒళ్ళు చేశాను చూశావా? " అన్నాడాయన హాస్యంగా.

"అన్యాయం మావయ్యగారూ పాపం అత్తయ్యగారు మిమ్మల్ని కంటికి రెప్పలా కాపాడుకున్నారు ఇంతకాలం అది మర్చిపోతే ఎలా? " అంది మాధవి.

"దానిదేం ఉంది తల్లీ ఏరు దాటాక తెప్ప తగలేయడం ఈ మగవాళ్ళకి అలవాటేగా" అంది కినుకగా తాయారమ్మ.

చక్రవర్తి నవ్వుతూ "బాబాయి సరదాగా అన్నారు లెండి పిన్నిగారూ! " అన్నాడు.

వేణు కొంచెం బాధగా "నావలన మా అమ్మా, నాన్న జీవితంలో మొదటిసారి విడిగా ఉండాల్సి వచ్చింది" అన్నాడు.

"నీ తలకాయ ఏం మాటలురా విడిగా ఉండడం ఏంటి? ఈ రోజుల్లో ప్రతి ఇంట్లో మొగుడూ, పెళ్ళాలు ఒకళ్ళు అమెరికాలో ఒకళ్ళు ఇండియాలో ఉంటున్నారటకదా. ఇంకా నయంకాదూ పాస్ పోర్టులు, వీసాలు, తెల్లవాడి అనుమతులు అక్కర్లేకుండానే మీ అమ్మ దగ్గరికి ఎప్పుడు పడితే అప్పుడు రాగలుగుతాను. అందుకు సంతోషించు."

వేణు నవ్వలేదు. "ఈ వయసులో మిమ్మల్నిద్దరినీ ఇలా ఉంచడం ధర్మం కాదు నాన్నా త్వరలోనే ఈ సమస్య పరిష్కరిస్తాను. అమ్మని నీ దగ్గరికి పంపించేస్తాను."

కృష్ణస్వామి కొంచెం కలవరపడ్డాడు. వేణు అసలే సెన్సిటివ్. వాడిలా ఆలోచిస్తే ఏం నిర్ణయం తీసుకుంటాడో అనిపించిందాయనకి. వేణు మనసులో ఏ భావమైతే రాకూడదని ఇంతకాలం ప్రయత్నించాడో ఆ భావన రానే వచ్చింది.

కొంచెం కలవరంగా అన్నాడాయన. "నేను కూడా ఇక్కడికే వచ్చేస్తానురా. మా తాతను వదిలి ఇంక ఉండలేను. గుడి బాధ్యతలు రామస్వామికి అప్పగిస్తున్నాను."

రామస్వామి కృష్ణస్వామికి దూరపు బంధువు. చిన్నప్పుడే అతనికి పోలియో వలన కాళ్ళు చచ్చుపడ్డాయి. కర్రలతో నడుస్తాడు. తండ్రి చిన్నప్పుడే పోడంతో తల్లే నాలుగిళ్ళల్లో వంటలు చేస్తూ రామస్వామిని పెంచి పెద్దచేసి, సంస్కృతం వేదాలు నేర్పించింది. అతను బ్రహ్మచారి. తల్లిపోయాక తనే చేతనైనట్టు ఒండుకుని తింటూ కాలక్షేపం చేస్తున్నాడు. అతని స్థితికి జాలిపడి కృష్ణస్వామి ఎక్కువగా గుడిలో వచ్చే ప్రసాదాలు ఇస్తూ వంట చేసుకునే అవసరం చాలావరకు తగ్గిస్తుండేవాడు. ఆయన ఎప్పుడైతే తాను వేణు దగ్గరకు వెళ్ళిపోవాలని నిశ్చయించుకున్నాడో మనసులో గుడి బాధ్యత రామస్వామికి అప్పగించాలన్న ఆలోచన అంకురించింది. అందుకుగాను రామస్వామికి గుడి నియమాలు, పద్ధతులు నేర్పిస్తున్నాడు. ప్రస్తుతం ఆయన్నే గుడిలో నిత్యపూజకు నియమించి వచ్చాడాయన.

సంభాషణ మారుస్తూ అన్నాడాయన వేణుతో "ఇంతకీ మనమిలా హఠాత్తుగా బయల్దేరుతున్నాం. దర్శనం అవుతుందా? అందుకోసం ఏదన్నా ఏర్పాటు చేశావా?"

వేణు కొంచెం భారంగా నిట్టూర్చాడు. అదే స్వరంతో అన్నాడు. "చేశాను నాన్నా. నా స్నేహితుడు ఎండోమెంట్స్‌లో చేస్తున్నాడు. వాడి సాయంతో మనకి స్పెషల్ దర్శనం టిక్కెట్లు కూడా బుక్ చేశాను. అర్ధరాత్రి రెండింటికి మనం స్నానలు చేసి వెళ్లిపోతే సుప్రభాత సేవ చూడొచ్చు."

"మంచిపని చేశావు." అభినందించాడు కృష్ణస్వామి.

"వేణూ టైం అవుతోంది. క్యాబ్ బుక్ చేశావా?" అడిగాడు చక్రవర్తి.

"ఆ.. చేసేసాను. వచ్చేస్తాడు. నాలుగైందా? టైమెంత?" అడిగాడు.

"ఇంకా పదిహేను నిమిషాలుంది నాలుగు అవడానికి."

"అలాగా! నాలుగింటికి రమ్మన్నాలే వచ్చేస్తాడు. అంటూ ఇప్పుడే వస్తాన"ంటూ లోపలికి వెళ్ళాడు.

ఆ కబురూ, ఈ కబురూ చెప్పుకుంటూ, పనులు చేసుకుంటూ హడావిడిగా గడిపేటప్పటికి క్యాబ్ రానే వచ్చింది. వేణూ, చక్రవర్తి సామాను క్యాబ్‌లోకి ఎక్కించారు. బాబునెత్తుకుని కృష్ణస్వామి, ఆయన వెనక తాయారమ్మ, మాధవి, నీలవేణి వచ్చి కారులో కూర్చున్నారు. వేణు తలుపులు తాళాలేసి చక్రవర్తితో వచ్చి వెనక సీటులోకి వెళ్ళిపోయారు. కారు కదిలింది.

కొండమీదికి వెళ్ళేసరికి పదైంది. అప్పటికే బుక్ చేసిన కాటేజ్‌కి తీసుకెళ్ళాడు వేణు అందరినీ. రెండు బెడ్ రూమ్స్ ఉన్న స్పెషల్ కాటేజీ. ఒక రూములో ఆడవాళ్ళు, ఒక రూములో మగవాళ్ళు చక చకా తెమిలి రెడీ అయిపోయి రూముల్లోంచి బైటికి వచ్చేశారు.

కాఫీలు తాగుదాం అంది తాయారమ్మ. ఆవిడకి తెల్లవారుఝామునే కాఫీ తాగటం అలవాటు. ఐదింటికే లేచి మొహం కడుక్కుని చిక్కటి పాలతో స్ట్రాంగ్ డికాషన్‌తో కాఫీ కలుపుకుని భర్తకిచ్చి, తానూ తాగాక కానీ, స్నానానికి వెళ్ళదావిడ ఆ అలవాటు పట్నం వచ్చినా కంటిన్యూ అవుతూనే ఉంది. ఇప్పటికే బాగా లేట్ అయింది. ఆవిడ ప్రాణం కాఫీ, కాఫీ అని కొట్టుకుంటోంది.

"పది దాటింది కదమ్మా బ్రేక్ ఫాస్ట్ చేసి ఒకేసారి కాఫీ తాగేద్దాం" అన్నాడు వేణు.

"కాఫీ తాగితే కానీ నేనేం తినలేనురా" అందావిడ.

"సరే రండి.." అంటూ కొంచెం దూరంలో ఉన్న కాఫీ కొట్టు దగ్గరకి నడిచాడు. అందరూ వేణుని అనుసరించారు.

బాయిలర్‌లో మరుగుతున్న డికాషన్, మరుగుతున్న పాలు, చక్కగా కడిగి ముగ్గేసిన పరిసరాలు, వెంకటేశ్వర స్వామి పటం ముందు వెలుగుతున్న అగరు బత్తీలు చక్కటి పరిమళాలు వెదజల్లుతుంటే ఆ వాతావరణం ఎంతో పవిత్రంగా, మరెంతో ఆహ్లాదంగా అనిపించి వివశురాలై చూసింది నీలవేణి. ఎన్నడూ కలలో కూడా ఊహించనిది జరిగింది. ఆ ఏడుకొండలవాడిని దర్శించుకోబోతోంది అతి త్వరలో. అదంతా బాబువల్లనే. వాడి పట్ల మమతతో నిండిపోయిందామె మనసు.

"ఎక్కడనుంచి ఎక్కడికి పడేశావు తండ్రీ నన్ను. ఆ అమ్మా, నాన్నలను దూరం చేసి, ఈ అమ్మా, నాన్నలను ఇచ్చావు. ఏమిటో నీ లీల. పెళ్ళికాని తల్లిగా బతకమని ఈ బాబునిచ్చావు. ఏ తల్లి కని నాకు వరంగా ఇచ్చిందో ఆ తల్లికి నేను బతుకంతా కృతజ్ఞురాల్ని నాయనా. నన్నిలాగే ఈ వృద్ధ దంపతుల చల్లని నీడలో, ఈ బాబు సేవలు చేసుకుంటూ బతకనీ నాకింకేం ఒద్దు. వేణుబాబుగారు వేరే పెళ్ళి చేసుకుంటే కూడా నేనీ బాబునివ్వను. నేనే పెంచుకుంటాను" అనుకుంటూ చేతుల్లో ఉన్న బాబుని గుండెలకు హత్తుకుంది నీలవేణి.

"కాఫీ తాగు నీలవేణి.. " వేడి, వేడి కాఫీ. గాజుగ్లాసు అందించింది మాధవి. బాబుని ఎడం చేత్తో గట్టిగా పొదుపుకుని కుడిచేత్తో గ్లాసు అందుకుంది.

"వాడినిలా ఇవ్వు. నేను తాగేశాను. నేనెత్తుకుంటాలే. " మాధవి నీలవేణి చేతులోంచి బాబుని అందుకుంది.

మాధవి వాడినెత్తుకుని అక్కడే ఉన్న రావిచెట్టు గట్టు మీద కూర్చుంది. చెట్టుమీద వాలిన పిట్టల్ని చూపిస్తూ "అదిగో చూశావా బర్డ్. అరరే ఎగిరిపోతోంది నాన్నా పిలువు హాయ్ బర్డ్. అయామ్ రిత్విక్ చెప్పు. నేను జేజిని చూడ్డానికి వచ్చాను. నా హెయిర్ జేజికిచ్చి వెళ్తాను తెలుసా! చెప్పునాన్నా. " అంటూ కబుర్లు చెపుతోన్న మాధవి దగ్గరికి "ఏంటి తెగ కబుర్లు చెప్పేస్తున్నావు వాడికి? " అంటూ వచ్చాడు చక్రవర్తి.

మాధవి నవ్వుతూ "కౌశిక్ ఏడి?" అడిగింది.

"అడుగో నానమ్మ పాలు తాగిస్తోంది. " తాయారమ్మ చేత్తో బుద్ధిగా పాలు తాగుతున్న కౌశిక్‌ని చూపించాడు.

"బాగుంది. ఆవిడకి అనుకోకుండా ఇద్దరు మనవళ్ళు దొరికారు. చెప్పలేనంత ఆనందంగా ఉన్నారావిడ" అంది మాధవి. చక్రవర్తి అవునన్నట్టుగా తలుపాడు.

అప్పుడే తిరుపతి నుంచి బయలుదేరిన బస్సు కొండమీదికి చేరింది. భక్తులంతా గోవిందా గోవిందా అంటూ గోవిందనామాలు చదువుతున్నారు. కొండమీదకి రాగానే అందరి మనసుల్లో ఏదో ఉద్వేగం. మరేదో ఆనందం. ప్రతి వ్యక్తికి ఆ కొండమీదికి రాగానే "హమ్మయ్య నా ఇంటికి నేను వచ్చాను. నా గమ్యం నేను చేరుకున్నాను. ఇదే నా గమ్యం. ఇక్కడే నా జీవితం ఈ ఏడుకొండలవాడి చరణాలే నా సర్వస్వం" అనే భావన కలిగేలా చేయడమే ఆ తిరుమలలోని ప్రత్యేకత. అక్కడి వాతావరణం ఆ గాలి, ఆ చెట్లు, పూలు ఎక్కడ చూసినా వినిపించే హరినామ సంకీర్తన, బోడి గుండ్లతో కనిపించే భక్తుల సందడి. టీలు, కాఫీలు పట్టుకుని తిరిగే కుర్రాళ్ళు. రాగి బాయిలర్లలో మరిగే పాలతో ఉండే టీ కొట్లు, రకరకాల వస్తువులు అమ్మే అంగళ్ళు. ఎక్కడ పడితే అక్కడ మేనువాల్చి విశ్రాంతి తీసుకునే భక్తులు. వసుధైక కుటుంబం అనే మాటకి అసలైన నిర్వచనంలా ఉండే తిరుమల. అడుగడుగునా కనిపించే ఆధ్యాత్మికత.

అర్చన బ్యాగ్ భుజాన వేసుకుని బస్సు దిగింది.

ఎంతకాలమైంది ఈ కొండకి వచ్చి తండ్రీ నన్నిలా వంటరిగా రప్పించావా? కుటుంబాలతో దిగుతున్న ప్రయాణీకులను చూసి కొంచెం మనసు కలతగా అనిపించింది. ఒక్కసారి పరిసరాలను చూసి, ముందుకు కదిలింది.

●●●

**వేణు అందర్నీ హోటల్ వైపు తీసుకెళ్ళాడు.** తండ్రి బైట ఏమీ తినడని తెలిసిన వేణు కృష్ణస్వామిని అడిగాడు. "నాన్నా మీరేం తింటారు?"

"ఫరవాలేదురా జీవితంలోనే మార్పులొచ్చాయి. అలవాట్లదేం ఉంది. మీతోటే నేనూ. మీ అమ్మ మారింది కదా నేనూ మారతాను. పదండి"

వేణు మనసు కలుక్కుమంది. తనని తాను తమాయించుకుని హోటల్లోకి నడిచాడు.

అక్కడ బ్రేక్ ఫాస్ట్, కాఫీలు ముగించి అందరూ కలిసి కళ్యాణకట్ట దగ్గరకు బయలుదేరారు.

అక్కడ కూడా జనం క్యూలో ఉన్నారు.

"లైన్లో నుంచోవాలమ్మా నేనూ, చక్రవర్తీ నిలబడతాం మీరంతా కాటేజీకి వెళ్తారా?" అడిగాడు వేణు తల్లిని. ఆవిడ భర్తవైపు చూసింది.

"ఎందుకులేరా కాస్సేపు నిలబడితే అయిపోతుంది. వెళ్ళి మాత్రం ఏం చేస్తాం? కానీ, అందరం నిలబడదాం" అన్నాడాయన.

మగవాళ్ళు క్యూలో నిలబడితే, ఆడవాళ్ళు అక్కడే కొంచెం దూరంలో ఉన్న చెట్టు కింద పిల్లల్ని పెట్టుకుని కూర్చున్నారు. క్యూ త్వరగానే అయిపోయి వీళ్ళవంతు వచ్చింది. పిల్లల్ని ఎత్తుకుని వెళ్ళారు అందరూ. రిత్విక్‌కి మొదటి మూడు కత్తెర్లు చక్రవర్తి వేశాడు.

"వీడికి భలే దొరికాడు మేనమావ" నవ్వుతూ బాబు బుగ్గ సున్నితంగా లాగి వదిలాడు వేణు.

కౌశిక్ వచ్చీరాని మాటలతో వచ్చి తానూ బాబు జుట్టు కట్ చేస్తానని మారాం చేయసాగాడు. ఎంత నచ్చచెప్పినా వినకపోవడంతో వాడి చెయ్యి పట్టుకుని రెండు కత్తెర్లు వేయించాడు చక్రవర్తి. బాబు అసలు ఏడవకుండా పూర్తిగా గుండు చేయించుకోడం అందర్నీ ఆశ్చర్యంలో ముంచెత్తింది.

"బాబోయ్ వీడెంత గట్టివాడు" అంది మాధవి.

"వాడికి తమాషాగా, వింతగా ఉంది. ఎంజాయ్ చేస్తున్నాడు." నవ్వాడు చక్రవర్తి.

వేణు ఒళ్ళో కూర్చుని బుద్ధిగా జుట్టు కట్ చేయించుకుంటున్న బాబుని చూస్తూ మురిసిపోతున్న వేణుని తాయారమ్మ, కృష్ణస్వామి చిరునవ్వుతో చూస్తుండిపోయారు.

బోడిగుండుతో, బోసినవ్వుతో చొక్కా నిండా వెంట్రుకలతో వేణు చంకలో ఉన్న బాబుని చుస్తూంటే నీలవేణికి ఎలాగో అనిపించింది. అయ్యో బాబు అందమంతా జుట్టులోనే ఉండేది. మళ్ళీ ఎప్పటికి అంత జుట్టు వస్తుందో దిగులుగా అనుకుంది.

చక్రవర్తి కౌశిక్‌ని కూడా తీసుకెళ్ళి గుండు చేయించేశాడు.

అప్పటివరకూ ఒత్తైన జుట్టుతో ముద్దుగా కనిపించిన పిల్లలిద్దరూ గుండ్లతో కనిపించడంతో మాధవిక్కూడా దిగులుగా అనిపించింది. గట్టిగా ఆ మాట అంటే తాయారమ్మ, కృష్ణస్వామి తప్పకుండా కేకలేస్తారు. అందుకే నోరుమూసుకుని ఉండిపోయింది.

"వీళ్ళిద్దరిని తీసుకుని మీ ఇద్దరూ కోనేటిలో స్నానం చేసిరండి" అంది తాయారమ్మ కొడుకునీ, చక్రవర్తినీ ఉద్దేశించి.

మాధవి కంగారుగా అంది "ఒద్దొద్దు చాదస్తం పడకండి. ఈ కోనేట్లో చేయించకూడదు. పసిపిల్లలుకి ఏవన్నా ఇన్ఫెక్షన్ వచ్చేట్టయితే త్వరగా వచ్చేస్తుంది."

"మరెలా? స్నానాలు చేయాలిగా" అందావిడ.

"రూములో చేస్తారు లెండి. ఇవాళ మనకి దర్శనం ఎలాగూ లేదు."

"అవునమ్మా ఇక్కడ వద్దు. రూముకి వెళ్ళి చేయిస్తాలే" అన్నాడు వేణు.

ఆవిడకి అర్ధమైంది మాధవి ఎందుకు వద్దంటోందో. అందుకే నెమ్మదిగా అంది. "పదండి పిల్లల్ని తీసుకుని కాటేజ్‌కి వెళ్ళి స్నానాలు చేయిద్దాం."

"ఇవాళ్టికి మనం దర్శనానికి వెళ్ళలేం కాబట్టి స్నానాలు, భోజనాలు చేశాక అలా పాపనాశనం, ఆకాశగంగ అవీ చూసొద్దాం" అన్నాడు వేణు.

అందరూ ఆ ప్రపోజల్ అంగీకరించారు.

తరువాత అందరూ తిరిగి కాటేజ్‌కి బయలుదేరారు.

●●●

అర్చన రూముకొచ్చింది. సింగిల్ కాట్. ఒక టేబుల్, కుర్చీ నిత్యం వచ్చి పోయే యాత్రికులతో క్రిక్కిరిసి ఉండే పుణ్యస్థలాల్లో ఈమాత్రం బస దొరకడం అదృష్టమే అనిపించింది ఆమెకి. బ్యాగ్ లోంచి బ్రష్, పేస్ట్ తీసుకుని, బాత్‌రూంలోకి వెళ్ళిపోయింది.

బ్రషింగ్ అయేటప్పటికి రూం బైట కాఫీ, కాఫీ అని అరుపు వినిపించింది. తలుపు తీసి బైటకొచ్చేటప్పటికి ఇద్దరు కుర్రాళ్ళు ఫ్లాస్కులో కాఫీ తీసుకుని రూములన్నీ తిరుగుతూ సప్లై చేస్తున్నారు. కాఫీ కుర్రాడిని పిలిచి రెండు ప్లాస్టిక్ గ్లాసుల్లో కాఫీ తీసుకుని అతనికి డబ్బులిచ్చి పంపించేసింది. కిటికీలోంచి బైటకి చూస్తూ కాఫీ తాగసాగింది.

దేవుడి దయవల్ల ఏ ఇబ్బందీ లేకుండా దర్శనం అయిపోతే బాగుండి. రేపు ఉదయం కిందికెళ్ళి అమ్మవారిని దర్శించుకుని రేపు రాత్రి బస్సుకి వెళ్ళిపోవచ్చు. లేదంటే రెండు రాత్రులు ఉండిపోవాల్సి వస్తుంది. తను కంకణం కూడా వేయించుకోలేదు. ఏదన్నా దర్శనానికి టికెట్టు తీసుకుంటే ఏం దర్శనాలుంటాయో కూడా తెలియదు. ఎప్పుడో వచ్చింది తిరుమలకి. అందరూ పెళ్ళి అవగానే స్వామి దీవెనలకోసం తిరుమల రావడం సంప్రదాయం. తన పెళ్ళికి ఓ సంప్రదాయం కూడానా నిట్టూర్చింది అర్చన. కాఫీ తాగడం పూర్తిచేసి స్నానానికి వెళ్ళిపోయింది.

●●●

పట్టు చీర కట్టుకుని, తడి జుట్టుకి క్లిప్పు పెట్టి వదిలేసింది. సెల్‌ఫోన్ , చెప్పులు రూములోనే వదిలేసింది. దర్శనం అయాక మళ్ళీ చెప్పులు తీసుకోనికి వెళ్ళడం ఇంకా పెద్దపని అనిపించింది. ప్రసాదం వేసుకోవడానికి ఒక క్యారీబ్యాగు చక్కగా మడతపెట్టి పర్సులో పెట్టుకుంది. పర్సులో కొంచెం చిల్లర, మరికొంత కరెన్సీ పెట్టుకుని రూమ్ తాళం వేసి బైటికి వచ్చింది.

కౌంటర్‌లో తాళం చెవి ఇచ్చి మెట్లు దిగి బైటికి వచ్చింది. టీ కుర్రాళ్ళు, కాఫీల వాళ్ళు, క్యారేజీలు, ప్లాస్టిక్ గ్లాసులు పట్టుకుని కాఫీ, టీ అంటూ అరుస్తూ తిరుగుతున్నారు.

'ఏ ఏర్పాట్లూ లేకుండా దర్శనానికి వెళుతున్నాను. క్యూలో ఎంత టైం పడుతుందో?' అనుకుంటూ ముందుకి వెళ్ళిపోయింది. నడిచినంత మేరా క్యూ కాంప్లెక్స్‌లు జనంతో నిండి ఉన్నాయి. ఆడా, మగా, పిల్లా పెద్దా పిచ్చి జనం. ఏవిటో ఈ స్వామివారి మహిమ దేవుడు లేడు అనేవాళ్ళు కూడా జీవితంలో ఒక్కసారైనా తిరుమలకొండకి వచ్చి స్వామిని దర్శించుకోకుండా ఉండరు. ఎక్కడనుంచి ఎక్కడిదాక ఉందో అర్ధంకానట్టు చాలా గజిబిజిగా అనిపించింది. ఏం చేయాలో తోచలేదు అర్చనకి. అలా అందరినీ చూస్తూ నడుస్తూ

వెళ్ళసాగింది. ఎప్పుడో అమ్మా, నాన్నలతో కలిసి ఇంటర్ పాసయాక వచ్చింది. తనకసలు ఇక్కడ ఏమీ తెలియదు. ఎవరన్నా తోడుంటే బాగుండేది. నిట్టూర్చింది.

అమ్మ, నాన్న ఈ జీవితంలో ఇంక వాళ్ళని చూడలేనేమో. ఎక్కడికెళ్ళారో అన్నయ్యకి, నాన్నకి తన మీద అభిమానం, జాలి లేకపోవచ్చు. అమ్మక్కూడా లేదా. తను చచ్చిందో, బతికుందో కూడా తలుసుకోడానికి మనస్కరించలేదా వాళ్ళకి.

అర్చన కళ్ళు చెమర్చాయి. నీళ్ళు నిండిన కళ్ళకి పరిసరాలు మసగ్గా కనిపిస్తోంటే కళ్ళు తుడుచుకుంది.

"అర్చనా..!" ఉలిక్కిపడింది అర్చన. చివ్వున వెనక్కి తిరిగింది.

నీలిమ..!!

"నువ్వా?" ఆశ్చర్యంగా చూసింది.

"అంత ఆశ్చర్యపోతావేం అర్చనా.. నేను తిరుపతి రాకూడదా?" చిరునవ్వుతో అడిగిమి నీలిమ.

అర్చన మాట్లాడలేదు. ఈ నీలిమ ప్రాణ స్నేహితురాలు ఒకప్పుడు. కానీ, ఈనాడు తన బద్ధ శత్రువు. ఏ మొహం పెట్టుకుని పలకరిస్తోంది. పక్కనే ఆమె భర్త కాబోలు మూడేళ్ళ పాపనెత్తుకుని నిలబడి ఉన్నాడు. బానే ఉన్నాడు. ఎందుకు కనిపించింది ఈమె? తనకసలు మాట్లాడాలన్న ఆసక్తే లేదు. ఇప్పుడు ఈ పరిస్థితుల్లో ఆ నాటి స్నేహితుల్ని కానీ, క్లాస్‌మేట్స్‌ని కానీ ఎవర్నీ కలవాలని లేదు. ఎందుకిలా జరిగింది? స్వామి దర్శనం కోసం వెళ్తోంటే ఏదో అపశృతిలా అనిపించింది అర్చనకి.

"మా వారు అర్చనా, ఇది నా కూతురు" యువకుడిని పరిచయం చేసింది.

"హలో" పలకరింపుగా నవ్వాడు.

"హలో!" బలవంతంగా నవ్వింది అర్చన.

"ఒక్కదానివే వచ్చావా అర్చనా?"

అర్చన ఏం మాట్లాడలేదు. కదలకుండా క్యూలో ఉన్న జనాన్ని చూస్తూ ఉండిపోయింది.

"మా దర్శనం అయిపోయింది. ఎర్లీగా వెళ్ళి క్యూలో నిలబడ్డాం. పైగా ముందే కంకణాలు వేయించుకున్నాం కదా ఇప్పుడే బైటికి వస్తున్నాం. నీకేదన్నా స్పెషల్ టికెట్ ఉందా?"

లేదన్నట్టు తలూపింది అర్చన.

"అరె అలా ఎలా వచ్చావు? తిరుపతికి ప్రీ ప్లాన్ లేకుండా వస్తారా ఎవరైనా? నువ్వన్నీ ఇలాగే చేస్తావు. సర్లే మా దగ్గర ఒక అర్చనంతర దర్శనం టికెట్ ఉంది రేపు ఉదయం మాతో వద్దువుగానిలే. ఇప్పుడు నీ వల్లకాదు. ఆ క్యూలో నువ్వు నిలబడలేవు." అంటూ భర్తతో అంది. "మీ అమ్మగారి టికెట్ వేస్ట్‌గా ఉంది కదా తనని తీసుకెళదాం."

"ఓ యస్ దానికేం" జేబులోంచి టికెట్ తీసి చూపించాడు.

"ఎందుకులే నీలిమా. ఇప్పుడు ట్రై చేస్తాను. అంతగా దర్శనం అవకపోతే రేపు మీతో వస్తాను. అయినా మీరెక్కడో, నేనెక్కడో రేపు కలవడం ఎలాగ" అంది అర్చన మొహమాటంగా.

"టైం ఎందుకు వేస్ట్ చేయడం? రేపు హాయిగా దర్శనం చేసుకోవచ్చు. మేము రామ్ బగీచాలో దిగాం. నువ్వెక్కడ దిగావు?"

అర్చనకి పచ్చి వెలక్కాయ గొంతులో దిగినట్టు అయింది. తనూ అక్కడే కదా. దేవుడా ఏమిటీ పరీక్ష.

"నేనూ అక్కడే" నీరసంగా అంది.

"అరే అలాగా ఇంకేం ప్రాబ్లమేం లేదు. రేపు వెడదాంలే బాగా నీరసంగా అనిపిస్తున్నావు. బ్రేక్ ఫాస్ట్ చేశావా? అయినా లంచ్ టైం అయింది. పద మాతో కలిసి లంచ్ చేద్దువుగాని"

"వద్దొద్దు. నాకు ఆకలి లేదు. నేను ఊరికే అలా వెళ్ళి రూముకి వెళ్తాలే మీరు వెళ్ళండి" గాభరాగా అంది అర్చన.

"ఏంటి దర్శనం తరువాత చేద్దామనా? తిరుపతిలో అలాంటి సెంటిమెంట్స్ ఓన్లీ సుప్రభాత సేవకో, పవళింపు సేవకో తోమాల సేవకో. ఇలా మిట్టమధ్యాహ్నం దర్శనానికి వెళ్తూ భోజనం చేయకుండా వెడితే కళ్ళు తిరిగిపడిపోతావు పద. కలిసి భోంచేద్దాం"

"ఒద్దులే నీలిమా నేను వెళ్తాను."

నీలిమ భర్తను చూస్తూ " మీరు నడుస్తుండండి మేం వస్తాం" అంది.

పాపనెత్తుకుని అతను ముందుకెళ్ళిపోయాడు.

నీలిమ అర్చన చేయి పట్టుకుని నడిపిస్తూ అంది. "నాకు తెలుసు అర్చనా.. నా మీద నీకు పీకలదాకా కోపంగా ఉంది. ఐకెన్ అండర్ స్టాండ్ కానీ, అర్చనా ఒక సాధారణ మధ్య తరగతి అమ్మాయికి నీ కున్నంత ధైర్యం, సాహసం ఉంటాయా? ఇంట్లో వాళ్ళందర్నీ కాదని ఏమన్నా చేయగలదా?"

అర్చన మాట్లాడలేదు. నీలిమ చేతుల్లో ఉన్న తన చెయ్యి ఇబ్బందిగా కదిపింది.

"అర్చనా! నీకు నేను సారీ చెప్పాలనుకోడం లేదు. కానీ, నా పరిస్థితి అర్థం చేసుకోమని మాత్రం కోరుతున్నాను"

"నిన్ను నేనేం అనలేదే" అర్చన అంది.

"అవునులే అది సరే నువ్వెక్కడ ఉన్నావు? ఏం చేస్తున్నావు? ఆ మధ్య మీ మావగారు, మీ ఆయనా నిన్ను వెతుక్కుంటూ మీ ఇంటికి వచ్చి వెళ్ళారు.."

అర్చన ఉలిక్కిపడి చూసింది.

"అవునా" అన్నట్టున్న ఆమె చూపు అర్థం చేసుకున్న నీలిమ అంది. "అవును నీకోసం వచ్చారు. మీ ఇల్లు అమ్మేశారని తెలిసి చాల ఎంక్వైరీ చేశారు. ఆ తరువాత ఏమైందో నాకు తెలియదు."

అర్చనకి అరికాళ్ళల్లో, అరిచేతుల్లో చెమటలు పట్టేశాయి. నోట్లోంచి మాట రానంత నీరసం ఆవహించింది.

నీలిమ సన్నని స్వరంతో అంది. "అర్చనా.. చిన్నప్పటినుంచీ నీలో ఉన్న విప్లవత్మక భావాలు, నీ యాటిట్యూడ్ నాకు బాగా తెలుసు. నిన్ను అన్యాయంగా ఎవరు ఒక్కమాట అన్నా సహించేదానివి కాదు. అలాంటిది నాగరాజు చేసిన నమ్మకద్రోహం నీ మనసు మీద ఎంతటి గాయం చేసి ఉంటుందో నేను ఊహించగలను. కానీ, ఒక తుచ్ఛుడి కోసం విలువైన నీ జీవితాన్ని నాశనం చేసుకున్నావనిపిస్తుంది నాకు. ఎనివే ఈ సమయంలో, ఇక్కడ ఈ పవిత్ర క్షేత్రంలో నీ తప్పొప్పుల గురించి మాట్లాడి నీ మనసు కష్టపెట్టడం నాకిష్టంలేదు. నువ్వు తిరుపతి ఒక్కదానివే వచ్చావు. నా స్నేహితురాలివి అనుకోకుండా కలిశాం. సరదాగా గడిపి స్వామి దీవెనలు తీసుకుని వెళ్ళిపోదాం సరేనా?"

నీలిమ స్వరంలోని మార్ధవం అర్చన మనసులో ఉన్న కోపం మీద మెల్లగా పన్నీరు చిలకరిస్తున్నట్టు అయింది. నెమ్మదిగా తనెందుకు దర్శనానికి వచ్చిందో చెప్పింది. తన పోస్టింగ్ సంగతి, ఇంతకాలం తను వైజాగ్ లోనే ఉన్న విషయం అన్నీ చెప్పింది.

"ఎంత చిత్రం. ఇంతకాలం నుంచీ ఒకే ఊళ్ళో ఉంటూ మనం కలుసుకోలేకపోయామా? పోనీలే. ఇప్పుడైనా కలుసుకున్నాం. ఏదెలా ఉన్నా నీ లక్ష్యం చేరుకోబోతున్న నిన్ను మనస్పూర్తిగా అభినందిస్తున్నాను అర్చనా. విష్ యూ ఏ గ్రాండ్ సక్సెస్" అంది నీలిమ.

థాంక్యూ..

ఆ తరువాత ఆ దంపతులతో కలిసి లంచ్ చేసింది. నీలిమ భర్త పాపను తీసుకుని వెళ్ళిపోయాడు. కాస్సేపు నీలిమా, అర్చనా కలిసి షాపింగ్ చేశారు. దేవుడి బొమ్మలు, గాజులు కొనుక్కున్నారు. ఇద్దరూ కలిసి రూం కెళ్ళిపోయారు.

"కాస్సేపు రెస్ట్ తీసుకుంటాను అర్చనా. మళ్ళీ కలుద్దాం. రేపు ఉదయం నాలిగింటికల్లా రెడీగా ఉండు" అంటూ నీలిమ తన రూంకి వెళ్ళిపోయింది. అర్చన కొన్ని వస్తువులన్నీ బ్యాగ్‌లో సర్దేసి, చీర మార్చుకుని తానూ విశ్రాంతిగా మంచం మీద వాలింది. కాస్సేపటికే ఆమెకి నిద్రపట్టింది.

●●●

వేణు, కృష్ణస్వామి దంపతులు, చక్రవర్తి దంపతులు, నీలవేణి, పిల్లలు అందరూ సుప్రభాత సేవ చూసుకుని, స్వామివారి దర్శనం చేసుకుని బైటకొచ్చారు.

అర్చనానంతర దర్శనం కోసం, ధర్మదర్శనం కోసం జనం క్యూల్లో ఉన్నారు. వాళ్ళందరినీ లోపలికి వదులుతున్నట్టున్నారు. గోవింద నామాలతో పరిసరాలు మార్మోగిపోతున్నాయి. జనం స్వామిని దర్శించుకోడానికి హాహాకారాలు చేస్తున్నారు. ఒకళ్ళనొకళ్ళు తోసుకుంటున్నారు.

ఆ జనాన్ని చూస్తుంటే మాధవికి కళ్ళు తిరుగుతున్నట్టు అయింది.

"అక్కా.. స్వామిని కళ్ళారా చూశాను. వైకుంఠానికొచ్చినట్టు అనిపిస్తోంది. చాలా బాగుందక్కా" అంది నీలవేణి మాధవి పక్కగా నడుస్తూ.

మాధవి సన్నగా నవ్వి ఊరుకుంది.

"రండి విమానం స్వామిని చూద్దాం" అంటూ జనం మధ్యలో దూరారు తాయారమ్మ, కృష్ణస్వామి. రిత్విక్‌ని ఎత్తుకుని నీలవేణి వాళ్ళని అనుసరించింది. చక్రవర్తి చేతుల్లోంచి కౌశిక్‌ని తనెత్తుకుని వేణు కూడా అరుగు ఎక్కాడు. మాధవి చెదిరిన జుట్టు సవరించుకుంటూ ముందుకు నడుస్తుండగా చక్రవర్తి ఆమె పక్కగా వచ్చి రహస్యంగా అన్నాడు.

"మధూ!.."

మాధవి చక్రవర్తి వైపు చూసింది.

"నేను.. నేను అర్చనని చూశాను."

"వాట్?" అదిరిపడింది మాధవి. "అ.. అర్చనా? ఎక్కడ? ఎక్కడ" ఉద్వేగంగా చూపులు తిప్పింది. ఆమె కళ్ళు జన ప్రవాహంలో అర్చన కోసం చంచలంగా తిరిగాయి.

"లోపలికి దర్శనానికి వెళ్తున్న వాళ్ళని చూశాను. ఒకమ్మాయి నేరేడుపండు రంగు పట్టుచీర కట్టుకుంది. అచ్చు అర్చనలాగానే అనిపించింది"

"మీరు సరిగా చూశారా? మీ భ్రమ ఏమీ ఇంత జనంలో అర్చన ఎలా కనిపించింది మీకు?"

"ఏమో సడన్‌గా నాకళ్ళు అటు తిరిగాయి. బైటికొస్తూ జనం వైపు చూస్తున్నాను. చేతులు జోడించి కళ్ళు మూసుకుని ఏదో చదువుతూ నెమ్మదిగా నడుస్తోంది. నా కళ్ళు అబద్దం చెప్పవనే నేననుకుంటున్నాను."

చాలా క్లియర్‌గా అంటున్నాడంటే నిజంగానే చక్రవర్తి అర్చనని చూశాడు అనిపించింది మాధవికి. చక్రవర్తి చూపులు చాలా పదును. ఎంతమందిలో ఉన్నా ఎవరినైనా ఇట్టే గుర్తిస్తాడు. కాబట్టి ఖచ్చితంగా అర్చన కనిపించి ఉంటుంది. మాధవి మనసులో అప్పటికప్పుడే అనేక ఆలోచనలు. అర్చన తిరుమల వచ్చిందా? స్వామి దర్శనం కోసం అర్చన ఎందుకు వచ్చి ఉంటుంది. అంత భక్తిప్రవత్తులున్నయా? నిజానికి తమ పరిచయంలో అర్చన పూజలు చేయగా ఎప్పుడూ చూడలేదు. అలాంటిది ఒక్కతే వచ్చి ఉంటుందా? చక్రవర్తిలాగే తనూ అందర్నీ చూసి ఉంటుందా? ఎందుకు అందర్నీ తప్పించుకుని తిరగాలనుకుంటోంది. ఎందుకు కుటుంబాన్ని కాదనుకుంటోంది. నిజంగా అర్చనేనా? అర్చన అయితే ఎక్కడున్నా, ఎలాగైనా పట్టుకోవాలి. వేణుని, బాబుని చూసిందా? అరే బాబు వేణు

చేతుల్లో లేడు. నీలవేణి ఎవరో తెలియదు అర్చనకి. అయితే బాబుని చూసి ఉండకపోవచ్చు. వేణుని మాత్రం తప్పకుండా చూసే ఉంటుంది.

"పదవెడదాం. నువ్వట్లా నిలబడితే బాగుండదు. పద, పద." చక్రవర్తి హడావుడి చేయడంతో అందరినీ అనుసరించింది.

నడుస్తోందే కానీ ఆమెని అర్చన గురించిన ఆలోచనలు ముప్పిరిగొన్నాయి. నిజంగా అర్చనేనా? తిరుపతి ఎందుకొస్తుంది? పైగా ఒక్కతి... నో.. చక్రవర్తి పొరపాటు పడి ఉంటాడు. అర్చన నిజంగా వచ్చి ఉంటుందా? అయితే తనెక్కడున్నట్టు? ఒక్కతే వచ్చిందా? ఎందుకొచ్చినట్టు. కేవలం దర్శనం కోసమా? లేక ఎవరినన్నా కొంపతీసి పెళ్ళికానీ... ఛ, ఛ నోరుమూసుకో తనని తను తిట్టుకుని ముందు నడుస్తున్న వాళ్ళని కలుసుకుంది. ప్రసాదం కౌంటర్ దగ్గరా, అక్కడా, ఇక్కడా ఎటు చూసినా అర్చన కోసమే మాధవి కళ్ళు అన్వేషించసాగాయి. మాటిమాటికీ వెనకపడుతోన్న మాధవిని వెనక్కి తిరిగి చూస్తూ అంది తాయారమ్మ.

"అమ్మాయ్ కాళ్ళు గానీ లాగేస్తున్నాయా.. ఏంటి నెమ్మదిగా నడుస్తున్నావు?" అడిగింది.

"అబ్బే అదేం లేదండి" అంటూ వడి, వడిగా ఆవిడ దగ్గరకి నడిచి ఆమె పక్కనే నడవసాగింది.

వేణు, చక్రవర్తి ప్రసాదం తీసుకురావడానికి వెళ్ళారు. పెద్దవాళ్ళతో కలిసి, నీలవేణి పిల్లలిద్దరినీ తీసుకుని బైట గచ్చుమీద చతికిలపడింది.

"నువ్వూ కూర్చోమ్మా" తాయారమ్మ అంది మాధవినుద్దేశించి.

"ఆ.. ఆ కూర్చుంటానండి" మాధవి అలా అంటూనే నెమ్మదిగా ముందుకు నడిచి వైకుంఠం ద్వారం వైపు వెళ్ళాలనుకుంది. కానీ, లోపలికి వెళ్ళిన అర్చన అక్కడ కనిపిస్తుందా అనిపించి వెనక్కి తిరిగింది. అన్యమనస్కంగానే పిల్లలిద్దర్ని ఆడిస్తున్న నీలవేణిని చూస్తూ మౌనంగా ఉండిపోయింది.

వేణు, చక్రవర్తి లడ్డూల కవర్‌తో వచ్చారు.

"పదండి రూముకెళ్ళి కాస్సేపు పడుకుందాం" అన్నాడు వేణు.

కూర్చున్నవాళ్ళంతా లేచారు.

మాధవి అంది. "నాకు ఈ వేళలో ఈ కొండమీద తిరగడం చాలా ఇష్టం. మనం కాస్సేపు ఇక్కడుందామా?" అంది చక్రవర్తితో.

"ఎందుకమ్మా ఇప్పుడు చల్లగా ఉంది కూడాను" కాస్సేపు పడుకుని మళ్ళీ వద్దాంలే అన్నాడు కృష్ణస్వామి.

మాధవి నిస్సహాయంగా చక్రవర్తిని చూసింది.

"మేమిద్దరం ఓ అరగంటాగి వస్తాం లెండి. వేణూ బాబుని రూముకి తీసుకెళతావా" అడిగాడు చక్రవర్తి మాధవి మనసులో ఆలోచన అర్థం చేసుకున్నవాడిలా.

"ఓకే ఎంజాయ్ చేయండి. పదండి నాన్నా మనం వెడదాం" అన్నాడు వేణు.

మాధవి కృతజ్ఞతగా చూసింది.

వాళ్ళు వెళుతుంటే మాధవి అంది "అర్చన వచ్చినా ఇదే దారిలో రావాలి కదా ఇక్కడే ఉందాం."

"అలాగే నాకేం అభ్యంతరం లేదు. కానీ, తను మనతో మాట్లాడుతుందా అనే డౌటు."

"మాట్లాడక ఏం చేస్తుంది? నేను మాట్లాడిస్తాను. ఇక్కడే ఉంటాను. కలిసి తీరతాను." పంతంగా అంది మాధవి.

చక్రవర్తి మౌనం వహించాడు. తను చూసింది ఖచ్చితంగా అర్చననే. ఆ జుట్టు, అందమైన ముఖ వర్చస్సు. అదే పర్సనాలిటీ ఖచ్చితంగా అర్చనే.

"కాఫీ తాగుదామా?" అడిగాడు.

"ఊహూ.. ముందు ఆమెని కలిశాకే" స్థిరంగా అంది మాధవి.

చక్రవర్తి ఇంకేం మాట్లాడలేదు. అటూ, ఇటూ తిరుగుతున్న జనం వైపు చూస్తూ కూర్చున్నారిద్దరూ.

●●●

మాధవి నిరీక్షణ వృధాకాలేదు. దర్శనం ముగించి నీలిమ, అర్చనా పాపని తీసుకుని మాధవి వాళ్ళు కూర్చున్న దగ్గరకే వచ్చారు. వాళ్ళను చూడగానే మాధవి చక్రవర్తితో అంది.

"మీరు వెళ్ళిపొండి మిమ్మల్ని చూస్తే ఆమె నాతో మాట్లాడకపోవచ్చు. నేను రూముకి వచ్చేస్తాను."

ఆమె అన్నది నిజమే అనిపించి చక్రవర్తి అర్చన దృష్టి తన మీద పడకముందే అక్కడి నుంచి దూరంగా వచ్చి వెనక్కి తిరిగి చూశాడు.

మాధవి అర్చన భుజమ్మీద చెయ్యేసి ఏదో మాట్లాడుతోంది. చక్రవర్తి హమ్మయ్య అనుకుని వెళ్ళిపోయాడు.

మాధవిని చూసిన అర్చన షాక్ తగిలినట్టు నిలబడిపోయింది.

"బాగున్నావా అర్చనా?" నవ్వుతూ అడిగింది మాధవి.

"నువ్వు.. మీరు.. నువ్వు ఇక్కడ?"

"స్వామి సన్నిధి. నేనూ దర్శనం కోసం వచ్చాను"

"కానీ.." అర్చన ఏం మాట్లాడలేకపోతోంది.

నీలిమ ఇద్దర్నీ విస్మయంగా చూస్తూ "ఎవరు అర్చనా? " అని అడిగింది.

మాధవే నవ్వుతూ చెప్పింది "అర్చన నా కజిన్."

ఓ నీలిమ కొంచెం అయోమయంగా అంది. చిన్నప్పట్నించీ ఒకే దగ్గర కలిసి బతికిన తామిద్దరికీ తెలియని బంధువులెవరూ లేరే. ఎవరీ కజిన్ అనుకుంది.

మాధవి అంది మళ్ళీ "రా అర్చనా. నా రూముకి వెడదాం. ఆయన కూడా ఉన్నారు. కలుద్దువుగాని."

"ఒద్దొద్దు" ఖంగారుగా అంది అర్చన.

"పోనీ నీ రూముకి వెడదామా?" అర్చన చేయి వదలకుండా అంది. ఎట్టి పరిస్థితుల్లో అర్చనని వదిలే ప్రసక్తి లేదు అని నిర్ణయించేసుకుంది మాధవి. ఏది ఏమైనా సరే ఇవాళ ఆమెతో మాట్లాడాలి. వీలైతే తీసుకెళ్ళిపోవాలి. మాధవి ఆలోచనలు తెలియని అర్చనకి మాధవి అనుకోకుండా ఎదురుపడడం ఒక విధంగా ఆనందంగా ఉన్నా, ఈ పరిస్థితిని ఎలా ఎదుర్కోవాలో తెలియని సందిగ్ధంతో అస్థిమితంగా అనిపిస్తోంది. ఏమిటీ పరీక్ష. నీలిమ, మాధవి కొంపతీసి ఇక్కడే వేణు కూడా కలవడు కదా! దేవుడా ఒక దరికి చేరబోతున్న నా జీవితం మళ్ళీ చిందర, వందర చేయకు.

"ఏంటి అర్చనా? ఏంటాలోచిస్తున్నావు. దర్శనం బాగా అయిందా?" మళ్ళీ అడిగింది మాధవి.

అర్చన సమాధానం చెప్పకుండా నీలిమతో అంది. "నేను రూముకి వెడతాను నీలూ. మీరు వచ్చేస్తారుగా."

"అలాగే" వాళ్ళిద్దరినీ అయోమయంగా చుస్తూ తలూపింది నీలిమ.

మాధవి చేయి అలాగే పట్టుకుని అర్చన ముందుకడిగేసి, ఒక్కసారి తూలినట్టైంది.

మాధవి గట్టిగా ఆమె భుజాలు పట్టుకుని నిలబెడుతూ "అనవసరంగా టెన్షన్ పడకు అర్చనా.. పద కాస్సేపు నీ రూంకెళ్ళి మాట్లాడుకుందాం. నిన్ను నేనేం ఎత్తుకుపోను సరేనా?"

అర్చన కళ్ళు మూసుకుంది.

రూముకొచ్చాక మంచం మీద బాసింపట్టు వేసుకుని కూర్చుంది మాధవి.

ఆమె ముందు అర్చన తలవంచుకుని మౌనంగా కూర్చుంది. ఆమె కళ్ళనుంచి కన్నీళ్ళు కారిపోతున్నాయి. ఇన్నాళ్ళుగా అణచుకున్న ఉద్వేగం మాధవి కనిపించడంతో ఎక్కువై దుఃఖం ఎగిసిపడుతోంది. మాధవికి ఆమె మానసిక స్థితి అర్థమైనట్టుగా కొన్ని నిమిషాలు అలాగే మౌనంగా ఉండిపోయింది. ఏడవనీ. మనసులో ఉన్నదంతా కన్నీళ్ళలో కొట్టుకు పోనీ అనుకుంది. పశ్చాత్తాపంతో దహించుకుపోతున్నట్టుంది. ఇదే సమయం. ఇప్పుడే ఆమెని తాను వెళ్ళిన దారినుంచి మళ్ళించవచ్చు. కొన్ని నిమిషాల తరువాత నెమ్మదిగా అంది మాధవి.

"ఏడవకు అర్చనా నీ మనసులో ఎం ఉందో నాకు చెప్పు నేనొచ్చాకదా"

అర్చన రుద్ధమైన కంఠంతో అంది నా మనసు విరిగిపోయింది ఇంకా ఆ మనసులో ఏం ఉంటుంది మధూ"

"మరి ఎందుకు ఏడుస్తున్నావు? అందర్నీ ఏడిపించడమే నీకు తెలుసనుకున్నా. నీక్కూడా కన్నీళ్ళున్నాయా? "అర్చన అన్న మాటకి చిరాకొచ్చి కొంచెం వెటకారంగా అడిగింది మాధవి. అర్చన మాట్లాడలేదు.

"చెప్పు అర్చనా ఎందుకిలా చేశావు?" అర్చనని రెట్టిస్తూ అడిగింది మాధవి.

"ఏం చెప్పను?" గాద్గదికంగా అడిగింది అర్చన.

"నీ మనసులో ఏం ఉందో చెప్పు"

"చెపితే తట్టుకునే గుండె ధైర్యం నీకుందా?"

"హు.. కట్టుకున్నవాడిని, అందులోనూ నువ్వంటే ప్రాణం పెట్టే భర్తనీ, కన్నకొడుకునీ వదిలి వెళ్ళిపోయావని తెలిసి తట్టుకోగలిగినదాన్ని నువ్వు చెప్పే విషయం విని తట్టుకోలేనా? ఇంతకన్నా భయంకరమైన విషయం చెప్పవుగా"

"ఆ మాట అంటేనే నాకు మండేది" ఎర్రబడిన కళ్ళతో చూస్తూ ఆవేశంగా అంది అర్చన,

"ఏ మాట?"

"ప్రాణం పెట్టే భర్త... ప్రాణం పెట్టే భర్త మీకు ఆ ఒక్కటే తెలుసు. కానీ, ఆ ప్రేమలో ఉన్న స్వార్థం ఏంటో నాకు తెలుసు."

"స్వార్థం లేని ప్రేమకి ప్రయోజనం ఉండదు. ఆ ప్రేమ ఫలించదు. ప్రేమ ఫలించాలంటే స్వార్థం తప్పదు."

"ఓహో వేణు కోసం మీరంతా అలా నిర్వచించుకున్నారా ప్రేమని?"

"కాదు.. ఫెయిల్ అయిన నాటి ప్రేమకథల స్ఫూర్తిగా ఆధునిక యువత నిర్వచించుకుంది ఇలా."

"అంటే తన ప్రేమ ఫలించలేదని అమ్మాయి మొహం మీద యాసిడ్ పోసే ప్రేమికుడిని కూడా నువ్వు సమర్థిస్తావనమాట."

"సమర్థించను. మానసికంగా పరిణతిలేని ప్రేమికుడని జాలిపడతాను. ప్రేమించిన అమ్మాయి మనసు గెల్చుకోలేని అసమర్థుడని అసహ్యించుకుంటాను."

"ఓ.. అంటే చాలా సమర్థుడని నీ నమ్మకం అనమాట"

"నిజం అతను సమర్థుడు. కానీ నువ్వే స్టుపిడ్‌వి. నీ కసలు ఏం కావాలో తెలియని చంచల మనస్కురాలివి. సున్నితమైన మనసున్న భర్తని అర్థం చేసుకోలేని రాక్షసివి.."

"స్టాపిట్ మాధవీ. ఐసే స్టాపిట్" ఆవేశంగా అరిచింది అర్చన.

మాధవి ఆమె వైపు చిత్రంగా చూసింది. కన్నీళ్ళ చారికలు కట్టిన చెంపల మీద కాటుక మరకలు, చెదిరిన ముంగురులు, నేరేడు పండు రంగు పచ్చని ఒంటి మీద మెరిసిపోతోంది. నల్లటి వంకీల జుట్టు చెంపలమీదుగా జారి వింత సోయగాన్నిస్తోంది. విచారంలో కూడా అపురూపమైన అందం. ఈ అందగత్తెకి కొంచెమన్నా మానవత్వం ఇవ్వలేదేంటి ఆ దేవుడు అనిపించింది ఆమెకి.

"మాధవీ ఒక్క మాట అడుగుతాను చెప్పు."

"అడుగు"

"నిన్ను చక్రవర్తి జాలితో పెళ్ళిచేసుకున్నాడా? ప్రేమించి పెళ్ళిచేసుకున్నాడా?"

"రెండూ కాదు. పెద్దవాళ్ళు చేశారు కాబట్టి చేసుకున్నాం. పెళ్ళయాక ఒకర్ని ఒకరు ప్రేమించుకుంటున్నాం, గౌరవించుకుంటున్నాం"

"అంటే ప్రేమతో పాటు గౌరవం కూడా పరస్పరం ఉండాలని ఒప్పుకుంటున్నావు కదా"

"అందులో సందేహం ఏం ఉంది? అయితే వేణుకి నా మీద గౌరవం లేదు. నీకా సంగతి తెలుసా?"

మాధవి విస్మయంగా చూసింది. "నీ మీద గౌరవం లేదా? ఎలా అనుకున్నావు? అందుకు నిదర్శనం ఉందా? "

"ఉంది" స్థిరంగా అంది అర్చన "ఉంది.. అందుకే అందుకే నాకిష్టం లేకుండా, నా అంగీకారం లేకుండా నా మీద అత్యాచారం చేశాడు" ఉద్రేకంగా అంది అర్చన.

"షటప్" తీవ్రంగా అరిచింది మాధవి.

"మొగుడు అతను నీ మెళ్ళో తాళి కట్టిన మొగుడు అతనికి నీమీద సర్వాధికారాలున్నాయి"

"లేదు అవును లేదు నాకు సిగ్గులేదు. అందుకే ఇంకా బతికున్నాను"

అంటూనే అర్చన రెండు చేతుల్లో మొహం దాచుకుని వెక్కి వెక్కి ఏడవసాగింది. మాధవి బిత్తరపోయింది. అనుకోకుండా పరిస్థితి ఇలా అవడంతో ఆమెకేం చేయాలో తోచలేదు. పాపం మనసు చెదిరిపోయి ఉంది. అనవసరంగా నా ఆవేశంతో ఈమెని బాధపెట్టానా అనిపించింది మాధవికి. కొంచెం ముందుకు జరిగి ఆమె చేతులు తొలిగించి మృదువుగా అంది "సారీ అర్చనా.. నీ మనసు బాధపెట్టాలనేది నా ఉద్దేశం ఎంత మాత్రం కాదు. ఏంటో దేవాలయం లాంటి ఇంటిని వదిలి, దేవతల్లాంటి మనుషుల్ని వదిలి వచ్చావనే కోపంతో ఏదో అన్నాను. ప్లీజ్ ఏడవకు. రిలాక్స్ అర్చనా.. ప్లీజ్"

మాధవి ఓదార్పు మాటలకి ఎక్కువ అవుతోన్న దుఃఖం అణచుకుంటూ వెక్కుతూ అంది అర్చన.

మీ దృష్టిలో నాగరాజు నా మీద అత్యాచారం చేస్తే, లేదా రెండు రోజులు తన అధీనంలో నన్నుంచుకుని, ఈ సమాజానికి నేను చెడిపోయాననే భ్రమ కలిగించి, ఈ సమాజం నన్ను అసహ్యించుకునేలా చేసినా, నా మీద జాలితో, తను పెళ్ళి చేసుకోకపోతే నా బతుకు ఏమైపోతుందో అనే విచారంతో వేణు ఆదర్శంగా నన్ను వివాహం చేసుకుని నాకు జీవితం ప్రసాదించాడు. కాబట్టి, వేణులాంటి ఆదర్శమూర్తిని, ఎంతో భద్రత కలిగిన కుటుంబ జీవితాన్ని వదిలేసి వచ్చి నేను ఇంకా చెడిపోయాను అవునా!

మాధవి సూటిగా చూస్తూ అంది. "చెప్పు నీ వర్షన్ పూర్తికానీ మాట్లాడతాను"

"ఏం మాట్లాడతావు? ఆడదానికి పెళ్ళి లేకపోతే బతుకులేదు. మొగుడనే వాడి నీడలో ఆడది ప్రశాంతంగా పిల్లల్ని కంటూ, వాళ్ళని పెంచి పెద్ద చేస్తూ, తన ఆశల్ని కోరికల్ని తన యవ్వనాన్ని పిల్లలకోసం త్యాగం చేస్తూ నూరేళ్ళు లేదా అరవై ఏళ్ళు లేదా ఎనభై ఏళ్ళు బతికి భర్త చేతుల్లో పుణ్యస్త్రీగా కళ్ళు మూసుకుని జన్మ చరితార్థం చేసుకోవాలి. అవునా అప్పుడే ఆడదాని జీవితానికి అర్థం, పరమార్థం అంతేనా?"

"పోనీ మా అభిప్రాయం అదే నీ అభిప్రాయం ఆడదాని జీవితం పట్ల నీ నిర్వచనం ఏంటో చెపుతావా?"

"చెపుతాను. అమ్మా, నాన్నల ప్రేమలో హాయిగా స్వేచ్ఛగా ఏ మాలిన్యం అంటకుండా పెరిగి, తనకంటూ కొన్ని ఆశయాలు, కొన్ని లక్ష్యాలు ఏర్పరచుకుని అవి నెరవేర్చుకునే దిశగా కృషిచేస్తూ, లక్ష్యాల్ని సాధించి, తనకు నచ్చిన, తనను మెచ్చిన వ్యక్తిని పెళ్ళాడి హాయిగా ఆనందంగా బతకడం.."

"నిన్ను నీ లక్ష్యాలు సాధించవద్దని వేణు నిషేధించాడా?"

"వేణు, వేణు తప్ప నాకు మరో బతుకు లేదా? అతనితో తప్ప ఇంకెవరితో నేను బతక్కూడదా? అతడ్ని తప్ప ఇంకెవర్నీ ప్రేమించకూడదా?" ఆవేశంగా అరుస్తున్న అర్చనవైపు చిత్రంగా చూస్తూ అంది మాధవి.

" ఎందుకలా గొంతు చించుకుంటున్నావు? ఏం చెప్పాలనుకుంటున్నావు?"

మాధవి ప్రశ్నకి అర్చన ఒక్కసారిగా తన ఆవేశాన్ని నిగ్రహించుకుంటూ అంది.

"మధూ నాలాంటి వాళ్ళు ప్రేమించకూడదా"

"అంటే నీలాంటి వాళ్ళంటే"

"అదే నేనేదో చెడిపోయాననుకుని మీరంతా భావించే"

"మేమలా భావించామని నీతో అన్నానా"

"నువ్వు కాదులే పోనీ మిగతావాళ్ళు"

"విషయం చెప్పు"

"చెప్పేముందు నా ప్రశ్నకి జవాబు చెప్పు. నేను ప్రేమించకూడదా"

"ఎవరిని?"

"నా ఊహల్లో ఉన్న వ్యక్తిని తరచూ నా కలలో కనిపిస్తూ నాకు శాంతి లేకుండా చేస్తున్న వ్యక్తిని నేను జీవితంలో ఎన్నడూ చూస్తాను అనుకోని వ్యక్తిని."

"ప్రేమించకూడదు. నీ భర్తని, నీ పిల్లలని తప్ప ఇంకెవరినీ ప్రేమించకూడదు."

"ఎందుకని?"

"ఒకసారి వివాహం అయిన స్త్రీ మనసు తెల్లకాగితం కాదు. ఎవరి పేరు పడితే అది రాసుకునే వ్యవస్థలో మనం బతకడం లేదు"

"లెట్ ద వ్యవస్థ గోటు హెల్."

"అలా అనే హక్కు నీకు లేదు అర్చనా. ఈ వ్యవస్థలో నువ్వూ భాగస్తురాలివి. ఈ వ్యవస్థ గౌరవం, ఈ వ్యవస్థను నిలబెట్టే బాధ్యత నీ మీద కూడా ఉన్నాయి. వాటిని కాదని నువ్వు ఈ వ్యవస్థలో బతకలేవు."

"కానీ, నేను ప్రేమించిన నాటికి నా మనసు ఒక తెల్లకాగితమే. పేరు రాసుకునే అవకాశం నాకు రాలేదు ఏం చేయను?"

"అబ్బా ఏంటో వివరంగా చెప్పు తల్లీ చంపకు" విసుగ్గా అంది మాధవి.

అర్చన కొన్ని క్షణాల్లో తన మనసులో అజ్ఞాతంగా పూజలందుకుంటున్న వ్యక్తి గురించి చెప్పింది. తరువాత నెమ్మదిగా అయినా స్థిరంగా అంది. "మాధవీ నాకు తెలియదు నేను చేసేది మంచో, చెడో అసలు ఏది మంచో, ఏది చెడో కూడా నాకు తెలియదు. తోచింది ఆచరించడం, నమ్మింది అనుసరించడం నా తత్వం. నేను వేణుని ఎన్నడూ ప్రేమించలేదు. ఎన్నడూ నా భర్తస్థానంలో అతడిని ఊహించలేదు. ఊహించని వ్యక్తిని ఎట్టి పరిస్థితుల్లో కూడా భర్తగా అంగీకరించే మనసు నాకు లేదు. అయినా నా నిస్సహాయతని, నా తల్లితండ్రుల వేదననీ తనకి అవకాశంగా తీసుకుని నన్ను స్వంతం చేసుకుందామనుకున్నాడు. తన స్వార్థానికి, త్యాగం అని పేరు పెట్టుకుని, నన్ను తన భార్యగా అతను శాశ్వతంగా బంధించాడు. అతను నన్ను శారీరకంగా బంధించగలిగాడు కానీ, మానసికంగా నేనెంతో స్వేచ్ఛగా ఉన్నాను. నా మనసులో వేణుకి అసలు స్థానం లేదు. నేను ఇతడినే ప్రేమించాను. ఆ కల నన్ను వెంటాడుతున్న రోజుల్లో అదొక పీడకల అనుకున్నాను. తల్చుకోడానికి భయం వేస్తుండేది. కానీ, ఎప్పుడైతే అతను నా కళ్ళముందు ప్రత్యక్షమై, తన చూపుల గాలంతో నన్ను తన వశం చేసుకున్నాడో అదొక మధురస్వప్నంగా, మరీ, మరీ ఆ కల నాకు రావాలని కోరుకునేదాన్ని. కానీ, కానీ, మా

ఇద్దరి మధ్యా, మమ్మల్ని వేరుచేస్తూ ఎగిరివచ్చిన ఓ భయంకరమైన పక్షి వేణు అనీ, విరిగిపడిన నా మొండెం పగిలిపోతున్న నా కలలనీ నేనెన్నడూ అనుకోలేదు. మధూ ఇప్పుడు చెప్పు. నా ప్రమేయం లేకుండా నేను పొందిన పరాభవాలకు, నేను శాశ్వతంగా ప్రేమించే అర్హతని కోల్పోయానా?"

రెండు చేతుల్లో మొహం దాచుకుని హిస్టీరిక్‌గా ఏడుస్తున్న అర్చనవైపు విచలితంగా చూసింది మాధవి. విస్మయంగా చూసింది. మాట్లాడకూడని మాటలు మాట్లాడుతున్న, చేయకూడని పనులు చేస్తున్న ఒక అరాచక శక్తిని చూస్తున్నట్టుగా చూసింది. ఆ చూపులో అర్చన చూపు కలిసి ఉంటే అక్కడికక్కడే పొడుచుకుని ప్రాణం విడిచేది. కానీ కన్నీళ్ళతో నిండిన ఆ కళ్ళకి ఏమీ కనిపించడం లేదు. ఒకే ఒక్కటి. అది తన ప్రేమ ప్రేమకి నోచుకోని మనసు. అదిప్పుడు దుఃఖంతో నిండిపోయి ఉంది.

మాధవి స్వరం కరుకుగా వినిపించింది.

"అందుక్కాదు అర్చనా నువ్వు ప్రేమించే అర్హత కోల్పోయింది. వేణులాంటి భర్తని పొందినందుకు నీకసలు జీవితంలో మరొకరిని కన్నెత్తి చూసే అర్హత లేదు. ప్రేమించే అధికారం అసలే లేదు. ఏ పరిస్థితుల్లో నిన్ను వేణు పెళ్ళి చేసుకున్నాడో కొంచెం వివేకంతో ఆలోచిస్తా అతనికి జీవితాంతం కృతజ్ఞతగా పడి ఉండాల్సినదానివి. నువ్వనుకున్నట్టు అతను నీమీద జాలితో నిన్ను పెళ్ళి చేసుకుని ఉండచ్చు. లేదా తన ప్రేమ గెలిపించుకోడానికి నీ నిస్సహాయతని వాడుకుని ఉండచ్చు. ఏది ఏమైనా అతను చేసింది నీకు మేలు. అందుకు నువ్వతనికి ఋణపడి ఉండాల్సిన దానివి. కానీ, ఏం చేశావ్? వేణు నువ్వేదో మానసికంగా దెబ్బతిన్నావని, అందుకే తనతో సఖ్యంగా లేవని, నిన్ను ఎలాగైనా అనురాగంతో తన దానిగా మార్చుకోవాలని ఎంతో సహనంతో ఎదురుచూశాడు. అలాంటి వాడికి నువ్వు జీవితకాలానికి సరిపడే మనస్తాపం అందిస్తావా? నువ్విలా ఎవరో, పేరూ, ఊరూ లేని వ్యక్తిని ప్రేమిస్తున్నావని వేణుకి తెలిస్తే అతని గుండె పగిలిపోతుంది. అదలా ఉంచినా అతను నిన్నెంత అసహ్యించుకుంటాడో ఊహించగలవా? అతనే అసహ్యించుకున్న రోజున నిన్ను ప్రేమించే వాళ్ళు ఈ భూమ్మీద ఉంటారా? నువ్వు పరితపిస్తున్న అతను నీ గతం తెలుసుకుంటే నిన్ను ప్రేమిస్తాడా? చెప్పు. అర్చనా నీ చుట్టూ సమాజం, కట్టుబాట్లు, ఉన్నాయి. అన్నిటికీ మించి ఒకరి భార్యగా, అతని పిల్లలకి తల్లిగా నీకు కొన్ని బాధ్యతలున్నాయి. నీ కుటుంబ గౌరవం నిలబెట్టాల్సిన కర్తవ్యం ఉంది. ఇన్నిటి మధ్య బందీవై జీవిస్తున్న నీకు నిజంగానే ప్రేమించే అర్హత లేదు. లేదు కాక లేదు. హిందూజాతిలో జన్మించిన నీకు స్త్రీగా కొన్ని సిద్ధాంతాలకు, సంప్రదాయాలకు కట్టుబడి ఉండాల్సిన ఆవశ్యకత అవసరం ఉంది. తెలిసిందా?"

అర్చన ఉక్రోషంగా చూసింది.

"హు సంప్రదాయం.. సంఘం కట్టుబాట్లు. వీటి మధ్య అనాదిగా స్త్రీ బంధించబడే ఉంటోంది. అందుకే ఇన్ని ఆత్మహత్యలు, ఈ బలిదానాలు వరకట్న చావులు, హత్యలు వీటి నుంచి స్త్రీకి విముక్తి లేదా? ఉండకూడదా? నీలాంటి సంప్రదాయవాదులంతా స్త్రీలను ఇలాంటి దిక్కుమాలిన నినాదాలతో బంధిస్తున్నారు. సంకెళ్ళు వేసి ఎక్కడికీ పోనీకుండా సంసారం అనే సంప్రదాయపు చెరసాలల్లో మానసికంగా ఉరితీస్తున్నారు. ఈ సంకెలలు శారీరకంగా మనిషిని కట్టేయగలవు కానీ, మనసుని కట్టేయగలవా? ఈ కట్టుబాట్లని దాటి వెళ్ళిపోవాలని, నేను కోరుకున్న జీవితంవైపు హాయిగా ఎగరాలని నా మనసు తహ, తహలాడుతోంది. జరిగిన సంఘటనలను ఎదుర్కొని, పోరాడి న్యాయం పొంది, నేను ఆశించినట్టుగా బాగా చదువుకుని, ఉన్నత స్థానంలో ఉండి, నాకు నచ్చిన వ్యక్తిని పెళ్ళిచేసుకుని సంతోషంగా, సుఖంగా బతికే అవకాశం నాకెందుకు దూరం కావాలి? ఏమీ జరక్కపోయినా, ఏదో జరిగిందని, తద్వారా నేనింక ఆనందకరమైన జీవితానికి పనికిరావని, నా పెద్దలు, ఈ సంఘం నిర్దేశించిన మార్గంలో నాకిష్టం లేకుండా నడిచి వెళ్ళిపోయి, ఈ వ్యక్తి లేకపోతే నా బతుకేమయేదో అనే అభద్రతా భావంతో ఆత్మవంచన చేసుకుంటూ బతకాల్సిన అవసరం ఏంటి?"

"ఆత్మ వంచన" మాధవి అదోరకంగా నవ్వింది.

"భారత దేశంలో నూటికి ఎనభైమంది స్త్రీలు ఈ ఆత్మవంచన తోటే బతుకుతున్నారు. ప్రతివాళ్ళూ నీలాగే ఆలోచిస్తే ఈ వివాహవ్యవస్థ ఇంత పటిష్టంగా ఉండేదా? భారతదేశ ఔన్నత్యాన్ని నిలబెట్టేది ఈ వివాహ వ్యవస్థ ఇంత పటిష్టంగా ఉండేదా? భారతదేశ ఔన్నత్యాన్ని నిలబెట్టేది ఈ వివాహ వ్యవస్థే. ఆ ఔన్నత్యాన్ని కాపాడడం స్త్రీలుగా మన కర్తవ్యం"

"దేశ ఔన్నత్యాన్ని నిలబెట్టడానికి నా ఆత్మాభిమానాన్ని, నా ఆశలను, నా కలలను, నేను పణంగా పెట్టాలా? ఈదేశ ప్రతిష్టను కాపాడడానికి స్త్రీలంతా తమ పవిత్రతని, పాతివ్రత్యాన్ని పణంగా పెట్టి, ఆత్మను చంపుకుని, ఒద్దికగా అందరికీ తలవంచి బతకాలి అవునా సారీ మిసెస్ మాధవీ. నాకంత సహనం, సమతాభావం, దేశభక్తి లేవు. నాకిష్టంలేని వ్యక్తికి ఈ శరీరాన్ని అప్పగించి, కళ్ళు మూసుకు పడుకునే శక్తి నాకు లేదు. నాకీ జీవితం వద్దు. నాకు ప్రేమించే అర్హత లేకున్నా, నేను ప్రేమించే పురుషుడు నాకు దక్కకున్నా ఫర్వాలేదు. కానీ, నేనీ ఆత్మవంచన చేసుకోలేను. నాకు స్వేచ్ఛ కావాలి. నాకు ఈ మానసిక వేదన నుంచి, ఈ నరకయాతన నుంచి విముక్తి కావాలి. అవును విముక్తి కావాలి. అందుకే నేను వెళ్ళిపోయాను."

"చాలా సంతోషం అర్చనా నీ సుఖం, నీ సంతోషం, నీ స్వేచ్ఛ నువ్వు చూసుకుని వెళ్ళిపోయావు. మరి నీ పేగు తెంచుకుని పుట్టినవాడి సంగతేంటి? రేపు వాడూ ఇలాగే అడుగుతాడు. నాకూ ఈ సమాజంలో గౌరవం కావాలి. ఒక స్థానం కావాలి. ప్రశ్నలే లేని జీవితం కావాలి అని. మరి నీ తల్లి ఏదీ అనే పెద్ద ప్రశ్నకి వాడిని ఏం సమాధానం చెప్పమంటావు?" సూటిగా చూస్తూ అడిగింది మాధవి.

అర్చన మాట్లాడలేదు. ఈ ప్రశ్నకి ఆమె దగ్గర ఇన్‌స్టెంట్‌గా సమాధానం లేదు. కానీ అంతరాంతరాల్లో ఖచ్చితమైన సమాధానం కోసం ఆమె నమ్మిన సిద్ధాంతం అన్వేషిస్తోంది. ఆ అన్వేషణ ఫలించేలోపే మాధవి అంది.

"నువ్వే కాదు. ఈ ప్రశ్నకి స్త్రీ స్వేచ్ఛ కోసం గొంతు చించుకుని అరిచిన ఆ చలం కూడా సమాధానం చెప్పలేదు. చెప్పలేడు కూడా. ఆయన తల్లి ఆయన్ని అలా వదిలేసి ఉంటే ఆయన నుంచి స్త్రీ స్వేచ్ఛాగానం వినిపించేది కాదు. ఏదైనా అనుభవంలోకి వస్తేనే తెలుస్తుంది అర్చనా. నీ సిద్ధాంతాలు, నీ ఆశయాలు అర్థరహితం అనీ, అందువలన నువ్వు కీర్తినీ, డబ్బునీ సంపాదించుకోగలవు కానీ, ప్రేమానురాగాలతో ముడిపడిన కుటుంబ జీవితాన్ని మాత్రం సంపాదించుకోలేవని నేను బల్లగుద్ది చెప్పగలను."

"అదే ఈ కుటుంబ జీవితం అంటూ కుటుంబం చుట్టూ గిరిగీసి బతకమనే కదా స్త్రీలను నిర్బంధించారింతకాలం ఈ సంప్రదాయవాదులు. అయినా మధూ పట్టుమని పాతికేళ్ళు లేని నీలో సంప్రదాయాల పట్ల ఇంత గౌరవం, నమ్మకం ఎలా వచ్చాయి?"

మాధవి నవ్వింది. ఆ నవ్వులో అర్చనకి చాలా అర్థాలు కనిపించాయి. చాలా వెటకారమూ ధ్వనించింది. ఆ నవ్వుకి అర్థం ఏంటి అడగడానికి కొంచెం జంకూ కలిగింది.

మాధవి అదే నవ్వుతో అంది. "నువ్వు ఈ భావాలతో ఈ జీవితాన్ని గెలవగలననుకుంటున్నావా?"

"గెలుస్తానో లేదో చెప్పలేను కానీ, ఓడిపోను. ఎందుకంటే నేను ఎక్కిన మొదటి మెట్టు నన్ను విజయం వైపుకి నడిపిస్తుందో లేదో తెలియదు. కాకపోతే ఓటమిని మాత్రం దగ్గరకి రానివ్వను. అందుకోసం ఎంతైనా పోరాడతాను"

"ఓ.కె గుడ్ లక్."

మాధవి లేచింది. అర్చన మాధవి చేయి పట్టుకుని అవుతూ అంది. మాధవీ నేను కలిసినట్టు దయచేసి ఎవరికీ చెప్పనని మాటివ్వు ప్లీజ్.."

మాధవి ఒక్కసారి అర్చన వైపు సూటిగా చూసింది. "చెప్పినందువలన ఏదన్నా ప్రయోజనం ఉందంటావా?"

అర్చన మాట్లాడలేదు.

"కాబట్టి చెప్పను. సరేనా? బై."

అర్చన చేయి విడిపించుకోబోతుంటే ఆమె చేయి వణకడం స్పష్టంగా కనిపించింది. ఆశ్చర్యంగా అర్చన మొహంలోకి చూసింది. రెండు కళ్ళూ నీటితో నిండాయి. వణుకుతున్న పెదాలతో అంది. "ఎప్పుడన్నా గుంటూరు వస్తావా? నాకు అక్కడే పోస్టింగ్ ఇచ్చారు."

"దేనికి?"

"కనీసం నాకు ఒక్కళ్ళన్నా ఆత్మీయులు ఉన్నారన్న తృప్తి నాకు మిగల్చడానికి."

"అదేంటి బొత్తిగా సెంటిమెంటల్‌గా మాట్లాడుతున్నావు. నీలాంటి బోల్డ్ డైనమిక్ లేడీకి సెంటిమెంట్స్‌తో పనుందా?"

"సెంటిమెంట్స్ అనుబంధాలను, బంధాలను పెంచేవి. నాకూ స్నేహం కావాలి. ఆ స్నేహం నీ నుంచి నేనాశిస్తున్నాను."

మాధవి ఇంకేదో అనబోయి ఆగిపోయింది. ఇప్పటికే చాలా కఠినంగా మాట్లాడింది. ఇంక ఆమెని బాధపెట్టడం వలన లాభం ఏంటి? అనిపించింది. తల పంకించి గుమ్మం వైపు నడిచింది.

"మధూ" అర్చన గట్టిగా మాధవిని వాటేసుకుంది.

"అర్చనా నీకు తెలియని మనసు నీలో ఒకటుంది. అదేంటో అన్వేషించి, దానికేం కావాలో ఆలోచించి నాకు చెప్పు. బహుశా అప్పుడీ కన్నీళ్ళకి చోటు ఉండకపోవచ్చు నీ జీవితంలో" అంటూనే అర్చనని వదిలించుకుని, వచ్చే కన్నీళ్ళు ఆపుకుంటూ గబ, గబా బైటికి నడిచింది మాధవి.

●●●

**మాధవి వెళ్ళిపోయాక అర్చనకి ఒక్కసారిగా** భవిష్యత్తు శూన్యంగా కనిపించింది. నరనరంలో నిస్సత్తువ ఆవహించి నిలువునా కూలిపోయింది. మాధవి మాటలు చెవుల్లో హోరెత్తిపోతున్నాయి. 'నువ్వు ప్రేమించడానికి వీల్లేదు. నీకా అర్హత లేదు' అంటూ మాధవి గొంతెత్తి గట్టిగా అరుస్తున్నట్టు అనిపిస్తోంది. 'నీ కొడుకు జీవితం ప్రశ్నార్థకం చేస్తావా? ' అని నిలదీస్తోంది. అర్చన కళ్ళముందు పెళ్ళలు, పెళ్ళలుగా తను పేర్చుకుంటున్న భావిసౌధాలు కూలిపోతున్నాయి. ఒక్క మాధవి వేయి మాధవిలుగా మారి తనని 'వేణు దగ్గరకు వెళ్ళిపో! నీకు అది తప్ప వేరే జీవితం లేదు. నీ కొడుకుని చేరదీయి. ఓ తల్లిగా, ఓ భార్యగా, ఓ కోడలిగా ఉత్తమురాలిగా బతుకు. అందులోనే నీ జీవితానికి పరిపూర్ణత సిద్ధిస్తుంది. నీ జన్మ చరితార్థం అవుతుంది. వెళ్ళు... వెళ్ళు నీకే చెప్పేది వెళ్ళు.' పదే పదే హోరెత్తిస్తోంది.

'నో!!! ' అర్చన రెండు చేతుల్తో చెవులు మూసుకుని కింద కూలబడిపోయి వెక్కి, వెక్కి ఏడవసాగింది.

అప్పుడే తలుపు తోసుకుని లోపలికి వచ్చిన నీలిమ అర్చనని ఆ స్థితిలో చూసి స్థాణువైంది.

గబగబా అర్చన దగ్గరకి నడిచి మోకాళ్ళమీద కూర్చుని గాభరాగా పిలిచింది. "అర్చనా... అర్చనా.. అర్చనా నిన్నే ఏమైంది?"

అర్చన గబుక్కున నీలిమని కావలించేసుకుంది. "నాకు చచ్చిపోవాలనిపిస్తోంది నీలూ.. నాకు చచ్చిపోవాలనిపిస్తోంది."

మంచం అంచున కూర్చోబెట్టింది. వెంట్రుకలు సవరిస్తూ మృదువుగా అంది. "ఎవరా అమ్మాయి? ఎందుకంత హడావిడిగా వచ్చావసలు?"

అర్చన సమాధానం చెప్పలేదు. ఏడుస్తూనే ఉంది. నీలిమకి జాలేసింది. ఎంతైనా తన స్నేహితురాలు. చిన్నప్పటి నుంచి కలిసి, మెలిసి తిరిగారు. చేతివేళ్ళలాగే ఈ సమాజంలో మనుషులు కూడా అందరూ ఒక్కలాగే ఉండరు. అలాగే మనస్తత్వాలు. అందరి మనస్తత్వాలు ఒక్కలాగే ఉంటే ఈ ప్రపంచం ఇలా ఎందుకుంటుంది? అర్చనకి ఏవో ఆలోచనలు, తనవి అనే స్వతంత్ర భావాలు ఉన్నాయి. వాటిని కాదని, తన భావాలను నియంత్రించి నువ్విలాగే ఉండాలి అనే హక్కు ఎవరికుంది? ఈ ప్రజాస్వామ్య దేశంలో ఎవరికిష్టమైనట్టు వాళ్ళు బతికే హక్కు ప్రతి వ్యక్తికీ ఉందికదా.. మరి ఈ విషయంలో స్త్రీలను ఎందుకు మినహాయిస్తారు. స్త్రీ ఏం చేసినా తప్పుగా, మహాపాపంగా ఎందుకు పరిగణిస్తారు? ప్రజలంటే కేవలం పురుషులే కాదుకదా. అర్చన చేసిన తప్పేంటి? ఆమె వెనకాలే వచ్చిన అమ్మాయి ఎవరు? వీళ్ళిద్దరి మధ్యా ఏం జరిగింది? అర్చన ఎందుకింతగా డిస్టర్బ్ అయింది?

ఒక్కసారిగా అనేక ప్రశ్నలు నీలిమని ఉక్కిరి, బిక్కిరి చేస్తుంటే మెల్లిగా అడిగింది.

"ఏం జరిగింది అర్చనా? ఎందుకేడుస్తున్నావు? ఉదయం నుంచి బాగున్నావు కదా. "

అర్చన మాట్లాడలేక పోయింది. ఏదో చెప్పాలని ప్రయత్నించి, ఏడుపు అడ్డం పడడంతో తిరిగి వెక్కిళ్ళు పెట్టసాగింది.

నీలిమ అర్చన భుజం చుట్టూ చేయి వేసి తన గుండెల దగ్గరగా ఆమెని పొదుపుకుని మృదువుగా అడిగింది.

"చెప్పవా? "

అర్చన కన్నీళ్ళతో తలెత్తి చూసింది. ఎర్రటి కళ్ళల్లో నీళ్ళతో చూస్తున్న అర్చనని చూడగానే కడుపు తరుక్కుపోయింది. నెమ్మదిగా అంది. "నాకు తెలుసు నువ్వు చెప్పలేకపోతున్నావు.. అవునా?"

అవునన్నట్టు తలూపింది అర్చన.

"అర్చనా. నీకూ? ఆ అమ్మాయికీ మధ్య ఏం జరిగిందో నాకు తెలియదు కానీ, నీ సున్నితమైన మనసుకి గట్టి దెబ్బ తగిలిందని మాత్రం అర్థం చేసుకోగలుగుతున్నాను. ఏం జరిగినా నువ్వింత బేలవై ఇలా ఏడవడం మాత్రం బాగాలేదు. ఈ పవిత్రక్షేత్రానికి వచ్చింది ఏడవడానికా? చూడు నీకు భగవంతుడు ప్రసాదించిన అద్భుతమైన భవిష్యత్తుని అరచేతిలో పట్టుకుని ఆయన దీవెనలు కోసం వచ్చావు అవునా.. ఇంకెందుకు ఏడుపు? గతం మర్చిపో. నీకు నచ్చిన దారిలో నువ్వు ఏర్పరచుకున్న రహదారిలో మహారాణిలా నడిచిపో. ఎవరి మాటలు వినకు. ఎవరినీ లక్ష్యపెట్టకు.. జరిగిందేదో జరిగింది. మంచో, చెడో ఒక నిర్ణయానికి వచ్చావు. దాని ఫలితం ఏదైనా ఆ నిర్ణయానికే కట్టుబడి ముందుకు సాగిపో. విజయం వరిస్తుందా? ఈ ప్రపంచం నీకు దాసోహం అవుతుంది. ఓడిపోయావా? ఈ జీవితమే దానికి పరిష్కారం చూపిస్తుంది.. సరేనా? లే.. లేచి మొహం కడుక్కో! ఇక్కడ ఆ దేవుడికి తప్ప ఇంకెవరికీ ఎలాంటి ఎక్స్‌ప్లనేషన్ నువ్వు ఇవ్వాల్సిన అవసరం లేదు."

నీలిమ మాటలు పగిలిన హృదయం మీద నవనీతం రాస్తున్నట్టు చల్లగా, హాయిగా వినిపిస్తున్నాయి.

కన్నీళ్ళతో నిస్సహాయంగా చూసింది.

"నేను నిజం చెపుతున్నాను. నువ్వెవరికీ భయపడాల్సిన అవసరం లేదు. నీ జీవితం నీ ఇష్టం. నీకొచ్చిన అపూర్వమైన అవకాశాన్ని ఎట్టి పరిస్థితుల్లో ఒదులుకోకు. అర్థమైందా? లేచి మొహం కడుక్కో పద లే" ఆమె భుజం పట్టి బలవంతంగా లేపబోయిన నీలిమని ఆపుతూ అంది. "నే.. నేను లేస్తాలే" అంటూ నెమ్మదిగా చేతిమీద లేచింది.

"అవును.. నేను ఆ భగవంతుడికి మాత్రమే సమాధానం చెప్పాలి. ఇంకెవరికీ కాదు. నాకు తెలుసు నేనేంటో" సణుగుతున్నట్టుగా అంటూ అరచేత్తో కళ్ళు తుడుచుకుంటూ లేచింది. బాత్ రూములోకి వెళ్ళి చల్లటి నీళ్ళతో మొహం కడుక్కుని వచ్చింది.

"కాస్సేపు రిలాక్స్ అయి, చీర మార్చుకో. నేను మళ్ళీ ఓ గంటలో వస్తాను. వెళ్ళి బ్రేక్‌ఫాస్ట్ చేద్దాం" సరేనా నీలిమ ఆప్యాయంగా అంది.

బుద్ధిగా తలూపింది అర్చన.

ఏడ్చి, ఏడ్చి ఎర్రబడి, వాచిన కనుదోయితో చిత్రమైన అందంతో మెరిసిపోతున్న అర్చనని చూస్తూ

'ఆడదానికి ఇంత అందం కూడా శత్రువే. ఈ అందంతో భవిష్యత్తులో ఇంకెన్ని సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందో ఈ పిల్ల!?' అనుకుంటూ సన్నగా నిట్టూర్చి అక్కడినుంచి వెళ్ళిపోయింది నీలిమ.

అర్చన చీర మార్చుకుని డ్రెస్ వేసుకుంది. జుట్టుకున్న క్లిప్ తీసి జుట్టు వదిలేసింది. తలుపు గడియవేసుకుని మంచం మీద వాలింది.

ఆమె మనసు ఎంత మళ్ళించాలనుకున్నా మాధవి మాటల చుట్టూనే తిరుగుతోంది. 'నీకు ప్రేమించే అర్హత లేదే. ' మాధవి మాట ఆమె గుండె మీద చెళ్ళు, ఛెళ్ళున కొడుతున్నట్టు వినిపిస్తోంది. ఎందుకులేదు? నా కెందుకు ప్రేమించే అర్హత లేదు? ఆ ప్రశ్న పదే, పదే వేధిస్తోంది. పెళ్ళి అయిందని ప్రేమించే అర్హత కోల్పోయిందా లేక నాగరాజు కిడ్నాప్ చేయబడిన ప్రేమించే అర్హత కోల్పోయిందా? ఈ రెండిటికీ తాను బాధ్యురాలు కాదే. అలాంటప్పుడు తన భావస్వాతంత్ర్యం ఎందుకు కోల్పోవాలి? ఎవరు చేసిన శాసనం ఇది? అయినా తనేం ఇప్పుడు అతనెవరో వెతుక్కుంటూ వెళ్ళి, 'నన్ను ప్రేమించవయ్యా మహానుభావా, నన్ను పెళ్ళాడి ఉద్ధరించు' అని అడగబోడంలేదే తనది మూగప్రేమ దీనివలన ఎవరు ఏం కోల్పోతున్నారు? ప్రేమించడం అంటే దానికి పరాకాష్ట పెళ్ళేనా? ప్రేమ మనసులో శాశ్వతంగా అలా పవిత్రంగా ఉండకూడదా? ప్రేమ ఉన్నచోటు శారీరక సంబంధం ఉండాలా? అందుకు పెళ్ళి చేసుకోవాలా? తనేం అతనితో మానసికంగా కానీ, శారీరకంగా కానీ, కామకేళిలో తేలిపోడంలేదే! అతనే లోకం అనుకుని పిచ్చిదై పనీ, పాటా లేకుండా తిరగడం లేదే, మనసులో అతడిని పెట్టుకుని మరో వ్యక్తిని భర్తగా అంగీకరించలేనంటోంది. అందుకు అందరూ సంతోషించాల్సిందిపోయి తనని ఎందుకిలా విమర్శల తూటాలతో తూట్లు పొడుస్తున్నారు.

"ఓ అపరిచితుడా నువ్వు నాకెందుకు కనిపించావు? కనిపించినవాడివి ఎందుకలా నన్ను ఆకర్షించావు. ఎందుకు నా మనసు దోచుకున్నావు. నేనివాళ ఎవరికీ ఏమీ కాకుండా మిగిలిపోయానంటే కారణం నువ్వు కూడా కదా! అయినా నా మీద నీకు ఏదో ఒక భావన కలిగి ఉండచ్చుకదా. అదేంటో ఎందుకు చెప్పలేకపోయావు. నేనంటే ఆడపిల్లను. ఎంత డైనమిక్ అయినా సహజంగా ఉండే సిగ్గు, బిడియం అనేవి నాకూ ఉంటాయి కదా. అంచేత నేను నిన్ను పలకరించలేకపోయాను. మరి నువ్వెందుకు పలకరించలేదు. కనీసం ఒక్కరోజు, ఒకే ఒక్కరోజుని సబార్డినేట్‌గా నేను కనిపించినప్పుడైనా నేనెవరో, నా పేరేంటో అడగాలనిపించలేదా? చాలా దుర్మార్గుడివి .. చాలా దుర్మార్గుడివి.."

అర్చనకి తెరలు, తెరలుగా దుఃఖం వచ్చింది. అలాగే ఏడుస్తూ కాస్సేపట్లో నిద్రలోకి ఒరిగిపోయింది.

●●●

హైదరాబాదు వచ్చాక చక్రవర్తితో తనకీ, అర్చనకీ జరిగిన సంభాషణ మొత్తం పూసగుచ్చినట్టు చెప్పింది మాధవి.

అంతా విన్న చక్రవర్తి ఆశ్చర్యంగా అన్నాడు.. "అయితే ఆ అమ్మాయిలో తానలా వెళ్ళిపోయినందుకు పశ్చాత్తాపం లేదా?"

"దాని తలకాయ ఉంది. పైగా గట్టిగా, ఖచ్చితంగా సమర్ధించుకుంటోంది. అయినా నాకు అసలు అర్థం కాలేదు. ఎవరో కల్లో కనిపించాడు. అతనే చాలాసార్లు బైట కూడా కనిపించాడు. అతనెవరో తెలియదు. పేరు తెలియదు. ఊరు తెలియదు అతన్ని ప్రేమిస్తున్నాను. అంటుందేంటి? అసలు ఎక్కడన్నా అలా జరుగుతుందా? పిచ్చిదా? మంచిదా?" అయోమయంగా అంది మాధవి..

చక్రవర్తి తల విదిలిస్తూ అన్నాడు "నీకన్నా ఎక్కువ కన్‌ఫ్యూజన్‌గా ఉంది."

"కన్‌ఫ్యూజన్ లేదు. ఏం లేదు. నాకిప్పుడు ఒకటి మాత్రం ఖచ్చితంగా అర్ధమైంది. ఇంక జీవితంలో అర్చనా, వేణూ కలవరు. వేణు వేరే పెళ్ళి చేసుకున్నా అర్చన ఎలాంటి అభ్యంతరాలు పెట్టదు. కాబట్టి వెంటనే వేణుకి నేను మంచి అమ్మాయిని చూసి పెళ్ళిచేస్తాను."

"మరి బాబు?"

"బాబు కోసమే. వాడికి తల్లికావాలి. వేణుకి భార్య కాదు."

"వచ్చే అమ్మాయి వాడిని తల్లిలా చూడాలిగా మధూ"

"చూడక ఏం చేస్తుంది? అలా చూసే అమ్మాయినే వెతుకుతాను."

"ఏమో అసలే ఈ కాలం అమ్మాయికి హిరణ్యాక్ష వరాలు.. అలాంటి అమ్మాయి దొరుకుతుందా?"

"దొరక్కపోతే రిత్విక్‌ని నేను పెంచుకుంటాను. వేణుకి వేరే అమ్మాయినిచ్చి పెళ్ళి చేస్తాను."

చక్రవర్తి విభ్రాంతిగా చూశాడు. "నువ్వా? నువ్వు పెంచుకుంటావా?"

"ఏం? వద్దా? "

"ఛ. అదికాదు.. కానీ, నీకు మళ్ళీ పిల్లలు పుడితే..?"

"పుట్టనివ్వండి. నాకు పిల్లలంటే ఇష్టం ఎంత మందినైనా పెంచేయగలను."

"కొంపతీసి ఇల్లంతా పిల్లల్తో నింపేస్తావా?" భయం నటించాడు చక్రవర్తి.

అతని మొహంలో భావాలు చూసి అప్పటిదాకా చిటపటలాడుతున్న మాధవి ఫక్కున నవ్వేసింది.

"వామ్మయ్య నవ్వావా తల్లి.! అర్చన మీద కోపంతో నాకివాళ తిండీ నీళ్ళు లేకుండా మాడుస్తావనుకున్నా.."

"కౌశిక్‌ని లేపి స్నానం చేయించండి. నేనీలోగా బ్రేక్ ఫాస్ట్ రెడీ చేస్తాను."

"అవునూ.. నాకో డౌటు?" అన్నాడు చక్రవర్తి.

"ఏంటో అది.?"

"అర్చన కూల్‌గ జాబ్ చేసుకునేది కదా సడన్‌గా ఎందుకు మానేసిందట? చెప్పిందా?"

"లేదే నేనేం అడగలేదు. అవునెందుకు మానేసింది?" కూర్చున్న చోటునుంచి లేచి కిచెన్ వైపు వెళ్ళబోతున్నదల్లా ఆగిపోయి సందేహంగా చూసింది.

"బాగుంది. నా ప్రశ్న నాకే వేస్తావేం? మీ ఆఫీసులో ఎవరూ నిన్ను అడగలేదా? "

"నన్నెందుకు అడుగుతారు?"

"మీరిద్దరూ క్లోజ్ ఫ్రెండ్స్ కదా."

"కావచ్చు. ఆ సంగతి ఎవరికీ తెలియదు. పైగా అర్చన చేరిన కొద్దిరోజులకే నేను డెలివరీకి వెళ్ళాను కదా"

"నాకు ఒక సంగతి తెలిసింది ఆ మధ్య"

"ఏంటిది?"

"మీ ఎం.డి స్టేట్స్ వెళ్ళిపోయాడని అతని ప్లేస్‌లో వేరే ఒకతను వచ్చాడని, అతను జాయిన్ అయిన మరునాటినుంచీ అర్చన ఉద్యోగం మానేసి వెళ్ళిపోయిందని."

మాధవి చివ్వున చూసింది చక్రవర్తివైపు "ఎవరు చెప్పారు? ఎప్పుడు చెప్పారు?" ఆత్రుతగా అడిగింది.

"నా కొలీగ్ ఒకతను చెప్పాడు. అతని కజిన్ కూడా అదే ఆఫీసులో పనిచేస్తున్నాడు. అంతా అనుకున్నారట ఆవిడకీ, అతనికీ ఏదో సంబంధం ఉందని అనుమానంగా ఉందని. ఎందుకంటే ఆమె వెళ్ళిపోయాక అతను రెండు, మూడుసార్లు స్టాఫ్‌లో ఎవరో ఒకళ్ళిద్దరిని అర్చన గురించి వాకబు చేశాట్ట కూడా."

"మరి ఈ విషయం నాకింతకాలం ఎందుకు చెప్పలేదు?" ఉద్వేగంగా అక్కడినుంచి వేగంగా కదులూ అంది మాధవి. "నేనివాళ ఆఫీసుకి వెళ్తున్నాను. అవసరం అయితే మరి కొంతకాలం జాబ్ చేస్తాను. అర్చన వెళ్ళిపోవడం వెనక మిస్టరీ ఛేదిస్తాను. అతనే అర్చన చెప్పిన వ్యక్తి. అయితే అతన్నోసారి కలుస్తాను.."

"దేనికి? కలిసి ఏం చేస్తావు? కొంపదీసి వాళ్ళిద్దరికీ పెళ్ళి చేస్తావా?"

"చెప్తా.. వెళ్ళొచ్చాక చెప్తా.." అంటూ కిచెన్ లోకి వెళ్ళిపోయింది మాధవి.

చక్రవర్తి భుజాలెగరేసి, కౌశిక్‌ని లేపడానికి బెడ్ రూములోకి వెళ్ళాడు.

అమాయకంగా, ముద్దుగా నిద్రపోతున్న కౌశిక్‌ని చూస్తుంటే చక్రవర్తికి లేపాలనిపించలేదు. చిట్టి తండ్రి అంత తొందరగా నిద్రలేచి ఏం చేయాల్లే అనుకున్నాడు. వాడి ముద్దు మొహం అలాగే తదేకంగా తనూ కౌశిక్ పక్కన పడుకున్నాడు. అతని ఆలోచనలు అర్చన మీదికి వెళ్ళాయి. మగవాడినైన నాకే నా రక్తం పంచుకు పుట్టిన కొడుకు మీద ఇంత ప్రేమా, ఆప్యాయత ఉంటే ఆడదై ఉండీ, ఓ తల్లి అయి ఉండీ అర్చన వాడినెలా వదిలేసి వెళ్ళగలిగింది? ప్రేమించి, మనస్ఫూర్తిగా కాపురం చేసిన భర్తద్వారా కలిగిన పిల్లల మీదే ఉంటుందా ఆడవాళ్ళకి మమకారం. వేణు అంటే ఇష్టం లేదు కాబట్టి వేణుద్వారా కలిగిన సంతానం మిద కూడా ఆమెకి ద్వేషం ఉండి ఉండచ్చా అందుకేనా వదిలేసింది. ఏమోలే ఇంకా నయం ఏ చెత్తకుప్పలో వదిలేయలేదు. వేణు తల్లి, తండ్రుల దగ్గర వదిలేసిందంటే చాలా ప్లాన్డ్‌గా ఉందనమాట. ఇంత ప్లాన్డ్‌గా ఉన్న అమ్మాయి చివరి గమ్యం ఎక్కడో, ఏమిటో..

"కౌశిక్ లేచాడా? వాడిని రెడీ చేయండి. ముగ్గురం ఒకసారే వెళ్ళాలి. వాడిని క్రచ్‌లో దింపేస్తాను." కిచెన్‌లోంచి అరిచింది మాధవి.

"ఏ క్రచ్‌లో? " అయోమయంగా అనుకున్నాడు. మృదువుగా కౌశిక్ చెంపమీద తాకుతూ కౌశిక్. "బంగారూ..! " అంటూ పిలిచాడూ. వాడూ మత్తుగా కదిలాడు. "చిట్టినాన్నా లే.. నాన్నా.. మనం ఆచ్చి వెళ్ళాలి. "

వాడు లేవలేదు. పక్కకి ఒత్తిగిల్లి మరీ పడుకున్నాడు.

అప్పుడే గదిలోకి వచ్చిన మాధవి అక్కడ జరుగుతున్న వింత చూస్తూ "బాగుంది. ఇలా అయితే వాడు సాయంత్రందాకా లేవడు. జరగండి తమరు" అంటూ కౌశిక్‌ని నిద్రలోనే ఎత్తుకుని "బంగారు తండ్రీ లేచేయ్. మనం ఇవాళ స్కూలుకి వెళదాం. అక్కడ నీకు బోలెడన్ని ఆటలుంటాయిరా. ఇంకా ఆంటీలుంటారు. అక్కలుంటారు. లేనాన్నా.. నా బంగారు కదూ.! " అంటూ బాత్రూములోకి తీసుకెళ్ళిపోయింది.

మాధవి అలా నిర్దాక్షిణ్యంగా వాడిని లేపుతోంటే ఒళ్ళు మండిపోయినా ఏమీ అనలేక తానూ రెడీ అవడానికి బయల్దేరాడు చక్రవర్తి.

కాసేపట్లోనే ముగ్గురూ బైటకి వెళ్ళిపోయారు.

ఆఫీసుకి దగ్గరగా ఉన్న క్రచ్‌లో కౌశిక్‌ని వదిలింది. మాధవికి పరిచయం ఉన్న సుధారాణి ఆ క్రచ్ నిర్వహిస్తోంది. ఆమె వచ్చి చేయి చాపగానే ముందు బిక్కమొహం పెట్టాడు కౌశిక్. మళ్ళీ మాధవి వాడిని తీసుకుని లోపలికెళ్ళి బొమ్మలన్నీ చూపించేటప్పటికి కాసేపట్లోనే సుధారాణితో కబుర్లు చెప్పడం మొదలు పెట్టాడు.

ఏడ్చి మారాం చేస్తే ఫోన్ చేయమని చెప్పి తన ఫోన్ నెంబర్ సుధారాణికిచ్చి మాధవి ఆటోని ఆఫీస్ వైపు పొమ్మని చెప్పింది.

ఆఫీసు దగ్గర ఆటో ఆగగనే ఒళ్ళంతా జలదరించినట్టు అనిపించింది. ఆటో దిగి మీటర్ చూసి డబ్బులిచ్చేసింది.

చాలాకాలం తరవాత ఆఫీసు ప్రాంగణంలో అడుగుపెడుతుంటే సన్నగా శరీరం కంపించినట్టు అయింది. అరచేతుల్లో చెమట పట్టింది. తనను తాను నిగ్రహించుకుంటూ తల వంచుకుని ఆఫీసు వైపు నడిచింది. చాలా కార్లు పార్క్ చేసి ఉన్నాయి. స్కూటర్లు, మోటార్ సైకిల్స్ అయితే లెక్కలేదు. ఎనిమిది అంతస్తుల ఆ కాంప్లెక్స్‌లో మాధవి ఆఫీసు మూడో అంతస్తులో ఉంది. లిఫ్ట్ దగ్గరకు నడిచి ఎదురు చూస్తూ నిలబడింది.

రెండు నిమిషాల్లో లిఫ్ట్ గ్రౌండ్ ఫ్లోర్‌లో వచ్చి ఆగింది. తెరుచుకున్న లిఫ్ట్ డోర్ లోంచి బైటకు వస్తున్నాడు శ్రీధర్.

"మాధవీ" మాధవి ముందు ఆగి సందేహంగా పిలిచాడు. లిఫ్టులోకి వెళ్ళబోతున్న మాధవి ఆగిపోయింది.

"హాయ్ శ్రీధర్.." పలకరింపుగా నవ్వింది అతణ్ణి చూసి.

"మీరేనా అని డౌటుగా పిలిచాను. మీరే అనమాట" నవ్వాడు శ్రీధర్.

"నేనే.. మీరింకా ఇక్కడే చేస్తున్నారా? ఈ పాటికి యు.ఎస్ వెళ్ళిపోయుంటారనుకున్నానే.."

"ఓ చాలా ఎక్స్‌పెక్టేషన్స్ ఉన్నాయన్నమాట మీకు నా గురించి లేదండి. నాకిక్కడ మంచి పోస్ట్ ఇచ్చి కంఫర్టబుల్ శాలరీ ఇస్తున్నారు. మా మిసెస్‌కి హైదరాబాదు వదిలి వెళ్ళడం అసలిష్టం లేదు. ఇంతకీ మీరు మళ్ళీ జాయిన్ అవడానికి వచ్చారా?"

"నా పోస్ట్ వేకెంట్‌గా ఉందా ఏంటి ఇంకా?" నవ్వుతూ అడిగింది.

"మీరొస్తానంటే కొత్త పోస్ట్ క్రియేట్ చేద్దాం.."

"థాంక్యూ" అంటూ లిఫ్ట్ వైపు చూసి అంది. "అరే లిఫ్ట్ వెళ్ళిపోయిందే"

"పోతే పోయిందిలెండి. మళ్ళీ వస్తుంది. రండి కాఫీ తాగుదాం. కింద కాఫీడే ఉంది." ఆహ్వానించాడు శ్రీధర్. మాధవికి అదే మంచి అవకాశం అనిపించింది. శ్రీధర్ మంచి యువకుడు. తెలివైనవాడు. ఎం.బి.ఏ.లో రెండు కోర్సులు, ఇంకా ఏవో చాలా చదువుకున్నాడు. ముఖ్యంగా మాధవికి ఆమె అక్కడ పనిచేసిన రోజుల్లో ఏవో సలహాలిస్తూ, సాయం చేస్తూ చాలా క్లోజ్‌గా ఉండేవాడు. ఇతనికి అర్చన కూడా బాగా తెలుసు. ఇతని ద్వారా కొన్ని విషయాలైనా తెలుస్తాయి కదా అనిపించింది.

"రండి.." అంటూ ముందుకు నడిచింది.

"మీ బాబా, పాపా ఎలా ఉన్నారు? " అడిగాడు శ్రీధర్ ఆమెని అనుసరిస్తూ.

"బాబే.. బాగున్నాడు. మీరు చూడలేదుకదా"

"మీరు చూపించలేదు కదా"

"అవును నాదే తప్పు సారీ" నవ్వింది.

"ఇట్స్ ఓకే. చక్రవర్తిగారు బాగున్నారా?"

"బ్రహ్మాండంగా ఉన్నారు."

ఇద్దరూ కాఫీడే దగ్గరకి వచ్చారు.

"ఏం కాఫీ తాగుతారు?"

"నాకే పేర్లేం తెలియదు. తెలిసినా ఏం ఒద్దు. హాయిగా మన ఇండియన్ కాఫీ విత్ మిల్క్, షుగర్ కావాలి." అంది.

"ఓకే. " అంటూ రెండు కాఫీ ఆర్డర్ చేసి "రండి" అంటూ అక్కడే ఉన్న కుర్చీలో కూర్చున్నాడు. మాధవి కూడా అతని ఎదురుగా మరో కుర్చీలో కూర్చుంది. ఆ కాంప్లెక్స్‌లో చాలా ఆఫీసులున్నాయేమో, చాలా మంది కాఫీ కోసం వచ్చి టేబిల్స్ దగ్గర కబుర్లు చెప్పుకుంటున్నారు. తక్కువ వాల్యూంలో ఏదో కొత్త హిందీ సినిమా పాట వినిపిస్తోంది. మాధవి ఆ వాతావరణం గమనిస్తుండగానే బాయ్ కాఫీ తెచ్చిచ్చాడు.

"పరిమళం మాత్రం అద్భుతంగా ఉంది. టేస్ట్ ఎలా ఉంటుందో "కప్పు చేతిలోకి తీసుకుంటూ అంది.

"తాగి చూడండి" తానూ కప్పు అందుకుని సిప్ చేశాడు.

"ఆఫీసు విశేషాలేంటి?" అడిగింది మాధవి.

"ఏం ఉంటాయండి? ఏవో ప్రాజెక్ట్స్ తెచ్చుకోడం, పూర్తిచేయడం.. ఇంతకీ మీరు వచ్చిన కారణం చెప్పలేదు."

"ఏం లేదు జస్ట్ అందర్నీ కలుద్దామని. అవునూ మనకి ఎవరో కొత్త ఎం.డి వచ్చారుట?"

"ఎవరూ? మీరు వెళ్ళాక ఇద్దరు ఎం.డి.లు మారారు" అన్నాడు ఎవరో అని ఆలోచిస్తూ.

"అలాగా!" ఏమని అడగాలో అర్థం కాలేదు మాధవికి. మౌనంగా కాఫీ సిప్ చేస్తూ ఉండిపోయింది.

"మాధవిగారూ మీ ఫ్రెండ్ ఎక్కడున్నారు? అదే అర్చనగారు" అడిగాడు శ్రీధర్.

మాధవి చేతిలో కప్పు వణికి కాఫీ తొణికి చేయిమీద పడింది. కప్పు టేబుల్ మీద పెట్టింది.

"అరెరె. అక్కడ వాష్ బేసిన్ ఉంది. వాష్ చేసుకోండి" అన్నాడు.

అతను చూపించిన వైపు చూసి బ్యాగు టేబుల్ మీద పెట్టి వాష్ బేసిన్ దగ్గరకు వెళ్ళి చేయి కడుక్కుంది. ఏమని చెప్పాలి? అర్థం కాలేదు. అర్చన ఎక్కడికెళ్ళిందంటే ఏమని చెప్పాలి? కొన్ని క్షణాలు అక్కడే గడిపి కర్చీఫ్‌తో తుడుచుకుంటూ టేబుల్ దగ్గరకు వచ్చింది.

కాఫీ కప్పు చేతిలోకి తీసుకోబోతుండగా అన్నాడు.

"ఇవ్వాళే పేపర్లో చదివాను. రీసెంట్‌గా గ్రూప్ ఒన్ క్యాండిడేట్స్‌కి పోస్టింగ్స్ ఇచ్చారుట. విజయవాడ ఆర్.డి.ఓగా ఎవరో అర్చన అనే లేడీ జాయిన్ అయారని నాకెందుకో ఆమే గుర్తొచ్చారు."

మాధవి చటుక్కున అనేసింది. "అర్చన జాయిన్ అయిందా?"

"ఓ అంటే ఆమేనా? నా గెస్ కరెక్ట్ అనమాట. కానీ,"

మాధవి కొన్ని క్షణాలు నిశ్శబ్దంగా ఉంది ఉంది. "శ్రీధర్.. ఈ విషయాలు మాట్లడటానికి వచ్చాను. నాకొన్ని వివరాలు కావాలి చెప్పగలరా? మీరు బిజీగా ఉన్నారా? నాకు కొంచెం టైం ఇవ్వగలరా?"

శ్రీధర్ అన్నాడు "ఆఫీసుకి వెళ్ళిపోదాం. నాక్కొంచెం ఇంపార్టెంట్ వర్క్ ఉంది. చూసుకున్నాక మనం కాస్సేపు మాట్లాడుకోవచ్చు. నాకు సెపరేట్ ఛాంబర్ ఉంది. మీరక్కడ కంఫర్టబుల్‌గా కూర్చోవచ్చు."

"ఓ.. దెన్ ఒకె పదండి"

ఇద్దరూ లేచారు.

చల్లగా, పరిమళభరితంగా ఉన్న శ్రీధర్ ఛాంబర్‌లోకి అడుగుపెట్టగానే చాలా ఆహ్లాదంగా అనిపించింది. అతని టేబుల్ మీద ఉన్న జర్నల్స్ తిరగేస్తూ కూర్చుంది. శ్రీధర్ విశాలంగా ఉన్న తన టేబుల్ వదిలేసి, ఓ మూల ఉన్న కంప్యూటర్ టేబుల్ దగ్గర కూర్చుని కాసేపట్లోనే సీరియస్‌గా వర్క్‌లో మునిగిపోయాడు. మాధవికి ఏం చేయాలో తోచలేదు. తను వచ్చిన పని అయేలా లేదు. శ్రీధర్‌ని ఏమని అడగాలి? అర్చనకీ, కొత్తగా వచ్చిన ఎం.డికి మధ్య ఏం జరిగిందని అడగాలి? ఎలా? చిరాకొచ్చేసింది. ఓ అరగంట గడిచాక శ్రీధర్ కంప్యూటర్ దగ్గర్నించి తన టేబుల్ దగ్గరకు వచ్చి బెల్ నొక్కాడు. వెంటనే ప్యూన్ వచ్చాడు.

"సరితను పిలువు" అన్నాడు.

ప్యూన్ వెళ్ళిపోయాడు. రెండు నిమిషాల్లో ఇరవై ఏళ్ళ అమ్మాయి వచ్చింది. సన్నగా, బాగా సన్నగా ఉంది. చాలా స్టైలిష్‌గా ఉంది. కానీ, వికారంగా ఉంది. దానిక్కారణం ఆమె చేసుకున్న అతి మేకప్.

"సరితా నా ఫైల్ ఓపెన్ చేసి ప్రింట్స్ తీసుకురండి" అన్నాడు శ్రీధర్. ఆమె వెళ్ళిపోయింది.

"చెప్పండి మాధవిగారూ.. సారీ.. బోర్ ఫీలయారనుకుంటా. "

మాధవి నవ్వింది.

"చెప్పండి వాట్ కెన్ ఐ డూ ఫర్ యూ? "

మాధవి కొన్ని క్షణాలు మౌనంగా ఉండిపోయింది. టేబుల్ మీద ఉన్న పేపర్ వెయిట్ గుండ్రంగా తిప్పుతూ మళ్ళీ తానే దాన్ని ఆపేస్తూ అదంతా చూస్తోన్న శ్రీధర్ అన్నాడు.

"మీరేంటో చాలా టెన్షన్‌గా ఉన్నట్టనిపిస్తున్నారు. "

మాధవి ఒక్కసారి కళ్ళెత్తి అతనివైపు చూసి, తిరిగి చూపులు వాల్చుకుని అవునన్నట్టు తలపంకించింది.

"మీరేం మాట్లాడాలనుకున్నా మాట్లాడచ్చు. నో టెన్షన్. ఒకే.!? "

"అర్చన రిజైన్ చేయడానికి కారణం తెలుసా? "

"తెలియదు. కానీ, నేను ఒక విషయం విన్నాను. మిస్టర్ భార్గవ్ మనకి యం.డి.గా వచ్చిన మరునాటి నుంచీ ఆమె కనిపించలేదు. ఆయన కూడా చాలాసార్లు ఆమె గురించి ఎంక్వైరీ చేశారు. "

"వాళ్ళిద్దరి మధ్యా ఏదన్నా.. ఐమీన్ లవ్ ఎఫైర్ ఏమన్నా ఉందేమో మీకు తెలుసా? "

"అలాంటిది ఉందనుకోను. కానీ, ఎం.డిగారు అలా అడగడంలో క్యూరియాసిటీ తప్ప నాకేం ప్రత్యేకత కనిపించలేదు. ఆయన అర్చన గారి పట్ల కొద్దిగా ఆకర్షితులయారేమో అనే అనుమానం వచ్చింది కానీ, బైద టైం హి వజ్ మ్యారీడ్ "

"మైగాడ్ !!" మాధవి గట్టిగా అరిచినట్టుగా అంది.

"ఏమైంది? " కొంచెం ఖంగారుగా అడిగాడు.

"ఏం ఏంలేదు. సారీ.." తడబడుతూ అని. "సరేనండి వస్తాను. చాలాసేపైంది నేనొచ్చి. ఇప్పుడు భార్గవ్‌గారు ఎక్కడున్నారో చెప్పగలరా?"

"స్టేట్స్ వెళ్ళిపోయారు. ఆయన మిసెస్ అక్కడ డాక్టర్."

"ఓ.. ఓకె వస్తాను.." లేచింది మాధవి.

"మీరీ ఇన్‌ఫర్మేషన్ అంతా ఎందుకడిగారో తెలుసుకోవచ్చా? "

నవ్వింది.

"తప్పకుండా.. కానీ, ఇప్పుడు కాదు. వస్తాను. థాంక్స్ ఫర్ యువర్ కో ఆపరేషన్."

శ్రీధర్ కూడా లేచి ఆమెకి బై చెప్పాడు. మాధవి అక్కడినుంచి వేణు ఇంటికి వెళ్ళింది.

ఆమె వెళ్ళేసరికి తాయారమ్మ మంచి నిద్రలో ఉంది. ఆమె పక్కనే రిత్విక్ పడుకున్నాడు. ఆవిడ చెయ్యి వాడిని చుట్టేసి భద్రంగా గుండెల్లో పొదువుకుంది. నీలవేణి వరండాలో కూర్చుని ఆరిపోయిన బట్టలన్నీ మడతలు పెడుతోంది. ఆమె చేతిలో వేణు షర్ట్ ఉంది. చాలా శ్రద్ధగా, పొందిగ్గా మడత పెడుతోంది. మాధవి కాస్సేపు ఆమెనే చూస్తూ నిశ్శబ్ధంగా నిలబడిపోయింది. ఈ అమ్మాయి కొంచెం చదువుకుని ఉంటే ఎంత బాగుండేది. తాయారమ్మగారు అంత నిశ్చింతగా నిద్రపోవాలన్నా, రిత్విక్ భవిష్యత్తు బాగుండాలన్నా, వేణు జీవితం గాడిలో పడాలన్నా ఈ ఇంటికి ఇలాంటి అమ్మాయి అవసరం చాలా ఉంది. కానీ, నీలవేణి కులం ఏమిటో తెలియదు. కులంకాని పిల్ల అయినా ఆదరించి ఇంట్లో పెట్టుకున్నా ఆమె ఆ ఇంట్లో ఒక పనిమనిషి. అంతకన్నా ఉన్నతమైన స్థానం ఇచ్చేంత విశాల హృదయం ఎవరికీ లేదు. తనకే లేదు అనుకుంది మాధవి.

సడన్‌గా మాధవికి గొంతు బొంగురుపోయి దగ్గురావడంతో నీలవేణి తలెత్తి మాధవిని చూసి,

"అయ్యో, అమ్మాయిగారూ తవరా? ఎంతసేపైందండి వచ్చి?" అంటూ చటుక్కున ఒళ్ళో ఉన్న బట్టలు కిందపడేసి లేచి నిలబడింది. మాధవి దగ్గడంతో చకచకా లోపలికెళ్ళి గ్లాసులో మంచినీళ్ళు తెచ్చిచ్చింది.

నీళ్ళు తాగి గ్లాసు చేతికిస్తోన్న మాధవితో అంది.

"మిమ్మల్నెవరో తల్చుకుంటున్నారమ్మా. "

నవ్వింది మాధవి. "ఇంకెవరు తల్చుకుంటారు. మా అమ్మే వారం అయింది ఫోన్ చేసి. "

"అట్లాగా రండి.. కూర్చోండి." అంటూ శబ్ధం చేయకుండా ప్లాస్టిక్ కుర్చీలాగింది.

మాధవి కూర్చుని ఒంగి కింద ఉన్న తాయారమ్మ చీర అందుకోబోయింది మడతపెట్టడానికి.

"అయ్యయ్యో మీరుండండమ్మా. నేనున్నాగా" అంటూ మాధవి చేతిలోంచి లాగేసి, దూరం జరుపుకుంది నీలవేణి బట్టలన్నిటినీ.

"ఫర్వాలేదులే.. నీలవేణి" అంది మాధవి.

"ఒద్దమ్మా మీరు చదువుకున్నవారు. పెద్దవాళ్ళు. ఇట్టాంటి పనులు మీకెందుకు? నేనున్నాగా. "

"నువ్వేం చదువుకున్నావు నీలవేణీ? "

"నేనా నాకు చదువెక్కడిదండి." నవ్వింది నీలవేణి.

"ఎందుకు చదువుకోలేదు? "

"మా ఇంట్లో ఆడపిల్లల్ని బళ్ళోకి పంపించరండి. ఆరో ఏట నుంచే నేన్ను పన్లోకి వెళ్ళేదాన్ని. మా నాయన బాగా తాగేవోడండి. మేము ముగ్గురం అక్కచెల్లెళ్ళం. మా అక్కలిద్దరికీ పన్నెండేళ్ళకే పెళ్ళయి అత్తారిళ్ళకెళ్ళిపోయారు. మా అన్న పదో తరగతి వరకూ చదువుకుని పట్నం ఎల్లి ఉద్యోగం చేసుకుంటున్నాడండి."

"ఏ పట్నం? అంటే ఏ ఊళ్ళో ఉన్నాడో తెలుసా? "

"లేదండి. తెలియదు. గోదారి పుష్కరాలొచ్చినప్పుడు అమ్మతో కలిసి గోదారికెళ్ళాను. అమ్మ మునిగిపోయింది. నేను తేలాను. కానీ, మునిగింది ఎక్కడో, తేలింది అయ్యగారి పాదాల దగ్గర. "

"నీకు మీ వాళ్ళని చూడాలనిపించదా? "

"నా వాళ్ళు ఎవరున్నారండి? మా అయ్యతాగి, తాగిపోయే ఉంటాడీయాలకి. మా అక్కలిళ్ళకి నేనెల్లనండి. ఆళ్ళ అత్తోరోళ్ళు మంచోళ్ళు కాదు. ఇంక మా అన్న ఎక్కడున్నాడో అయినా నాకిప్పుడు అమ్మగారు, అయ్యగారు తప్ప ఇంకెవరిమీదా ఆశలేదండి. బతికినా, చచ్చినా వాళ్ళిద్దరి పాదాలే. "

మాధవి కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

వీళ్ళ మాటలు విన్న తాయారమ్మ లేచి వచ్చింది. "ఏమ్మా ఎంతసేపైంది నువ్వొచ్చి? " ఆవలిస్తూ అడిగింది.

"పదినిమిషాలైందండి." అంది మాధవి.

"నిద్రపట్టేసింది.. " అంటూనే ఆవిడ కూడా ఓ కుర్చీ జరుపుకుని కూర్చుంది.

నీలవేణి మడతలు పెట్టిన బట్టలన్నీ బొత్తిగా పట్టుకుని లోపలికెళ్ళిపోయింది.

"ఏంటమ్మా విశేషాలు? ఎలా ఉన్నారు? వచ్చి చాలా రోజులైంది కదూ"

"అవునండి. తిరుపతి నుంచి వచ్చాక ఇవాళే వచ్చాను."

"పిల్లాడేడి?"

"క్రచ్‌లో వదిలానండి. నాకు కొంచెం పనుండి ఉదయాన్నే బైటికి వెళ్ళిపోయాను."

"క్రచ్. అంటే?"అయోమయంగా చూసిందావిడ.

"అంటే పిల్లల్ని చూసుకునే టీచర్లంతా కలిసి ఒక స్కూల్‌లాంటిది పెడతారు. అక్కడ పిల్లలకి కావలసిన సదుపాయాలన్నీ ఉంటాయి. ఆటలు, కథలు చెపుతారు. చిన్న, చిన్న పోయమ్స్ నేర్పిస్తారు. స్కూలుకి పంపించేముందు అలవాటు చేయడానికి కొంతకాలం క్రచ్‌లో పెట్టాలి. అప్పుడు స్కూల్‌కి వెళ్ళడానికి మారాం చేయరు"

"అలాగా! వాళ్ళంతా మనవాళ్ళేనా?" అడిగిందావిడ.

మాధవి నవ్వింది. "అన్ని రకాల వాళ్ళు ఉంటారండి."

"మరెందుకమ్మా ఒక్కపూటకి అక్కడ దింపడం?"

"కాదండి. ఒక్క పూటకోసం కాదు. మరో ఆరునెలల్లో వాడిని స్కూల్లో చేర్పిస్తాను. మూడో ఏడు వస్తుంది. అందాకా అలవాటు చేయడానికి చేర్పించాను. వాడు అలవాటు పడితే నేను కూడా ఏదన్నా ఉద్యోగం. చూసుకుందామనుకుంటున్నాను"

"ఎందుకమ్మా హాయిగా ఉండక నీకేం తక్కువ? నువ్వు సంపాదించకపోతే గడవదా?"

"అదికాదండి ఇంట్లో ఊరికే కూర్చుంటే బ్రెయిన్ దయ్యాలకొంపలా తయారవుతుంది. అందుకే చిన్న ఉద్యోగం చూసుకుందామనుకుంటున్నాను."

"నా మాట విని ఆ ఆలోచన మానుకో. సుఖాన ఉన్న ప్రాణం దుఃఖాన పెట్టుకున్నట్టు అవుతుంది. నీ కంతగా కాలక్షేపం కాకపోతే మా వేణుకి ఏవన్నా సంబంధాలు చూడు."

మాధవికి నవ్వొచ్చింది. ఆపుకుంటూ అంది "వేణుకి సంబంధాలు చూడాలన్నా నాకు నలుగురు తెలియాలి కదా. వాళ్ళకి చెబితే ఎవరన్నా వాళ్ళ దృష్టిలో ఉంటే చెపుతారు. ఈసారి వేణుకి, మీకు అన్ని విధాలా అనుకూలంగా ఉన్న అమ్మాయిని చూసి చేద్దాం. నేనీ కార్యాన్ని బాధ్యతగా స్వీకరిస్తున్నాను. తప్పకుండా వేణుకి మంచి అమ్మాయిని చదువు, సంస్కారం, గుణం అన్నీ ఉన్న అమ్మాయిని చూస్తాను సరేనా?"

మాధవి చెప్పిన తీరుకి ఆవిడకి ఆమె పట్ల వాత్సల్యం పెల్లుబికింది.

"నా తల్లే! బంగారు తల్లి.. ఆ పని చేయి నీ కడుపున పుడతా" అంది.

ఇంతలో నీలవేణి కాఫీ కప్పులతో వచ్చింది.

కాఫీ కప్పు అందుకుంటూ తాయారమ్మ అంది. "దీనిక్కూడా ఏదన్నా సంబంధం ఉంటే చూడమ్మా. ఆడపిల్లని ఎన్నాళ్ళు మనింట్లో అట్టే పెట్టుకుంటాం. దీని పెళ్ళి చేసి పంపించేస్తే మనకొక బాధ్యత తీరుతుంది. ఆ తరువాత వేణు పెళ్ళి చేసి మేమిద్దరం మా ఊరు వెళ్ళిపోతాం."

"నేనూ అదే అనుకుంటున్నాను పిన్నిగారూ. తప్పకుండా నీలవేణికి తగిన అబ్బాయిని చూస్తాను."

నీలవేణి చటుక్కున అంది. "నేనిక్కడ నుంచి.. అంటే అమ్మగారూ. మీ దగ్గరనుంచి ఎక్కడికీ వెళ్ళనండి. నాకు పెళ్ళీ వద్దు, పెటాకులు వద్దు. మీ సేవలు చేసుకుంటూ బతకనివ్వండి"

"అదేంటే నీకు పెళ్ళిచేయకుండా మా సేవలకోసం మా ఇంట్లో అట్టే పెట్టుకోమంటావా? మంచిదానివే.. వల్లకాదు" అంటూ చివ్వున లోపలికెళ్ళిపోయింది.

ఒక్క క్షణం మాధవితో పాటు తాయారమ్మ కూడా నివ్వెరపోయింది. తరువాత తేరుకుంటూ

"దాని మొహం. ఇదే ప్రపంచం అనుకుంటోంది వెర్రిబాగుల్ది. దాని మాటలు పట్టించుకోకుండా గంతకు తగ్గ సంబంధం ఏదో చూడమ్మా"

ఇంతలో రిత్విక్ ఏడుపు వినిపించింది. నీలవేణి పరిగెత్తుకుంటూ రిత్విక్ దగ్గరకు వెళ్ళివాడిని భుజం మీద వేసుకుని రావడంతో వాడి ఏడుపు ఆగిపోయింది.

నీలవేణి వాడిని ముద్దు చేస్తూ "పాలు తాగుదామా తండ్రి. దా పాలు తాగుదాం" అంటూ వంట గదివైపు వెళ్ళడం చూసిన మాధవికి మరోసారి అనిపించింది. ఈ అమ్మాయి కొంచెం చదువుకున్నా బాగుండేది. అనుకుంది.

కాసేపు ఆవిడతో పిచ్చాపాటీ మాట్లాడి మూడవడంతో క్రచ్‌కు బయల్దేరింది.

"వస్తుండండమ్మా మమ్మల్ని మర్చిపోకు" అంది తాయారమ్మ.

"అయ్యో ఎలా మర్చిపోతాను పిన్నిగారూ తప్పకుండా వస్తాను." అంది ఆవిడ మాటలకు నొచ్చుకుంటూ

ఆవిడ మాధవి భుజమ్మీద చేయేసి ఆప్యాయంగా నొక్కింది.

మాధవి బైటకొచ్చేసి అటు వెళ్తున్న ఆటో పిల్చి ఎక్కింది.

క్రచ్‌లో అడుగుపెట్టేటప్పటికి కౌశిక్ పూర్తిగా బొమ్మల్లో మునిగిపోయి ఆడుకుంటున్నాడు.

"ఏమన్నా పేచీ పెట్టాడా?" అడిగింది సుధారాణిని.

"లేదండి. అసలు పేచీ పెట్టలేదు. మీరిచ్చిన ఫుడ్ పెట్టాను. పాలు తాగించాను. రెండు గంటలసేపు పిల్లలతో పాటు పడుకున్నాడు. అడుగో ఇంతకు ముందే లేచి మళ్ళీ ఆటల్లో పడ్డాడు" అంటూ ఆడుకుంటున్న బాబుని చూపించింది.

మాధవి దగ్గరకు వెళ్ళగానే పరిగెత్తుకుని వచ్చి ఒళ్ళో వాలిపోయాడు. అంతసేపు వాడిని వదిలి ఉన్నందుకు చాలా గిల్టీగా అనిపించింది మాధవికి. వాడిని గుండెలకు హత్తుకుని ముద్దు పెట్టుకుంది.

వచ్చీరాని మాటలతో వాడేవో కబుర్లు చెపుతుంటే ఆటో మాట్లాడుకుని ఇంటికి వచ్చింది. కౌశిక్‌కి నీళ్ళు పోసి, జారుడుగా ఉప్మా చేసి పెట్టి పాలు పట్టింది. టీ.వీ ఆన్ చేసి కార్టూన్ నెట్‌వర్క్ పెట్టేసి బుల్లి కుర్చీలో వాడిని కూర్చోబెట్టి తను సాయంత్రం వంటకు ఏర్పాట్లు చేసుకోసాగింది. ఆమెకి పదే, పదే నీలవేణి, ఆమె పని తీరు మొదలసాగింది. భలేపిల్ల. అలాంటి పిల్ల ఒక్కతి ఉంటే చాలు. ఇల్లంతా అప్పగించేయచ్చు.

మాధవి అలా అనుకుంటుండగానే ఫోన్ మోగింది.

"హలో.. ఆ.. పిన్నీ నువ్వా?? ఏంటి సంగతులు?" అడిగింది శైలజ.

"ఏముంటాయమ్మా అవునూ నువ్వు ఉద్యోగం చేస్తున్నావా?"

"లేదు పిన్నీ డెలివరీకి మానేసిందాన్ని మళ్ళీ చేరలేదు. ఇదిగో కౌశిక్‌ని ఇవాళే క్రచ్‌లో వేశాను. బానే అడ్జెస్ట్ అయాడు. ఇంక వెతుక్కుంటాను. బాబాయి ఎలా ఉన్నారు, ప్రీతి, నిశాంత్ బాగున్నారా? అన్నట్టు వాడికి, నిశాంత్‌కి ఇంజనీరింగులో సీటొచ్చిందా?"

శైలజ నవ్వింది. "ఏవిటే బాబూ ఆ ప్రశ్నల పరంపర చెప్తాను. ఒక్కొక్కటే చెప్తాను. వాడికి సీటొచ్చింది. కానీ, ఇక్కడికాదు చెన్నైలో చేరాడు. ప్రీతికి జాబ్ వచ్చింది. ఇక్కడే విజయవాడలో చిన్న సాఫ్ట్‌వేర్ కంపెని. దానికి పెళ్ళి సంబంధాలు వస్తున్నాయి. మనకి అన్నీ నచ్చడంలేదు. అదసలే పెంకెది. ఉద్యోగంలో ఎవడ్నో చూసి ముడేయించుకున్నా వేయించుకుంటుంది. ఆ ప్రమాదం జరక్కుండా దానికేదన్నా సంబంధం చూడవే."

మాధవి ఆసక్తిగా అడిగింది."నీ రిక్వైర్ మెంట్ ఏంటి పిన్నీ?"

"ఏముంటుందే పిల్లాడు బుద్ధిమంతుడు కావాలి. మంచి ఉద్యోగం ఉండాలి. భార్యని ప్రేమగా చూసుకోవాలి. మన పిల్ల చక్కటిది కాబట్టి కుర్రాడు కూడా కొంచెమన్నా అందంగా ఉండాలి కదా"

సాలోచనగా అంది మాధవి "సరే పిన్నీ తప్పకుండా చెప్తాను." అని ఏదో అడగబోయిన దానిలా రెండుసార్లు "పిన్నీ, పిన్నీ.." అని ఆపేసింది.

"ఏంటమ్మా? చెప్పు.." ఆప్యాయంగా అడిగింది శైలజ.

"ఏం లేదులే తరవాత చెప్తాను" అంది మాధవి

"ఏంటి ఏదన్నా శుభవార్తనా? రెండో వాళ్ళు వస్తున్నారా?"

ఆవిడ మాట అర్థమైన మాధవి సిగ్గుగా అంది. "ఛీ, ఛీ అదికాదులే తరువాత చెప్తాను. ఇంకా ఏంటి విశేషాలు?" అడిగింది మాధవి సంభాషణ మళ్ళిస్తూ.

"ఏం ఉంటాయి మాకు. నిద్రలేవడం, ఒండుకోడం, తినడం, పడుకోడం టీవి చూడడం. అది సరేగానీ మాధవీ.. ఆ సీరియల్స్ తీసేవాళ్ళు నీకెక్కడన్నా కనిపిస్తారా?"

"ఎందుకు పిన్నీ?"

"ఏం లేదు. ప్రతి సీరియల్ ఒకటే కథ. హీరో ఆ హీరోని ఇద్దరు హీరోయిన్లు ప్రేమించడం, ఒకదాన్ని వాడు పెళ్ళి చేసుకోడం, రెండోది వీళ్ళ మీద పగబట్టి వాళ్ళు కాపురం చేయకుండా నానా హింసలు పెట్టడం వాళ్ళకింక కథలు లేవా? ప్రతి సీరియల్‌లో ఇద్దరు పెళ్ళాలు. ఛీ, ఛీ సిగ్గులేదా వాళ్ళకి. డబ్బుకోసం నీతిమాలి బతకడం ఎందుకే?"

మాధవి పక, పకా నవ్వింది "నీలాంటి గృహిణులు చూస్తున్నారు, వాణిజ్య వేత్తలు పోషిస్తున్నారు. తీసేవాళ్ళు తీస్తారు పిన్నీ. నిన్ను చూడమని ఎవరు చెప్పారు? మీలాంటి వాళ్ళే అలాంటి సీరియల్స్ మీద తిరగబడి, తిరస్కరిస్తే ఇంకోసారి తీస్తారా? ఆడవాళ్ళందరినీ హింసాప్రవృత్తి కలిగిన మానసిక రోగులుగా చూపించే విష సంస్కృతి పెరిగిపోయిందంటే కారణం చూసేవాళ్ళే. వాళ్ళదే తప్పు. తీసేవాళ్ళది కాదు."

"ఏమోనే కాలక్షేపం కోసం టీ.వి పెడతాం కానీ, ఇలాంటి దరిద్రగొట్టు సీరియల్స్ చూడ్డానికా? కాదు కదా. కానీ, ఏ ఛానెల్ పెట్టినా అవే సీరియల్స్ అదే కథలు, అదే ఆడవాళ్ళు. అసహ్యం వేస్తోంది. నాకు చిరాకొచ్చి వారమైంది కేబుల్ కనెక్షనే పీకించేశాను."

"మంచిపని చేశావు" అంటూ మాధవి గలగలా నవ్వింది.

"చాలా మంచి పనిచేశావు పిన్నీ. రేటింగ్ తగ్గితే స్పానర్‌షిప్ ఉండదు. ఒకసారి ఒకళ్ళకి లాస్ వచ్చిందంటే రెండోవాళ్ళు సాహసం చేయరు. సరేలే టీ.వి సీరియల్స్ తీసేవాళ్ళని రాజకీయ నాయకులని ఎంత తిట్టినా వాళ్ళకి సిగ్గూ శరం ఉండవు. మనకనవసరంగా కంఠశోష వదిలెయ్. ఇంకా ఏంటి?"

"ఏం లేదు. మీ ఆయన్ని అడిగానని చెప్పు. ప్రీతి సంగతి మర్చిపోకు."

"మర్చిపోనులే"

"సరే మరి ఉంటాను"

"అలాగే బై" ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి మాధవి ఆలోచనలో పడిపోయింది.

ప్రీతి కొంచెం పెంకెదే కానీ, మంచిది. మనసు మంచిది. పైగా పనిమంతురాలు నెట్‌లో రకరకాల వంటలు చదివి ఇంట్లో ప్రయోగాలు చేస్తుంటుందని పిన్ని చాలాసార్లు చెప్పింది. పైగా చక్కటి పిల్ల వేణుకి మాట్లాడితే.

కాలింగ్ బెల్ మోగింది.

మాధవి కూర్చున్న చోటునుంచి కదిలి డోర్ తీసింది.

●●●

**"హాయ్ మాధవీ.." వేణు చిరునవ్వుతో నిలబడి ఉన్నాడు.**

"హాయ్ వేణూ.. దా, దా బ్యాంకు నుంచేనా?"

"ఊ ఏడీ వీడు రాలేదా?" లోపలికి వచ్చి, చుట్టూ చూస్తూ అడిగాడు చక్రవర్తినుద్దేశించి.

"లేదు వచ్చే టైం అయింది. నువ్వేంటి అప్పుడే వచ్చావు."

"నేను కొంచెం పనుండి మధ్యాహ్నమే బైటికి వచ్చేశాను. చక్రవర్తిని కలవలేకపోయాను."

"అలాగా. కూర్చో కాఫీ తెస్తాను. మంచినీళ్ళివ్వనా?"

"ఏం ఒద్దు. చక్రవర్తిని కూడా రానీలే కలిసి కాఫీ తాగుదాం వచ్చే టైం అయింది కదా" అలా సోఫాలో కూర్చుంటూ అక్కడే థామస్ బొమ్మతో ఆడుకుంటున్న కౌశిక్‌ని చూసి "హాయ్ హీరో హౌవ్వార్యూ? " అంటూ పలకరించాడు.

కౌశిక్ వేణు పలకరించగానే మొహం నిండా నవ్వుతో కేరింతలు కొట్టి తిరిగి థామస్‌లో మునిగిపోయాడు.

"వీడికి ఆ థామస్, స్పైడర్ మాన్ ఉంటే ఇంక ఏమీ ఒద్దు."

"వాడి బొమ్మలతోటే వాడిని ఆడిద్దాం దానికేం?" అంటూ నవ్వాడు వేణు.

"నీకిప్పుడు పిల్లలతో ఆడుకోడం బాగా అలవాటైపోయింది కదూ.." అంది మాధవి కూడా నవ్వుతూ.

"నిజం మాధవీ పిల్లలతో ఉంటే కాలం ఎంత త్వరగా గడిచిపోతుందో కదా. హాయిగా ఉంటుంది. నాకు చిన్నప్పటి నుంచీ పిల్లలంటే ఇష్టమే కానీ, వాళ్ళ సమక్షంలో జీవితం ఇంత ప్రశాంతంగా, ఆహ్లాదంగా ఉంటుందని ఇప్పుడే తెలిసింది.."

మాధవి వేణు వైపు అలాగే చిత్రంగా, అద్భుతంగా చూస్తూ ఉండిపోయింది.

ఆమె మనసులో అప్పటికప్పుడే ఎన్నో భావాలు చెలరేగసాగాయి. వేణు మంచివాడు. ఒక మామూలు అమ్మాయి కోరుకునే లక్షణాలన్నీ ఉన్నవాడు. ఇతనికి ఎందుకు పెళ్ళి చేయకూడదు? చేయాలి వెంటనే ప్రీతిని ఇక్కడికి పంపించమని పిన్నికి చెప్పాలి. ఆ మాత్రం తొక్కలో ఉద్యోగం ఇక్కడ దొరకదా? బోలెడన్ని సాఫ్ట్‌వేర్ కంపెనీలు హైదరాబాదు నిండా ఉన్నాయి. ప్రీతి వస్తే వేణుకీ, ప్రీతికీ మంచి స్నేహం కలపాలి. ఆ తరువాత ఎలాగూ ఇద్దరి మధ్యా అనురాగం, అభిమానం అనే కెమిస్ట్రీ తప్పకుండా ఏర్పడుతుంది. అలా ఏర్పడకపోతే వాళ్ళిద్దరూ యువతీ, యువకులు కారు. మాధవి ఆలోచనల్లో వేణు మాటలు వినలేదు. వేణు ఆమె మొహం దగ్గరగా చిటికెలు వేస్తూ.. "హలో" అన్నాడు.

మాధవి ఉలిక్కిపడింది.

"ఏంటి హటాత్తుగా ఎక్కడికెళ్ళావు?" చిత్రంగా ఆమెనే చూస్తూ అడిగాడు.

మాధవి పల్చగా నవ్వేసి అంది. "ఏం లేదు. నీకు పెళ్ళి చేసేద్దామా అని ఆలోచిస్తున్నాను."

వేణు మొహంలో ప్రసన్నత మాయమైపోయింది. కొంచెం సీరియస్‌గా అయిపోయి తీసిన తలుపుల గుండా బైటికి చూస్తూ ఉండిపోయాడు.

మాధవికి వేణు మొహంలో వచ్చిన మార్పులు చూడగానే అరే తొందరపడి నా మనసులో మాట అనేశాను. అనకుండా ఉండాలిసింది అనిపించింది. తనను తాను సంబాళించుకుని "కూర్చో వేణూ చక్రవర్తి వచ్చేలోపల బజ్జీలు వేస్తాను" అంటూ లేవబోయింది.

వేణు కూడా మామూలుగా అయిపోతూ "మిర్చి బజ్జీలు వేస్తావా? నేను హెల్ప్ చేయనా? " అన్నాడు తానూ లేస్తూ.

"ఒద్దులే నువ్వు వీడితో ఆడుకుంటూ కూర్చో. నేను చేసేస్తాను."

"సరే అయితే మిర్చిలో ఓన్లీ వాముపొడి, ఉప్పు మాత్రం రాయి. చింతపండు, మసాలా అవన్నీ వేయకు"

"అలాగేలే.. నాకూ అలాగే ఇష్టం" అంటూ నవ్వి లోపలికి వెళ్ళిపోయింది.

వేణు కింద కూర్చుని థామస్ ట్రైన్‌తో ఆడుకుంటున్న కౌశిక్ వైపు చూశాడు. వాడు అందులో మునిగిపోయాడు. వేణు తనూ కింద కూర్చుని "మనిద్దరం ఆడుకుందామా? " అన్నాడు కౌశిక్‌తో.

కౌశిక్ వరసగా ట్రాక్ మీద పేర్చిన బోగీలన్నీ చెల్లాచెదురు చేసి "ఆలుకుందాం" అన్నాడు.

వాడికి అప్పుడే కొద్ది, కొద్దిగా మాటలు వస్తున్నాయి.. చిలకలా పలుకుతున్నాడు.

"ఓ.కె.. బాస్.. నేను అన్నీ మళ్ళీ చక్కగా పెట్టేస్తాను. నువ్వు చప్పట్లు.. ఐ మీన్ క్లాప్స్ కొట్టాలి. ఓకే" అంటూ ట్రాక్ మీద బోగీలు ఎక్కించసాగాడు.

వేణు మాటలు వింటోన్న మాధవి మనసులో మళ్ళీ ప్రీతి మెదిలింది. ఎలాగైనా ప్రీతిని ఇక్కడికి పిలిపించాలి అనుకుంది.

మాధవి మిరపకాయలు చీల్చి అంతకు ముందే రెడీ చేసి డబ్బాలో పోసి పెట్టుకున్న వాము పొడి తీసి మిర్చి మధ్యలో రాయసాగింది.

స్టవ్ వెలిగించి బాండీ పెట్టి నూనె పోస్తుంటే చక్రవర్తి బండి చప్పుడైంది.

పోనీలే వేడి, వేడిగా తింటారు అనుకుంటూ సెనగపిండి డబ్బా తీసి ఒక గాజు బౌల్లో వేసి, ఉప్పు కొంచెం కారం, వేసి కలిపింది. కొద్దిగా వంట సోడా కూడా వేసి నీళ్ళతో బజ్జీ పిండి తయారు చేస్తూండగా

"హలో వేణూ.. బ్యాంకుకి రాలేదా ఇవాళ?" అంటూ చక్రవర్తి స్వరం వినిపించింది.

"వచ్చానురా కానీ త్వరగా వెళ్ళిపోయాను. మా నాన్నగారి స్నేహితుడి కొడుకు ఊరునుంచి వచ్చాడు. అతని ఫ్లాట్ ఏదో రిజిస్ట్రేషన్ ఉందంటే వెళ్ళాను. ఏంటి విశేషాలు? " కౌశిక్ దగ్గర్నించి లేచి సోఫాలో కూర్చుంటూ అన్నాడు వేణు.

"ఏం ఉంటాయి? మూడు లోన్‌లు ఆరు వడ్డీలు. " వేణు ప్రశ్నకి సమాధానం చెబుతూ కౌశిక్‌ని ఎత్తుకుని ఎగరేసి "ఏరా మావయ్యతో ఆడుకుంటున్నావా? " అంటూ వేణు పక్కన సోఫాలో కూర్చుని కౌశిక్‌ని ఒళ్ళో కూర్చోబెట్టుకున్నాడు. కాస్సేపు తండ్రి జేబులో పెన్నుతో ఆడుకుని తిరిగి థామస్ గుర్తొచ్చిందేమో చక్రవర్తి ఒళ్ళోంచి జారి వెళ్ళిపోయాడు కౌశిక్.

"నీది లోన్ సెక్షన్ అయిపోయి చాలా బిజీ అయిపోయావనుకుంటా. "

"ఇంటరెస్ట్ రేట్ ఎంత పెరిగినా లోన్స్ కోసం వచ్చేవాళ్ళ సంఖ్య పెరుగుతూనే ఉంది కానీ తరగడం లేదు. "

"మన పనే అది కదా. బ్యాంకులు ఉన్నదే అందుకు. "

"అంతేలే...అవునూ నువ్వెందుకు ఇల్లు ప్లాన్ చేయడం లేదు.? "

"అనుకుంటున్నాను చక్రవర్తీ. అదే ఆలోచన వచ్చింది ఇవాళ. నాకు ఫ్లాట్స్ ఒద్దు. ఇండిపెండెంట్ ఇల్లుకావాలి. అమ్మా, నాన్నలకు ఫ్లాట్స్ నచ్చవు. "

"అవునూ.. ఇప్పుడు నువ్వున్న ఇల్లే కొనేయచ్చు కదా. ఆ మధ్య ఆ ఇల్లు అమ్మాలనుకుంటున్నట్టు ఓనర్స్ ప్రయత్నిస్తున్నట్టు తెలిసింది. "

"అలాగా నాతో అనలేదే?" ఆశ్చర్యంగా అడిగాడు వేణు.

"నాతో కూడా వాళ్ళు డైరెక్ట్‌గా అనలేదు. ఎవరో అంటే విన్నాను. ఓసారి మాట్లాడదామా? "

"వైనాట్ ష్యూర్. ఎలాగా ఫస్ట్‌కి రెంట్ ఇవ్వడానికి వెళతాం కదా. మాట్లాడదాం కొంచెం రిపేర్స్ చేయించుకుంటే హాయిగా ఉంటుంది ఇల్లు. మూడేళ్ళనుంచీ ఉంటున్నాను. కాని నాతో కలిసినప్పుడైనా మాటవరసకి అనచ్చు కదా. "

"చూడు వేణు.. కొన్ని పనులు వాయిదా వేస్తే అవుతాయి. కొన్ని పనులు వెంటనే చేస్తే అవుతాయి. ఎల్లుండి ఆదివారం కదా వెళ్ళి మాట్లాడదాం. ఫస్ట్ రావడానికింకా పదిహేను రోజులుంది. ఈలోగా అతనికి వేరే పార్టీ దొరికితే? "

చక్రవర్తి అన్నది నిజం అన్నట్టుగా తలూపుతూ అన్నాడు. "ఓకె.. ఆదివారం వెళదాం."

ఇంతలో మాధవి వేడి, వేడి బజ్జీల ప్లేటు, మంచినీళ్ళ జగ్గు, గ్లాసులు పెట్టుకున్న ట్రేతో వచ్చి "సార్ గారు కాళ్ళూ, చేతులూ కడుక్కుని వస్తారా?" అంది చక్రవర్తిని ఉద్దేశించి.

''యస్ మేడమ్'' అంటూ గట్టిగా ఎగబీలుస్తూ ''వావ్ మిర్చి బజ్జీ.. '' తీసుకోబోయాడు చక్రవర్తి.

మాధవి చిన్నగా కసురుతూ అంది. ''వెళ్ళండి బాబూ.. చేతులన్నా కడుక్కుని రండి. అసహ్యంగా అలాగేనా తినేది. ''

''ఓ.కే'' అంటూ తిరిగి కౌశిక్‌ని ముద్దు చేస్తూ ''మరి నా బుజ్జిగాడికి స్నాక్స్'' అన్నాడు.

''వాడి స్నాక్స్ వారికి రెడీ'' అంటూ ప్లేటు టీపాయ్ మీద పెట్టి తిరిగి లోపలికి వెళ్ళి క్యాడ్‌బరీ చాక్లెట్ తీసుకొచ్చి కౌశిక్‌కి ఇచ్చింది మాధవి.

''తీసుకో వేణూ'' అంటూ మంచినీళ్ళ జగ్, గ్లాసులు పెట్టింది.

వేణు వేడి వేడిగా ఉన్న బజ్జీ చేతిలోకి తీసుకుని ఊదుకుంటూ అన్నాడు. '' మంచి స్మెల్ మాధవీ నువ్వు మిర్చి బజ్జి చెయ్యడంలో ఫర్‌ఫెక్ట్ అనుకుంటా'' అన్నాడు.

''ఊఁ..ఊఁ.. పర్లేదు. బండి పెట్టుకోవచ్చు అవసరం అయితే'' అంటూ వచ్చాడు చక్రవర్తి.

మాధవి కొరకొరా చూసింది.

''సరదాగా అన్నానులేరా'' నవ్వుతూ బజ్జీ తీసుకున్నాడు.

ముగ్గురూ కాస్సేపు ఇళ్ళు, ప్లాట్స్, పెరిగిన సిమెంట్ ధరలు, స్టీలు ధరలు వీటి గురించి మాట్లాడుకుంటూ బజ్జీలు తినడం పూర్తిచేశారు. మాధవి మంచి టీ ఇచ్చింది. అది తాగి ఇద్దరి దగ్గరా సెలవు తీసుకుని కౌశిక్‌ని ముద్దు పెట్టుకుని బయలుదేరాడు వేణు.

వేణు వెళ్ళిపోయాక ఉత్సాహంగా అంది మాధవి.

''వేణు పెళ్ళి అయిపోయినట్టే''

''ఎవరితో''

''అమ్మాయితో ''

''అలాగా అబ్బాయిల్ని కూడా చేసుకుంటున్నారా''

''చేసుకోకేం. పేపర్ నములుతుంటారు కదా తెలియదా?''

''ఒద్దులే గుర్తుచేయకు నాకు బజ్జీ వామిట్ అవుతుంది.''

మాధవి నవ్వుతూ ప్లేటు, గ్లాసులు తీసుకుని లోపలికి వెళ్ళబోతుంటే అడిగాడు. ''ఇంతకీ ఎవరు?''

''మా పిన్ని కూతురు ప్రీతి వస్తోంది. దాన్ని వేణుకి పరిచయం చేసి, ఇద్దర్నీ ఎడాపెడా తిప్పేస్తాను.''

''ముందవన్నీ లోపల పెట్టేసి వచ్చి తీరుబడిగా, నాకు అర్థం అయేలా చెప్తావా?'' విసుగ్గా అడిగాడు.

మాధవి ప్లేట్లు గ్లాసులు సింక్‌లో వేసి వచ్చింది. నాప్‌కిన్‌తో చేతులు తుడుచుకుని, కౌశిక్ మూతినిండా నిండిపోయిన చాక్లెట్ తుడిచింది. వాడిని ఎత్తుకుని సోఫాలో కూర్చుంటూ శైలజ ఫోన్ చేసిన విషయం తనకి వచ్చిన ఆలోచన వివరంగా చెప్పింది.

''బాగుంది నీ ఐడియా చాలా బాగుంది. కానీ, వర్కవుట్ అవుతుందంటావా? వేణు అర్చనని మర్చిపోయి పెళ్ళికి ఒప్పుకుంటాడంటావా?''

''అర్చనని మర్చిపోడు. కానీ, పెళ్ళికి ఒప్పుకుంటాడు.''

''ఎలా చెప్పగలవు?''

''సైకాలజీ స్టూడెంటుని కదా''

''అబ్బో గుడ్'' అని నవ్వుతూ మాధవి నెత్తిమీద సున్నితంగా మొట్టాడు.

మాధవి కౌశిక్ షర్ట్ విప్పుతూ అంది. "వేణు యోగి కాదు. అలాగని భోగీ కాదు. మామూలు మగవాడు. అర్చనంటే ప్రేమ ఎంత ఉందో, ఆమె మీద కోపమూ అంతే ఉంటుంది. అయితే మరో పెళ్ళికి ఒప్పుకోవాలంటే రొటీన్‌గా పెళ్ళి చూపులకి తీసుకెళ్ళి ముక్కూ, మొహం తెలియని అమ్మాయి నెవరినో చూపించి ఈ అమ్మాయి మెళ్ళో తాళి కట్టు అంటే కట్టలేడు. అతనే కాదు. అతని స్థానంలో ఏ మగాడున్నా కట్టలేడు. కాబట్టి అతని జీవితంలోకి మరో అమ్మాయి ముందు ప్రవేశించాలి. ఆమె అతన్ని తన స్నేహంతో, అభిమానంతో ఆకట్టుకోవాలి. ఈ వయసులో అమ్మాయిలతో స్నేహం ఆకర్షించినంతగా అబ్బాయిల స్నేహం ఆకర్షించదు."

"అవునవును. నాకూ అంతే" కొంటెగా నవ్వాడు.

"ఇంకేం క్యారీ ఆన్" కోపంగా లేవబోతుంటే ఆమె చీర చెంగు పట్టుకుని ఆపుతూ అన్నాడు "అంతలోనే కోపం వచ్చిందా?"

"నా కేం కోపం లేదు వీడికి స్నానం చేయించాలి."

"చేయిద్దువుగానిలే కానీ చెప్పు"

"ఏంటి చెప్పేది రామాయణమా? భారతమా? ఇప్పటికింతే సంగతులు. మిగతావి వెండి తెరమీద చూడండి. అన్నట్టు అర్చన జాయిన్ అయిందిట.."

"ఎక్కడ?" ఆశ్చర్యంగా చుశాడు.

"ఎక్కడేంటి? తనకి ట్రైనింగ్ ఉంటుంది కదా కొంతకాలం ట్రైనింగ్ ఇస్తారు డిఫరెంట్ ఫీల్డ్స్‌లో."

"అవునా?" సందేహంగా చూస్తూ అంది. "మరి శేఖర్ పేపర్లో అర్చన జాయిన్ అయినట్టు చదివానన్నాడు."

"అర్చనంటే ఆవిడ ఒక్కతేనా? జాయిన్ అయింది మన అర్చన కాదు. అర్చన అనే అమ్మాయి సబ్ కలెక్టర్‌గా జాయిన్ అయింది."

ఓ గట్టిగా ఊపిరి పీల్చి వదిలి" ఏమోలే నాకేం తెలుసు గవర్నమెంటు రూల్స్. పదరా బుజ్జిగా లాల పోసుకుందాం" అంటూ కౌశిక్‌ని ఎత్తుకుని బాత్ రూం వైపు వెళ్ళబోతుంటే ఆమె వైపు చేయి చాపి అన్నాడు చక్రవర్తి "ఇలా ఇవ్వు వాడికి నేను చేయిస్తాను స్నానం."

"ఓ థాంక్యూ" కౌశిక్‌ని చక్రవర్తి కిచ్చి తను చిందర వందరగా ఉన్న కౌశిక్ ఆటసామాను సర్దడంలో మునిగిపోయింది.

●●●

మాధవి ఇంటి నుంచి బైటికి వచ్చిన వేణుకి ఎందుకనో వెంటనే ఇంటికి వెళ్ళాలనిపించలేదు. పావుగంటలో ఇంటికి వెళ్ళిపోవచ్చు. కానీ, మనసంతా దిగులు ఆక్రమించింది. హఠాత్తుగా భవిష్యత్తు శూన్యంగా అనిపిస్తోంది. హఠాత్తుగా తననెవరో విసిరి దూరంగా నిర్మానుష్యంగా ఉన్న ప్రదేశానికి పడేసినట్టు అనిపించింది. ఎంత ఒంటరితనం. చక్రవర్తి నిజంగా చాలా అదృష్టవంతుడు. మాధవి లాంటి అమ్మాయి భార్య కావడం అంటే ఎంత అదృష్టం ఉండాలి. అంత డబ్బున్నవాళ్ళ అమ్మాయి అయినా ఎప్పుడూ ఆడంబరాలకు పోదు. సింప్లిసిటీ ఈజ్ మదర్ ఆఫ్ బ్యూటీ అన్నట్టు సింపుల్‌గా ఉంటుంది. చక్కటి పనిమంతురాలు, సంప్రదాయాలంటే గౌరవం ఉన్న అమ్మాయి. పెద్దవాళ్ళంటే భక్తి. పిల్లలంటే ప్రేమ. మాధవి నిజంగా గ్రేట్.

వేణు బండి టాంక్ బండ్ వైపుకి పోనిచ్చాడు.

ట్రాఫిక్ బాగా ఎక్కువగా ఉంది. బైకు చాలా నెమ్మదిగా కదుల్తోంది. కార్ల వాళ్ళు కార్లు ఆపుకుని, బండ్లవాళ్ళు బండ్లు ఆపుకుని, ఆటోల వాళ్ళు కూడా నోరు మూసుకుని హారన్లు కొట్టకుండా కూర్చున్నారు.

అబ్బా విసుగ్గా ఉంది. సిగ్నల్ దగ్గర పావుగంటసేపు బండి కదలలేదు. ముందూ, వెనకా వందలకొద్దీ వివిధరకాల వాహనాలు ఆగి ఉన్నాయి. సిగ్నల్ నాలుగువైపులా ఎక్కడా గ్రీన్ లైట్ వెలగడంలేదు. అంటే ఎవరో వి.ఐ.పి వస్తున్నట్టున్నాడు. ఇలాంటి ప్రొటోకాల్ వలన

ఎంతమంది సమయం వృధా అవుతుందో అర్థంకాదా ఈ నాయకులకి అనిపించింది. ఉత్తప్పుడు ఐదు నిమిషాలు సిగ్నల్ పడ్డా ఎడతెరిపి లేకుండా మోగించే హారన్‌లు మూగబోయాయి. అందరూ అసహనంగా వి.ఐ.పి కోసం చూస్తున్నారు. వేణుకి చిరాకొచ్చేసింది. బండి అక్కడ వదిలేసి పరుగెత్తి పోవాలనిపిస్తోంది.

బాబేం చేస్తున్నాడో పాపం అమ్మ వాడితో ఉదయం నుంచి ఎంత అవస్థపడుతుందో. ఆ అమ్మాయి నీలవేణి ఎంత చాకిరీ చేస్తోంది. ఈ ఇంటికీ, ఆ అమ్మాయికీ ఇది ఏనాటి ఋణానుబంధమో కానీ, ఎంతకాలం ఇలా? అర్చనలాంటి మూర్ఖురాలి కోసం తానిలా జీవితాంతం బ్రహ్మచారిగా ఉండాల్సిందేనా పెళ్ళెందుకు చేసుకోకూడదు? ఇవాళ మాధవి నోటినుంచి ఆ మాత ఎందుకొచ్చింది? మాధవి మనసులో ఎప్పటినుంచో ఉందా ఆ ఆలోచన. తోటి స్త్రీగా అర్చనకి అన్యాయం జరుగుతుందేమో అని ఆలోచించడం లేదా మాధవి. లేక అర్చన ఇక రాదని ధృఢంగా నిశ్చయించుకుందా? నిజమే ఎందుకొస్తుంది? అక్కర్లేదని వెళ్ళిపోయింది. తన భవిష్యత్తుకి అడ్డం అని కన్నకొడుకుని వదిలేసింది. తను కోరుకున్న మంచి భవిష్యత్తుని సాధించింది. ఇంక ఎందుకొస్తుంది? బాధగా అనిపించింది వేణుకి.

ఈ ప్రపంచంలో ప్రతి మనిషికీ ఏవో కొన్ని ఆశయాలుంటాయి. ఆశలుంటాయి. కోరికలుంటాయి. అవి తీర్చుకోవాలన్న లక్ష్యం ఉంటుంది. అందులో చిత్రం ఏం లేదు. కానీ, ఏం సాధించినా, ఎంత ఎత్తుకు ఎదిగినా చివరికి ప్రతివాళ్ళకీ కావాల్సింది తన అనుకునే మనుషులే కదా. అనుకున్నది సాధించాక అయినా భర్త, పిల్లలు, సంసారం కావాలనిపించదా? అనిపిస్తుందేమో ప్రతి స్త్రీ కోరుకునేది అదే కదా! అర్చన కూడా స్త్రీనేగా తనేం అన్నిటికీ అతీతురాలేం కాదుగా.

సడన్‌గా వెహికల్స్ అన్నీ ఒక్కసారిగా కదలడంతో వేణు ఆలోచనల్లోంచి తేరుకుని బండి స్టార్ట్ చేశాడు. ఇంతసేపు ట్రాఫిక్ ఆగిపోవడానికి కారణం అయిన ఆ వి.ఐ.పి ఎవరో గమనించలేదు. సర్లే ఎవరైతే ఏం?

వేణు అసెంబ్లీ దాటి రవీంద్రభారతి దగ్గరకు వచ్చాడు. రవీంద్రభారతి బైట బ్యానర్లు కనిపించాయి. మంచి కూచిపూడి డ్యాన్స్ బాలే.. బ్యానర్లు కట్టి ఉన్నాయి. బ్యానర్ల మీద కళాకారిణి ఫోటోలు అందంగా ఆకర్షణీయంగా.

ఆ కళాకారిణి పేరు వినలేదు. కొత్తమ్మాయి కావచ్చు. బ్యానర్ మీద ఉన్న బొమ్మలో అద్భుతమైన భంగిమలో ఎంతో అందంగా ఉంది.

వేణు బండి రవీంద్రభారతి గేట్లోకి పోనిచ్చాడు. చాలా కార్లు, మోటారు సైకిళ్ళు స్కూటర్లు. పార్కింగ్ లాట్ నిండిపోయింది. కాస్సేపు పరిశీలించి బండి పార్క్ చేయడానికి సరిపోతుందనుకున్న చోట పార్క్ చేసి నెమ్మదిగా లోపలికి వెళ్ళాడు.

ఇంకా ప్రోగ్రామ్ స్టార్ట్ అవలేదు. చల్లగా ఉంది లోపల. ప్రేక్షకులు పల్చగా ఉన్నారు. బైట చూస్తే అన్ని కార్లు, స్కూటర్లు .. మరి జనమేంటి ఇంత తక్కువ అనిపించింది. కాకపోతే పైన కూడా రెండు ఆడిటోరియమ్స్ ఉన్నాయన్న విషయం గుర్తొచ్చింది. పైన ఫస్ట్‌ఫ్లోర్‌లో ఏదో సాహిత్య కార్యక్రమం జరుగుతున్నట్టుంది. ఆ పైన ఏం ఉందో.

ఉచితంగా నాట్య ప్రదర్శనలు, ఉచితంగా సంగీత కచేరీలు, ఉచితంగా నాటక ప్రదర్శనలు అన్నీ ఉచితంగానే అయినా జనం సినిమా పాటలకి వచ్చినట్టు ఇలాంటి కార్యక్రమాలకు ఎందుకు హాజరు కారో అనిపించింది. అయితే కొద్ది సేపట్లోనే వేణు అభిప్రాయం తప్పని ఋజువు చేస్తూ హాలు నిండిపోయింది.

వేణు పక్కన ఉన్న ఖాళీ సీట్లోకి ఇద్దరమ్మాయిలు వచ్చారు. అందంగా ఉన్నారు. చక్కటి డిజైన్ చీరలు కట్టుకున్నారు. చీరలకు తగిన సెట్ చెవులకి, మెడలో తెల్లగా, లేత గులాబీరంగు లిప్‌స్టిక్ వేసుకున్నారు. సంప్రదాయబద్ధమైన చీరకట్టుని ఆధునికంగా కట్టుకుని ఆకర్షణీయంగా ఉన్నవాళ్ళని చూస్తూ అనుకున్నాడు. ఈ కాలంలో అందంగా లేని అమ్మాయిలు అరుదేమో. ఇన్ని రకాల అలంకరణ వస్తువులు, బ్యూటీ పార్లర్లు ఎలాంటి వాళ్ళనైనా అందంగానే తయారు చేస్తున్నాయి. కాకపోతే వీళ్ళిద్దరూ సహజంగానే అందగత్తెలు.

''ఎక్స్‌క్యూజ్‌మీ'' వాళ్ళిద్దరిలో ఒకమ్మాయి వేణుని చూస్తూ పిలిచింది.

"యస్" ప్రశ్నార్ధకంగా చూశాడు.

"ఇఫ్ యూ డోంట్ మైండ్ మీరు ఆ పక్క సీటులోకి వెళ్తారా? మా ఫ్రెండ్ వస్తుంది."

వేణు తల తిప్పి చుశాడు. తను కూర్చున్న సీటు పక్కన ఖాళీగా ఒకే సీటు ఉంది. అవతలవైపు ఖాళీ లేదు. ఓ... ముగ్గురూ వరసగా కూర్చుంటారు కాబోలు.

మౌనంగా లేచి పక్క సీటులోకి మారాడు.

"థాంక్యూ" మధురంగా నవ్వింది.

వేణు మాట్లాడకుండా స్టేజిమీదకు తల తిప్పాడు. అప్పుడే కార్యక్రమం ప్రారంభం కాబోతుందని అనౌన్స్ చేస్తూ ఓ గంభీరమైన స్వరం వినిపించింది.

ముందుగా కళాకారిణి పరిచయం.

వేణుకిప్పుడు ఏకాగ్రత పోయింది. ఆ అమ్మాయిలిద్దరూ ఎంత అందంగా ఉన్నారు. పిచ్చి వెధవలా తను అర్చన వెంట పడి జీవితం నాశనం చేసుకున్నాడు. ఆమె కన్నా అందమైన వాళ్ళు ఈ ప్రపంచంలో చాలా మంది ఉన్నారు. ఎందుకిలా జరిగింది? ఈ జీవితం ఇంతేనా? చాలా నిస్పృహగా అనిపించింది.

కొన్ని క్షణాల్లో మెరుపులు విరజిమ్ముతూ వేదికమీదకు వచ్చింది కళాకారిణి. వినాయకుడి ప్రార్ధనతో నృత్యం. సర్వం తనకు తెలియకుండానే మర్చిపోయి అందులో లీనమయాడు.

●●●

అర్చన జీవనయానంలో మరో మజిలీకి ఆరోజే నాంది. రిపోర్ట్ చేయడానికి హైదరాబాదు బయలుదేరింది.

"నాకు కొంతకాలం ట్రైనింగ్ ఉంటుంది నళినీ.. ఎక్కడికి పంపిస్తారో ఏంటో నాకేం తెలియదు. ఏదో చదువుకుని పరీక్షలు రాసి, అలాట్‌మెంట్ అయితే పొందాను కానీ, నాకేమీ తెలియదు. నేనెక్కడ ఉండాలో ఏం చేయాలో నా డ్యూటీస్ రెస్పాన్సిబిలిటీస్ అంతా అయోమయం. అందుకే నా సామానంతా నీ దగ్గర ఉంచు. ఎక్కడోక్కడ కొంచెం సెటిల్ అయాక తీసుకుని వెళతాను" అంది ఇల్లు ఖాళీ చేస్తూ.

"అలాగే ఉంచు.. అర్చనా! అన్నీ పాక్ చేసి పైన పెట్టేస్తాను. నీకెప్పుడు కావాలంటే అప్పుడు తీసుకుని వెళ్ళు. భయపడకు ధైర్యంగా వెళ్ళు. హైదరాబాదు వెళ్తున్నావు కదా.. వాళ్ళని కలుస్తావా?" ఆసక్తిగా అడిగింది నళిని.

అర్చన ఖచ్చితంగా అంది "లేదు ఎవర్నీ కలవను. నేరుగా ఏ పని కోసం వెళ్తున్నానో ఆ పని చేసుకుంటాను. వస్తాను. నేను ఏ బంధాలను పెంచుకోవాలనుకోడం లేదు నళినీ. నాకు తెలుసు. హైదరాబాదు అనగానే నేనూ భయపడ్డాను. నేరుగా నాకు పోస్టింగ్ ఇచ్చి ఉంటే ఎంత బాగుండేది. ఏ బాధా లేకుండా ఎక్కడోక్కడ ఆర్.డి.వోగా చేరిపోయేదాన్ని. ఏడాది దాకా ట్రైనింగ్స్ ఉంటాయట. ఏమిటో సర్లే ఏం చేస్తాం. నేనిప్పుడు ప్రభుత్వాధికారిని ప్రభుత్వం ఆధీనంలో ఉండాలి."

"కాదు పబ్లిక్ అసిస్టెంట్‌వి. ప్రభుత్వాధికారివి అయినా ప్రజలకు మాత్రం నువ్వు సేవకురాలివి. ఈ విషయం మర్చిపోకు."

"నళినీ!" విస్మయంగా పిలిచింది అర్చన.

"నీకింత ఖచ్చితమైన అభిప్రాయం ఉందా?"

నళిని నవ్వింది. "ఆశ్చర్యంగా ఉందా అర్చనా? ప్రతి ప్రభుత్వాధికారీ, ప్రతి మినిస్టరు, ఆఖరికి ముఖ్యమంత్రి కూడా ప్రజలకు సేవకులే. ప్రజాసేవ చేయడానికి మీ అందరికీ ఒక హోదా, ఒక కుర్చీ, నెలకి జీతం ఇస్తారు. అది మర్చిపోయి, వ్యక్తిగత సౌలభ్యాలకు, వ్యక్తిగత సుఖాలకు ప్రాధాన్యత ఇస్తారు కాబట్టే కొందరు ఏసిబి వలలో, సిబిఐ వలలో పడి శిక్ష అనుభవిస్తుంటారు. ప్రభుత్వ ఉద్యోగం అంటే ఆషామాషీకాదు ప్రతి అడుగూ, ఆచి తూచి వేయాలి. అనుక్షణం అప్రమత్తంగా ఉండాలి."

"నళినీ.. భయంగా పిలిచింది. నువ్వలా అంటుంటే నాకేంటో భయంగా ఉంది. ఇంతకాలం ఉద్యోగం, ఉద్యోగం అని సంబరపడ్డానే కానీ, అందులో ఉండే రిస్క్ నాకు తెలియదు."

నళిని అర్చన మొహంలో భావాలు చూసి మెత్తగా నవ్వి ఆప్యాయంగా అర్చన భుజం తట్టి అంది. "భయపడకు అర్చనా! నిన్ను భయపెట్టాలని నేనివన్నీ చెప్పడం లేదు. నువ్వు మంచి పేరు, ప్రతిష్టలు సంపాదించుకుని ప్రజాభిమానం పొందాలని కోరుకుంటూ చెపుతున్నాను. బి కేర్‌ఫుల్ అంతే నీ విధులు నువ్వు బాధ్యతగా నిర్వరిస్తూ, ఏ ప్రలోభాలకూ లొంగకుండా ఉన్నావంటే మొత్తం వ్యవస్థే నీ పాదాక్రాంతం అవుతుంది. నిజాయితీతో దేన్నైనా గెలవచ్చు."

అర్చన కొంచెం తేలిగ్గా నవ్వింది. "నీ మాటలు జీవితాంతం గుర్తుంచుకుంటాను నళినీ! నాకిలా చెప్పేవాళ్ళు మాత్రం ఎవరున్నారు? నేనెలాంటి ప్రలోభాలకు లొంగేదాన్ని కానని నీకు తెలుసుకదా. అది చాలు."

నవ్వుతూ అంది నళిని. "ప్రలోభాలంటే తెలుసుగా.. లంచాలు! వాటి జోలికి మాత్రం పోకేం."

"ఛీఛీ నేనంత చీప్‌గా కనిపిస్తున్నానా?" చీదరగా అంది అర్చన.

నళిని నవ్వి అర్చన చేయి చేతిలోకి తీసుకుని నొక్కింది.

సామాను ఆటోలో వేసేశారిద్దరు కలిసి. అర్చన వర్ధనమ్మగారి దగ్గరకు వెళ్ళి సెలవు తీసుకుంది "కలెక్టర్ కాబోతున్నావు. మమ్మల్ని మర్చిపోకమ్మా" అందావిడ.

"ఎంతమాటన్నారండి. ఎప్పటికీ మర్చిపోను" మనస్ఫూర్తిగా అంది అర్చన.

"అప్పుడప్పుడు వస్తుండు. చూడూ.. పెద్దదాన్ని చెబుతున్నాను నీ భర్తతో నీకేం గొడవలున్నయో నాకు తెలియదు. కానీ, భార్యాభర్తలన్నాక గొడవలు రావడం సహజం. అలాగని విడిపోడం పరిష్కారం కాదు. బంగారు పళ్ళానికైనా గోడ చేటు ఉండాలంటారు. నువ్వు కలెక్టర్‌వైనా నీ పక్కన భర్త ఉంటే కలిగే గౌరవం వేరు. నా మాట విని మీ ఆయన్ని కలుసుకుని హాయిగా కాపురం చేసుకో."

అర్చన మౌనంగా ఉండిపోయింది.

"ఏం? ఈసారి. మీ వారితోటే నిన్ను చూడాలి నేను." ఆవిడ ఆజ్ఞాపిస్తున్నట్టు అంది.

అర్చన పల్చగా నవ్వి. "అలాగే.. వస్తానండి" అంటూ అక్కడ్నించి వచ్చి ఆటో ఎక్కింది. నళిని కూడా అర్చన పక్కన కూర్చుంది. ఆటో కదిలింది.

సామానంతా నళిని ఇంటికి చేర్చి సూట్ కేసు, హ్యాండ్ బాగ్, మాత్రం తీసుకుని బయలుదేరింది. నళిని అర్చనని కౌగిలించుకుంది. అర్చన ఆమె భుజం మీద తలవాల్చి అంది. "మరో ప్రస్థానం మొదలవబోతోంది. ఏం జరుగుతుందో నా డెస్టినేషన్ ఎక్కడో నాకే తెలియడం లేదు. కానీ, ఖచ్చితంగా ఒక గౌరవనీయమైన గమ్యం మాత్రం చేరతాను."

"ఆల్ ద బెస్ట్" నళిని మనస్ఫూర్తిగా అంది.

"థాంక్యూ" నవ్వుతూ నళిని నుంచి విడివడి సూట్‌కేస్, హ్యాండ్ బాగు చేతికి తీసుకుంది.

నళిని గుమ్మందాకా వచ్చి వీడ్కోలు చెప్పింది. అప్పటికే పక్కింటి కుర్రాడిద్వారా పిలిపించిన ఆటో ఎక్కి స్టేషన్‌కి వెళ్ళిపోయింది అర్చన.

ఆమె వెళ్ళేటప్పటికే హైదరాబాదు వెళ్ళాల్సిన రైలు ప్లాట్ ఫామ్ మీదికి వచ్చి ఉంది. తన కంపార్ట్ మెంట్ చూసుకుని, బెర్త్ వెతుక్కుని, సూట్‌కేస్ సీటు కిందకి తోసి, సీటులో కూర్చుని రిలాక్స్ అయింది అర్చన.

భూమి గుండ్రంగా ఉండును. జీవితం ఎటు వెళ్ళినా ప్రారంభించిన చోటుకే వస్తోంది. హైదరాబాదు..! ఇక్కడ తనకేం జ్ఞాపకాలు గుర్తుంచుకోవాల్సినవి ఏమీ లేవు. ఏ అనుబంధాలూ లేవు. వేణుతో సహజీవనంలో మధురానుభూతులకు చోటేలేదు. ఇకపోతే పేగు చీల్చుకుని పుట్టిన బాబు.. వాడెక్కడున్నాడో? వాడి తాతగారు, నానమ్మల దగ్గర ఉండి ఉంటాడు. వాళ్ళు వేణు దగ్గర ఉండిపోయే అవకాశం లేదు కాబట్టి అప్పుడప్పుడు వేణూనే వెళ్ళి వాడితో గడిపి వస్తున్నాడేమో. తను వేణుకి ఎదురుపడే అవకాశమే లేదు. హెడ్ క్వార్టర్స్‌లో పని కాగానే తిరిగి రైల్లో బస్సో ఎక్కి వెనక్కి వచ్చేస్తుంది. మళ్ళీ ఏ ఊరు వెళ్ళాల్సి ఉంటుందో. ఎక్కడికి వెళ్ళినా వేణుని కానీ, అతని తల్లి, తండ్రులను కానీ కలిసే ప్రసక్తి లేదు. ఇకపోతే బాబు.. వాడిని చూడాలన్న ఆరాటం తనకి లేదు, కాకపోతే వాడిని వదిలేసి వచ్చినందుకు మాత్రం అప్పుడప్పుడు బాధ కలుగుతుంది. కానీ తప్పదు.

ఇంకెవరున్నారు? మాధవి? మాధవి ఉద్యోగం చేస్తోందో, మానేసిందో..

అతను ఉండి ఉంటాడా? ఇంకెక్కడికైనా వెళ్ళాడేమో అతను కానీ, మళ్ళీ కనిపించడుకదా. మానుతున్న గాయం మీద కారం చల్లినట్టు అతను కనక కనిపిస్తే తను ఖచ్చితంగా డిస్టర్బ్ అవుతుంది. భగవంతుడా అతను మాత్రం కనిపించకూడదు. ఎప్పుడు కలిసినా తన ప్రమేయం లేకుండా, ఎటువంటి ప్రయత్నాలు లేకుండా, అసలు పరిచయమేలేని వ్యక్తి ఎందుకు పదే, పదే కనిపించేవాడో ఇప్పటికీ ఒక పజిల్. నేరుగా తన బాస్‌గా కనిపించడం మరో పెద్ద పజిల్. అసలు అతని పేరేంటి? ఊరేంటి? వివరాలేంటి? పెళ్ళయిందా? అతను తనని ప్రేమించాడా? ఇష్టపడ్డాడా? తనలాగే అతను కూడా అనుకోని కలయికలకి ఆశ్చర్యపోయాడా? ఎందుకిలా జరుగుతోందని ఆలోచించాడా? అసలిప్పుడు ఎక్కడున్నాడు, అతనెవరు? మనసంతా వికలమైపోయింది. హఠాత్తుగా భవిష్యత్తు శూన్యంగా అనిపించింది.

"ఎక్స్‌క్యూజ్ మీ.."

అర్చన ఆలోచనల్లోంచి తేరుకుని తలతిప్పి చూసింది.

పాతికేళ్ళ యువతి ఎదురుగా నిలబడి ఉంది. చేతిలో సూట్ కేస్ భుజానికి హ్యాండ్ బ్యాగ్.

"కొంచెం జరిగితే సూట్ కేస్ పెట్టుకుంటాను" అంది.

అర్చన కాళ్ళు దగ్గరకి లాక్కుంది.

ఆ అమ్మాయి ఒంగి సూట్ కేసు సీటుకిందకి తోసి హమ్మయ్య అంటూ సీటులో కూర్చుంది.

"మీరు హైదరాబాదేనా?" అడిగింది.

అవునన్నట్టు తలూపింది అర్చన.

"నేనూ హైదరాబాదేనండి నాకు గ్రూప్ ఒన్ ఎగ్జామ్స్‌లో అలాట్ మెట్ వచ్చింది. సెక్రెటేరియట్‌లో రిపోర్టు చేయాలి."

అర్చన కళ్ళు సంభ్రమంతో విచ్చుకున్నాయి. "అరే నేనూ అంతే. నేను కూడా రిపోర్టు చేయడానికే వెళ్తున్నాను."

"ఓ అలాగా. గ్లాడ్ టు మీట్ యు. నా పేరు గాయత్రి. మీరు"

"నా పేరు అర్చన"

"అబ్బ. చాలా హ్యాపీగా ఉంది అర్చనా..! ఒక్కదాన్ని నాకేం తెలియదు. ఏం చేయాలా అని ఆలోచిస్తూ బయల్దేరాను."

"నేనూ అంతే" నవ్వింది అర్చన. కాసేపట్లో ఇద్దరూ కబుర్లలో పడిపోయారు. వాళ్ళు కబుర్లలో ఉండగానే రైలు కదిలింది.

ప్రీతికి హైదరాబాదులో హైటెక్ సిటీలో ఉద్యోగం సంపాదించింది మాధవి. ప్రీతిని ఎలాగైనా హైదరాబాదు పిలిపించాలన్న ఆమె కోరిక నెరవేరింది. "వచ్చాక వెతుక్కుంటుందిలే పిన్నీ.. పంపించెయ్ నాకూ బోర్‌గా ఉంది. ప్రీతి తోడుగా ఉంటుంది" అని ఎంత బతిమాలినా, శైలజ మాత్రం "ముందు ఉద్యోగం దొరకనీవే. అలాగే పంపిస్తాను. అట్నుంచి అటే పెళ్ళి చేసి పంపించేద్దువుగాని" అని ఉద్యోగం దొరికిందాకా పంపలేదు. మాధవి, శేఖర్ సాయంతో ప్రీతికి సాఫ్ట్‌వేర్ ఇంజనీరుగా ఉద్యోగం వెతికి పెట్టింది. త్వరగానే దొరికింది.

ఆరోజే ప్రీతీ వచ్చే రోజు. శుక్రవారం. ఉదయాన్నే ఆరింటికే వచ్చేస్తుంది బస్సు. చక్రవర్తి డిపోకి వెళ్ళి ప్రీతిని పికప్ చేసుకున్నాడు.

సన్నగా, నాజూగ్గా ఉంది. చుడీ మీద షార్ట్ వేసుకుంది. పొట్టి జుట్టు క్లిప్ పెట్టి వదిలేసింది. చున్నీ మెడకు వేసుకుంది. డ్రస్ పూర్తిగా ఫిగర్ కనిపించేలా ఫిట్టింగ్ ఒకచేతికి బ్రేస్‌లెట్, మెడలో సన్నటి గొలుసు గొంతువరకే ఉంది. దానికో చిన్న లాకెట్. చెవులకి చిన్న, టాప్స్. పాయింటెడ్ షూస్.

ఆ అమ్మాయి దగ్గరగా వెళ్ళి అనుమానంగా పిలిచాడు "ప్రీతీ..!"

చటుక్కున చూసి నవ్వింది. "హాయ్ బావగారూ ఎలా ఉన్నారు?" అంటూ పలకరించి చనువుగా కారులో చక్రవర్తి పక్కనే కూర్చుని "మిమ్మల్ని పెళ్ళిలో చూశానంతే. నేనప్పుడు టెన్త్‌లో ఉన్నాను. మీరు నన్నసలు గుర్తుపట్టరేమో అనుకున్నా. ఫర్వాలేదే" గబ, గబా మాట్లాడుతూ దారిపొడుగునా తన కాలేజీ కబుర్లు, ఉద్యోగం కబుర్లు తెగ చెప్పేసింది. తనకి హైదరాబాదులో ఉద్యోగం చూపించినందుకు బోలెడన్ని థాంక్స్ కూడా చెప్పింది. ఆ అమ్మాయి చెలాకీతనం, మాటకారితనం చూశాక మాధవి అంచనా తప్పుకాదని, త్వరలోనే వేణుని బుట్టలో వేసేయగలదని అనిపించింది చక్రవర్తికి.

కారు ఇంటిముందు ఆగింది. తన సూట్‌కేసు కారులోనే వదిలేసి, హ్యాండ్ బాగ్ మాత్రం తీసుకుని లోపలికి పరిగెత్తింది. గుమ్మంలోనే ఎదురొచ్చిన మాధవిని కావలించేసుకుని "బాగున్నావా అక్కా?" అంటూ పలకరించింది.

"ఏడీ నీ కొడుకు? నాకు మంచి కాఫీ ఇస్తావా తలనొప్పిగా ఉంది." గబ, గబా మాట్లాడేస్తూ, సమాధానం కోసం చూడకుండా ఇల్లంతా తిరిగేస్తున్న ప్రీతివైపు మురిపెంగా చూస్తూ 'ఎలా ఉంది?' అన్నట్టు కళ్ళెగరేస్తూ చక్రవర్తివైపు చూసింది మాధవి. చక్రవర్తి 'గుడ్' అన్నట్టుగా బొటనవేలు చూపించి నవ్వాడు.

ఒక రౌండ్ ఇల్లంతా చూసి మాధవి వైపు చూస్తూ "బావగారు చాలా మంచివారు" అంది ప్రీతి.

"ఏంటో ఆయన మంచితనం అప్పుడే ఏం చూశావు?" నవ్వింది మాధవి.

"చిన్న మెతుకు ముట్టుకున్నా అన్నం పూర్తిగా ఉడికిందో లేదో చెప్పేయచ్చుకదా. అది సరేగానీ నిజంగా నాకు జాబ్ చూశావా? అమ్మకలా చెప్పి పిలిపించావా?"

"ఎందుకే అంత అపనమ్మకం. నిజంగానే దొరికింది నీకు జాబ్. సోమవారం వెళ్ళగానే అపాయింట్‌మెంట్ ఆర్డర్ ఇస్తారు. సరేనా?" నమ్మకంగా చెప్పింది మాధవి.

"థాంక్స్ అక్కా. నాకు హైదరాబాదులో జాబ్ రావాలని చాలా కోరిక ఉండింది. మా నాన్న పడనివ్వలేదు. నీకు చాలా, చాలా థాంక్స్. నాకోరిక తీర్చావు" అంది కృతజ్ఞతగా.

"ఇంకేం నీ కోరిక, నా కోరికా కూడా తీరాయిలే. వెళ్ళు ఫ్రెష్ అయిరా. మంచి కాఫీ ఇస్తాను" అంటూ ఆమె చేతిలో హాండ్ బ్యాగ్ అందుకుని గోడకున్న హ్యాంగర్ హోల్డర్‌కి తగిలిస్తూ అంది మాధవి. "హాయిగా ఇవాళ రెస్ట్ తీసుకో. రేపు ఎటన్నా సరదాగా తిరిగి వద్దాం. సోమవారం జాయిన్ అవుదువుగాని."

"ష్యూర్.. థాంక్యూ" అంటూ సూట్‌కేస్ తెరిచి టవల్, నైటీ తీసుకుని వెళ్ళిపోయింది

మాధవి బాత్ రూము చూపించి, పేస్టు, నీళ్ళు ఇవ్వడానికి ప్రీతి వెనకాలే వెళ్ళింది.

చక్రవర్తి పనిపిల్లాడితో ప్రీతి సూట్‌కేస్ లోపల ఆమెకి కేటాయించిన గదిలో పెట్టించాడు.

ప్రీతిని స్నానానికి పంపించి వచ్చింది మాధవి. చక్రవర్తిని చూసి "ఎలా ఉంది?" అంది.

"అమ్మాయికేం? చూడముచ్చటగా ఉంది. కానీ, వేణు కుటుంబంలో కలిసిపోతుందా అనేదే అనుమానం."

"ఎందుకో?"

"ఆమె డ్రెస్, ఓవర్ యాక్టివినెస్ చూస్తుంటే అనిపిస్తోంది."

"చక్కగా సరిపోతుంది. మీరేం వర్రీ అవకండి." హామీ ఇస్తున్నట్టుగా అని కౌశిక్ ఏడుపు విని బెడ్ రూములోకి పరిగెత్తింది.

నిద్ర లేచి, కూర్చుని ఏడుపు మొదలెట్టాడు కౌశిక్. వాడినెత్తుకుని లాలిస్తూ "ఎందుకురా అప్పుడే లేచావు? సరేలే పిన్ని వచ్చింది చూపిస్తారా. మనం బ్రష్ చేసుకుని, పాలు తాగి పిన్నితో ఆడుకుందామా?" అంటూ వాడితో కబుర్లు చెబుతూ హాల్లోకి వచ్చిన మాధవి, స్నానం పూర్తి చేసుకుని చుడీదార్‌తో కనిపించిన ప్రీతివైపు తృప్తిగా చూసింది.

"ఇడుగో నా కొడుకు" అంటూ కౌశిక్‌ని చూపించింది.

ప్రీతి "హాయ్" అంటూ చెయి చాచింది. నిద్రమత్తు పూర్తిగా వదలని కౌశిక్ ఏడుపు మొహం పెట్టి మాధవిని హత్తుకుపోయాడు.

"రారా. నేను పిన్నిని" అంది దబాయింపుగా ప్రీతి.

"వెళ్తావా? పిన్ని" అంది మాధవి వాడి బుగ్గ నిమురుతూ.

అడ్డంగా తల ఊపి ఆమె భుజం మీద వాలిపోయాడు కౌశిక్

"సర్లె.. కాస్సేపయాక వాడే వస్తాడు. పద కాఫీ తాగుదువుగాని" అంటూ కిచెన్ వైపు దారి తీసింది మాధవి. ఆమెని అనుసరించింది ప్రీతి.

వెనకాలే వస్తున్న ప్రీతిని మాధవి భుజం మీదనుంచి తొంగి చూస్తున్నాడు కౌశిక్. "పిలిస్తే రాకుండా ఏంటిరా దొంగచూపులు చూస్తున్నావు? అన్నీ వెధవ బుద్దులే.. మగ బుద్దులు" అంది ప్రీతి.

"ఏంటే పసివాడ్ని దులిపేస్తున్నావు?" చిరుకోపంగా అంది మాధవి.

"పసివాడైనా, ముసలాడైనా మగాడు, మగాడే"

"నీకు మగాళ్ళంటే ఏదో కసి ఉన్నట్టుంది."

"చాలా.." కోపంగా అంది ప్రీతి.

మాధవి పూర్తిగా ప్రీతివైపు తిరిగి ఆశ్చర్యంగా అడిగింది "ఎందుకు?"

"ఎందుకేంటి? ప్రతిదానికీ కాంపిటీషన్‌కి వస్తారు" కోపంగా అంది ప్రీతి.

ఆ అన్న తీరుకి గట్టిగా నవ్వి కౌశిక్‌ని ప్రీతి చేతికిస్తూ "వాళ్ళు అలాగే అనుకుంటున్నారు అమ్మాయిల గురించి. ఎత్తుకో వీడ్ని.. కాఫీ కలుపుతాను" అంది.

ప్రీతి చేతుల్లోకి మారిన కౌశిక్ ఏడుపు లంకించుకున్నాడు. "ఏడవకురా. నీకు చాక్లెట్ కొనిస్తాను." అంటూ భుజాన వేసుకుని వంటగదిలోంచి డైనింగ్ హాల్లోకి తిరుగుతూ అవీ, ఇవీ చూపిస్తూ వాడిని ఓదార్చే ప్రయత్నం చేయసాగింది ప్రీతి. మాధవి ఐదు నిమిషాల్లో పొగలు కక్కుతున్న కాఫీ అందిస్తూ. "ఇలా ఇవ్వు" అంటూ కౌశిక్‌ని అందుకుంది. ప్రీతి కాఫీ గ్లాసు చేతికి తీసుకుని డైనింగ్ టేబుల్ దగ్గరున్న కుర్చీలో కూర్చుంది.

"వీడికి మొహం కడిగించి వస్తాను" అంటూ మాధవి వాష్ బేసిన్ దగ్గరకు వెళ్ళింది.

పొందిగ్గా, నీటుగా ఎక్కడే వస్తువు ఉండాలో స్కెచ్ గీసినట్టు అందంగా పేర్చుకున్న ఫ్రిజ్, మైక్రో ఓవెన్, వెట్ గ్రైండర్, కాబినెట్లు చూస్తూ గట్టిగా అంది ప్రీతి. "అక్కా మీ ఇల్లు చాల బాగుంది. నీటుగా పెట్టుకున్నావు. మా అమ్మ అయితే అన్నీ చేతికి అందేలాగా చుట్టూ పెట్టుకుని వంట చేస్తుంది. నాకు చాలా చికాకు.. తెలుసా?"

మాధవి టవల్‌తో కౌశిక్ మొహం తుడుస్తూ వచ్చి, వాడ్ని డైనింగ్ టేబుల్ మీద కుర్చోపెట్టి, గాజు మగ్‌లో ఉన్న నీళ్ళు గ్లాసులో పోసి వాడికి మంచి నీళ్ళు తాగించింది.

అక్కడే ఉన్న కాబినెట్ లోంచి ఒక ప్లాస్టిక్ డబ్బా తీసి, బౌల్‌లో చాకోస్ వేసి వాడి ముందు పెట్టింది.

"పోనీలే పాపం పిన్ని ఒక్కతే చేసుకోవాలి కదా" అంటూ కిచెన్‌లోకి వెళ్ళి గ్లాసులో పాలుపోసి, అందులో కాంప్లాన్ కలిపి తీసుకొచ్చింది.

"వీడు కాంప్లాన్ బాయా?" కాఫీ తాగడం పూర్తిచేసి కప్పు టేబుల్ మీద పెట్టి కౌశిక్ బుగ్గ గిల్లింది ప్రీతి.

మాధవి నవ్వింది. "ఇవాళ ఎక్కడికన్నా వెళదాం వస్తావా?" అడిగింది.

"నీ ఇష్టం .. నువ్వెక్కడికంటే అక్కడికి."

"ఓ.కె. లంచ్ అయాక నా ఫ్రెండ్ వాళ్ళున్నారు. అక్కడికి వెడదాం.. వాళ్ళు కూడా వస్తే అందరం కలిసి శిల్పారామం వెళ్ళొద్దాం."

"ఓ. థాంక్యూ నాక్కూడా ఎప్పటినుంచో శిల్పారామం చూడాలని కోరిక." హుషారుగా అంది ప్రీతి.

"ఓ.కే" అంటూ చక్రవర్తిని పిలిచి అప్పటికప్పుడే మధ్యాహ్నం లంచ్ తరువాత వేణు ఇంటికి వెళ్ళి అందరూ కలిసి శిల్పారామం వెళ్ళడానికి నిర్ణయించేసింది మాధవి.

ఆమె పని తీరు, మాటలు, కౌశిక్‌ని పెంచుతున్న విధనం, నిర్ణయాలు తీసుకోడంలో ఆమె చూపిస్తున్న నేర్పు అన్ని పరిశీలిస్తూ .. అక్క దగ్గర చాలా నేర్చుకోవాలి అనుకుంది ప్రీతి.

●●●

అర్చన జీవితంలో మరో అధ్యాయం మొదలైంది. ఉద్యోగస్తురాలిగా జీవితం ప్రారంభం అయింది.

హైదరాబాదు నుంచి నేరుగా వచ్చి మచిలీపట్నంలో కలెక్టర్‌కి రిపోర్టు చేసింది. అతను చిన్నవాడే మంచివాడు ఎంతో మర్యాదగా, స్నేహంగా మాట్లాడాడు. గుడివాడలో వి.ఆర్.వో ట్రైనింగ్‌కి పంపించాడు.

డైరెక్ట్‌గా పోస్టింగ్ ఇస్తే బాగుండేది. మళ్ళీ ఈ ట్రైనింగులు ఏంటో.. ట్రైనింగ్ అవసరమా అనిపించింది ముందు కానీ, ఒక్కొక్కటే తెలుసుకుంటూంటే ఎంతో నేర్చుకోవాలికదా. అనిపిస్తోంది. తహసీల్దారు కూడా మంచివాడే స్నేహంగా ఉంటున్నాడు."ఇంతటితో ట్రైనింగ్ అయిపోయింది అనుకోకండి. చాలా ఉంటాయి." అంటూ అర్చన భయం గమనించి కొద్దిగా ఆటపట్టించాడు.

నవ్వేసింది అర్చన. "మంచిదే కదండీ. అనుభవజ్ఞుల ద్వారా శిక్షణ పొందితే నేను పర్ఫెక్ట్ కలెక్టర్‌ని అవుతాను" అంది.

"అవుతారు లెండి. మీరు చాల షార్ప్" అన్నాడు.

"థాంక్యూ" అని నవ్వేసింది. అలా అన్నదే కానీ మనసులో కొంచెం దిగులు మొదలైంది. ఇక నుంచీ ఊరూరూ తిరగాలేమో బదిలీలు, ట్రైనింగులు అంటూ ఎక్కడికి వెళితే ఎవరు ఎదురవుతారో అని భయం వేస్తోంది. ఎవరు ఎదురైనా మానిపోతున్న పుండుని ఏదో రకంగా కెలకడమే జరుగుతుంది అలా జరిగితే తను తన ఉద్యోగానికి న్యాయం చేయలేదు. ఏ ఆందోళనా లేకుండా ప్రశాంతంగా, నిశ్చింతగా ఈ ఉద్యోగంలో అంచెలంచెలుగా ఎదిగి ఏనాటికైన ఐఏయస్ అనిపించుకోవాలి. యస్ తప్పకుండా అనిపించుకుంటా.

అలా అలా అనుకున్నాక అర్చనకి చాలా హాయిగా అనిపించింది.

అర్చన ఐ ఏ యస్. ఎంత బాగుంటుంది. ఎప్పటికి వస్తుందా రోజు? వెంకటేశ్వరస్వామికి మనసారా నమస్కరిస్తూ అనుకుంది. "దేవుడా త్వరగా రావాలి ఆ రోజు. త్వరగా..!"

అర్చనకి క్వార్టర్స్, ప్రభుత్వ వాహనం ఏర్పాటు చేశారు.

మూడు నెల్లుకాలా. అప్పుడే మూడు ఊళ్ళు తిరిగింది. గుడివాడలో ప్రస్తుతం వి.ఆర్.వో ట్రైనింగ్‌లో ఉంది.

మొదటి రోజు మచిలీపట్నం రోడ్ల మీద తిరుగుతోంటే అణువణువూ తమాషాగా స్పందించింది. మచిలీపట్నానికి ఓ చరిత్ర ఉంది. ఆంధ్రదేశ చరిత్రలో ఓ ప్రాధాన్యత ఉంది. అయితే, మొదటిసారి చూసినప్పుడు అనిపించింది. సుదీర్ఘమైన చరిత్ర కలిగిన ఊరు ఇలా ఉందేం. ఈ మచిలీపట్నం మూడవ శతాబ్దం నాటికే ఏర్పడిందంటారు. ఇంకా అప్పటిలాగే ఉంది. ఇంతకన్నా బాగు చేయలేరా.

ఫ్రెంచి, డచ్, బ్రిటిష్ వారు ఆంధ్రప్రదేశ్‌లో మొదటగా వాళ్ళ వ్యాపార కార్యకలాపాలు సాగించింది ఇక్కడినుంచే..

మచిలీపట్నం పెద్ద రేవు పట్టణం. మచిలీపట్నం అంటే మచిలి కమాన్ అని పిలిచేవారట. చేపల పట్నం సముద్రం దగ్గరకి వెళితే అంతా చేపల కంపేనేమో. దీన్నే బందరు అంటారు. బందరు లడ్డు. అమ్మ ఎంత బాగా చేసేది.

తల్లి గుర్తుకు రాగానే కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. ఎంత నిర్దయ వాళ్ళకి నా సుఖం కన్నా పరువు, మర్యాదలే ముఖ్యం కాబోలు. గుండె బరువెక్కింది. నిజం చెప్పాలంటే ఇవాళ ఎంత శుభదినం. కూతురు భవిష్యత్తులో కలెక్టర్ అవుతుంది. ఒక మంచి హోదాలో ఉద్యోగం చేయబోతోంది. వాళ్ళకెంత గర్వకారణం. మగపిల్లాడినైతే నువ్వు బాగా చదువుకుని పెద్ద ఉద్యోగం చేసి మనింటిపేరు, నాన్నగారి పేరు నిలబెట్టరా నాన్నా అంటారు. ఆడపిల్లల్ని మాత్రం అణవుకుగా, మర్యాదగా ఉంటూ, అత్తగారింట్లో బుద్ధిగా ఉంటూ, భర్త ఏమన్నా ఎదురు చెప్పకుండా పుట్టింటి పరువు నిలబెట్టు అంటారు. ఎందుకీ తేడా? ఆడపిల్లగా తను ఎదిగిన తీరు, తన హోదా, రేపు ఈ సమాజంలో, తనని చూసి నవ్విన ఈ సమాజంలో, తనని అవహేళన చేసిన ఈ సమాజంలో తనొక పెద్ద ఆఫీసర్‌గా తిరుగుతుంది. వీళ్ళంతా రేపట్నించీ తన అడుగులకు మడుగులొత్తుతారు. ఇప్పుడు తను ఆ వెధవ నాగరాజుని ఏమైనా చేయచ్చు. తనకి కొద్ది రోజుల్లో పవర్స్ వస్తాయి. పవర్ ఫుల్ లేడీ. ఇది ఏ తల్లీతండ్రికైనా ఎంత గర్వకారణం. కానీ ఏం జరుగుతోంది? వాళ్ళింటినుంచి, వాళ్ళ కుటుంబం నుంచీ, ఆఖరికి వాళ్ళ జీవితాలనుంచే తనని వెలేశారు. చాలా అన్యాయం. చాలా అన్యాయం భగవాన్. నేనీ అన్యాయం సహించలేను. బాధగా అనుకుంది.

నువ్వు సహించినా, సహించకపోయినా ఇంతే నీ జీవితం అని ఎవరో ఛెళ్ళున చరిచి చెప్పినట్టు అనిపించింది. నిట్టూర్చింది.

చలికాలం మొదలైందేమో చల్లటి గాలి విసురుగా తగులుతోంది. కొంగు భుజం చుట్టూ కప్పుకుంది.

కృష్ణాజిల్లా గుడివాడ కూడా బాగుంది. ఎందుకో తెలియదు కానీ, ఆ ఊళ్ళో తిరుగుతోంటే ఊరు మీద తెలియని మమకారం కలుగుతోంది. ఏదో తెలియని చిన్న పులకింత, అనిర్వచనీయమైన మధురానుభూతి ఆమె ఆలోచనల్లో ఉండగానే కారు క్వార్టర్స్ ముందు ఆగింది. అర్చన కారు దిగి లోపలికి నడిచింది. వెనకాలే డ్రైవర్ తన ఫైల్ బ్యాగ్ పట్టుకుని వస్తుంటే గర్వంగా అనిపించింది.

●●●

అనుకున్న ప్రకారం వెంటనే కాకపోయినా కొంచెం ఆలస్యంగా వేణు, చక్రవర్తి వెళ్ళి వేణు ఇంటి ఓనర్‌ని కలిశారు. ఇల్లు అమ్మే ప్లాన్‌లో అతనుండడం  వలన కొంచెం ఫెక్సిబుల్ గానే మాట్లాడాడు అతను. దాదాపు గంటసేపు రకరకాల చర్చలు జరిగాక రేటు ఫిక్స్ అయింది. అతను చెప్పిన ధర తాలూకు డబ్బు వేణుకి తప్పకుండా లోన్ వస్తుందని చెప్పాడు చక్రవర్తి. త్వరలోనే నిర్ణయం చెప్పేస్తామని ఆయనతో చెప్పి బైటికి నడిచారు చక్రవర్తి, వేణు. చక్రవర్తి కారులో ఇద్దరూ వేణు ఇంటికి వెళ్ళారు. వెళ్ళగానే తల్లికి, ఫోన్‌లో తండ్రికి విషయం వివరించాడు వేణు. తన ఊళ్ళో ఉన్న ఇల్లంత విశాలంగా లేకపోయినా, పట్నంలో ఇలాంటి ఇల్లు దొరకడం అదృష్టంగా భావించిన తాయారమ్మకి కొడుకు తీసుకున్న నిర్ణయం నచ్చింది. వెంటనే తాను కూడా ఫోన్‌లో భర్తతో తన హర్షాన్ని ప్రకటించింది.

"నలభైలక్షలు లోను ఎందుకురా నాన్నా. ఇరవై తీసుకో మిగతాది నేను సర్దుతాను" అన్నాడు కృష్ణస్వామి. వేణుకి ఆయన ప్రపోజల్ బాధాకరంగా అనిపించినా చక్రవర్తి కన్విన్స్ చేయడంతో ఒప్పుకున్నాడు.

మంచిరోజని అదే రోజు సాయంత్రం ఇద్దరూ కలిసి వెళ్ళి ఓనర్ కి రెండు లక్షలు అడ్వాన్స్ ఇచ్చి అగ్రిమెంటు రాసుకున్నారు.

ఆ సందర్భం పురస్కరించుకుని "రాత్రి డిన్నర్ బైట చేద్దాం" అంది మాధవి.

వేణు అంగీకరించాడు.

తల్లికి తాను డిన్నర్‌కి రానని చెప్పి మాధవి కుటుంబంతో కలిసి ఇన్‌ఆర్బిట్ మాల్‌కి వెళ్ళాడు వేణు. ప్రీతి ఉద్యోగంలో జాయిన్ అయి నెలరోజులవుతోంది. ప్రీతి వేణుతో స్నేహం కలిపేసింది. ఆ రోజు శిల్పారామం వెళ్ళినప్పుడే చాలా కబుర్లు చెప్పేసింది. ఆ అమ్మాయి కబుర్లు వేణుక్కూడా నచ్చాయి. ఆమెతో మాట్లాడుతుంటే హాయిగా అనిపించింది. త్వరలోనే ఇద్దరూ మంచి స్నేహితులయిపోయారు. మధ్య, మధ్య రెండు సార్లు ఫోన్‌లో కూడా మాట్లాడుకున్నా, ఆ రోజు తర్వాత ఇవాళే మళ్ళీ కలవడం.

"కంగ్రాట్స్ వేణూ." షేక్ హ్యాండిస్తూ అభినందించింది ప్రీతి.

"థాంక్యూ." నవ్వుతూ చెప్పాడు వేణు.

మాధవి వాళ్ళిద్దరినీ మరోసారి కలపాలని అనుకున్నా తొందరపడకుండా అవకాశం కోసం ఎదురుచూసింది. ఆ అవకాశం ఈనాడు కల్పించింది. వాళ్ళిద్దరినీ కలపడం కోసమే డిన్నర్ ప్రపోజల్ పెట్టింది. ఇంతకన్నా మంచి సమయం ఏం ఉంది అనిపించింది మాధవికి.

చక్రవర్తి డ్రైవింగ్ సీట్లో, అతని పక్కన ఒళ్ళో కౌశిక్‌తో మాధవి, వెనకసీట్లో ప్రీతి, వేణు కూర్చున్నారు కారు కదిలింది. ప్రీతి గలగలా నవ్వుతూ తన ఆఫీసు విషయాలు చెప్తోంటే సరదాగా వింటూ కూర్చున్నాడు వేణు. మధ్య మధ్య మాధవిని అక్కా ఆ విషయం తెలుసా ఈ సంగతి తెలుసా అంటూ కదుపుతున్నా మాధవి మాత్రం వాళ్ళ మాటల మధ్య ఎక్కువగా తను గానీ, చక్రవర్తిగానీ అడ్డు రాకుండా జాగ్రత్త పడింది.

"అవును గానీ, మీ ఊళ్ళో ఇంజినీరింగ్ సర్టిఫికెట్స్ ఎంతకిస్తారు?" అడిగింది ప్రీతి.

"ఎంతకివ్వడం ఏంటి?" చిత్రంగా చూశాడు వేణు.

"ఏం లేదు మా ఆఫీసులో నాకు కొలీగ్స్ ఇద్దరున్నారు. వాళ్ళకసలు నాలెడ్జి లేదు. ఖచ్చితంగా వాళ్ళిద్దరూ ఇంజినీరింగ్ సర్టిఫికెట్లు కొనుక్కున్నారని నా నమ్మకం."

వేణు నవ్వాడు. "ఏమో కావచ్చు" అన్నాడు.

"అసలేమీ రాదేంటి వేణూ. ఇంగ్లీషే రాదు. నేను చెబుతుంటే ఇగో అడ్డం వస్తుందేమో మాకు తెలుసు, మాకు తెలుసు అంటూ నన్నసలు నోరెత్తనివ్వరు. "

"పోనీ వాళ్ళ పనిలో నువ్వెందుకు ఇన్‌వాల్వ్ అవడం.."

"వాళ్ళ పనికాదు బాబూ. కంబైన్డ్ ప్రాజెక్ట్ వాళ్ళకేం రాదు. నన్ను చేయనివ్వరు. నా కసలు చిరాకొస్తోంది"

ఆమె మొహంలో కనిపించిన చిరాకు చూసి నవ్వాడు.

అలా వారి, వారి ఉద్యోగాల గురించి, చదువుల గురించి, విదేశాలకు వెళ్ళడానికి ఎదురవుతున్న సమస్యల గురించీ మాట్లాడుకుంటుంటే మాధవి వినీ, విననట్టు వింటూ మధ్య, మధ్య చక్రవర్తికి చూశావా నా తడాఖా అనే సందేశాలు పంపిస్తూ కూర్చుంది.

గంటన్నర తరువాత కారు జూబ్లీ హిల్స్ చేరింది. అక్కడి నుంచి మాల్ మరి కొంచెం దూరం. ట్రాఫిక్ ఆగిపోయింది. చక్రవర్తి ఇంజన్ ఆఫ్ చేసాడు.

"పాపం మీ ఊళ్ళో డెలివరీలన్నీ రోడ్ల మీదే అవుతాయేమో" అంది ప్రీతి.

ఆ మాట ఆమె ఎందుకందో తెలిసిన మాధవి నవ్వుతూ "నోరుముయ్యవే! వెధవ వాగుడూ నువ్వూనూ" అంది.

"వెధవ్వాగుడేంటక్కా. ఎప్పుడనగా బయల్దేరాం. ఈ లోపల నేను రెండుసార్లు విజయవాడ వెళ్ళివచ్చేదాన్ని బాప్‌రే ఇంత ట్రాఫిక్కా?"

అప్పుడే వెనక నుంచి అంబులెన్స్ హారన్ వినిపించడంతో చూశావా "నేనంటూనే ఉన్నా ఖచ్చితంగా అందులో డెలివరీ కేసే ఉండచ్చు" అంది ప్రీతి.

అంతలో గ్రీన్ సిగ్నల్ పడడంతో కారు కదిలింది. కొన్ని నిమిషాల్లోనే మాల్ ముందు ఆగింది.

●●●

**వేణు ఇంటికి మరమ్మత్తులు మొదలు పెట్టాడు.**

వంటగది తాయారమ్మకి అనుకూలంగా విశాలంగా చేయించాడు. ఈశాన్యంలో విడిగా పూజగది కట్టించాడు తండ్రికోసం.

రెండు పడకగదులను తన అభిరుచి మేరకు ఆధునికంగా చేయించాడు.

మేడమీద రెండు పడక గదులు, ఒక పెద్ద హాలు.

నీలవేణికి విడిగా మేడమిద ఒక గది అటాచ్‌డ్ బాత్ రూం కట్టించాడు.

మార్బుల్ ఫ్లోరింగ్, బాత్‌రూములో చక్కటి డిజైన్ ఉన్న టైల్స్, పూజగదిలో దేవుడి బొమ్మలున్న టైల్స్, వంటగదిలో గ్రైనేట్‌తో ప్లాట్‌ఫామ్, గోడలకి కాఫీ కప్పులున్న టైల్స్, వెనుక భాగంలో పెరట్లో వరసగా చెట్లు పెంచడానికి రెండు వరసలు తవ్వించి, చుట్టూ సిమెంటుతో గట్టులా కట్టించాడు. మిగతా భాగం బండలు వేయించాడు. పాత గేటు తీసేసి కొత్త గేటు పెట్టించాడు. అటు ఆధునిక సౌకర్యాలు, ఇటు సంప్రదాయ నగిషీలు అద్ది చూడగానే మనసు దోచేలా తయారైంది పాత ఇల్లు. రెండు లక్షలు బడ్జెట్ వేసుకుంటే అది నాలుగు లక్షలు దాటింది. వంటగదిలో, బెడ్ రూమ్స్‌లో రాక్స్, హాల్లో షోకేసు ఫాల్స్ సీలింగ్, లైట్లు ఆ ఇల్లు చూసి నీలవేణి మురిసిపోయింది.

" సినిమాల్లో ఇల్లులా ఉంది. ఎంత బాగా కట్టించారో వేణుబాబు. ఎంతైనా పట్నం బాబుకదా" అనుకుంది.

తాయారమ్మ ఆనందానికి పట్టపగ్గాల్లేకుండా అయింది.

బాబుకి మూడో ఏడు వచ్చేసింది. ఇల్లంతా తిరిగేస్తూ చిలకపలుకులు పలుకుతూ ఇంట్లో అందరి ఆనందానికి కేంద్రబిందువైనాడు.

కృష్ణస్వామి వేణుగోపాలస్వామి గుడిలో తన స్నేహితుడి కొడుకైన శ్రీధర సిద్ధాంతిని అర్చకుడిగా నియమించాడు. శ్రీధర సిద్ధాంతి తిరుపతి వేదపాఠశాలలో వేదాలు చదువుకుని వచ్చాడు. బుద్ధిమంతుడు. అర్చకుడిగా నియమించేముందు గుడి బరువు, బాధ్యతలే కాదు. గుడి అభివృద్ధికోసం కూడా పాటు పడాలని చెప్పాడు.

ఆ గుడి సుమారు 60 సంవత్సరాల క్రితం నాటిది. ఇంతవరకూ కృష్ణస్వామి కుటుంబం వారేగానీ, మరెవ్వరూ అర్చకులుగా చేయలేదు. అక్కడ వేణుగోపాలుడు వెలిశాడని అంటారు. పురాతన కాలంనాటి కట్టడం గర్భగుడి కూడా చాలా లోపలికి ప్రధాన ద్వారానికి నాలుగు అడుగులు లోపలికి ఉంటుంది. నల్లటి విగ్రహం గుడి ఆవరణలో వేపచెట్లు, రావి చెట్లు, మామిడి చెట్లు ఉంటాయి.

ఒక మర్రి చెట్టుకూడా బాగా కిందికి వేళ్ళాడే ఊడలతో ఉంటుంది. ధ్వజస్థంభంముందు పెద్ద తులసికోట ఉంటుంది. ఎంతటి అశాంతినైనా హరించి మనశ్శాంతిని ప్రసాదించే వాతావరణం అక్కడ నెలకొని ఉంటుంది.

భక్తులు హారతి పళ్ళెంలో, హుండీలో వేసే డబ్బు తప్ప మరో గుడినిధి అంటూ ఏమీలేదు. ఎవరు అర్చకులుగా ఉంటే వాళ్ళే ప్రసాదాలు చేసి నైవేద్యం పెడతారు. ఇప్పటిదాకా దేవుడి నైవేద్యానికి ఎలాంటి లోటూ జరగలేదు. ఇకముందు కూడా అలాంటి లోటు జరగకుండా చూడమని కన్నీళ్ళతో చెప్పిన కృష్ణస్వామికి చేతిలో చేయివేసి ప్రమాణం చేశాడు శ్రీధర సిద్ధాంతి. ఈ పవిత్రత ఎప్పటికీ ఇలాగే ఉంటుంది బాబాయ్ అన్నాడు.

ఆ గుడితో అనుబంధం తెంచుకుని వెళ్తుంటే ఆయన గుండె ముక్కలైనట్టు అనిపించింది. భగవంతుడితో ఉన్న అనుబంధం ఎక్కడున్నా అలాగే ఉంటుంది. కానీ, పిల్లలతో అనుబంధం దగ్గరగా ఉంటేనే ఉంటుందేమో అనిపించింది ఆయనకి. ప్రస్తుతానికి ఇల్లు మాత్రం తాళం వేసేసి, కొడుకు దగ్గరకు హైదరాబాదు బయలుదేరాడు.

కృష్ణస్వామి రాకతో ఆ ఇంటికి నిండుదనం వచ్చినట్టు అనిపించింది తాయారమ్మకి. ఇన్నాళ్ళూ భర్త అక్కడ ఏం తింటున్నాడో, ఏం చేస్తున్నాడో అని ప్రతి క్షణం దిగులుండేది. మనిషి కొడుకు దగ్గర ఉన్నా, మనసు మాత్రం భర్త చుట్టూ తిరుగుతుండేది. అరవై అయిదేళ్ళ వృద్ధుడిని జీవితంలో మొదటిసారిగా ఒక్కడినే ఒదిలి పెట్టడం నిజానికి ఎంతో బాధాకరమైన విషయం. కానీ, పరిస్థితులు ఆవిడని ఆయనకి దూరం చేశాయి. ఒక పసివాడిని, అందునా తన మనవడిని తల్లి లేని వాడిని, ఏ మాత్రం పిల్లల్ని పెంచే విషయంలో అనుభవం లేని కొడుకు దగ్గర వదిలి పెట్టి ఉండడం అంతకన్నా బాధాకరం అనిపించింది పోనీ నీలవేణిని ఇక్కడ ఉంచాలన్నా, అక్కడ ఉంచాలన్నా ఆ పిల్ల నిండు యవ్వనంలో ఉంది. ఏ క్షణంలో ఏం జరిగినా అందుకు తనే బాధ్యురాలు అవుతుంది. అటు భర్తమీదా, ఇటు కొడుకు మీదా నమ్మకం లేకకాదు. పరిస్థితుల మీద ఆవిడకి నమ్మకం లేదు. ఇప్పుడు ఆయన రావడంతో ఆవిడ ఆనందానికి అవధుల్లేకుండా ఉంది.

ఊళ్ళో ఉన్నన్ని రోజులూ పసివాడి ఆటలు, పాటలు, ముద్దుమాటలూ ఫోన్‌లో వినిపిస్తూ ఉంటే ఆయన హృదయం మనవడి పట్ల వాత్సల్యాభిమానాలతో నిండిపోయింది. ప్రతిక్షణం వాడిని ఎప్పుడెప్పుడు చూస్తానా, వాడితో ఎప్పుడెప్పుడూ దగ్గర ఉండి ఆడుకుంటానా, ఎప్పుడు వాడిని గుండెలకు హత్తుకుని పడుకోవాలా, వాడి చిటికెన వేలు పట్టుకుని షికారు తీసుకెళ్ళాలా అని తహ తహ లాడిన కృష్ణస్వామికి ఇప్పుడు మనవడి స్పర్శ చిన్నికృష్ణుడి స్పర్శగా అనిపిస్తోంది. ఆ వేణుగోపాలుడు ఈ పసివాడి రూపంలో తన ఒడిలో కూర్చుని ఉన్నట్టుగా భావించి పారవశ్యం పొందసాగాడు.

ఇప్పుడు ఆ దంపతులకి పసివాడే ప్రాణం. వాడే లోకం. వాడు అల్లరి చేసినా, ఇంట్లో ఏం పాడు చేసినా ఏమీ అనరు. నవ్వుతూ చుస్తుంటారు.

వేణు ఇంట్లో ఉన్నంతసేపూ అతని సెల్‌ఫోన్ రిత్విక్ చేతుల్లోనే ఉంటూంది. ఆ ఫోన్ చెవికానించుకుని, " తాతా, తాతా" అంటూ వాడేవో కబుర్లు చెప్పేస్తుంటే మురిసి మురిసి చూశారు. అలామాట్లాడుతూనే మాటలు పాటల కిందకి మార్చి రాగాలు తీస్తూ సెల్ కుడిచేత్తో పట్టుకుని నేలకేసి కొడుతు ఆడుకుంటూ, ఆడుకుంటూ ఓ శుభముహూర్తంలో ఫోన్ బద్దలు కొట్టేసాడు.

అది చూసి కెవ్వున అరిచాడు వేణు. ఆ అరుపుకి బెదిరిపోయిన రిత్విక్ గట్టిగా ఏడుపు మొదలుపెట్టాడు. పదివేల రూపాయల సెల్ నాశనం. వేణు ముందు మండిపడ్డా వాడి ఏడుపు చూసి ఖంగారు పడ్డాడు.

"తల్లీ, తండ్రీ వాడికేం తెలుసురా. వాడికి అందేలా పెట్టడం నీదే తప్పు" అంటూ తననే నిందించేసరికి మౌనంగా ఉండిపోయాడు. అయితే, మనసులో మాత్రం ఎక్కడో ఓ మూల వాడి ఆటలకి ఆనందం మాత్రం చిందులేసింది.

ఇల్లు మరమ్మత్తు పనులు, ఎప్పటికప్పుడు శుభ్రం చేయడం, పెరట్లో వాకిట్లో ఊడ్చుకోడం క్షణం ఖాళీ ఉండడంలేదు. రిత్విక్‌ని పూర్తిగా కృష్ణస్వామి, తాయారమ్మ దంపతులే చూసుకుంటున్నారు. ఇల్లు పెద్దదవడం, కన్‌స్ట్రక్షన్ పని వలన కలిగే ఇబ్బందులు, అదనపు పనులు ఆమెకి పని బాగా పెరిగింది.

అది గమనించిన తాయారమ్మ వేణుకి చెప్పింది మరో మనిషిని చూడమని.

త్వరలోనే మరో పనిమనిషిని కూడా పెట్టేశాడు వేణు.

నాలుగైదు నెలలు గడిచి ఇల్లు పూర్తయింది.

గృహప్రవేశానికి ముహూర్తం చూశాడు కృష్ణస్వామి, వసంత పంచమి, గురువారం. అద్భుతంగా ఉంది. అప్పటిదాకా సరైన ముహూర్తాలు కనిపించలేదు.

ఆరోజు మాధవి వచ్చింది. కౌశిక్‌ని తీసుకుని వచ్చిన మాధవిని మనసారా ఆహ్వానించింది తాయాతమ్మ. "రామ్మా రా కులాసానా" అంటూ చేతులు చాచి కౌశిక్‌ని అందుకుంది.

" అమ్మమ్మా" అంటూ కౌశిక్ ఆవిడ కళ్ళజోడు తీయబోతుంటే " నా తండ్రిగా దీని జోలికి రాకురా" అంటూ మేడమీద ఉన్న నీలవేణికి వినిపించేలా కొంచెం గట్టిగా అంది " నీలవేణీ బాబుని తీసుకురా వాడి స్నేహితుడొచ్చాడు ఆడుకుంటాడు. "

" వస్తున్నానమ్మా" నీలవేణి రిత్విక్‌ని ఎత్తుకుని కిందికి దిగింది.

మాధవిని చూసి నవ్వుతూ దగ్గరగా వచ్చి " బాగున్నారా అక్కా" అంటూ పలకరించింది.

మాధవి రిత్విక్‌ని ఎత్తుకుని కాస్సేపు ఎగరేసి, ఆడి, ముద్దు పెట్టుకుని నీలవేణి చేతికిచ్చి, వాళ్ళిద్దరి ముందు బొమ్మలు పడేసి " వెళ్ళి పని చూసుకో వాళ్ళే ఆడుకుంటారు" అంది.

" నేనున్నాగా తల్లీ. ఆడించడానికి" అంటూ వచ్చిన కృష్ణస్వామికి నమస్కరించింది.

" దీర్ఘసుమంగళీభవ" అంటూ కులాసానామ్మా. అడిగాడాయన.

" ఆ... మాకేం మేము కులాసానే బాబాయ్ గారూ. మీరెలా ఉన్నారు? " అడిగింది.

" నా మనవడితో ఆడుకుంటుంటే వయసు ఓ పదేళ్ళు తగ్గినట్టుందమ్మా" అన్నాడాయన.

నవ్వింది మాధవి.

తలతిప్పి ఇల్లంతా కలయ చూస్తూ, " ఇల్లు చాలా బాగుంది పిన్నిగారూ. కొత్త ఇంట్లో సాధారణంగా వచ్చే చక్కటి పరిమళం వస్తోంది" అంది.

" అవునమ్మా నా కొడుకు దగ్గరుండి పర్యవేక్షిస్తున్నాడు" అందావిడ.

" అదృష్టవంతులు మీరు. ఒక్కడైనా బంగారంలాంటి కొడుకు" అంది మాధవి.

కృష్ణస్వామి పిల్లలిద్దరినీ తీసుకుని హాల్లోకి వెళ్ళిపోయాడు ఆడించడానికి.

మాధవి తాయారమ్మ పక్కన సోఫాలో కూర్చుంది.

" మీ బాబాయి గృహప్రవేశానికి ముహూర్తం నిర్ణయించారమ్మా. ఈలోగా వాడికేదన్నా సంబంధం చూడమ్మా పెళ్ళి నిరాడంబరంగా జరిగినా ఎంచక్కా కొడుకూ, కోడలూ కలిసి గృహప్రవేశం చేసుకుంటారు" అంది తాయారమ్మ.

నెలరోజుల్లోనే సంబంధం కుదిరి, వేణు పెళ్ళి చేసుకుని భార్యతో గృహప్రవేశం చేయాలన్న ఆవిడ కోరికకి ముందు నవ్వొచ్చినా తరువాత జాలేసింది.

" తప్పకుండా చూస్తానండి. మంచి సంబంధం చూడాలని ఆలస్యం చేశాను. " అంది.

" మనకేం కట్నకానుకలివ్వాలా? అదేం లేదుగా. వేణు చక్కటి కుర్రాడు, బుద్ధిమంతుడు, తల్లిగా నేను చెప్పకూడదు కానీ, నీకు తెలుసుగా చక్కగా ఉంటాడు. "

మాధవి ఆవిడ చేతిమీద చేయేసి మృదువుగా అంది. " అతడ్ని అర్థం చేసుకుని అన్నివిధాలుగా సహకరించే అమ్మాయి కావాలి కదండీ."

" అవునమ్మా" అందావిడ మాధవి వివేకానికి ముచ్చటపడుతూ.

మాధవి అదే అదనుగా ఆవిడకి కొంచెం దగ్గరగా జరిగి స్వరం తగ్గించి నెమ్మదిగా అడిగింది. " అదిసరే. ఈ విషయం చెప్పండి మా ప్రీతిని చూశారుగా ఆ అమ్మాయి మీద మీ అభిప్రాయం ఏంటి? "

ఆవిడ కళ్ళు మెరిశాయి ఉత్సాహంగా అంది. " ఆ అమ్మాయికేం పంజాబీ డ్రెస్ వేసుకున్న అమ్మవారిలా ఉంది" అంది.

మాధవి నవ్వింది. " దాన్ని ముందు అడిగి తన అభిప్రాయం తెలుసుకుని మీకు చెప్తాను. తరువాత వేణుని అడుగుదాం" అంది.

" అలాగే నువ్వెలా అంటే అలా. నీతో బంధుత్వం కలుపుకునే అవకాశం రావడం అదృష్టం" అందావిడ మనస్ఫూర్తిగా.

" అయ్యో అంతమాటనకండి పిన్నిగారూ. మీ ఔన్నత్యం ముందు నేనెంత చెప్పండి." అంటూ ఆవిడ చేయిమీద చెయ్యేసి నెమ్మదిగా నొక్కింది మాధవి. ఆ స్పర్శలో ఆవిడకి అంతులేని ఆప్యాయత కనిపించింది.

మాధవి కాసేపు రిత్విక్‌తో ఆడుకుని, కాస్సేపు నీలవేణికి పనిలో సాయం చేసి వెళ్ళిపోయింది.

ఇంటికి వెళ్ళగానే తెలుగు క్యాలండర్ తీసుకుని మరునాటి తిధి నక్షత్రం చూస్తుంటే చక్రవర్తి వచ్చాడు.

" ఏంటి విశేషం? పంచాంగం చూస్తున్నావు జాబ్‌లో చేరుతున్నావా? " అడిగాడు.

" రేపు సప్తమి గురువారం. మంచిది. ఓకె" అంటూ క్యాలండర్ పక్కన పెట్టి " అది పంచాంగం కాదు తెలుగు క్యాలండర్" అంది.

" పంచాంగం అంటే తిధి, వార, నక్షత్రాలు, యోగ విషయాలు, కారణాలు అనే ఐదు సూత్రాల ఆధారంగా తయారు చేయబడింది. ఈ క్యాలండర్‌లో తిధి, వార, నక్షత్రాలున్నాయి కదా. అందుకిది పంచాంగం" వివరంగా తనకేదో బాగా తెలిసినట్టు చెబుతోన్న చక్రవర్తి వైపు నిశితంగా చూస్తూ ఫక్కున నవ్వింది మాధవి.

" ఎందుకా నవ్వు? " అడిగాడు.

" ఏమీలేదు. " అంటూ అతని టై వదులు చేస్తూ అంది. " ప్రీతికి సంబంధం మాట్లాడాను. దాని అభిప్రాయం తెలుసుకోడానికి మంచిరోజు కోసం చూశాను. "

" నువ్వు చాలా పెద్దదానివైపోతున్నట్టు అనిపిస్తోంది. మరీ అమ్మమ్మని పెళ్ళిచేసుకున్నానేంటి? " అదోలా మొహం పెట్టి అంటోన్న చక్రవర్తి వైపు కోపంగా చూసింది. " పెళ్ళిమాటలు మాట్లాడితే అమ్మమ్మ అయినట్టా? "

" కాదా.. "

" అయితే మీరు నాకన్నా ముందే తాత అయారు. "

" నేనా? ఎలా? " ఆశ్చర్యంగా చూశాడు.

" వేణు పెళ్ళి మాటలు మీరేగా మాట్లాడారు. "

" నో.. నాకసలు తెలియదు. "

" అహా పాపం. తెలీదు. వేణు ప్రేమ, అర్చననే పెళ్ళిచేసుకుంటానని సవాల్ చేయడం మీకు తెలీదని నేను నమ్మాలా? "

" అదా" తేలిగ్గా అంటూ ఆమెని దగ్గరకు లాక్కుని అన్నాడు. " నువ్వీ మధ్య చాలా నాటీ అవుతున్నావు. మాటకు మాట చమత్కారంగా జవాబు చెపుతున్నావు. "

" సహవాస దోషం లెండి కానీ, నేను రేపు ప్రీతితో వేణు గురించి మాట్లాడాలనుకుంటున్నాను. "

" వేణు గురించి డైరెక్ట్‌గా అడిగే కన్నా ముందు పెళ్ళిమీద, కాబోయే భాగస్వామి మీద తనకున్న ఐడియాస్ ఏంటో తెలుసుకో. "

మాధవి ఉలిక్కిపడినట్టు చూస్తూ అంది. " అరె నిజం నేనిదంతా ఆలోచించలేదండి. నిజమేకదా దానికీ దాని స్వంత ఆలోచనలు, ఏవో కోరికలు ఉంటాయిగా" అంది ఆలోచిస్తూ.

చక్రవర్తి తన తలతో ఆమె తల ఢీ కొడుతూ "మొద్దుబుర్ర ఆవేశమే కానీ, ఆలోచన లేదు" అన్నాడు.

బేలగా అంది మాధవి. "అది ఒప్పుకోదంటారా?"

"ఒప్పుకోదని నేనన్నానా? కాకపోతే డైరెక్ట్‌గా అడిగి తను కాదంటే బాధపడేకన్నా జాగ్రత్తగా తన మనసులో ఏముందో తెలుసుకుని నీ ఆలోచన చెప్పమంటున్నా. "

మాధవికి చక్రవర్తి మాటలు నిజమే అనిపించాయి. "నిజమే కదా" అనుకుంది. తనకా ఆలోచన రానందుకు తనని తానే తిట్టుకుంటూ "సరేలెండి మీరు కాళ్ళు, చేతులు కడుక్కురండి టీ తెస్తాను" అంటూ లోపలికి వెళ్ళిపోయింది.

ఆమె వెళ్ళిన వైపు చూస్తూ "ఆ కుటుంబంతో ఈమెకి ఏ జన్మదో ఈ బంధం" అనుకున్నాడు చక్రవర్తి.

●●●

అర్చన ఇప్పుడు రాజమండ్రి ఆర్. డి. వోగా ఉంది. క్వార్టర్స్, వాహనం, పనివాళ్ళు హోదా, బాగుంది. ఇప్పుడు అర్చనకి గతం తల్చుకుంటే ఏమీ అనిపించడంలేదు. వేణు అసలు గుర్తేరాడు. బాబు మాత్రం అప్పుడప్పుడు గుర్తొస్తుంటాడు. ఇప్పుడు బాబుకి మూడేళ్ళుంటాయేమో, కబుర్లు చెపుతున్నాడేమో అనుకుంటూ ఉంటుంది. క్వార్టర్స్‌లో పనిచేస్తున్న శోభకి మూడేళ్ళ పిల్లాడు, ఆరేళ్ళ పిల్ల ఉన్నారు. అక్కడే పిల్లలను చూసుకుంటూ ఉంటుంది. భర్త తాపీమేస్త్రి. ఆ తల్లీ, పిల్లల్ని చూసినప్పుడు సన్నని నిట్టూర్పు వస్తుంటుంది. వాళ్ళకి కబుర్లు చెబుతూ శోభ అన్నం పెట్టే దృశ్యం అర్చనకి కన్నుల పండువగా అనిపిస్తుంటుంది.

ఆఫీసులో కూడా పెద్దగా పని ఒత్తిడిగా అనిపించలేదు. పి.ఎ శ్రీపతి, సూపరింటెండెంట్ వసుమతి, అకౌంటెంట్ ఇలా ఓ నలుగురైదుగురు అర్చనని బాగా అభిమానిస్తారు. అనుభవజ్ఞులైనవాళ్ళు దాదాపు వాళ్ళే ఆమెకి ఆఫీసు గురించి, అక్కడి పని గురించి ఆ ఊళ్ళో ఉన్న సమస్యల గురించి వివరంగా చెప్పారు. పెద్దగా రాజకీయంగా కూడా ఎలాంటి హడావిడీ కనిపించదు. ఆమె చేరిన వారానికే ఆగస్టు పదిహేను, స్వాతంత్ర్య దినోత్సవం జరిగింది. తన చేతుల మీదుగా పతాకావిష్కరణ చేస్తుంటే తనువెల్లా పులకించింది. తన హోదా తల్చుకుంటే గర్వంగా అనిపించింది. కానీ, హోదా హక్కులను లేదా అధికారాన్ని ఇవ్వదు. బాధ్యతలను మనపై ఉంచుతుంది అన్న ప్రముఖుల పలుకు గుర్తుకు తెచ్చుకుని తనని తాను సమాధాన పర్చుకునేది.

సాయంకాలాలు అప్పుడప్పుడు గోదావరి బ్రిడ్జిమీద నడుస్తూ ఆ సౌందర్యాన్ని ఆస్వాదిస్తూ ఉంటుంది.

సూపరింటెండెంట్ వసుమతిని తీసుకుని అన్నవరం, ద్రాక్షారామం, ర్యాలిలో జగన్మోహిని, చెన్నకేశవ ఆలయాలు దర్శించింది. ఎక్కడికెళ్ళినా తనకు జరుగుతున్న రాచమర్యాదలు, వాళ్ళిస్తున్న గౌరవం ముందు కొంచెం ఇబ్బందిగా అనిపించినా తరువాత ఆనందంగా అనిపించింది.

తూర్పుగోదావరి జిల్లా..

విశాఖపట్నంలో పుట్టి, పెరిగినా ఎన్నడూ రాజమండ్రి వచ్చిన గుర్తేలేదు.

ఎంత చరిత్ర ఉంది రాజమండ్రికి అనిపించింది.

1904లో తూర్పు గోదావరి జిల్లా ఏర్పడింది. ఈ ప్రాంతాన్ని మౌర్యులు, శాతవాహనులు, ఇక్ష్వాకులు, గాంగులు, విష్ణుకుండినిలు, చాళుక్యులు, వెలనాటి చోళులు, కాకతీయులు, తురుష్కులు, కొండవీటి రెడ్డి రాజులు, గజపతులు, విజయనగర రాజులు పాలించారు. 1916లో లాగరాయి పితూరీ, 1922లో అల్లూరి సీతారామరాజు మన్యం తిరుగుబాటులను అణచి వేసేందుకు బ్రిటిష్ ప్రభుత్వం మలబారు సైనికులను తీసుకు వచ్చింది. జిల్లాలో 30శాతం పైగా అడవులు వ్యాపించి ఉన్నాయి. రాజరాజ నరేంద్రుని పేరు మీదుగా రాజమహేంద్రవరం నిర్మించబడింది. అదే నేడు రాజమండ్రి.

కందుకూరి వీరేశలింగంగారి ఇల్లు చూపించాడు శ్రీపతి. ఆయన కూర్చున్న కుర్చీ ఆయన నడిచిన పరిసరాలు అర్చన ఆనందానికి అవధుల్లేకుండా అయింది. ఆయన స్థాపించిన హితకారిణి సమాజం గురించిన కొన్ని ఫోటోలు కూడా చూపించాడు. మహాభారతాన్ని రచించిన నన్నయ రాజమండ్రివాడే అని చదివినట్టు గుర్తు. అనుకుంది అర్చన.

గోదావరినది రంపచోడవరం నుంచి ప్రవహించి ధవళేశ్వరం వద్ద వశిష్ఠ, గౌతములుగా చీలుతుంది. వశిష్ఠ పశ్చిమానికి ప్రవహించి వైనతేయమనే పాయగా చీలి రాజోలు దగ్గర సముద్రంలో కలుస్తుంది.

రాజమండ్రి గోదావరి నదిపైన సర్ ఆర్థర్ కాటన్ నిర్మించిన బ్యారేజ్ మీద నిలబడి చూస్తుంటే పరవళ్ళు తొక్కే గోదావరి పై కథలన్నీ తన గర్భంలో దాచుకుని అలలనే అక్షరాలు పేర్చి ఆ కథలన్నీ తనకు వినిపిస్తున్నట్టే అనిపిస్తుంటుంది అర్చనకి.

చుట్టుప్రక్కల ప్రాంతాలైన రాజోలు, భీమవరం మొదలైన ప్రదేశాలన్నీ ఒకొక్కరోజు ఇన్‌స్పెక్షన్‌కి వెళ్ళి అన్నీ చూడాలని నిర్ణయించుకుంది.

ఒకసారి కలెక్టర్ అక్షయ్‌కుమార్‌తో కలిసి యానాం, సామర్లకోట వెళ్ళింది.

అక్షయ్ కుమార్ వయసు ముప్పై ఏళ్ళు. అతనిది అవడానికి తూర్పుగోదావరే అసలు ఊరు అయినా తండ్రి ఉద్యోగరీత్యా చాలాకాలం క్రితమే నార్త్‌లో సెటిల్ అయాడు. తెలుగు బాగానే వచ్చు. పచ్చగా, ఆరడుగుల ఎత్తు, అమీర్ ఖాన్‌లా ఉంటాడు.. అర్చనతో ఎంతో స్నేహంగా ఉంటాడు. అతని భార్య ఫ్యాషన్ డిజైనర్. ఆమెది పూర్తిగా నార్త్. పేరు హంస. అతనికి తగినట్టే అందంగా ఉంటుంది. ఈమె ఎన్నడూ అందాలపోటీలకు వెళ్ళి ఉండదు. వెళ్ళి ఉంటే తప్పకుండా మిస్ యూనివర్స్ అయి ఉండేది అనుకుంటుంది అర్చన. ఒకటి, రెండుసార్లు ఆమె కూడా భర్తతో కలిసి టూర్ వేసుకుని వచ్చింది. అందరూ కలిసి కడియం వెళ్ళారు. కడియం నర్సరీలో మొక్కలు చూసి చిన్నపిల్లల్లా సంబరపడ్డారు అర్చన, హంస.

ప్రతిక్షణం నీళ్ళు చల్లుతూ, కలుపు మొక్కలు ఏరిపారేస్తూ, గులాబీ కొమ్మలు కట్ చేస్తూ, మట్టిని కదుపుతూ కంటికి రెప్పల్లా కాపాడుతున్నారు అక్కడివాళ్ళు. మగపిల్లల్లా నడుం చుట్టూ టవల్ కట్టుకుని, పొడుగాటి జాకెట్ వేసుకున్న ఒకమ్మాయి ఆ మొక్కల మధ్య మొక్కగా మారి చిలకలా నవ్వుతూ, కబుర్లు చెపుతూ, ఒక్కో క్రోటన్ పేరు చెబుతూ మొక్కల్ని పరిచయం చేస్తున్న తీరు అద్భుతంగా అనిపించింది అర్చనకి. చల్లనిగాలి, ఆ గాలిలో వస్తున్న పరిమళం.

"నాకిక్కడి నుంచి కదలాలని లేదు సార్" అంది అర్చన నవ్వుతూ.

"మీకిక్కడ పోస్టింగ్ ఇవ్వమంటారా?" తనూ నవ్వుతూ అడిగాడు అక్షయ్.

"ఇక్కడ క్వార్టర్స్ కట్టించి ఇవ్వండి" చాలు అంది.

"రెవెన్యూ మీదేకదా మీరే కట్టుకోండి."

"మీకిద్దరికీ ఛాన్స్ దొరికితే ఆంధ్రప్రదేశ్ మొత్తం ఆక్యుపై చేసుకుంటారులే" అంటూ అల్లరిగా నవ్వింది హంస.

"పోనీలే నీకేగా మొత్తం" అన్నాడు అక్షయ్.

"అంత ఆశగానీ, అలాంటి దుర్బుద్ధిగానీ మాకు లేదులే" హంసగారు అంది అర్చన.

"కమాన్ అర్చనా ఈ గారూ, గీరూ ఐ డోంట్ లైక్ ప్లీజ్ కాల్ మీ హంసా. "

"ఓ థాంక్యూ" అంగీకారంగా నవ్వింది.

"అందరం ఒకే వయసు వాళ్ళం దాదాపు హోదాలు పక్కన పెడితే పేర్లు పెట్టి పిలుచుకుంటే సాన్నిహిత్యం పెరుగుతుంది. ఎలాంటి భేషజాలూ లేకుండా మన జిల్లా అభివృద్ధి కోసం కలిసి, మెలిసి కృషి చేయచ్చు ఏమంటారు? " అడిగాడు అక్షయ్.

"అంతకన్నానా సార్. మీకు నా కోపరేషన్ హండ్రెడ్ పర్సెంట్."

"మరి ఈ సార్ ఎందుకు? "

"కరెక్టేకానీ, నాక్కొంచెం టైమ్ కావాలి సార్ అనే పిలుపు నుంచి మారడానికి"

"టేక్ సమ్ టైమ్" అన్నాడు.

'ఇంతలో కొబ్బరి బోండాలు రావడంతో తీయటి కొబ్బరి నీళ్ళు తాగి రిలాక్స్ అయారు.

అర్చన, హంసా కూడా మొత్తం కలయతిరిగి బోలెడన్ని మొక్కలు తీసుకున్నారు.

అక్షయ్ కుమార్ సిసి, అతన్ని క్యాంప్ క్లర్క్ అంటారు. ఎంతో నమ్రతగా హంస సెలెక్ట్ చేసిన మొక్కలన్నీ కార్లో పెట్టించాడు. శ్రీపతి కూడా సింహాచలాన్ని పిలిచి అర్చన తీసుకున్న మొక్కలన్ని కారులో పెట్టించాడు. రెండు కార్లు బయల్దేరాయి.

ఆ రోజు ఉదయం లేచేటప్పటికి వాతావరణం చల్లగా ఉంది.

అర్చన బెడ్‌లైట్ వెలుగులో గోడగడియారం వైపు చూసింది. చీకటిగా ఉంది. ఫ్యాన్ కూడా తిరగడం లేదు. అంటే కరెంట్ పోయిందనమాట.

పక్కనే పెట్టుకున్న సెల్ తీసింది. స్విచ్ ఆఫ్ అయి ఉంది. "అరె. చార్జి పెట్టలేదు రాత్రి. " అనుకుంటూ ఆన్ చేసి టైం చూసింది. ఆరుంబావు.

అరెరె. ఆరు దాటిందే అనుకుంటూ ముసుగు తీయబోతే బాగా చలిగా అనిపించింది. తిరిగి ముసుగు బిగిస్తూ కిటికీ రెక్క కొద్దిగా తెరిచింది. బైట జల్లు పడుతున్న ధ్వని వినిపిస్తోంది. మొక్కలన్నీ నల్ల వస్త్రం కప్పుకుని వర్షంలో స్నానం చేస్తున్నట్టుగా ఉన్నాయి. దూరంగా చీకటిని చీల్చుకుంటూ మధ్య, మధ్య మెరుపులు మెరుస్తున్నాయి.

ఎటూ కాని కాలంలో వర్షం ఏంటి? తుఫాను కాదుకదా?

అలా అనిపించగానే చటుక్కున లేచి కూర్చుంది.

"ట్రింగ్, ట్రింగ్" ఫోన్ మోగింది.

అర్చన కెందుకో భయం వేసింది. ఎవరబ్బా ఈ టైంలో ఫోన్? అనుకుంటూ మంచం దిగి టేబుల్ దగ్గరకు నడిచింది. రిసీవర్ అందుకుని "హలో" అంది.

"గుడ్ మార్నింగ్ మేడమ్. నేను శ్రీపతిని మాట్లాడుతున్నాను. "

శ్రీపతి తన పి.ఏ.

"గుడ్ మార్నింగ్ శ్రీపతీ ఏంటి ఈ టైములో ఫోన్ చేశారు? "

"మేడమ్ సైక్లోన్.. అర్ధరాత్రి నుంచీ మొదలైంది. చుట్టుపక్కల ప్రాంతాలన్నీ మునిగిపోయాయి. చాలా సీరియస్‌గా ఉంది పరిస్థితి. మీ కోసం చాలా సేపట్నించీ ట్రై చేస్తున్నాను. "

"అలాగా! అయ్యో నాకు అసలు వినిపించలేదు. సారీ ఇంతకీ మీరెక్కడ ఉన్నారు? "

"నేను ధవళేశ్వరం దగ్గర ఉన్నాను. మీరు ఫోన్ తీయకపోతే నేను బయలుదేరి వచ్చేశాను. "

వణికిపోయింది అర్చన.

భగవంతుడా? ఏమిటీ పరీక్ష? ఏం చేయాలో తోచలేదు.

"ఇప్పుడు ఏం చెయ్యాలి? " అడిగింది ఖంగారుగా.

శ్రీపతికి కొంచెం జాలేసింది. ఆవిడకి అసలే కొత్త. అప్పుడే ఈ సైక్లోన్. అనుభవజ్ఞుడు. కొంచెం అభిమానంగా అన్నాడు. "మీరేం కంగారు పడకండి. నేను సింహాచలానికి ఫోన్ చేశాను. అతనొచ్చేలోపల మీరు రెడీ అవండి. రెస్క్యూ టీమ్ కూడా వచ్చేసింది. మీరు టెన్షన్ పడకండి. సింహాచలం ఉంటాడు. జాగ్రత్తగా తీసుకొస్తాడు మిమ్మల్ని. ఓ.కె. "

"థాంక్యూ.. థాంక్యూ మిస్టర్ శ్రీపతీ" వణుకుతున్న చేత్తో రిసీవర్ పెట్టేసి, అరచేతులు రుద్దుకుని కళ్ళకద్దుకుంది. ట్యూబ్ లైట్ ఆన్ చేసి గోడకున్న వెంకటేశ్వరస్వామి పటం చూసి తండ్రీ కాపాడు. ప్రజల్ని కాపాడు. ప్రజల ఆస్తుల్ని కాపాడు. అనుకుంటూ బాత్ రూము వైపు వెళ్ళింది.

ఏడు దాటుతుండగా వచ్చాడు సింహాచలం జీపు తీసుకుని.

అప్పటికే రెడీగా ఉంది అర్చన. మామూలు క్రేప్ సిల్క్ చీర కట్టుకుని, స్వెటర్ వేసుకుంది. తలకి మఫ్లర్ చుట్టుకుని, వచ్చి జీపులో కూర్చుంది.

జీపు కదిలింది. అద్దాల కిటికీలోంచి అంతగా తెలియలేదు కానీ, వర్షం కుండపోతగా కురుస్తోంది. రోడ్లన్నీ జలమయం అయిపోయాయి. ఎక్కడా జనసంచారం లేదు. మెయిన్ రోడ్డెక్కింది జీపు. గోదావరి బ్రిడ్జి మీదకు వచ్చింది. గోదావరి పరవళ్ళు తొక్కుతోంది. సెల్ తీసి శ్రీపతికి ఫోన్ చేసింది. ఎంతసేపు రింగైనా అతను లిఫ్ట్ చేయలేదు. ఇతను ఫోన్ తీయడంలేదేంటి స్వగతంగా అనుకుంటుంటే అన్నాడు సింహాచలం.

"అడావుడిగా ఉండి ఉంటాడమ్మా. మీరేం కంగారడమాకండి. మన సారుకి అలవాటే. ప్రతి ఏడూ ఈ తుపాను అలవాటైపోయిందండి. ఆరు చాకచక్యంగా చూసుకుంటారు. మీరేం బాద పడబోకండి."

"ఏమో" అనుకుంది మనసులో పైకి మాత్రం గాంభీర్యం చూపిస్తూ "ప్రాణ నష్టం జరక్కుండా ఉంటే చాలు సింహాచలం" అంది.

"ప్రాణ నష్టం జరక్కుండా ఎలా ఉంటాదమ్మా" అంటూ సింహాచలం గతంలో వచ్చిన తుఫాను తాలుకు వివరాలు చెప్పసాగాడు. ఎంతమంది జనం చనిపోయారో, ఎంత ఆస్తి నష్టం జరిగిందో, ప్రభుత్వం ఎంత నిర్లక్ష్యంగా వ్యవహరించింది అతను చెప్తోంటే అర్చన కళ్ళముందు భయానక దృశ్యాలు కదలసాగాయి.

ఇంతలో సెల్ మోగింది.

అక్షయ్ కాలింగ్ అన్న అక్షరాలు చూసి గుండె ఆగినట్టైంది.

"గుడ్ మార్నింగ్ సర్." తడబడుతున్న స్వరంతో చెప్పింది.

"అర్చనగారూ ఎక్కడున్నారు? "

"ధవళేశ్వరం వెళుతున్నాను. "

"ఓ మైగాడ్ నేను కూడా బయలుదేరాను. రక్షణ ఏర్పాట్లు చూడండి. అక్కడి పరిస్థితి నాకు వెంట, వెంటనే తెలియచేయండి."

"ఓకె సర్."

"ఓకె. " ఆఫ్ అయింది.

జీపు సడన్‌గా ఆగడంతో ఉలిక్కిపడింది.

వందల మంది జనం హాహాకారాలతో నిండి ఉంది. వరద, వరద గోదావరి గర్జిస్తోంది. ఏం జరుగుతోందో ఆమెకేం అర్థం కాలేదు.

"మేడమ్ దిగుతారా?" అడిగాడు సింహాచలం..

అర్చన తనకు తాను ధైర్యం చెప్పుకుంటూ దిగబోతుంటే సింహాచలం ఒక్కనిమిషం అంటూ టార్చిలైటు ఆన్‌చేసి ఆమె కాలు పెట్టాల్సిన చోట టార్చివేశాడు.

జీపు దిగి అడుగులో అడుగువేస్తూ వణుకుతున్న కాళ్ళతో నడుస్తోంటే సడన్‌గా కాలు బురదలో ఇరుక్కుంది. కెవ్వుమంది అర్చన.

"జాగ్రత్తగా దిగండి." అంటూ చేయి అందించాడు సింహాచలం. సంకోచించకుండా అతని చేయి అందుకుని అడుగులో అడుగువేస్తూ కదిలింది.

●●●

**ఎప్పుడూ పేపర్లో చదవడం,** టీవీలో చూడటం తప్ప ప్రత్యక్షంగా ప్రకృతి చేసిన భీభత్సాన్ని, గోదావరి ప్రళయ తాండవాన్ని చూడని అర్చన అక్కడి పరిస్థితి చూసి నిలువెల్లా వణికిపోయింది. గుట్టలు, గుట్టలుగా పడి ఉన్న శవాలు, ఎటు చూసినా ఆర్తనాదాలు, హాహాకారాలు శోక సముద్రంలో మునిగిపోయిన ప్రజలు, నామరూపాల్లేకుండా కొట్టుకుపోయిన ఇళ్ళు, ఆస్తులు అక్కడ అడుగు పెట్టగానే కనిపించిన ఆ ఘోరాన్ని చూసిన అర్చనకి ఏడుపాగలేదు. వెక్కి, వెక్కి ఏడుస్తున్న అర్చనని ఎలా ఓదార్చాలో అర్థంకాలేదు శ్రీపతికి, సింహాచలానికి.

"మేడమ్ ఊరుకోండి మీరే అలా ఏడిస్తే ఎలా? ఊరుకోండి" అంటూ ఆమె దగ్గరగా వచ్చి పదే, పదే చెప్పసాగాడు. అర్చన ఎంత కంట్రోల్ చేసుకోవాలన్నా ఆమె చేతకావడం లేదు.

అప్పటికే అక్కడికి సర్పంచ్, ఎం.ఆర్.వో, లోకల్ ఎం.ఎల్.ఏలు, ఎం.పిలు, ఇతర నాయకులు వచ్చేసి పరిస్థితి గమనిస్తున్నారు. గజ ఈతగాళ్ళు అన్వేషణ ప్రారంభించడానికి సిద్ధంగా ఉన్నారు. అర్చనని చూడగానే ముందు ఇంత ఆలస్యంగానా వచ్చేది అన్నట్టుగా ఒక చూపు చూశారు ఎం.ఎల్.ఏలు, ఎంపిగారు కూడా. కాకపోతే కన్నీళ్ళతోనిండిన ఆమె మొహం చూడగానే ఎవరూ ఏం మాట్లాడలేకపోయారు.

అక్షయ్ కుమార్‌కి పరిస్థితి వివరిస్తూ, అతని రాకకోసం ఎదురుచూస్తూ శ్రీపతికి తనకు తోచిన సూచనలు, సలహాలు ఇవ్వసాగింది. ఎం.ఎల్.ఏ ఈశ్వరరావు ఆమెతో చెపుతున్నాడు. ఎంత ఆస్తి నష్టం జరిగి ఉంటుందో అంచనా వేస్తున్నాడు. అర్చన కెందుకో పేపర్లో చదివిన విషయాలు గుర్తొచ్చాయి. చిన్నప్పుడెప్పుడో చదివిన తుపాను ఎప్పుడొస్తుంది? అనే కథ కూడా గుర్తొచ్చింది. వీళ్ళంతా ఈ పరిస్థితి కోసం ఎదురు చూస్తున్నారా బ్యాంకు అకౌంట్లు నింపుకోడానికి అనుకుంది.

వెంటనే తన ఆలోచన ఎవరన్నా పసిగట్టారేమో అని ఉలిక్కిపడింది. కాస్సేపటికి అక్షయ్ కుమార్‌కూడా వచ్చేశాడు. ఎం.పి అక్షయ్ కుమార్ ఆలస్యంగా రావడం పట్ల ఉగ్రుడయాడు. అతను తను హైదరాబాదు వెళ్ళానని, వార్త తెలిసిన వెంటనే బయల్దేరి వచ్చానని సంజాయిషీ ఇస్తున్నాడు.

వెంట, వెంటనే బాధిత కుటుంబాలకు తక్షణ, రక్షణ ఏర్పాట్లు చేస్తూనే సి.ఎస్.గారికి పరిస్థితి సమీక్షించాడు.

ముఖ్యమంత్రి, తదితర మంత్రులంతా సుడిగాలి పర్యటన చేశారు. అప్పటికప్పుడే ఐదుకోట్ల రూపాయల సైక్లోన్ ఫండ్ ప్రకటించారు ముఖ్యమంత్రి. బాధితులకు ఆహారం, ఆశ్రయం ఏర్పాట్లు చేశారు.

అక్షయ్‌కుమార్ వచ్చాక కొంచెం అర్చన మనసు శాంతించింది. అతను అప్పటికప్పుడు తీసుకుంటున్న నిర్ణయాలు, సెక్రెటేరియట్ ఫోన్ చేసి సి.ఎస్‌తో, ఇతరులతో మాట్లాడుతున్న తీరు స్పాంటేనియస్‌గా, ఎవరి ఆదేశాలకోసం ఎదురు చూడకుండా తీసుకుంటున్న నిర్ణయాలు, ఆమెకి అద్భుతంగా అనిపించాయి. కలెక్టర్ అంటే ఇలా ఉండాలి అనుకుంది.

గజఈతగాళ్ళు వాళ్ళ అన్వేషణ కొనసాగిస్తున్నారు. మంత్రులు, ఎం.ఎల్ఏలు, ఎం.పిలు కొంతసేపటికి వెళ్ళిపోయారు. మిగిలిన వాళ్ళకి ఎం.ఆర్.వో వెంకటేశ్వర రావు కాఫీలు ఏర్పాటు చేశాడు. అర్ధరాత్రి వేళ వచ్చి కాఫీ నీళ్ళు కూడా తాగకుండా శ్రమ పడుతున్న శ్రీపతి, మొదలైన వాళ్ళందరూ కాఫీ తాగగానే కొంచెం సేద తీరారు.

అర్చనకి తల పగిలిపోతోంది. కడుపులో తిప్పేస్తోంది. సడెన్‌గా ఏదో అవుతున్నట్టనిపించింది. తలపట్టుకుని నిలబడ్డ అర్చనని కాసేపు విశ్రాంతి తీసుకోమని చెప్పి తన ఇంటికి పంపించాడు ఎం.ఆర్.ఓ. ఆమె వెళ్ళిన కొద్ది సేపటికే అక్షయ్‌కుమార్ నుంచి ఇతర ప్రాంతాల పర్యటనకు పిలుపు వచ్చింది.

ఎం.ఆర్ వో భార్య "అయ్యో మీకివన్నీ కొత్తట్టుందండీ. పాపం కొత్తగా వచ్చారట కదా. ఖంగారు పడకండి. ఆరోగ్యం చూసుకోండి" అంటూ దయగా మాట్లాడింది.

అర్చన ఆమె దగ్గర సెలవు తీసుకుని మళ్ళీ అక్షయ్ కుమార్, శ్రీపతి వాళ్ళు అందరూ ఉన్న దగ్గరకు వచ్చింది.

నిర్విరామంగా, ఎలాంటి అలసట లేకుండా ప్రజలని రక్షించడమే తన బాధ్యత అన్నట్టు పనిచేస్తున్న శ్రీపతినిచూసి గవర్నమెంటు ఆఫీసులో పనిచేయరు అనే వాళ్ళని అప్పటికప్పుడు పట్టుకొచ్చి తన్నాలనిపించింది అర్చనకి. ఎంత అంకితభావంతో పనిచేస్తున్నాడు ఇతను. అర్చన కళ్ళు మళ్ళీ చెమర్చాయి.

అక్కడినుంచి మిగతా ప్రాంతాల్లో పరిస్థితి సమీక్షించడానికి బయల్దేరారు. అర్చన దారి పొడుగునా కనిపిస్తున్న ఘోరం చూడలేక కళ్ళు మూసుకుంది.

సాయంత్రానికి కొంచెం శాంతించింది గోదావరి. కరాళ నృత్యం చేసిన ప్రకృతి కడుపు నిండిన కొండ చిలువలా ప్రశాంతంగా ఉంది.

అప్పటిదాకా తుఫాను ప్రాంతాలు పర్యటించి వచ్చిన అర్చన, అక్షయ్ కుమార్ పంచాయితీ ఆఫీసులో అందరితో సమావేశమయారు. మిగతా ఆర్.డి.వోలు కూడా వచ్చారు. అందరూ కలిసి తరువాత తీసుకోవాల్సిన చర్యల గురించి చర్చించారు. వెంటనే రిపోర్టు సబ్మిట్ చేయాల్సిందిగా అందరికీ ఆదేశాలిచ్చాడు అక్షయ్ కుమార్.

వారం రోజులు ఊపిరి సలపని పనులు మీటింగులు, మీటింగులు హైదరాబాదులో సెక్రెటేరియెట్‌లో మీటింగ్. కలెక్టర్‌తో పాటు ఆర్.డి.వోలు, మిగతావాళ్ళు అందరూ కూడా వెళ్ళారు. ఆర్థిక నష్టం అంచనా వేయలేకపోతున్నారు. ప్రాణ నష్టం అసలే తెలియడం లేదు. వెతుకుతున్న కొద్దీ బయటపడుతున్నాయి శవాలు.

అర్చన మానసికంగా, శారీరకంగా కూడా బాగా అలసిపోయింది.

నిద్ర సరిపోడం లేదు. రోజూ మహా అయితే నాలుగ్గంటలు మాత్రం నిద్రపోతోంది.

ఆ రోజు బాగా అలసిపోయింది. ఎంత ఆపుకున్నా కళ్ళు మూతలు పడిపోతున్నాయి. అప్పటికే ఐదారు కప్పుల టీ తాగింది. ఎన్నడూ లేనిది ఈ మధ్య కాఫీ, టీలతో కడుపు నిండిపోతోంది. వేళకాని వేళలో భోజనం ఒక్కోరోజు బ్రేక్ ఫాస్ట్ చేయడమే లేదు. డిన్నర్ కూడా తింటే తింటోంది లేకపోతే లేదు. అన్నిటికన్నా హాయిగా నిద్రపోవాలనిపిస్తోంది. నెమ్మదిగా కళ్ళు మూసుకుంది.

"మేడమ్ మీరు వెంటనే రావాలి. ఏలేరు దగ్గర మళ్ళీ గండిపడింది. చాలామంది చనిపోయారు. "

శ్రీపతి గాభరాగా పిలుస్తున్నాడు. దాదాపు ఆమె చెయ్యి పట్టుకుని పరుగందుకున్నాడు. పరుగెడుతోంది అర్చన. దారినిండా రక్తపాతాలు, నిర్జీవంగా పడి ఉన్న జనం, ఒరుసుకు పోయిన రోడ్లు, కొట్టుకుపోయిన ఊళ్ళు, పాయలుగా చీలిన గోదావరి. ప్రతి పాయ దగ్గరా విగతజీవులు.

"ఎవరది? " అర్చన శ్రీపతి చెయ్యి విదిలించి పరిగెత్తింది. బురదలో మూడేళ్ళబాబు బోర్లాపడి ఉన్నాడు.

"అయ్యో ఎవరీబాబు? ఒంటరిగా పడి ఉన్నాడు. శ్రీపతీ త్వరగా రండి. ఎవరీబాబు? మొహం కనిపించడంలేదు. ఎవరో ఎక్కడివాడో, తల్లి, తండ్రి ఎవరో చూడండి. పాపం పసివాడు. శ్రీపతీ మీకే చెప్పేది. బాబు మొహం కనిపించడంలేదు. తిప్పండి వెల్లకిలా తిప్పండి. బాబూ..!! " కెవ్వున అరిచింది అర్చన.

"మేడమ్ మేడమ్" ఎవరో పిలుస్తున్నారు. బలవంతంగా కళ్ళు తెరిచింది.

శ్రీపతి, మరీ ఇద్దరు స్టాఫ్.

కుర్చీలోనే గాఢనిద్రపట్టేసింది అర్చనకి. ఆ నిద్రలో కల. భయంకరమైన కల. కుర్చీలో సరిగా కూర్చోబోయింది. చేతకాలేదు. వడలిపోతోంది. ఆమె కుడి చెయ్యి వేళ్ళాడుతోంది. ఎడం చేతి మీంచి చీర చెంగు కిందకి జారుతోంది.

"మేడమ్ ఎలా ఉన్నారు?" శ్రీపతి స్వరంలో ఖంగారు.

అర్చనకి నోట్లోంచి మాట రావడంలేదు.

ఆమె ఎదురుగా ముగ్గురో, నలుగురో నిలబడ్డారు. అందరి మొహాల్లో ఆందోళన.

ఎవరో అరిచారు. "నారాయణా.. మంచినీళ్ళు తీసుకురా త్వరగా. ఎవరినన్నా లేడీస్‌ని రమ్మను."

వెంటనే మంచినీళ్ళ గ్లాసుతో నారాయణ, అతని వెనకే స్టెనో చిత్ర. చిత్ర గబ, గబా వచ్చి వేళ్ళాడుతోన్న అర్చన చెయ్యి సరిగా పెట్టి ఆమెని సరిగా కూర్చోబెట్టింది. ఒళ్ళు కాలిపోతోంది.

"సార్ మేడమ్‌కి ఫీవర్.." ఖంగారుగా అంది చిత్ర.

"అరెరె పదండి. మేడమ్‌ని ముందు సోఫాలో కాస్సేపు పడుకోబెడదాం. డాక్టర్‌ని పిలుద్దాం. ఇంకెవరినన్నా లేడీస్‌ని పిలవండి."

"ఫర్వాలేదు... తప్పుకోండి. లేడీస్ వల్లకాదు" శ్రీపతి ధైర్యంగా ముందుకు వచ్చి సుకుమారమైన అర్చనని రెండు చేతులతో ఎత్తి ఆవిడ యాంటీ రూములో ఉన్న సోఫాలో పడుకోబెట్టాడు.

"చిత్రగారూ! డాక్టర్‌కి ఫోన్ చేయండి" అంటూ అర్చన చీర కుచ్చిళ్ళు సర్ది సోఫా కవర్ తీసి ఆమె మీద కప్పాడు.

కాసేపట్లో అక్కడ అర్చన ఆరోగ్యం పట్ల హడావిడి మొదలైంది. డాక్టర్ వచ్చి చూసింది. నూటమూడు డిగ్రీలుంది జ్వరం.

వెంటనే ఇంజక్షన్ ఇచ్చింది. మందులు రాసిచ్చి ఎలా వాడాలో చెప్పింది.

శ్రీపతి జేబులోంచి డబ్బులు తీసిచ్చి నారాయణని మెడికల్ షాప్‌కి పంపించాడు. అలాగే ఫ్రూట్ జ్యూస్‌కూడా తెమ్మన్నాడు.

అతనికి ఆమె పరిస్థితికి జాలేసింది. అనుకోకుండా కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

చాలా సుకుమారమైన మనసు. చూడకూడని దృశ్యాలు చూసింది. ఎదురుపడకూడని సంఘటనలు... తల్లడిల్లిపోయింది. ఏ టైంలో ఫోన్ వచ్చినా పరుగులు పెట్టింది. ప్రభుత్వం చేస్తున్న సహాయ చర్యలు ప్రజలకి సరిగా అందడం లేదని తన డబ్బులు లక్షరూపాయలు ఖర్చుపెట్టి దుప్పట్లు, బియ్యం, పప్పులు, బట్టలు తెప్పించి పంచి పెట్టింది.

ఇలాంటి ఆడవాళ్ళు ఇంత మానసికమైన వత్తిడి భరించలేరు.

ఏమిటో ఈవిడ ఫ్లాష్ బ్యాక్. ఎప్పుడూ ఎవరూ రారు. పెళ్ళి అయినట్టులేదు. మెళ్ళో మంగళ సూత్రం లేదు. ఎందుకీవిడ పెళ్ళిచేసుకోలేదు. ఇంత ఒంటరితనం ఎలా భరిస్తోంది? ఏవేవో ప్రశ్నలు, సందేహాలు.

"అమ్మా .. " అర్చన మూలుగు వినిపించి చటుక్కున కుర్చీలోంచి కదిలాడు.

"మేడమ్" ఆర్ద్రంగా పిలిచాడు.

అర్చన బలవంతంగా కళ్ళు తెరిచింది. "దా..దాహం."

"ఒన్ మినిట్ మేడమ్. " అంటూ నారాయణ తెచ్చిన ఫ్రూట్ జ్యూస్ గ్లాసులో పోసి చిత్రను పిలిచాడు. చిత్ర శ్రీపతి ఆదేశానుసారం అర్చన తలకింద చేయిపట్టి ఆమెని కొద్దిగా కూర్చోబెట్టి జ్యూస్ తాగించింది.

"చాలు" వాంతి వస్తున్నట్టుగా అనిపించి చేత్తో ఆపేసింది అర్చన.

"పడుకోండి" చిత్ర ఆమెని తిరిగి పడుకోబెట్టి గ్లాసు తీసేసి, కర్చీఫ్ తడిపి, మూతి తుడిచింది.

చల్లగా తగలడంతో కళ్ళు తెరిచిన అర్చన చిత్ర తనకి సేవచేస్తోందని గమనించింది. ఆమె కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

"ఎలా ఉంది మేడమ్?" ఆప్యాయంగా అడిగాడు శ్రీపతి.

అర్చన మాట్లాడలేదు. ఆమె ఎడమ కంటినుంచి కన్నీళ్ళు జారాయి.

చిత్ర కూడా చున్నీతో కళ్ళు తుడుచుకుంది.

"సార్ పాపం ఒక్కరే ఉండాలేమో కదా మేడమ్. మా ఇంటికి తీసికెళ్ళాలని ఉంది. కానీ, మా అత్తగారు చిరాకు మనిషి" అంటోన్న చిత్రని ఆపుతూ..

"ఒద్దులెండి. ఫర్వాలేదు. మా ఇంటికి తీసుకెళ్తాను. మా మిసెస్ చూసుకుంటుంది" అన్నాడు శ్రీపతి.

ఆ మాటలకు కళ్ళు తెరిచింది అర్చన.

రెండు చేతులూ జోడించింది వాళ్ళకి.

"ఏంటి మేడమ్. మీరు ఇలాంటప్పుడు కాకపోతే ఎప్పుడు చేస్తాం? మీరేం బాధపడకండి. నేను మీ సొంత అన్ననుకోండి. సారీ మీకభ్యంతరం లేకపోతేనే" అన్నాడు శ్రీపతి.

అర్చన కళ్ళు వర్షించసాగాయి.

కొంచెం టెంపరేచర్ తగ్గగానే శ్రీపతి ఆమెని కారులో కూర్చోబెట్టి తన ఇంటికి తీసుకెళ్ళాడు.

అతని భార్య వారిజ అర్చనని కంటికి రెప్పలా చూసుకుంది.

ఆ జ్వరం జ్వరం నాలుగు రోజులు కొనసాగింది. వైరల్ ఫీవర్. అలవాటు లేని ఒత్తిడి, వానలో, చలిలో, బురదలో, తిరగడం ఆమెని పూర్తిగా పడేశాయి. నాలుగోరోజు కొద్దిగా తగ్గుముఖం పట్టింది. లేచి కూర్చుని చారన్నం తింది.

"మీకు చాలా శ్రమిచ్చాను సారీ" అంది వారిజతో.

"అదేం మాటండి. ఆపదలో కాకపోతే ఇంకెప్పుడు మనిషికి మనిషి సాయం చేసుకునేది. అలా ఎప్పుడూ అనుకోమాకండి. ఇది మీ ఇల్లే అనుకోండి." ఆప్యాయంగా అంది వారిజ.

అక్కడే కూర్చుని ఆడుకుంటున్న పాపని చూస్తూ "ఎంతమంది పిల్లలు మీకు? " అడిగింది అర్చన. ఆమె స్వరం చాలా నీరసంగా ఉంది.

"ఇద్దరండి. బాబు పెద్దవాడు. పాపచిన్నది. దీనికి నాలుగేళ్ళు. బాబుకి ఎనిమిదేళ్ళు. స్కూలుకి వెళ్ళాడు" అంది వారిజ.

అలాగా అన్నట్టు పల్చగా నవ్వి, కళ్ళు మూసుకుంది.

అక్షయకుమార్ వచ్చి చూసి వెళ్ళాడు. "ఖంగారేం లేదు. బాగా విశ్రాంతి తీసుకోండి" అని చెప్పాడు.

అర్చన వాళ్ళందరి ఆప్యాయతకు చలించిపోయింది. ఈ ఒంటరి బతుక్కు నాకెవరూ లేరు అనుకున్నందుకు ఇంత మంది ఆత్మీయుల్ని ఇచ్చావా తండ్రీ నీకు నా కృతజ్ఞతనెలా తెలుపుకోను? వెంకటేశ్వర స్వామికి మనసారా దణ్ణం పెట్టుకుంది.

ఐదోరోజు ఇంటికి వెళ్ళిపోతానంది. "మీరు మొహమాటపడి వెళ్ళకండి. ఈ ఇల్లు మీ ఇల్లే అనుకోండి" అన్నారు శ్రీపతి దంపతులు.

"లేదు నాకసలు మొహమాటం లేదు. మీ ఆప్యాయతకి, ఆదరణకి నాకసలు మాటలు కూడా రావటంలేదు. కానీ, ఇంటికెళ్ళిపోతాను ప్లీజ్" అంది.

"అలాగే రండి దింపేస్తాను" అంటూ శ్రీపతి లేవడంతో, వారిజ అర్చన చేయి పట్టుకుని కారుదాకా నడిపించింది.

కారులో కూర్చుని కృతజ్ఞతగా చేతులు జోడించింది అర్చన.

ఆ జోడించిన చేతులు పట్టుకుని పక్కకి నెడుతూ "మీరెప్పుడూ ఇలా చేయకండి. మీకు సేవ చేసుకునే భాగ్యం మాకు కలిగింది" అంది వారిజ.

కారు కదిలింది. అర్చన నీరసంగా కళ్ళుమూసుకుంది. ఒంటరితనంలోని బాధ, ఆవేదనా మొదటిసారిగా తెలుస్తున్నట్టు అనిపిస్తోంది.

●●●

ఆరోజు శనివారం. ప్రీతికి ఆఫీసు లేదు. ఆఫీసు లేని రోజు లేటుగా లేస్తుంది. ఆ రోజు కూడా తొమ్మిదిన్నరకి లేచింది. మాధవి చిరాగ్గా అంది. "నీకసలు డిసిప్లిన్ లేదే ప్రీతీ వెళ్ళు, ఫ్రెషప్ అయిరా. ఆఫీసు ఉన్నా, లేకపోయినా కనీసం ఆరింటికి లేవాలి ఆడపిల్లలు. అప్పుడే ఇంట్లో లక్ష్మీదేవి తాండవిస్తుంది."

"అమ్మా పతివ్రతా నువ్వు లేస్తావుగా చాల్లే. ఒక్కళ్ళు లేస్తే చాలు ఆవిడకి స్వాగతం పలకడానికి" అంటూ బాత్ రూములో దూరింది ప్రీతి.

ప్రీతి స్నానం చేసి వచ్చేటప్పటికి ప్లేటులో మసాలా దోశె ఎదురుచూస్తోంది. మాధవి మంచినీళ్ళ జగ్గు, గ్లాసులు తీసుకొచ్చింది.

చక్రవర్తి ఆఫీసుకి వెళ్ళేటప్పుడే కౌశిక్‌ని స్కూల్లో దింపి వెళ్తాడు. ఇవాళ శనివారం కాబట్టి చక్రవర్తి త్వరగా వచ్చేస్తాడు. వస్తూ, వస్తూ కౌశిక్‌ని కూడా తీసుకొస్తాడు. అందుకే ఇవాళ మసాలా దోశె చేసి, వంట తరువాత చెయ్యొచ్చులెమ్మని కూర్చుంది మాధవి.

"బావుందక్కా దోశె. ఎంతైనా నువ్వు వంటలు బాగా చేస్తావు." అంది ప్రీతి మెచ్చుకుంటూ.

"నీక్కూడా నేర్పుతాను. నేర్చుకో. ఇవాళ ఫ్రైడ్ రైస్ చేస్తావా, బావగారికి ఇష్టం" అంది మాధవి.

"ఆ ఒక్కటి తప్ప ఏదైనా చెప్పు చేస్తాను. కిచెన్‌లో దూరి గంటలు, గంటలు వేస్ట్ చేయడం అంటే నాకు బోర్" అంది ప్రీతి.

"వేరేవాళ్ళు చేస్తే లొట్టలు వేసుకుంటూ తినడం బోర్ కాదా.."

"అసలు కాదు"

"నోరు మూసుకో. వంట నేర్చుకో. రేపు పెళ్ళయ్యాక మొగుడి మొహాన ఏం పెడతావు?"

"ఎంచక్కా చెఫ్‌ని చేసుకుంటా."

"అంతే బుద్దులు భూములేలుతుంటే అదృష్టాలు గాడిదలు కాస్తాయట"

"నీ ఉద్దేశం ఏంటి? చెఫ్ అంటే అంత చులకనా, ఫైవ్ స్టార్ హోటల్ చెఫ్ జీతం సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ జీతం కన్నా ఎక్కువ తెలుసా నీకు"

"అయితే?"

"ఇంకేంటి ప్రాబ్లం?"

"నాకేం ప్రాబ్లం లే. సరేకానీ, అలాంటిదేమన్నా ఉందా కొంపతీసి"

"అంటే"

"అంటే ఏముంది? లవ్ ఎఫైర్ ఏదన్నా?"

"ఏదీ చెఫ్‌తోటా?"

"చెఫ్ కాకపోతే పఫ్. ఎవరన్నా ఉన్నారా అని అడుగుతున్నా"

"ఉంటే చెపుతారేంటి పాపం?"

"ఏం నీకు అక్కని కదా చెప్పచ్చు."

"రమ్మని పాపం ఆశ. అక్కైనా చెప్పను. చెల్లి అయినా చెప్పను. అయినా లవ్ అనేది పెళ్ళి అయిందాకా సీక్రెట్‌గా ఉంచాల్సిన సంగతి తెలుసా?"

"తిక్కవాగుడాపి చెప్పు ఎవరినన్నా ప్రేమించావా?"

"సరేగానీ, నాకు రెండు దోసెలు పెట్టేసి, ఇంక చాలు డైటింగ్ చెయ్యి అనాలనుకుంటున్నావా? అదేం కుదర్దు. ఇంకో దోశె కావాలి" అంది ప్రీతి ప్లేటులో మిగిలిపోయిన కూర తాలూకు ముక్కలు ఏరుకుతింటూ.

మాధవి అది చూసి గబుక్కున లేస్తూ అంది "సారీరా నీ ప్లేటు చూళ్ళేదు. ఇప్పుడే తెస్తాను. చల్లారిపోతాయని రెండే వేశాను" అంటూ కిచెన్ లోకి వెళ్ళింది.

ప్రీతి మాధవి వెళ్తోంటే అటూ, ఇటూ కదులుతున్న ఆమె పెద్ద జడ చూస్తూ నవ్వుకుంది. పెద్ద జడ ఉన్నవాళ్ళు చీర కట్టుకుంటే, ఆ జడ అలా వాళ్ళు నడుస్తున్నప్పుడు నాట్యం చేస్తుంటే ఎంత బాగుంటుంది అనుకుంది.

మాధవి చేతిలో హాట్ ప్యాక్‌తో వచ్చింది.

"అక్కా నువ్వు చాలా బాగుంటావు తెలుసా!" తన ప్లేటులో దోసె వేస్తున్న మాధవి మొహంలోకి చూస్తూ అంది ప్రీతి.

"దోశెలు ఎన్నికావాలంటే అన్ని తినచ్చు. నో రేషన్. దానికోసం ఈ పొగడడం అవసరమా?"

"అందుక్కాదు కానీ, నిజంగా చెపుతున్నాను. అవునూ నీదీ, బావగారిది లవ్ మ్యారేజా?"

"నా సంగతి ఎందుకే నీకు? నేను నీ సంగతి అడిగితే మాట దాటేయడానికి కాకపోతే ఎందుకు?" కోపంగా అంది మాధవి.

"ఏం మాట అడిగావని దాటేయడానికి?"

"అదే నీకేదన్నా లవ్ ఎఫైర్ ఉందా అని."

"ఉంది."

మాధవి చేతిలో ముక్క జారిపోయింది. చటుక్కున ప్రీతి మొహంలోకి చూస్తూ ఎవరతను? అంది. అలా అడుగుతున్నప్పుడు మాధవి గుండె దడ, దడా కొట్టుకుంది. ఏ జవాబు తను వినకూడదనుకుందో అదే జవాబు చెప్పింది ప్రీతి. అయ్యో పాపం వేణుకి ఈ సంబంధం కూడా కుదరదా? దేవుడా, దేవుడా.

"మహేష్.. మహేష్ బాబు"

మాధవి నూనె జిడ్డుతో ఉన్న చేత్తో ప్రీతి నెత్తిన ఒక్కటి మొట్టింది. "నిన్నసలు తన్నాలి పట్టుకుని" కోపంగా అంది.

ప్రీతి పెదాల మధ్య నవ్వు బిగపట్టుకుని "అరె నిజం చెబుతున్నాను. మహేష్ బాబంటే హీరో మహేష్ ఒక్కడేనా? నా బాయ్ ఫ్రెండ్ పేరు మహేష్ కాకూడదా?" అంది.

"నీ మొహానికి మహేష్ బాబు బాయ్ ఫ్రెండ్ ఎప్పుడు కావాలి గానీ, నేనో సంబంధం చూశాను నీకు" అసలు విషయంలోకి వచ్చింది మాధవి.

"ఎవరు? వేణా?" తినడం పూర్తిచేసి, వాష్ బేసిన్ దగ్గరకు నడుస్తూ అడిగింది ప్రీతి చాలా మాములుగా అడిగింది. అలా అడగడంలో ఎగ్జయిట్మెంట్ లేకపోవడం కొంత నిరాశ కలిగించినా ఆ మాటకే మాధవి సంబరంగా అంది. "యస్. వేణు.. మన వేణునే."

ప్రీతి మాట్లాడకుండా చెయ్యి, మూతి కడుక్కుని నోట్లో నీళ్ళు పోసుకుని, పుక్కిలించి వచ్చి నాప్కిన్తో చేతులు తుడుచుకుంటూ మాధవి మొహంలోకి చూసింది.

మాధవి కూడా చెయ్యి కడుక్కువచ్చి టేబుల్ మీద ఉన్న ప్లేట్లు, గిన్నెలు సర్దుతూ చెప్పసాగింది. "వేణు చాలా మంచివాడు ప్రీతీ. నెమ్మదస్తుడు. చూశావుగా కుర్రవాడు కూడా బాగుంటాడు. తల్లి, తండ్రులకు ఒక్కడే కొడుకు. అంతో, ఇంతో ఆస్తి ఉంది. మంచి ఉద్యోగం ఉంది. ఎంత లేదన్నా జనరల్ మేనేజర్ స్థాయికి ఎదుగుతాడని అనుకుంటున్నాను. నీ అభిప్రాయం ఏంటి?"

మాట్లాడుతూనే కిచెన్లోకి, డైనింగ్ టేబుల్ దగ్గరకీ తిరుగుతూ అన్ని సర్దుకుంటూ, కాఫీ కూడా కలిపి తీసుకొచ్చింది. ప్రీతి మౌనంగా మాధవి మాటలు వింటూ ఫ్రెంచ్ విండోలోంచి బైట ఉన్న మొక్కల్ని చూడసాగింది.

మాధవి కాఫీ కప్పు ప్రీతికి ఒకటి ఇచ్చి తనొకటి తీసుకుని నిజం ప్రీతీ చాలా మంచివాడు అతన్ని చేసుకుంటే నువ్వు సుఖపడతావు అంది.

మాధవి మొహంలోకి చూసి సన్నగా నవ్వి తిరిగి తలవంచుకుని కాఫీ తాగసాగింది.

"మాట్లాడవేం? ఏదో ఒకటి చెప్పు."

ప్రీతి కాఫీ తాగడం పూర్తి చేసి, కప్పు టేబుల్ మీద పెట్టి టేబుల్ మీద వేలితో సున్నాలు చుడుతూ కూర్చుంది.

"ఏంటే మాట్లాడవేం?" చిరాగ్గా అడిగింది మాధవి.

ప్రీతి తలెత్తి చూసి నెమ్మదిగా అంది. "ఏం మాట్లాడను?"

"ఏదో ఒకటి వేణు మీద నా అభిప్రాయం చెప్పాను. నువ్వేం అనుకుంటున్నావో చెప్పచ్చుగా."

"వేణుకేం అక్కా! అందగాడు, బ్యాంక్ ఆఫీసర్ మంచివాడు కానీ,"

"ఊ కానీ, చెప్పు బాబు గురించేనా? అది జస్ట్ యాక్సిడెంటల్గా జరిగిన దాని ఫలితం. వాడిని నేను పెంచుకుంటాను."

"అదికాదు."

"మరేంటి?"

"ఆవిడ, వేణు విడాకులు తీసుకున్నారా?"

"అతను వద్దు అని ఆవిడ వెళ్ళిపోయాక ఇంక విడాకుల గోలెందుకు?"

"ఏమో! ఆవేశంలో వెళ్ళిపోయింది. ఆవేశం తగ్గాక రావచ్చుగా?"

"ఏం మూడేళ్ళదాకా తగ్గని ఆవేశం హఠాత్తుగా తగ్గిపోతుందా?"

ప్రీతి స్థిరంగా అంది. "అక్కా భార్యాభర్తలు, మాంగల్య బలం, నూరేళ్ళ పంట వగైరా స్లోగన్స్ నిజమో, అబద్ధమో నాకు తెలియదు. కానీ, ఆడపిల్లగా, పెళ్ళిచేసుకోబోయే ముందు నా సెక్యూరిటీ నేను ఆలోచించుకోవాలి. కీడెంచి మేలెంచమన్నారుగా పెద్దలు. లీగల్గా విడిపోని భార్యాభర్తలు, పైగా అతనికి ఆవిడంటే ప్రాణం అని తెలుసు నాకు. ఏ క్షణాన అయినా కలిసే అవకాశం మన ఇండియన్ సొసైటీలో ఉంది. అలా అయితే, నా పరిస్థితేంటి?"

మాధవి మ్రాన్పడిపోయింది.

●●●

**వేణు ఎంతో అందంగా, ఆధునికంగా కట్టించిన** ఇంట్లోకి తాయారమ్మ, కృష్ణస్వామి దంపతులతో గృహప్రవేశం చేయించాడు. మొత్తం స్నేహితులందరినీ ఆహ్వానించాడు. వేణు పెళ్ళి చేసి, ఆ దంపతులతో గృహప్రవేశం చేయించాలనుకున్న తాయారమ్మ కోరిక తీర్చలేకపోయినందుకు మాధవికి చాలా బాధగా అనిపించింది. ప్రీతి అభిప్రాయం ఆవిడతో చెప్పడానికి భయం వేసింది. ఏం చెప్పాలో తెలియక మాధవి కొద్దిరోజులు తప్పించుకు తిరిగింది. కానీ, అనుభవజ్ఞురాలు, వివేకవంతురాలు అయిన తాయారమ్మ మాధవి చెప్పకుండానే విషయం గ్రహించి చూపులతోటే ఆమెని ఓదార్చింది. గృహప్రవేశం పనుల్లో మాధవి ఆ ఇంటి ఆడపడుచుగా అన్ని పనులూ చేసింది. తాయారమ్మ సూచించినట్టుగా వేణు, మాధవి దంపతులకు మంచి బట్టలు పెట్టాడు.

ప్రీతి నెమ్మదిగా వేరే ఉద్యోగం చూసుకుని బెంగుళూరు వెళ్ళిపోయింది. వెళ్ళేముందు తన ఫియాన్సీని వేణుకి పరిచయం చేసింది. అతని పేరు సిద్దార్థ. ప్రీతితో పాటే సాఫ్ట్‌వేర్ ఇంజనీరుగా పనిచేస్తున్నాడు. ప్రస్తుతం ఇద్దరికీ బెంగుళూరులో వేరే ఉద్యోగం వచ్చింది. ఇద్దరూ కలిసే వెళ్తున్నారు. ఆ విషయం మాధవికి అప్పుడే చెప్పద్దని సమయం చూసి తనే చెప్తానని వేణుతో మాట తీసుకుంది ప్రీతి.

"వేణూ! అక్క మనసు ఒక విషయంలో కష్టపెట్టాను. అందుకే ఇప్పుడే ఈ విషయం చెప్పడం నాకిష్టం లేదు. నా ఆత్మీయుడిగా నీకు మాత్రం పరిచయం చేస్తున్నాను సిద్దూని. నీకు నచ్చాడా?" అంది వేణుతో కలిసి హోటల్లో కూర్చుని కాఫీ తాగుతూ..

"సిద్దూకేం చక్కగా ఉన్నాడు. మాధవి ఒద్దంటుందనుకోను" అన్నాడు వేణు.

"ఒద్దనదు మెచ్చుకోదు."

"ఏం? ఎందుకలా అనుకుంటున్నావు?" ఆసక్తిగా అడిగాడు.

"ఏం లేదు" అని కొన్ని క్షణాలు మౌనంగా ఉండి అంది ప్రీతి. "నీ అభిప్రాయం నాకు తెలియదు కానీ, అక్క నీ గురించి నాతో ప్రస్తావించింది.. కానీ" ఇబ్బందిగా ఆగిపోయింది.

వేణు ఆశ్చర్యంగా చూశాడు. "అలాగా ఏమంది?" అడిగాడు.

"ఏముంటుంది నువ్వు చాలా మంచివాడివని, యోగ్యుడివని నిన్ను పెళ్ళి చేసుకుంటే నేను చాలా సుఖంగా ఉంటానని"

"ఓ గాడ్!" వేణు గాభరాగా అన్నాడు. "మాధవి ఎందుకలా తొందరపడింది. నన్ను ఒకమాట అడగచ్చుకదా సారీ ప్రీతీ నేను మాధవికెప్పుడూ చెప్పలేదు నాకు సంబంధాలు చూడమని. మరి తనెందుకు తొందరపడుతోందో నాకర్థం కావడంలేదు. ఎనీవే సారీ."

"ఛ ఛ సారీ ఏంటి? తప్పేం లేదు. అక్క అలా అడగడంలో కానీ, నేను ఆల్‌రెడీ సిద్దుని ప్రేమిస్తున్నాను. తనది మన కులం కాదు. ఈ సంగతి చెబితే గొడవ అవుతుందని నేను చెప్పలేదు. అయినా వేణూ అక్క సంగతి పక్కన పెట్టు. నేను అడుగుతున్నాను. నువ్వెందుకు మళ్ళీ పెళ్ళి చేసుకోకూడదు?"

వేణు మాట్లాడలేదు.

ప్రీతి రెట్టిస్తూ అంది. "చెప్పు వేణూ! నువ్వింక అర్చన తిరిగి వస్తుందని అనుకుంటున్నావా?"

వేణు చురుక్కున చూశాడు. "లేదు రావాలని కూడా ఆశించడంలేదు. కానీ,"

"ఊ కానీ"

"మంచి అమ్మాయి దొరకాలి కదా! నేనీసారి నాకు నచ్చడం కన్నా అమ్మా, నాన్నలకి నచ్చే అమ్మాయిని చేసుకోవాలనుకుంటున్నాను."

"ఓ.." సంతోషంగా చిన్నగా అరిచింది ప్రీతి. "సో నువ్వు మ్యారేజ్ చేసుకుంటావు. మరి ఒకటడగనా?"

"చెప్పు"

"అర్చనతో డైవర్స్ తీసుకోవచ్చుకదా!?"

అప్పుడే ఆ విషయం గుర్తొచ్చినవాడిలా చూశాడు. "అవసరమా?" అన్నాడు.

"ఏమో చెప్పలేం కదా. తను తిరిగి వస్తే?"

"రానివ్వను." కోపంగా అన్నాడు.

నవ్వింది ప్రీతి. "అవన్నీ కాదు కానీ, చూడు వేణూ! కనీసం ఆవిడకి ఒక లెటర్ రాయి. ఇలా నువ్వు రిమ్యారేజ్ చేసుకోవాలనుకుంటున్నావని, ఆమె అంగీకారం కావాలని"

"చస్తే రాయను. " జేవురించిన మొహంతో అన్నాడు " ఎందుకు రాయాలి. రాయను. నాకు, మా పేరెంట్స్‌కి నచ్చిన అమ్మాయి దొరికితే పెళ్ళి చేసుకుని వెళ్ళి ఆవిడని కలుస్తాను"

అతని స్వరంలో వినిపించిన కసికి ముందు నివ్వెరపోయినా తరువాత అతడిని అర్థం చేసుకున్నదానిలా మెత్తగా నవ్వింది ప్రీతి. "ఆల్ ది బెస్ట్ వేణూ! నీ పెళ్ళికి పిలవడం మాత్రం మర్చిపోకు" అంది.

"నిజం చెప్పనా ప్రీతీ?" ఆమె మొహంలోకి సూటిగా చూస్తూ అన్నాడు వేణు.

అతనలా హఠాత్తుగా అడగడంతో ఖంగారుగా చూసింది ప్రీతి. ఏం చెప్తాడు? అన్నట్టు.

"అంత ఖంగారు పడతావేం? నిన్ను ఇబ్బంది పెట్టే మాట ఏం చెప్పనులే. నాకెందుకో నిన్ను చూడగానే నాకు నీలాంటి అల్లరి చెల్లెలుంటే ఎంత బాగుండేది అనిపించింది. అందుకే నీతో చాలా త్వరగా కలిసిపోయాను. లేకపోతే నేను ఏ ఆడపిల్లతో ఇంత చనువుగా ఉండడం జరగదు."

ప్రీతి నమ్మలేనిదానిలా చూసింది. ఆమె కళ్ళల్లో చిన్న మెరుపు, ఆ మెరుపులో ఒక రిలీఫ్ చూసిన వేణు మనసారా నవ్వాడు. "నిజం ప్రీతీ! నువ్విది నమ్మాలి" అన్నాడు.

ప్రీతి కూడా చిరునవ్వుతో మనస్ఫూర్తిగా అంది "నమ్ముతాను. నీ కళ్ళల్లో నిజాయితీ నన్ను నమ్మమంటోంది. అయితే నేను అక్క ప్రపోజల్ అంగీకరించకపోవడం ఎంత మంచిదైంది?"

"మాధవి.. పాపం నాకు పెళ్ళి చేయాలన్న ఆరాటంలో అవతలి వాళ్ళ మనోభావాలను పట్టించుకోవడంలేదు. నేను చెబుతాలే తనకి. డోంట్ వర్రీ."

"థాంక్యూ. ఇంక వెడదామా?" టేబుల్ మీద పర్సు చేతిలోకి తీసుకుంటూ అంది.

"ష్యూర్" వేణు కూడా సెల్ ఫోన్ తీసుకుని జేబులో పెట్టుకుంటూ లేచాడు.

ఆ తరువాత ప్రీతి బెంగుళూరు వెళ్ళిపోయింది. వెళ్తూ మాధవితో అంది. "త్వరలో నా పెళ్ళికి విజయవాడ వద్దువుగానిలే అక్కా. కోపం పెట్టుకోకుండా తప్పకుండా రా!"

మాధవి నిర్లిప్తంగా నవ్వేసింది.

మాధవికి చాలా బాధ అనిపించింది. కనీసం వెళ్ళేటప్పుడు అయినా వేణు డైవర్స్ తీసుకుంటే చేసుకుంటాను అంటుందని ఆశించింది. కానీ, తన పెళ్ళికి రమ్మని ఆహ్వానించిందంటే తను ఆల్‌రెడీ అబ్బాయిని చూసుకుందన్నమాట అనుకుని నిట్టూర్చింది మాధవి.

●●●

ఆ రోజు వేణు ఆఫీసు నుంచి హడావుడిగా వచ్చాడు. "అమ్మా, అమ్మా" అంటూ.

"ఏంటిరా ఏంటి హడావుడి?" అడిగింది తాయారమ్మ హాల్లోకి వస్తూ.

"ఆ అమ్మాయిని చూసుకోడానికి ఒక అబ్బాయి వస్తున్నాడు. ఆ అమ్మాయిని కాస్త మంచి చీర కట్టుకోమని చెప్పు" అన్నాడు.

"ఏ అమ్మాయి?" ఆశ్చర్యంగా అడిగిందావిడ.

"అదేనమ్మా. మన రిత్విక్‌ని చూసుకునే అమ్మాయి నీలవేణి"

"ఓ నీలవేణికి సంబంధం చూశావా? ఎంత మంచి మాట చెప్పావురా" ఆవిడ సంతోషం వెల్లివిరుస్తున్న స్వరంతో కొంచెం గట్టిగా పిలిచింది. "నీలవేణీ.. నీలవేణీ"

వేణు తన గదిలోకి వెళ్ళిపోయాడు.

రిత్విక్‌తో లాన్‌లో ఆడుకుంటున్న నీలవేణి వాడి చిటికెన వేలు పట్టుకుని వచ్చింది "ఏంటమ్మగారూ?" అంటూ.

"వాడిని నాకిచ్చి నువ్వెళ్ళి మొహం కడుక్కుని, కాస్త మంచి చీర కట్టుకుని తయారవు" అందావిడ తొందరపెడుతూ వేణు గదివైపు వెళ్ళింది తాయారమ్మ.

ఆవిడ వెళ్ళిన వైపు చూస్తూ అచేతనంగా మెట్లెక్కి తన గదివైపు వెళ్ళిపోయింది నీలవేణి.

బట్టలు మార్చుకుంటున్న వేణు దగ్గరకు వెళ్ళి అడిగింది తాయారమ్మ. "ఇంతకీ ఎవరి కుర్రాడురా ? ఏం కులం? ఏం చేస్తాడు?"

వేణు చిరునవ్వుతో చూశాడు. "మా బ్యాంకులో కొత్తగా చేరాడమ్మా ప్యూను. వాడికి కూడా ఎవరూ లేరుట. మేనత్తో ఎవరో పెంచారుట. వాళ్ళు కాపులనుకుంటా. ఈ అమ్మాయి గురించి చెప్పాను. అమ్మాయి బాగుంటే చాలన్నారు. బుద్ధిమంతురాలు కావాలన్నారు. అమ్మాయి బాగనే ఉంటుందిగా తయారైతే మంచమ్మాయి. అందుకే రమ్మన్నా"

"మంచిపని చేశావు. ఆ పిల్లనో ఇంటిదాన్ని చేస్తే మన బాధ్యత తీరిపోతుంది. ఈ ముక్క నాన్నగారి చెవిన కూడా వేసొస్తానుండు" అంటూ ఆవిడ కృష్ణస్వామి దగ్గరకు వెళ్ళింది. పెరట్లో పాదులకు నీళ్ళు పెడుతూ, పిచ్చి మొక్కలు ఏరిపారేస్తూ, కాలక్షేపం చేస్తున్న కృష్ణస్వామి దగ్గరకు వడి, వడిగా నడుస్తూ "ఇది విన్నారా?" అంది తాయారమ్మ.

ఆయన చేతిలో పని ఆపి ఆవిడ వైపు ప్రసన్నంగా చూస్తూ "ఏది?" అన్నాడు.

"మన వేణు నీలవేణికి సంబంధం చూశాడు. వాళ్ళు పిల్లను చూసుకోడానికిప్పుడు వస్తున్నార్ట."

ఆవిడ స్వరంలో వినిపిస్తున్న ఉత్సాహం, మొహంలో కనిపిస్తున్న ఆనందం చిత్రంగా చూశాడాయన. ఏనాటి ఋణానుబంధమో అనుకుంటూ చిన్నగా నిట్టూర్చి అలాగా అన్నాడు.

"అలాగా అని అంత మెల్లిగా అంటారేం? పదండి కాళ్ళు, చేతులూ కడుక్కుని బట్టలు మార్చుకుని హాల్లోకి రండి. మంచీ, చెడూ మాట్లాడాలి మీరే" అందావిడ.

"మాట్లాడదాంలే. ముందు అబ్బాయికి, అమ్మాయి, అమ్మాయికి అబ్బాయి నచ్చాలి కదా."

"నచ్చకేం చేస్తుంది? నీలవేణి మంచి చీర కట్టుకుని కాస్త తయారైతే సినిమా స్టారులా ఉంటుంది. పదండి, పదండి. నేనీలోగా ఏవన్నా టిఫిను చేస్తాను" అంటూ హడావుడిగా వంటగదివైపు వెళ్తూ, అయ్యో మాధవికి కబురు చేస్తే బాగుండేదే అనుకుంది. ఆమెకీ మధ్య ఏ విషయమైనా మాధవితో పంచుకోకపోతే వెలితిగా ఉంటోంది. మాధవి ఆ ఇంటి ఆడపడుచు అయిపోయింది.

నీలవేణి తన గదిలో కిటికీ దగ్గర స్థాణువులా నిలబడి బైటకి చూడసాగింది. వేణు బట్టలు మార్చుకుని తెల్లటి పైజమా, లాల్చీ వేసుకున్నాడు. రిత్విక్ చిటికెన వేలు పట్టుకుని లాన్‌లో తిరుగుతూ వాడితో ఏదో మాట్లాడుతున్నాడు. అప్పుడే కృష్ణస్వామి అక్కడికి వచ్చాడు. లాన్‌లో మొక్కలన్నీ గాలికి సుతారంగా కదులుతున్నాయి. రంగు, రంగుల గులాబీలు విరగబూసి ఉన్నాయి. గోడమీదుగా పాకి

అవతలి వైపుకి వంగి ఉంది బోగన్ విల్లా. లేత నారింజ రంగులో వింత అందంతో అలరారుతున్నాయా కాగితం పూలు. లాన్‌లో గడ్డి మెత్తగా, తివాచీ పరిచినట్టు ఉంది.

నీలవేణి కళ్ళల్లో అప్రయత్నంగా నీళ్ళు తిరిగాయి.

తను పెళ్ళి చేసుకుని ఈ ఇంటినుంచి వెళ్ళిపోవాలా? ఈ అమ్మగారిని, అమాయకపు ఆవిడ వాత్సల్యాన్ని, అయ్యగారి అభిమానాన్ని రిత్విక్‌తో అనుబంధాన్ని అన్నిటినీ వదులుకుని వెళ్ళిపోవాలా? ఈ ఇంట్లో ప్రతి అడుగులో తనకెన్నో మరిచిపోలేని అనుభూతులున్నాయి. ఈ మనుషులతో సుమారు ఐదేళ్ళ నుంచీ విడదీయలేని బంధం పెనవేసుకుపోయింది. ఇంతకాలం నుంచీ ఈ ఇంట్లో తానూ ఒకతిగానే భావించుకుంది తనని తాను. ఏనాడూ తనకి పెళ్ళి చేస్తారని, అక్కడినుంచి పంపిస్తారని అనుకోలేదు. ఇప్పుడు హఠాత్తుగా పెళ్ళిచూపులు అంటోంటే దుఃఖం ఆగడం లేదు. ఒద్దు. తనకి పెళ్ళొద్దు. ఈ ఇంటి నుంచి తనెక్కడికీ వెళ్ళలేదు. వెళ్ళలేదు.

నీలవేణి రెండు చేతుల్లో మొహం దాచుకుని వెక్కి, వెక్కి ఏడవసాగింది. తనకి ఎందుకంత ఏడుపొస్తోందో ఆమెకే అర్ధం కావడం లేదు.

కిందనుంచి ఒక్కసారిగా సందడి వినిపించడంతో ఉలిక్కిపడి కళ్ళు తుడుచుకుని కిటికీలోంచి బైటకి చూసింది. గేటు తోసుకుని ఒక స్త్రీ, ఇద్దరు మగవాళ్ళు, ఒక బాబు లోపలికి వస్తున్నారు. వాళ్ళని చూడగనే పెళ్ళికొడుకు ఎవరో తెలిసిపోయింది నీలవేణికి. వాళ్ళని వేణు నవ్వుతూ లోపలికి ఆహ్వానించడం చూడగానే మళ్ళీ దుఃఖం కట్టలు తెంచుకుంది.

"నీలవేణీ!" తాయారమ్మ స్వరం వినిపించడంతో ఖంగారుగా బాత్ రూములోకి దూరి తలుపేసుకుంది. గబ,గబా పది నిమిషాల్లో తయారై, పసుపు పచ్చ షిఫాన్ చీర కట్టుకుని, జుట్టు వదులుగా అల్లుకుని కూర్చుంది.

తాయారమ్మ ఆయాసపడుతూ పైకి వచ్చింది.

"ఏం చేస్తున్నావే. పిలిస్తే పలుకవు?" అంటూ.

"అయ్యో మీరొచ్చారేంటమ్మా బాత్ రూములో ఉన్నాను వినిపించలేదు." అంటూ చటుక్కున ఆవిడ దగ్గరకు నడిచి చేయందుకుంది నీలవేణి.

తనకి సమీపంగా నిలబడిన నీలవేణిని ఒక్కసారిగా అలా చూడగానే ఆవిడ తనకళ్ళను తనే నమ్మలేనట్టు మ్రాన్పడిపోయి నిలబడింది. నిర్లక్ష్యంగా అల్లి వదిలేసిన పెద్ద జడ, పసుపు పచ్చ షిఫాన్ చీరలో బొమ్మలా ఉన్న శరీరం, సన్నగా కాటుక దిద్దుకున్న విశాలమైన కళ్ళు, ఛామనఛాయకి హైదరాబాదు నీళ్ళు వంటపట్టి కొంచెం ఎక్కువే తెల్లగా అనిపిస్తోంది. నీలవేణి ఇంత అందంగా ఉంటుందా అనిపించింది ఆవిడకి. వెంటనే చూపులు తిప్పుకుంటూ, "సర్లే పద, పద వాళ్ళొచ్చారు" అంటూ తొందరపెట్టింది.

"నేను రెడీగా ఉన్నానమ్మా" నిర్లిప్తంగా అంది నీలవేణి హైదరాబాదు వచ్చాక నీలవేణి మాటల్లో యాస పూర్తిగా పోయింది.

పద. అంటూ ఆవిడ తిరిగి మెట్లు దిగుతోంటే తన చేయి అందించి ఆమెని అనుసరించింది.

మౌనంగా వాళ్ళముందు తలవంచుకుని నిలబడి, వాళ్ళడిగిన "నీ పేరేంటి? ఏమన్నా చదువుకున్నావా?" అనే రెండు ప్రశ్నలకి నోటితో ఒక జవాబు, తల ఊపడంతో మరో జవాబు చెప్పి కృష్ణస్వామి సైగచేయడంతో పైకి వెళ్ళిపోయింది.

"అమ్మాయి నచ్చిందండి మాకు" అన్నారు పెళ్ళివారు.

నచ్చకేం చేస్తుంది బంగారు బొమ్మలా ఉంది. కాస్త చదువుకుని ఉంటే కలెక్టర్ అంతటివాడు వచ్చేవాడు అనుకుంది మనసులో తాయారమ్మ.

కృష్ణస్వామి చెపుతున్నాడు. నీలవేణి వాళ్ళ కుటుంబంలోకి ఎలా వచ్చింది? ఆమె పూర్వాపరాలు చెబుతూ

"పిల్ల బంగారం మేము కట్నాలు ఇవ్వము. పెళ్ళి మాత్రం మా పిల్లకి చేసినంత ఘనంగా చేస్తాం. పిల్ల మెడలో మాకు తోచినట్టు అంతో, ఇంతో బంగారం పెడతాం. ఆపిల్ల కులం ఏదైనా ఇంతకాలం మాలో కలిసిపోయి, మమ్మల్ని కంటికి రెప్పలా చూసుకుంది. కాబట్టి ఆ పిల్ల మా పిల్లే. పండగలూ, పబ్బాలకూ పిలుస్తాం."

"దానికేం సార్. మాకూ మీలాంటి వాళ్ళ కుటుంబం నుంచి అమ్మాయి లభించడం గొప్ప. ఏ కులం అయిన మీ ఇంట్లో ఉంటోంది కాబట్టి మీ సంస్కారం, మీ మంచితనం ఆమెలో కూడా మాకు కనిపిస్తున్నాయి. మా వాడికి తల్లీ, తండ్రీ లేకపోవడంతో చదువులో వెనకబడి, చిన్న ఉద్యోగస్తుడైనాడు కానీ, బాగా చదువుకుని ఉంటే వాడూ బాంకు ఆఫీసర్ అయేవాడు" అన్నాడు పిల్లాడి మేనమామ గిరిధర్.

"బ్యాంకులో ప్యూన్ అయినా అతనికి వచ్చే జీతంతో వాళ్ళు హాయిగా బతకచ్చు. అమ్మాయి చాలా పొదుపుగా ఉంటుంది" అంది తయారమ్మ.

ఆ తరువాత ఆ మాటా, ఈ మాటా అయాక వాళ్ళ అంగీకారం తెలిపి వాళ్ళు వెళ్ళిపోయారు.

"ఘనమైన పని చేశావురా వేణూ. మంచి సంబంధం తెచ్చావు. ఆ అమ్మాయి మనల్ని నమ్ముకున్నందుకు మనం ఈ పెళ్ళి చేసి తన ఋణం తీర్చుకోవాలి" అంది తాయారమ్మ వాళ్ళు వెళ్ళాక. కృష్ణస్వామి అవునన్నట్టు తలపంకించి, "లాంఛనంగా తాంబూలాలు తీసుకుని, లగ్నపత్రిక రాసుకుందాం మంచి రోజు చూస్తాను" అన్నాడు.

"ఆ అమ్మాయి అభిప్రాయం అడిగారా?" అన్నాడు వేణు.

అప్పుడు గానీ ఆ దంపతులకి ఆ విషయం గుర్తుకు రాలేదు. అవును సుమా. ఇంతకీ నీలవేణికి నచ్చాడో లేదో అనుకుంది.

"అడగడానికేం ఉందిరా. మనం ఏదంటే అదే కదా. తనకేం తెలుసని" అన్నాడు కృష్ణస్వామి.

"తెలిసినా తెలియకున్నా అడగడం ధర్మం కదా నాన్నా. అమ్మా నువ్వే అడిగి చెప్పు. నాకు తెలిసి వద్దనదు కానీ, అడగాలి" అన్నాడు వేణు.

వేణు మాట నిజమే అనిపించింది ఆవిడక్కూడా "అలాగే అడుగుతాలేరా" అంది.

మర్నాడు మధ్యాహ్నం భోజనాలు పూర్తయాక వంటగది కడిగేసి, నీలవేణి తన గదిలోకి వెళ్ళిపోయింది.

వంట చేయడం తప్ప మిగతా పనులన్నీ నీలవేణి తన ఇల్లు అన్నంత జాగ్రత్తగా, శ్రద్ధగా చేస్తుంది. హైదరాబాదు వచ్చాక నీలవేణికి అక్కడ తిరగకూడదు, అది ముట్టుకోకూడదు అనే నిబంధనలు పోయాయి. తప్పని సరి పరిస్థితుల్లో ఆ అమ్మాయిని వంటగదిలోకి రానివ్వాల్సి వచ్చింది. కొత్తల్లో తాయారమ్మకి నీలవేణి అలా వంటగదిలో యధేచ్ఛగా తిరగడం చాల ఇబ్బందిగా అనిపించింది. సిటీలో తప్పదు కాబట్టి ఆవిడ అతి కష్టం మీద సరిపెట్టుకుంది. రాను, రానూ అలవాటైపోయింది. ఇప్పుడు ఆమె ఇల్లంతా శుభ్రం చేయడం, కిటికీ అద్దాలు రోజు విడిచి రోజు తుడవడం, టేబుల్స్, టీపాయ్, సోఫాలు బట్టతో తుడవడం, మధ్య, మధ్య ఫ్రిజ్ కడగడం ఇలాంటి పనులన్నీ ఎవరూ చెప్పకుండానే తన దినచర్యలో భాగంగా చేసుకుపోతుంటే ఆవిడ చాలా మామూలుగా చూస్తూ ఉంటుంది. ఆవిడకి తెలుసు ఆ పనులన్నీ చేయడం తనవల్ల కాదని, చేయకపోతే ఇల్లు ఛండాలంగా ఉంటుందని. అందుకే నీలవేణి చేస్తుంటే ఏం మాట్లాడదు. ఇల్లు ఎప్పటికప్పుడు అద్దంలా ఉంచుతుంది నీలవేణి. పగలు భోజనాలు కాగానే హాల్లో పడుకుంటే హాయిగా అనిపిస్తుంది ఆవిడకు. ఒక్కోసారి ఈ పిల్ల పెళ్ళి చేసుకుని వెళ్ళిపోతే ఈ ఇల్లు ఎలా అనిపిస్తుంటుంది ఆవిడకి కానీ అలా అని ఆమెకి పెళ్ళి చేయకుండా ఇంట్లో చాకిరీకి శాశ్వతంగా ఉంచుకోడం అమానుషం అని అనుకుంటుంది తనకి తానే.

తాయారమ్మ రోజులా పడుకోకుండా నీలవేణి వెళ్ళిన కొద్ది నిమిషాలకి తను కూడా మెట్లెక్కి పైకి వెళ్ళింది. నీలవేణి గది తలుపు ఓరగా వేసి ఉంది ఆవిడ తలుపు కొద్దిగా తోసి గదిలోకి తొంగి చూసింది. నీటుగా ఉంది గది. మంచం లేదు. కిందనే పరుపు

వేసుకుంది. ఓ మూల పాత స్టూలు మీద చిన్న కూజా, దానిమీద బోర్లించిన గ్లాసు, అలమరలో నీటుగా సర్దుకున్న ఆమె బట్టలు అక్కడక్కడా ఒకటీ, రెండూ రిత్విక్ బొమ్మలు అప్పుడప్పుడూ రిత్విక్‌ని తీసుకుని తన గదిలోనే ఆడించుకుంటుంది. ముఖ్యంగా వేణు ఇంట్లో ఉన్న సమయం దాదాపు తన  గదిలోనే గడుపుతుంది.

పరుపు మీద కుడివేపు తిరిగి పడుకుంది. ఎడం చేయి కళ్ళ మీద పెట్టుకుంది. ఆవిడ మృదువుగా "నీలవేణి.. " అని పిలుస్తూ లోపలికి నడిచింది.

దిగ్గున లేచింది. ఖంగారుగా లేచి నిలబడి "అయ్యో అమ్మగారూ మీరిలా వచ్చారేంటి? నేనే వస్తాకద పిలిస్తే" అంటూ ఆవిడ దగ్గరగా నడిచింది.

"పర్వాలేదులే అప్పుడప్పుడూ మెట్లెక్కాలిట. అబ్బాయి చెప్పాడు. అవునేంటి? నీ గదిలో ఒక్క కుర్చీ కూడా లేదా?" అందావిడ చుట్టూ చూస్తూ.

"ఇప్పుడే తెస్తానుండండి" అంటూ చివ్వున బైటకి వెళ్ళి బాల్కనిలో ఉన్న ప్లాస్టిక్ కుర్చీ తీసుకొచ్చి వేసింది. ఆవిడ మోకాళ్ళు పట్టుకుని కూర్చుంది.

"కూర్చో నువ్వు కూడా" అంది నిలబడిన నీలవేణిని చూస్తూ.

"పర్లేదండి చెప్పండి" అంది నీలవేణి నిలబడే

"ఏం లేదు. నిన్న పెళ్ళిచూపులు జరిగాయి కదా. వాళ్ళకి నువ్వు నచ్చావు. మరి నీ సంగతేంటి? నీకతను నచ్చాడా?" అడిగిందావిడ.

నీలవేణి అపాదమస్తకం వణికింది. నిన్నటి నుంచీ ఆమె అదే ఆలోచిస్తోంది. రాత్రంతా కంటిమీద కునుకు కూడా లేదు. ఈ ఇల్లు, ఈ మనుషులు తప్ప మరో ప్రపంచం గురించి ఆలోచించలేదు. అది ఎలా ఉంటుందో కూడా ఆమెకి తెలియదు. అకస్మాత్తుగా అమ్మగారు వచ్చి నీకు పెళ్ళి చూపులు అని చెప్పగానే గుండె గుభేలుమంది. అసలు పెళ్ళి చూపులంటే ఏంటో కూడా తెలియదు. తనేం చేయాలో, ఎలా నిలబడాలో, ఏం మాట్లాడాలో కూడా తెలియదు. అలాంటిది అత్యంత కష్టంగా పది నిమిషాలు నిలబడి వచ్చేసింది. ఆ తరువాత వాళ్ళల్లో పెళ్ళికొడుకు ఎవరు? అతనేం చేస్తాడు? అతనెక్కడ ఉంటాడు? ఏమీ ఆలోచించలేదు. అసలా ఆలోచనలు రావడం లేదు. ఒక్కటే తెలుస్తోంది. ఈ ఇల్లు, ఈ మనుషులను వదిలి తను వెళ్ళిపోవాలి వెళ్ళిపోయి బతకగలదా? ముక్కూ, మొహం తెలియని వాళ్ళతో అసలు ఎలా మసలుకోవాలో కూడా తెలియదు. పైగా ఇక్కడ అందరితో ఏదో తెలియని ఒక బలమైన అనుబంధం పెనవేసుకుపోయింది. ఆ బంధాన్ని తెంపుకుని వెళ్ళడం అంటే తన ప్రాణాలు ఇక్కడ వదిలి కేవలం కట్టెగా వెళ్ళాలి.

"చెప్పమ్మా నీకు నచ్చాడా?" ఆవిడ మళ్ళీ అదే మృదుస్వరంతో అడిగింది.

నీలవేణి కళ్ళు నీటితో నిండి బొటబొటా కన్నీళ్ళు కారిపోయాయి.

ఆవిడ ఖంగారుగా కుర్చీలోంచి లేచి ఆమె దగ్గరగా వచ్చి అడిగింది. "అరెరె. ఎందుకేడుస్తున్నావు? ఏం జరిగింది?"

నీలవేణి సమాధానం చెప్పలేదు. ఆవిడ మాటల్లోని అభిమానం, వాత్సల్యం ఆమె గుండెని తాకి, చల్లగాలి సోలిన మేఘంలా వర్షించసాగింది. గుండెల్లోంచి దుఃఖం కట్టలు తెంచుకుని ప్రవహించసాగింది.

ఆవిడకి అయోమయంగా అనిపించింది. ఎలా ఓదార్చాలో, ఏం చేయాలో అర్థం కాలేదు. "ఏం జరిగింది నీలవేణి? " అంది.

"అమ్మగారూ!" వెక్కుతూ పిలిచింది నీలవేణి.

"ఏంటే చెప్పు ఎందుకేడుస్తున్నావు? నీకీ సంబంధం ఇష్టంలేదా? చెప్పమ్మా"

"నాకిష్టాలేంటమ్మగారూ. నా బతుక్కి మీరు పెళ్ళిచేయాలనుకోడమే గొప్ప. ఇంక నాకో ఇష్టం కూడానా"

"తప్పు అలా మాట్లాడకూడదు. ఏం నువ్వు మనిషివి కావా? నీకూ కోరికలు, ఆశలూ ఉండవా? నీకేదన్నా మనసులో ఇలాంటి వాడు కావాలని ఉందా చెప్పు. ఏదో వదిలించుకోవాలని నీకు పెళ్ళి చేయాలనుకోడం లేదు. ఎక్కువ కాలం నిన్నిలా మా చాకిరీకి వాడుకుంటే ఈ సమాజం మమ్మల్ని దుమ్మెత్తి పోస్తుంది కదా. నువ్వే చెప్పు. అదీగాక నీక్కూడా పెళ్ళి వయసు వచ్చింది. నీకు మాత్రం కోరికలు లేవూ, నీది అనే ఇల్లు, వాకిలీ, నీ మనిషి నీకు కావాలి కదమ్మా. నీకు పెళ్ళిచేయడం మా బాధ్యత కదా. అందుకే ఈ కార్యం భుజాలమీద వేసుకున్నాడు మా అబ్బాయి."

ఎంత మంచివాళ్ళు వీళ్ళు. ఎంతటి దైవస్వరూపులు. ఇక్కడి నుంచి వెళ్ళిపోతే తనకిలాంటి వ్యక్తులు కనిపిస్తారా? ఆ పెళ్ళివాళ్ళు ఎలాంటివాళ్ళో ఏంటో. టీవీ సీరియల్స్‌లో చూపించినట్టు తనకి విషం పెట్టి చంపేస్తే తనని చిత్రహింసలు పెడితే, నిత్యం తనని అనాధ అంటూ హింసిస్తే.

"అమ్మగారూ!" నీలవేణి కుప్పకూలినట్టు ఆవిడ పాదాలమీద పడిపోయింది.

"అయ్యో ఏం పనే ఇది. లే, లే" ఆవిడ ఒంగి నీలవేణి భుజాలు పట్టుకుని లేవనెత్తింది.

"కళ్ళు తుడుచుకో ఏడుపు ఆపుకో. మాట్లాడు. నీ మనసులో ఏం ఉందో చెప్పు."

తల అడ్డంగా ఊపుతూ అంది నీలవేణి "అమ్మగారూ నాకు ఇక్కడ నుంచి వెళ్ళాలంటే భయంగా ఉంది. నేను ఎక్కడా బతకలేను. నాకు పెళ్ళివద్దు. మీ పాదాల దగ్గర ఉండనివ్వండి. నాకింతకన్నా ఏం ఒద్దమ్మా కాదనకండి. నాకు ఎక్కడ బతకాలన్నా భయమే."

ఆవిడ నివ్వెర పోయింది. ఏం జరుగుతోందో అర్ధం కాలేదు. నీలవేణి పెళ్ళి అంటే ఎందుకింతగా భయపడుతోందో అసలు అర్ధం కాలేదు. నెమ్మదిగా అంది "అంత భయం దేనికే? వేణు బాబు మీద నమ్మకం లేదా? మంచివాడినే చూస్తాడు. నువ్వు సుఖంగా ఉండాలనేగా మా ఆశ."

"నేను ఇక్కడే సుఖంగా ఉంటానమ్మా"

"కానీ, ఎలా కుదురుతుంది నీలవేణీ నువ్విక్కడ ఇలా శాశ్వతంగా ఉంటే మా సంగతి పక్కన పెట్టు, వేణుబాబుకి చెడ్డపేరు రాదా? వయసులో ఉన్న నిన్ను మా ఇంట్లో ఎలా అట్టేపెట్టుకుంటాం పెళ్ళి చేయకుండా? మా పరువు, మర్యాదలు ఉంటాయా చెప్పు. నలుగురూ నాలుగుమాటలంటారమ్మా"

దెబ్బతిన్నట్టుగా చూసింది. ఆవిడ మాటలు నీలవేణికి కరెంట్ షాకుల్లా తగిలాయి. తనకి పెళ్ళి ఇష్టంలేదు. కానీ, ఆవిడ చెబుతోన్న విషయాలు వింటోంటే తన వలన ఈ ఇంటికి చెడు జరుగుతోందనిపిస్తోంది. తనకి ఆశ్రయం ఇచ్చి, కళ్ళల్లో పెట్టుకు చూసిన ఈ కుటుంబానికి తన వల్ల అపకారం జరగడమా? అంతకన్నా తను పొడుచుకుని చావడం నయం. అందుకే గాభరాగా అంది.

"అమ్మా అంతమాట అనకండి. నా వలన మీక్కానీ, బాబుగారిక్కానీ చెడ్డపేరు రావడం నాకిష్టంలేదు. ఒకవేళ అదే జరిగేట్టయితే నా అభిప్రాయంతో పనిలేదు. మీకు ఎవరు నచ్చితే వాళ్ళతో నా పెళ్ళి చేయండి. నాకు మాత్రం ఎవరెలాంటివారో ఎలా తెలుస్తుంది?"

"నిన్ను వదులుకోవడం మాకూ ఇష్టంలేదు. కానీ, తప్పదు. ఇది కాకపోతే మరోటి. నువ్వు ఏదో ఒక సంబంధం ఒప్పుకుని పెళ్ళిచేసుకోవాలమ్మా"

కన్నీళ్ళతో చూస్తూ స్థిరంగా అంది నీలవేణి. "అమ్మా! నా వలన మీకు ఎట్లాంటి చెడూ జరగడం నేను భరించలేను. మీరెలా చెబితే అలా జరగనివ్వండి. మీ ఇష్టం. నా భవిష్యత్తు మీకే వదిలేస్తున్నాను."

"మనస్ఫూర్తిగా అంటున్నావా ఈ మాట?"

"అవును మనస్ఫూర్తిగా అంటున్నాను. నాకు ఇక్కడినుంచి వెళ్ళడం ఇష్టంలేని మాట నిజం. కానీ, అది జరిగేపని కాదు కాబట్టి వెళ్ళాలి. నేనెక్కడికి వెళ్ళాలో నాకు తెలియదు. మీకన్నా నా బాగోగులు చూసేవాళ్ళు ఎవరున్నారు? అందుకే మీరేం చెబితే అది చేస్తాను. నన్ను నమ్మండి."

ఆమె మాటలకి తాయారమ్మ ముగ్ధురాలైంది.

ఎంత అణుకువ. ఎంత మంచితనం. ఎంతటి పనిమంతురాలు, ఎంత బుద్ధిమంతురాలు. కురూపి కాదు. అంతో ఇంతో అందమైందే. ఈమెని భార్యగా పొందినవాడు, ఈమెని కోడలిగా పొందిన కుటుంబం ఎంతో అదృష్టం చేసుకుని ఉండాలి. కానీ, కానీ, ఎవరి పిల్లో, ఏం కులమో తెలియని ఈ పిల్లని చూస్తూ, చూస్తూ ఊహూ. కుదరదు.

శాశ్వతంగా ఈ పిల్లనిక్కడ ఉంచాలంటే ఒకటే మార్గం. ఈ ఇంటి కోడల్ని చేసుకోడం. కానీ, శుద్ధ శ్రోత్రియ బ్రాహ్మల కుటుంబానికి ఈమెని ఏ అర్హతతో కోడల్ని చేయగలదు. పైగా చదువు, సంస్కారం, నాగరికత ఉన్న వేణు చదువూ, సంధ్యా లేని ఈ అమ్మాయిని భార్యగా అంగీకరిస్తాడా?

ఆవిడ తన ఆలోచనలకి తానే ఉలిక్కిపడింది. ఛ, ఛ నేనేంటి ఇలా ఆలోచిస్తున్నాను. తప్పు. ఈ ఆలోచన వచ్చిందని తెలిసిందంటే ఆయన తనని నిప్పుల్లో కడిగినా కడుగుతాడు. పని పిల్ల పనిపిల్లే. ఆమె మంచితనానికో, పనితనానికో స్వేచ్ఛ, స్వాతంత్ర్యం ఇచ్చినంత మాత్రాన ఇలాంటి నిర్ణయాలు తీసుకోడం సమంజసమా?

అయినా ఆ పిల్ల కన్నీళ్ళకిలా కరిగిపోయి, ఇలాంటి ఆలోచనలేంటి? బుద్ధి తక్కువ కాకపోతే.

ఆవిడ నెమ్మదిగా ఆలోచనలు వదిలించుకుని నీలవేణి తలమీద చేయి పెట్టి మనసులోనే దీవించి మౌనంగా అక్కడి నుంచి వెళ్ళిపోయింది.

ఆవిడ వెళ్ళిన వైపు చూస్తూ నిలబడిపోయిన నీలవేణి కళ్ళు మూసుకుని రెండు చేతులూ జోడించి కనిపించని దేవుడికి దణ్ణం పెట్టుకుంటూ అనుకుంది. "దేవుడా వచ్చే జన్మ అనేది ఉంటే ఈ మనుషుల మధ్యలోనే బతికే అదృష్టం ఇవ్వు.!"

●●●

**అర్చన ఆర్.డి.వోగా రాజమండ్రిలో మంచి పేరు తెచ్చుకుంది.**

మొదట్లో కొన్ని సంఘటనలకు భయపడి, బెదిరిపోయి తల్లడిల్లినా క్రమంగా తనకి తనే ధైర్యం చెప్పుకుని క్లిష్ట సమస్యలని కూడా చాకచక్యంగా పరిష్కరిస్తూ, అటు ప్రభుత్వాధికారుల దగ్గరా, ఇటు లోకల్ ఎమ్.ఎల్.ఏలు, ఇతర నాయకుల దగ్గరా తన తోటి ఉద్యోగుల దగ్గరా, సబార్డినేట్స్ దగ్గర కూడా మంచి ఆఫీసర్‌గా పేరు పొందింది.

ఆరోజు అర్చన ఆఫీసుకి వెళ్ళేటప్పటికి ఆమె కోసం నలుగురైదుగురు విజిటర్స్ ఎదురు చూస్తున్నారు. లాండ్ తగాదాకి సంబంధించిన విషయం.

అర్చన తన ఛాంబర్‌లోకి వెళ్తూనే వాళ్ళ హడావుడీ మొదలైంది.

"చాలాసేపట్నించీ ఎదురుచూస్తున్నాం. ఇంకా ఎంతసేపు అని అరుస్తున్నారు." బహుశా పి.ఏ ఆపి ఉంటాడు "మేడమ్ ఇప్పుడే వచ్చారు. కొంచెం రిలాక్స్ అవనివ్వరా" అని అతని స్వరం అస్పష్టంగా వినిపించింది.

తన సీటు దగ్గరకు వెళ్తూనే బెల్ కొట్టి వాళ్ళని పంపించమని చెప్పింది ప్యూన్‌కి.

ఆ వచ్చిన వాళ్ళల్లో ఒకమ్మాయి కూడా ఉంది. ఆమె, ఆమెతో పాటు ఇద్దరు వ్యక్తులు వచ్చారు. ఆ అమ్మాయి చాలా ఫెరోషియస్‌గా ఉంది. చూడగానే బాగా డబ్బున్నవాళ్ళ అమ్మాయిలాగా ఉంది. సుమారు 30, 32 ఏళ్ళు ఉండచ్చు. తెల్లగా ఉంది. ఖరీదైన

సిల్కు చీర, మెడలో పుస్తెల తాడు, చంద్రహారం, రెండు పేటల ముత్యాల గొలుసు, రెండు చేతులకీ నిండుగా బంగారు గాజులు, వేళ్ళకి ఉంగరాలు, చెవులకి డైమండ్ దిద్దులు, డైమండ్ ముక్కుపుడుక

"నమస్కారం మేడమ్ గారూ" అంటూ నమస్కరిస్తూ వచ్చారు.

అర్చన తల పంకించి "చెప్పండి ఏంటి ప్రాబ్లమ్?" అంది.

వాళ్ళల్లో ఒకతను మొదలుపెట్టాడు.

"వీళ్ళాయన మా ల్యాండ్ ఇల్లీగల్‌గా ఆక్రమించుకుని ఇప్పుడు అక్కడ కల్టివేషన్ ప్రయత్నాలు చేస్తున్నాడు మేడమ్. మేము మా ల్యాండ్ అని అన్నందుకు ఇదిగో ఈ అమ్మాయి తండ్రి మా మీదకు తగాదాకి వచ్చాడు" అన్నాడు అతను కొంచెం చదువుకున్నవాడిలా ఉన్నాడు.

"నోరుమూసుకో అది మా తాతల నుంచి మాకు సంక్రమించిన భూమి మధ్యలో అక్రమంగా ఆక్రమించుకున్నది నువ్వు" అంటూ రయ్యిన లేచాడు అమ్మాయి తండ్రి. ఎత్తుగా, లావుగా పంచెకట్టుతో, బుర్రమీసాలతో అచ్చు సినిమాల్లో చూపించే భూస్వామిలాగా ఉన్నాడు.

అర్చన కొంచెం గట్టిగా అంది. "మీరు, మీరూ దెబ్బలాడుకునేట్టయితే ఇక్కడికెందుకు వచ్చారు?"

"అదికాదు మేడమ్. అది మా నాన్నగారు నాకు పసుపు కుంకాల కింద నా పెళ్ళిలో ఇచ్చారు. మా ఆయన దాన్ని సాగుచేసి వరి పండించాలనుకుని ఈ మధ్యే ఆ పని మొదలుపెట్టాడు. ఈ లోగా ఈ పెద్దమనిషి మాతో యుద్ధానికి వచ్చాడు" అంటూ ఆ అమ్మాయి మొదలు పెట్టింది. ఆ అమ్మాయి వైపు సూటిగా చూస్తూ అడిగింది అర్చన.

"ఏం చేస్తాడు మీ ఆయన?"

"మా ఆయన రూలింగ్ పార్టీ లీడరు" అంది వయ్యారాలు పోతూ.

"ఓ సరే మీరు వెళ్ళి బైట కూర్చోండి. పిలుస్తాను" అంటూ వాళ్ళని బైటకి వెళ్ళమని, బెల్ నొక్కి పి.ఏ ని పిలవమని చెప్పింది ప్యూనుకి.

శ్రీపతి వచ్చాడు. వస్తునే ఆమెకి విష్‌చేసి ఆ ల్యాండ్ గురించిన సమాచారం మొత్తం చెప్పాడు.

నిజానికి అది పోరంబోకు భూమి. ఆ అమ్మాయి తండ్రి పేరు వీరాస్వామి. అతను పెద్ద రాజకీయనాయకుడు. ఏ పార్టీ రూలింగ్‌లో ఉంటే ఆ పార్టీకి గొడుగుపట్టి పెత్తనం చలాయిస్తుంటాడు. అతనికి ఒక కూతురు విజయదుర్గ. కొడుకు వరప్రసాద్. కూతుర్ని మరో రాజకీయ నాయకుడైన మునిస్వామి కొడుకు కిచ్చి పెళ్ళి చేస్తూ కట్నం కింద యాభై లక్షల, బంగారం, విశాఖపట్నంలో ఒక ఫ్లాటు, ఈ పోరంబోకు భూమి ఇచ్చాడు. ఈ భూమిని తన పరపతి, పదవి, దాదాగిరీ ఉపయోగించి సంపాదించాడు. ఒక విధంగా అన్యాయంగా ఆక్రమించాడు. అల్లుడు ఈయనని మించినవాడు. రాజకీయం అడ్డుపెట్టుకుని, భూ ఆక్రమణలు, గుండాయిజాలు చేస్తుంటాడు. అతనికి ఈ అమ్మాయి కూడా వత్తాసు. దొంగలు, దొంగలు ఊళ్ళు దోచుకున్నట్టు ఆ ఆక్రమణలో తనకీ భాగం ఉందంటూ ఇప్పుడీ కొత్త వ్యక్తి వచ్చాడు. వీళ్ళందరికీ తహసీల్దారుగారి వత్తాసు ఉంది. ఆయన ప్రోద్భలంతోటే చుట్టుపక్కల చాలా ప్రభుత్వ స్థలాలు ఆక్రమించుకున్నారు.

వింటుంటే రగిలిపోయింది అర్చన - ఎంత అన్యాయం! పైగా అన్యాయాన్ని సమర్థించుకోడం సిగ్గన్నా లేదా వీళ్ళకి!? తహసీల్దారు అసలలాంటివాడని తను ఎన్నడూ అనుకోలేదు. అంటే చాపకింద నీరులా చాలా చేస్తున్నాడనమాట. తను ఎంత అమాయకురాలు అర్చన అప్పటికప్పుడు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌ని ఫైల్స్‌తో సహా రమ్మని కబురు చేసింది.

ఆఘమేఘాలమీద ఆక్రమించుకున్న భూమిని తిరిగి ప్రభుత్వ పరిధిలోకి తీసుకోడానికి తన ప్రయత్నాలు తాను చేయసాగింది. ఆ పరంపరలోనే తెరమీదికి వచ్చాడు నాగరాజు. విజయదుర్గ భర్త. పెద్ద మీసాలు, బాగా వళ్ళొచ్చి, ఫెళఫెళ్ళాడే ఖద్దరు చొక్కా వేసుకుని వస్తాదులా వచ్చాడు.

అతన్ని చూడగానె అర్చన, ఆమెని చూడగానే నాగరాజు కూడా ముందు నిశ్చేష్టులయారు.

తేరుకున్న అర్చన మండిపడింది. అతన్ని చూడగానే ఒక్కసారిగా గతం కళ్ళముందు కదిలి ఎంతో ఆవేశపడిపోయింది. ఇంతకాలం అణచి ఉంచిన పగ, ప్రతికారం ఉవ్వెత్తున ఎగిశాయి. లాగిపెట్టి ఆ చెంపా, ఈ చెంపా వాయించాలనిపించింది. కానీ, తన హోదా, అధికారం, తన పరువు, ప్రతిష్ట ఆమెనా పని చేయనివ్వలేదు. అందుకే తనతో మట్లాడటానికి వచ్చిన అతడిని మాట్లాడకుండానే అక్కడి నుంచి పంపించేయాల్సిందిగా పి.ఏకి చెప్పింది

ఎవరో లేడీ ఆఫీసర్ ఉందని తెలుసుగాని, ఆ లేడీ అర్చన అనీ, తల్చుకుంటే తన పొగరు, రాజకీయ వేషాలు అన్ని అడ్డంగా తోసేయగల అధికార హోదాలో ఉందని తెలియని నాగరాజు అర్చనని అలా చూడగానే నిశ్చేష్టుడయాడు. నోటినుంచి మాట రాలేదు. తానొక పార్టీ లీడరు అయినా ఆ క్షణంలో తనకి తాను ఆమె ముందు నిలబడలేనివాడని అర్ధమైంది. అందుకే మౌనంగా వెళ్ళిపోయి మరో విధంగా ఆమె నుంచి తన కేసు విషయమై శరణు కోరాలని నిశ్చయించుకున్నాడు.

అయితే, అర్చన మాత్రం ఎవరితో ఏమీ చర్చించకుండా తహసిల్దారుతో చర్చిస్తూ ఒక అధికారిగా తను తీసుకోవాల్సిన చర్యలు తీసుకోసాగింది.

తహసీల్దారు సహకారంతో తప్పుడు పనులు చేస్తున్న ఆ కుటుంబం మొత్తం ఆమె మీదకి తగాదాకి వచ్చింది. అది మాది మా పూర్వీకులది అంటూ ఏవేవో కాగితాలు చూపించారు.

ఆఖరికి అధికారి ఒక మహిళ కాబట్టి మరో మహిళే ఆవిడతో డీల్ చేస్తే బాగుంటుందని అంటూ తన భార్యని ఎగదోసాడు నాగరాజు.

ఆమెకిలాంటి లావాదేవీలు చాలా సామాన్యం అన్నట్టు వచ్చి అర్చనకి ఒక లెదర్ బ్యాగ్ ఇచ్చింది.

"ఏంటిది?" తీవ్రంగా అడిగింది అర్చన.

"ఏదోలెండి మేడమ్‌గారూ. మాకు తోచింది. మీ సహకారం కావాలి మాకు" అంటూ వెకిలిగా నవ్వుతున్న విజయదుర్గని అసహ్యంగా చూస్తూ అరిచింది అర్చన.

"ఆడదానివై ఉండి ఇలాంటి పనులు చేయడానికి నీకు సిగ్గులేదూ. ప్రభుత్వ భూములంటే నీ ముత్తాతల సొంతం అనుకుంటున్నావా? అయినా ఒక గూండాకి, రౌడీకి పెళ్ళానివైన నీకు ఇంతకన్నా నీతి ఎక్కడుంటుంది? వెళ్ళు ముందు ఇక్కడినుంచి."

"ఏమ్మో ఏదో ఆడదానివని ఊరుకుంటుంటే పెద్ద నీతిమంతురాలిగా మాట్లాడుతున్నావే. నీలాంటి వాళ్ళని చాలామందిని చూశాంలే. పట్టు ఈ కానుక తీసుకుని ఈ కేసు వదిలెయ్. ఎన్నేళ్ళు ఈ ఉద్యోగంలో కొట్టుకున్నా ఇంత డబ్బురాదు. ఇంద" అంటూ బ్యాగు అర్చన వైపు నిర్లక్ష్యంగా తోసింది.

అర్చన ఆవేశంతో వణికిపోతూ "గెట్ అవుట్. ఒక్క క్షణం ఇక్కడ కనిపించావంటే నిన్నూ, నీ మొగుడునీ అరెస్టు చేయిస్తాను" అంటూ అరిచింది.

ఆమె అరుపుకి బైటనుంచి శ్రీపతి, ప్యూను, మరో స్టెనో పరిగెత్తుకుని వచ్చారు.

ఆవేశంతో నిలువెల్లా వణికిపోతున్న అర్చనని చూసి వాళ్ళకి మతిపోయింది.

శ్రీపతి ముందుగా తేరుకుని విజయదుర్గని ఒక విధంగా బలవంతంగా బైటకి నెట్టినంత పనిచేశాడు.

అర్చనకి చల్లని కూల్ డ్రింక్ తెప్పించి ఇచ్చి ఆమెని మామూలు స్థితికి తీసుకురావడానికి చాలాసేపు పట్టింది వాళ్ళకి.

ఆ తరువాత అర్చన ఈ విషయం కలెక్టర్ దాకా రాసింది. పూర్తి రిపోర్టు ఇస్తూ నా జ్యూరిస్ డిక్షన్‌లో ఇలాంటి దారుణాలు జరగడం నేను భరించలేను. ఈ భూ ఆక్రమణ కేసులో పార్టీకి సహకరించి ఇల్లీగల్ యాక్టివిటీస్‌ని ప్రోత్సహిస్తున్న తహసీల్దారు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌ల మీద చర్యలు తీసుకోవాలని సూచించింది.

ఆమెకి కొన్ని సంవత్సరాలుగా నాగరాజు మీద రగులుతున్న పగ తీర్చుకునే అవకాశం వచ్చింది. అది వదలాలని లేదు. అఫీషియల్‌గా అతని మీద ప్రతీకారం తీర్చుకునే అవకాశం వదులుకుందంటే జీవితాంతం ఒక ఓటమిని మౌనంగా భరించాలి అనిపించింది.

చాలా బెదిరింపులు, ప్రయత్నాలు, గొడవలు తరువాత నాగరాజు మీద విజయం సాధించింది.

అపజయం పాలైన విజయదుర్గ అర్చన ఇంటికి యుద్ధానికి వచ్చిందో రోజు.

ఆమెని సూటిగా అడిగింది అర్చన. "నీకు నీ మొగుడు పెద్ద గుండా అనీ, నీలాంటి ఆడవాళ్ళ జీవితాలెన్నో నాశనం చేసాడని నీకు తెలుసా. అలాంటి వాడితో కాపురం చేయడానికి సిగ్గులేదూ ఈ నగలకోసం, ఈ పట్టు చీరలు, పసుపు, కుంకాల కోసం ఈ సమాజంలో గూండాలకి ఉన్నత స్థానం కల్పించడంలో నువ్వు కూడా కారణం అవుతున్నావని నీకు తెలుసా! అలాంటి మగాడికి పెళ్ళాంగా బతికేకన్నా నీకున్న ఆస్తితో ఒంటరిగా బతకలేవా?"

విజయదుర్గ నవ్వింది. ఆమె నవ్వులో ఒక విధమైన కసి కనిపించింది. అప్పటిదాకా అర్చన మీద అగ్ని వర్షం కురిపించిన ఆమె అర్చన మాటలతో నవ్వింది. మాటల్లో మృదుత్వం చోటు చేసుకుంది.

"మేడమ్. ఈ సమాజంలో ఏ మగాడు నీతిమంతుడో మీరు చెప్పగలరా? భార్యకాక, మరో ఆడదానితో సంపర్కంలేని మగాడిని మీరు చూపించండి నేను నా మొగుడ్ని వదిలేస్తాను.

పిచ్చి మేడమ్. అందరూ మగాళ్ళూ వెధవలే అయినప్పుడు ఆడవాళ్ళంతా పెళ్ళి ఒద్దు అనిగానీ, పెళ్ళయ్యాక వాడు వెధవని తెలిశాక విడాకులు తీసుకుంటాను అనిగాని అంటే ఇంక ఈ సమాజంలో పెళ్ళిళ్ళు, కాపురాలు, పిల్లలు ఏమీ ఉండవు. మా ఆయన బైట పులి కావచ్చు. కానీ ఇంట్లో నా ముందు పిల్లి. వాడు బైట ఎంతమందితో తిరిగి వచ్చినా నేను కాపురం చేస్తున్నానని అనుకుంటున్నారా? చేస్తున్నా తప్పదు. చేయకపోతే వాడు మరో అమ్మాయిని చూసుకుంటాడు. నేను కాకపోతే నా స్థానం మరో ఆడది తీసుకుంటుంది. ఎందుకిస్తాను చెప్పండి.

మీకో సంగతి చెప్పాలి. వాడికెలాగైతే నేను కాక వేరే సంబంధాలు ఉన్నాయో. నాకూ అలాగే ఉన్నాయి వాడు చేసే చెడ్డ పనులకి మద్దతు ఇస్తూ, నా సరదాలు నేనూ తీర్చుకుంటాను. మగాడికో నీతి, ఆడదానికో నీతి ఉండకూడదు కదా. ఎప్పుడైతే వాడి బుద్ధి తెలుసుకున్నానో అప్పుడే నేనీ నిర్ణయం తీసుకున్నా. లోకం దృష్టిలో వాడు నా మొగుడు. నా పిల్లలకి తండ్రి. తప్పదండి. ఇలాగే బతకాలి. బతక్కపోతే చావాలి. ఎందుకంటే నాలాంటి ఆడదాన్ని మొగుడు లేకుండా ఈ లోకం బతకనివ్వదు. మొగుడు చాటున ఏం చేసినా పట్టించుకోదు.

లోకం వెర్రిబాగులదండి బాబూ! అందుకే నాకుండే సంబంధాలు, అనుబంధాలు నాకుంటాయి. కాబట్టి ఇదిగో ఈ మాంగల్యం కోసం వాడికి కట్టుబడి ఉన్నాను. మీరో రహస్యం తెలుసుకోవాలి. " అర్చన దగ్గరగా ఒంగి రహస్యంగా అంది. "ఈ సమాజంలో నూటికి అరవైశాతం ఆడవాళ్ళు మొగుడి మీద ప్రేమతో కలిసి ఉండరు. అవసరం కోసం, వాడివలన కలిగే గౌరవం కోసమే కలిసి ఉంటారు. ఇది నిజం. నమ్మండి. నా మాట విని మీరు కూడా ఎవరో ఒకళ్ళని పెళ్ళాడండి. లేకపోతే ఎంత నీతిగా ఉన్నా అపనిందలు తప్పవు. అన్నట్టు మీకూ, మీ కలెక్టర్‌కీ ఏదో ఉందట కదా. నలుగురూ అంటున్నారు లెండి. వస్తా"

అర్చన నెత్తిమీద నిప్పులవాన కురిపించి తిప్పుకుంటూ వెళ్ళిపోయింది.

అర్చన కళ్ళముందు తన పరువు, ప్రతిష్ఠ తగలబడుతున్నట్టు, తననెవరో ఆ మంటల్లోకి తోసేస్తున్నట్టుగా కంపించిపోయింది.

సుడిగాలిలాగా వచ్చి, ప్రళయం సృష్టించి వెళ్ళిపోతూ ఆమె అన్న మాటలు అర్చన గుండెల్లో గునపాల్లా దిగబడసాగాయి.

చదువు, సంధ్యాలేని పల్లెటూరి మొద్దులా తను భావించిన అమ్మాయా? ఇన్ని మాటలు మాట్లాడగలదా? ఇంత నిర్మొహమాటంగా, జీవితాన్ని, జీవితపు కృత్రిమ విలువలనీ కాచి వడపోసిన దానిలా, ఖచ్చితంగా, నిస్సిగ్గుగా.. ఇప్పుడర్థమైంది ఆమెకి ఎందుకు ఆడవాళ్ళ జీవితాలిలా బానిసత్వం నుంచి మారడం లేదో బాగా అర్థమైనట్టు అనిపించింది.

ఎంత ధైర్యం ఆ అమ్మాయికి? ఎంత పొగరు? ఏమంటోంది? తనకీ, ఛీ, ఛీ ఎంత నికృష్టపు మాట అంది.

అక్షయ్ కుమార్.

తనకీ అతనికీ నో...నో.. దేవుడా ఏమిటీ అపనింద? నిజమేనా ఆ అమ్మాయి అన్నమాట నిజమేనా? తనతో నమ్రతగా, అణకువగా ఉంటూ వెనకనుంచి తన గురించి ఇలా మాట్లాడే వాళ్ళు ఉన్నారు..అలాంటి వాళ్ళు తన మీద ఈ అభాండాలు వేసేది. ఎవరు ఈ పుకార్లు లేవదీసేది. ఎవరు తనని ఇంత చులకనగా కామెంట్ చేసేది. ఎవరు? తహసీల్దారా? రెవెన్యూ ఇన్స్పెక్టరా? ప్రస్తుతం వాళ్ళిద్దరే తన శత్రువులు. లేక, లేక నాగరాజా తన మీద పగ ఇలా తీర్చుకుంటున్నాడా? నీచుడు.. తుచ్చుడు.

అర్చనకి ఆ క్షణంలోనే అలాంటి మాటలు ఎవరు మాట్లాడుతున్నారో తెలుసుకోవాలని, వాళ్ళమీద తీవ్రమైన చర్యలు తీసుకోవాలని అనిపించింది.

అప్పుడు సమయం రాత్రి ఎనిమిదింపావు.

ఇప్పుడు ఎవరు దొరుకుతారు? అందరూ వారి, వారి కుటుంబాలతో హాయిగా ఉంటారు..

తను ఫోన్ చేసి ఎవరిలా అన్నారట అంటే ఏం సమాధానం చెప్తారు?

అర్చనకి ఏడుపొచ్చింది. గట్లు తెగిపొంగిన వరద గోదావరిలా మంచం మీద వాలిపోయి గుండె పగిలేలా ఏడవసాగింది.

ఆ మరునాడు అర్చన మండుతున్న గుండెలతో ఆఫీసులో అడుగుపెడుతుండగానే శుభవార్త ఆమె చేతుల్లో హొయలు పోయింది.

అర్చనకి జాయింట్ కలెక్టర్‌గా విజయవాడలో పోస్టింగ్ వచ్చింది.

ఆమె ఆనందాలకి అవధుల్లేవు. ఆ క్షణంలో విజయదుర్గ సృష్టించిన కలకలం అంతా చల్లారిపోయింది. తన కల. తన కల సాకారం అయింది. ఇంతకన్నా ఏం కావాలి? కుక్కలు మొరగనీ, తను ఏనుగు... ఏనుగు ఎక్కడున్నా ఏనుగే దాని రాజసం ఎవరికుంటుంది?

దాని విలువ ఎవరికుంటుంది? డోంట్ కేర్ అర్చనా. డోంట్ కేర్! నీ భవిష్యత్తు బాటనిండా భగవంతుడు సుకుమారమైన పూల తివాచీ పరిచాడు. దానిమీద మహారాణిలా తలెత్తుకుని ఠీవిగా నడిచి వెళ్ళిపో. నీ గమ్యం చేరు. అప్పుడే ఈ కుక్కలే నీకు దాసోహం అంటాయి. వెళ్ళు అర్చనా బీ బ్రేవ్. బెస్టాఫ్ లక్. ఎక్కడినుంచో ఆకాశవాణి ఆశీర్వదిస్తున్నట్టుగా అనిపించింది.

అభినందనల పరంపరలో పూలగుత్తుల పరిమళాలతో ఉక్కిరి, బిక్కిరి అయింది. నోరంతా తీయగా తన అభిమానులు పంచిన స్వీట్స్‌తో.

మనసంతా ఆహ్లాదంగా తేలిగ్గా హాయి, హాయిగా ఆమని సాగే... పెదాలు అస్పష్టంగా పాడసాగాయి.

హాయిగా నిద్రపోయింది.

●●●

నీలవేణికి సంబంధం కుదిరింది. తాంబూలాలు పుచ్చుకోడానికి ముహూర్తం పెట్టాడు కృష్ణస్వామి.

మాధవికి ఆ విషయం కబురు చేసి వెంటనే రమ్మని చెప్పమంది వేణుతో తాయారమ్మ. మాధవి అదే రోజు మధ్యాహ్నానికల్లా వచ్చేసింది. వస్తూనే నీలవేణిని సంతోషంగా కౌగలించుకుని అభినందించింది. "కంగ్రాచ్యులేషన్స్ నీలవేణీ" అంటూ.

వచ్చావా మాధవీ పెళ్ళిచూపులు అనుకోకుండా ఏర్పాటు చేశాడు వేణు. నీకు కబురు చేసే సమయం కూడా దక్కలేదు. అమ్మాయి అదృష్టవంతురాలు మంచి సంబంధం దొరికింది. ఇక ఆ పిల్ల పెళ్ళిచేసి అత్తారింటికి పంపించేదాకా నీదే బాధ్యత. అంది తాయారమ్మ మనస్ఫూర్తిగా మాధవిని ఆహ్వానిస్తూ.

అలాగే పిన్నిగారూ అంతా నేను చూసుకుంటాగా. అంటూ నీలవేణితో అంది.

నువ్విప్పటినుంచీ నేను చెప్పినట్టు వినాలి. నీలవేణి నవ్వింది.

బాగా కొబ్బరినూనె రాసుకుని బిగించి వేసుకున్న జడచూస్తూ నవ్వుతూ అడిగింది మాధవి పెళ్ళి చూపులకి ఇలాగే కూర్చున్నావా?

"లేదన్నట్టు తల ఊపింది నీలవేణి. నెమ్మదిగా అంది. వాళ్ళు శుక్రవారం వచ్చారు"

"ఓ. శుక్రవారం అని తలంటుకున్నావా? పోనీలే బతికిపోయారు. ఇంత నూనె రాసుకుంటేగానీ నీ జుట్టు నిలవదా? చూడు మొహం నిండా జిడ్డుగా ఎలా కారుతోందో. " చెంపలమీదికి అంటిన జిడ్డు వేలితో రాసి చూపిస్తూ అంది మాధవి.

నీలవేణి మాట్లాడలేదు. ఉండండి మీకు కాఫీ తెస్తాను. అంటూ వంటగదిలోకి వెళ్ళిపోయింది.

మాధవి తాయారమ్మ దగ్గర కూర్చుని చెప్పండి పిన్నిగారూ. నీలవేణికి చీరలు కొనడానికి షాపింగ్‌కి ఎప్పుడు వెడదాం? తాంబూలాల రోజు ఎంతమందికి వంట చేయాలి? అని వివరాలన్ని అడిగి తెలుసుకుంది.

ఆవిడ చెపుతున్నవన్నీ జాగ్రత్తగా వింటూ ఎంతో ఆనందించింది మాధవి.

"మీరేం బెంగపెట్టుకోకండి. ఆ పిల్ల పెళ్ళిచేసి పంపించిందాకా నేను మీతోటే ఉంటాను సరేనా? " అంది.

"నాకు తెలుసు తల్లీ నువ్వు ఉంటే నాకు పదిమంది పెట్టు. నిశ్చింతంగా ఉంటాను. " అందావిడ.

నీలవేణి సన్నగా నిట్టూర్చింది వాళ్ళ మాటలకి.

ఆ తరువాత నుంచీ మాధవి ప్రతిరోజూ కౌశిక్‌నీ, చక్రవర్తినీ పంపించేశాక బయల్దేరి తాయారమ్మ దగ్గరకు వచ్చేసి పెళ్ళి పనులు ఏమున్నాయో చూసుకోడం, ఏం కావాలో లిస్టు రాసివ్వడం వగైరా పనులన్నీ చేయసాగింది.

తాంబూలాలు మర్నాడనగా మాధవి, నీలవేణి షాపింగ్‌కి వెళ్ళారు. అనుటెక్స్‌కి తీసుకెళ్ళింది మాధవి.

అప్పుడప్పుడూ అలవాటుగా తాయారమ్మకి చీరలిచ్చే మూటలవాడి దగ్గర ఒకటి, రెండూ చీరలు కొనివ్వడం తప్ప ఏనాడూ బైటకి వెళ్ళి చీరలు కొనుక్కున్నది లేదు. అలాంటిది ఇవాళ అంత పెద్ద షోరూములోకి అడుగుపెడుతుంటే నీలవేణికి ముందు కాళ్ళు వణికాయి. తరువాత కళ్ళు విశాలం చేసుకుని ఆశ్చర్యంగా చూసింది అద్దాల్లో ఉన్న చీరలన్నీ. ఎంత బాగున్నాయి చీరలు. ఇన్ని రకాల చీరలుంటాయా అనుకుంది.

మాధవి పట్టుచీరల కౌంటర్ దగ్గరకు వెళ్ళి చీరలు చూపించమంది.

ఎంతో మర్యాదగా, అణకువగా చీరలు తీసి చూపిస్తుంటే ఆ కుర్రాడు బాగా తెలిసినవాడు కాబోలనుకుంది.

"మీకితను తెలుసా?" అడిగింది నెమ్మదిగా.

"లేదే ఏం?" ఆశ్చర్యంగా అడిగింది మాధవి.

"ఏం లేదు. ఇన్ని చీరలు ఇంత ఓపిగ్గా చూపిస్తుంటేనూ"

"ఫక్కున నవ్వింది మాధవి. మనం కొనడానికి వచ్చాంకదా! మంచిది సెలక్ట్ చేసుకోవాలంటే అతను చూపించి తీరాలి. అది అతని డ్యూటీ."

నీలవేణి తన తెలివితక్కువకి సిగ్గుపడ్డది.

"చెప్పు. ఏ చీర బాగుంది? రేపొక చీర కట్టుకోవాలి నువ్వు. పెళ్ళికి రెండు పట్టుచీరలు. రెండు ఫ్యాన్సీ చీరలు కొనమన్నారు. నీకేది నచ్చిందో చెబితే అవి తీసి పక్కన పెట్టించి వాటిలో ఇంకా బాగున్నది సెలక్ట్ చేద్దాం. ఇదిగో ఈ నీలంచీర చూడు. పసుపు పచ్చ బార్డర్ మంచి కలర్ కాంబినేషన్." అంటూ ఒక్కో చీర చూపిస్తూ నీలవేణి మొహంలో భావాల కోసం చూడసాగింది మాధవి.

అందమైన చీరలు చూస్తున్న ఆమె కళ్ళు తళుకులీనుతున్నాయి. కానీ, ఎక్కడో ఏదో నిర్లిప్తత కనిపిస్తోంది.

"నాకింత ఖరీదైన చీరలెందుకక్కా? " అంది మొహమాటంగా.

"పెళ్ళికదా వేణీ! పెళ్ళికి ఇలాంటి చీరలు కట్టుకోవుగా" అంటూ నీలవేణి కట్టుకున్న కాటన్ చీర పట్టుకు చూపించింది మాధవి.

"అయినా, అనాధని. అమ్మగారు నాకింత మంచి చీరలు కొనివ్వడం నాకు బాధగా ఉంది" అంది.

"ష్.. ఇక్కడ అలా మాట్లాడకూడదు. నువ్వు మా ఇంటి ఆడపిల్లవి. సరేనా చూడు ఇదెంత బాగుందో కొత్త కలర్ కాంబినేషన్ గచ్చకాయ రంగు మీద జరీ నెమళ్ళు, మెజంతా బార్డర్, బార్డర్ మీద చిన్న నెమళ్ళు. అద్భుతంగా ఉందా చీర. "

నీలవేణిక్కూడా బాగా నచ్చింది "ఖరీదెంత ఉంటుందో అక్కా. చాలా బాగుంది చీర" అంది.

"ఖరీదు గురించి నీకెందుకు బాధ? నీకు నచ్చిందా చెప్పు" అంది మాధవి.

తలూపింది నీలవేణి.

మాధవి రెండు పట్టుచీరలు, రెండు క్రేప్ చీరలు సెలక్ట్ చేసి, జరీ అంచున్న తెల్ల వెంకటగిరి చీర ఒకటి కొన్నది.

"ఇది తలంబ్రాల చీర నా తరపున" అంటూ అన్నీ ప్యాక్ చేయించి, బిల్లు చెల్లించి బైటకొచ్చింది. మాధవిని అనుసరిస్తున్న నీలవేణి ఆమె చూడకుండా చెమర్చిన కళ్ళు చెంగుతో అద్దుకుని ఆమెని అనుసరించింది.

ఇద్దరూ కొబ్బరిబొండాలు కొట్టించుకుని, నీళ్ళు తాగి ఇంటికొచ్చారు.

ఆ చీరలు చూసి తాయారమ్మ చాలా మెచ్చుకుంది.

మర్నాడు ఆదివారం.

ఆరోజే నీలవేణి పెళ్ళి నిశ్చయతాంబూలాలు.

మాధవి, తాయారమ్మ కలిసి వంట చేసేశారు. పులిహోర, ముక్కల పులుసు, పప్పు, క్యాబేజీ కూర, బెండకాయ వేపుడు, టమాట పచ్చడి, పెరుగు, స్వీట్లు వేణు బైటనుంచి తెచ్చాడు.

పదింటికల్లా పెళ్ళివాళ్ళు వచ్చారు.

ముందురోజు కొన్న పసుపు పచ్చ బార్డర్ ఉన్న లేత నీలం రంగు చీర కట్టుకుంది నీలవేణి. మాధవి నీలవేణికి చీరకట్టుకోడంలో సాయం చేసింది.

ఒక్కసారి నిలువునా ఆమెని చూస్తూ అనుకుంది మాధవి. "ఎంత చక్కగా ఉంది ఈ అమ్మాయి!! కానీ ఏదో లోపం." మాధవి మరోసారి పరిశీలనగా చూస్తుంటే నీలవేణి ఇబ్బందిగా తల వంచుకుంది. అప్పుడర్థమైంది మాధవికి. ఆమె మెడ బోసిగా ఉంది.

మాధవి చటుక్కున తన మెడలో ఉన్న ముత్యాలదండ తీసి నీలవేణి మెడలో వేసింది.

నీలవేణి ఖంగారుగా అంది. "అయ్యయ్యో అక్కా.. నాకెందుకిప్పుడు వద్దు. "

"మాట్లాడకు. పద కిందికి వెడదాం." అంటూ మాధవి నీలవేణి నోరు చేత్తో సున్నితంగా మూసింది.

నీలవేణికి మెట్లు దిగుతుంటే కాళ్ళల్లో వణుకు, అరిచేతుల్లో నుదుటిమీద చిరుచెమట, గుండెల్లో గాబరా. తడబడుతూ దిగసాగింది.

భయం, భయంగా అనిపించింది. ఈ అనుభవం కొత్తగా, వింతగా ఉంది. కానీ, ఎందుకో ఇందులో ఆమెకేమీ ఆనందం కలగడంలేదు. ఏదోగా ఉంది. ఈ కార్యక్రమానికి, ఈ వేడుకకి మూలకారణం అయిన తాను అందుకు ఏ విధంగా అర్హురాలో ఆమెకే అర్థం కాలేదు.

అక్కడున్న వాళ్ళంతా దేవుళ్ళలాగా తనొక్కతే అడవి నుంచి పారిపోయి వచ్చి వాళ్ళందరి అనుగ్రహానికి, ఆదరానికి పాత్రురాలైన ఓ వింతజీవిలా అనిపించసాగింది.

కృష్ణస్వామిగారి పౌరోహిత్యంలో నిశ్చయ తాంబూలాలు జరిగిపోయాయి. పెళ్ళివారు నీలవేణికి ఉల్లిపొర రంగు ఫ్యాన్సీ చీరపెట్టారు.

వేణు పెళ్ళికొడుక్కి మంచి బట్టలు తెచ్చాడు.

అందరూ కూర్చుని లగ్నపత్రిక రాసుకున్నారు.

ఆరోజుకి సరిగ్గా ఇరవై ఏడు రోజులకి ఉదయం ఎనిమిది గంటల ఇరవై నిమిషాలకి ముహూర్తం పెట్టాడు కృష్ణస్వామి.

దడ, దడలాడుతున్న గుండెలు చిక్కబట్టుకుని ప్రతిమలా కూర్చుంది నీలవేణి.

పెళ్ళికొడుకుని చూస్తుంటే ఎందుకో ఆ పిల్లాడు నీలవేణికి అంతగా మ్యాచ్ అవలేదేమో అనిపించింది మాధవికి. ఆ అమ్మాయి చదువుకోకపోయినా, అణకువ, వినయం మూర్తీభవించిన అందంతో పెళ్ళికొడుకు పక్కన మెరిసిపోతోంది. అతను చామనఛాయగా, సన్నగా ఎటువంటి తేజస్సు లేకుండా మౌనంగా కూర్చున్నాడు. అతని మొహంలో ఏ భావం కనిపించలేదు. అటు ఆనందంకానీ, ఇటు మరోటి కానీ ఏమీ లేదు. చాలా నిర్వికారంగా జరిగే తంతుతో తనకేం సంబంధం లేనట్టు మాధవి సంతృప్తిగా నిట్టూర్చింది. పోనీలే మంచివాడైతే చాలు.

నిజానికి ఎంత పెద్దమనసుంటే ఓ అనాథకి ఇంత ఆర్భాటంగా తాంబూలాలు, పెళ్ళి చేయగలరు ఎవరైనా కులపిచ్చి మహమ్మారిలా విశృంఖలంగా ప్రబలిన ఈ సమాజంలో నీలవేణికి కులంతో సంబంధం లేకుండా పెళ్ళి కుదరడమే గొప్ప పోనీలే ఆ అమ్మాయి సుఖంగా ఉంటే చాలు అనుకుంది.

ఆ తరువాత కార్యక్రమాలన్నీ నిరాటంకంగా జరిగిపోయాయి. పెళ్ళివాళ్ళు భోజనాలు చేసి వెళ్ళిపోయారు.

నీలవేణి పట్టుచీర మార్చుకుని, సాదాచీర కట్టుకుని తిరిగి పనిలో పడింది.

మాధవి ఆమెని చూస్తూ అనుకుంది. ఎప్పుడో చిన్నప్పుడు సినిమాల్లో శాపవశాత్తూ భూమ్మీద పడిన గంధర్వకన్యల కథలు చూసింది. కానీ, ఈ అమ్మాయి ఏ గంధర్వుడి వరంతోటో ఈ ఇంటికి వచ్చింది. కాకపోతే ఒకటే లోపం.. చదువు! చదువు తెచ్చే వెలుగు ఒక్కటే ఆమె మొహంలో తక్కువైంది. కాకపోతే కనుముక్కుతీరుగానీ, తలకట్టుకానీ, అంతగా పొడుగూ, పొట్టీకాని పర్సనాలిటీకానీ, వంపుసొంపులు కానీ, ఈమె అందగత్తెకాదు అని చెప్పడంలేదు. అన్నివిధాలా జీవితం బాగుండి బాగా చదువుకుని ఉంటే ఈ అందానికి విద్య ఆభరణమై వెలిగిపోయేది కాదా అనుకుంది.

●●●

**అక్షయ్ కుమార్‌కి హైదరాబాదు కలెక్టర్‌గా పోస్టింగ్ వచ్చింది.**

అతని స్థానంలో ఒక రిజర్వేషన్ కోటాలో సెలక్ట్ అయిన హరిబాబు అనే అతన్ని వేశారు.

ఆ విషయం తెలిసిన వెంటనే శ్రీపతి అర్చనతో అన్నాడు

"మేడమ్ మీరు కూడా ఏదన్నా ప్రయత్నాలు చేసుకుని ఇక్కడినుంచి వెళ్ళిపోతే బాగుంటుంది."

ఆశ్చర్యంగా చూసింది అర్చన. "ఏం? ఎందుకని?"

శ్రీపతి కాస్సేపు ఏమీ మాట్లాడలేదు. కానీ, కొంచెం మొహమాటంగా మరికొంచెం ఇబ్బందిగా చెప్పాడు.

"హరిబాబుగారికి మంచిపేరు లేదు. సబ్‌కలెక్టర్‌గా చేసినప్పుడు అతని మీద చాలా అలిగేషన్స్ ఉన్నాయి. పైగా ఉమనైజర్ కూడా అని విన్నాను. మీరసలే సెన్సిటివ్ ఇబ్బంది పడతారేమో అని నాకు భయంగా ఉంది."

అర్చన అతని వైపు కృతజ్ఞతగా చూసింది. తనకన్నా వయసులో కనీసం ఆరేడేళ్ళు పెద్దవాడు నిజాయితీపరుడు, కష్టపడి పనిచేస్తాడు. తెలివైనవాడు. ఎలాంటి సమస్యనైనా చాకచక్యంగా పరిష్కరించగల నేర్పరి. తనీవేళ ఈ ఊళ్ళో సమర్ధురాలైన ఆఫీసర్‌గా పేరు తెచ్చుకుందంటే అందుకు కారణం శ్రీపతే. అతని సహాయ సహకారాలు మర్చిపోలేనివి. అలాంటిది అతనే తనతో ఇలా మాట్లాడుతున్నాడంటే రాబోయే కలెక్టర్ నిజంగానే అంత మంచివాడు కాదేమో. పైగా శ్రీపతికి అతని గురించి తనతో ఇలా చెడుగా చెప్పడంలో వచ్చే లాభం ఏముంది?

"మీరన్యధా భావించకండి. నేనిలా నా పై ఆఫీసర్ గురించి చెప్పకూడదు. కానీ, మీరంటే నాకు గౌరవం. మీ మనస్తత్వం బాగా తెలిసిన వాడిగా చెపుతున్నాను."

నవ్వింది అర్చన.

"నేనేం అనుకోడంలేదు శ్రీపతిగారూ. థాంక్స్ నా మీద ఇంత శ్రద్ధ చూపిస్తున్నందుకు తప్పకుండా ఆ ప్రయత్నాల్లో ఉంటాను. దుష్టులకి దూరంగా ఉండమన్నారు కదా పెద్దవాళ్ళు."

శ్రీపతి తన మాటకి ఆమె ఇచ్చిన గౌరవానికి ఆనందం వెలుబుచ్చుతూ చూశాడు. "థాంక్యూ మేడమ్" అన్నాడు ఛాంబర్‌లోంచి బైటకి వెళ్ళిపోతూ.

అతనెక్కువ సేపు ఛాంబర్‌లో ఉండకపోవటం చాలాసార్లు గమనించింది అర్చన. ఫైల్స్ తీసుకురావడం, సంతకాలు తీసుకోడం వెంటనే వెళ్ళిపోడం, లేదంటే ఏదన్నా మీటింగ్స్ ఉంటే ఆ మీటింగ్‌లో కూర్చుని పాయింట్స్ నోట్ చేసుకోడం, మినిట్స్ తయారు చేయడం అంతే తప్ప ఎలాంటి పరిస్థితుల్లో కూడా అవసరానికి మించి ఒక్కమాట మాట్లాడకపోడం అతని సంస్కారంగా భావిస్తుంది అర్చన.

అర్చనకి తన వలన చెడ్డపేరు రాకూడదని, ఆ ఆఫీసులో రూమర్లు పుట్టించేవాళ్ళు చాలామంది ఉన్నారని, రూమర్లు పుట్టించడానికే వాళ్ళు పుట్టారని అతనికి తెలుసు. అతని పదిహేనేళ్ళ సర్వీసులో ఎందరినో చూశాడు. ఎన్నో మాటలు పడ్డాడు. కానీ ఏమీ పట్టించుకోడు. అన్నిటినీ ఎదుర్కుంటూ తనదైన శైలిలో పనిచేసుకుంటూ పోతాడు.

అతనికి అర్చనంటే చాలా గౌరవం. ఆఫీసులో అర్చన గురించి చాటుగా చాలామంది మాట్లాడుకోడం అతనికి తెలుసు. అతని ఎదురుగా మాట్లాడకపోయినా అలాంటి వాళ్ళు అక్కడ చాలామంది ఉన్నారని అతనికి తెలుసు. అర్చన అందమైన అమ్మాయి. ఒంటరిగా ఉంటుంది. ఎప్పుడూ బంధువులు, స్నేహితులు ఎవరూ వచ్చినట్టు చూడలేదు. పెళ్ళి అయిందో, లేదో తెలియదు. ఈ కారణాలు చాలు ఆమె గురించి మాట్లాడుకోడానికి అని అతనికి తెలుసు. అలా మాట్లాడుకోవద్దని అది సభ్యత కాదని అతను చెప్పలేడు. వాళ్ళంతా చాలా సామాన్యులని అలా మాట్లడుకోడం వాళ్ళ నైజం అనీ భావిస్తాడు. ఈ సమాజంలో అలా మాట్లాడుకునే వాళ్ళే చాలామంది ఉంటారని అందులో ఇలాంటి ప్రభుత్వ కార్యాలయాల్లో ఇంకా ఎక్కువమంది ఉంటారని అతనికి బాగా తెలుసు. అందరి స్వభావాలు మార్చే ప్రయత్నం అతనేం చేయడు.

కాకపోతే ఇప్పుడు రాబోయే హరిబాబు గురించి అతనికి తెలుసు. లంచగొండి, అమ్మాయిల పిచ్చి. అతనికి ఎథిక్స్ లేవని, తనకి ఎదురు చెప్పిన వాళ్ళమీద తనని కులం పేరుతో దూషించారని కేసులు పెట్టాడని చాలా విషయాలు తెలుసు. ఇంతకు ముందు ఆర్.డి.ఓగా చేసిన సుకన్య అనే స్త్రీతో అతనికి సంబంధాలుండేవి. అతని అండ చూసుకుని ఆమె అక్కడ స్టాఫ్‌ని హింసించేది. ఆమె చేత

హింసింపబడినవాళ్ళలో శ్రీపతి కూడా ఒకడు. అందుకే అతను ధైర్యంగా అర్చనతో ఆ విషయం చెప్పగలిగాడు. చెప్పాక అతని మనసు తేలిగ్గా ఉంది. చెప్పడం తప్పు కావచ్చుకానీ, చెప్పకపోతే మరీ తప్పు అని అతనికి అనిపించింది. చెప్పాడు. నిర్ణయం ఆమెది.

శ్రీపతి ఆ తరువాత ప్రశాంతంగా పనిచేసుకోసాగాడు.

ఆవేళే అక్షయ్ కుమార్ రిలీవ్ అయేరోజు.

హరిబాబు జాయిన్ అయే రోజు. సి.టి.సిలు సంతకాలు చేశారు. ఛార్జీ ఇచ్చాడు అక్షయ్‌కుమార్.

సాయంత్రం ఆరింటికి పెద్ద ఎత్తున సెండాఫ్ ఏర్పాటు చేశారు.

ఆ పార్టీకి అర్చన వెళ్ళాల్సి వచ్చింది. ఆమె వెనకే శ్రీపతి కూడా వెళ్ళాడు. తహసీల్దారు కూడా వచ్చాడు. నాగరాజు ల్యాండ్ విషయంలో సస్పెండ్ అవకుండా తనని తాను కాపాడుకున్నాడు తహసీల్దారు కానీ, అతనికి అర్చన మీద బాగా కోపంగా ఉంది. అయినా ఆ కోపం పైకి కనిపించక పోనివ్వడం అతని ప్రత్యేకత. కొంతమంది మొహంలో భావాలన్ని స్పష్టంగా కనిపిస్తాయి. కానీ, తహసీల్దారులాంటి వాళ్ళ మొహంలో ఏ భావమూ కనిపించదు. పైకి చిరునవ్వుతో ఉంటారు. అలాంటి వాళ్ళనే గోముఖ వ్యాఘ్రాలని, వయోవిషకుంభాలనీ అంటారు. ఆ ఉపమానాలు అతనికి సరిగ్గా సరిపోతాయి.

అక్షయ్ కుమార్ అర్చనని పరిచయం చేశాడు హరిబాబుకి.

అతను ఆమెని ఒక్క చూపుతో నఖశిఖపర్యంతం స్కాన్ చేసినట్టు చూస్తుంటే అర్చన ఇబ్బందిగా కదిలింది. ఆ తరువాత పూలదండలు వేయడం, బొకేలు బహూకరించడం జరిగింది. ప్రముఖులు కొందరు వెళ్ళిపోతున్న కలెక్టర్ గుణగణాలు పొగుడుతూ మాట్లాడారు. కొందరు కొత్తగా వచ్చిన కలెక్టర్ గుణగణాలు కీర్తించారు. పార్టీ పూర్తి అయేసరికి ఎనిమిది దాటింది.

శ్రీపతి నెమ్మదిగా ఆమె దగ్గరకు వచ్చి రహస్యంగా అన్నాడు. "ఇప్పుడు డిన్నర్‌కి ఆహ్వానిస్తారు. మీరు ఏదన్నా రీజన్ చెప్పి తప్పించుకోండి. ఏం ఫర్వాలేదు"

అర్చనకి కూడా ఎప్పుడెప్పుడు అక్కడినుంచి వెళ్ళిపోదామా అనిపిస్తోంది. అంతమంది జనంలో ఊపిరాడనట్టుగా ఉంది. ఈ భేషజాలు, ఈ కృత్రిమ మర్యాదలు ఆమెకి నచ్చలేదు. ముఖ్యంగా హరిబాబు మధ్య, మధ్యలో తనవైపు అదోరకంగా చూడడం చాలా చిరాగ్గా ఉంది. అందుకే శ్రీపతి మాటకు విలువ ఇచ్చి డిన్నర్‌కు ఆహ్వానించిన అక్షయ్ కుమార్‌కి చెప్పింది.

"నాక్కొంచె ఫీవరిష్‌గా ఉంది సార్. నేను రేపు ఉదయం మిమ్మల్ని, హంసగారినీ కలుస్తాను. సారీ ప్లీజ్ ఎక్స్ క్యూజ్‌మీ."

"ఓ... ఓకె. నో ప్రాబ్లెమ్. మీరు వెళ్ళిపొండి" అన్నాడు అక్షయ్.

అర్చన అతనికి థాంక్స్ చెప్పి అక్కడ ఉన్న అందరికీ మర్యాదగా తన ఇబ్బంది చెప్పి సెలవు తీసుకుంది.

హరిబాబు మొహంలో క్షణకాలం కదిలిన ప్రశ్నార్థకం గమనించింది. కానీ అతనికి ఏమీ చెప్పకుండా నమస్కరించి సెలవు తీసుకుంది. అతని కళ్ళు మరోసారి స్కాన్ చేశాయి.

మౌనంగా అక్కడినుంచి వెళ్ళిపోయింది.

ఆమెని ఇంటి దగ్గర జాగ్రత్తగా దింపి, గుడ్‌నైట్ చెప్పి వెళ్ళిపోయాడు.

అర్చన లోపలికొచ్చి హమ్మయ్య అని ఊపిరి పీల్చుకుంది.

ఇతనికి భయపడి తను వెళ్ళిపోడం అంటే ఓటమిని అంగీకరించడం. కానీ, శ్రేయోభిలాషిగా శ్రీపతి చెప్పిన మాటని మన్నించాలి. లేకుంటే ఇబ్బంది పడాల్సింది తనే. గొడవలు వచ్చాక బాధపడేకన్నా రాకుండా తప్పుకోడం మంచిదికదా. నొప్పించక, తానొవ్వక తప్పించుకు తిరుగువాడు ధన్యుడు సుమతీ.

ఎలా? ఎవరిని కలవాలి? తనకి ఇక్కడనుంచి బదిలీ కావాలి. ఆలోచిస్తూనే స్నానం చేసి, ఫ్రెష్ అయింది.

కాసేపట్లో వంటమనిషి ఆమెకి యాపిల్ ముక్కలు, కీరా, క్యారట్ ముక్కలు కట్ చేసి ప్లేటులో పెట్టుకుని వచ్చింది. దాంతోపాటే ఒక పెద్ద గ్లాసు నిండా మజ్జిగ కూడా తెచ్చి బల్లమీద పెట్టి వెళ్ళిపోయింది.

కిటికీలోంచి బైట లాన్‌లో పరుచుకున్న వెన్నెల చూస్తూ, ఆలోచనలు ముసురుకుంటుంటే తరిమేస్తూ ఒక్కో ముక్కే తింటూ కూర్చుండిపోయింది అర్చన.

మర్నాడు ఉదయం అర్చన అక్షయ్‌కుమార్‌ని, హంసని వాళ్ళింట్లో కలిసింది.

హంస నైటీతో, అక్షయ్ పైజమా, లాల్చీతో చాలా క్యాజువల్‌గా ఉన్నారు. అర్చన వెళ్ళేటప్పటికి పనివాళ్ళు సామాను సర్దుతోంటే వాళ్ళిద్దరూ అటూ, ఇటూ తిరుగుతూ వాళ్ళకేవో సూచనలు ఇస్తూ కొంచెం హడావుడిగా కనిపించారు.

"సారీ. టైం కాని టైంలో వచ్చానా? " నొచ్చుకుంటూ అంది అర్చన.

"నో, నో ఇట్స్ ప్లెజర్ రండి." ఆదరంగా ఆహ్వానించాడు అక్షయ్.

హంస ఆమెని ఆప్యాయంగా కౌగిలించుకుంది.

"నాకు కొంచెం బెంగగా ఉంది అర్చనగారూ. యూ ఆర్ ఎ గుడ్ ఫ్రెండ్ ఆఫ్ మీ" అంది.

అర్చన కూడా మనస్ఫూర్తిగా అంది. "నాకూ అలాగే ఉంది. అయామ్ మిస్సింగ్ యూ" రండి కూర్చోండి. మిమ్మల్ని నిలబెట్టి మాట్లాడుతున్నాను." అర్చన చేయి పట్టుకుని తీసుకొచ్చి సోఫాలో కూర్చోబెట్టి ఆమె పక్కనే కూర్చుంది.

"అర్చనగారూ మీరు నిన్న చాలా ఇన్‌కన్వీనియన్స్ ఫీలైనట్టున్నారు." అడిగాడు అక్షయ్ కూడా మరో సోఫాలో కూర్చుంటూ.

"ఎందుకలా అనుకుంటున్నారు?" అడిగింది అర్చన.

అక్షయ్ నవ్వాడు.

"చూడండి. నేను మీకన్నా సీనియర్‌ని కదా. నాకు అందరి గురించి తెలుసు. మేమిద్దరం ఒకే బాచ్ వాళ్ళం. హరిబాబు గురించి కథలు, కథలుగా తెలుసు. కానీ, హి ఈజ్ లక్కీ ఫెలో. ఎప్పుడూ పట్టుపడలేదు. కానీ ఒన్ థింగ్ ఈజ్ ష్యూర్. సర్వీసులో తప్పకుండా అతను దెబ్బతింటాడు."

అర్చన మాట్లాడలేదు. అతను చెప్పేది వినసాగింది.

అక్షయ్ హరిబాబు గురించి చాలా విషయాలు చెప్పాడు. "మీరు ఎదురు చెప్పారంటే తన కులం పేరుతో తిట్టారని మీమీద కేసు పెడతాడు. జాగ్రత్త" అన్నాడు.

అర్చన నవ్వింది. "సార్. అతనికి కమ్యూనిటీ బలం ఉంటే నాకు జండర్ బలం ఉంది. ఆడవాళ్ళని హెరాజ్ చేస్తున్నాడని నేను తిరిగి కేసు పెట్టచ్చు కదా."

"యస్. హండ్రెడ్ పర్సెంట్ కరెక్ట్. మీరేం భయపడకండి." హుషారుగా అంది హంస.

"యూ కెన్ డూ ఎనీథింగ్. బట్ మనకు కొన్ని రెస్ట్రిక్షన్స్ ఉంటాయి. మనకి మన కెరియర్ ఇంపార్టెంట్ ఎదగాల్సిన వాళ్ళం, అలాంటి వాడి వలన దిగజారిపోకూడదు. అసలు కేసులు, గొడవలు అనే వాటి జోలికి పోకుండా మీరు మీ ప్రయత్నాలు ప్రారంభించండి. నేను కూడా హెల్ప్ చేస్తాను. అయినా మీకింక జె.సి వచ్చేస్తుంది" అన్నాడు.

అతనలా తన పట్ల ప్రత్యేకమైన అభిమానం, శ్రద్ధ చూపించడం అర్చనకి ఆనందంగా అనిపించింది. నిజయంగా అక్షయలాంటి ఆఫీసర్ మళ్ళీ ఎదురవుతాడా అనిపించింది.

"థాంక్యూ సర్ థాంక్స్ ఎలాట్. నేను జాగ్రత్తగా ఉంటాను. వీలైనంత త్వరగా ఇక్కడినుంచి వెళ్ళిపోవడానికి ప్రయత్నిస్తాను" అంది.

పనమ్మాయి మూడు గాజు గ్లాసుల్లో ఆరెంజ్ జ్యూస్ తెచ్చింది.

కాసేపు కూర్చుని, తను హంస కోసం తెచ్చిన వెండి కుంకుమ భరిణ ఇచ్చింది. నెమలి ఆకారంలో ఉన్న ఆ భరిణ హంసకి బాగా నచ్చింది. "థాంక్యూ అర్చనా.. " అంది మురిపెంగా అందుకుంటూ.

"హైదరాబాదు వచ్చినప్పుడు మీరు తప్పకుండా రావాలి మా ఇంటికి" అంది హంస.

"తప్పకుండా వస్తాను. " అంటూ ప్రామిస్ చేసింది అర్చన. ఇద్దరి దగ్గరా సెలవు తీసుకుని వచ్చేసింది.

●●●

మాధవి మళ్ళీ నెల తప్పింది. నాలుగో నెల.

నీలవేణి నిశ్చయతాంబూలాలు తీసుకున్న రోజే ఈ విషయం తాయారమ్మకి తెలిసింది.

ఆవిడ చాలా సంతోషించింది. ఓ మంచి రోజు చూసి అయిదో నెలరాగానే సీమంతం జరిపించింది. నలుగురు ముత్తైదువులను పిలిచి, చలిమిడి, స్వీట్లు చేసి, ఒక మంచి చీర పెట్టి, చేతులకు గాజులు వేయించింది.

ఇదంతా ఏంటండి అని చెమర్చిన కళ్ళతో అడిగిన మాధవి చెక్కిళ్ళు నిమురుతూ నవ్వింది.

"నీ దగ్గర నాకు ఆడపిల్లలు లేని లోటు తీర్చుకుంటున్నానమ్మా" అంది.

మాధవి మనసు ఆర్ద్రమైంది. ఎంత మంచిది ఈమె అనుకుంది.

శ్రావణ మాసంలో ముహూర్తం. ఇంకా ఇరవైరోజులుంది పెళ్ళికి.

నీలవేణి అసలు ఆ విషయమే తెలియనట్టు చాల మామూలుగా తన రొటీన్ పనుల్లో బిజీగా ఉంటోంది. తనకి పెళ్ళి అన్న ఆలోచనగానీ, తన జీవితం సెటిల్ అవబోతోందన్న ఉద్విగ్నతకనీ, ఆరాటం కానీ ఏమీలేకుండా నిర్వికారంగా ఉన్న నీలవేణిని చూస్తుంటే మాధవికి ఆశ్చర్యం కలగసాగింది.

ఓరోజు అడిగేసింది. గార్డెన్‌లో కూర్చుని తాయారమ్మ, మాధవి మాట్లాడుకుంటున్నారు. బాబుని తీసుకుని నీలవేణి దొంగా, పోలీస్ ఆడుతోంది. తుళ్ళుతూ, నవ్వుతూ ఆడుకుంటోన్న ఆమెని చూసి అంది మాధవి.

"ఈ అమ్మాయి పెళ్ళికి పూర్తిగా అంగీకరించిందా పిన్నిగారూ? "

ఆవిడ నిట్టూర్చింది.

మాధవి ఆవిడవైపు వింతగా చూసింది.

"ఏంటండి? ఏమైంది? " అడిగింది.

"ఏమోనమ్మా. పెళ్ళిపట్ల పెద్దగా ఆసక్తి చూపించలేదు. ఎందుకో ఆ రోజు పెళ్ళిచూపులనాడు ఒకటే ఇదిగా ఏడ్చింది. "

"ఎందుకు? " ఆశ్చర్యంగా చూసింది.

"ఏమో. నాకు భయంగా ఉంది అమ్మగారూ" అంటూ ఏడ్చింది.

"అంతేనా? " ఊపిరి పీల్చుకుంది మాధవి. ఆవిడ అలా అనగానే ఒక్క క్షణం మాధవికి భయం, అనుమానం కూడా కలిగాయి. ఈ అమ్మాయి వేణు పట్ల ఆకర్షితురాలు కాలేదు కదా అనుకుంది. ఆవిడ భయపడింది అనగానే హమ్మయ్య అనుకుంది.

కాసేపు మాట్లాడి ఆవిడ స్నానం చేయడానికి లోపలికి వెళ్ళగానే నీలవేణి దగ్గరకు నడిచింది మాధవి. బాబు అప్పుడే అటుగా వచ్చిన కృష్ణస్వామి దగ్గరకు పరిగెత్తాడు.

"రా నీలవేణీ! కాసేపు అక్కడ కూర్చుందాం" అంది మాధవి ఓ పక్కగా అల్లుకున్న జాజిపందిరి కింద ఉన్న సిమెంటు బెంచీ చూపిస్తూ.

"రండి" అంటూ ముందుకు నడిచి బెంచీ మీద రాలిన పూలు ఏరసాగింది నీలవేణి.

కొంతభాగం తన చీరచెంగుతో తుడిచి "కూర్చోండి.." అంది.

"నువ్వూ కూర్చో" అంది మాధవి తను భారంగా కూర్చుంటూ.

"ఇప్పుడే వస్తాను. దారం తెస్తాను. పూలు చాలా ఉన్నాయికదా. మాలకడతాను. " అంటూ లోపలికి పరిగెత్తింది నీలవేణి.

ఆమె వెళ్ళిన వైపు చూస్తూ ఈ అమ్మాయికి హైదరాబాదు నీళ్ళు బాగానే సరిపడ్డాయి అనుకుంది మాధవి.

కొన్ని క్షణాల్లోనే దారపుండతో వచ్చిన నీలవేణి ఏరిన పూలన్నీ ఓ పక్క కుప్పగా పోసి తను మాధవికి కొంచెం ఎడంగా కూర్చుని మాల కట్టసాగింది. ఎంతో నేర్పుగా, చక, చకా మాలకడుతున్న నీలవేణిని చూస్తూ ఆసక్తిగా చూడసాగింది మాధవి. ఇంత బాగా మాలకట్టడం ఎక్కడ నేర్చుకున్నావు?

నీలవేణి నవ్వింది. "కొన్ని పనులు కొందరికి పుట్టుకతోటే అబ్బుతాయక్కా. మీకు చదువబ్బినట్టు. "

మాధవి ఆశ్చర్యపోయింది. ఎంత చక్కటి సమాధానం. ఈ అమ్మాయి తెలివైందే అనుకుంది.

"నీ పెళ్ళికి నా నుంచి ఏం బహుమతి కావాలి నీలవేణీ?" అడిగింది మాధవి.

నీలవేణి మొహం మ్లానమైంది. ఏం సమాధానం చెప్పకుండా తలవంచుకుని మాలకట్టసాగింది.

మాధవి కొన్ని క్షణాలు సమాధానం కోసం ఎదురు చూస్తూ పరిసరాలు గమనిస్తూ, మధ్య, మధ్య ఆమె మొహంలో భావాలు పరిశీలించసాగింది.

చల్లగాలి వీస్తోంది. ఉండుండీ జాజిపూల పరిమళం వస్తోంది.

బంతిపూలు బోర్డరులా ఉన్నాయి ఆ లాన్‌కి. పసుపు, నారింజ రంగుల్లో అందంగా, శోభాయమానంగా ఉన్నాయి. గులాబీలైతే లెక్కలేదు. అన్ని రంగులూ తెప్పించి వేయించాడు వేణు. గులాబీల పట్ల మొత్తం అతనిదే శ్రద్ధ. రోజూ ఇంటికి రాగానే గులాబీ మొక్కలన్నిటినీ చూస్తూ, అవసరమైతే మందులు చల్లడం, కొమ్మలు కట్ చేయడం, గడ్డి మొక్కలు మొలిస్తే పీకేయడం వంటి పనులన్నీ చేస్తుంటాడు వేణు.

దూరంగా కృష్ణస్వామి బాబుని ఒళ్ళో కూర్చోబెట్టుకుని కథ చెబుతున్నట్టున్నాడు. వాడు శ్రద్ధగా వింటున్నాడు.

మాధవి నీలవేణి వైపు చూసింది. మాల కడుతోన్న ఆమె కుడిచేతి మీద చిన్న నీటిబొట్టు.

మాధవి కళ్ళెత్తి చూసింది. నీలవేణి కళ్ళనుంచి నీళ్ళు బొట్లుగా కారుతున్నాయి.

"నీలవేణీ...! " మాధవి ఆమె చేతి మీద తన చేయి ఉంచి గాభరాగా పిలిచింది.

నీలవేణి పూలమాల పక్కన పెట్టి చెంగుతో కళ్ళు తుడుచుకుంది.

"ఎందుకేడుస్తున్నావు? " అడిగింది మాధవి.

"ఏం లేదు. "

"చెప్పు నేను నీకు అక్కని కదా. చెప్పు. ఎందుకేడుస్తున్నావు? నీకి పెళ్ళి ఇష్టం లేదా? "

"అది కాదు. " గబగబా తల ఊపుతూ అంది నీలవేణి.

"మరెందుకేడుస్తున్నావు? "

"ఏం లేదక్కా. "

"అక్కా అని పిలిచాక అబద్ధం చెప్పకూడదు. చెప్పు. "

బొంగురుపోయిన గొంతుతో అంది. "ఈ ఇల్లు, బాబు, అయ్యగారు, అమ్మగారు ఇదంతా వదులుకుని ఎక్కడికో, ఎవరితోటో బతకడానికి వెళ్ళడం అని తల్చుకుంటేనే నాకు భయంగా ఉంది. ఇక్కడ నుంచీ వెళ్ళాలని లేదక్కా. "

మాధవి హమ్మయ్య అన్నట్టు గట్టిగా ఊపిరి పీల్చుకుని అంది. "పిచ్చిదానా. కనిపెంచిన తల్లితండ్రులను, రక్తం పంచుకు పుట్టిన వాళ్ళను కూడా వదిలి అత్తగారింటికి వెళ్ళాల్సిందే ఆడపిల్లలు. అలాంటిది ఏదో కొంతకాలం వీళ్ళింట్లో ఆశ్రయం పొందిన నీకు వాళ్ళ పట్ల అంత మమకారం, ఆపేక్ష ఉంటే ఎలా? తప్పదు. "

"కానీ, అక్కడ వాళ్ళెలాంటి వాళ్ళో? ఏంటో నాకేం తెలియదు. నాకు నలుగురిలో మాట్లాడడం, ప్రవర్తించడం కూడా రాదు. "

"అదే వస్తుంది. నాలుగు రోజులు వాళ్ళతో గడిపితే నీకు ఎలా మాట్లాడాలి? ఎలా ప్రవర్తించాలి అనే విషయాలు తెలుస్తాయి. అదేం కోర్సా! చదువుకోవాలి, బట్టీ పట్టాలి అనుకోడానికి."

"కానీ, ఏంటో!?" అంది నీలవేణి.. నిరాశగా.

"అంతా నీ భయం. ఇది నీకేకాదు. పెళ్ళి చేసుకునే అమ్మాయిలందరికీ ఇలాగే ఉంటుంది. కాబట్టి అంతా మర్చిపోయి, హాయిగా ఆనందంగా ఉండు. పెళ్ళి రెండు రోజులుందనగా నీకు మెహందీ పెట్టిస్తాను. నా ఫ్రెండ్ ఒకమ్మాయి ఉంది. తను చాలా బాగా పెడుతుంది. సరేనా?" నీలవేణి చేయి అందుకుని అంది మాధవి.

తల ఊపింది నీలవేణి. మళ్ళీ మాల చేతికి తీసుకుని ఇంకా కొన్ని పూలు కట్టి ఆ మాల మాధవికిచ్చింది.

"థాంక్యూ" అంటూ ఆ మాల అందుకుని జడలో తురుముకుంది మాధవి.

మరో చిన్న ముక్క తనకి, తాయారమ్మకి కట్టి, "లోపలికి వెడదామా?" అంది నీలవేణి ముసురుకుంటున్న చీకట్లు చూస్తూ.

"పద" అంటూ లేచింది మాధవి.

●●●

పెళ్ళి వారం అనగా జరిగింది ఆ సంఘటన. కృష్ణస్వామి రోజూలాగే ఆ రోజు కూడా ఐదింటికే లేచి, కాలకృత్యాలు తీర్చుకుని స్నానానికి వెళ్ళాడు. ఇంతలో హఠాత్తుగా వినిపించింది ఆయన గొంతు. "అమ్మా.. " అంటూ గట్టిగా.

అప్పటికే తానూ లేచి వాకిలి ఊడుస్తున్న నీలవేణి ఆయన పిలుపుకి చీపురు కిందపారేసి ఒక్క ఉదుటున పెరటి వైపు వెళ్ళింది.

కృష్ణస్వామి బాత్ రూములోకి వెళ్ళబోతూ జారిపడ్డాడేమో ఆ పడడం, పడడం సిమెంటు తొట్టిమీద పడ్డాడు.

నీలవేణి పరిగెత్తుకుని వెళ్ళి ఆయనని లేపి కూర్చోబెట్టింది.

మళ్ళీ వెనక్కి పైకి చూస్తూ గట్టిగా పిలిచింది. "అమ్మగారూ, వేణు బాబుగారూ.... "

ఆ పిలుపుకి అప్పుడే మెలకువ వచ్చిన తాయారమ్మ ఖంగారుగా లేచి కూర్చుంది మంచం మీద. నీలవేణి స్వరం మరోసారి వినిపించడంతో బలవంతంగా మంచం దిగి, మోకాళ్ళు పట్టేసినట్టు అయి, కుంటుకుంటూ పెరటి వైపు వెళ్ళింది.

"ఏమైందే?" గట్టిగా అడిగింది నిద్రమత్తు వదలని స్వరంతో.

"అయ్యగారు పడిపోయారమ్మా. " ఏడుపు గొంతుతో అంది నీలవేణి.

"అయ్యో పడ్డారా?" ఖంగారుగా అని గట్టిగా "వేణూ! " అని అరిచిందావిడ.

ఆమె పిలుపుకి వేణు ఉలిక్కిపడి లేచాడు. గబ, గబా బాల్కనీలోకి వచ్చి చూడగానే బాత్‌రూము వైపు వెళ్ళేచోట వాష్ ఏరియాలో సిమెంటు తొట్టి దగ్గర నిస్సహాయంగా కూలబడిన కృష్ణస్వామి, కన్నీళ్ళతో ఆయన పక్కనే నిలబడ్డ నీలవేణి, నడవలేక ఆయనవైపు నడుస్తూన్న తాయారమ్మ కనిపించారు.

గబ, గబా మెట్లు దిగి, ఒక్క అంగలో వచ్చి తండ్రిని రెండు చేతుల్తో లేవనెత్తాడు.

ఆయన తన రెండు చేతులూ వేణు భుజమ్మీద వేసి, కుంటుకుంటూ నడుస్తూ వసారాలోకి వచ్చాడు.

అప్పటికే నీలవేణి పరిగెత్తుకుంటూ లోపలికి వెళ్ళి ఒక కేన్ కుర్చీ తెచ్చి అక్కడే వేసింది.

"దెబ్బ తగిలిందా నాన్నగారూ.?" ఆయన్ని కుర్చీలో కూర్చోబెడుతూ అడిగాడు వేణు.

"తగిలినట్టుందిరా. నడుం దగ్గర కలుక్కుమంది. లేవలేకపోతున్నాను. " బాధ అణచుకుంటూ అన్నాడాయన.

"ఇప్పుడే డాక్టర్ దగ్గరకు వెడదాం నాన్నా. నేను బట్టలు మార్చుకుని కారు బైటికి తీస్తాను" అంటూ వేణు చక, చకా వెళ్ళి బట్టలు మార్చుకుని కారు గరాజ్ లోంచి బైటకి తీసాడు. తిరిగి వచ్చి ఆయన్ని పట్టుకుని లేపి తాయారమ్మ సాయంతో జాగ్రత్తగా కారు దాకా తీసుకొచ్చి కారులో కూర్చోపెట్టాడు.

"నేను కూడా రానురా? " అడిగింది తాయారమ్మ.

"ఎందుకమ్మా నేను చూపించి తీసుకొస్తాను. ఖంగారేం లేదు. పెద్ద వయసుకదా. బెణికి ఉంటుంది. తగ్గిపోతుందిలే" అంటూనే డ్రైవింగ్ సీటులోకి వెళ్ళికారు స్టార్ట్ చేశాడు.

"ఏంటో ఇవాళ నిద్రలేచి ఎవరి మొహం చూశారో పొద్దున్నే" అంటూ తాయారమ్మ నీరసంగా లోపలికి నడిచింది.

నీలవేణి మనసు చివుక్కుమంది.

ఆవిడ ఆ మాట చాలా క్యాజువల్‌గా అన్నా ఆ అమ్మాయికెందుకో తనే ఆయన పడడానికి కారణమేమో అనిపించసాగింది. నిజానికి అలా అనుకోడానికి కారణం ఏమీలేదు. పడినప్పుడు తనేం చేయలేకపోయానన్న న్యూనతాభావం తప్ప మరోటికాదు. కానీ, నీలవేణి అలా అనుకుంది.

పనిచేస్తూనే ఉన్నా మనసంతా వేణు, కృష్ణస్వామి తిరిగి రావడం కోసం వేయి కళ్ళతో ఎదురుచూడసాగింది.

దాదాపు గంట తరువాత వేణు ఫోన్ చేశాడు.

తాయారమ్మ మాట్లాడింది. "నాన్నని హాస్పిటల్‌లో అడ్మిట్ చేశానమ్మా. రెండు రోజులుండాలన్నారు డాక్టర్లు" అంటూ అతను చెప్పడంతో ఆవిడ గాభరాపడిపోయి ఏడవసాగింది.

నీలవేణికి ఆవిడ దుఃఖం చూస్తుంటే తనకీ బాగా దుఃఖం వచ్చింది.

"ఏడవకండమ్మగారూ అయ్యగారికి తగ్గిపోతుంది. భయపడమాకండి" అంటూ తనకి తోచిన విధంగా ఓదార్చడానికి ప్రయత్నించసాగింది.

సుమారు తొమ్మిది దాటుతోంటే తాయారమ్మ సూచనతో మాధవికి ఫోన్ చేసి విషయం చెప్పింది.

తిరుగుటపాలో వచ్చింది మాధవి "ఏమైంది పిన్నిగారు? ఎలా పడ్డారు? అసలేమైంది? " అంటూ.

నీలవేణి జరిగింది చెబుతుండగా వేణు వచ్చాడు. "ఏం జరిగింది వేణూ. డాక్టర్ ఏమన్నారు? " అడిగింది మాధవి.

వేణు ఏం లేదన్నట్టు తలూపుతూ "నడుం దగ్గర ఎముక జరిగిందిట. ఎక్స్‌రేలు, ఇ.సి.జిలు అవుతున్నాయి" అన్నాడు.

"ఇ.సి.జి దేనికి? " ఆశ్చర్యంగా చూసింది మాధవి.

"వయసు కదా పెద్దవారు. ఏం జరక్కూడదని ముందు జాగ్రత్తగా అన్ని పరీక్షలు చేస్తారు. నీకు తెలియందేముంది మాధవీ" అంటూ మాధవి మొహంలోకి చూశాడు.

అప్పుడే మాధవి కూడా వేణు వైపు చూడడంతో అతను సైగ అర్థం చేసుకున్నదానిలా అప్పటికి ప్రశ్నల పరంపర ఆపేసింది. కాస్సేపయాక తాయారమ్మ పూజ చేసుకోడానికి, నీలవేణి వంటగదిలోకి వెళ్ళడంతో వేణు మాధవికి చెప్పాడు.

"నాన్నకి మైల్డ్ ఎటాక్ వచ్చింది. అలా పడిపోడంతో బయపడ్డట్టున్నారు. కారులో వెళ్తుండగానే సడన్‌గా గుండె చేత్తో పట్టుకున్నారు. ఒళ్ళంతా చెమట పట్టేసింది. నాకు చాలా భయం వేసింది. లక్కీగా డాక్టర్ అవైలబుల్‌గా ఉన్నారు. వెంటనే ఎమర్జెన్సీ కింద అడ్మిట్ చేసుకున్నారు. ప్రస్తుతం ఓ.కె. పడుకున్నారు. "

"అయ్యో ఎంతపని జరిగింది వేణూ.!?" బాధగా అంది మాధవి.

"ఏం చేస్తాం?" నిట్టూర్చాడు వేణు.

నీలవేణి వేణుకీ, మాధవికీ కాఫీ తెచ్చిచ్చింది.

ఆ తరువాత వేణు ఆఫీసుకు సెలవు పెట్టడం, మాధవి కూడా వేణుతో వెళ్ళి కృష్ణస్వామిని చూసిరావడం ఇదంతా జరగడంతో తాయారమ్మకి తెలిసిపోయింది ఆయనకి హార్ట్ ఎటాక్ వచ్చిందని. ఆవిడ ఏడుపు మొదలుపెట్టింది.

"మీరేం భయపడకండి పిన్నిగారూ. ఆయనకేం కాదు. క్షేమంగా వస్తారు" అంది మాధవి ఆవిడ్ని ఓదారుస్తూ.

"ఏమో తల్లీ ఆ ఏడుకొండలవాడి దయ. ఆయన క్షేమంగా ఉండాలి. "

"ఉంటారన్నాగా. నా మాట నమ్మండి." అంది మాధవి అభయం ఇస్తున్నట్టుగా.

అయితే, ఆమె మాట నమ్మేలోపలే ఆయనకి మరోసారి ఎటాక్ రావడం, క్షణాల్లో ఆయన ప్రాణాలు అనంతవాయువుల్లో కలిసిపోడం జరిగింది.

కల్యాణం జరగాల్సిన ఇంట్లో విషాదం కమ్ముకుంది. కృష్ణస్వామి జీవితంలో మొదటిసారిగా అస్వస్థుడై హాస్పిటల్ పాలు కావడం, అదే ఆఖరుసారి అయి, శాశ్వతంగా కన్ను మూయడం జరిగిపోయింది. మాధవినీ, తాయారమ్మనీ, నీలవేణినీ ఓదార్చడానికి వేణు, చక్రవర్తి గాంభీర్యం నటించాల్సి వచ్చింది. కానీ, వేణు గుండెల్లో బడబాగ్ని రగలసాగింది. నాన్నలేరు అని తల్చుకుంటే అతనికి ప్రపంచం శూన్యంగా అనిపించసాగింది. నాన్నలేరా? మరోసారి, మరోసారి అలా పదే, పదే తనని తాను ప్రశ్నించుకుంటూ కన్నీళ్ళు కార్చలేక, గుండెల్లో సుడులు తిరుగుతున్న సుడిగుండాలను తట్టుకోలేక సొమ్మసిల్లిపోయాడు.

బ్యాంకులో వాళ్ళతో పనిచేసే మరికొందరు స్నేహితులు, ఊరినుంచి వచ్చిన బంధువులు, సన్నిహితుల సమక్షంలో మర్నాటికల్లా వేణుతో దగ్గరుండి కార్యక్రమాలు జరిపించాడు చక్రవర్తి.

మాధవి కొంచెం మనసు దిటవు చేసుకుని తాయారమ్మకి తానే ఓ తల్లై ఓదార్చసాగింది.

ఎవరు ఎలా, ఎంతగా ఓదార్చినా నలభై ఏళ్ళ వైవాహిక జీవితంలోని అనుబంధాన్ని ఇరవై నాలుగు గంటల్లో మర్చిపోవడం సాధ్యమా? అలా సాధ్యమైతే ఈ అనుబంధాలకు అర్థం ఏంటి? అనుకున్నాడు చక్రవర్తి.

వారం రోజుల్లో జరగాల్సిన నీలవేణి పెళ్ళి వాయిదా పడిందన్న సంగతి కూడా ఎవరికీ గుర్తురాలేదు. పెళ్ళివారు ఫోన్ చేస్తే తప్ప. విషయం తెలిసిన పెళ్ళివారు వెంటనే వచ్చారు. జరిగిందానికి చాలా బాధపడ్డారు. పెళ్ళి నిరవధికంగా వాయిదా పడింది.

తిండీ, నీళ్ళు లేక కన్నీళ్ళతో, వేదనతో చిక్కిశల్యమైపోయింది తాయారమ్మ పదిరోజులకే.

ఇప్పుడే మళ్ళీ నీలవేణి పెళ్ళికి ముహూర్తం పెట్టి, ఆమెని సగౌరవంగా సాగనంపడానికి ఏర్పాటు చేయడానికి ఎవరూ లేరు. తండ్రిలా ఆదరించిన కృష్ణస్వామి కనుమరుగయాడు. తల్లిలా అక్కున చేర్చుకున్న తాయారమ్మ పుట్టెడు దుఃఖంతో గుండెల్లో సప్తసముద్రాలను నింపుకుంది.

వేణుకి తన గురించి తానే ఆలోచించుకునే శక్తి కూడా నశించిపోయింది.

బాబుని చూసుకుంటూ, తాయారమ్మని కళ్ళల్లో పెట్టుకుని కాపాడుతూ మధ్య, మధ్య గుండె పగిలేలా ఏడుస్తూ కాలం వెళ్ళదీస్తోంది నీలవేణి.

●●●

**మాధవి దాదాపు ప్రతిరోజూ బాబుని** స్కూల్‌కి, చక్రవర్తిని బ్యాంక్‌కు పంపించి వచ్చి తాయారమ్మ దగ్గరే ఉంటోంది. తనకు చేతనైన విధంగా ఆవిడకి ధైర్యం చెబుతూ, నచ్చచెబుతూ దగ్గరుండి భోజనం తినిపించడం, కాస్సేపు పిల్లల కబుర్లు చెబుతూ ఆహ్లాదపరచడానికి ప్రయత్నిస్తూ సాయంకాలం వరకూ ఆవిడని కనిపెట్టుకుని ఉంటోంది.

ఇప్పుడు ఇంట్లో పని, బాబు పని, వంట పని మొత్తం నీలవేణి భుజస్కంధాలపైన పడింది. దానికి తోడు విషాదం మూర్తీభవించి నిద్రాహారాలకు దూరమైన తాయారమ్మ బాధ్యత. వేణుకి క్యారేజీ సర్ది డైనింగ్ టేబుల్ మీద పెట్టేస్తుంది. డ్రైవర్ తీసుకెళ్ళి కారులో పెట్టేస్తాడు. వేణు సగం మాత్రం తింటాడు మిగతాది అలాగే వదిలేస్తాడు. ఉదయం బ్రేక్‌ఫాస్ట్ ఏం తింటాడో తెలియక ఏం అడిగితే ఏం అంటాడో భయంతో నీలవేణి సందిగ్ధంగా గడుపుతూ ఒకరోజు మాధవితో అంది.

"అక్కా వేణుబాబుగారు ఉదయం ఏం తింటారో అడిగి చెప్తావా? పాపం నేనాయనకి ఏం టిఫిన్ చేయడంలేదు."

మాధవికి జాలేసింది. ఇంట్లో పెద్దదిక్కులైన వాళ్ళల్లో ఒకరు పోయారు. ఒకరు మానసికంగా ఈ లోకంలో లేరు. వేణుతో మాట్లాడదు. ఈ అమ్మాయికి ప్రస్తుత పరిస్థితి అగ్నిపరీక్షలాంటిది. సన్నగా నిట్టూర్చి అంది.

"వాళ్ళ బ్యాంకులో క్యాంటిన్ ఉంటుందిలే వేణీ నువ్వేం ఇబ్బంది పడకు. ఆకలేస్తే అక్కడ తింటాడు. ఇంకొక్క నెలరోజులు గడిస్తే అన్నీ సర్దుకుంటాయి."

ఆమె అన్నట్టుగానే నెలరోజులు గడిచి, మొదటి నెల మాసికం అయాక వేణులో కొద్దిగా మార్పొచ్చింది. తాయారమ్మ కూడా ఏడుస్తూ పడుకోకుండా లేచి తిరగడం, మధ్య మధ్య వంట గదిలోకి వచ్చి వేణుకేం కావాలో చూడడం, ఎక్కువసేపు పూజ చేసుకోవడం చేస్తోంది. మధ్యాహ్నం నీలవేణి ఆవిడ తింటేనే తనూ తింటానని అన్నం తినకుండా మారాం చేస్తుండడంతో తప్పనిసరిగా ఎంగిలిపడుతోంది.

ఇదివరకు మధ్యాహ్నాలు కాస్సేపు పడుకునే ఆవిడ ఇప్పుడు అలా కూర్చుని శూన్యంలోకి చూడడం, లేదంటే బాబా జీవిత చరిత్ర తీసుకుని పారాయణ చేస్తూ కూర్చోడం, లేదంటే జపమాల తీసుకుని జపం చేసుకోడం చేస్తోంది. ఇదివరకులా నీలవేణితో ఆ కబురూ, ఈ కబురూ చెప్పడం లేదు. బాబుతో కాస్సేపు ఆడుకుంటుంది. వాడూ ఇప్పుడు ఆవిడ దగ్గరే పడుకుంటున్నాడు. ఆ ఒక్క మార్పు నీలవేణికి బాధకలగచేసింది. వాడు పక్కన లేకపోతే నీలవేణికి ఏదో లోటుగా అనిపించసాగింది. తనకు తోచిన కథలేవో చెబుతూ వాడిని నిద్రపుచ్చి, నిద్రపోతున్న వాడి ముద్దు మొహం చూస్తూ ఏదో అలౌకిక ఆనందం పొందుతుండేది. అదిప్పుడు దూరమైంది. ఏదో ఒంటరితనం దిగులు కమ్మేయసాగింది.

కృష్ణస్వామి మరణంతో నీలవేణిలో అనూహ్యమైన అభద్రతాభావం చోటుచేసుకుంది. ఇంక నాభవిష్యత్తేంటి? నేనేం చేయాలి? నేనెక్కడుండాలి? అనే ఆలోచనలు ఆమెని కుదిపేస్తున్నాయి. పగలంతా ఆ పనీ, ఈ పనీ చేసుకుంటూ ఆలోచనలు తరిమేస్తున్నా, రాత్రి కాగానే ఒంటరితనం భూతంలా భయపెట్టసాగింది.

ఆమెకి పెళ్ళివాయిదా పడిందన్న దిగులుకానీ, బాధకానీ లేదు. కానీ, తన భవిష్యత్తు గురించిన ఆలోచనలు మొదటిసారిగా ఆమె మనసులో నిండిపోయి అశాంతి కలగచేస్తున్నాయి. తండ్రిలాంటి కృష్ణస్వామి మరణించడం, తాయారమ్మ విషాదంలో పడిపోడంతో ఆమెకి ఇదివరకటి ఆప్యాయత, అభిమానం లభించడంలేదు. ఇప్పుడు బాధ్యతలు బాగా ఎక్కువయాయి. కానీ ఏదో కోల్పోయిందనిపిస్తోంది.

కొత్తగా ఈ మధ్య నీలవేణికి వేణుపట్ల సానుభూతి కలగసాగింది. ఏం తింటున్నాడో, ఏం చేస్తున్నాడో తెలియడంలేదు. తననేమీ అడగడు. అతనికి ఏం ఇష్టమో, ఏం చేయాలో తనకి తెలియదు. ఇన్నేళ్ళలో వేణుతో తను మాట్లాడిన మాటలు వేళ్ళ మీద లెక్కపెట్టచ్చు.

అలాంటిది మీకేం కావాలి? ఏం చేయను? అని అడిగే సాహసం ఆమెకి లేదు. తనేమీ అడగడు. అతనికి ఏం ఇష్టమో, ఏం చేయాలో తనకి తెలియదు. అలా అని ఏదో ఒకటి తింటాడులే నాకెందుకు? అని కూడా అనుకోలేకపోతోంది. అందుకే రాత్రి డిన్నర్‌కి మాత్రం ప్రత్యేకంగా వంటచేయడం, అన్నీ టేబుల్ మీద అమర్చి కొంచెం దూరంగా తలుపు చాటున నిలబడి అతను తినేటప్పుడు పరిశీలించడం ఏదన్నా వెతుక్కుంటున్నట్టు కనిపించగానే గబుక్కున వెళ్ళి అందించడం చేస్తోంది. అలా చేయడంలో ఆమెకేదో ఆనందం కలుగుతోంది. ఆ ఆనందంలో కృతజ్ఞత తప్ప మరో భావం లేదు.

ఏది ఏమైనా నీలవేణి సేవలు ఆ ఇంటికిప్పుడు కావాలి. ఆ మనుషులకి ఆమె అవసరం ఉంది. అందుకే ఆమె పెళ్ళి గురించి ఆలోచించడంలేదు. ఒక్క మాధవి మాత్రమే మధ్య, మధ్య అనుకుంటూ ఉంటుంది. ఏంటి ఈ అమ్మాయి జీవితం ఇలా అర్థాంతరంగా ఆగిపోయింది. ఎవరూ ఈమె సంగతి ఆలోచించరా అనుకుంటుంది. మళ్ళీ తనకు తనే ఆలోచించడానికి ఏం ఉంది? పెళ్ళి చేయాలి. అందుకు ముహూర్తం చూడాలి. కానీ, ఇంట్లో అశుభం జరిగాక ఏడాదివరకూ శుభకార్యం చేయకూడదంటారు. మరి ఏం చేయాలి? అలా అనుకుంటుండగానే మాధవికి నెలలు నిండాయి.

ఈసారి పురుడు తన చేత్తో పోస్తానన్న తాయారమ్మ ఇప్పుడా శక్తిలేని దానిలా నిస్సహాయంగా ఉంది. మాధవి తల్లి వచ్చి ఆమెని పుట్టింటికి తీసుకెళ్ళిపోయింది. వెళ్ళేటప్పుడు మాధవి తాయారమ్మకి తనకు తోచిన విధంగా కొన్ని ఓదార్పు మాటలు చెప్పి మనసు దిటవు చేసుకుని మామూలు ప్రపంచంలోకి రమ్మని వేడుకుంది. అలాగే నీలవేణికృూడా వేణు బాధ్యతలు, బాబు, తాయారమ్మల బాధ్యతలు అప్పగించి తన ఫోన్ నెంబర్ ఇచ్చి ఏదన్నా అవసరం ఉంటే ఫోన్ చేయమని చెప్పింది.

నీలవేణి కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. మౌనంగా తలూపి, ఆమెకి వీడ్కోలు పలికింది.

ఇప్పుడు నీలవేణికి మరీ భయంగా అనిపిస్తోంది.

ఎలా ఈ ఇంటిని, ఈ ఇంట్లో మనుషుల్ని కాపాడాలి? ఈ ఇంట్లో తన బాధ్యత ఏంటి? ఎంతవరకు?

వంట చేయడం, బాబుకి తినిపించడం, తాయారమ్మని బతిమాలి కొద్దిగా తినేలా చేయడం, వేణుకి క్యారియర్ సర్ది ఇవ్వడం. ఆ తరువాత తను తినాలంటే భయం వేస్తుంది. తను తినేటప్పుడు ఎవరన్నా చూస్తారేమో, ఎమన్నా అనుకుంటారేమో అనిపిస్తుంది. ఇంతకాలం ఇంట్లో ఎలా తిరిగినా వంటగదిలోకి వెళ్ళడానికి బెరుగ్గానే ఉండేది. ఇప్పుడు వంటగది మొత్తం నీలవేణి ఆధీనంలోకి వచ్చేసింది. ఏం చేయాలో, ఎలా చేయాలో అంతా అయోమయం. ఎలాగోలా వంట చేసేసి బైటపడిపోతుంది. వండిన పదార్థాలన్నీ డైనింగ్ టేబుల్ మీదకి చేర్చి ఊపిరి పీల్చుకుంటుంది. ఆ తరువాత ఇల్లంతా తిరుగుతూ ఏ పని చేసినా ఏమీ అనిపించదు. కానీ వంటగదిలోకి వెళ్ళేటప్పుడే ఎక్కడ లేని వణుకూ వస్తుంది.

ఇంటిపనితో రోజంతా బొంగరంలా క్షణం కూడా ఖాళీ లేకుండా తిరిగేస్తుంటే ఏ బాధా ఉండదు. కానీ, రాత్రికాగానే ఏదో భయం, మరేదో దిగులు మనసంతా ఆవరించి, నిద్రకూడా తొందరగా పట్టడంలేదీ మధ్య.

ఇటీవల ఆమెలో కొత్త ఆలోచనలు చోటు చేసుకుంటున్నాయి. వాటిలో ఎంతకాలం ఈ ఇంట్లో ఇలా ఉండాలి. ఎంతకాలం ఉన్నా ఈ ఇంటికి తనేమీకాదు అనే భావన ప్రధానంగా ఆమె మనసుని కుమ్మరిపురుగులా తొలిచేస్తోంది. రేపు తాయారమ్మగారికి ఏమన్నా అయితే తన పరిస్థితేంటి? అనిపించగానే నిలువెల్లా వణికిపోతోంది. ఎవరితో ఈ విషయాలు చర్చించాలో, ఏం చేయాలో తెలియడంలేదు. తనకి ఎవరూ తన అనే వాళ్ళు లేరు. మనసులో ఉన్నదేదైనా పంచుకోడానికి ఎవరూ లేరు.

ఇంతకాలం కృష్ణస్వామిగారున్నప్పుడు ఇంటిల్లిపాదీ తనను ఇంట్లో మనిషిగా చూస్తుంటే ఇలాంటి ఆలోచనలు రాలేదు. ఇప్పుడు తాయారమ్మ కూడా మంచం పట్టడంతో ఆమెతో ఆత్మీయంగా మాట్లడేవాళ్ళు ఎవరూ లేరు. మాధవి అయినా ఉంటే బాగుండేది. తను

కొంచెం చదువుకుని ఉంటే ఎంత బాగుండేది అనిపించసాగింది. ఇప్పుడు తనేదన్నా చదువుకోవచ్చా. కొద్దిగా తెలుగులో రాయడం, చదవడం వచ్చు. పోనీ కుట్టుపనో, ఇంకేదన్నా నేర్చుకుంటే?

అలాంటి ఆలోచనలతో కొంతకాలం గడిచాక నీలవేణి ఏదో ఒక శుభక్షణం చూసి తాయారమ్మనే అడగాలని నిశ్చయించుకుంది. కానీ, అలాంటి క్షణాలు ఎన్ని వచ్చినా అడగడానికి ఆమెకి ధైర్యం మాత్రం చాలడంలేదు. నీలవేణికి జీవితం అలా పరాధీనగా గడిచిపోతుండగానే మరికొంతకాలం గడిచింది.

ఈలోగా బ్యాంకులో వేణుకి పెళ్ళివాళ్ళ దగ్గర్నించి ఒత్తిడి మొదలైంది. ఈ సంబంధం క్యాన్సిల్ చేసుకుంటామని కబురుచేశారు. వేణుకేం చేయాలో తోచలేదు. చక్రవర్తి సలహా అడిగాడు. పెళ్ళికొడుకు తొందరపడుతున్నాడని.

"నేను మాత్రమేం చెప్పగలను వేణూ. మీ ఇంటి పరిస్థితి నీకే తెలియాలి. మీ అమ్మగారు మామూలు మనుషుల్లో పడి ఇదివరకులా పనిచేయగలిగితే ఆ అమ్మాయినింక పెళ్ళిచేసి పంపించేయడం మంచిది. ఎందుకైనా మంచిది మీ అమ్మగారిని అడుగు" అన్నాడు.

వేణు ఆ రోజే తాయారమ్మని అడగడానికి ఆవిడ గదిలోకి వెళ్ళాడు. అక్కడి దృశ్యం చూసి స్థంభించిపోయాడు.

తాయారమ్మ తలని ఎడం చేత్తో పైకి ఎత్తి, మంచానికి ఆనించి కూర్చోబెట్టింది నీలవేణి. ఆవిడ ఒడిలో దిండుపెట్టి, దానిమీద సగ్గు జావ ఉన్న స్టీలు బౌలు పెట్టి స్పూనుతో తాగిస్తోంది. ఆవిడ నీరసంగా కళ్ళు మూసుకుని కొద్దిగా నోరు తెరిచి బలవంతంగా తాగుతోంది జావ. ఆ క్షణంలో వాళ్ళిద్దరినీ అలా చూశాక వేణుకి మతిపోయింది. అమ్మకేమైంది. ఆందోళనగా అనుకున్నాడు.

అప్రయత్నంగా అనేశాడు.

అప్పుడు నీలవేణి తలతిప్పి వేణువైపు చూసింది. కంగారుగా చూపులు తిప్పేసుకుని "అమ్మగారికి విరేచనాలు అవుతున్నాయి" అంది.

"ఎప్పటినుంచి?" అడిగాడు.

"ఈ రోజు ఉదయం నుంచే" నీలవేణి మళ్ళీ చెప్పింది.

వేణుకేం చేయాలో, ఏం మాట్లాడాలో అర్ధంకాలేదు. ఈ సంభాషణ జరుగుతున్నప్పుడు కూడా ఆవిడ కళ్ళు తెరవలేదు. ఓపిక లేనిదానిలా నిస్సత్తువగా ఓ పక్కకి తలవాల్చి కూర్చుంది.

వేణు బైటకి వచ్చేశాడు.

ఆ క్షణంలో అతనికి ఒక్కటే అనిపించింది. ఈ పరిస్థితుల్లో నీలవేణిని ఈ ఇంటినుంచి బైటకి పంపకూడదు. పంపిస్తే తను చాలా తప్పు చేసినవాడు అవుతాడు.

వెంటనే సెల్ తీసి పెళ్ళికొడుక్కు, అతని తల్లి, తండ్రులకి సారీ చెప్పాడు.

అయితే ఆ సారీ ఫలితం రెండు రోజుల తరవాత తెలిసింది.

ఆ కుర్రాడు బ్యాంకులో తనకు కనిపించిన ప్రతి ఒక్కరికీ వేణు భార్యతో అభిప్రాయభేదాలు వచ్చి ఆమెని ఇంటినుంచి వెళ్ళగొట్టాడని, మళ్ళీ పెళ్ళి చేసుకోడానికి ఆవిడ విడాకులు ఇవ్వకుండా వేణు మీద కక్ష తీర్చుకుంటోందని, అందుకే తన సుఖానికీ, సంతోషానికీ నీలవేణిని వాడుకుంటున్నాడని, ఆమెకి పెళ్ళి చేసి పంపిస్తే తన ఆటలు సాగవు కాబట్టి ఏదో ఒంకతో ఆమె పెళ్ళి క్యాన్సిల్ చేసి ఆ అమ్మాయి జీవితం నాశనం చేస్తున్నాడని.

"ఏం వేణూ బాధ్యతలు లేకుండా, ఖర్చులేకుండా ఎంజాయ్ చేయడం అంటే మాములు విషయం కాదోయ్. లక్కీఫెలోవి" అని కొందరు మిత్రులు వెటకారంగా నవ్వుతోంటే వేణుకి ఈ విషయాలు తెలిసాయి.

అది విన్న వేణు ఉగ్రుడైపోయాడు. తనని తాను కంట్రోల్ చేసుకోడం అసాధ్యమే అయింది. బ్యాంకులో సెలవు చీటీ పంపించి ఇంటికి వెళ్ళిపోయాడు.

అప్పుడు నీలవేణి వంటగదిలో ఉంది. సాంబారు ఘుమఘుమలు వస్తున్నాయి.

వేణు విసురుగా వంటగది గుమ్మంలోకి వెళ్ళి నిలబడి గట్టిగా అన్నాడు. "నువ్వు రేపు నీ పెళ్ళికి రెడీ అవు"

నీలవేణికి అంత అకస్మాత్తుగా అతనలా ఎందుకన్నాడో అర్థంకాక తెల్లబోయి చూడసాగింది.

"అర్థంకాలేదా? నీ సర్వీసెస్ మాకు అవసరం లేదు. రేపు గుళ్ళో నీ పెళ్ళి చేసేస్తాను. వెళ్ళిపో ఇంక"

చూస్తుండగానే ఆమె కళ్ళు నీటితో నిండిపోయి బొటబొటా కన్నీళ్ళు కారిపోయాయి.

కన్నీళ్ళ మధ్య, వణుకుతున్న పెదాలతో అంది. "ఎందుకు? నా వలన ఏదన్నా తప్పు జరిగిందా?"

"తప్పులేదు, రైటు లేదు. నీ పెళ్ళి చెయ్యాలి నేను. అయినా సంబంధం కుదిరాక నీకోసం ఏళ్ళ తరబడి ఎవరు ఎదురు చూస్తారు?"

నీలవేణి తలవంచుకుని శిలలా నిలబడిపోయింది.

"రేపు ఎట్టి పరిస్థితుల్లో నీ పెళ్ళి చేసేయాలి. ముహూర్తాలు, అవీ నాకు తెలియవు. దేవుడి ముందు ఎప్పుడైనా చేసుకోవచ్చు. అంతే" అంటూ అక్కడినుంచి తన గదిలోకి వెళ్ళిపోయాడు.

బ్యాంకుకి వెళ్ళిన వేణు మధ్యలో ఎందుకు వచ్చాడో, అంత అకస్మాత్తుగా తన పెళ్ళి అని ఎందుకు నిర్ణయించాడో అర్థంకాని నీలవేణి వెర్రిదానిలా నిలబడిపోయింది. అణువణువూ వణికిపోతుంటే స్టవ్ ఆఫ్ చేసి వచ్చి తన గదిలో అచేతనంగా కూర్చుండిపోయింది.

వేణు మాటలు చెవుల్లో ప్రతిధ్వనిస్తుంటే అతని ప్రవర్తనకి, మాటలకి నిర్వచనం తెలియక ఎవరిని అడగాలో అర్థం కాక అయోమయంగా గడిపిన నీలవేణికి హఠాత్తుగా మాధవి ఇచ్చిన నెంబరు గుర్తొచ్చి ఆమెకి ఫోన్ చేయడం కోసం మెట్లు దిగి హాల్లోకి వచ్చింది.

అప్పుడు వినిపించింది ఆమెకి నీరసంగా తాయారమ్మ గదిలోంచి నీలవేణీ అన్న పిలుపు.

ఆవిడకి భోజనం టైం అయిందని గుర్తొచ్చిన నీలవేణి ఆవిడ గదిలోకి పరిగెత్తింది.

●●●

అర్చనని జవహర్‌లాల్ నెహ్రూ నేషనల్ అర్బన్ రెన్యూవల్ మిషన్ ప్రాజెక్ట్‌కి స్పెషల్ డెప్యూటీ కలెక్టర్‌గా ఖమ్మం జిల్లాలోని భద్రాచలం వేశారు.

శ్రీహరి హెచ్చరించినట్టే హరిబాబుతో ఆమెకి చాలా అసహనంతో కూడిన అనుభవాలు ఎదురయాయి. అతను వచ్చిన ఎనిమిది నెలలవరకూ అతనితో కలిసి పనిచేయాల్సిన పరిస్థితి తప్పలేదు. ప్రతి విషయంలో అతని జోక్యం భరించలేకపోయింది. కాదంటే కక్షకట్టినట్టుండే అతని ప్రవర్తన ఆమెకి క్షణం, క్షణం నరకంలా ఉంది. ఆమెకి నచ్చక తీసిపారేసిన అనేక మంది పార్టీ లీడర్లను అతను ప్రోత్సహిస్తూ, వాళ్ళు చేసే అరాచకాలకు వత్తాసు పలుకుతూ చేయకూడని పనులెన్నో చేస్తోంటే అతనితో నిత్యం ఏదో ఒకగొడవ నిశ్శబ్దంగా జరుగుతుండేది. ఈ పరంపరలోనే కాలరుతో పాటు తలకూడా దించుకుని వెళ్ళిన నాగరాజు తిరిగి కాలరెత్తుకుని ఆమె ముందు తిరుగుతుంటే ఆమెకి ఒంటినిండా కారం రాసుకున్నట్టు అనిపిస్తుండేది. పై అధికారులకి హరిబాబు మీద రిపోర్టు చేద్దామంటే అతని కులబలం ఆమెని బలవంతంగా ఆపేస్తుండేది. కారణం ఆ పై అధికారి కూడా అతని కులంవాడు కావడం.

అందుకే మనసు చంపుకుని బలవంతంగా ఎనిమిది నెలలు అతని అరాచకాన్ని భరిస్తూనే తన ప్రయత్నాలు తను చేసుకుంది. ఆమెకి అక్షయ్ కుమార్ ఈ విషయంలో చాలా సహాయం చేసాడు. ఫలితంగా ఆమెకి ఖమ్మం జిల్లాకి పోస్టింగ్ వచ్చింది.

తనదంటూ పెద్దగా సామాను లేకపోవడంతో కష్టపడకుండానే ఆమె రాజమండ్రి నుంచి ఖమ్మం జిల్లాకి ప్రయాణం అయింది.

శ్రీపతితో పాటే మిగతా స్టాఫ్ అందరూ కూడా ఆమెకి ఘనంగా వీడ్కోలు పలికారు.

సెండాఫ్ పార్టీకి రావలసిన హరిబాబు అర్జంటుగా మీటింగ్ ఉందంటూ రాకపోవడంతో శ్రీపతే ఏర్పాట్లన్నీ చేశాడు.

అక్కడి నుంచి వచ్చేస్తోంటే అర్చనకి కళ్ళు చెమర్చాయి.

అందరూ కూడా తనంటే ప్రాణం పెట్టిన వాళ్ళే. ఎవరినీ అనవసరంగా ఇబ్బంది పెట్టడం, హెరాజ్ చేయడం వంటిది చేయని అర్చనంటే అందరూ అభిమానం చూపించారు ఆమెలాంటి ఆఫీసర్ రాదని అనిపించింది అందరికీ.

అర్చన స్టెనో తను స్వంతంగా చేసిన అందమైన జరీ వర్క్ క్రేప్ చీర బహుమతిగా ఇస్తూ అంది. "మీరు నన్ను ఎప్పటికీ గుర్తుంచుకోవాలని ఇస్తున్నాను మేడమ్. ప్లీజ్ కాదనద్దు."

అర్చన కళ్ళల్లో గిర్రున నీళ్ళు తిరిగాయి ఆ అభిమానానికి. "చాలా థాంక్స్. మీరు నేనెక్కడున్నా, ఏం కావాలన్నా రావచ్చు ఎప్పటికీ మీ అందరి అభిమానం మర్చిపోను" అంది.

"థాంక్యూ మేడమ్" అంది స్టెనో తృప్తిగా.

"మీరు నాకు సోదర ప్రేమ అందించారు శ్రీపతిగారూ. మీ సహాయ సహకారాలు నేనెప్పటికీ మర్చిపోను." అంది శ్రీపతితో.

శ్రీపతి కృతజ్ఞతగా చేతులు జోడించాడు.

రెండు రోజుల్లో మరో ఆర్.డి.వోకి అడిషనల్ చార్జ్ కింద పోస్టింగ్ ఇస్తూ ఆమెని రిలీవ్ చేశారు. అతనికి చార్జ్ అప్పగించి రిలీవ్ అయి ఖమ్మం వెళ్ళిపోయింది.

●●●

ఖమ్మం వాతావరణంకి, రాజమండ్రి వాతావరణానికి చాలా తేడా కనిపించింది. ఖమ్మంలో ఎందుకో వేడిగా అనిపించింది. కానీ తప్పదుకదా. అణువణువూ మండించిన హరిబాబు ప్రవర్తన కన్నా ఖమ్మం భరించరానిది కాదనిపించింది.

కలెక్టర్ ఆఫీస్‌కి వెళ్ళి మర్యాదపూర్వకంగా కలెక్టర్‌ని కలిసింది.

ఆవిడ పేరు హరిణి.

ఎంతో అందమైన యువతి. డైరెక్ట్‌గా ఐ.ఏ.యస్.కి సెలెక్ట్ అయి ఖమ్మం వచ్చింది.

అర్చనతో స్నేహంగా మాట్లాడింది.

"మీరెలాంటి ఇబ్బంది పడకండి. ఫీల్ ఫ్రీ" అంది స్నేహంగా.

రాజమండ్రిలో అర్చన అనుభవాలు అడిగి తెలుసుకుంది.

ఇద్దరూ వారి, వారి విద్యా, వృత్తి గురించిన విషయులు చాలాసేపు మాట్లాడుకున్నారు. ఇంతలో పి.ఎ కలెక్టర్ మీటింగ్‌కి వెళ్ళాలని గుర్తుచేయడంతో హరిణి మరోసారి అర్చనకి షేక్ హ్యాండిచ్చి, బెస్టాఫ్ లక్ చెప్పి మీటింగ్‌కి వెళ్ళిపోయింది.

ఆవిడ వైభోగం చూసిన అర్చన మనసులో ఒక్క క్షణం నాకీ రోజు ఎప్పుడొస్తుంది అనిపించింది. వెంటనే అంతరాత్మ త్వరలో అని సమాధానం ఇచ్చినట్టు అనిపించి నవ్వుకుంది.

●●●

భద్రాచలం..

శ్రీరాముడు సతీసమేతంగా కొలువై ఉన్న ప్రదేశం. పదిహేడవ శతాబ్దంలో కంచర్ల గోపన్న చేత నిర్మించబడిన పవిత్ర ప్రదేశం. అనంతరం భద్రాచల రామదాసుగా చరిత్రలో మిగిలిపోయాడు గోపన్న. అంతేకాక మహర్షి భద్రాద్రి తపస్సుకు మెచ్చిన రాముడు

సీతాన్వేషణానంతరం రావణుడిని వధించి, సీతను తోడ్కొని వస్తూ మహర్షి భద్రాదికి మోక్షం ప్రసాదించాడని, ఆయన పేరుతోటే భద్రాద్రి పిలవబడుతోందని అంటారు. అలాగే పోకల దమ్మక్క అనే మహిళకు స్వప్నంలో కనిపించి తన విగ్రహాల ఆచూకీ తెలిపాడని, అవే నేటి భద్రాచలంలోని విగ్రహాల కథలు.

అఫీషియల్ డ్యూటీ మొదలుపెట్టేముందు రాముడిని దర్శించుకోవాలని పి.ఏకి చెప్పింది. వెంటనే అట్టహాసంగా ఏర్పాట్లు జరిగాయి.

కలెక్టరుగారు వస్తున్నారు అంటూ అక్కడ ప్రతివాళ్ళు చేసిన హడావుడి, ఆర్భాటం అర్చనకి తమాషాగా అనిపించింది. నడుస్తుంటే కాళ్ళకింద రెడ్ కార్పెట్ పరచకపోయినా పరిచినంత హడావుడి చేశారు.

చుట్టూ విస్తరించిన గోదావరి నది మధ్యలో కొండమీద వెలసిన కోదండ రాముడు, శ్రీరాముడు, అయోధ్యారాముడు.

ఆంధ్రదేశంలోని పుణ్యక్షేత్రాల్లో తిరుపతి తరవాత అత్యంత ముఖ్యమైన పుణ్యక్షేత్రంగా పేరుపొందిన భద్రాచలంలో పనిచేసే అవకాశం రావడం అదృష్టం అనిపించింది అర్చనకి.

దేశంలోనే అయోధ్య తరవాత భద్రాచలమే రెండో రామక్షేత్రంగా ప్రసిద్ధి పొందింది. మూలవిరాట్టుల విగ్రహాలు పడమటివైపు తిరిగి ఉన్నాయి. రాముడు పద్మాసనంలో కూర్చుని ఉండి, శంఖం కుడి చేతిలో, చక్రం ఎడం చేతిలో ధరించి మిగతా రెండు చేతుల్లో శూలం, బాణం ధరించి ఉన్నాడు. రాముడికి ఎడమవైపు సీతాదేవి, ఆమెకి ఎడమ పక్కన లక్ష్మణుడు ఉన్నారు.

దీపం వెలుగులో వెలిగిపోతున్నాయి విగ్రహాలు.

సాధారణంగా తూర్పు వైపు ఫేస్ చేసి ఉంటాయి కదా విగ్రహాలు అడిగింది అర్చన ఎం.ఆర్.వో సుధాకర్‌ని.

ఇది ఈ ఆలయ ప్రత్యేకత మూలవిరాట్టులు పడమర ప్రవహిస్తున్న గోదావరి నదివైపు చూస్తున్నాయి అన్నాడు సుధాకర్.

అలాగా అన్నట్టు తల ఊపింది.

ప్రతి శ్రీరామనవమికి టీ.వీలో సీతాకళ్యాణం లైవ్ చూడడం తప్ప ఇంతవరకూ భద్రాచలం రాలేదు. ఈ విధంగా రప్పించాడనమాట రాముడు అనిపించింది అర్చనకి.

శ్రీరామనవమికి చూడాలి ఇక్కడ ఉత్సవం. చాలా అద్భుతంగా ఉంటుంది అన్నాడు మళ్ళీ.

తల పంకించింది అర్చన. ఆమె చూపులు విగ్రహాలవైపు మళ్ళాయి.

ఆమెకా క్షణంలో భక్తిభావం నిలువెల్లా ప్రవహిస్తున్నట్టు అనిపించింది. ఆ పరిసరాల్లో తిరుగుతూ ఆ విగ్రహాలను అంత దగ్గరగా చూస్తుంటే ఒళ్ళు జలదరించినట్టు అయింది.

ఉద్యోగంలో చేరే ముందు తిరుపతి వెళ్ళింది. కానీ, ఒకే ఒక క్షణం దర్శనం చేసుకోగలిగింది. అప్పటికే అక్కడి వాలంటీర్లు తోసేసారు జరుగు, జరుగు అంటూ. కనీ, ఇప్పుడు ఇక్కడ ఒక హోదలో ఎంత దగ్గరగా, ఎంత తనివితీరేలా చూడగలుగుతోంది. ఇంత దగ్గరగా ఒక్కసారి ఆ ఏడుకొండలవాడి విగ్రహం కూడా చూడగలిగితే.

రామా ఆ అవకాశం కూడా ఇవ్వవా? ప్లీజ్ మనసారా వేడుకుంటూ రెండు చేతులు జోడించి కళ్ళు మూసుకుంది.

"మీ గోత్రనామాలు చెప్పండమ్మా. అర్చన చేస్తాను. " అర్చకస్వామి మాటలతో కళ్ళు తెరిచి సన్నగా నవ్వి అంది.

"ఆ భగవంతుడి గోత్రంతోటే చేయించండి. నా పేరులోనే ఉంది అర్చన" అంది.

అర్చకస్వామి మంత్రాలు చదువుతూ విగ్రహాలకు పూలతో అక్షితలతో పూజచేస్తోంటే కళ్ళప్పగించి విగ్రహాలను చూస్తూ ఉండిపోయింది. అమ్మా, నాన్న ఉంటే వాళ్ళెంత సంతోషించేవాళ్ళు తను దగ్గరుండి పూజ చేయించేదికదా. ఇలాంటి అవకాశం వస్తుందని ఎప్పుడైనా ఊహించి ఉంటారా? ఇప్పటికైనా కూతురు ఉన్నత స్థాయిలో ఉందని తెలిసిన తరవాతైనా రావచ్చుకదా.

రారు. కొడుకు చేతిలో వాళ్ళు బానిసలు. వాళ్ళేకాదు. ఈ పితృస్వామ్యవ్యవస్థలో, మగవాడిదే పెత్తనం అనే భావజాలం నిలువునా నిండిన ఈ సమాజంలో కొడుకు సంరక్షనలో ప్రతి, తల్లి, తండ్రి ఉండాలన్న నియమానికి కట్టుబడిన ప్రతివాళ్ళూ అంతే. నిట్టూర్చింది అర్చన.

"ఇదిగోండమ్మా హారతి అద్దుకోండి." హారతి పళ్ళెంతో వచ్చిన అర్చకస్వామి ముందు స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ అర్చన తల వంచి, భక్తిగా హారతి కళ్ళకద్దుకుంది. ఆమె నుదుట కుంకుమ పెట్టి, తల మీద అక్షితలు చల్లి, శఠగోపం పెట్టి ఆశీర్వదించాడు అర్చకస్వామి.

పర్సులోంచి ఐదువందల నోటు తీసి హుండీలో వేసింది.

"ఇవి ఉత్సవ విగ్రహాలు. శ్రీరామ నవమికి బైటకి తీసి కళ్యాణం జరిపిస్తాం" అని వివరించాడు మరో అర్చకస్వామి ఆమె గర్భగుడిలోంచి బైటకి వస్తుంటే ఆమె వెనకాలే నడుస్తూ.

అర్చన ఆ విగ్రహాలవైపు చూసింది. కంచు విగ్రహాలు.

"ఎక్కువగా రద్దీలేదు ఎంచేత" అంది.

"తిరుపతిలో లాగా అస్తమానం రద్దీ ఉండదు మేడమ్‌గారూ. గోదావరి పుష్కరాలు వచ్చినపుడు, శ్రీరామనవమికి, వైకుంఠ ఏకాదశికి ఇలా ప్రత్యేకమైన రోజుల్లోనే లక్షలమంది భక్తులు వస్తారు. మిగతా రోజుల్లో ప్రశాంతంగా దర్శనం అవుతుంది." అన్నాడాయన.

"రండి మేడమ్. అదిగో అది సుదర్శన చక్రం" అంటూ ఆలయశిఖరం మీద ఉన్న సుదర్శన చక్రం చూపించాడు సుధాకర్ గుడిలోంచి బైటకి రాగనే.

అర్చన తలెత్తి సుదర్శన చక్రం చూసింది.

"ఈ చక్రం గోదావరి నదిలో రామదాసుకి లభించిందట" అన్నాడు సుధాకర్.

అతను చెపుతోన్న విషయాలన్నీ వింటూ తల పంకిస్తూ, మధ్య, మధ్య అలాగా అంటూ మొత్తం ఆవరణ అంతా తిరగసాగింది.

బాపు చిత్రించిన దశావతారాలు ముచ్చట పడింది.

"కళ్యాణం ఎక్కడ జరిపిస్తారు?" అడిగింది.

"రండి చూపిస్తాను" అంటూ నమ్రతగా ముందుకు దారితీశారు అర్చకులు.

వారిని అర్చన అనుసరిస్తే ఆమెని పి.ఏ, ఎమ్.ఆర్.ఓ మరికొందరు అనుసరించారు.

కళ్యాణ మంటపానికి తీసుకొచ్చి చూపించాడు అర్చకస్వామి "ఇదేనండి కళ్యాణమంటపం."

"ఇక్కడ లక్షల మంది జనం ఎలా సరిపోతారు?" ఆశ్చర్యంగా అడిగింది.

నవ్వాడు. "మీరు చూసే ఉంటారు కదమ్మా. ఒకళ్ళనొకళ్ళు తోసుకుంటూ ఒకళ్ళమీద ఒకళ్ళు పడిపోతూ, తొక్కుకుంటూ మీరే చూస్తారుగా ఇంకో నెలలో శ్రీరామనవమి రానే వస్తోంది" అన్నాడు.

అర్చన మౌనంగా ఉండిపోయింది.

అక్కడినుంచి బైటకి వచ్చి పర్ణశాలకి వెళ్ళారు. రాముడి దండకారణ్యంలో వనవాసం చేసినప్పటి ప్రదేశంగా చెప్తారు. మొత్తం వనవాసం చిత్రిస్తూ చెక్కిన శిల్పాలు. సీతాదేవి పాదముద్రలు.

సీతాదేవి మూర్ఛతో కిందపడిపోయిన విగ్రహం చూస్తూ ఆ శిల్పి చాతుర్యానికి అబ్బురపడిపోయింది. ఎంత బాగున్నాయి. నిలువునా జీవంతో కళకళ్ళాడుతున్నాయి.

ఓ పక్క నిండుగా ప్రవహిస్తున్న గోదావరి మరో పక్క పర్ణశాల నిజంగానే అక్కడ సీతా, రామలక్ష్మణులు కొలువైనారేమో అనిపించింది. అక్కడనుంచి కదలబుద్ధికాలేదు. ఇంకా వేసవికాలం పూర్తిగా మొదలవలేదు. నది మీచి చల్లగాలి వీస్తోంది. ఎండ ఉన్నా చురుక్కుమనడంలేదు. చల్లగా, హాయిగా ఆహ్లాదంగా ఉంది.

కొంచెం ఎక్కువసేపు అక్కడ గడిపింది. రావణాసురుడి విగ్రహం, బంగారు లేడిని చూపిస్తున్న సీత ఎంత బాగుంది.

అక్కడ నుంచి జటాయువు పాకకి వెళ్ళారు. రావణాసురుడు సీతనపహరించుకుని వెళ్తున్నప్పుడు రావణుడిని అడ్డగించి భీకరపోరాటం సల్పిన జటాయువు రావణుడి దెబ్బలకు రెక్కలు విరిగి కూలబడి అక్కడే రాముడి కోసం ఎదురుచూస్తూ ఉన్నాడని చరిత్ర.

"ఇక్కడికి యాభై ఐదు కిలోమీటర్ల దూరంలో రెక్కపల్లి అని ఉంది అక్కడ జటాయువు శరీర భాగం నుంచి ఒక రెక్క విరిగిపడి ఇప్పటికీ ఉంది చూస్తారా" అన్నాడు సుధాకర్.

"తరువాత చూద్దాం" అంది అర్చన నవ్వి.

"మేడమ్ లంచ్ టైం అవుతోంది" కొంచెం మెల్లగా, నమ్రతగా గుర్తుచేశాడు పి.ఏ.

"పదండి" గంభీరంగా అంటూ ముందుకి నడిచింది.

ఆమెని అనుసరించారు పి.ఏ, సుధాకర్ దారిలో అన్నాడు సుధాకర్.

"రేపు పాపికొండలు, పేరంటాలపల్లి ఇంకా కొన్ని ట్రైబల్ ఏరియాస్ చూడచ్చు."

"తప్పకుండా. ఈ రోజు ఆఫ్టర్ లంచ్ ఆఫీస్‌కి వెడదాం అంది." ఇంక విజిటింగ్ ఏమీలేదు అన్నట్టుగా.

కాసేపట్లో కారు ఆమె క్వార్టర్స్ దగ్గర ఆగింది. అర్చన కారు దిగి లోపలికి వెళ్ళిపోయింది.

అప్పటికే ప్రసాదాలు తీసుకొచ్చి పెట్టారెవరో. ఆ పూటకి పులిహోర, చక్కరపొంగలి, వడ, లడ్డు మొదలైన ప్రసాదాలే లంచ్‌గా స్వీకరించింది.

మధ్యాహ్నం మూడవుతుండగా ఆఫీస్‌కి బయలుదేరింది.

సీటులో కూర్చోగానే ఆమె కోసమే ఎదురు చూస్తున్నట్టుగా స్టాఫ్, కొందరు పార్టీ లీడర్లు, ఇతర ఆఫీసర్లు ఫ్లవర్ బొకేలు తీసుకొచ్చి మర్యాద పూర్వకంగా కలవడం, మధ్య, మధ్య బలవంతంగా స్వీట్సు ఇవ్వడం గంటసేపు అదే సరిపోయింది.

టేబుల్ ఫ్లవర్ బొకేలతో నిండిపోయింది.

అటెండర్‌ని పిలిచి ఇంక కలవడానికి వచ్చేవాళ్ళని ఎవరినీ లోపలికి రానివ్వద్దని చెప్పింది.

పి.ఏని పిలిచి ఫైల్స్ తెప్పించింది.

కాసేపట్లో తన విధుల్లో మునిగిపోయింది.

●●●

**మాధవి పాపాయిని** ఎత్తుకుని మూడోనెల్లో పుట్టింటినుంచీ వచ్చేసింది. వస్తునే తాయారమ్మ ఆశీర్వాదం కోసం తీసుకెళ్ళింది.

ఆవిడని చూడగానే మాధవి కళ్ళల్లో గిర్రున నీళ్ళు తిరిగాయి. శుష్కించిన దేహం, జీవకళ కోల్పోయిన వదనం. మాధవిని చూస్తూనే ఆవిడ కళ్ళల్లో చిన్న మెరుపు కనిపించింది. పాపాయికోసం శుష్కించిన చేతులు చాచింది. జాగ్రత్తగా పాపాయిని ఆవిడ ఒళ్ళో పడుకోపెట్టి ఆమె పాదాలకు నమస్కరించింది మాధవి.

పిల్లా, పాపలతో కళకళలాడుతూ బతుకమ్మా అని ఆవిడ సన్నని స్వరంతో ఆశీర్వదించింది.

అప్పుడే ఆవిడ కోసం సగ్గుజావ తీసుకొచ్చిన నీలవేణి మాధవిని చూస్తూనే ఆనందంతో పొంగిపోతూ "ఎప్పుడొచ్చావక్కా" అంటూ జావగిన్నె టీపాయ్ మీద పెట్టి ఆత్రంగా కౌగిలించుకుంది.

"బాగున్నావా వేణీ?" ఆప్యాయంగా అడిగింది మాధవి.

నీలవేణి కళ్ళల్లో గిర్రున నీళ్ళు తిరిగాయి. దుఃఖం పెగిలివచ్చింది. మౌనంగా తలూపింది బాగున్నానన్నట్టు.

మాధవి ఆమె వీపు మీద చేత్తో మృదువుగా నిమిరింది. అలా నిమరడంలో ఒక చల్లని ఓదార్పు, ఒక అభయం కనిపించినట్టు అనిపించి ఆమె వైపు కృతజ్ఞతగా చూస్తూ, తాయారమ్మకి జావతాగించడానికి పూనుకుంది.

ఆవిడ చేతుల్లోంచి పాపాయిని అందుకుని కొన్ని క్షణాలు తదేకంగా పాపమొహం వైపు చూసి చిరునవ్వుతో మాధవి చేతికి అందించింది నీలవేణి. తాయారమ్మ మంచం మీద వెనక్కి వాలి, గోడనానుకుని కూర్చుంది.

మంచం చివరగా కూర్చుని జావగిన్నె ఆవిడ చేతికి అందించి జారిపడకుండా కళ్ళతోటే కాపాడుతూ ఆవిడవైపే చూస్తూ కూర్చుంది నీలవేణి.

"జావ ఎందుకు? లంచ్ టైం కదా అన్నం తినడంలేదా? " అడిగింది మాధవి ఆవిడవైపు బాధగా చూస్తూ.

"అరగడం లేదక్కా ఒక ముద్ద తిన్నా అరగడంలేదు. " నీలవేణి సమాధానం చెప్పింది.

ఆవిడ ఖర్మ అన్నట్టుగా కుడిచేత్తో సన్నగా నుదుటిమీద కొట్టుకుని సైగచేసింది మాధవికి.

మాధవి కొంచెం ముందుకు నడిచి మంచానికి ఎడం వైపు వచ్చి, కొద్దిగా ఒంగి తాయారమ్మ భుజం మీద ఓదార్పుగా చెయ్యివేసి మృదువుగా అంది. "మీరు త్వరలో అన్నం తింటారు. నేను వచ్చాగా చూసుకుంటాను. "

నీలవేణి మనసు కలుక్కుమంది. అంటేతను ఆవిడని సరిగా చూడడంలేదా? తెల్లవారి లేచిందగ్గర్నించి ఆవిడకి పళ్ళుతోమడంతో ప్రారంభం అయే దినచర్య రాత్రి పడుకునేవరకూ నిరంతరాయంగా సాగుతూ ఒక యంత్రంలా చేస్తోన్న సేవలన్నిటి సంగతి ఏంటి? మాధవి అలా అనడం చాలా బాధగా అనిపించింది. కళ్ళల్లో నీళ్ళు కనిపించకుండా ఖాళీ అయిన జావగిన్నె తీసుకుని, అక్కడినుంచి నిశ్శబ్దంగా వెళ్ళిపోయింది. ఆ క్షణంలో మొదటిసారిగా నీలవేణికి నేను పనిమనిషిని జీతం బత్తెం లేని పనిమనిషిని అనే భావన కలిగింది.

వంట గదిలోకి వెళ్ళిపోయి కొద్దిక్షణాలు ఆపుకోలేని దుఃఖంతో గోడనానుకుని ఏడుస్తూ నిలబడిపోయింది. మాధవిని చూడగానే ఎంతో ఆత్మీయురాలిని చూసినట్టు అనిపించింది. ఈ మూడునెల్లుగా తను పడిన మానసిక వేదనకి ఆమెదగ్గర ఓదార్పు లభిస్తుందని ఆశించింది. కానీ, ఇదేంటి? మాధవి వస్తూనే తన మనసునింత గాయం చేసింది.

మాధవి మారిపోయిందా? ఇదివరకులా లేదా? తనని పనిమనిషిలా చూస్తోందా?

ఇంకా ఎంతకాలం తనీ ఇంట్లో ఇలా ఊరికే కూర్చుని తింటుందని అనుకుంటోందా?

అయితే తనేం ఊరికే తినడంలేదే గొడ్డుచాకిరీ చేస్తోంది. తనకి ఈ చాకిరీకి లభిస్తున్న ప్రతిఫలం ఏంటి? నెలకి జీతం ఇస్తున్నారా?

జీతం... నీలవేణికి హఠాత్తుగా గుర్తొచ్చింది. తనీ ఇంటికి వచ్చిన కొత్తలో వేణు కొంత డబ్బు ఫిక్సడ్ డిపాజిట్ చేసాడు.

ఆ రోజు బ్యాంకు కాగితాల మీద సంతకాలు తీసుకుంటూ దీనిమీద నెలకి వడ్డీ వస్తుంది. అది నీ సేవింగ్స్ ఎకౌంట్‌లో జమ అవుతుంది. నీకేమన్నా కావాలంటే ఆ డబ్బు తీసుకుని వాడుకోవచ్చు అంటూ ఒక చిన్న పుస్తకం ఇచ్చాడు. అదే పాస్ బుక్. అవును ఆ డబ్బు ఏమైంది? మళ్ళీ తను ఆ మాటే మర్చిపోయింది.

ఇన్నేళ్ళ తన పనిమనిషి ఉద్యోగానికి అది పారితోషికం కదా. తను ఏమన్నా చేసుకోవచ్చు.

ఆ డబ్బు అడిగి తీసుకుని ఏదన్నా చిన్న వ్యాపారం చేసుకోవచ్చుకదా ఏం వ్యాపారం చెయ్యాలి. చీరల వ్యాపారం, గాజుల వ్యాపారం, ఇంకా ఇంకా

"వేణీ! " ఉలిక్కిపడింది.

మాధవి లోపలికి వచ్చింది. గోడనానుకుని నిలబడిన నీలవేణిని ఆమె చెంపలమీద కన్నీటి చారికలను చూసి నివ్వెరపోయింది. దగ్గరగా వచ్చి ఆమె భుజమ్మీద చేయివేసి ఆప్యాయంగా అడిగింది. "ఏమైందమ్మా ఎందుకేడుస్తున్నావు? "

ఒక్క క్షణం కూడా ఆగకుండా మాధవి భుజం మీద వాలిపోయి బావురుమంది నీలవేణి.

మాధవి కంగారుగా అడిగింది. "అరెరె వేణీ ఏం జరిగింది? ఇప్పటిదాకా బాగానే ఉన్నావుగా ఏంటీ ఏమైంది?"

నీలవేణి మాట్లాడలేదు. దుఃఖం ఆమెని మాట్లాడనివ్వలేదు. అలా వెక్కి వెక్కి ఏడుస్తూ కొన్ని నిమిషాలు ఉండిపోయింది. తరువాత మాధవి భుజం మీంచి కదిలి చెంగుతో మొహం తుడుచుకుంది. అయినా వెక్కిళ్ళు మాత్రం ఆగలేదు.

"ఏం జరిగింది నీలవేణీ" అడిగింది మాధవి. ఆమెకి నీలవేణి హఠాత్తుగా ఎందుకలా ఏడుస్తోందో అర్ధం కాలేదు. ఈ మూడు నెల్లనుంచీ మనసులో ఉన్న బాధ పంచుకోడానికి ఎవరూ లేక మౌనంగా భరించి ఇప్పుడు తనని చూడగానే ఎమోషనల్ అయిందేమో అన్నట్టుగా ఆమె వైపు సానుభూతిగా చూస్తూ అంది. "బాధపడకు వేణీ నేనొచ్చాగా అన్నీ సెటిల్ చేస్తాను. నువ్వు కొంచెం వేణుని కూడా అర్ధం చేసుకోవాలి. పాపం ఎంత మానసిక వేదన అనుభవిస్తున్నాడో తెలుసా."

నీలవేణి ఏం మాట్లాడలేదు.

"నాక్కొంచెం కాఫీ ఇస్తావా? " అడిగింది మాధవి.

నీలవేణి చటుక్కున అక్కడినుంచి కదిలి పెరట్లోకి వెళ్ళింది మొహం కడుక్కోడానికి.

మాధవి నీటుగా, అద్దంలా సర్ది ఉన్న వంటగది చూస్తూ నీలవేణి లేకపోతే ఈ పరిస్థితుల్లో ఈ ఇంటిగతి ఏంటి? పెద్ద దిక్కుగా అందర్నీ క్రమశిక్షణలో పెట్టిన పెద్దాయన కృష్ణస్వామిగారు చనిపోగానే ఈ ఇంట్లో కళా, కాంతీ పోయాయి. తాయారమ్మగారు అలా అవడంలో భర్తని కోల్పోయిన దిగులేనా లేక ఆవిడకేదన్నా శారీరక అనారోగ్యం ఉందా? లేక పెరుగుతున్న వయసా? ఆవిడ మళ్ళీ మామూలు మనిషి అవుతుందా? ఆవిడలా ఉంటే వేణు సంగతేంటి? వేణు పెళ్ళి సంగతేంటి? అర్చన విడాకులిస్తేగానీ వేణుని చేసుకోవడానికి ముందుకురారు. వేణు అవివాహితుడని అబద్ధం చెప్పాలన్నా కళ్ళముందు కనిపిస్తున్న ఆరేళ్ళ కొడుకు మాటేంటి? వాడినెవరు చూసుకుంటారు? ఈ రోజుల్లో అమ్మాయిలు తెగించి చెపుతున్నారు. భర్త తాలుకు బంధువులెవరూ ఇంటిమీద పడద్దని, అత్తా, మావలు కూడా విడిగా ఉండాలని అలాంటి వాళ్ళు సవతి కొడుకుని చూసుకుంటారా? పోనీ వాడిని తను పెంచుకున్నా విడాకులు అవకుండా పెళ్ళి చేసుకునేవాళ్ళు ఎవరు? నీలవేణి భవిష్యత్తు ఏంటి? కుదిరిన సంబంధం పోయింది. ఇప్పుడెలా?

అర్చనని తను కలిసి విడాకుల సంగతి మాట్లాడాలి. ఆమె దగ్గర సంతకాలు తీసుకురావాలి. ఆ పని వేణు ఎలాగా చేయడు. తనే పూనుకోవాలి. చక్రవర్తితో మాట్లాడాలి. అర్చన ఇప్పుడు ఖమ్మం జిల్లాలో ఉందని తెలిసింది. వెళ్ళాలి. కలవాలి ఎలా?

ఇకపోతే నీలవేణికి సంబంధం చూడాలి. పేపర్లో ప్రకటన ఇస్తే? అవును ఆమె వివరాలన్నీ ఇచ్చి పేపర్లో వేయిస్తే అర్ధం చేసుకునేవాళ్ళు వస్తారు.

నీలవేణి మొహం కడుక్కుని వచ్చింది. ఎర్రగా కందిపోయిన చెంపలు, ఏడ్చి, ఏడ్చి ఉబ్బిన కళ్ళు నీలవేణి పరిపూర్ణ స్త్రీత్వం సంతరించుకుంది అనుకుంది మాధవి ఆమె వైపు తదేకంగా చూస్తూ. నీలవేణి ఆమె చూపులకి పల్చగా నవ్వి కాఫీ డికాషన్ చిన్నగిన్నెలోకి వంపి పాలు పోస్తోంది.

మాధవి మారలేదా? తనే అపార్ధం చేసుకుందా? నీలవేణి మనసులో పశ్చాత్తాప కెరటం ఉవ్వెత్తున లేచినట్టైంది. కాఫీ కప్పులో పోసి, నురగ వచ్చిందాకా కలిపి మాధవి వైపు తిరిగి ఆమె చేతికిచ్చింది.

"కౌశిక్ ఎలా ఉన్నాడక్కా? " అడిగింది.

"బాగున్నాడు వేణీ అన్నట్టు రిత్విక్ పేచీ పెట్టకుండా స్కూల్ కి వెళ్తున్నాడా?" అడిగింది మాధవి కాఫీ సిప్ చేస్తూ.

"వెళుతున్నాడు కానీ.." ఆగిపోయింది నీలవేణి.

ఆ మధ్య రిత్విక్ ఇంటికొస్తూనే చిన్న గొడవచేయడం గుర్తొచ్చింది.

స్కూలు నుంచి వస్తూనే నీలవేణి దగ్గరకు వచ్చి "నీలవేణీ నా అమ్మ ఎక్కడుంది? " అన్నాడు రిత్విక్.

నీలవేణి ఊహించని ఆ ప్రశ్నకి నిర్ఘాంతపోయి కలవరపడింది.

"చెప్పూ అమ్మెక్కడ?" అన్నాడు.

"అమ్మ..అమ్మ.. " నీలవేణి ఖంగారు పడుతుండగా అప్పుడే వేణు అడుగుపెట్టాడు.

రిత్విక్ వేణుని చూడగానే నీలవేణిని వదిలి వేణు దగ్గరకు పరిగెత్తుకుంటూ వెళ్ళి "డాడీ అమ్మకావాలి నాకు" అన్నాడు.

వేణు ముందు కంగారు పడ్డాడు. వాడేం అడుగుతున్నాడో అర్థంకాలేదు. రిత్విక్ మళ్ళీ వేణు చేయిపట్టుకుని ఊపుతూ "డాడీ, డాడీ వేరీజ్ మమ్మీ, ఐ వాంట్ మమ్మీ. చెప్పు డాడీ మమ్మీ జేజి దగ్గరకి వెళ్ళిందా? " అని అడుగుతుంటే లాగి వాడి వీపు మీద కొట్టి "డర్టీఫెలో నోరుమూసుకుని వెళ్ళి ఆడుకో. వెధవ ప్రశ్నలు, వెధవ అల్లరి వెళ్ళు" అంటూ వాడి వీపు మీద రెండుచేతులేసి తాయారమ్మ గదివైపు నెట్టాడు.

వాడు కెవ్వుమంటూ గట్టిగా ఏడుస్తూ వెళ్తోంటే నీలవేణి గబుక్కున వెళ్ళి వాడిని ఎత్తుకుని బుజ్జగించసాగింది.

వేణు, వెంటనే నీలవేణివైపు ఆగ్రహంతో చూసి "నువ్వు నేర్పిస్తున్నావా వీడికి అన్నీ. " అంటూ మండిపడ్డాడు.

ఊహించని ఆ అపవాదుకి నీలవేణి నిశ్చేష్టురాలైపోయింది.

వేణు రిత్విక్ వైపు చూస్తూ "నీకెందుకురా అన్ని విషయాలు. చెత్త విషయాలు ఎవరు చెప్పినా వినకూడదు" అన్నాడు.

"డాడీ నా స్కూల్లో అందరికీ మమ్మీ ఉంది. నాకు లేదు. ఐ వాంట్ మమ్మీ" అంటూ వెక్కి వెక్కి ఏడుస్తుంటే వేణు తలపట్టుకుని సోఫాలో కూలబడిపోయాడు. నీలవేణి ఇంక అక్కడ లోపలికి వెళ్ళిపోయింది రిత్విక్‌ని ఎత్తుకుని.

రిత్వి వెక్కుతూ "నా అమ్మ చచ్చిపోయింది కదా.. నీలవేణీ" అంటూ పదే, పదే అడగడంతో వాడిని ఆ సంఘటన నుంచి, ఆ ఆలోచన నుంచి మరల్చడం ఆ రోజు చాలా కష్టమైపోయింది.

మాధవికి ఆ సంఘటన చెపుతూంటే దుఃఖం పొంగి వచ్చింది. అతి కష్టం మీద ఏడవకుండా జాగ్రత్తపడుతూ అంది నీలవేణి. "పెద్దయ్యగారు చనిపోవడంతో నా బతుకు తలకిందులైపోయిందక్కా. నా పొడ వేణుగారికి గిట్టకుండా ఉంది. ప్రతిరోజూ ఏదో ఒకటి అంటూనే ఉన్నారు. నేనేం చేశాను చెప్పు" అంటూ మళ్ళీ దుఃఖం అడ్డుపడడంతో ఆగిపోయింది.

మాధవి ఆమె తలమీద చేయివేసి అంది "బాధపడకు నేనొచ్చాగా. అంతా సెటిల్ చేస్తాను. ఇంక నా కాన్సన్ ట్రేషన్ అంతా ఈ ఇంటిమీదే పరిస్థితులు చక్కబడ్డాకే నా కాపురం సంగతి చూసుకుంటాను సరేనా?" అంది.

నీలవేణి కళ్ళనీళ్ళతో తలఊపింది.

ఆ తరువాత మాధవి మధ్యహ్నం దాకా కూర్చుని కౌశిక్‌ని స్కూలు నుంచి తీసుకురావాలంటూ పాపని తీసుకుని వెళ్ళిపోయింది.

ఆ సాయంత్రం వేణు చక్రవర్తితో కలిసి ఇంటికి వచ్చాడు. అతడిని చూడగానే మానసికంగా ఎంత వేదన అనుభవిస్తున్నాడో అర్థం అయింది మాధవికి. ఇదివరకటి కళలేదు మొహంలో. చిక్కిపోయాడు. కళ్ళల్లో దిగులుకనిపిస్తోంది. నవ్వు కూడా ఇదివరకులా పసిపాప నవ్వులా స్వచ్ఛంగా, హాయిగా లేదు. పేలవంగా నవ్వుతున్నాడు. అతడినలా చూడగానే మాధవికి ఏడుపొచ్చేసింది. తనలో తనే సర్దుకుంటూ మామూలుగా మాట్లాడింది. తాయారమ్మ ఆరోగ్య విషయాలు, ఆవిడ డాక్టర్ వివరాలు తెలుసుకుంది. నీలవేణి విషయం కూడా చర్చించింది. త్వరలోనే ఆమెకి మంచిసంబంధం చూసి పెళ్ళిచేసి పంపించే బాధ్యత తనది అని అతనికి హామీ ఇచ్చింది.

మాధవిని చూడగానే సొంత చెల్లెల్ని చూసినంత ఆనందంగా అనిపించింది వేణుకి. మనసంతా తెలియని నిశ్చింతతో ఉండిపోయింది. పాపాయిని చూస్తూ అన్నాడు. "నీ పోలికే మాధవీ పాప. అందంగా అవుతుంది"

"అంటే నేనందగా లేనా? " సరదాగా అన్నాడు చక్రవర్తి.

"ఆ విషయం నా నోటితో ఎందుకురా చెప్పిస్తావు. వెళ్ళి డ్రెస్సింగ్ టేబుల్ దగ్గర నిలబడు" అన్నాడు వేణు.

చక్రవర్తి మాధవి వైపు చూస్తూ అన్నాడు. "విన్నావా? నీకు కోపం రావడంలేదా? "

"ఎందుకు కోపం ఉన్నమాటంటే" చిలిపిగా నవ్వింది మాధవి.

"నీ ఉద్దేశం? నేనందంగా లేకపోతే ఎందుకు చేసుకున్నావు? "

"ఏదో రాసిపెట్టి ఉందికదా తప్పుతుందా? "

మాధవి మాటలకి వేణు నవ్వుతూ అన్నాడు. "నువ్వు ఎలా ఉన్నా, మాధవిలాంటి అమ్మాయి నీ భార్య కావడం మాత్రం నీ అదృష్టంరా."

"యస్. ఇట్స్ ట్రూ.. " మనస్ఫూర్తిగా అన్నాడు చక్రవర్తి.

"సర్లే లేవండి. భోం చేద్దాం" అంది మాధవి.

ఆ రాత్రి అక్కడే చక్రవర్తితో, మాధవితో కలిసి డిన్నర్ చేసి ఇంటికెళ్ళాడు వేణు.

●●●

ఇదంతా జరిగినా పదిరోజులకి మాధవి చక్రవర్తిని ఒప్పించి, ఇన్నోవాలో పిల్లలని తీసుకుని భద్రాచలం బయలుదేరింది. వేణుని కూడా అడిగింది కానీ, వేణు రాననడంతో ఊరుకుంది.

కారు భద్రాచలం చేరుతుండగా మధ్యలో పాల్వంచలో ఆగి వెంకటేశ్వరస్వామి దర్శనం చేసుకుని, అక్కడినుంచి కలెక్టర్ ఆఫీసుకి ఫోన్ చేసింది. వచ్చేటప్పుడే ఫోన్ నెంబర్, మిగతా వివరాలన్నీ తెలుసుకుని డైరీలో రాసుకుంది మాధవి.

టెలిఫోన్ ఆపరేటర్ లైనులోకి రాగానే ఏమని అడగాలో అర్థం కాలేదు.

అర్చన కలెక్టర్ మేడమ్ అనాలా? ఏమనాలి? కొంచెం ఆలోచిస్తూనే అర్చన ఉందా? అనడిగింది.

"అర్చనా ఒన్ మినిట్ అంటూ అర్చనా... అర్చనా నీకు ఫోన్" అంటూ ఆపరేటర్ గట్టిగా పిలిచింది.

మాధవికి అప్పుడనిపించింది. బహుశా తన అర్చనని కాదు అంత గట్టిగా అమర్యాదగా పిలిపించుకునే స్థాయిలో కాదుగా అర్చన ఉంది. ఇంతలో "హలో" ఎవరూ అంటూ ఓ స్వరం వినిపించడంతో మాధవి అసహనంగాఅంది. "ఆపరేటర్‌కి ఇవ్వమ్మా ఫోను. "

"ఎవరండి మీరు? " మళ్ళీ అడిగింది ఆ అమ్మాయి

"నువ్వు ఆపరేటర్‌కి ఇవ్వు ఫోను" విసుగ్గా అంది మాధవి.

"ఎవరో.. క్రాక్" అంటూ ఆ అమ్మాయి ఆపరేటర్‌కి ఫోన్ ఇస్తూ అన్నట్టుంది. ఆ మాట వినిపించింది మాధవికి.

ఆపరేటర్ లైన్లోకి వచ్చి "హలో ఎవరు కావాలండీ మీకు? " అడిగింది.

మాధవి అంది. "మీ కలెక్టర్ మేడమ్. అర్చనగారు కావాలి. "

"ఓ ప్రాజెక్టు డైరెక్టర్ మేడం కావాలా? ఆమెకి ఇక్కడినుంచి ఇవ్వలేనండి. పేషీ నంబరు ఇస్తా రాసుకోండి" అంటూ పేషీ నెంబరు చెప్పింది.

"థాంక్స్" అంటూ ఊపిరి పీల్చుకుని పేషీకి చేసింది మాధవి.

అర్చన పి.ఏ ఫోన్ తీసుకున్నాడు.

"మేడమ్ ఉన్నారా?" అడిగింది మాధవి మర్యాదగా.

"మీరెవరు? " అడిగాడతను.

మాధవి కొన్ని క్షణాలు సందేహించి చెప్పింది "ఆవిడ ఫ్రెండ్‌ని. నా పేరు మాధవి. "

లైన్లో ఉండండి అంటూ కొన్ని క్షణాల తరువాత "మాట్లాడండి" అంటూ కట్ చేశాడు.

అవతలి నుంచి అర్చన మృదుమధుర స్వరం వినిపించింది. "హలో అర్చనా హియర్. "

మాధవి గొంతులో ఏదో అడ్డుపడ్డట్టు అయింది. ఆ రోజు తిరుపతిలో కలిశాక మళ్ళీ కలవలేదు. మాట్లాడలేదు ఎందుకో టెన్షన్‌గా అనిపించింది. ఎంతైనా కలెక్టర్ ఎలా మాట్లాడాలి? ఏంటి అర్థంకాలేదు.

గొంతు సవరించుకుని "నేను మాధవిని" అంది.

చక్రవర్తి ఆమె మొహంలో మారుతున్న భావాలు గమనిస్తూ పిల్లల్ని ఆడిస్తూ కూర్చున్నాడు.

"మధూ.. " అర్చన స్వరంలో హఠాత్తుగా ఆప్యాయత, అభిమానం కలిసాయి.

మాధవికి ఆనందంతో కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. ఎంతకాలమైంది ఈ స్వరం విని. ఎంతైనా ఇద్దరూ కలిసి దాదాపు ఏడాది ఒకే దగ్గర పనిచేశారు. తెలియని అనుబంధం. అర్చన తన స్నేహితురాలు. సమాజంలో ఉన్నత స్థానంలో ఉంది. వ్యక్తిగత విషయాలు ఎలా ఉన్నా ఇంత మంచి స్నేహితురాలు లభించడం తన అదృష్టం. ఒక కలెక్టర్‌కి ఏదన్నా పని విషయంలో కలవాలన్నా ముందుగా అపాయింట్‌మెంట్ దొరకాలి. దొరికినా వాళ్ళు టైము కేటాయించి తనతో మాట్లాడాలి.

"మధూ నువ్వేనా? " మరోసారి అర్చన స్వరం వినిపించడంతో కలవరపడుతు "నేనే మా...మాధవిని" అంది.

"ఎలా ఉన్నావు? మాట్లాడవేం?" అర్చన స్వరంలో ఆప్యాయతతో కూడిన అధికారం.

ఏకవచనంతో సంభోదించాలా, బహువచనం ఉపయోగించాలా ఆలోచిస్తున్న మాధవికి ఆ స్వరం మొత్తం సందేహాలను పటాపంచలు చేసింది. గొంతు సవరించుకుంటూ అంది. "అర్చనా బాగున్నవా? "

అర్చన స్వరంలో కూడా తడి వినిపించింది. "ఏంటే ఎక్కడున్నావు? ఎక్కడినుంచి మాట్లడుతున్నావు? "

"నేను బాగున్నాను అర్చనా. నువ్వెలా ఉన్నావు? "

"నాకేం చాలా బాగున్నాను. ఇంతకీ ఎక్కడినుంచి?"

మాధవి చెప్పింది. "పాల్వంచలో ఉన్నాను. ఆలయం మెట్లమీద కూర్చుని మాట్లాడుతున్నాను. ఇప్పుడు బయల్దేరి భద్రాచలం వస్తున్నాను. నిన్నెక్కడ ఎలా కలవాలి? "

"ఎలా వస్తున్నావు? "

"కారులో. "

"ఓకే. నేను నిన్ను కలుస్తాను. నేరుగా టెంపుల్ దగ్గరకు రండి. నేనక్కడ మిమ్మల్ని పికప్ చేసుకోడానికి ఏర్పాట్లు చేస్తాను. నేను కూడా వస్తాను. చక్రవర్తిగారెలా ఉన్నారు? ఎంతకీ ఎవరెవరు వస్తున్నారు? "

"నేను, నా భర్త, పిల్లలు. "

"పిల్లలా? అంటే.. "

"పాపాయికి మూడునెల్లు."

"ఓ గుడ్ కంగ్రాట్స్" అర్చన స్వరంలో ఆనందం.

"థాంక్యూ ఇవాళ పనులేం పెట్టుకోకుండా ఫ్రీగా ఉంటావా? "

"మీరు వచ్చేలోపల ఒక మీటింగ్ ఉంది. అది అయిపోతుంది. ఆ తరువాత ఫ్రీ. నీకోసం సరేనా? "

"థాంక్స్"

"ఓ..కె. ఐ విల్ బి వెయిటింగ్ ఫర్ యూ. "

"వస్తున్నాను. "

"బై.. "అర్చన ఫోన్ పెట్టేసింది.

మాధవి హాయిగా నిట్టూరుస్తూ చక్రవర్తివైపు చూసింది.

"ఎట్ లాస్ట్. " అన్నాడు చక్రవర్తి నవ్వి.

"ఎంత ఫ్రెండ్ అయినా ఒక పెద్ద హోదాలో ఉంది కదా. కొంచెం టెన్షన్ పడ్డాను" అంది మాధవి పాపాయిని ఒళ్ళోకి తీసుకుంటూ. కౌశిక్ వాడిలో వాడు ఏదో షూట్ చేస్తున్నట్టు చేతులు తిప్పుతూ కనిపిస్తున్న చెట్లవైపు, మైదానం వైపు చూస్తూ ఆడుకుంటున్నాడు.

"ఆ విషయం నీ మొహం చూస్తూనే అర్థం అయింది" అన్నాడు చక్రవర్తి.

"మేడమ్ గారి దగ్గర పర్సనల్ విషయాలు మాట్లాడడానికి కొంచెం ధైర్యం కావాలి. చూద్దాం" అంది మాధవి తలపంకిస్తూ.

"అనవసరంగా వాళ్ళ విషయాల్లో ఎక్కువ ఇన్వాల్వ్ అవుతున్నావేమో అనిపిస్తోంది" అన్నాడు చక్రవర్తి కొబ్బరి చిప్ప పగలకొట్టి ముక్క తింటూ.

"అదేంటండి అట్లా అంటారు. వాళ్ళు మనకున్న ఒకే ఒక్క ఫ్యామిల్ ఫ్రెండ్స్. మనం వాళ్ళకి అంతకన్నా ఎక్కువ ఆ ఇంట్లో పట్టించుకునేవాళ్ళు ఎవరున్నారు? " వేణుని చూస్తుంటే జాలేయడంలేదూ.

"వేణు నా స్నేహితుడు. ఎందుకుండదు జాలి? కానీ, ఏం చేయగలం?"

"ఏదన్నా చేయడానికి ప్రయత్నిద్దాం. సక్సెస్ అయితే ఒక కుటుంబాన్ని నిలబెట్టిన సంతృప్తి దక్కుతుంది. లేదంటే ఏం చేయలేకపోయామన్న ఆవేదన మిగులుతుంది. కానీ ప్రయత్నమే చేయకపోతే నామీద నాకే కోపం వస్తుంది. "

చక్రవర్తి మాధవి వైపు అనురాగంగా చూశాడు. "నీదెంత మంచి మనసు మాధవి! " అన్నాడు.

మాధవి నవ్వింది. "పదండి వెడదాం." అంటూ పాపనెత్తుకుని లేస్తూ "అరే గాడిదా రా" ఇటు అంటూ అరిచింది మెట్లు దిగి కిందకి వెళ్ళిపోతున్న కౌశిక్‌ని ఉద్దేశించి.

చక్రవర్తి కూడాలేచి గగబగబా మెట్లు దిగి కౌశిక్ చేయందుకున్నాడు.

"మన భోజనం సంగతేంటి? " అడిగాడు. మెట్లు దిగి తన పక్కగా వచ్చిన మాధవిని.

"అర్చన చూసుకుంటుంది" అంది.

"చెప్పావా? "

"ప్రత్యేకంగా చెప్పాలా? " అంటూ నవ్వి ఆఖరిమెట్టు దిగి, వెనక్కి తిరిగిచూస్తూ అంది. "ఎంత హాయిగా, ప్రశాంతంగా ఉంది కదా ఇక్కడ. దేవుడు ఎక్కడున్నా దేవుడేగా! అంత హైరాన పడి, కనురెప్పపాటులో చూసి రావడానికి తిరుపతిదాకా ఎందుకు వెళ్ళడం? మనం ప్రతీ ఏడాదీ ఇక్కడికే రావచ్చుకదా. "

"వెంకటేశ్వర స్వామి వెలిసింది అక్కడ కదా! "

"ఎవరు చూశారు ఆ సంగతి. ఏమో లెండి. ఏ మహిమా లేకపోతే అంతంత ఆస్తులు ఎలా సంపాదించుకుంటాడాయన? పదండి". అంటూ కారు దగ్గరకి నడిచింది.

అందరూ కారెక్కగానే కారు స్టార్ట్ చేశాడు డ్రైవర్.

"అలాగే మీ అమ్మ ఫ్రెండ్ ఉంది ఇక్కడ. ఇదంతా ఆవిడదే మనకో గెస్ట్ హౌస్ కట్టివ్వమని చెప్పు అమ్మకి" అన్నాడు చక్రవర్తి.

"మమ్మీ నిజమా? " పెద్దకళ్ళతో అడిగాడు కౌశిక్.

"నోరు మూసుకోరా అయినా నీకెన్నిసార్లు చెప్పాను. మమ్మీ, డాడీ అనద్దని. అమ్మా, నాన్న అనకపోతే నాలిక చీరేస్తా కోపంగా" అంది మాధవి.

"మా స్కూల్లో అందరూ మమ్మీ, డాడీ" అనే అంటారు.

"అయితే? .... చంపుతాను వెధవా"

"వాడికేం తెలుసు అందరూ అంటే అదే అంటాడు. నెమ్మదిగా చెప్తాలే" ఇద్దర్నీ సర్దిపుచ్చాడు చక్రవర్తి.

భద్రాచలం చేరేసరికి గుడి ప్రధాన ద్వారం దగ్గరే అర్చన ఏర్పాటు చేసిన గుమాస్తా వాళ్ళకోసం ఎదురుచూస్తున్నాడు. మాధవి భద్రాచలంలోకి కారు ప్రవేశించగానే అర్చనకి ఫోన్ చేసి, కారు నెంబర్ చెప్పింది.

కారు నెంబర్ చూసి కారు గుర్తుపట్టి ఎంతో మర్యాదగా వాళ్ళని రిసీవ్ చేసుకున్నాడు గుమాస్తా.

నేరుగా గెస్ట్ హౌస్‌కి వెళ్ళారు.

అక్కడ అర్చన ఎదురుచూస్తోంది.

ఏ.సి గెస్ట్ హౌస్ విశాలంగా, నీటుగా ఆడంబరంగా ఉంది.

అర్చన అందంగా, హుందాగా ఖరీదైన ఉప్పాడ చీరలో వచ్చి మాధవిని కౌగలించుకుంది.

"సారీ చిన్న లెటర్ డిక్టేట్ చేయాల్సి వచ్చి స్టెనోని ఇక్కడికే రమ్మని ఇక్కడే ఉన్నాను. అందుకే మిమ్మల్ని రిసీవ్ చేసుకోడానికి రాలేదు" అంది.

"ఫర్వాలేదు. థాంక్స్ ఫర్ ద ఎరేంజ్‌మెంట్" అంది మాధవి.

అర్చన మాధవి చేతుల్లోంచి పాపనందుకుని, చక్రవర్తిని చూస్తూ "ఎలా ఉన్నారు? " అంది.

చక్రవర్తి నవ్వి "ఓ..కె.. " అన్నాడు

"చెప్పండి దర్శనం ఇప్పుడు చేసుకుంటారా? సాయంకాలమా? "

మాధవి చక్రవర్తివైపు చూసింది.

చక్రవర్తి వాచీ చూసుకుంటూ అన్నాడు "పన్నెండు దాటింది గుడిమూసేస్తారు కదా. "

అర్చన నవ్వింది. "పర్వాలేదు మీకు బిఫోర్ లంచ్ దర్శనం చేసుకోవాలన్న సెంటిమెంటు ఉంటే చెప్పండి ఏర్పాట్లు చేస్తాను. "

"లేదులే అర్చనా మిట్టమధ్యాహ్నం పూజలు పద్ధతి కూడా కాదు. సాయంత్రం అమ్మవారికి కుంకుమార్చన ఏర్పాటు చేయగలవా? "

"ష్యూర్ అయితే సాయంత్రం దర్శనానికి వెళదాం. ముందు లంచ్ సంగతి చూద్దాం" అంటూ అక్కడే చేతులు కట్టుకుని నిలబడ్డ గుమాస్తావైపు చూసింది.

అర్చన నవ్వి అంది.. "హండ్రెడ్ పర్సెంట్. "

"అలాగే మేడమ్.. ఈ లోపల కాఫీ చెప్పమంటారా?"

అర్చన మాధవి వైపు చూసింది.

"అవును కాఫీ కావాలి" అంది మాధవి.

"మూడు కాఫీ, ఒక బోర్నవిటా" అంది అర్చన.

గుమాస్తా వెళ్ళిపోయాడు.

"ఇప్పుడు చెప్పండి ఏంటి సంగతులు? " అడిగింది అర్చన.

"ఇప్పుడు మాకో పెద్ద సందేహం ఉంది. ముందది తీర్చండి" అన్నాడు చక్రవర్తి.

"చెప్పండి" అంది అర్చన.

"మిమ్మల్ని మీరు అనాలా? " ఇదివరకులా ఆగిపోయాడు.

"నేను మీతో ఇదివరకులా ఉన్నానా, వేరుగా ఉన్నానా గమనించి మీరెలా కావాలంటే అలా పిలవండి" అంది అర్చన.

అర్చన మానసికంగా ఎదిగింది అనుకుంది మాధవి.

"సర్లేగానీ, నువ్వు ఇక్కడికొచ్చి ఎంతకాలమైంది? " అడిగింది మాధవి.

"ఒన్ ఇయర్ కావస్తోంది. "

"ఎలా ఉంది ఇక్కడ? రాజమండ్రిలో వరదలు, తుఫాను చాలా అవస్థపడ్డావేమో కదా. "

"అది అవస్థ అనిపిస్తుంది కానీ, చాలా ఛాలెంజింగ్ సిట్యుయేషన్. మానసికంగా, శారీరకంగా అనుభవించిన ఎంతో టార్చర్ ఆ తరువాత పొందిన తృప్తితో ఎగిరిపోతుంది. ఆపదలో ఉన్నవాళ్ళకి సాయం చేయడంలో ఎంత తృప్తి ఉందో అనుభవపూర్వకంగా తెలుసుకున్నాను. నా వృత్తిలో సేవా ధర్మం ఉంది. అది నాకు చాలా నచ్చింది. అంతేకాదు. దుర్మార్గులతో ఆడుకునే అవకాశం కూడా ఉంది. అందుకు చాలా మానసిక స్థైర్యం కావాలి. అఫ్‌కోర్స్ ఇప్పుడిప్పుడే నేను అందుకు ప్రిపేర్ అవుతున్నాను. "

"కష్టం కదూ అనుక్షణం మెంటల్ టార్చర్ భరించాలి. "

"తప్పదు. అదే జాబ్ అంటే రొటీన్‌గా ఆఫీస్ కొచ్చి ఫైల్స్ సంతకం చేసి, నెలయేసరికి జీతం తీసుకోడంలో ఏం ఉంది చెప్పు. "

అర్చన మాటలికి అభినందనగా చూసింది మాధవి.

అర్చన పాపవైపు చూసి "పేరేం పెట్టావు? " అడిగింది.

"లక్షణమైన తెలుగు పేరు పెట్టాను అరుంధతి"

"అదేంటే అందరూ పేర్లకోసం ఇంటర్ నెట్ సెర్చ్ చేసి మరీ పెడుతోంటే నువ్వింత పాతపేరు పెట్టావేంటి? "

"ఇంటర్‌నెట్ మొత్తం జల్లెడ పట్టి నాకు తెలిసినవాళ్ళు వాళ్ళమ్మాయికి పెట్టిన పేరేంటో తెలుసా.? "

చెప్పమన్నట్టు ఆసక్తిగా చూసింది అర్చన.

"శ్రాద్ధవి. "

ఫక్కున నవ్వింది అర్చన. "బాప్‌రే మీనింగ్ తెలుసా వాళ్ళకి.? "

"బాగుందని పెట్టిందిట వాళ్ళమ్మ. "

"ఓ గాడ్" నవ్వి, నవ్వి అలసినట్టుగా అంది అర్చన.

ఆమె నవ్వుతో శృతి కలుపుతూ అన్నాడు చక్రవర్తి "వెర్రి వేయివిధాలు. "

ఇంతలో గుమాస్తా కాఫీతో రావడంతో అర్చన అందరికీ కాఫీలిచ్చి కౌశిక్‌ని పిలిచి దగ్గర కూర్చోబెట్టుకుంది.

"బోర్నవిటా తాగుతావా? చల్లార్చి ఇవ్వనా" అంటూ.

మాధవి కంగారుగా అంది. "నేను పడతాలే నీ చీరమీద పడుతుందేమో. "

అర్చన అవునన్నట్టు తలూపి కౌశిక్‌ని వదిలింది.

**అర్చన పరపతితో సీతారాముల దర్శనం** సుఖంగా, ప్రశాంతంగా జరిగింది.

మాధవి భక్తిగా వేడుకుంది. " అర్చనని, వేణుని కలుపు తండ్రీ వాళ్ళ జీవితాలు ప్రశాంతంగా, హాయిగా సాగిపోనీ. నీలవేణికి మంచి సంబంధం కుదరాలని దీవించు. నా పిల్లలనీ, నా భర్తనీ చల్లగా చూడు నాయనా. "

అర్చకస్వామి ఎంతో శ్రద్ధగా మాధవి, చక్రవర్తి పేర్లు, గోత్రం, పిల్లల పేర్లు తెలుసుకుని అర్చన చేశాడు.

దగ్గరుండి తీర్థ, ప్రసాదాలు ఇప్పించాడు అర్చన పి.ఏ.

అక్కడినుంచి పర్ణశాల, గోదావరి తీరం అన్నీ చూసి గెస్ట్‌హౌస్‌కి వచ్చేటప్పటికి ఎనిమిది అయింది.

అప్పటికే అర్చన ఆఫీస్ నుంచి వచ్చి ప్రెషప్ అయి విశ్రాంతిగా కూర్చుని టీ.వీలో వార్తలు చూస్తోంది.

లోపలికి అడుగుపెట్టిన మాధవిని, చక్రవర్తిని చూస్తూ చిరునవ్వుతో అడిగింది. " దర్శనం బాగా జరిగిందా? "

" నువ్వున్నాక లోటేముంది. " మాధవి పాపాయిని అర్చన చేతికి అందించి బట్టలు మార్చుకోడానికి లోపలికి వెళ్ళిపోయింది.

" త్వరగా వచ్చినట్టున్నావే" అన్నాడు చక్రవర్తి.

" ఆ.. సాధారణంగా ఈ టైంకి వచ్చేస్తాను. ఏదన్నా కొంపలంటుకుపోయే పరిస్థితి వస్తే తప్ప లేట్ అవదు" అంది. అర్చన పాపాయిని ముద్దు చేస్తూ కౌశిక్ అలా నిలబడిపోయి టీ.వి చూస్తుంటే అంది మళ్ళీ. " వీడేంటి టి.వి పిచ్చోడా?"

" ఈ జనరేషన్ పిల్లలకి టీ.వీ, సెల్‌ఫోన్, ఐ - పాడ్, టాబ్లెట్ ఇవేగా ఎంటర్‌టైన్ మెంట్ ఛానెల్స్.. వాడిని బైటకెళ్ళి ఆడుకోరా అంటే కూడా వెళ్ళడు. "

నవ్వింది అర్చన.

అప్పుడే పి.ఏ వచ్చి లడ్డూల పాకెట్లు ఇచ్చాడు.

" అబ్బా ఎందుకిన్ని? " అన్నాడు చక్రవర్తి బరువైన ఆ పాకెట్ అందుకుంటూ.

పి.ఏ అర్చన దగ్గర సెలవు తీసుకుని వెళ్ళిపోయాడు.

" పంచిపెట్టుకోండి. పుణ్యక్షేత్రాలకు వెళ్ళొచ్చాక ప్రసాదాలు పంచడం అలవాటుకదా! " అంది అర్చన.

" ఎంతమందికి పంచమంటావేంటి? " అంటూ ఒక లడ్డు తీసి కౌశిక్‌కి ఇచ్చాడు చక్రవరి.

అప్పుడే బట్టలు మార్చుకుని వచ్చిన మాధవి అది చూసి " అంత లడ్డూ తింటే వాడిప్పుడు అన్నం తింటాడా? ఉండరా" అంటూ వాడి చేతిలోంచి లడ్డు లాక్కుని సగంలో సగం తుంచి ఇచ్చింది.

బిక్కమొహం వేసిన వాడితో నచ్చచెపుతున్నట్టుగా " అన్నం తిన్నాక మిగతాది ఇస్తాను సరేనా!? " అంది.

వాడొక్కసారి అర్చనవైపు, చక్రవర్తి వైపు చూసి మౌనంగా లడ్డు నోట్లో పెట్టుకున్నాడు.

అందరూ కూర్చుని టి.వి చూస్తుంటే అర్చన ప్రస్తుత రాజకీయ పరిస్థితుల గురించి, తనకి ఎదురవుతున్న రకరకాల అనుభవాల గురించి, లోకల్ లీడర్లుగా పిలవబడే లోఫర్ల గురించి చెబుతుండగానే వంటమనిషి వచ్చి డిన్నర్ రెడీ అయిందని చెప్పడంతో అందరూ డైనింగ్ హాల్ వైపు కదిలారు.

రాత్రి పదకొండు దాటింది.

చక్రవర్తి, పిల్లలు అలసిపోయారేమో త్వరగానే పడుకున్నారు.

అర్చన, మాధవి లాన్‌లోకి వచ్చారు. అందంగా, ఆహ్లాదంగా ఉంది. నలుపు, తెలుపు రంగుల్లో గుంపులుగా కదులుతున్న మేఘాల మీద నెలవంక హొయలుపోతోంది. లైట్ల వెలుగులో ఫౌంటెన్ నుంచి పడుతున్న నీళ్ళు రంగులు మారుతున్నాయి. రక,రకాల మొక్కల

మీదినుంచి చల్లగాలి వీస్తోంది. స్లిప్పర్లు వదిలేసి మెత్తటి పచ్చిక మీద నడుస్తూ అంది మాధవి. " ఇలా నడిస్తే మంచిదట కదా పాదాల ఆరోగ్యానికి. "

" తెలియదు. కానీ, అలా ఎప్పుడన్నా సరదాగా నడుస్తాను. ఆ మెత్తదనం అనుభూతించడానికి. రా! ఇక్కడ కూర్చుందాం.." అంటూ గార్డెన్ ఛెయర్స్ వైపు నడిచింది అర్చన.

ఆమెని అనుసరిస్తూ ముక్కుపీలుస్తూ అంది మాధవి. " ఇక్కడెక్కడో నైట్‌క్వీన్ ఉన్నట్టుంది. ఎక్కడా?"

"అటు.. ఆ చివర గోడమీదికి పాకింది చూడు. " కుడిచేత్తో చూపించింది అర్చన.

"చాలా బాగా మెయిన్ టైన్ చేస్తున్నారు గార్డెన్." అంది మాధవి కూర్చుంటూ.

అర్చన ఆవలించి పల్చగా నవ్వింది.

పల్చటి వెలుగు క్రీనీడలా ఆమె చెంపమీద పడుతోంది. "బ్లాక్ అండ్ వైట్ సినిమాల్లో హీరోయిన్‌ల ఉన్నావు" అంది మాధవి ఆమెని చూస్తూ.

నవ్వింది అర్చన. "వాళ్ళ అందాలు చూడ్డానికే ఆ సినిమాలు చూస్తాను. "

"నీకు సినిమాలు చూసే టైం ఉంటుందా? "

"అప్పుడప్పుడు డి.వి.డిలు పెట్టుకుని ల్యాప్‌టాప్‌లో చూస్తుంటాను. కారులో లాంగ్ డ్రైవ్ వెళ్ళేటప్పుడో, రాత్రిపూట నిద్రపట్టనప్పుడో. "

మాధవి నవ్వి మౌనంగా పరిసరాలను చూస్తూ ఆలోచించసాగింది. ఆమెకి అర్చనతో తాను మాట్లాడాలనుకున్న విషయం ఎలా ప్రారంభించాలో అర్థం కాలేదు. అర్చన ఎలా స్వీకరిస్తుందో కూడా తెలియడంలేదు. కానీ, ఇదే ఆఖరి అవకాశం. ఇప్పుడు మాట్లాడి పరిస్థితులు చక్కదిద్దకపోతే ఇంక ఆ జీవితాలంతే... ఈ జీవితం ఇంతే.

"ఏంటి మధూ ఏం ఆలోచిస్తున్నావు? నిద్రొస్తుందా? " మృదువుగా అడిగింది అర్చన

"నిద్ర రోజూ పోవచ్చు. ఇంత అపురూపమైన క్షణాలు మళ్ళీ వస్తాయా అర్చనా?"

అవునన్నట్టు తలాడించింది అర్చన.

"అర్చనా! " నెమ్మదిగా పిలిచింది మాధవి.

అర్చన ఆమె వైపు చిరునవ్వుతో చూసింది.

"నీతో మాట్లాడాలి. "

"మాట్లాడు. "

"ఏం ఆలోచించావు? "

"దేని గురించి? "

"నీ భవిష్యత్తు.. నీ కొడుకు భవిష్యత్తు. "

"నా భవిష్యత్తు ఆలోచించడానికేం ఉంది? నా బిజీ లైఫ్‌లో ఆలోచించే సమయం నాకు లేదు. ఇకపోతే నా కొడుకు. నాకో కొడుకున్నాడన్న విషయం నాకు చాలా తక్కువసార్లు గుర్తొస్తోంది. అది కూడా అప్పుడు పడిన ప్రసవవేదన, నేను భరించిన బరువు గుర్తొస్తేనే. వాడి భవిష్యత్తు చూసుకోడానికి వాడి తండ్రి ఉన్నాడుగా. "

"పోనీ.. ఆ తండ్రి భవిష్యత్తు.?"

"ఎవరో తండ్రి భవిష్యత్తు నేనెందుకు ఆలోచిస్తాను మాధవీ. నాకంత టైం లేదు. "

మాధవికి ఛరున కోపం వచ్చింది. ఏంటీ ఈ మనిషి? ఈమెకి అనుభూతులు, అనుబంధాలు అంటూ ఏం లేవా? ఇంత యాంత్రికంగా బతకగలరా ఎవరైనా అనుకుంటూ కోపం తమాయించుకుంటూ అంది.

"అర్చనా.. సూటిగా అడుగుతున్నాను చెప్పు. ఏ వయసులో అనుభవించాల్సింది ఆ వయసులో అనుభవించాలి. నువ్విలా ముప్పై ఏళ్ళు దాటినా వైవాహిక జీవితాన్ని అనుభవించకపోతే త్వరగా ముసలిదానివవుతావు. పెళ్ళి సంగతన్నా ఆలోచించవా? "

"చెప్పాగా మధూ.. నాకంత టైం లేదని. "

"రెడిక్యులస్.. " అసహనంగా అంది మాధవి.

అర్చన నవ్వింది.

"సరే వేణుకి విడాకులివ్వడానికి అభ్యంతరం లేదని, అతను మరో వివాహం చేసుకోడానికి అంగీకరిస్తున్నానని రాసివ్వు. "

అర్చన చిత్రంగా చూసింది. "ఎందుకు? "

"ఎందుకేంటి? అతను మరో వివాహం చేసుకోవాలంటే మొదటి భార్యనుంచి లీగల్‌గా విడిపోకపోతే ఎవరు చేసుకుంటారు? "

"ఓ! అందుకా రాయబారం వచ్చావు. దానికోసం ఇంత దూరం రావాలా మధూ. ఇ మెయిల్ చేసేదాన్ని కదా. దానికేం రేపే ఇచ్చేస్తాను. నాకీ ఆలోచనే రాలేదు. పాపం అతను వివాహం చేసుకోలేదా? తప్పకుండా ఇస్తాను. "

ఎంత ఈజీగా అంటోంది.

విడాకులివ్వడం అంటే ఏ.టి.ఎమ్ నుంచి డబ్బులు తీసివ్వడంలా ఉంది ఈమెకి. అవునులే సంపాదిస్తోంది కదా.

మాధవి కళ్ళల్లో గ్రరున నీళ్ళు తిరిగాయి. మొహం తిప్పుకుని అర్చన చూడకుండా మొహం మీద పడిన ముంగురులు సవరించుకున్నట్టుగా చిటికెన వేలితో కంటి చివరకు వచ్చిన నీటి బిందువు బైటకి జారకుండా తుడుచుకుంటూ అంది. "నీ విశాలమైన మనసుకు థాంక్స్. అయితే డైవోర్స్‌కి అంగీకరిస్తున్నావన్నమాట. నువ్వెప్పటికైనా మారతావనుకున్నాను. అవునులే నీ స్థాయికి వేణు ఏం తూగుతాడు? " కొంచెం కోపం, కొంచెం ఆవేదన, మరికొంచెం వ్యంగ్యం కలిసిన స్వరంతో అంది మాధవి.

మాధవి మనసులో భావాలు గమనించిన అర్చన కుర్చీ కొంచెం మాధవికి దగ్గరగా జరుపుకుని ఆమె చేయి అందుకుని అంది. "కోపం వచ్చింది కదూ. కానీ, ఒక్క క్షణం ఆ కోపం తగ్గించుకు ఆలోచించు. నాకేం బంధం ఉంది అతనితో. నేనేం ఇష్టపడి అతని కోసం తపించి పెళ్ళిచేసుకుని కాపురం చేయలేదుకదా. "

"ఓ.. మరి నువ్వు తపించినవాళ్ళేమయారు? ఎవడో ఊరూ, పేరూ లేనివాడిని ప్రేమించావుకదా. ఏమయాడతను? "

అర్చన మొహం మ్లానమైంది. చప్పున మాధవి చేయి వదిలేసి మౌనంగా గాలికి కదుల్తున్న మొక్కలవైపు చూస్తూ ఉండిపోయింది.

ఆమెనలా చూడగానే మాధవికి ఆమె మనసు గాయం చేశానని అనిపించింది. కొంచెం బాధగా "సారీ అర్చనా! " అంది.

అర్చన వెంటనే స్పందించలేదు. అలా మౌనంగా, గంభీరంగా మొక్కలవైపు, పూవులవైపు చూస్తూ ఉండిపోయింది.

తరువాత నెమ్మదిగా అంది. "మాధవీ. మంచి కలలు నిజంకావు. మళ్ళీ, మళ్ళీ రావు. అతనొక మంచి కల. ఆ కల ఇదివరకు రోజూ గుర్తొచ్చేది. అది నిజం కావాలన్న ఆశా ఉండేది. ఆ వయసులో అది సహజం నేనిప్పుడు ఎదిగాను. అన్ని విధాలుగా ఎదిగాను. ఎప్పుడన్నా ఒకసారి ఆ కల తల్చుకుంటానేగానీ, అది నిజం కావాలని నేను కోరుకోడంలేదు. అలా అని నిజంకాకూడదని ఆశించడంలేదు. కలని కలగానే స్వీకరించే మానసిక స్థాయిని పొందగలిగాను. అలాగే వేణుతో పరిచయం, వేణుతో పెళ్ళి, అతనితో కలిసి ఒక ఇంట్లో కొంతకాలం జీవించడం, ఆ జీవితంలో నేనెలాంటి అనుభూతుల్ని పొందకపోడం, అతని బలత్కారం, ఆ తరవాత బలవంతంగా మోసిన గర్భం. ఇదంతా వాస్తవం. ఈ వాస్తవం అబద్ధం అని నిరూపించాలని కూడా అనుకోడం లేదు. కాకపోతే నాకూ కొన్ని ఆశలు, ఆలోచనలు ఉన్నాయి. నాకో నిర్దిష్టమైన గమ్యం ఉంది. నేను ఆల్‌మోస్ట్ నా గమ్యం చేరాను. ఇక్కడ నుంచి నాకిష్టంలేని,

నన్ను, నన్నుగా కాక నన్నో యంత్రంలా మార్చే సంసార జీవితంలోకి వెళ్ళాలని మాత్రం అనుకోవడంలేదు. బహుశా నీకు నేనో బండరాయిలా అనిపిస్తున్నానేమో. కొడుకు మీద దీనికి వాత్సల్యం లేదని అనుకుంటున్నావేమో. నా కొడుక్కి తన తల్లి బతికి ఉందని, ఆమె మంచి ఉన్నత స్థాయిలో ఉందని, ఆమె దగ్గర బతికితే ఉజ్వలమైన భవిష్యత్తు పొందచ్చని తెలియచేసి నా దగ్గరకు వాడిని ఎవరన్నా పంపగలిగితే నాకంతకన్నా ఆనందం లేదు. వాడినో మంచి పౌరుడిగా తీర్చి దిద్ది తల్లిగా నా కర్తవ్యం నెరవేర్చుకుంటాను. కానీ, వేణుతోటి, వాళ్ళ వాళ్ళతోటి దెబ్బలాడి బలవంతంగా వాడిని నా దగ్గరకు తెచ్చుకోవాలని మాత్రం అనుకోడం లేదు. అందుకు నాకు అర్హత లేదు. ఎందుకంటే ఒకరోజు అగమ్యంగా తిరుగుతూ వాడినేం చేయాలో తెలియక వాళ్ళదగ్గర వదిలేశాను. ఇప్పుడు ఏ ధైర్యంతో వాడు నాక్కావాలని అడగను. "

మాధవి ఆశ్చర్యంగా వినసాగింది. ఈమె అర్చనేనా? తనకు తెలిసిన అర్చనేనా? ఈమె మనసులో ఇన్ని భావాలున్నాయా? కొడుకు కావాలన్న కోరిక ఉందా? ఆ కోరికను గాంభీర్యం చాటున అణచి ఉంచిన ఈమె వ్యక్తిత్వాన్ని తానెలా అంచనా వేయగలదు.

హఠాత్తుగా అంది. "అలాంటప్పుడు విడాకుల ప్రసక్తి దేనికి? వేణుతో కలిసి ఉండచ్చుగా. "

"పిల్లల కోసం జీవితాంతం ఇష్టం లేని భర్తను భరించే సాధారణ స్త్రీని కాదుకదా. "

"ఏం పైనుంచి దిగివచ్చావా? " కసిగా అంది మాధవి.

అర్చన మెత్తగా నవ్వింది. "కోపం తెచ్చుకోకు మధూ. నాకు వేణు మీద కోపం, ద్వేషం లేదు. అలాగని భర్తగా ప్రేమించలేను. ఎలా కాపురం చేయను చెప్పు. "

"మరి జీవితాంతం ఇలాగే ఉంటావా? "

"ఎందుకుంటాను. నన్ను అర్థం చేసుకుని, నన్నుగా ప్రేమించి, నా ప్రేమను కూడా పొందగల వ్యక్తి తారసపడితే పెళ్ళి చేసుకుంటాను. "

"మరి కొడుకు కావాలంటున్నావుగా. వాడిని ఆ వ్యక్తి ఆదరిస్తాడా?"

"కొడుకు కావాలంటంలేదు. వస్తే ఆదరిస్తానంటున్నాను. అయినా నన్ను ప్రేమించి ఆదరించే వ్యక్తి లభిస్తే ఆ వ్యక్తికి నా కొడుకుని ఆదరించడంలో ఇబ్బందేం ఉంటుంది? "

"చాలా ఉంటుంది. నిన్ను చేసుకునే వాడు నీ డబ్బుకోసం, నీ అందం కోసం, నీ హోదా కోసం చేసుకుంటాడు. ఎటి పరిస్థితుల్లో కూడా వాడు నీ కొడుకుని ఆదరించడు. "

ఒక్కసారిగా ఉలిక్కిపడింది అర్చన. అంతేనా? తనని తనుగా స్వీకరించే వ్యక్తి లభించడా? మాధవి అనేది నిజమేనా? అలా అయితే తను ఎప్పటికీ పెళ్ళిచేసుకోదు. అలా అని ఈ ఒంటరి జీవితం ఇలా కొనసాగించడం కూడా ఇష్టం లేదు. ఏం చేయాలి? బాబుని తెచ్చేసుకుంటే... అవును తనకో తోడు, తన జీవితానికో అర్థం ఉంటుందా? ఎవరికోసం ఈ సంపాదన ఎవరికోసం ఈ ఆరాటం, ఈ పరుగులు. తనకంటూ ఎవరున్నారు అమ్మా, నాన్న, అన్నయ్య, అత్తగారు మావగారు.

"ఇంతకీ పెద్దవాళ్ళిద్దరూ ఎలా ఉన్నారు? " అడిగింది అర్చన.

"ఏ పెద్దవాళ్ళు?" సూటిగా చూసింది మాధవి.

"అదేనే వేణు తల్లితండ్రులు. "

"నీకు తెలియదా? పెద్దాయన పోయారు. ఆవిడ ఉన్నా లేనట్టుగా ఉన్నారు అనారోగ్యంతో. ఆ ఇల్లు స్మశానంలా ఉంది. నీలవేణి అని ఒకమ్మాయి తాయారమ్మగార్ని, బాబుని కనిపెట్టుకుని ఉంటోంది. ఆ అమ్మాయికి పెళ్ళిచేసి పంపించేయాలన్నది వేణు బాధ్యతగా భావిస్తున్నాడు. ఆ అమ్మాయి వెళ్ళిపోతే ఆ ఇంట్లో దిక్కులేదు. "

"వేణు ఇంతకాలం పెళ్ళెందుకు చేసుకోలేదు? "

"తెలిసి అడుగుతున్నావా? వేణు నిన్ను నిజంగా ప్రేమించాడు అర్చనా. అతన్ని పెళ్ళిచేసుకోడానికి ఒప్పించడానికి నేను చాలా కష్టపడ్డాను. అతను ఒప్పుకునేసరికి అమ్మాయిలంతా తెలివిమీరారు. విడాకులు తీసుకోకుండా చేసుకోం అంటున్నారు. "

"అయ్యో అలాగా పాపం. నేను తప్పకుండా విడాకులిస్తాను మధూ. అతను బాగుండాలన్నదే నా కోరిక. చాలా సంతోషం."

మళ్ళీ ఇద్దరి మధ్యా మాటలు ఆగిపోయాయి. ఎవరి ఆలోచనల్లో వాళ్ళు చీకటి, వెలుగుల మిశ్రమాన్ని చూస్తూ కూర్చున్నారు.

●●●

వేణు జీవితం తన వలన నాశనం అయిందా? మొదటిసారిగా అర్చన మనసులో ఈ ఆలోచన కలిగింది. ఎంతపని జరిగింది. తను తన కోణం నుంచే ఆలోచించింది ఇంతకాలం. కానీ, వేణు స్థానంలో నిలబడి ఆలోచించలేదు. ఎందుకింత మూర్ఖురాలైంది. అయ్యో తను ఎప్పుడో విడాకులిచ్చేసి ఉండాల్సింది. ఈ పాటికి వేణు హాయిగా పిల్లా, పాపలతో కళకళ్ళాడుతూ ఉండేవాడు. ఒక స్నేహితుడిగా కూడా తను అతన్ని భావించలేకపోయిందా? స్నేహితుల బాగుకోరుకోడం సంస్కారం కదా. మాధవి ఇంత దూరం వచ్చి తనతో వ్యక్తిగత విషయాలు చర్చించడం వలన ఆమెకొచ్చిన లాభం ఏంటి? కేవలం స్నేహితుల శ్రేయస్సు కోరి అటు వేణుకి, ఇటు తనకి ఏదో మంచి చేయాలన్న తపన కదా. తనలో ఆ సంస్కారం, ఆ మానవత్వం కొరవడడానికి కారణం ఏంటి?

ఛ తప్పు చేసింది. చాలా తప్పు చేసింది. దేవుడు లాంటి కృష్ణస్వామిగారు పోయారా? ఎంత మంచి వ్యక్తి. అలాంటి వ్యక్తిని మళ్ళీ కలుసుకోలేదు. పాపం ఆవిడ తాయారమ్మగారు. పార్వతీ దేవిలా కళ, కళ్ళాడుతుండే ఆవిడ వదనం ఎలా ఉందో? అర్చనకి గుండెనిండా దుఃఖం పేరుకుంది. ఆవిడని చూడాలనిపించింది. బాబుని వాళ్ళు ఆదరించకపోయి ఉంటే తనకి మహాపాపం అంటేది. తనని పాపవిముక్తురాల్ని చేసిన ఆ పుణ్యదంపతులకి తనేం చేసింది?

అర్చన అనూహ్యంగా మాధవి ఒడిలో తలదాచుకుని వెక్కి, వెక్కి ఏడవసాగింది.

అనుకోని ఆ సంఘటనకి బిత్తరపోయిన మాధవి కలవరంగా అడిగింది "అర్చనా.. అర్చనా ఏంజరిగింది? నేను బాధపెట్టానా? సారీ అర్చనా. సారీ ప్లీజ్ ఊరుకో. "

అర్చన కాదన్నట్టు తలాడిస్తూనే ఏడవసాగింది.

కొద్ది నిమిషాలు అలా ఏడుస్తూ ఉండిపోయిన అర్చన నెమ్మదిగా లేచి "పద పడుకుందాం" అంది వెక్కుతూ.

మాధవి మరేం మాట్లాడకుండా ఆమెని పొదివిపట్టుకుని లోపలికి నడిపించింది.

మర్నాడు అర్చన దగ్గర సెలవు తీసుకుని మాధవి దంపతులు హైదరాబాదు బయలుదేరారు. బొట్టు పెట్టి పట్టుచీర ఇచ్చింది అర్చన మాధవికి. పిల్లలిద్దరికీ చెరో ఐదువేలు చెక్ ఇచ్చింది. మాధవి ఇంటి ఫోన్ నెంబరు, సెల్ నెంబరు తీసుకుంది.

వాళ్ళు వెళ్ళాక భారమైన మనసుతో ఆఫీసుకి వెళ్ళిపోయింది.

●●●

నీలవేణికి మరో సంబంధం చూశాడు వేణు.

ఆ అబ్బాయి ఎయిర్‌టెల్ మొబైల్ కంపెనీలో పనిచేస్తున్నాడు. తల్లీ, తండ్రి ఇద్దరక్కలు ఉన్నారు. చాలా మాములు కుటుంబం.

నీలవేణిని చూడగానే కుటుంబ సభ్యులందరికీ అమ్మాయి నచ్చింది. ఆమె పేరున తను వేసిన ఫిక్స్‌డ్ డిపాజిట్ వివరాలు చెప్పాడు వేణు. పెళ్ళి చేతనైనంతలో ఘనంగానే చేస్తానని మాట ఇచ్చాడు

కన్యాదానంలాంటి ఫార్మాలిటీస్ లేకుండా రిజిస్ట్రార్ ఆఫీసులో పెళ్ళి చేసి, గ్రాండ్‌గా రిసెప్షన్ ఏర్పాటు చేస్తానన్నాడు.

పెళ్ళికొడుక్కి సూటు, వాచీ, ఉంగరం ఇవ్వడానికి ఒప్పుకున్నాడు.

నీలవేణి కూడా మౌనంగానే తన అంగీకారం తెలిపింది. ఆమెకిప్పుడు ఎప్పుడెప్పుడు ఈ ఇంటినుంచి వెళ్ళిపోవాలా అనే ఆరాటం మొదలైంది. శాశ్వతంగా తనీ ఇంట్లో ఉండడం అసంభవం. అమ్మగారు ఉన్నంతకాలం కనీసం ఒక పనిమనిషిగానైనా తనీ ఇంట్లో ఉండగలదు. ఆవిడకేదన్నా అయితే తన పరిస్థితి ఏంటి? వేణుబాబుగారి పెళ్ళి అయితే వచ్చే ఆవిడ తనని ఇంట్లో నుంచి వెళ్ళగొట్టడం ఖాయం. అప్పుడెక్కడికి వెళ్ళాలి? ఏం చేయాలి?

అందుకే నీలవేణి తనని పెళ్ళి చేసుకోడానికి ఎవరు ముందుకు వచ్చినా అంగీకరించాలని నిర్ణయించుకుంది. వచ్చేవాడు కుంటివాడు అయినా, గుడ్డివాడు అయినా, వృద్ధుడైనా తనకో నీడనిచ్చేవాడు అయితే చాలు. కానీ, దేవుడు దయతలచి ప్రస్తుతం వచ్చినవాడు బాగానే ఉన్నాడు. చాలు. ఈ మాత్రం చాలు.

మాధవి చేత అడిగించాడు వేణు "ఆ అమ్మాయికిష్టమేనా తెలుసుకో మాధవి" అంటూ.

"మనస్ఫూర్తిగా చెప్పు వేణీ" అని అడిగిన మాధవికి నవ్వుతూ చెప్పింది. "ఇష్టమే అక్కా. వీలైనంత త్వరగా ముహూర్తం పెట్టించండి."

మాధవి విస్తుబోయి చూసింది. "ఎందుకు? ఏం జరిగింది? విసుగ్గా ఉందా ఇక్కడ.?"

"ఛీ అదేం లేదక్కా. ఊరికినే. మళ్ళీ ఈ సంబంధంకూడా తప్పిపోకుండా త్వరగా పెళ్ళయిపోతే బాగుంటుంది కదా. "

మాధవి నవ్విందేకానీ, ఆమెకెందుకో నీలవేణి మనసు గాయపడిందనిపించింది.

వేణుతో చెప్పింది "ఆ అమ్మాయి ఒప్పుకుంది వేణూ. వీలైనంత త్వరగా ముహూర్తం పెట్టించు. "

వేణు "హమ్మయ్య" అని ఊపిరి పీల్చుకున్నాడు.

ఆ తరువాత చక, చకా మిగతా ఏర్పాట్లు చేశాడు వేణు. నెల ముందుగా రిజిస్ట్రార్ ఆఫీసులో అపాయింట్‌మెంట్ తీసుకున్నాడు.

ఈలోపల అర్చన మాధవికి వేణుతో తనకెలాంటి అభ్యంతరం లేదని లెటర్ పంపించింది.

మాధవి మనసు కలుక్కుమన్నా, పోనీలే వేణు జీవితం సెటిల్ అయిపోతుందని ఊపిరి పీల్చుకుంది. నీలవేణి పెళ్ళి అయాక ఆ లెటర్ విషయం వేణుకి చెప్పచ్చులెమ్మని ఊరుకుంది.

అంతకు ముందు పెళ్ళికోసం కొన్న పట్టుచీరలు వాడలేదు కాబట్టి మళ్ళీ కొత్తచీరలు కొనే అవసరం రాలేదు. కాకపోతే మెడలోకి సూత్రం గొలుసు కొనమని మాధవికి డబ్బులిచ్చాడు వేణు.

నీలవేణిని తీసుకుని వెళ్ళి ఆమెకి గొలుసు కొన్నది మాధవి.

తాయారమ్మ ఆరోగ్యం కొంచెం కుదుటపడింది. అందుకు నీలవేణే కారణం ఆమె తీసుకున్న శ్రద్ధ, ఆమె చేసిన నిరంతరాయ సేవలు ఆవిడని మళ్ళీ మనిషిని చేశాయి. పూర్తిగా కాకపోయినా తన పనులు తను చేసుకోగలుగుతోంది. ఆ విషయంలో మాత్రం అందరూ నీలవేణి పట్ల కృతజ్ఞత ప్రదర్శించారు.

"నీ దయతోటే పిన్నిగారు మాములు మనిషయారు వేణీ" అంది మాధవి.

"నా స్థానంలో ఎవరున్నా చేస్తారక్కా! నాదేం ఉంది" అంది నిర్లిప్తంగా నీలవేణి.

"మామూలుగా ఆడపిల్లలు పెళ్ళి అంటే చాలా ఆనందంగా, ఉత్సాహంగా ఉంటారు. నీ మొహం చూస్తుంటే నీకీ పెళ్ళి ఇష్టంలేదేమో అనిపిస్తోంది. నిజం చెప్పు వేణీ. మనస్ఫూర్తిగానే ఒప్పుకున్నావా? "

నీలవేణి సన్నగా నిట్టూర్చి అంది. "నాకు పెళ్ళే అవుతుందో, లేదో అనుకున్నాను. ఎవరో ఒకళ్ళు దయతో నన్ను చేసుకోడానికి ముందుకొచ్చారు. ఇంక ఇష్టం ప్రసక్తి దేనికక్కా. "

"అలా అనకు నీకిష్టం లేకుండా చేయడం మాకెవరికీ ఇష్టంలేదు. "

"అదేం లేదక్కా. ఒకసారి సంబంధం తప్పిపోయిందికదా అని మనసులో భయం, గాభరాగా ఉంది. "

"ఆ పరిస్థితులు అవి. అలా అని ఎప్పుడూ అలాగే జరగదు. తెలిసిందా? పిచ్చి ఆలోచనలు పెట్టుకోకుండా హాయిగా ఉండు" మృదువుగా మందలించింది మాధవి.

ఆ తరువాత నీలవేణిలో కొంచెం మార్పు గమనించి ఊపిరి పీల్చుకుంది మాధవి.

కాకపోతే నీలవేణి అత్తగారింటికి వెళ్ళిపోతే తాయారమ్మ బాధ్యత, రిత్విక్ బాధ్యత ఎవరు తీసుకుంటారు? రిత్విక్ కూడా బాగా అలవాటైపోయాడు నీలవేణికి. వాడు గొడవేం చేయడు కదా.

అదే విషయం ఓ రోజు వేణుతో చర్చించింది మాధవి.

"అలా అని ఆ అమ్మాయిని జీవితాంతం ఇక్కడ ఉంచుకోలేంగా మాధవీ. చూద్దాం ఇంకెవరన్నా మేడ్స్ దొరుకుతారేమో అయితే సడన్‌గా కాకుండా కొంచెం నెమ్మదిగా రిత్విక్‌ని డైవర్ట్ చేయాలి. అలా చేయాలంటే కొద్దిరోజులు నీలవేణి ఇంటికి వస్తూపోతూ ఉండాలి" అన్నాడు వేణు.

"వాళ్ళత్తగారితో మాట్లాడు వేణూ. పరిస్థితి వివరించు. వాళ్ళు మంచివాళ్ళు అర్థం చేసుకుంటారనుకుంటాను. "

"నేనూ అదే ఆలోచిస్తున్నా చూద్దాం. రేపు మాట్లాడతాలే" అన్నాడు వేణు తలపంకిస్తూ.

మరునాడే వేణు సికింద్రాబాద్ వెళ్ళాడు బ్యాంక్ నుంచి.

నీలవేణికి కాబోయే అత్తగారు వాళ్ళ ఇల్లు కూడా సికింద్రాబాదే అవడంతో కొంతకాలం పాటు అప్పుడప్పుడు వచ్చి తాయారమ్మని చూసుకోడానికి అనుమతిమ్మని అడిగాడు వేణు పెళ్ళికొడుకు తండ్రిని.

ఆయన పెద్దమనసుతో "అదేంటండి. ఆ అమ్మాయి మీ అమ్మాయి. ఇంతకాలం ఆమెని ఆదరించి, ఆశ్రయం ఇచ్చి ఇప్పుడు పెళ్ళిచేస్తున్నారు. మీరెప్పుడు కావాలంటే అప్పుడు తీసుకెళ్ళండి." అన్నాడు.

వేణు గుండెల మీదనుంచి బరువు దింపినట్టు అయింది. "థాంక్స్" చెప్పాడు.

ఆగస్టు నెల పదకొండోతేదీ ఉదయం పదిగంటల పది నిమిషాల, ఇరవై సెకన్లకి రిజిస్ట్రార్ ఆఫీసులో నీలవేణి, శ్రావణ కుమార్ వేణు, తాయారమ్మ, మాధవి, చక్రవర్తి, శ్రావణకుమార్ తల్లితండ్రులు, అక్కల సమక్షంలో పూలదండలు మార్చుకున్నారు.

వేణు, చక్రవర్తి సాక్షి సంతకాలు చేశారు.

●●●

**నీలవేణి తాయారమ్మ పాదాలమీద వాలిపోయింది.** ఆమె కళ్ళనుంచి రాలిన కన్నీళ్ళు ఆవిడ పాదాలను అభిషేకించాయి. ఆవిడ బలహీనమైన చేతుల్తో ఆమెని లేవనెత్తి 'నిత్య సుమంగళిగా బతుకు' అంటూ దీవించింది.

మాధవి నీలవేణిని ఆప్యాయంగా కౌగలించుకుని "కంగ్రాట్స్ వేణీ మంచి గృహిణిగా పేరు తెచ్చుకో. అలా అని గృహహింసని మాత్రం భరించకు" అంది.

"అలాంటివి మా ఇంట్లో ఉండవండి" అంది శ్రావణకుమార్ అక్కయ్య సరోజ.

"నాకు తెలుసు మీ స్వచ్ఛమైన మనసులే అందుకు సాక్ష్యం" అంది మాధవి నవ్వుతూ.

ఆ తరువాత అందరూ కలిసి హోటల్లో లంచ్ చేసి ఇంటికి వచ్చారు.

ఆ సాయంత్రం రిసెప్షన్ ఇంట్లోనే ఏర్పాటు చేశాడు.

ఇల్లంతా సీరియల్ బల్బులతో, పూలదండలతో డెకరేట్ చేయించాడు.

కాటరింగ్ ఆర్డర్ చేశాడు.

చాలా రోజుల తరువాత ఇల్లంతా కళకళ్ళాడింది. తాయారమ్మ పట్టుచీర కట్టుకుని అలా నట్టింట్లో కూర్చుని ఉంటే అందరి మనసులు ఆహ్లాదంగా మారయి.

రిసెప్షన్ సమయం దగ్గర పడుతుండగా అంది తాయారమ్మ. "వేణీ బట్టలు సామాను సర్దుకున్నావా? "

ఆవిడ కోసం సగ్గుజావ తీసుకొచ్చిన నీలవేణి లేదన్నట్టుగా తలాడించింది.

"వెళ్ళు, వెళ్ళు సర్దుకో ఈ పనులన్నీ పక్కన పెట్టు. ఆనక వాళ్ళు తొందరపెడితే కంగారులో అన్నీ మర్చిపోతావు వెళ్ళు."

"అలాగేనమ్మా" ఆవిడ జావ తాగిన గిన్నె తీసుకుని లోపలికి వెళ్ళిపోయింది.

కొద్ది నిమిషాల తరువాత నీలవేణి తన గదిలోకి వెళ్ళి బట్టలు, సామాను సర్దుకోసాగింది.

అలా సర్దుకుంటుంటే ఆమెకి కన్నీళ్ళాగలేదు. ఈ ఇంటితో తనకింక ఋణం తీరిపోయిందా?

ఇక నుంచి తనీ ఇంటికి ఓ పరాయిదానిలా రావాలా? ఇంతకాలం ఎవరూ తనని పరాయిగా చూడలేదు. ఇక ముందు తనకి ఈ ఇల్లు పరాయి ఇల్లు.

గది మధ్యలో నిలబడి చుట్టూ కళ్ళతో తడిమి, తడిమి చూసుకుంది.

వెనక్కి తిరిగి తను నడిచి వచ్చే వరండా, మెట్లు చూసింది. బాల్కనీలోకి వచ్చి పెరట్లోకి చూసింది.

ఈ మొక్కలన్నీ తను నాటినవే. తను పెంచినవే.

రిత్విక్, కౌశిక్ ఆడుకుంటున్నారు.

రిత్విక్‌ని ఈ చేతుల్తో పెంచింది. వాడి ఉచ్చలు, పీతులు తీసింది. వాడు తన బట్టల మీద వాంతులు చేశాడు. చాలా చేశాడు. అన్నీ ఆనందంగా భరించింది.

ఇంక వాడితో తనకేం సంబంధం లేదా?

అసలు తనెందుకు వేరేవాళ్ళని పెళ్ళిచేసుకోడానికి ఒప్పుకుంది.

వేణు బాబునే పెళ్ళి చేసుకుని ఉంటే ఎంత బాగుండేది.

"వేణీ.!! "

మాధవి పిలుపుకి ఉలిక్కిపడి, ఖంగారుగా చూసింది. తన మనసులో కలిగిన ఆలోచన ఈమెకి తెలిసిందా

"ఏంటి? ఏం చేస్తున్నావు? " అడిగింది మాధవి ఆమెకి దగ్గరగా వస్తూ.

"ఏం.. ఏం లేదక్కా నా సామాను సర్దుకుంటున్నాను. "

"ఓ.. బాధగా ఉందా? " ఆప్యాయంగా అడిగింది.

నీలవేణికి దుఃఖం ఆగలేదు. వెక్కి వెక్కి ఏడ్చింది.

మాధవి కళ్ళు కూడా చెమర్చాయి. "ఏడవకు.. వస్తూ ఉంటావుగా. ఇక్కడికి దగ్గరే మీ అత్తగారిల్లు."

నీలవేణి వెక్కుతూ అంది. "నేను రావచ్చా మళ్ళీ ఈ ఇంటికి.? "

"అదేంటి వేణీ.. ఎవరు రావద్దంటారు నిన్ను? నువ్వు ఈ ఇంటి ఆడపడుచువి. ఎప్పుడు కావాలంటే అప్పుడు రావచ్చు. రావాలి కూడా."

నీలవేణికి ఆ మాటలు గుండెల మీద పన్నీరు చిలికినట్టు అనిపించాయి. హాయిగా నిట్టూర్చింది.

"పద కిందికెళదాం. నిన్ను తయారు చేస్తాను రిసెప్షన్‌కి" అంది మాధవి.

"వస్తాను. మొహం కడుక్కుని వస్తాను" అంది నీలవేణి.

"సరే నేను వెళ్తాను.. వచ్చెయ్" అంటూ మాధవి కిందికెళ్ళిపోయింది.

నీలవేణి మొహం కడుక్కుని, జడవేసుకుని తయారై కిందికి వచ్చింది.

నెమలి కంఠం రంగు పట్టుచీర ఇచ్చి "వెళ్ళి ఇది కట్టుకురా! కల్యాణం బొట్టుపెడతాను" అంది మాధవి.

నీలవేణి మౌనంగా ఆ చీర అందుకుని తిరిగి పైకి వెళ్ళి చీర కట్టుకుని వచ్చింది.

మాధవి, తాయారమ్మ బొమ్మలా వచ్చి ఎదురుగా నిలబడ్డ నీలవేణిని చూసి ముగ్ధులైనట్టుగా చూడసాగారు. "ఎంత బాగుంది ఈ అమ్మాయి, ఈమెకి పరాయి సంబంధం చూసి పొరపాటు చేశామా? అనవసరంగా ఈమెని ఈ ఇంటి నుంచి పంపిస్తున్నామా? కులగోత్రాల గురించి పక్కన పెడితే వేణుకి ఇంతకన్నా మంచి అమ్మాయి లభిస్తుందా? అయ్యో ఎంత పొరపాటు జరిగింది."

"అమ్మగారూ దీవించండి.." నీలవేణి పాదాలు తాకడంతో ఉలిక్కిపడిన తాయారమ్మ మనసులోనే చెంపలు వాయించుకుంటూ దీర్ఘసుమంగళీభవ అంటూ దీవించింది.

ఆవిడ అలా అనగానే నీలవేణి బావురుమంది.

"అమ్మగారూ నేనేదన్నా తప్పు చేస్తే క్షమించండి."

"అదేంటే నువ్వేం తప్పు చేసావు? పిచ్చిదానా.. లే ఏడవకు. ఆడపిల్లలన్నాక అత్తగారింటికి వెళ్ళక తప్పదు. ఏడవకు" అంటూ ఓదార్చబోయినా ఆవిడక్కూడా దుఃఖం ఆగలేదు. "ఏ జన్మబంధమో ఎంత సేవ చేసింది ఈ పిల్ల!" అనుకుంది.

మాధవి కూడా దుఃఖంతో మూగబోయిన స్వరంతో ఏం మాట్లాడలేక నీలవేణిని దగ్గరకు తీసుకుని ఆమె వీపు మీద ఓదార్పుగా రాస్తూ బలవంతంగా గొంతు పెకిలించుకుని అంది, "ఏడవకు.. అతిధులు వస్తున్నారు బాగుండదు."

నీలవేణి బలవంతంగా తనను తాను నిగ్రహించుకుని అక్కడే ఉన్న టవల్‌తో మొహం తుడుచుకుంది.

"మరోసారి మొహం కడుక్కురా! తయారు చేస్తాను" అంది మాధవి.

నీలవేణి లోపలికి వెళ్ళింది.

రిసెప్షన్ కి వేణు తనకి ముఖ్యమైన కొలీగ్స్‌ని, స్నేహితులని పిలిచాడు. శ్రావణ కుమార్ తరపున పాతికమంది వచ్చారు. అంతా కలిపి యాభైమంది.

లాన్‌లో ఓ పక్కగా ఏర్పాటు చేసిన టెంట్ మధ్యలో కుర్చీలు, మూలగా వేసిన డయాస్, దానిమీద నూతన వధూవరులు.

సరదాగా, ఉత్సాహంగా పూర్తి అయింది రిసెప్షన్.

మర్నాడు కన్నీటి వీడ్కోలు తీసుకుని భర్త, అత్తగారు, మావగార్లతో నీలవేణి వెళ్ళిపోతుంటే రిత్విక్ బావురుమన్నాడు. అప్పటిదాకా "నీలవేణి పెళ్ళి, నీలవేణి పెళ్ళి" అంటూ గంతులేస్తూ తిరిగిన రిత్విక్ అకస్మాత్తుగా అలా ఏడవడంతో అందరూ ఖంగారు పడ్డారు. నీలవేణి అయితే కన్నీటి చెరువైంది. వాడిని దగ్గరకు తీసుకుని ఏడుస్తుంటే మాధవి బలవంతంగా వాళ్ళిద్దరినీ విడదీసి నీలవేణిని పంపించి రిత్విక్‌ని దగ్గరకు తీసుకుని, నీలవేణి అలా ఎందుకు వెళ్ళిందో చెబుతూ వాడిని నిద్రపుచ్చింది.

●●●

అర్చనకి తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ పోస్టింగ్ వచ్చింది.

అర్చన కల నెరవేరింది. అర్చన.. ఐ.ఏ.యస్.

"వావ్... సాధించాను... సాధించాను."

గట్టిగా అరవాలనిపించింది. ఆ అరుపు ఎంత దూరంలో ఉన్నారో తెలియని అమ్మా, నాన్నలకి అహంకారం నిలువెల్లా నింపుకున్న అన్నయ్యకి వినబడేలా గట్టిగా అరవాలి.

"నేను కలెక్టర్‌ని... అర్చన కలెక్టర్."

మళ్ళీ చాలా కాలానికి విశాఖపట్నం వెళ్ళాలి.

ఆనందం చిన్న కెరటంలా కదిలి నిలువెల్లా తాకినట్టైంది.

తను పుట్టి పెరిగిన ఊరు, తనని అవమానాలపాలు చేసిన ఊరు, తనని తరిమేసిన ఊరు, తనకి మనోబలం ఇచ్చి జీవితంలో నిలబెట్టిన ఊరు. విశాఖపట్నానికీ తనకీ అవినాభావ సంబంధం ఉంది.

అదే ఊరుకి తను కలెక్టర్‌గా వెళ్తోంది.

ఎంత గొప్ప అవకాశం. అక్కడ తను కలవాల్సిన వాళ్ళు కొందరున్నారు. ముందుగా నళిని తనకెంతో సాయం చేసి, మరెంతో మనోధైర్యం ఇచ్చిన నళిని.

పాత డైరీలు వెతికి, నళిని అడ్రస్ కోసం చూసింది. కానీ, ఎక్కడా కనిపించలేదు.

అక్కడి నుంచి వచ్చాక కొత్తల్లో మాత్రం రెండో మూడో ఉత్తరాలు రాసింది తను. ఆ తరువాత నళిని సంగతే మర్చిపోయింది. అలా మర్చిపోడంలో అహంకారం కానీ, నిర్లక్ష్యం కానీ లేదు పనుల వత్తిడి తప్ప ఒక్కోసారి తన భోజనం సంగతి కూడా మర్చిపోయింది.

ఇప్పుడు హఠాత్తుగా వెళ్ళి కలిస్తే నళిని ఎలా రియాక్ట్ అవుతుందో.

అసలు తను వెళ్ళగలదా?

నళిని అదే ఇంట్లో ఉందో, ఎక్కడ ఉందో.

ఆవిడ తనకి ఆశ్రయం ఇచ్చి ఆదరించిన చల్లని తల్లి. ఆవిడ పేరు.. ఆవిడ పేరు.. ఏం పేరు గుర్తురావడం లేదు. ఇల్లు గుర్తుందిగా ఆవిడ ఆ రోజు తనని సాగనంపుతూ అంది కూడా "కలెక్టర్ కాబోతున్నావు. మమ్మల్ని మర్చిపోతావా? " అని. మర్చిపోలేదని ఆవిడకి కనిపించి మరీ చెప్పాలి. కరెక్ట్ ఆవిడ పేరు వర్ధనమ్మగారు. మాట పెడసరంగా ఉన్నా మనసెంతో మంచిది.

అర్చన ఆలోచిస్తుండగానే ఫేర్‌వెల్ పార్టీలు, మళ్ళీ పుష్పగుచ్ఛాలు, స్వీట్లు, అభినందనల పరంపరలు, మొదలైనాయి.

అజయ్ నుంచి బొకే వచ్చింది "కంగ్రాట్స్" అంటూ.

అది చాలా అపురూపంగా దాచుకుంది అర్చన.

ఖమ్మం జిల్లా కలెక్టర్ తనకెంతో సన్నిహితంగా వచ్చిన స్నేహమయి కలెక్టర్ హరిణిని కలిసింది.

ఆమె చాలాసేపు అర్చనకి కలెక్టర్‌గా ఎలాంటి ఛాలెంజెస్ ఎదుర్కోవాలో, ఎలాంటి వత్తిళ్ళు వస్తాయో, అన్నీ విపులంగా చెప్పింది. చివరికి "ఏం జరిగినా మీరు మాత్రం చలించకండి. మనం ఎంత గంభీరంగా ఉంటే ఎదుటివాళ్ళు అంత భయపడతారు. మీరు భయపడినట్టు వాళ్ళు గుర్తించారంటే చెవులకి తాటాకులు కడతారు. బి కేర్ ఫుల్. ఆల్ ద బెస్ట్" అంటూ అభినందించింది.

ఆమెకి కృతజ్ఞతలు చెప్పి వచ్చేసింది అర్చన.

తిరిగి సామాను ప్యాక్ చేయించి, విశాఖపట్టణం రైలెక్కింది.

అర్చన చార్జ్ తీసుకుంది మళ్ళీ రొటీన్.. పాత కలెక్టర్‌ని రిలీవ్ చేయడం, కొత్త కలెక్టర్‌కి స్వాగతం.

కలెక్టర్ రాగానే ఎందరో వస్తారు కలుస్తాం అంటూ. వాళ్ళంతా స్వార్థపరులే! వాళ్ళ వాళ్ళ ప్రయోజనాల కోసం గౌరవం, అభిమానం, శ్రద్ధ ఒలకపోసేవాళ్ళే. లోకల్ లీడర్లు, రాజకీయాల్లో తిరిగేవాళ్ళు కంట్రాక్టర్లు.

వాళ్ళలో కనిపించే అతి వినయం, అతి మర్యాద అర్చనకి చిరాకు.

కానీ, ఆ చిరాకు బైట పడకుండా జాగ్రత్త పడాలి.

ప్రవాహంలా వస్తున్న విజిటర్స్‌తో విసుగొచ్చేసింది.

పాత కలెక్టర్ చాల మంచివాడు ఆంధ్రుడు. పేరు విద్యాధర్. అతను కెమిస్ట్రీలో పి.హెచ్.డి చేశాడు.

విద్యాధికుడు, సంస్కారవంతుడు, చక్కనివాడు. చూడగానే పాత సినిమాల్లో హీరోలైన, హరనాథ్, శోభన్‌బాబులాంటి అందగాళ్ళు గుర్తొస్తారు.

"మీ గురించి విన్నాను అర్చనగారూ మీరు చాలా డైనమిక్ అని తెలిసింది. కీప్ ఇట్ అప్. వీళ్ళంతా దొంగలు. మనకి ఈ స్వీట్లు, పూలదండలు, బొకేలు ఇవన్నీ ఇస్తున్నారంటే మనమీద అభిమానం అనుకోకండి. అఫ్‌కోర్స్ మీకు తెలిసే ఉండచ్చు. మనల్ని ట్రాప్ చేయడానికి వాళ్ళు పంపించిన ప్రతిఫైలూ మనం కళ్ళు మూసుకుని సైన్ చేసేస్తామన్న వెధవ నమ్మకం తోటి. "

అర్చన ఆ మాటకి నవ్వింది.

"వీళ్ళని చూడగానే అర్థం అవుతుంది సార్ "అంది.

"ఇఫ్ యూ డోంట్ మైండ్ సార్ తీసేస్తారా?"

"ష్యూర్. "

"మీకేం డౌట్స్ వచ్చినా, క్లారిఫికేషన్ కావాలన్నా కాంటాక్ట్ చేస్తుండండి. మీకో విషయం చెప్పాలి మీ పర్సనల్ స్టాఫ్‌ని కూడా ఎక్కువగా నమ్మకండి. మన దగ్గర నమ్మకంగా ఉంటూనే డబ్బులకోసం అమ్ముడుపోతుంటారు. కాన్ఫిడెన్షియల్ ఫైల్స్ జిరాక్స్‌లు వెళ్ళిపోతుంటాయి. స్టెనో శ్వేత గుడ్ గర్ల్ ఆ అమ్మయిని నమ్మచ్చు. నేను చెప్తాను. షి విల్ కోపరేట్."

"థాంక్యూ విద్యాధర్ గారూ! అని మీ పేరు షార్ట్ చేయడం ఎలా? " అడిగింది అర్చన.

అతను ఆలోచిస్తున్నట్టు ఒక్క క్షణం కళ్ళుమూసుకుని "విద్యా.. ఈజిట్ ఓకె.? " అన్నాడు.

"యా! " నవ్వింది అర్చన.

"ఓ.కె మనం నైట్ డిన్నర్ చేద్దాం. మీ కభ్యంతరం లేదుగా. "

"నాటెటాల్. తప్పకుండా చేద్దాం."

ఆ తరువాత మరి కొంచెం సేపు కూర్చుని విద్యాధర్ వెళ్ళిపోయాడు.

అర్చన విజిటర్స్ అందరూ వెళ్ళిపోయారని పి.ఏ ద్వారా కన్‌ఫర్మ్ చేసుకుని తన బంగళాకి బయలుదేరింది.

బిళ్ళబంట్రోతు తెల్లటి యూనిఫామ్‌లో అత్యంత వినయంగా ఛాంబర్ డోర్ తీసి పట్టుకున్నాడు. ఆమె బైటకి రాగానే అక్కడ ఉన్న స్టాఫ్ కొందరు వినయంగా లేచి నిలబడ్డారు.

పి.ఏ ఆమె ఏమన్నా చెబుతుందేమోనన్నట్టు చేతులు కట్టుకుని నిలబడ్డాడు.

అర్చన ఛాంబర్ లోంచి బైటకి వచ్చి ఒక్కసారి తలతిప్పి చూసింది.

అర్చన ఐ.ఏ.యస్, కలెక్టర్ తూర్పు గోదావరి జిల్లా. నేమ్ ప్లేట్ మెరుస్తోంది. ఆమె గుండె ఝుల్లుమంది. అర్చనా శభాష్ అనుకుంది.

చార్జ్ తీసుకునే ముందు లేని నేమ్ ప్లేట్, తీసుకుని బైటకి రాగానే కనిపించింది. అప్పుడే మార్చేశారన్నమాట.

అప్పటిదాకా విద్యాధర్ అనే కలెక్టర్‌తో ఇలాగే ఇదే వినయంతో ఉన్న వీళ్ళు కొత్త కలెక్టర్‌ని అదే భావంతో చూడ్డానికి పెద్దగా మానసిక సంసిద్ధత అవసరం లేదన్నమాట. రొటీన్ ఉద్యోగం.. రొటీన్.

ఆమెను చూడగానే డ్రైవర్ మరెంతో వినయంగా కారు డోర్ తీసి పట్టుకున్నాడు.

అర్చన ఠీవిగా కారెక్కింది.

డ్రైవర్ పక్కన ఫ్యూన్ కూడా కూర్చున్నాడు. కారు కదిలింది.

రాజు వెడలె రవితేజములలరగ. కుడి ఎడమల డాల్‌కత్తులు మెరవగ.

నవ్వుకుంది అర్చన.

విశాఖపట్నం రోడ్లమీద ఆశ్రయం కోసం అన్వేషిస్తూ తిరిగిన అర్చన, మహారాణిలా ఏ.సి కారులో దర్జాగా ఒక పెద్ద బంగళాకి తనదైన బంగళాకి బయలుదేరింది.

●●●

వేణు చాలాకాలం తరవాత ఇంట్లో ప్రశాంతంగా కూర్చుని పేపర్ చదువుకుంటున్నాడు.

తాయారమ్మ పనిమనిషి సహాయంతో వంట చేస్తోంది.

తల్లి చేతుల్లోంచి కాఫీ కప్పు అందుకుని, "కూర్చోమ్మా" అంటూ తన పక్కన సోఫాలో కూర్చోమన్నటు కొంచెం జరిగాడు.

ఆవిడ కొడుకు పక్కన కూర్చుని అతను చదివేసి పక్కన చిందర వందరగా పడేసిన కొన్ని న్యూస్ పేపర్‌లోని భాగాలు సరిగా పెడుతూ "నీలవేణి ఎలా ఉందో ఓసారి ఫోన్ చేయకపోయావా? " అంది.

"చేశానమ్మా వాళ్ళు సంతోషంగా ఉన్నారు. ఆ అబ్బాయి బాగా చూసుకుంటున్నాడు. ఆ అమ్మాయి అదృష్టవంతురాలు" అన్నాడు.

"పోనీలే మనం ఆ అమ్మాయిని చేరదీసి, ఇంతకాలం ఉంచుకున్నందుకు మంచి సంబంధం చేశామన్న తృప్తి దక్కింది. " నిట్టూర్చింది ఆవిడ.

"నీ ఆరోగ్యం పూర్తిగా బాగుందామ్మా? నీకేం ప్రాబ్లం లేదుకదా! "

"ఏం లేదురా కానీ ఎంతైనా వచ్చే వయసే కానీ, పోయే వయసు కాదుగా? ఏ క్షణాన ఏం జరుగుతుందో చెప్పలేం."

"అలా అనకమ్మా నాకు భయం వేస్తుంది.. " కలవరంగా అన్నాడు వేణు.

"భయం దేనికిరా.. ప్రకృతి సహజం కదా నాయనా.. అన్నిటికీ మానసికంగా సంసిద్ధంగా ఉండాలి. " ఆప్యాయంగా కొడుకు చేయి చేతిలోకి తీసుకుని నిమిరింది.

"వేణూ.. నీ మీద కాస్త శ్రద్ధ పెట్టరా! మంచి అమ్మాయి లభిస్తే పెళ్ళిచేసుకో నాన్నా. నాకు రిత్విక్‌ని చూస్తుంటే భయంగా, దిగులుగా అనిపిస్తోంది. వాడికి తల్లికావాలిరా!" అంది ఆవేదన మిళితం చేసిన స్వరంతో.

వేణు నిట్టూర్చాడు. "చేసుకుంటానమ్మా. తప్పకుండా చేసుకుంటాను. కానీ నా బాధ ఒక్కటే ఈ కాలం ఆడపిల్లలు బాగా చదువుకున్నవాళ్ళు, స్వతంత్రభావాలున్నవాళ్ళు. ఏవేవో కోరికలున్నవాళ్ళు. మా బ్యాంక్‌లో బాచిలర్స్ కొందరున్నారు. వాళ్ళకి ముప్పై అయిదు, నలభై దాకా వయసుంది. ఇంతవరకూ పెళ్ళికాలేదు. ప్రతి అమ్మాయి ఇంజినీరు, డాక్టరు కావాలంటున్నారు. గవర్నమెంట్ ఆఫీసర్ సంబంధం అంటే గొప్పగా భావించే రోజులు పోయాయి. అందరికీ ఎన్.ఆర్.ఐలు కావాలి. "

"అంటే? " ఆశ్చర్యంగా చూసిందావిడ.

అంటే అమెరికాలో డాలర్లు సంపాదిస్తూ, అక్కడ ఇల్లూ, వాకిలీ ఏర్పరచుకున్న వాడు కావాలి.

అలాగా అదేం దిక్కుమాలిన కోరికలు, హాయిగా మనదేశంలో దర్జాగా బతక్క.

"లేదమ్మా ఆ రోజులు పోయాయి. అందరికీ అమెరికానే కావాలి. పైగా వయసు కూడా వాళ్ళకన్నా ఏడాది మాత్రమే ఎక్కువుండాలిట. మూడేళ్ళు ఎక్కువ ఉంటే వాడిని అంకుల్ అనేస్తున్నారు. "

"తప్పు. అంత చిన్నవాడిని చేసుకుంటే అమ్మాయిలు పురుళ్ళు, పుణ్యాలతో తొందరగా వయసెక్కువైనట్టు కనిపిస్తారు. మగాళ్ళు చిన్నపిల్లల్లా ఉంటారు. అందుకే కనీసం అయిదారేళ్ళన్నా పెద్దవాడు అయిఉండాలి. అయినా భర్త అనేవాడు తనకన్నా పెద్దవాడైతేనే భార్యని అర్థం చేసుకుని అపురూపంగా చూసుకుంటాడు. "

"అవన్నీ మీ ఆలోచనలు. కాలం మారిపోయింది కదమ్మా"

"అయితే నీ పెళ్ళి సంగతేంటిరా?" దిగులుగా అడిగింది.

"అవుతుందిలేమ్మా నవ్వాడు వేణు. నాకిప్పుడు ముప్పై రెండేగా. మాధవి యుద్ధప్రాతిపదికన సంబంధాలు చూస్తోందిలే. " అన్నాడు.

"ఏమోరా. నీ పెళ్ళి త్వరగా అయితే ఏడుకొండలవాడి దర్శనానికి వస్తానని మొక్కుకున్నాను. ఓసారి తిరుపతి వెళ్ళి కల్యాణం చేయిస్తే బాగుండు నీ పెళ్ళి అవుతుందేమో!? " అంది ఆవిడ.

"ఆయనకి కల్యాణం చేయించాలన్నా నా పక్కన ఒక భార్య ఉండాలి కదమ్మా. రాములవారిలా బంగారు భార్యని పెట్టుకోలేనుగా" అన్నాడు వేణు సరదాగా.

ఆవిడ బాధగా నిట్టూర్చి అంది. " ఓ తుఫానులా వచ్చి, కల్లోలం చేసి వెళ్ళింది ఆ అమ్మాయి. తను మాత్రం కలెక్టర్ అయిందటగా!? " కోపంగా అంది అర్చనని ఉద్దేశించి.

వేణు మొహంలో నవ్వు ఎగిరిపోయింది.

"అవునమ్మా. అనుకున్నది సాధించింది" అన్నాడు తిరిగి న్యూస్ పేపర్ చేతిలోకి తీసుకుని.

"ఏం లాభం? కలెక్టర్ అయినా, మహారాణి అయినా భర్త అనేవాడు, పిల్లలు లేనప్పుడు ఆ జీవితానికి విలువేముంది? "

"అట్లా అనకమ్మా కలెక్టర్ హోదా ఎంత గొప్పది. మనలాంటి వాళ్ళం ఆమెతో ఐదు నిమిషాలు మాట్లాడడానికి గంటలు, గంటలు అపాయింట్‌మెంట్ కోసం ఎదురు చూడాలి. అంతగా వెళ్ళినా వాళ్ళకి మనతో మాట్లాడే టైం కూడా ఉండదు. ఎన్ని పనులు? ఎంత గౌరవం. అడుగులకి మడుగులొత్తేవాళ్ళు ఎందరో. ఆ జీవితం వేరులేమ్మా. మొగుడికి వండిపెడుతూ, పిల్లల్ని కని, పెంచి పెద్దచేసి, వాళ్ళు, భర్త పెట్టే చిత్రహింసలు భరిస్తూ, చివరికి అనారోగ్యంతో మరణించే సాధారణ స్త్రీల జీవితం చాలా దయనీయం. అలాంటి స్థితినుంచి అమ్మాయిలు ఇంతగా ఎదగడాన్ని మనం హర్షించాలమ్మా. "

"ఆ అమ్మాయి మరెవరో అయితే తప్పకుండా హర్షించేదాన్నిరా. కానీ, ఆ అమ్మాయి వలన ఒక కుటుంబం చిందర, వందర అయింది. తనని క్షమించే ఔదార్యం నీకున్నా నాకు లేదు. " అంటూ ఆవిడ వేణు ఖాళీ చేసిన కాఫీగ్లాసు తీసుకుని అక్కడినుంచి వెళ్ళిపోయింది.

వేణు ఆవిడ వెళ్ళినవైపు నిర్విణ్ణుడై చూస్తూ, కొన్ని క్షణాల తరవాత పేపర్‌లోకి దృష్టిమళ్ళించాడు.

అకస్మాత్తుగా అతని దృష్టి నిర్యాణం అని ఉన్న ఫోటో వైపు మళ్ళింది.

"అరె వీళ్ళు పోయారా?" షాక్ తగిలినట్టు అయాడు.

పాపం సావిత్రమ్మగారు పోయారు.

అర్చన తల్లి లేటెస్ట్ ఫోటో. మొహాన బొట్టులేదు. అంటే ఆయన కూడా పోయారన్నమాట.

"అర్చనకి తెలుసా.? "

ఆమెని ఎంతో గారాబంగా చూసుకున్న తల్లి, తండ్రి.

ఇప్పుడు అర్చన పూర్తిగా అనాధ.

అమ్మ అన్నట్టు కలెక్టర్ అయినా భర్త అవసరం లేకపోవచ్చుకానీ, అర్చనకి తల్లి, తండ్రి కావాలి కదా. ఎవరికైనా అమ్మా, నాన్నా కావాల్సిందే ప్రెసిడెంట్ ఆఫ్ అమెరికా అయినా అమ్మా, నాన్న అమ్మా, నాన్నే.

వేణుకి అర్చనని తల్చుకుంటే జాలేసింది.

ఇంక తను అనాథ అని తెలుసా ఆమెకి.

ఎందుకు తెలియకుండా ఉంటుంది? న్యూస్ పేపర్ చదువుతుందికదా. వాళ్ళన్నయ్య సమాచారం పంపించి ఉంటాడు కదా. చివరిచూపులకి వెళ్ళి ఉండచ్చు.

పాపం వాళ్ళెంత మానసిక వేదన అనుభవించారో.

వేణుకెందుకో వాళ్ళ మీద మమకారం కలిగింది.

తను ఆ ఇంటి అల్లుడు, తనేం చేయలేకపోయాడు.

కొడుకు చివరి రోజుల్లో ఎలా చూసుకుని ఉంటాడో బాగా చూసుకున్నాడో లేదో. అసలే అహంభావి, మూర్ఖుడు.

వేణు మనసంతా బాధగా అయిపోయింది.

సోఫాలోంచి లేచి టి.వి స్టాండ్ మీద పెట్టిన సెల్ తీసుకున్నాడు.

మాధవి నెంబర్‌కి కలిపాడు.

మాధవి లైన్ లోకి వచ్చింది.

"మాధవి! " పిలిచాడు.

"గుడ్ మార్నింగ్ వేణూ.. ఏంటి ఉదయాన్నే ఫోన్ చేశావు? "

"గుడ్ మార్నింగ్ మాధవీ. ఒక విధంగా బాడ్ మార్నింగ్ కూడా."

"ఏంటి ఏమైంది? " ఖంగారుగా అడిగింది.

"ఏంలేదు. ఒక బ్యాడ్ న్యూస్. పేపర్ చూశావా? ఇవాళ."

"లేదే. అప్పుడేనా? ఇప్పుడే చక్రవర్తి, కౌశిక్ బైటకి వెళ్ళారు. ఏనీ ఇంపార్టెంట్ న్యూస్.?"

"అర్చన వాళ్ళ మదర్ పోయారు. "

"అవునా! అరే.. పేపర్లో వచ్చిందా? "

"ఊ.. నాకెందుకో అర్చనని చూడాలని ఉంది మాధవీ. పాపం తనకి ఎవరున్నారు ఇప్పుడు.!? "

మాధవి చలించిపోయింది, వేణు స్వరంలో వినిపిస్తున్న వేదనకి.

"వేణూ.. " విచలితంగా పిలిచింది.

"అవును మాధవీ! ఒక్కసారి ఫోన్ చేసి ఎలా ఉందో తెలుసుకోవా ప్లీజ్."

"వేణూ! " మాధవి అభిమానం నిండిన స్వరంతో పిలిచింది. "నీదెంత సున్నితమైన మనసు వేణూ. నీకేం కానీ అర్చన గురించి నీకెందుకింత కన్సర్న్? "

"ఏం కాకపోవడం ఏంటి మాధవీ. ఆమె నా భార్య ఇంకా నా భార్యకిందనే కన్సిడర్ చేస్తుందికదా. "

మాధవి మనసులో గునపం దిగినట్లయింది. వేణు ఎంత ఆశాజీవి. అర్చన విడాకులకి అభ్యంతరం లేదని లెటర్ పంపించిన విషయం వేణుకి చెప్పడం మర్చిపోయింది తను. తప్పు తనదే చెప్పెయ్యాలి. ఇంక అర్చన అతనికేం కాదని చెప్పేయాలి.

నెమ్మదిగా బరువుగా అంది. "అర్చన విడాకులకి అభ్యంతరం లేదని లెటర్ పంపింది వేణూ.. ఇంక అర్చన మనకేం కాదు. "

వేణు ఒక్కసారి తుళ్ళిపడ్డాడు. "పంపించిందా? ఎప్పుడు? "

"నీలవేణి పెళ్ళికిముందే నీకు చెప్పడం మర్చిపోయాను. నీ పెళ్ళికి గ్రీన్ సిగ్నల్ వచ్చిందని సంతోషించాను. "

వేణు చేతిలో రిసీవర్ జారిపోయింది.

అవతలనుంచి మాధవి "హలో, హలో వేణూ.. " అంటుంటే గాల్లో వినిపిస్తున్న ఆమె స్వరం కఠోరంగా వినిపిస్తోంటే గట్టిగా చెవులు మూసుకున్నాడు.

నిస్తేజంగా అక్కడే ఉన్న కుర్చీలో వాలిపోయాడు.

అర్చన ఇంక నాకేం కాదా?

వేణుకి ఒక్కసారిగా దుఃఖం పొగుకొచ్చింది. ఇంతకాలం అస్పష్టంగా ఉన్న విషయం ఇప్పుడు స్పష్టంగా తేటతెల్లంగా కనిపిస్తుంటే ఆ వాస్తవాన్ని జీర్ణించుకోడానికి అతనికి ధైర్యం సరిపోనట్టు, అంతో, ఇంతో మిగిలిన ఆశ సమూలంగా కొట్టుకుపోయినట్టు అనిపించి సర్వావయవాలు చచ్చుపడినట్టు అనిపించింది.

అలాగే శూన్యంలోకి చూస్తూ కూలబడిపోయాడు.

●●●

అర్చన ఆరోజు ఉదయం ఆఫీసుకి రాగానే ఆమెకోసం ఎదురు చూస్తూ కూర్చుని ఉంది ఒక వృద్ధురాలు.

కారు దిగి వెనకాల ప్యూన్ అనుసరిస్తుంటే ఠీవిగా తన ఛాంబర్‌లోకి వెళ్ళిపోయిన అర్చన ఆమెని గమనించలేదు.

తన సీటులో కూర్చుని రిలాక్స్ అవుతుండగా ప్యూన్ వెనకాలే టిఫిన్ క్యారియర్, వాటర్ బాటిల్ తీసుకొచ్చి యాంటీ రూములో పెట్టాడు. తళతళలాడే గ్లాసులో మంచినీళ్ళు తెచ్చి టేబుల్ మీద పెట్టాడు. అప్పటికే ఏసి ఆన్‌లో ఉందేమో గదంతా చల్లగా, మంచి పరిమళంతో నిండి ఉంది.

ప్యూన్ బైటికి వెళ్ళిపోయాడు. పి.ఏ లోపలికి వచ్చి "గుడ్ మార్నింగ్ మేడమ్!" అంది.

"గుడ్‌మార్నింగ్. ఏదన్నా ఇంపార్టెంట్ మాటర్ ఉందా? ఇవాళ ఎంగేజ్ మెంట్స్ ఏంటి? " అడిగింది అర్చన.

"ఈవినింగ్ ఆర్.డి.వోలతో మీటింగ్ ఉంది. మూడు గంటలకి సి.ఎం.గారితో వీడియో కాన్ఫరెన్స్ ఉంది. "

"ఓకే. నెక్స్ట్. "

"మీకోసం ఒక ఓల్డ్ లేడీ వచ్చి చాలా సేపట్నించీ వెయిట్ చేస్తున్నారు. "

"ఎవరు? "

"తెలియదండి."

"ఇప్పుడు టైం పదిన్నర. ఆఫీసు పదిన్నరకి తీస్తారు కదా. అంత త్వరగా ఎందుకొచ్చినట్టు ఆవిడ. అంటే విజిటర్స్ టైమింగ్స్ ప్రకారం అటెండ్ అవాలా?" సీరియస్‌గా అడిగింది అర్చన.

"అదికాదు మేడమ్. నేను చెప్పాను. ఆమె ఫర్వాలేదు మేడమ్ ఎప్పుడొచ్చినా పర్లేదు వెయిట్ చేస్తాను" అని కూర్చుంది.

అర్చన కనుబొమలు ముడిపడ్డాయి. "ఎవరు ఆమె? " అడిగింది.

"మీ ఫ్రెండ్‌నని చెప్పారు. "

"నా ఫ్రెండా?" అర్చన అర్ధంకానట్టు చూసి, "పంపించండి లోపలికి" అంది.

"అలాగే" అంటూ పి.ఏ బైటకి వెళ్ళిపోయింది.

తనకి ఫ్రెండ్స్ ఎవరున్నారబ్బా? అర్చన కనుబొమలు ముడిపడ్డాయి. ఆలోచిస్తూ లోపలికి రాబోయే ఆ స్త్రీ కోసం ఎదురుచూస్తూ కూర్చుంది.

●●●

**"నమస్కారం మేడమ్" అంటూ** లోపలికి వచ్చిన వృద్ధురాలిని చూడగానే అర్చన ఉలిక్కిపడింది. ఈమె.. ఈమె. !!

"న..ళి..నీ.." చివ్వున కుర్చీలోంచి లేచింది.

మెతోపాటే లోపలికి వచ్చిన పి.ఏ వాళ్ళిద్దరినీ చూసి కలెక్టర్‌గారికి కావలసినవాళ్ళు అనుకుంటూ వెంటనే బైటకి వెళ్ళిపోయింది.

అర్చన తన పెద్ద టేబుల్ చుట్టూ తిరిగి నళిని దగ్గరగా వచ్చి మె వైపే చూడసాగింది.

నళిని కూడా చిరునవ్వుతో మె వైపే చూస్తుండగా అప్రయత్నంగా అర్చన కళ్ళల్లో గిర్రున నీళ్ళు తిరిగాయి. చటుక్కున నళినిని కౌగలించుకుంది.

ఎంతోకాలానికి కలిసిన ప్రాణస్నేహితురాళ్ళిద్దరూ కొద్దిసేపు సర్వం మరచిపోయి హృదయాలను హత్తుకుని తమ భావాలను పరస్పరం నివేదించుకుంటున్నట్టు అలా ఉండిపోయారు.

అర్చన తేరుకుని మెని వదిలి, చేయి పట్టుకుని తన విశ్రాంతి గదివైపు తీసుకుని వెళ్ళింది.

సోఫాలో కూర్చోబెట్టి తనూ మె పక్కనే కూర్చుని "ఎంతకాలమైంది నళినీ. నేను ఇక్కడికి వచ్చేముందు నీ ఫోన్ నెంబర్ కోసం చాలా వెతికాను. కనిపించలేదు. ఎంత బాధపడ్డానో తెలుసా. నిజంగా అయామ్ లక్కీ నువ్వేరావడం, మనం కలుసుకోడం నేనసలు ఊహించలేదు."

"నేనంటే అనామకురాలిని. నా ఫోన్ చిరునామా లేకపోతే కలవడం అసాధ్యం కానీ నువ్వలా కాదుగా. న్యూస్ పేపర్‌లో నువ్వు చార్జ్ తీసుకున్నావన్న వార్త, నీ ఫోటో చూడగానే అనుకున్నాను. వెంటనే రావాలని..కానీ, కొంచెం రోగ్యం బాగోలేక రాలేకపోయాను."

అర్చన మె వైపు తేరిపార చూసింది. "అవునేంటి నళినీ ఇలా అయిపోయావేంటి?"

నళిని నవ్వింది. మె నవ్వులో కాంతిలేదు. మొహం కూడా జీవం లేనట్టుగా ఉంది. జుట్టు నలుపు, తెలుపు మిశ్రమంతో నిర్జీవంగా ఉంది. నేత చీరకట్టుకుని, బలవంతంగా వృద్ధాప్యం మోస్తున్నదానిలా ఉంది.

"వయసు పెరుగుతోందిగా అర్చనా" అంది పేలవంగా నవ్వుతూ.

"ఏమంత వయసుందని నీకు. యాభైకి చేరావా? నీ వయసులో ఇంకా గ్లామరస్‌గా ఉండాలని తపించేవాళ్ళు ఎంతమందున్నారో తెలుసా.

"అది వాళ్ళ అదృష్టం వదిలెయ్. ఏంటి ఎలా ఉన్నావు? అన్నట్టు మర్చిపోయాను. ఒక్క నిమిషం.." అంటూ భుజాన వేలాడుతున్న హాండ్ బ్యాగ్ తీసి అందులోంచి చిన్న పెట్టె తీసిస్తూ అంది "కంగ్రాచ్యులేషన్స్.. అనుకున్నది సాధించావు."

"థాంక్యూ.. థాంక్స్ ఎలాట్.. ఏంటిది?" అంటూ అట్టపెట్టెకున్న గిఫ్ట్ రేపర్ తీసి, పెట్టిలోంచి వెండి సరస్వతీదేవి బొమ్మ తీసింది. "వావ్ బ్యూటిఫుల్ థాంక్యూ" అంటూ అక్కడే ఉన్న టీపాయ్ మీద పెట్టింది బొమ్మ.

"సరస్వతి పుత్రికవు కదా అందుకే ఇది తెచ్చాను" అంది నళిని.

అర్చన నవ్వింది. నవ్వులో ఎంతో నందం, తృప్తి గమనించింది నళిని.

"ఏంటి సంగతులు నళినీ?" అడిగింది అర్చన.

"చెప్పు అర్చనా. నీ సంగతులేంటి? ఎలా ఉంది నీ ఉద్యోగం, నీ అనుభవాలేంటి?"

"ఓ చాలా ఉన్నాయి. అవన్నీ వదిలెయ్. ఇంతకీ విద వర్ధనమ్మగారు ఎలా ఉన్నారు? నేనోసారి విద్నీ కలవాలనుకుంటున్నాను."

"విడపోయారు అర్చనా. హార్ట్ ఎటాక్."

"వాట్." అర్చన కీచుగా అరిచింది. "పోయారా? ఎప్పుడు?"

"రెండేళ్ళయింది. అవునూ నీకు తెలుసా?"

"ఏంటి?"

నళిని మె మొహంలోకి అనుమానంగా చూసింది. ఈమెకి తన తల్లిపోయినట్టు తెలుసా. పేపర్ రోజూ చూస్తుంటుంది కదా. తెలియకుండా ఉంటుందా? చెప్పాలా వద్దా,

"ఏంటి నళినీ అలా చూస్తున్నావు?" అభిమానంగా అడిగింది అర్చన.

"అర్చనా మరి.. మరి మీ అమ్మగారు పోయారు తెలుసా?"

అర్చన కళ్ళల్లో గ్రురున నీళ్ళు తిరిగాయి. తలాడిస్తూ అంది "తెలుసు. మా వదిన నాకు ఇదే ఫీస్కి లెటర్ రాసింది. నేను జాయిన్ అయిన రెండో రోజే వచ్చిందా లెటర్ .."

"విడకి నువ్వెలా తెలుసు? ఐ మీన్ ఈ అర్చన తన డబిడ్డ అనీ" చిత్రంగా చూసింది నళిని.

"ఇంట్లో ఫ్యామిలీ ఫోటో ఉంది కదా. అందులో చూసిందట. చాలా పెద్ద ఉత్తరం రాసింది. మా అన్నయ్య తాగుడికి బాగా అలవాటు పడ్డాట్ట. శాడిస్టుట. మా వదిన్ని చిత్రహింసలు పెడుతున్నాట్ట. అమ్మని కూడా నాన్న పోయాక చాలా బాధలు పెట్టాట్ట. అమ్మ చాలాసార్లు నా దగ్గరకి తీసుకెళ్ళమని అడిగేదట. కానీ దానిపేరు ఎత్తిన వాళ్ళని మర్డర్ చేసి జైలుకి వెళ్తాను అని బెదిరిస్తుండేవాడుట. వాళ్ళకి ఇద్దరు పిల్లలుట. చివరలో పాపం..." అలా అంటూండగానే అర్చన స్వరం దుఃఖంతో గిపోయింది. సన్నగా ఏడుస్తూ ఉండిపోయింది కొన్ని క్షణాలు.

నళినిక్కూడా దుఃఖం వచ్చింది. అర్చన భుజం మీద చేయేసి ఓదార్పుగా నిమురుతూ ఉండిపోయింది కొన్ని క్షణాలు.

"బాధపడకు అర్చనా ఏంటో, మీ అన్నయ్య నీ మీద అకారణంగా అంత ద్వేషం ఎందుకు పెంచుకున్నాడో!?"

"ద్వేషం కన్నా అసూయ ఎక్కువ నళినీ. అసూయ ద్వేషంగా మారింది. కాకపోతే మా ఒదినకి, పిల్లలకి నేనే ఏదన్నా సాయం చేయాలి. లేకపోతే పిల్లల భవిష్యత్తు పాడైపోతుంది."

"అంటే ఏం చేస్తావు?"

"చూస్తాను. తను లెటర్లో అడ్రస్ ఇచ్చింది. వాళ్ళు పిఠాపురంలో ఉంటున్నారు. ఎలాగొలా ఒదిన్ని, పిల్లలనీ నా దగ్గరకు తీసుకు వచ్చేస్తాను. విడ కూడా అదే కోరింది."

"మంచి నిర్ణయం అర్చనా" మనస్ఫూర్తిగా అభినందించింది నళిని.

"నా వాళ్ళేగా నళినీ. వాళ్ళు నన్నుకాదనుకున్నారేగానీ, నేనెప్పుడూ వాళ్ళని కాదనలేదు. ఇంత సంపాదిస్తున్నాను. ఇద్దరు పిల్లల్ని చదివించి వాళ్ళకి జీవితం ఇవ్వలేనా? నాకు మాత్రం ఎవరున్నారు చెప్పు?"

"అంటే నువ్వింక జీవితాంతం ఇలాగే ఉంటావా?"

"మరెలా ఉంటాను?"

"ఇంక వేణు దగ్గరకి వెళ్ళవా?"

అర్చన మొహంలో భావాలు మారిపోయాయి. కొంచెం గంభీరంగా అంది. "ఈ మధ్యే విడాకులకి నాకు అంగీకారం అని లెటర్ పంపించాను. "

"వాట్?" అదిరి పడి చూసింది నళిని. "లెటర్ పంపించావా? "

"అంత శ్చర్యపోతావేం నళినీ. మేము ల్రెడి విడిపోయేకదా ఉన్నాం. చట్టప్రకారం విడిపోతున్నాం అంతే.."

"పొరపాటు చేశావు అర్చనా. చాలా పొరపాటు చేశావు"

"పొరపాటా?" శ్చర్యంగా చూసింది అర్చన. "ఇందులో పొరపాటేం ఉంది?నా స్నేహితురాలు మాధవి చెప్పింది. నేను లీగల్‌గా విడాకులిస్తేగానీ, అతను వేరే పెళ్ళి చేసుకోలేడు అని. నిజమే కదా. నేను ఒద్దు అనుకున్నప్పుడు అతడి సుఖానికి నేనెందుకు టంకం కావాలి?"

నళిని స్వరంలో సడన్‌గా సీరియస్‌నెస్ వచ్చింది. "ఏనాటికైనా అతడిని కలుస్తావనుకున్నాను అర్చనా! చాలా పొరపాటు చేశావు. అంత నిజాయితీగా నిన్ను ప్రేమించేవాడు నీకు దొరుకుతాడా చెప్పు"

"అదేంటి నళినీ. మళ్ళీ మొదటికి వస్తావేం నేనింక అతడిని కలవడం అసంభవం అని చెప్పాకదా."

" రోజులు వేరు. అప్పుడు నువ్వు వేశంలో ఉన్నావు. చిన్నదానివి. ఇప్పుడు అన్ని రకాలుగా చాలా ఎదిగావు. ఇంకా అదే నిర్ణయంతో ఉన్నావని ఎలా అనుకుంటాను?"

"నిర్ణయాలు క్షణం, క్షణం మారతాయా నళినీ."

"కొన్ని నిర్ణయాలకు మార్పు అనివార్యం"

"ఎంచేత?"

"జీవితానికి సంబంధించినవి కాబట్టి"

"అంటే వేణు తప్ప ఇంకెవరూ నాకు భర్తగా రారా?"

"వస్తారు? కానీ, వాళ్ళు వేణు కారు"

"ఏంటతని గొప్పతనం?"

"ఏంటి అతని నేరం?"

"అతను స్వార్థపరుడు, నన్ను సాధించడమే తన శయంగా పెట్టుకుని, నా కిష్టంలేకపోయినా నా బలహీన పరిస్థితులను అడ్డం పెట్టుకుని బలవంతంగా పెళ్ళిచేసుకున్నాడు. అంతే బలవంతంగా నన్ను అనుభవించాడు."

మాటలు విన్న నళిని నిదానంగా అంది. "నువ్వింకా ఎదగాలి అర్చనా. యస్.. యూ హావ్ టు."

"ఎలా? "

"చెప్తాను.. "

అప్పుడే ఫోన్ మోగింది. అర్చన ఫోన్ అందుకుంది. యస్. అంది.

అవతలి నుంచి పి.ఏ ఏదో చెప్పింది. "పావుగంటాగి కాల్ చేయమనండి" అంటూ ఫోన్ డిస్కనెక్ట్ చేసి నళిని వైపు చూసింది.

నళిని అర్చనను నింపాదిగా చూస్తూ అడిగింది.

"నీలో ఏ లోపంలేదని నువ్వు చెప్పగలవా? వేణు నిన్నేదో బలత్కారం చేశాడని అనుకుంటున్నావు. ఏడాదిపాటు ప్రేమించిన అమ్మాయి, భార్య స్థానంలో తనకు అతి సమీపంగా తిరుగుతుంటే ముట్టుకోకుండా ఉండగల శక్తి ఏ మగాడి కుంటుంది. మగవాడి సంగతి వదిలెయ్. ఒక అమ్మాయి తనంటే ఇష్టంలేని వ్యక్తిని తనకిష్టమై పెళ్ళి చేసుకుని వ్యక్తి తనకి దూరంగా ఉంటుంటే ఎంత నరకం అనుభవిస్తుంది. ఒక్కసారి లోచించు."

"అర్చనా ఈ కుర్చీలోంచి లేచి అలా గేటు బైటకి వచ్చాక నువ్వు కూడా ఒక మామూలు స్త్రీవి. అందరిలాగే నీకూ కొన్ని అనుభూతులు, కోరికలు, వాత్సల్యాలు, బలహీనతలు ఉంటాయి.. వాటిని జయించి బతుకుతున్నాం అని ఎవరైనా అనుకుంటే అది ఒక భ్రమ. అలా బతికేవాళ్ళు హిమాలయాల్లో ఉంటారు. మనం సమాజంలో ఉన్నాం కదా."

"నువ్వేం చెప్పాలనుకుంటున్నావో నా కర్థంకావడంలేదు" నళిని మొహంలోకి గుచ్చిచూస్తూ అంది అర్చన.

నళిని పేలవంగా నవ్వింది.

"అర్చనా నీలో కలెక్టర్ కుండాల్సిన హుందాతనం, గాంభీర్యం బాగా వచ్చాయి. నిన్ను, నీ మొహంలోని భావాలను ఇప్పుడు చూస్తుంటే నాకు ఇంకో సందర్భం అయితే భయం వేసేది."

అర్చన  మాటలకి కలవరంగా నవ్వుతూ అంది" సారీ నేను కలెక్టర్గా మాట్లాడటంలేదు. నీ ఫ్రెండ్గానే మాట్లాడుతున్నాను."

నళిని బలవంతంగా నవ్వి, కాస్సేపు అర్చన కుర్చీ వెనకాల గోడకి నించబడిన గాంధీ మహాత్ముడి ఫోటో వైపు చూస్తూ ఉండిపోయింది. తరవాత మెల్లిగా అంది. "మన నాయకులు, అధికారులు గాంధీ తత్వాన్ని గౌరవించడం మానేసి హింసాత్మక సమాజాన్ని ఇచ్చారు. అలాగే ధర్మం, న్యాయం నీతి అనేవి జల్లెడ పట్టి వెతికినా కనిపించని మనుషులన్న సమాజం ఇది. కానీ, గాంధీ ఫోటోని, ధర్మచక్రాన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఇంకా తీసేయలేదు. ఎంత త్మవంచన కదా"

అర్చన మె మాటలకి వింతగా తలతిప్పింది. మెతో పాటు రివాల్వింగ్ చైర్ గిర్రున తిరిగింది. గాంధీ ఫోటో చూసింది. తనెప్పుడూ గమనించలేదు. పెద్ద ఫోటో. మె అప్పుడే తన ఛాంబర్ని మొదటిసారిగా పరికిస్తున్నట్టుగా చూసింది. విశాలమైన టేబుల్ మీద ఓ పక్క చిన్న జాతీయ పతాకం మరోపక్క మూడు సింహాల బొమ్మ. ప్రభుత్వాధికారి ఛాంబర్లో ఉండాల్సిన హంగులన్నీ ఉన్నాయి.

ఇవన్నీ దేనికి? నీతికీ, న్యాయానికీ ధర్మానికీ కట్టుబడి ఉండమని చెప్పడం కోసం కదా. నిజానికి నళిని అన్నట్టు ఎవరు కటుబడి ఉంటున్నారు? లంచం తీసుకోని అధికారులున్నారా? ధర్మంగా పాలించే నాయకులున్నారా? అహింసాయుత సమాజం కోసం కృషిచేస్తున్న వాళ్ళు ఎవరున్నారు?

నళిని స్వరం వినిపించింది. "నేనిక్కడ ఇంతసేపు కూర్చుని నీ సమయం పాడుచేస్తున్నానేమో. నిన్ను డిస్టర్బ్ చేస్తున్నానేమో? నేనింక వెళ్తాను అర్చనా."

"నో, నో అదేం లేదు. పనులుంటే తరవాత చేసుకుంటాను. ఎంతో కాలానికి కలిసిన ప్రాణ స్నేహితురాలివి నీతో కాస్సేపు గడపడం వలన కొంపలంటుకు పోయిందేం లేదు నళినీ. ఇంతకీ నువ్వేదో చెబుతూ పేసావు. చెప్పు ఏం చెప్పాలనుకున్నావు?"

నళిని తలాడిస్తూ అంది. "ఏం లేదులే అర్చనా. నీకు తెలియదా ఏంటి మరీ చిన్నపిల్లను చేసి మాట్లాడుతున్నాను అనిపించింది."

అర్చన కొంచెం ముందుకు వంగి నళిని చేయి తన చేతిలోకి తీసుకుని అంది. "మాట్లాడు చెప్పు. నేనేం అనుకోను. లోచించే విషయం ఉంటే లోచిస్తా. లేదంటే మర్చిపోతా."

నళిని అర్చన కళ్ళల్లోకి చూసింది. మె కళ్ళల్లో నిజాయితీ కనిపిస్తోంది. అంతులేని విశ్వాసం కనిపిస్తోంది.

చెప్పు నళినీ అంది.

చెప్పడానికేం ఉంది అర్చనా. నిట్టూరుస్తూ అంది నళిని.

"అర్చనా శలు, శయాలు ఉండడం వేరు అవి తీర్చుకునే అవకాశం ఉన్నవాళ్ళు తీర్చుకుంటారు. లేనివాళ్ళు తీర్చుకోరు. రాజీపడతారు. అలాగే బలహీనతలు అందరికీ ఉంటాయి. వాటిని కొందరు జయిస్తారు. కొందరు ఓడిపోతారు. ఓడిపోయాక పశ్చాత్తాపపడతారు."

"వేణు పశ్చాత్తాపపడలేదంటావా? అతనిలో కలిగిన మానసిక పరిణితిని నువ్వు గమనించేందుకు ప్రయత్నించావా? నీ అహం దెబ్బతింది. దూరంగా వచ్చేశావు. వచ్చేశావు కాబట్టి, అదృష్టం కలిసి వచ్చింది కాబట్టి నువ్వనుకున్నది సాధించావు. ఉజ్వలమైన స్థితిని చేరుకున్నావు. కానీ,"

అర్చన తలెత్తి చూసింది.

"నీకు తెలుసా నువ్వు చేరుకోవాల్సిన గమ్యం చేరుకోలేదు."

భృకుటి ముడివేసి అర్ధవంతంగా చూసింది అర్చన అంటే ..?

"అంటేనా భర్తతో సంసారం చేస్తూ, పిల్లా, పాపలతో బతికే స్త్రీకి, నీలా ఏదో సాధించేశానని పెళ్ళి ఒద్దనుకుని ఒంటరిగా బతికే స్త్రీకి చాలా తేడా ఉంటుంది. నువ్వు ఎంత అందగత్తెవైనా అనుభవించాల్సిన జీవితం అనుభవించకపోతే నీ అందం వాడిపోయిన పూవులా ఉంటుంది. తెలుసా"

"నీ ఉద్దేశం?"

"నన్ను చూడు నేను వయసులో ఉండగా నాకు వివాహం మీద సక్తి కలగలేదు. ఒకవేళ కలిగి ఉంటే అందంగా లేకపోయినా, వయసు ఇచ్చిన మెరుపు చూసైనా ఎవరో ఒకళ్ళు పెళ్ళి చేసుకునేవాళ్ళు. కానీ పెళ్ళి చేసుకోలేకపోయాను. సంసార జీవితం గడపలేకపోయాను. చూశావుగా నలభై ఐదేళ్ళకే అరవై ఏళ్ళ దానిలా అయాను."

"నువ్వు మెయిన్‌టైన్ చేయలేదు.."

"నిజానికి అర్చనా వేణు పాపం చాలా మంచివాడు. అతనిలోని బలహీనతని చూశావుగానీ, మంచితనం చూడలేదు. చూసి ఉంటే ఇంత నిర్ధయగా విడాకులిచ్చేదానివి కాదు. ఏం ఇంత చదువుకున్నావు. సాంఘికంగా, ర్ధికంగా ఎదిగావు. నీ తెలివితేటలు, నీ హోదా వేణులోని బలహీనతని క్షమించే ఔదార్యం నీకివ్వలేదా? ఇంకెందుకమ్మా నీ కీ హోదా? "

అర్చన అయోమయంగా చూసింది.

"అంటే అతడిని క్షమిస్తేనే నేనీ హోదాకి అర్హత సంపాదించినట్టా.!?"

"అలా కాదు. అతడిని క్షమించి ఉంటే నువ్వింకా ఎత్తుకు చేరేదానివి. నీ చదువులకి నీ అంతస్తుకీ నీ సంస్కారం ఒక మెరుపునిచ్చేది. "

"అవునా..! " అర్చన లోచనలో పడింది. తను వేణుని ఇంకా ద్వేషిస్తోందా? అదేం లేదే. అతడిని క్షమించడం అంటే ఏంటి? తనేం చేయాలి? వెళ్ళి నిన్ను క్షమించాను వేణూ. అని చెప్పలా? ఎందుకు చెప్పాలి? అలా చెప్పినందువలన ప్రయోజనం ఏంటి? అలా చెప్పగానే తను తిరిగి వచ్చేసిందని వేణు అనుకుంటే.

అసలు క్షమించడం అంటే ఏంటి? అతడిని ద్వేషించకపోవడం, తన పట్ల అతని దురుసు ప్రవర్తనకి అతనికి శిక్ష వేయకపోవడమే కదా. తనేం శిక్ష వేసింది. అతనికి తనేం శిక్ష వేయలేదే తనకు తనే శిక్ష వేసుకుంది. తను అతడిని వదిలేసి రావడమే శిక్షా! అవునేమో?

పాపం తన వలన వాళ్ళ కుటుంబం ఉన్న ఊళ్ళో తలెత్తుకోలేకపోయింది. వేణు జీవనమాధుర్యాన్ని కోల్పోయి ఒంటరిగా మిగిలిపోయాడు. కృష్ణస్వామిగారు చనిపోయారు. తాయారమ్మగారు అనారోగ్యంతో మంచం పట్టారు. అన్నిటికీ మించి బాబు. తన కొడుకు తల్లిలేనివాడయాడు. ఒక్కటి కాదు చాలా చాలా శిక్షలు పడ్డాయి వాళ్ళకి.

కానీ, తనకి అమ్మా, నాన్నా అన్నయ్యా దూరమయారు. కారణం తనే. వేణు కాదు. వేణుని దూరం చేసుకున్నందుకు వాళ్ళు తనని వెలేశారు. బహుశా వేణుతో బతికి ఉంటే అంతా తనని దరించేవాళ్ళేమో అంటే మనసు చంపుకుని, త్మను చంపుకుని, వ్యక్తిత్వాన్ని

చంపుకుని డపిల్లలు భర్త అనే వాడితో అన్ని విధాలుగా రాజీపడి బతికితేనే బంధువులు, మిత్రులు అనబడే ఈ సమాజం డదాన్ని - దరిస్తుందనమాట. ఎంత అన్యాయం. ఈ అన్యాయం గురించి నళిని, మాధవిలాంటి సాధారణ స్త్రీలకి విపులంగా తెలియచేయడం ఎలా?

నళిని స్వరం మళ్ళీ వినిపించింది. "నాకు తెలుసు నా మాటలు నీకు నచ్చలేదు. కానీ నే కోరేది ఏంటంటే నీ హోదా, అభిప్రాయాలు, భావాలు పక్కన పెట్టి ఒక విద్యావంతురాలైన స్త్రీగా, సంస్కారవంతురాలిగా లోచించు. చిన్న క్షమ నీ మనసుకి ఎంత తృప్తినిస్తుందో. మనం గుంపులో ఉంటాం. ఎవరో కాలు తొక్కుతారు. మనం బాధతో కెవ్వుమని అరిచి మనసులో వాళ్ళని గుడ్డివాళ్ళా కళ్ళు కనిపించడం లేదా ఇడియట్స్ అని తిట్టుకుంటాం. వాళ్ళు మనవైపు క్షమార్పణగా చూసి సారీ అండీ అంటారు. అప్పుడు ఏం అంటాం. నవ్వేసి ఊరుకుంటామా లేదా? అదే సంస్కారం. అలా కాకుండా మన మనసులో క్షణంలో కలిగిన భావాల తాలూకు భాష ఉపయోగించి తిడితే ఏం జరుగుతుంది? మాటా, మాటా పెరుగుతుంది. ఉచితానుచితాలు, సభ్యతా, సంస్కారాలు, విచక్షణా జ్ఞానం అన్నీ కోల్పోతాం. అందరూ మనల్ని వింతగా చూస్తారు. ఇంటికొచ్చి వేశం తగ్గించుకుని లోచిస్తే ఛ పొరపాటు చేశాం. అందరిలో అలా ప్రవర్తించకుండా ఉండాల్సింది అని పశ్చాత్తాప పడతామా? లేదా?"

"అది కేవలం ఒక చిన్న సంఘటన కానీ, ఒక రోజంతా మన మనసుని కలవరానికి, ఆందోళనకి గురిచేస్తుంది."

నళిని మాటలు వింటోంటే కన్నతల్లి చల్ల, చల్లగా మందలిస్తున్నట్టు, తనకి తెలియని ఎన్నో విషయాలు కమ్మగా చెబుతున్నట్టు అనిపించసాగింది అర్చనకి అలాగే మెవైపు కన్నార్పకుండా విభ్రాంతిగా చూడసాగింది.

మళ్ళీ ఫోన్ మోగింది. అర్చన విసుగ్గా ఫోన్ తీసింది.

అవతలి నుంచి పి.ఏ స్వరం "సారీ ఫర్ ద డిస్టర్బెన్స్ మేడమ్. సి.ఎస్.గారి ఫోన్."

అర్చన ఖంగారుగా "యస్, యస్ కనెక్ట్ చేయండి" అంది. మె మొహంలో, స్వరంలో స్పష్టంగా ఉన్న ఖంగారు చూసి ఇంపార్టెంట్ ఫోన్ అనుకున్న నళిని చేతి వాచీ చూసుకుంది. మాటల్లో గమనించలేదు. తనొచ్చి అరగంట దాటింది. ఒక కలెక్టర్ దగ్గర మె ఫీసులో ఇంతసేపు కూర్చోడం అంటే తను చాలా తప్పు చేసినట్టు అనిపించింది. ఎన్ని పనులుంటాయి వీళ్ళకి. ఛ అనుకుంటూ సోఫాలో పక్కనే పెట్టుకున్న హ్యాండ్ బ్యాగ్ తీసి భుజాన వేసుకుంది. అర్చన "యస్ సర్, యస్ సర్" అంటూ ఎంతో నమ్రతగా అవతలి వాళ్ళ మాటలకి స్పందిస్తోంది. మూడు నిమిషాల తరువాత ఫోన్ పెట్టేసింది.

నళిని మెల్లగా అంది "సారీ అర్చనా.. చాలాసేపు కూర్చుని నీ పనికి టంకం కలిగించాను. ఇంక వెళ్తాను."

అర్చన లేస్తూ అంది. "ఓకె నళినీ. మళ్ళీ కలుద్దాం. నీ ఫోన్ నెంబర్ పి.ఏ కి ఇచ్చి వెళ్ళు."

"అలాగే నా మాటలు నీకు బాధ కలిగిస్తే క్షమించు. కానీ, లోచించడం మాత్రం మర్చిపోకు. వేణు చాప్టర్ ముగిసింది. ఇంకెవరినైనా పెళ్ళి చేసుకుని హ్యాపీగా ఉండాలని కోరుకుంటున్నాను" అంది నళిని గది బైటకి నడుస్తూ.

అర్చన తలపంకిస్తూ నవ్వింది. అలా నవ్వడంలోనే అనుభవజ్ఞురాలైన నళినికి అర్థమైంది. ఈమె ఖచ్చితంగా లోచిస్తుంది అనుకుంది.

నళినిని పంపించాక మీటింగ్‌లతో, కలవడానికి వచ్చిన కంట్రాక్టర్లతో బిజీ అయిపోయింది అర్చన. కానీ, అస్పష్టంగా మె మెదడులో నళిని మెత్త, మెత్తగా వేసిన మాటల తూటాల చిట, చిట పేలుతున్నట్టుగా మధ్య మధ్యలో పరధ్యానంలోకి వెళ్ళిపోతూ తనను తాను సంబాళించుకుంటూ గడిపేసింది.

●●●

సాయంత్రం రు, రున్నర మధ్య బైట ఉధ్రుతంగా వర్షం కురుస్తోంది మాధవి ఇటీవలే కొన్న కారులో తనే డ్రైవ్ చేసుకుంటూ వెళ్ళి కౌశిక్‌ని స్కూలు నుంచి, ట్యూషన్‌కి, అక్కడినుంచి ఇంటికి తీసుకొచ్చి వాడికి స్నాక్స్, పాలు ఇచ్చింది. వాడు హోం వర్కు చేసుకుంటున్నాడు. పాప హాల్లో బొమ్మలతో డుకుంటోంది.

పిల్లలిద్దర్నీ బైటకి తీసుకువెళ్ళాలంటే బండి మీద ఇబ్బందిగా ఉందని చక్రవర్తి మాధవికి వేరే కారు కొనిచ్చాడు. మె డ్రైవింగ్ స్కూల్లో చేరి డ్రైవింగ్ నేర్చుకుంది. ఇప్పుడు ఎక్కడికి వెళ్ళాలన్నా చక్రవర్తికోసం ఎదురుచూడాల్సిన అవసరం ఉండడం లేదు. మె కోసం పనులన్నీ మానుకుని చక్రవర్తి పరుగులు పెడుతూ ఇంటికి రావాల్సిన అవసరం కూడా లేదు. బ్యాంకు అయిపోగానే కాస్సేపు స్నేహితులతో గడిపి తాపీగా వస్తున్నాడు.

మాధవి కాస్సేపు పాపతో డుకుని టైం చూసి చక్రవర్తి వచ్చే వేళయిందని అనుకుంటూ కిచెన్‌లోకి వెళ్ళింది.

ఈ మధ్య ఇద్దరూ కూడా ఎనిమిది, ఎనిమిదిన్నర లోపే డిన్నర్ చేసేస్తున్నారు అది కూడా పుల్కాలు, గ్లాసు మజ్జిగా. పొట్ట వచ్చేస్తోందని చక్రవర్తి డైటింగ్ స్టార్ట్ చేయడంతో మాధవి కూడా పుల్కాలే అలవాటు చేసుకుంది.

మాధవి చకచకా ఉల్లిపాయలు కట్ చేసి ఎగ్ కర్రీ చేసేసింది. గోధుమ పిండి తడిపింది. పిల్లలిద్దరికీ గుప్పెడు బియ్యం కడిగి చిన్న రైస్ కుక్కర్‌లో పెట్టింది.

ఫోన్ రింగైంది.

మాధవి చేతులు నాప్‌కిన్‌తో తుడుచుకుంటూ హాల్లోకి వెళ్ళి ఫోన్ తీసింది.

అవతల నుంచి మృధుమధురమైన అర్చన స్వరం వినిపించింది. "హ..లో మధూ"

మాధవి నమ్మలేనట్టు శ్చర్యంగా పిలిచింది. "అర్చనా"

"యస్. అర్చననే ఎలా ఉన్నావు మధూ? నాకసలు మళ్ళీ ఫోన్ చేయలేదేం?"

అర్చన స్వరంలో స్పష్టంగా వినిపించిన నిష్ఠూరం గమనించి "సారీ అర్చనా వీలుకాలేదు. పైగా నువ్వు బిజీగా ఉంటావు కదా అని చేయలేదు నువ్వెలా ఉన్నావు?"

"నేను బాగున్నాను. నేను రేపు ఉదయం హైదరాబాదు వస్తున్నాను. సి.ఎస్.గారి దగ్గర మీటింగ్ ఉంది. అది అయిపోగానే ఫోన్ చేస్తాను కలువగలవా?"

మాధవి కెందుకో కలవాలనిపించలేదు. ఈమెతో ఇంక నాకేం సంబంధం అనిపించింది. వేణుకి విడాకులిచ్చేశాక ఈమె ఎవరు? కలెక్టర్ స్నేహితురాలు అని గొప్పగా చెప్పుకోవాలనే రాటం తనకేం లేదు.

"ఏంటి మధూ లోచిస్తున్నావు?" అర్చన స్వరం వినిపించడంతో ఖంగారుగా అంది. "ఏం లేదు తప్పకుండా కలుద్దాం. ఎక్కడ?"

"మీ ఇంటికి రాకూడదా నేను?"

"అదేం మాట అర్చనా కానీ రాగలవోలేదో అని అన్నాను. యూ ర్ వెల్ కమ్."

"అదే ఇల్లుగా"

"అదే ఇల్లు, అదే వాకిలి, అదే మనుషులం నవ్వింది మాధవి"

"అందరూ బాగున్నారా?" అందరూ అనడంలో ఏదో ధ్వనింపచేస్తూ అడిగింది.

", చక్రవర్తి, పిల్లలు అంతా బాగున్నారు."

"పెద్దావిడ ఎలా ఉన్నారు?"

"ఎవరు మీ అత్తగా.." నాలిక్కర్చుకుంది మాధవి "తాయారమ్మగారా? పర్లేదు ఇప్పుడు కొంచెం బెటర్. కొడుకు ఇంటివాడైతే పూర్తిగా కోలుకుంటారు"

"వేణు ఇంకా మ్యారేజ్ చేసుకోలేదా?"

"లేదు. నీలవేణి పెళ్ళి అయింది. వేణుకి చూస్తున్నాం. రెండు, మూడు సంబంధాలు రెడీగా ఉన్నాయి. వేణు పెళ్ళి చూపులకి వస్తే ఏదో ఒకటి సెటిల్ చేస్తాం. శూన్యమాసం అని వాళ్ళమ్మగారు ఇప్పుడు పెళ్ళిచూపులు ఒద్దన్నారు"

"ఓ.." కాస్సేపు అవతలి నుంచి నిశ్శబ్దం.

"ఓకే. మీటింగ్ అవగానే నీకు కాల్ చేసి వస్తాను సరేనా?"

"ష్యూర్."

ఫోన్ పెట్టేసింది మాధవి

అర్చన వస్తోంది. ఎంతోకాలానికి మళ్ళీ ఈ ఇంటికి అర్చన వస్తోంది.

ఈ విషయం వేణుకి చెప్పాలా? వద్దా?

చెబితే తప్పకుండా బాధపడతాడు చూడాలనిపిస్తుంది. కలుసుకోవాలనిపిస్తుంది. కలుసుకోలేడు. నరకం కన్నా చెప్పకుండా ఉండడమే నయం.

మాధవి తిరిగ్ కిచెన్‌లోకి వెళ్ళబోతుండగా చక్రవర్తి వచ్చాడు.

వస్తునే హాల్లో బొమ్మలతో డుకుంటున్న పాపతో కాస్సేపు కబుర్లు చెప్పి మధ్యలో "హాయ్" అంటూ కళ్ళెగరేస్తూ భార్యని పలకరించాడు.

"అర్చన వస్తోంది. "

మాధవి స్వరం చిన్న బాంబు పేల్చినట్టు వినిపించింది.

"అర్చనా! " విభ్రాంతిగా చూశాడు చక్రవర్తి. "ఇక్కడికా? "

"అంత శ్చర్యపోతావేం? రేపు సి.ఎస్.గారి మీటింగ్ ఉందిట. అదయాక వస్తానంది. "

"కానీ, ఎలా? మనింటికి వస్తుందా? తను కలెక్టర్."

"అయితే అంతకన్నా ముందు నా ఫ్రెండ్ "చిరాగ్గా అంది మాధవి.

"అంత చిరాకు దేనికోయ్! ఎంత ఫ్రెండ్ అయినా మనింటికి రావడం గ్రేట్. మంచిదోయ్ నీ ఫ్రెండ్"

"నాకన్నా ముందే నీకు ఫ్రెండ్" గుర్తుచేసింది మాధవి.

"అఫ్‌కోర్స్" భుజాలెగరేశాడు.

"మరైతే రేపు స్పెషల్ ఏంటి? "

"దేనికి? "

"అదే డిన్నర్‌కో, లంచ్‌కో వస్తే కొంచెం స్పెషల్స్ చేయాలికదా. "

అతని హడావుడి చూసి చిన్నగా నవ్వింది మాధవి. "నువ్వేం హడావుడి పడకు. తను ఎప్పుడొస్తుందో తెలియదు. వచ్చాక ఫ్రెండ్‌గా ప్రేమని, కలెక్టర్‌గా గౌరవాన్ని ఇచ్చి దరిస్తాను సరేనా?"

చక్రవర్తి భార్య దగ్గరగా వచ్చి మె చుబుకం పట్టుకుని కళ్ళల్లోకి ప్రేమగా చూస్తూ అన్నాడు. "నాకు తెలుసు మధూ. నువ్వు గ్రేట్ లేడీవి. చాలామందిలో లేని ఎన్నో గుడ్ క్వాలిటీస్ నీకున్నాయి. ఐ లవ్ యూ" అన్నాడు.

మాధవి నవ్వి "ఐ టూ" అంటూ అతని భుజం పట్టి తోస్తూ అంది "వెళ్ళి ఫ్రెషప్ అయిరా, డిన్నర్ రెడీ చేస్తాను."

"ఐదు నిమిషాల్లో వస్తాను. కలిగా ఉంది" అంటూ బాత్ రూము వైపు వెళ్ళిపోయాడు.

మర్నాడు సాయంత్రం సుమారు రున్నరకి ఉద్విగ్నంగా ఎదురు చూస్తూన్న మాధవి ఇంటిముందు ప్రభుత్వ వాహనం గింది. మాధవి, చక్రవరి ఇద్దరూ పిల్లల్ని చెరో చేత్తో పట్టుకుని గేటు దగ్గరకు వచ్చారు.

లేతాకు పచ్చరంగుకి నేవీ కలర్ బార్డర్ ఉన్న గద్వాల్ చీర కట్టుకుని ఠీవిగా కారు దిగింది అర్చన.

మెకన్నా ముందే కారు దిగి తెల్లటి యూనిఫాంలో ఉన్న డ్రైవర్ డోర్ తీసిపట్టుకున్నాడు.

ఠీవి, దర్జా ప్రత్యక్షంగా చూస్తున్న మాధవి ఒక్కసారిగా పులకించిపోయింది.

దిసీజ్ ఉమన్ ఎం పవర్‌మెంట్, దిసీజ్ ఉమన్ ప్రోగెస్.. ఐ అప్రిషియేట్ అర్చనా..! అయామ్ ప్రౌడ్ ఫ్ యూ! అనుకుంది మనసులోనే చిరునవ్వుతో మాధవి, చక్రవర్తి మె దగ్గరగా నడిచి "వెల్‌కమ్" అంటూ చేతులు చాచారు.

అర్చన అందంగా నవ్వుతూ "థాంక్యూ" అంటూ పిల్లలిద్దరినీ చెరో చేత్తో దగ్గరికి తీసుకుని భుజం మీదుగా వెనక్కి చూస్తూ డ్రైవర్‌ని పిలిచింది. "రమేష్ కవర్ తీసుకురా" అంటూ

రమేష్ అనబడే డ్రైవర్ ఎంతో నమ్రతగా ఒక పెద్ద కవర్ తీసుకొచ్చాడు. దానిమీద "లైఫ్‌స్టైల్" అని ఉంది.

"లోపలికి పద" అంటూ మాధవి దారి తీస్తుంటే మెని అనుసరిస్తూ వెళ్తున్న అర్చన వెనకాలే డ్రైవర్ కూడా లోపలికి నడిచి మె కనుసైగతో చేతిలో ఉన్న కవర్ హాల్లో ఉన్నటీపాయ్ మీద పెట్టి తలవంచుకుని బైటకి వెళ్ళిపోయాడు.

అర్చన పిల్లలిద్దరినీ అలాగే పట్టుకుని సోఫాలో కూర్చుని కవర్‌లోంచి చెరో అట్టపెట్టె తీసి ఇద్దరికీ ఇచ్చింది. ఇంకో అట్టపెట్టె మీద కళానికేతన్ అని ఉంది. అది చూసి "ఎందుకివన్నీ?" అంది మాధవి.

అర్చన నవ్వి కళానికేతన్ అట్టపెట్టె తిరిగి కవర్‌లో పెట్టేసి "నా తృప్తికోసం" అంటూ "మీరు కూడా కూర్చోవచ్చు కదా" అంది చక్రవర్తినుద్దేశించి.

చక్రవర్తి మె ఎదురుగా మరో సోఫాలో కూర్చుంటూ "మధూ.. విడకి మంచి కాఫీ ఇస్తే బాగుంటుంది కదా" అన్నాడు.

"తెస్తాను. " అంటూ మాధవి లోపలికి వెళ్ళిపోయింది.

తరువాత కాస్సేపు ముగ్గురూ కబుర్లు చెప్పుకున్నాక అర్చన మాధవిని అడిగింది. "వేణు ఇంటికి వెళ్ళిపోయి ఉంటాడా?" ఈ టైమ్‌కి.

మె ఎందుకలా అడిగిందో అర్థంకాక కొంచెం అయోమయంగానే అంది "త్వరగా వెళ్ళిపోతాడు. వాళ్ళమ్మగారు ఒక్కరే ఉంటారు కదా! " అన్నాడు చక్రవర్తి.

మాధవి కూడా అర్చనవైపు చిత్రంగా చూసింది. "ఎందుకు? " అంది.

అర్చన కొంచెం స్థిరంగా అంది. "ఒక్కసారి వాళ్ళింటికి వెళదాం వస్తావా?"

"వేణు ఇంటికా? నువ్వా కానీ" మాధవి మాటలు మధ్యలోనే పేస్తూ అంది అర్చన. "ప్లీజ్ మధూ. వెళదాంరా. మీరు కూడా రండి" అంది చక్రవర్తితో.

చక్రవర్తి, మాధవి ఒకళ్ళవైపు ఒకళ్ళు ఏం చెప్పాలో తెలియని వాళ్ళలా చూసుకున్నారు. అర్చన అదేం గమనించనట్టు పిల్లలిద్దరికి వేసుకున్న డ్రెస్ తీసి తను కొన్న కొత్త డ్రెస్‌లు వేయసాగింది.

మాధవికి సైగ చేశాడు చక్రవర్తి లోపలికి వెళ్ళి రెడీ అవమన్నట్టు.

అర్చన వస్తోందని మాధవి అప్పటికే నీటుగా రెడీ అయి మంచి చీరకట్టుకుంది. అందుకే అవసరం లేదన్నట్టు తలాడించింది. "పదండి వెళదాం" అంది.

ఐదు నిమిషాల్లో అందరూ కలిసి అర్చన కారులోనే వేణు ఇంటికి బయలుదేరారు.

●●●

"వేణూ .... " టీవీ చూస్తున్న వేణుని పిలుస్తూ వచ్చింది తాయారమ్మ.

"ఏమ్మా? " తలెత్తి విడ వైపు చూశాడు వేణు.

"రిత్విక్ భోజనం అయింది. వీడి హోం వర్క్ చేయించావా?" అంది. మూతి తుడుచుకుంటూ వచ్చిన రిత్విక్‌ని చూపిస్తూ.

రిత్విక్‌ని దగ్గరకు తీసుకుని అడిగాడు. "ఏరా హోం వర్క్ చేసేశావా?"

ఓ వాడు తల గుండ్రంగా తిప్పాడు.

"సరే అయితే వెళ్ళి పడుకో" అంటూ వాడిని ముద్దు పెట్టుకుని వదిలేశాడు.

"మనం కూడా భోంచేద్దాం నాన్నా.. ఎనిమిదవుతోంది" అంది విడ నీరసంగా.

"అయ్యో కలేస్తోందామ్మా! పద నువ్వు తినేద్దువుగానీ నేను వడ్డిస్తాను. నాకిప్పుడే కలి లేదు" అంటూ లేచాడు వేణు.

"అదేంటిరా ఫీసు నుంచి వచ్చి కాఫీనే తాగావు. "

"లేదులేమ్మా ఫ్రెండ్స్‌తో కలిసి సమోసాలవీ తిన్నాను. దా నీకు నేను దగ్గరుండి తినిపిస్తాను" అన్నాడు.

అప్పుడే బైట గేటు ముందు కారాగింది.

విడ అద్దాల కిటికీలోంచి బైటకి చూస్తూ "కారాగింది. మాధవి వాళ్ళు వచ్చినట్టున్నార్రా" అంది.

మాధవి వాళ్ళా టైం చూస్తూ "అదేంటి ఈ టైంలో వచ్చారేంటి?" అంటూ గుమ్మం దాకా వెళ్ళాడు వేణు. అతని వెనకాలే అడుగులో అడుగువేసుకుంటూ విడ కూడా బయలుదేరింది. విడకి మాధవిని చూస్తే ప్రాణం లేచొచ్చినట్టు ఉంటుంది.

పిల్లలిద్దరూ పరిగెత్తుకుంటూ వచ్చారు "అమ్మమ్మా" అంటూ.

వాళ్ళ వెనకాలే చక్రవర్తి.

"ఏంటిరా ఈ టైంలో ఈ సర్‌ప్రైజ్ విజిట్ ఏంటి?" అంటూ గుమ్మం దాటి ముందుకెళ్ళి చక్రవర్తి దగ్గరగా నడుస్తూ గేటులోంచి లోపలికి వస్తున్న మాధవిని మె వెనకాలే హుందాగా వస్తోన్న స్త్రీని చూస్తూ ప్రశ్నార్థకంగా చక్రవర్తి వైపు చూస్తూ అడిగాడు. "ఏంటి పెళ్ళిచూపులా? "

చక్రవర్తి కాదన్నట్టు తలాడిస్తూ "సరిగా చూడు ఎవరో తెలుస్తుంది" అంటూ లోపకికి వెళ్ళిపోయాడు. అతనికి గాభరాగా ఉంది. ఇప్పుడిక్కడ ఎలాంటి సీను చూడాల్సివస్తుందో ఏం గొడవ అవుతుందో అని భయంగా కూడా ఉంది. అందుకే తన ఎదురుగా వస్తోన్న తాయారమ్మని కూడా పలకరించకుండా "మంచినీళ్ళు కావాలి" అంటూ ఫ్రిజ్ దగ్గరకు వెళ్ళిపోయాడు.

మాధవికి గుండె దడ, దడలాడుతోంది. ఇప్పుడు వేణు, అర్చన ముఖాముఖీ ఎదురుపడతారు. ఎలా? ఏం జరుగుతుంది? ఇద్దరూ మాట్లాడుకుంటారా?

"ఏంటి మాధవీ ఈ వేళప్పుడు ఈ రాక? " అంటున్న వేణు వైపు చూసి, నవ్వి గబగబా తలవంచుకుని లోపలికి వెళ్ళిపోయింది.

అటు చక్రవర్తి, ఇటు మాధవిల ప్రవర్తన వింతగా అనిపించిన వేణు మాధవి వెనకాల వస్తోన్న స్త్రీని పట్టించుకోకుండా చిత్రంగా తలతిప్పి లోపలికి చూశాడు.

మాధవి అప్పుడే ఎదురుగా వస్తోన్న తాయారమ్మ చేయి పట్టుకుని నడిపిస్తూ గుమ్మందాకా తీసుకురావడం అర్చన లోపలికి అడుగుపెట్టడం ఒకేసారి జరిగాయి.

అర్చన తన చేతిలో ఉన్న కళానికేతన్ కవర్‌లోంచి ఖరీదైన పట్టుచీర తీసి, తాయారమ్మ భుజాలమీద శాలువాలా కప్పి ఒంగి విడ పాదాలకు నమస్కరించింది.

విడ మె ఎవరో తనకి చీర ఎందుకిస్తుందో, ఎందుకు పాదాలకు నమస్కరిస్తుందో అర్థంకాక తెల్లమొహం వేసి చూసింది మాధవి వైపు.

మాధవి "దీవించండి పిన్నీ" అంది.

"దీర్ఘసుమంగళీభవ తల్లీ.." అంటూ మెని లేవనెత్తి మె మొహంలోకి చూస్తూ "నువ్వెవరమ్మా..!? " అంది.

అప్పటిదాకా మెనంతగా గమనించని వేణు మె చర్యకి తాయారమ్మతో పాటు తనూ శ్చర్యపోతూ మె మొహంలోకి చూశాడు.

షాక్ తగిలినట్టు అయింది.

అమ్మాయిగా తన జీవితం నుంచి వెళ్ళిపోయిన అర్చన నేడు ప్రౌఢగా ఎదురుగా వచ్చి నిలబడింది. గుర్తుపట్టకపోవటానికి శరీరాకృతిలో, వస్త్రధారణలో మార్పువచ్చిందికానీ, అందమైన కళ్ళు, త్మవిశ్వాసం నిండిన చిరునవ్వు అలాగే ఉంది.

మె స్వరం నుంచి హఠాత్తుగా డైనమైట్ పేలినట్టు అనిపించింది తాయారమ్మకి "నేను మీ కోడల్ని అర్చనను."

విడ ఉలిక్కిపడి అర్చనని వదిలేసింది.

"నువ్వా!?" అంది వెనక్కి అడుగేసి.

"క్షమించండి. నారాక మీకిష్టం ఉండకపోవచ్చు. కానీ," అంటూ వేణు దగ్గరగా నడిచి అంది. "వేణూ నేను ఇప్పుడు నిన్నుగానీ, మీ అమ్మగార్ని కానీ క్షమార్పణ అడగడానికి రాలేదు. కేవలం ఇంకా భర్తీకాని నా స్థానం నాకివ్వగలవేమో అని అడగడానికి వచ్చాను. క్షమార్పణలు, ఏడుపులు లాంటి డ్రామాలు నాకిష్టంలేదు. నేను మనస్ఫూర్తిగా నీ జీవితంలో భాగం అడగడానికి వచ్చాను. నీ అంగీకారం చెప్పు" అంది.

మాధవి, చక్రవర్తి ఊపిరి బిగపట్టుకుని వేణు నిర్ణయం కోసం చూడసాగారు. వాళ్ళకసలు అయోమయంగా ఉంది. పిల్లలు ముగ్గురూ డుకోడానికి రిత్విక్ రూములోకి వెళ్ళిపోయారు. అక్కడ వాతావరణం భయంగానూ, జలదరింపుగాను ఉంది అందరికీ. ఏం జరుగుతుందో అర్థం కాని అయోమయావస్థలో నిలబడిపోయారు.

వేణు ఏం మాట్లాడాలో తెలియని వాడిలా జరుగుతున్నదంతా వాస్తవం అని నమ్మలేనివాడిలా బొమ్మలా నిలబడిపోయాడు. నిజంగా అర్చన వచ్చిందా?

అర్చన అతనికి మరి కొంచెం సమీపంగా వచ్చింది " వేణూ నీ నిర్ణయం ఏదైనా నేనేం అనుకోను. ఓ ఫ్రెండ్‌లా వచ్చాననుకుని వెళ్ళిపోతాను."

వేణు బలవంతంగా గొంతు పెగుల్చుకున్నాడు.

తన ప్రాణం, తన సర్వస్వం అర్చన తనని జీవితంలో భాగం ఇవ్వమని దర్పంగానే అర్థిస్తోంది. కాదనగల శక్తి తనకుందా? కానీ, కానీ,

నెమ్మదిగా అన్నాడు. "మీరు, మీరు.. నువ్వు. ఇప్పుడు.. "

"కలెక్టర్‌ని అంటావు అవునా. కలెక్టర్‌ని అయినా నేను కూడా మనిషినే వేణూ" అంది నవ్వుతూ.

వేణు ఏం మాట్లాడలేదు.

అర్చన మాధవి వైపు తిరిగి మెకి దగ్గరగా నడిచి అంది. "ఈ ఇంటి డపడుచువి నీ అనుమతితో నేనీ ఇంట్లో నా స్థానం తీసుకోడానికి వచ్చాను. అనుమతిస్తావా మధూ."

మాధవి ఉద్వేగంగా అర్చనని గభాల్న కౌగిలించుకుంది. మె కన్నీటితో అర్చన భుజం తడిసిపోయింది.

చక్రవర్తి మెల్లిగా నడుస్తూ వెళ్ళి వేణు దగ్గరగా వెళ్ళి అతని భుజం పట్టుకుని మాధవి అర్చనల దగ్గరకు నడిపించాడు.

మాధవి అర్చనని వదిలి మె చేయి పట్టుకుని, వేణు చేతికి అందించింది.

"వేణు మనసారా నన్ను హ్వానించాలి మాధవీ" అంది అర్చన అంటీ అంటనట్టూ తన చేయి తాకిన వేణుని చూస్తూ.

వేణు అప్రయత్నంగా గట్టిగా పట్టుకున్నాడామె చేయి.

"క్షమించావా వేణూ!?" అంది అర్చన పల్చగా కదిలిన కన్నీటి మధ్య నవ్వుతూ.

"నాలోని బలహీనతలని అర్థం చేసుకుని, క్షమించిన నీ ఔదార్యం ముందు నేను ఓడిపోయాను అర్చనా. నన్ను క్షమించు" అన్నాడు వేణు. "ఒద్దొద్దు నో క్షమార్పణలు" అంది అర్చన. మె నవ్వుతున్నా మె కళ్ళల్లో అస్పష్టంగా కదులుతున్న బాధ, కన్నీళ్ళు అందరూ గమనించారు.

కన్నీళ్ళు తుడుచుకుంటూ తాయారమ్మ గాద్గదికంగా అంది. "అమ్మా మాధవీ కోడలికి హారతివ్వు. "

అర్చన నవ్వింది. వేణు చేయి గట్టిగా పట్టుకుని మె దగ్గరగా నడిచి "అలాంటివేం వద్దత్తయ్యా మీ దీవెనలు చాలు" అంటూ విడ పాదాలకు నమస్కరిస్తూ వేణు వైపు చూసింది. మె చూపు అర్థం చేసుకున్నవాడిలా వేణు ఒంగాడు.

"రిత్విక్‌కి వాళ్ళమ్మని పరిచయం చేయవా?" అంది మాధవి.

వేణు కొంచెం గట్టిగా "రిత్విక్" అని పిలిచాడు.

లోపలినుంచి "కమింగ్ డాడ్" అంటూ అరిచి రెండు నిమిషాల్లో పరిగెత్తుకొచ్చాడు రిత్విక్.

వేణు పోలికలు, తన పోలికలు పుణికి పుచ్చుకుని అందంగా ఉన్న రిత్విక్‌ని చూసి చేతులు చాపింది అర్చన.

కొత్తావిడ అలా పిలుస్తుంటే మె ఎవరో అర్థం కాని రిత్విక్ వేణు వైపు చూశాడు.

"కమ్ రిత్విక్ షి ఈజ్ యువర్ మామ్" అన్నాడు వేణు.

"మామ్.. " వాడి కళ్ళల్లో శ్చర్యం నందం ముప్పిరిగొన్నాయి. మరోసారి "మామ్!? " అంటూ నమ్మలేనివాడిలా అర్చన వైపు చూశాడు. చూపులకి నిలువెల్లా కరిగిపోయిన అర్చన చప్పున రెండు అడుగులేసి వాడిని దగ్గరకు తీసుకుంది.

మె గుండెల్లో గువ్వలా ఒదిగి "మామ్, మామ్" అంటూ పదే పదే ఉచ్చరించసాగాడు రిత్విక్.

"యస్ బాబూ.. నేను నీ మామ్‌ని.. కాదు, నీకు అమ్మ.. అమ్మని" అంది అర్చన.

వేణు వాళ్ళిద్దరినీ చూసి తృప్తిగా నవ్వాడు.

మాధవి, చక్రవర్తి హాయిగా నవ్వారు.

తాయారమ్మ అపురూపమైన సన్నివేశాన్ని చూస్తూ "వీళ్ళిద్దరూ చిరకాలం ఇలాగే ఉండేలా దీవించు తండ్రీ" అంటూ చేతులు జోడించి తల పైకెత్తి కళ్ళు మూసుకుంది.

●●●

**అందరికీ నమస్కారాలు..**

*సరిగా నాలుగేళ్ళ క్రితం అమెరికాకి వచ్చిన కొత్తలో కౌముది చదివి, కౌముది కుటుంబంలో నాకూ చోటివ్వమని కోరుతూ కిరణ్‌ప్రభ గారికి ఒక కవిత, ఒక నవలకి ఇతివృత్తం పంపించాను. ఆయన కవిత ప్రచురించి, ఇతివృత్తాన్ని అంగీకరించి ఘనస్వాగతం పలికారు. అప్పటి నుంచీ కౌముది అనే సాహితీ కుటుంబంలో నేనూ ఒక సభ్యురాలిని అయాను. రెండు సంవత్సరాలుగా నా ఈ అర్చనను ఆదరించి పాఠకులందరికీ నా కృతజ్ఞతలు.*

*ముఖ్యంగా ప్రతినెలా ఖచ్చితంగా తన అభిప్రాయం చెబుతూ నా నవలలోని పాత్రలతో మమేకమైపోయి, నీలవేణిని ఏం చేస్తారు? అర్చన నేం చేస్తారు? వేణుకి పెళ్ళి చేస్తారా లేదా? అంటూ కల్మషం లేని మనసుతో, గలగలా నవ్వుతూ నన్ను ప్రశ్నిస్తూ, ఈ నవల మంచి నవలగా రూపుదిద్దుకోడానికి తన సహకారం అందించిన కాంతిగారికి ఎన్ని కృతజ్ఞతలు చెప్పినా తక్కువే.*

*అర్చనని, వేణునీ కలుపుతానని ఆమె ఊహించి ఉండకపోవచ్చు. నాకూ తెలియదు. కానీ, బాగా ఆలోచిస్తుంటే ఎంతో మంచి మనసు, ఉన్నత విద్యావంతురాలు, సమాజంలో ఉన్నత స్థానంలో ఉన్న ధీమంతురాలు అయిన అర్చన తనవలన చెల్లాచెదురైన ఓ కుటుంబాన్ని గాలికి వదిలేసి తను మరో పెళ్ళి చేసుకోడాన్ని హర్షించలేకపోయాను. రచయిత్రిగా నేనే హర్షించకపోతే పాఠకులెలా హర్షిస్తారు. అందుకే ఇద్దరినీ కలిపాను. హుందాగా, దర్జాగా వచ్చి తన స్థానం తిరిగి పొందింది అర్చన. నా ఈ ముగింపుని అందరూ ఆమోదిస్తారని ఆశిస్తూ..*

**మీ అత్తలూరి విజయలక్ష్మి.**